Hikmat-e-Tableegh
(Telugu)

సందేశ ప్రచార ఉపాయం

మూలం

మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది

సంకలన కర్త

సయ్యద్ అసద్ గీలాని

అనువాదం

ఎస్.ఎమ్. ఖాద్రి

విషయసూచిక

అధ్యాయం-1

సందేశ ప్రచారం

తొలిపలుకులు........ 07

దైవధర్మం వైపునకు ఆహ్వానం 11

ప్రవక్తల దైవదౌత్యం 11

'ఇలాహ్'-'రబ్' పదాలకు అర్థం 14

దైవత్వపు ప్రత్యక్ష దావాదారులు 15

దైవత్వపు పరోక్ష దావాదారులు 17

ఈ దుష్ట సంప్రదాయానికి 18

దైవప్రవక్తలు చేసిన అసలు సంస్కరణ 20

సందేశ ప్రచార ప్రాధాన్యత 22

సత్యానికి చేయూత 22

సత్యధర్మ సంరక్షణ 23

సత్యం పెట్టే పరీక్ష 23

దైవదాసునికి దేవుని తోడ్పాటు 24

వీరికే పదోన్నతులు.... 26

సత్యధర్మ సందేశం - దాని ధ్యేయం 27

తజ్కియహ్ అంటే.... 29

సత్యం వైపునకు ఆహ్వానించడం..... 29

సత్యమార్గగామి 31

సత్యతిరస్కారులు 32

సత్యోపదేశం 32

సత్యధర్మ సాఫల్యం 34

అంతిమ విజయం విశ్వాసులదే 39

సత్యధర్మ ప్రచార మార్గంలో.... 42

హజ్రత్ మూసా (అ) గారి..... 46

విశ్వాస పటిమగల యువత.... 46

సాఫల్యగమ్యాన్ని చేరే..... 47

వనరులకంటే అల్లాహ్‌పైన్నే భారం 49

అల్లాహ్ పరోక్ష సహాయం 50

సత్యాసత్యాల నడుమ సంఘర్షణ 51

సత్యసందేశ ప్రచార మార్గంలో.... 52

జగమెరిగిన నైతికతల విధ్వంసం 54

కష్టాలను వెన్నంటి వచ్చే సుఖాలు 59

అధ్యాయం-2

పరీక్షా సమయంలో... 63

స్థిరత్వం 68

దేవుని హక్కు 69

ఆచరణలో పెట్టగలిగిందే..... 78

దైవసందేశ ప్రచార నగధీరులు 80

త్యాగనిరతి 83

విజయ సోపానం 84

నిలకడ 85

హిజ్రత్ సంకటం 89

సందేశ ప్రచారం నేర్పే పాఠాలు 94

సత్యపిపాసులకు సంబంధించిన.... 95

దైవసందేశ ప్రచారం- ప్రజాదరణ 96

సత్యాన్ని ఢీకొనే అసత్యవాద శక్తులు 97

అపజయం, వినాశాలు చివరకు.... 99

సత్యానికి వ్యతిరేకంగా 100

నేరగాళ్ళ పీచమణిచే దైవవిధానం 100

మార్గభ్రష్టమైన మానవ సమాజాలు...101
నామరూపాల్లేకుండా పోయేది.... 102
దేవుని అంతిమ తీర్పు 103
దైవ సంప్రదాయం ఏమిటి? 103
దైవసహాయం అందే విధానం 103
సత్యసందేశ ప్రచారపు.... 106
సత్యానుయాయులు మరియు..... 107
అసత్యవాదుల ఎత్తుగడలు.... 107
సత్యమార్గంలోని అడ్డంకులు 110
సత్యసందేశ ప్రచారంలో సహనం....111
సత్యవిరోధుల అసభ్య ప్రవర్తన 112
సత్యధర్మ ప్రచారం ఓర్పు.... 113
సత్యసందేశ ప్రచారం- మనశ్శాంతి 113
సత్యమార్గంలో నిరాశా ... 115
నేరస్థులకు లభించిన సుదీర్ఘమైన.... 115
తీర్పు ఘడియ కోసం ఎదురుచూపు 116
అసత్యవాదుల ప్రభావం 116
బాధాకరమైన పరిస్థితుల పట్ల ఓర్పు 120
ఓర్పు ప్రాముఖ్యత - దాని అవసరం 121
సందేశ ప్రచారం శాశ్వతమైనది... 123
వ్యతిరేకతల విషయంలో అల్లాహ్‌నే...126
వ్యతిరేకతలన్నిటికీ అల్లాహ్‌నే 127
సత్యసందేశ ప్రచార హోదా.... 127
దైవాభీష్టాన్ని ఆనందంగా 128
సందేశ ప్రచారంలో విజ్ఞతకుగల... 129
సందేశ ప్రచారంలో నమాజు ... 129
సత్యధర్మ ప్రచారంలో సామూహిక...131
ఇస్లామ్ ధర్మం సత్యంతో ... 132
ధర్మసందేశ ప్రచార 134
దృఢసంకల్పంతో సత్యాన్నే ... 134
అవిశ్వాసంతో తనకు ఎలాంటి 138
దైవదాస్యమే శ్రేయస్కరమార్గం 141
స్థాయిని పెంచే మార్గం హిజ్రత్ 142

అధ్యాయం-3

ప్రచార ఉపాయం 144
కొన్ని సైద్ధాంతిక దృష్టి కోణాలు 144
సందేశ ప్రచార విధానం ... 146
ఇస్లామీ సందేశ ప్రచారానికి 147
సత్యధర్మపథం దారి బత్తెములు.... 148
నేర్పు, నైపుణ్యం గురించి 151
ఇస్లామ్ - ఒక ఉద్యమం 153
ప్రవక్తల అడుగుజాడలను..... 153
దైవ ఏకత్వం వైపునకు ప్రజలను.... 154
దేవుడు ఒక్కడు అన్నదే.... 154
ఏకేశ్వరవాదం తప్ప తక్కిన.... 156
దైవ ఏకత్వం-జీవన పరమార్థం 156
దైవ ఏకత్వానికి సంబంధించిన... 157
పరీక్షలన్నీ సుశీలమూర్తిత్వ.... 158
సత్యాన్ని గుర్తించేందుకే ఈ పరీక్షలు 159
ఉద్యమ నాయకుని త్యాగనిరతి 160
సమానత్వం 160
మానవ శ్రేయం కోసం.... 161
సత్యసంధత- అమానతులు... 161
ఇస్లామియ జీవనసరళిని.... 162
రక్తపాత రహిత విప్లవం 162

సిద్ధాంతాలకు అనుగుణంగా... 163
సైద్ధాంతిక ప్రచార విప్లవం 164
ఇస్లామీ వ్యవస్థ ప్రతిష్ఠాపనం.... 165
సందేశ ప్రచార విధానం 166
విజ్ఞానం మరియు ఆచరణలలో.... 172
చెడును మంచి పద్ధతుల ద్వారా.... 174
దూషించేవారికి సద్వచనాలు.... 174
మంచిని చేసి చెడును రూపుమాపడం 175
సందేశ ప్రచారం, సహనాల 177
షైతాను ప్రేరణల నుండి.... 178
సందేశ ప్రచారంలో ... 180
ఓర్పు, నిలకడ, హుందాతనం.... 181
డొంక తిరుగుడు మాటలకు ... 182
మూఢులకు, అజ్ఞానులకు ... 183
కవ్వింపులో సహనాన్ని ప్రదర్శించడం 183
సందేశ ప్రచారంలో నిలకడ 184
సందేశ ప్రచారంలో వివేకం.... 185
దైవాన్ని స్మరించడం 185
వివేకవంతమైన మరియు శ్రేష్ఠమైన... 186
ఉత్తమమైన రీతిలో..... 187
చర్చించే సమయంలో 187
కోపోద్రేకాలకు, షైతాను 188
దుర్భాషలు నోట వెలువడకుండా... 188
వ్యతిరేకులపై ఫత్వాలు.... 189
ఎగతాళికి గురైనప్పుడు..... 190
వివేకానికి సంబంధించిన.... 191
సందేశ ప్రచారంలో ఓ మేలైన.... 193
మాటల్లో సానుభూతిని 193
సత్యాసత్యాల నడుమ జరిగే..... 203
ధర్మావగాహనకు కావలసిన.... 207
సందేశ ప్రచారం ఎదుటి మనిషిని... 209
నిదురపోయే జాతిని తట్టిలేపే.... 210
దైవగ్రంథం కలవారు.... 211
కోపోద్రేకాలకు దూరంగా.... 214
సిద్ధాంతాల పట్ల నిలకడ.... 215
సందేశప్రచార అవకాశాలను.... 216
సందేశ ప్రచార వివేకానికి.... 219
హుందాగా సత్యధర్మాన్ని 222
సత్యసందేశ ప్రచారం 223
విముఖతను చూపవలసిన వ్యక్తులు 223
దైవభీతి గలవారే సత్యాన్ని ... 227
సత్యాన్ని స్వీకరించే సామర్థ్యం ... 228
మొండి ఘటాలకు దూరంగా ... 230
సందేశాన్ని నేరుగా అందించాలి 231
సత్యధర్మ ప్రచార ప్రతిఘటనకు..... 233
సంస్కరణ కార్యక్రమం .. 236
సందేశ ప్రచారంలో అనైతిక 238
సందేశ ప్రచారకుడు నిష్పక్షపాతిగా.. 242
మొండి వైఖరిని అవలంబించే 243
సందేశ ప్రచార సందర్భంలో 247
గ్రంథవహులు 249
సందేశ ప్రచారంలో హృదయాలను.. 249
లేఖల ద్వారా దైవధర్మం వైపుకు... 250
సత్యధర్మ ప్రచారం ఓ విధి 250

అప్రధాన విషయాలకంటే... 251
మనం ఎవరికీ విరోధులం కాము 254
వ్యతిరేకతలో అవలంబించవలసిన.. 255
అధ్యాయం-4
సందేశప్రచారకుడు 256
పరిజ్ఞానానికి సంబంధించిన... 258
అంతరాత్మజాగరూకత 258
సంకల్పశుద్ధి 259
సత్యజ్ఞాన సంపాదన 260
సహాబా (ర)ల పవిత్ర జీవితాల.... 261
దైవంతో సంబంధం 262
ప్రవక్త (స) పట్ల పూర్తి ... 263
పరలోక చింతన 264
దివ్యఖుర్ఆన్ చూపిన ప్రవర్తన.... 265
ఉద్యమ కార్యోన్ముఖుడు ... 267
మానవాళి సంస్కరణకు 268
సత్పురుష సాంగత్యం 269
తనకంటే మేలైన సహచరులను... 270
మంచిని ఆజ్ఞాపించడం ... 271
సుశిక్షణ, సంస్కరణలను 271
సద్వ్యవస్థ ప్రాబల్యం కొరకు.... 272
సత్యధర్మ ప్రచారకుని గుణగణాలు 275
ఇస్లాం ధర్మప్రచార పనికి .. 281
వ్యక్తిగత సుగుణాలు 281
సామూహికంగా పాటించాల్సిన.... 286
అల్లాహ్ మార్గంలో చేసే కృషికి... 288
అసత్యవాదులు.... 292
ప్రప్రథమ దైవం వైపు.... 293
రాజీపడే ధోరణిని వీడండి 296
పరుల కోరికలను.... 299
అజ్ఞానపు అన్ని కాలం చట్టాలను... 299
భౌతికవాదుల భోగభాగ్యాలను..... 301
కావలసింది సామాజిక హోదా .. 302
అనుసరణకు తోడు అనుశీలన 306
వ్యతిరేకతకు వెరువకండి 306
వ్యతిరేకుల కుచేష్టలను ఎదిరించడం 307
సత్కార్యాల ద్వారా చెడుల ప్రక్షాళన 307
వ్యతిరేకుల పట్ల మీరు.... 308
సత్యసందేశవహుడు శక్తి పొందే... 308
సమాజ స్థాపన 309
దివ్యఖుర్ఆన్ పారాయణం 309
అల్లాహ్ సంస్మరణ 315
దైవస్మరణ ద్వారా శక్తిని పొందడం 316
సత్యసందేశవహుడు జరిపే.... 318
భౌతిక ప్రయోజనాలను 319
ధర్మప్రచార హోదా బాధ్యతలు 319
అల్లాహ్ శరణుకోరండి... 320
దుష్టభావాల ప్రేరణే దాష్ట్యానికి... 321
మనస్సు చేసే మోసం పట్ల.... 323
సత్యవాదులకు ఎదురయ్యే ... 323
విజయ భాగ్యానికి గర్వపడక.... 327

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

అధ్యాయం -1

సందేశ ప్రచారం

తొలిపలుకులు

మానవ జాతి సామాజిక జీవనసరళి ఎలా ఉండాలి అనే మౌలిక సూత్రాలను బోధించినవారు దైవప్రవక్తలు మాత్రమే. వీరు మానవజాతి హితైషులు, సచ్ఛీలతల్లో న్యాయకాగ్రేసరులూను. విశ్వ సృష్టికర్త అయిన అల్లాహ్, మానవజాతి మార్గభ్రష్టత్వానికి లోనుకాకుండా సమయానుకూలంగా, సందర్భాన్నిబట్టి ప్రవక్తలను ప్రభవింపజేశాడు. వీరు బోధించిన రుజుమార్గమే 'సిరాతె ముస్తఖీమ్' సత్యధర్మమూను (దీనెహక్). దానికి భిన్నంగా అవలంబించబడే ప్రతి మార్గం దుష్టమార్గం, అసత్యమార్గం. ఈ దుష్టమార్గాలు మనిషి ఐహిక, పరలౌకిక జీవితాలను నష్టానికి గురిచేస్తాయి.

దైవసందేశకులైన ప్రవక్తలు, వారి సమకాలీన సమాజాల్లో తమ సందేశాన్ని ఎల్లప్పుడు ఓ సాధారణ ఉద్యమంగా, సార్వత్రిక సందేశంగానే బోధించడం జరిగింది. సమాజాన్ని హితమైన, సక్రమమైన మార్గంపై నడింపించడానికే సతతం కృషి చేసిన మహామహులు వీరు. అదే విధంగా, ఈ లక్ష్యసాధన కోసమే శ్రమిస్తూ ఆ ప్రవక్తల అనుయాయులు నడిపిన ఉద్యమాలన్నీ ఇస్లామీయ ఉద్యమాలే. దైవసందేశ ప్రచార ధ్యేయానికి భిన్నంగా మానవ సమాజంలో ఏయే ఉద్యమాలైతే పుట్టుకొచ్చాయో అవన్నీ అసత్య ఉద్యమాలే. ఆ ఉద్యమాల వలన మానవజాతికి సామూహికంగా జరిగే నష్టం అమితం. ప్రవక్తలుగాని, వారిని అనుసరించిన మహాపురుషులుగాని ప్రచారం చేసిన సందేశం ప్రతి కాలంలోనూ ఒకే రీతిలో ఉంటూ వచ్చింది. ఈ సందేశ ప్రచారంలో ముఖ్యమైన మూడు అంశాలు ఉన్నాయి.

1) సర్వసృష్టికి కర్త అయిన దైవం లేదా అల్లాహ్ దాస్యాన్నే సర్వసామాన్యం చేయడం. ఆయన ఆదేశాలను జవదాటకుండా ఉండడం. ఆయనే ఈ విశ్వానికి అసలు ప్రభువుగా, యజమానిగా, పాలకునిగా నమ్మడం.

2) ఇహలోక జీవితాన్ని అల్లాహ్, ఆయన ప్రవక్త (స) గారి బోధనలకు అనుగుణంగా మలచడం. వ్యక్తిగత జీవితంలో లేదా సామాజిక జీవితంలో ఆయన ఆదేశాలకు వ్యతిరేకంగా ఉనికిలోవున్న ప్రతి విషయాన్ని తొలగించి, జీవితాలను స్వచ్ఛమైన దైవ విధేయతా మూసలో మలచడం.

3) దైవం, దైవప్రవక్తల ఆదేశాలకు భిన్నంగా మానవ జీవితాలను శాసిస్తూ వారిపై అధికారాన్ని చెలాయించే ప్రతి వ్యక్తిని అతని అధికార హోదా నుండి తొలగించడం. అధికారం, హోదా దైవిధేయులైన సజ్జనులకే అప్పగించడం.

ఇస్లామీయ ఉద్యమం ప్రతి కాలంలోనూ ఇలాగే ఉంది. ఈ ప్రయత్నాన్నే ఇస్లామీయ సందేశ ప్రచార ఉద్యమం (దావతె ఇస్లామీ) అని అంటారు. ఈ సందేశంలోనే దృఢత్వం, విశ్వవశీకరణ శక్తులున్నాయి. దీని ప్రచారం కోసమే ప్రవక్తలు ప్రభవించారు. ఇదే ప్రతి విశ్వాసి జీవిత ధ్యేయం కూడాను.

ముస్లిం సమాజం సైద్ధాంతికంగా ప్రపంచానికి నేతృత్వం వహించే సమాజం. మానవత్వ మార్గదర్శనానికి సృష్టికర్త తరపున చిట్టచివరి సందేశాన్ని తీసుకొచ్చి దాన్ని ఆచరణాత్మకంగా ప్రపంచం ముందు ప్రదర్శించడానికి, తద్వారా దైవకారుణ్యం ఎలాంటిదో చూపెట్టడానికి ఉనికిలోనికి వచ్చిన సత్సమాజం అది. దైవాదేశాలను మానవాళి ముందు ఆచరణాత్మకంగా ప్రదర్శించడమే ఇస్లామ్ ధర్మం ముఖ్యోద్దేశం. అయితే ఈ ఇస్లామ్ ధర్మం, గతంలో ఓసారి మహోన్నత అంతర్గత శక్తిని, శుభశ్రేయాలను ప్రదర్శించి చూపినప్పటికీ, దురదృష్టవశాత్తు నేటి ముస్లిములు దాన్ని ప్రపంచం కంటికి అగుపడకుండా చేశారు. ముస్లిముల ఈ వైఖరి, ప్రపంచాన్ని ఇస్లామ్ ధర్మం వైపునకు ఆకర్షించేబదులు ఇస్లామ్ పట్ల అపోహలకు, అనుమానాలకు గురిచేసేదిగా తయారైంది.

గతంలో ప్రపంచంలోని అనేక జాతులు వినాశానికి గురిఅయ్యాయి. నామ రూపాల్లేకుండాపోయిన ప్రతి జాతి కూడా అలా నాశనం అయిపోవడానికి గల కారణం ముఖ్యంగా అది ఆచరణకు దూరమైపోవడమే. మహోన్నతమైన సిద్ధాంతాలు కలిగి ఉన్నప్పటికీ ఆ సిద్ధాంతాలను పొగడం మట్టుకే అవి పరిమితమైపోయాయిగాని వాటిని ఆచరణలో పెట్టే శక్తి మాత్రం ఆయా జాతుల సామూహిక కార్యాచరణలో అగుపించ లేదు. ఈ ఆచరణ శూన్యత, జడత్వం వల్ల ఏర్పడిన వైపరీత్యం, వ్యత్యాసాల (Contradiction) నుండి గట్టెక్కడం ఆ జాతులకు అసాధ్యం అయిపోయింది.

సమాజంలో పాతుకుపోయిన ఈ ఆచరణ రాహిత్యం ఫలితంగానే ఏకేశ్వర ఆరాధనకు తోడు అనేక ఇతర ఆరాధనామార్గాలు కూడా వచ్చి చేరాయి ముస్లిములలో. అయినా ఓ ముస్లిమ్ తనను తాను ఏకోశ్వరోపాసకునిగా చెలామణి అవుతూనే ఉన్నాడు. దైవదౌత్యాన్నే అనుసరిస్తున్నానని భావిస్తూనే ముస్లిం సమాజం దైవప్రవక్త (స) బోధనలను సైతం జవదాటుతూ ఇతర అనేక నమ్మకాలను (సెంటిమెంట్లను) పుణికిపుచ్చుకుంటోంది. అయినప్పటికీ దైవప్రవక్త (స) ఎడల గౌరవ మర్యాదలు మాత్రం చెక్కుచెదరవు. దివ్యఖుర్ఆన్ చిట్టచివరి దైవగ్రంథం అని విశ్వసిస్తూనే, దైవేతర చట్టాలను కూడా ఎలాంటివి వెగటులేకుండా అనుసరించడం జరుగుతోంది. అయినా, దైవగ్రంథం సత్యగ్రంథం అనడంలో మాత్రం వీసమెత్తు తేడా కనబడదు. ఇవన్నీ

మానవత్వపు లేమి, అనైతిక విలువలతో కూడిన ఆచరణలు అనడంలో సందేహం లేదు. ఇలాంటి సామాజిక నైతిక వాతావరణంలో దైవ మరియు దైవేతర చట్టాల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని చూయిస్తున్నాయి. మానవ సచ్చరిత్రంపై భరోసా లేకుండా చేస్తున్నదీ వైఖరి. మనిషి ప్రదర్శిస్తున్న ప్రేమ వాత్సల్యాలను, స్నేహ సౌభ్రాతృత్వాలను, అతను చేసుకుంటున్న ఒప్పందాలు, ప్రమాణాలను, పరస్పర సంబంధ బాంధవ్యాలను నమ్మడానికి మన సొప్పడం లేదు. యే వ్యక్తి అయితే నేడు గొప్పగా ఓ ధ్యేయం కోసం చిత్తశుద్ధితో శ్రమిస్తున్నానని చెప్పుకుంటున్నాడో, మునుముందు అతనే ఆ మార్గంపై నడుస్తాడని నమ్మకం లేకుండాపోతోంది. ఈ మనిషి స్థితి ఎంత పతనావస్థ ఎంత దిగజారిపోయిందంటే, ఆ వాతావరణంలో ఓ సంస్కర్త సజావుగా తన పనిని తాను చేసుకుపోలేకపోతున్నాడు. అనుకున్నదే చెప్పడం, చెప్పిందే ఆచరణలో పెట్టడం అన్నది సుశిక్షణకు, సద్వర్తనకు ప్రతీకలు. ఈ సుగుణాలు మనిషి జీవితంలోని ప్రవేశించిననాడే కార్యక్రమాలు శ్రమ లేకుండానే నెరవేరగలవు.

ఆలోచన, ఆచరణలలోని ఈ వ్యత్యాస వాతావరణం, పూర్తి పతనావస్థ నుండి పుట్టుకొస్తుంది. ఓ మహోన్నతా ధ్యేయం కోసం పని చేసే సంస్థలు కూడా ఈ వ్యత్యాస వాతావరణం వల్లనే ప్రభావాన్ని కోల్పోతుంటాయి. విప్లవ నినాదాల్లో పస లేకుండా పోయినప్పుడు, విప్లవ ప్రణాళికలు దైనందిన అలవాటుల్లాగే విలువలు కోల్పోయి నప్పుడు ఏర్పడే పరిస్థితులు ఇలాగే ఉంటాయి. ఈ పరిస్థితులు ఏర్పడినప్పుడు ఓ సమాజంలో ఇస్లామీ సందేశాన్ని సరికొత్త తరహాలో ప్రారంభించడం కంటే వేరే మార్గం ఉండదు.

ఓ జీవన వ్యవస్థను సొంతం చేసుకొని దాన్ని అవలంబించాలంటే, దాని ప్రాబల్యం కోసం ఉద్యమించాల్సి ఉంటుంది. ఆ ఉద్యమం, ఆ వ్యవస్థ పూర్తిగా ఉనికిలోనికి వచ్చేంత వరకు నిరంతరం పనిజేయాలి. వివిధ సామర్థ్యాలు గల మేధావుల్ని దాని వైపునకు ఆకర్షించేందుకు చర్యలు తీసుకోవాలి. వారిలోని ఆ సామర్థ్యాలను కోరుకున్న వ్యవస్థ ప్రాబల్యం కోసం వినియోగించాలి. సంపూర్ణ లక్ష్యసాధన కోసం, దాని ఉనికి మరియు సంరక్షణ కోసం ఆ విప్లవ సెగను చల్లార కుండా జాగ్రత్తపడాలి. క్రొత్త వ్యక్తులు వచ్చి చేరడం తగ్గిపోకుండా, పాత వ్యక్తుల్లో జడత్వం చోటు చేసుకోకుండా, ఆ ఉద్యమం కోసం కొంగ్రొత్త ప్రణాళికలను రూపొం దించాలి. అదేకాదు, ఆ ఉద్యమం పురోగతి సాధించాలంటే క్రొత్తగా వచ్చి చేరే వారికి సరియైన శిక్షణ గరపడం అవసరం. వారికి నైతికపరంగా, వైజ్ఞానికంగా ఉద్యమ ప్రమాణాలకు అనుగుణంగా మలచడం, వారి ద్వారా పనిచేయించడం ఎంతైనా అవసరం. ఒకవేళ ఈ పని నిరంతరంగా కొనసాగుతూ ఉంటే, ఆ వ్యవస్థ సంపూర్ణ ప్రాబల్యం పొందేవరకు చురుకుగా పనిచేయడమే కాకుండా, ఆ వ్యవస్త ఉనికిలోనికి వచ్చిన తరువాత కూడా దాన్ని చక్కదిద్దడం, వ్యతిరేక శక్తుల్ని దాని ముందు తల

వంచేటట్లు చేయడం, ఆ వ్యవస్థలో ఏర్పడే రుగ్మతలు దూరం చేసి దాన్ని దృఢంగా ఉంచే లాంటి ప్రక్రియలు కొనసాగుతూనే ఉంటాయి.

ప్రతి సందేశవహుడు, తనకు కావలసిన సామూహిక అవసరాలను దృష్టిలో పెట్టుకొని పనిచేస్తాడు. సందేశాన్ని చేరవేసేవాడు ప్రాణంలేని రాళ్ళు రప్పలకో, చెట్టుపుట్టలకో తన సందేశం వినిపించడు. ఈ నిర్జీవ పదార్థాలు అతని సందేశాన్ని అర్థం చేసుకోవు గనుక. సందేశవహుని సంబోధన మానవులనే సంబోధిస్తుంది. దైవం మానవునికి ఆలోచనా జ్ఞానం, మేధ, అర్థం చేసుకునే హృదయాన్నిచ్చాడు. కదలాడ డానికి, పని చేయడానికి కాళ్ళు చేతులూ ఇచ్చాడు. ఈ విప్లవోద్యమం ద్వారా మనిషిపై ఆ ఉద్యమానికి సంబంధించిన అనుకూలమైన లేదా ప్రతికూలమైన ప్రభావాలు పడతాయి.

ప్రతి జీవితానికి పరోక్ష పరిణామం చావు. ప్రతి చావుకు పరోక్ష పరిణామం ప్రళయ దినం (తీర్పుదినం). ఆ విధంగానే ప్రతి సందేశం పరోక్షంగా కోరేది సహకారం, సహచర్యలనే. సహకారం ఉన్నచోటే వ్యతిరేకత, సంఘర్షణలు కూడా వాటంతటవే పుట్టుకొస్తాయి. ఎందుకంటే, సందేశవహుడు ఎవరినైతే తన వైపునకు ఆహ్వానిస్తున్నాడో, ఆ సందేశాన్ని వినేవాడు తటస్థంగా ఎన్నటికీ ఉండలేడు. సందేశాన్ని వినేవారు ఆ సందేశం వైపునకు ఆహ్వానించే ప్రచారకుని వైపునకు మ్రొగ్గి అతనికి సహకరించడమో లేదా ప్రతిఘటించడమో జరుగుతుంది. ఇలా సందేశ ప్రచారం పరస్పర సంఘర్షణా ఘట్టంలోనికి ప్రవేశిస్తుంది.

బాటసారుల సౌకర్యార్థం రాచమార్గంపై పెట్టే ప్రకటనా యంత్రం లాంటిదే సందేశ ప్రచారం కూడా. సందేశ ప్రచారకుడు ఆ యంత్రాన్ని ఆ రాచమార్గంపై నెలకొల్పి బహిరంగంగా ప్రదర్శిస్తూ బాటసారుల్ని, "ఈ యంత్రం ఇక్కడ నెలకొల్పడం లోనే మీ మేలుదాగుంది" అని నమ్మబలకడం అవసరం. ఆ యంత్రం ప్రయోజనాలను ఒక్కొక్కటిగా వారి ముందుంచుతూ, సంభవం అనుకున్న విమర్శలను దూరం చేయ డానికి ప్రయత్నం చేయాలి. ఆ ప్రదేశంలో ఇది వరకు ఉన్న పాత చిహ్నాన్ని లేదా కట్టడాన్ని ఎందుకు తీసివేయడం జరిగిందో, ఆ పాత నిర్మాణం అక్కడుండడం వలన ఒనగూడే నష్టాలేమిటో వారికి వివరించాలి. అక్కడున్న పాత చిహ్నాన్ని తీసివేసి దాని స్థానే క్రొత్త యంత్రాన్ని నెలకొల్పడంలోనే ప్రజల శ్రేయం, ప్రయోజనం ఉంది అని మానసికంగా వారిని సిద్ధపర్చవలసి ఉంటుంది.

ఏ ఉద్యమమైనా ఇలాంటి సందేశ ప్రచారం లేకుండా ముందుకు నడవ జాలదు. ప్రజలకు దైవసందేశాన్ని చేరవేసే సహజమైన ఈ విధానాన్ని కాదని మరే ఉద్యమం జడత్వం నుండి, స్థానభ్రష్టత్వం నుండి తప్పించుకోజాలదు. జడత్వం అనే ఈ పరిస్థితిని మార్చేది కూడా సందేశ ప్రచారోద్యమమే. దీని ద్వారానే ఉద్యమంలో

చలనం వస్తుంది. కాబట్టి దైవధర్మసందేశ ప్రచారమే యదార్థమైన శక్తికి, బలానికి మూలం. సందేశ ప్రచారకుడు ఈ సందేశ ప్రచార స్రవంతిని ఎప్పుడు సుష్కించి పోకుండా చూడవలసి ఉంటుంది. దైవధర్మ సందేశ ప్రచారమే ఓ విశ్వాసి అసలు జీవిత ధ్యేయం. ఈ ధ్యేయం వైపునకు పురోగమించడంలోనే విశ్వాసశ్రేయం దాగుంది.

దైవధర్మం వైపునకు ఆహ్వానం

ఏవేవో దిగ్భ్రమలకు లోనుచేసే ఆలోచనలను (Distracted Ideas) లేదా కళవరపరిచే ఆచరణలను జొప్పించడానికి వీలు కలిగిన వ్యవస్థ యే మాత్రం కాదు ఇస్లామ్ ధర్మం. కొన్ని పటిష్టమైన సూత్రాలు, సిద్ధాంతాలపై నిలబడి ఉందీ వ్యవస్థ. ఈ ధర్మానికి చెందిన ప్రతి పెద్ద అంశాల లగాయత్తు చిన్నచిన్న విషయాలు సైతం ఈ మౌలిక సూత్రాలతో తార్కికంగా (Logically) అనుసంధానం అయి ఉన్నాయి. మానవ జాతి మనుగడకు సంబంధించిన వివిధ కోణాల నియమనిబంధనలన్నీ ఆ మూల సిద్ధాతంతోనే ముడివడి ఉంటాయి. ఓ విత్తనం నుండి వ్రేళ్ళు, ఆ వ్రేళ్ళ నుండి కాండం, ఆ కాండం నుండి కొమ్మలు, రెమ్మలు, వాటి నుండి ఆకులు పుట్టుకొచ్చి చెట్టు పూర్తిగా విస్తరించినప్పటికీ దాని ఒక్కో ఆకు ఆ చెట్టువ్రేళ్ళతో ఎలా అనుసంధానం అయివుంటుందో సమస్త ఇస్లామీయ జీవన రంగాలు కూడా ఈ మూలసిద్ధాంతంతో అలాగే అనుసంధానమై ఉంటాయి. కాబట్టి మీరు ఇస్లామీయ జీవితానికి సంబంధించిన యే రంగాన్నైనా అర్థం చేసుకోదలిస్తే, మొదట దాని మూలం వైపునకు దృష్టిని మరల్చవలసి ఉంటుంది. అప్పుడుగాని అది సాధ్యం అయ్యే విషయం కాదు. దాన్నే విస్మరిస్తే అసలు నిజాన్ని తెలుసుకోవడం అసంభవం.

ప్రవక్తల దైవదౌత్యం

ఇస్లామ్ గురించి రెండు విషయాలు దాదాపుగా ముస్లిములందరికీ తెలుసు. ఇస్లామ్ సందేశప్రచారం ప్రవక్తలందరి కార్యక్రమంగా ఉండిందని, ఇది కేవలం అబ్దుల్లాహ్ తనయుడు ముహమ్మద్ (స) గారి సందేశ కార్యం వరకే పరిమితం కాదని, అనదికాలం నుండి ఈ భూమండలంపై దైవం తరపు నుండి ప్రభవించిన ప్రవక్తలందరి సందేశ ప్రచార కార్యక్రమం అదే. రెండవ విషయం, దైవం తరపున యే ప్రవక్తలైతే ఈ ప్రపంచంలో ప్రభవించారో వారి ప్రభావం ఏకైక లక్ష్యం కేవలం సృష్టికర్త దైవత్వాన్ని బలపర్చడం, ఆయన ఆరాధననే చేయించడం.

ముస్లిములకు సంబంధించినంత వరకు పై రెండు యదార్థాలు నిజం. ప్రతి ముస్లిమ్ ఆ మాటలను వినడంతోడనే ఓహో ఇవి ప్రతి అమాయక పల్లెవాసి అయిన ముస్లిమ్‌కు కూడా తెలిసిన విషయమే కదా అని తడబడకుండా చెప్పేస్తాడు. అయితే ఆ అమాయక ముస్లిముల ఈ సంగ్రహ అవగాహన వెనుక ఏకేశ్వర వాదానికి

సంబంధించి దాగివున్న ఆలోచన ఎలాంటిది? కేవలం ఆ ఒక్క దైవాన్నే ఆరాధించమని చెప్పడానికి గల కారణం ఏమిటి?? ఈ ప్రశ్నలను మరికొంత తరచి చూడమని మిమ్మల్ని ప్రేరేపించదలిచాను. مَا لَكُمْ مِّنْ اِلٰهٍ غَيْرُهٗ "ఆయన తప్ప మరే ఆరాధ్యుడు లేడు" అని ప్రకటించ గానే దుష్టశక్తులన్నీ ఏ కారణం చేత ఆ ప్రవక్తలను వేదించవలసి వచ్చింది? ఈ నిజాన్నే ఆలోచించమని నేను మిమ్మల్ని కోరేది.

ఈ రోజు చాలా మంది ముస్లిములు అనుకుంటున్నట్లుగా, మస్జిద్‌లోనైతే ఏకేశ్వరుడైన అల్లాహ్ ఎదుట సాష్టాంగపడితేచాలు, మసీదు నుండి బయటకు వచ్చిన తరువాత అధికారంలో ఉన్న ప్రభుత్వానికి నిర్నిబంధంగా విధేయతను చూపవచ్చు అని చెబితే, తనకువిధేయులుగా ఉన్న ప్రజల స్వాతంత్ర్యంలో యే ప్రభుత్వం అయినా అనవసరంగా ఎందుకు జోక్యం చేసుకుంటుంది?

రండి, మనమిప్పుడు, దైవం గురించి దైవప్రవక్తలకు ప్రపంచంలోని ఇతర శక్తులతో ఏ విషయం మీద వివాదం ఏర్పడిందో పరిశోధించి చూద్దాం.

దైవగ్రంథం అయిన దివ్యఖుర్ఆన్‌లో ఒకచోట కాదు అనేకచోట్ల, దైవ తిరస్కారులు, బహుదైవారాధకులతో దైవప్రవక్తలకు ఏర్పడిన వివాదం ఏమిటో చెప్పడం జరిగింది. వారు (బహుదైవారాధకులు, దైవతిరస్కారులు) దేవుని అస్తిత్వాన్ని నిరాకరించ లేదు. అల్లాహ్‌యే ఈ భూమ్యాకాశాలను సృజించినవాడని, వారికి జననమిచ్చినవాడు కూడా ఆయనే అని విశ్వసించిన వారే. ఈ విశ్వవ్యవస్థ పూర్తిగా ఆయన ఆదేశాల ప్రకారమే నడుస్తోంది; గాలులు ఆయన ఆదేశం ప్రకారమే వీస్తున్నాయి; సూర్య చంద్రులు, భూమి అన్నీ ఆయన అదుపాజ్ఞలో ఉండి పరిభ్రమిస్తున్నాయి అని నమ్మేవారు వారు. ఇదే విషయాన్ని దివ్యఖుర్ఆన్ ఇలా సెలవిస్తోంది:

قُلْ لِّمَنِ الْاَرْضُ وَمَنْ فِيْهَآ اِنْ كُنْتُمْ تَعْلَمُوْنَ ۝
سَيَقُوْلُوْنَ لِلّٰهِ ؕ قُلْ اَفَلَا تَذَكَّرُوْنَ ۝ قُلْ مَنْ رَّبُّ
السَّمٰوٰتِ السَّبْعِ وَرَبُّ الْعَرْشِ الْعَظِيْمِ ۝ سَيَقُوْلُوْنَ
لِلّٰهِ ؕ قُلْ اَفَلَا تَتَّقُوْنَ ۝ قُلْ مَنْ بِيَدِهٖ مَلَكُوْتُ كُلِّ
شَيْءٍ وَّهُوَ يُجِيْرُ وَلَا يُجَارُ عَلَيْهِ اِنْ كُنْتُمْ تَعْلَمُوْنَ ۝
سَيَقُوْلُوْنَ لِلّٰهِ ؕ قُلْ فَاَنّٰى تُسْحَرُوْنَ ۝ (مومنون ٨٤ تا ٨٩)

"(ఓ ప్రవక్తా!) ఈ భూమి, ఇందులో ఉన్నదంతా ఎవరిదో చెప్పండి మీకు తెలిస్తే?" అని అడుగు. వారు, ఇవన్నీ దేవునివే అని తప్పకుండా అంటారు. "అయితే, మీరు స్పృహలోనికి ఎందుకురారు?" అని అడుగు. (సరే) "సప్తాకాశాలు, మహోన్నత సింహాసనానికి యజమాని ఎవరు?" అని అడుగు. వారు దేవుడే అని తప్పకుండా అంటారు. "అలాంటప్పుడు వారు (ఆ దేవునికి) ఎందుకు భయపడరు? అని అడుగు."

"(పోనీ, ఈ సృష్టి వ్యవస్థలో) ప్రతి వస్తువుపై పాలనాధికారం ఎవరికుందో చెప్పండి మీకు తెలిస్తే?" అని వారిని అడుగు. వారు తప్పకుండా దేవునికే ఉంది అని చెబుతారు. అలాగే (మీకు) ఆశ్రయం ఇచ్చేవాడు ఒకడున్నాడు, ఆయనకు వ్యతిరేకంగా మరెవ్వరూ (మీకు) ఆశ్రయం ఇవ్వలేరు. అలాంటి శక్తి స్వరూపుడెవ్వరూ? అని అడుగు. దేవుడే అని తప్పకుండా అంటారు వారు. మరైతే మీరు ఎలా మోసపోతున్నారని అడుగు." (మోమినూన్: 84-89)

وَلَئِن سَأَلْتَهُم مَّنْ خَلَقَ السَّمٰوٰتِ وَالْأَرْضَ وَسَخَّرَ الشَّمْسَ
وَالْقَمَرَ لَيَقُولُنَّ اللّٰهُ ۖ فَأَنّٰى يُؤْفَكُونَ ○ (عنكبوت: ٦١)

"భూమ్యాకాశాలను ఎవరు సృజించారని, సూర్యచంద్రుల్ని ఎవరు అదుపులో ఉంచగలిగారని నీవు అడిగితే, దేవుడే అని వారు తప్పకుండా అంటారు. అలాంటప్పుడు వారెలా మోసపోతున్నారు?" (అన్కబూత్:61)

وَلَئِن سَأَلْتَهُم مَّن نَّزَّلَ مِنَ السَّمَآءِ مَآءً فَأَحْيَا بِهِ الْأَرْضَ مِنْ
بَعْدِ مَوْتِهَا لَيَقُولُنَّ اللّٰهُ ۚ (عنكبوت: ٦٣)

"ఆకాశం నుండి వర్షం కురిపించి తద్వారా మృత భూమికి జీవం పోస్తున్న దెవరూ? అని అడిగితే, "దేవుడే" అని వారు తప్పకుండా అంటారు. కనుక ఆ దేవుడే సకల ప్రశంసలకు అర్హుడని చెప్పు. కాని చాలా మంది (ఈ సత్యాన్ని) గ్రహించలేరు." (అన్కబూత్: 63)

وَلَئِن سَأَلْتَهُم مَّنْ خَلَقَهُمْ لَيَقُولُنَّ اللّٰهُ فَأَنّٰى يُؤْفَكُونَ ○ (الزخرف: ٨٧)

ఒకవేళ నీవు "మిమ్మల్ని ఎవరు సృష్టించారని అడిగితే 'దేవుడే' అని వారు తప్పకుండా అంటారు. మరి వీరు ఎలా మోసపోతున్నారు?" (అజ్జుఖ్రుఫ్:87)

పైన చెప్పిన ఖుర్ఆన్ వాక్యాల ద్వారా తేటతెల్లం అవుతున్నదేమిటంటే, దేవుడు ఉన్నాడని, ఆయనే సర్వసృష్టికి కర్త అని, ఈ భూమ్యాకాశాల సమస్తానికి యజమాని, ప్రభువు ఆయనే అనే విషయంలో వారికి పూర్తి విశ్వాసం ఉండేది. ఈ విషయాలను తిరిగి వారికి బోధించడానికే ప్రవక్తలు రావలసిన అవసరం లేదే? అయితే, మరి ఆ ప్రవక్తలు ఎందుకు రావలసి వచ్చింది? ఏర్పడిన వివాదం అసలు ఏ విషయం మీదా?, అన్నదే మూలప్రశ్న.

ప్రవక్తలు చెప్పిందీ బోధించిందల్లా, "ఎవరైతే మీకూ, ఈ భూమ్యాకాశాలకూ సృష్టికర్తో ఆయనే మీ ఆరాధ్యుడు, పోషకుడు కూడాను. ఆయన్నే మీరు విశ్వసించాలి" అన్నదే. కాని ఈ విషయాన్నే ప్రపంచం ఒప్పుకోడానికి సిద్ధపడలేదు.

రండి! మనం ఇంకొంత లోతుకు వెళ్ళి ఈ వివాదానికి మూలం ఏమిటి? అరబిక్ పదమైన ఇలాహ్ అంటే ఏమిటి? రబ్ అనే పదానికి అర్థం ఏమిటి? దైవప్రవక్తలు దేవుణ్ణి ఇలాహ్‌గా, రబ్‌గా నమ్మండి అన్నప్పుడు ప్రపంచమంతా కట్టగట్టుకొని వారికి వ్యతిరేకంగా ఎందుకు నిలబడింది? అనే సత్యాలనే పరిశోధించి చూద్దాం.

'ఇలాహ్'-'రబ్' పదాలకు అర్థం

'ఇలాహ్' పదానికి అర్థం ఆరాధనకు అర్హుడు, పూజనీయుడు అనేది మీకంద రికీ తెలిసిందే. అయితే, క్షమించాలి! 'మాబూద్' అనే పదానికి అర్థం ఏమిటో మీరు మరిచిపోయారు. మాబూద్ అనే అరబిక్ పదానికి మూలధాతువు 'అబ్ద్.' అబ్ద్ అంటే దాసుడు అని. 'ఇబాదత్' అంటే కేవలం ఆరాధన (పూజ) ఒక్కటే కాదు. దాసుడు తన యే జీవితాన్నైతే దాస్యం చేస్తూ గడుపుతాడో అది పూర్తిగా ఆరాధనే. సేవ కోసం నిలబడడం, గౌరవసూచకంగా చేతులు కట్టుకోవడం, ధ్యానభావంతో తలను వంచడం, విధేయతాభావంతో తన్మయత్వం చెందడం, ఆదేశపాలన కోసం పరు గిడడం, యజమాని ఏ పనికి పురమాయించినా దాన్ని వెంటనే నెరవేర్చడం, యేది కావాలన్నా దాన్ని వెంటనే సమకూర్చడం, యజమాని శక్తికి, ఆయన ప్రభండతకు గడగడలాడిపోతూ అణిగిమణిగి వినమ్రతను చూపడం, ఆయన చట్టాన్ని అమలు పర్చడం ఆ చట్టాలను శాసనంగా చేయడం, దేన్ని అంతం చేయడానికోసం ఆదేశ మిస్తాడో దాన్ని అంతమొందించడం, ఆయన ఆదేశాలను అవలంబించే మార్గంలో ప్రాణాలను సైతం త్యాగం చేయడం వగైరాలు. ఇదీ ఇబాదత్‌కు సంబంధించిన అసలు భావం. మనిషి ఇల్లాంటి ఆరాధన లేదా ఇబాదత్‌ను ఎవరి పట్ల పాటిస్తాడో ఆయనే అతని అసలు మాబూద్ (ఆరాధ్యుడు).

ఇప్పుడిక రబ్ అనే పదానికి భావం ఏమిటో చూద్దాం. అరబిక్ భాషలో రబ్ అనే పదానికి అసలు అర్థం పోషించువాడు అని. ప్రపంచంలో పోషించేవాడికే తన విధేయతను చూపుతాడు మనిషి. కాబట్టి, 'రబ్'కు మరో అర్థం యజమాని, ప్రభువు అని కూడా వస్తుంది. అరబిక్ భాషలోని జాతీయమైన ప్రయోగం (Idiom)లో ధనవంతుణ్ణి 'రబ్బుల్ మాల్'గా, ఇంటి యజమానిని 'రబ్బుద్దార్'గా పిలువడం జరుగు తోంది. మనిషి ఎవరినైతే తన పోషణ కర్త అని తలుస్తాడో, ఎవరి వల్ల ప్రయోజనం కలుగుతుందని ఆశిస్తాడో, ఎవరివల్లనైతే తన గౌరవం, అభివృద్ధి సంభవం అని అనుకుంటాడో, మరెవరి కటాక్ష వీక్షణాలు లేకపోతే తన జీవితం సర్వనాశనం అవు తుందని భయపడతాడో, ఎవరినైతే తన యజమానిగా, దిక్కుగా చేసుకొని విధేయిస్తాడో అతడే అతని 'రబ్' (పోషకుడు) కూడాను.

ఈ రెండు పదాల అర్థాలను దృష్టిలో ఉంచుకొని మనిషికి పోటీగా, నేనే నీ ఇలాహ్‌ను, నేనే నీ రబ్‌ను, నా దాస్యమే నీవు చేయాలి అనే డిమాండుతో ముందుకు

వచ్చేవాడు ఇంకెవడుంటాడు? చెట్టు చేమలా; రాళ్ళు రప్పలా? నదీ నదాలా? పశుగణమా? సూర్యచంద్ర నక్షత్రాదులా? ఎవరూ?? ముందుకొచ్చి ఆ డిమాండు చేసే శక్తి వేటిలో ఉంది? కేవలం ఒక్క మనిషి మాత్రమే ఆ డిమాండు చేస్తాడు. మనిషికి పోటీగా ఆ డిమాండును చేసే శక్తి ఒక మనిషిలోనే ఉంది. దైవత్వం పొందాలనే తపన కేవలం మనిషి పుర్రెలోనే పుట్టుకురాగలదు. తన సాటి మనుషులకు దేవుణ్ణి కావాలని, వారిచేత తన దాస్యం చేయించుకోవాలని, వారి తలలను తన ముందు వంగేటట్లు చేసుకొని తన హుకుమ్ చెలాయించుకోవాలని, వారిని తమ మనోవాంఛలకు బానిసలుగా చేసుకోవాలని ప్రేరేపిస్తుంది మనిషి పేరాశ.

దేవుణ్ణి కావాలనే మనిషి దురాశ ఎంత మనోహరమైందంటే, దానికి ధీటైనది మనిషి ఈ రోజు వరకు కనుగొనలేకపోయాడు. ఎంతో కొంత ధనబలం, కండబలం, తెలివితేటలు లేదా మరో విధమైన శక్తి సామర్థ్యాలు కలవాడు, తన సహజమైన, న్యాయమైన హద్దులను అతిక్రమించి చుట్టుపట్లగల మనుషులపై, బలహీనులపై, దరిద్రులు, అమాయకులు, ఇతరత్రా మరే బలహీనతలు, శక్తిసామర్థ్యం లేని వారందరిపై తన దైవత్వాన్ని రుద్దేస్తాడు.

దేవుణ్ణయి పోవాలనే పేరాశగల వ్యక్తులు మొత్తం రెండు రకాలు. వీరు రెండు వేరువేరు మార్గాలను పాటిస్తారు. వీరిలో ఒక రకం, దైవత్వపు ప్రత్యక్షదావా దారులు. రెండోరకం, పరోక్షదావాదారులు.

దైవత్వపు ప్రత్యక్ష దావాదారులు (Direct Claimants)

మితిమీరిన తెగువ లేదా దైవత్వం చెలాయించడానికి గల శక్తి సామర్థ్యాలు, వనరులు మెండుగా ఉన్నవారు నేరుగా తమ దైవత్వాన్ని చాటుకుంటారు. ఉదాహరణకు ఫిర్‌ఔన్‌నే తీసుకుందాం. అతను తన రాచరికం, తన సైనికబలం ఆధారంగా ఈజిప్టు ప్రజలకు أَنَا رَبُّكُمُ الْأَعْلَىٰ مَا عَلِمْتُ لَكُم مِّنْ إِلَٰهٍ غَيْرِي "నేనే మీ అందరిమించిన రబ్‌ను (పోషకుణ్ణి), నాకంటే ఇంకెవ్వరూ మీకు రబ్ లేరు" అని ప్రకటించాడు. దైవప్రవక్త హజ్రత్ మూసా(అ) అతని ముందుకు వచ్చి తన జాతికి విముక్తి కలిగించి స్వతంత్రులుగా చేయమని డిమాండు చేశారు. ఆ డిమాండుతోపాటే 'నీవు కూడా ఈ విశ్వకర్తకు దాస్యం చెయ్యి" అని హితవు పలికారు. అప్పుడు ఫిర్‌ఔన్, "నేను నిన్ను ఖైదు చేయగలను జాగ్రత్త. కాబట్టి నీవు కూడా నా దాస్యాన్నే ఒప్పుకో" అన్నాడు. దివ్యఖుర్‌ఆన్‌లో ఫిర్‌ఔన్ మూసాల మధ్య జరిగిన సంభాషణ వివరాలు ఉన్నాయి. ఫిర్‌ఔన్ మూసాను హెచ్చరించిన తీరు చూడండి:

لَئِنِ اتَّخَذْتَ إِلٰهًا غَيْرِي لَأَجْعَلَنَّكَ مِنَ الْمَسْجُونِينَ

"నీవే గనక నన్ను విడిచి మరెవ్వరినైన ఆరాధ్యునిగా (ఇలాహ్‌గా) చేసుకుంటే నిన్ను జైలుకు పంపిస్తాను జాగ్రత్త!"

అలాగే హజ్రత్ ఇబ్రాహీం (అ)తో వాదులాడిన రాజు మరొకడు. ఆ రాజు నమ్రూద్. అతనికి ఇబ్రాహీం (అస)కు మధ్య జరిగిన సంవాదం ఎలా ఉందో జాగ్రత్తగా చదవండి.

أَلَمْ تَرَ إِلَى الَّذِي حَاجَّ إِبْرَاهِيمَ فِي رَبِّهِ أَنْ آتَاهُ اللَّهُ الْمُلْكَ إِذْ قَالَ إِبْرَاهِيمُ رَبِّيَ الَّذِي يُحْيِي وَيُمِيتُ قَالَ أَنَا أُحْيِي وَأُمِيتُ ۖ قَالَ إِبْرَاهِيمُ فَإِنَّ اللَّهَ يَأْتِي بِالشَّمْسِ مِنَ الْمَشْرِقِ فَأْتِ بِهَا مِنَ الْمَغْرِبِ فَبُهِتَ الَّذِي كَفَرَ ۗ

(بقره : ٢٥٨)

"ఇబ్రాహీంతో అతని ప్రభువు విషయంలో వాదనకు దిగిన వ్యక్తి గురించి నీవు ఆలోచించావా? దేవుడు అతనికి రాజ్యాధికారం ప్రసాదించాడు. (అందువల్ల అతను అధికార గర్వంతో విర్రవీగుతూ దేవుని విషయంలో వాదనకు దిగాడు). "ఎవరి ఆధీనంలో జీవన్మరణాలున్నాయో ఆయనే నా ప్రభువు" అని ఇబ్రాహీం అన్నప్పుడు, "చావు బ్రతుకులు నా ఆధీనంలో కూడా ఉన్నాయి" అని అన్నాడతను. అయితే దేవుడు సూర్యుణ్ణి తూర్పు నుండి ఉదయింపజేస్తున్నాడు కదా! నీవు కాస్త అతణ్ణి పడమర నుండి ఉదయింపజెయ్యి చూద్దాం" అని సవాల్ విసిరారు హజ్రత్ ఇబ్రాహీం. దానికి ఆ దైవతిరస్కారి సమాధానం ఇవ్వలేక తెల్లమొహం వేశాడు. దేవుడు దుర్మార్గుల్ని ఎన్నటికీ సన్మార్గం చూపడు. (బకరా: 258)

ఆ దైవతిరస్కారి ఎందుకు తెల్లమొహం వేసినట్లు? లోతుగా పరిశీలిస్తే, అతను దేవుని ఉనికిని తిరస్కరించలేదని, ఈ విశ్వవ్యవస్థను నడిపేవాడు అల్లాహ్‌యేనని, సూర్యుణ్ణి ఉదయింపజేసేది అస్తమింపజేసేది ఆయనే అనే యదార్థం అతనికి బాగా తెలుసు. ఈ విశ్వానికి స్వామి, ప్రభువు ఎవరు? ఇరాక్ ప్రజల ప్రభువు ఎవరు? అన్నది కాదిక్కడ వాదన. అతను సృష్టికి యజమానిని, దేవుణ్ణి అని దావా చేయడం లేదిక్కడ. అతను చేస్తున్న దావా కేవలం, నేనే ఇరాక్ సామ్రాజ్యంలో నివసించే ప్రజలకు రబ్‌ను (పోషకుడిని) అన్నదే. నా చేతిలోనే ప్రజల జీవన్మరణాలున్నాయని, నాకు ఇష్టమైన వారికి మరణ దండన విధించగలను, నేను కోరిన వారికి ప్రాణభిక్ష పెట్టగలను అని తలచడమే. నా మాటే చట్టం, నా ఆదేశం సర్వ ప్రజలకు వర్తిస్తుంది. కాబట్టి మీరు నన్నే రబ్‌గా గుర్తించండి, నా దాస్యం, నా ఆరాధనే చేయండి అని అజ్ఞాపిస్తున్నాడు. కాని హజ్రత్ ఇబ్రాహీం (అస) ఈ భూమ్యాకాశాలకు స్వామి, ప్రభువు ఎవరో, ఎవరి దాస్యం అయితే ఈ సూర్య చంద్రులు చేస్తున్నాయో ఆయన్నే నేను

నా రబ్‌గా విశ్వసించి ఆయన దాస్యమే చేస్తాను అన్నప్పుడు అతను తెల్లమొహం వేశాడు. ఇలాంటి దైవప్రచారకుణ్ణి ఎలా నియంత్రించాలో తెలియక తికమకపడ్డాడు.

ఫిర్‌ఔను, నమ్రూదులు దైవత్వం గురించిన యే దావాలు చేశారో ఆ దావాలు ఆ ఇద్దరి మట్టుకే పరిమితంగా లేవు. ప్రపంచంలో ప్రతి చోటా పాలకుల డిమాండు కూడా అలానే ఉండింది. ఈ డిమాండుల కారణంగానే ఈరాన్‌లో పాదుషాల కోసం 'ఖుదావంద్' అనే పదం వాడుకలోనికి వచ్చింది. ఆ పాదుషాల ముందు ఆరాధనకు సంబంధించిన సకల ఆచారాలు, మర్యాదలు అమల్లో ఉండేవి. అయితే యే ఒక్క ఈరానీ కూడా వారిని దేవుళ్ళకు దేవుడుగా అంటే అల్లాహ్‌గా తలచలేదు. ఆ పాదుషాలు సైతం తమను అలా తలచమని బలవంతం చేయలేదు. అలాగే భారతదేశంలోనూ రాజుల వంశాలు దేవతల పేర్లతో ముడివడి ఉన్నాయి- కాబట్టి సూర్యవంశ రాజులు, చంద్రవంశ రాజులు అనే పేర్లు నేటికిని వాడుకలో ఉన్నాయి. రాజును అన్నదాత, (అంటే పోషకుడు-Cherisher)గా పిలిచేవారు. అతని ముందు సాష్టాంగప్రణామంగా బోర్లాపడేవారు. అయితే తాను పరమేశ్వరుణ్ణి, పరమాత్ముణ్ణి అని ఏ రాజూ తలచలేదు. ప్రజలు కూడా అలా భావించలేదు. నేడు కొన్నిచోట్ల రాజుల కోసం ఇలాహ్ లేదా రబ్ అనే అర్థాలు వచ్చే పదాలు వాడుకలో ఉన్నాయి. అయినప్పటికీ అలాంటి పదాలు వాడుకలో లేని చోట్ల కూడా ఆ పదాల్లో నిగూఢంగా దాగివున్న అర్థాలే స్ఫురిస్తున్నాయి. ఈ రకం దైవత్వాన్ని క్లెయిము చేసిన చోట్లల్లా, మనిషి ఇలాహ్, రబ్ అనే పదాలనే ఉపయోగించనవసరం లేదు. ప్రజలపై అధికారం చెలాయించే వారందరూ, ఫిర్‌ఔన్, నమ్రూదులు నెలకొల్పిన ఆ అధికారాన్ని, ఆ స్వామ్యాన్ని, ఆ యజమాన్యాన్ని, ఆ దైవత్వాన్నే నెలకొల్పజూస్తున్నారు. పదాలు ఏమైనప్పటికీ, వారికి దాస్యం చేసేవారు, వారిని ఆరాధించేవారు నోటితో ఆ పదాలను పలుకకపోయినా వారిని రబ్‌గా, ఇలాహ్‌గానే గుర్తిస్తారు.

దైవత్వపు పరోక్ష దావాదారులు

తామే దేవుళ్ళమని, పోషణ కర్తలమని ప్రత్యక్షంగా దైవత్వపు దావాను చేసే మనుషులు ఒక రకం అయితే, వీరికి ఉన్నంత శక్తిసామర్థ్యాలు, కావలసిన వనరులు, అంగబలం, ఆర్థికబలం, కండబలం లేని మనుషులు కూడా తమ ఎత్తుగడలతో, మోసాలతో పరోక్షంగా ఆ దైవత్వం గురించిన దావాను చేసేవారు మరోరకం. వీరు సాధారణ ప్రజల మనోమస్తిష్కాలను ఇంద్రజాలం ద్వారా లోబరుచుకుంటారు. వాటినే ఆయుధాలుగా మలుచుకొని ఏ ప్రేతాత్మనో, ఏ దేవతా విగ్రహాన్నో, ఏ నక్షత్రాన్నో, మరే సమాధినో, చెట్టునో, పుట్టనో దేవుళ్ళుగా మలిచి ఇవే మీకు లాభనష్టాలను చేకూర్చిపెట్టగలవని, ఇవే మీ కోరికలను ఈడేర్చేవని, మీకు రక్షణను కలిగించేవని మభ్యపెడతారు. వీటిని ప్రసన్నులుగా చేయకపోతే అవి మిమ్మల్ని కరువుకాటకాలకు,

వ్యాధులకు, కష్టాలకు లోనుచేస్తాయి అని భయపెడతారు. వాటిని ప్రసన్నులుగా చేసి మ్రొక్కుకుంటే మిమ్మల్ని ఆదుకుంటాయి అంటారు. అయితే వాటిని ఎలా ప్రసన్నులుగా చేసుకోవాలో, మీ వైపునకు వాటి దృష్టి ఎలా మళ్ళుతుందో ఆ మార్గాలు, ఆ విధానాలు మాకు తప్ప మరెవ్వరికీ తెలియవు. కాబట్టి మీరు మా పెత్తనాన్ని గుర్తించాలి, దాని కోసం మీరు మమ్మల్ని ప్రసన్నులుగా చేయవలసి ఉంటుంది. మీ ధన మాన ప్రాణాలను మా చేతిలో పెట్టండి అని నమ్మిస్తుంటారు. చాలా మంది అమాయకులు వారి ఈ ఉచ్చులో చిక్కుకుపోవడం వలన పురోహితులు, పూజార్లు, బాబాలు, ముజావర్ల దైవత్వం వ్యాప్తిలోకి వస్తుంది.

ఇలాంటి వారిలో కొందరు జ్యోతిష్యం, భవిష్యవాణి, సోదె వాస్తు, మంత్ర తంత్రాలు, తాయత్తులు వగైరా ట్రిక్కులను ఆసరాగా చేసుకుంటారు. మరికొందరైతే, దేవుడే సకలం, ఆయనకే దాస్యం చేయాలి అని ఒప్పుకుంటారుగాని, మీరు దేవునికి చేరువకావాలంటే, ఆయన ప్రసన్నత పొందాలంటే ఆరాధనా విధానాలన్నీ, మీ జననం మొదలు మరణం వరకు గల ప్రతి ధార్మిక తంతు, కర్మకాండ మాత్రం మా చేతుల మీదుగానే జరగాలి సుమా అంటూ సాధారణ ప్రజలకు ఆ జ్ఞానం వాసన కూడా తగలకుండా జాగ్రత్త పడుతూ ఉంటారు. స్వయంగా వారే దేవుని వాక్యంగా నిలిచి ధర్మసమ్మతమైనదేదో, నిషిద్ధమైనదేదో ప్రజలకు నిర్దేశించి చెబుతూ ఉంటారు. ఇలా వారి వాక్కే ఓ చట్టంగా మారుతుంది. సృష్టికర్తకు కాకుండా ప్రజలు తమ ఆదేశాలకు తలవంచేటట్లు చేస్తారు. పౌరోహిత్యం, ప్రీస్టిజం అంటే ఇదే. రకరకాల పేర్లతో, రకరకాల పద్ధతులతో అనాదిగా ఈ ప్రపంచంలో అమలు జరుగుతున్న ఆచారం దాని చలువ వల్లే కొన్ని కుటుంబాలు, కొన్ని వర్గాలు, కొన్ని జాతులు సాధారణ ప్రజలపై తమ పెత్తనాన్ని సాగించుకుంటూ వస్తున్నాయి.

ఈ దుష్ట సంప్రదాయానికి మూలం ఏమిటి?

ఈ దృష్టితో గనక మీరు చూస్తే, ప్రపంచంలో ఈ దుష్ట సంప్రదాయానికి అసలు మూలం, ఈ రుగ్మతకు అసలు కారణం మనిషిపై మనిషి చాటుకునే దైవత్వమే అని గ్రహించగలరు. ప్రత్యక్షంగాగాని, పరోక్షంగాగాని ప్రకటించే దైవత్వం కారణంగానే చెడు ప్రారంభం అవుతోంది. దీన్నుండే నేడు హాలాహల స్రవంతులు పుట్టుకొస్తున్నాయి. ప్రస్తుతం మనిషి వేలాది సంవత్సరాలుగా మనిషిని ఇలాహ్‌గా, రబ్‌గా నమ్మకుండా ఉండలేక పోతున్నాడు. ఎవరో ఒకరు ఇలాహ్‌గా, రబ్‌గా ఉండకపోతే అతని జీవితం గడిచేటట్లు లేదు అనే యదార్థం మనకు తెలిసి వచ్చింది. సృష్టికర్తను విశ్వసించకపోయినా, మనిషి ఇలాహ్, రబ్‌ల బారినుండి తప్పించుకోలేక పోతున్నాడు. ఇంకా చెప్పాలంటే, ఈ పరిస్థితిలో అనేకమంది ఇలాహ్‌లు,రబ్‌లు అతని నెత్తికెక్కి కూర్చుంటున్నారు. ఈ రోజు మీరెటు జూసినా ఓ జాతి మరో జాతికి ఇలాహ్

అయికూర్చుంది. ఇంకోచోట ఓ వర్గం మరో వర్గానికి ఇలాహ్‌గా అలరారుతోంది. మరోచోట ఓ పార్టీ ఇంకోపార్టీని ఆ స్థానంలో తెచ్చి కూర్చోబెడుతోంది. ఓ చోట జాతీయ ప్రభుత్వం ఆ దైవత్వ స్థానాన్ని ఆక్రమిస్తే మరోచోట ఎవరో ఒకరు నియంతగా, డిక్టేటరుగా, مَا عَلِمْتُ لَكُمْ مِنْ إِلٰهٍ غَيْرِي "నాకు తప్ప మరెవ్వరూ మీ ఇలాహ్ కాడు" అని చాటుతున్నాడు. మనిషికి ప్రపంచంలో ఎక్కడా ఇలాహ్ లేకుండా లేడు.

మనిషిపై మనిషి దైవత్వం నెలకొంటే బయల్పడే ఫలితం ఎలా ఉంటుంది అని ఆలోచిస్తే, ఓ అల్పుణ్ణి పోలీసు కమీషనరుగా, ఓ అజ్ఞానిని ప్రధానమంత్రిగా చేస్తే బయల్పడే ఫలితం లాంటిదే అది. దైవత్వం మత్తే అలాంటిది మరి. ఆ మత్తును సేవించిన వాడు తననుతాను ఎప్పుడూ కంట్రోలు చేసుకోలేడు. అథవా అతను కంట్రోలులో ఉన్నప్పటికీ దైవత్వపు విధులను నిర్వర్తించడానికి ఏ పరిజ్ఞానం కావాలో ఆ పరిజ్ఞానం, ఆ నిస్వార్థత, ఆ ప్రతిఫలాపేక్ష రాహిత్యం, ఆ నిరాపేక్షతలను మనిషి ఎక్కడ నుండి తీసుకొని రాగలడు? అందుకే, ఎక్కడైతే మనిషిపై మనిషి దైవత్వం నెలకొని ఉన్నదో అక్కడ దౌర్జన్యం, సంవిధానోల్లంఘన, అక్రమ ధనార్జన, అన్యాయం, అక్రమాలు ఏదో ఒక రూపంలో చోటు చేసుకుంటున్నాయి. మనిషి ఆత్మకు ప్రకృతి సిద్ధమైన స్వేచ్ఛ లభించడం లేదు. మనిషి మనోమస్తిష్కాలపై, అతని సహజశక్తి సామర్థ్యాలపై విధించబడిన ఆంక్షలు అతని వృద్ధి వికాసాలను అడ్డుకుంటున్నాయి. దీన్నే విడమరుస్తూ అంతిమ దైవప్రవక్త (స) ఎంత మంచి మాట అన్నారో చూడండి:

قَالَ اللّٰهُ عَزَّ وَجَلَّ إِنِّي خَلَقْتُ عِبَادِي حُنَفَاءَ فَجَاءَتْهُمُ
الشَّيٰطِينُ فَاجْتَالَتْهُمْ مِنْ دِينِهِمْ وَحَرَّمَتْ عَلَيْهِمْ مَا
أَحْلَلْتُ لَهُمْ
(حدیث قدسی)

"అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు: నేను నా దాసులను సరైన నైజంతో పుట్టించాను. ఆ తరువాత షైతానులు వారిని చుట్టుముట్టారు. వారిని సహజమైన, ప్రకృతి సిద్ధమైన మార్గం నుండి తప్పించారు. వారికి నేను హలాల్ (ధర్మసమ్మతం) చేసిన దాన్ని ఆ షైతానులు వారికి దక్కకుండా చేశారు." (హదీసె ఖుద్‌సీ)

మనిషి సకల కష్టాలకు, అతని వినాశనానికి, దివాలా తనానికి(Deprivation), ఏకైకకారణం ఇదే. ఇదే అతని అసలు వికాసాన్ని అడ్డుకుంటోంది. అతని నైతికతలను, ఆధ్యాత్మికతను, అతని వైజ్ఞానిక, ఆలోచనాత్మక శక్తులను, అతని సభ్యతా సంస్కా రాలను, అతని రాజకీయ మనుగడను ఒకటేమిటి ప్రతి విషయాన్ని క్షయవ్యాధిలా తినేస్తోంది. గతంలోను అలా జరిగింది. భవిష్యత్తులోనూ అలా జరుగగలదు. ఈ రోగానికి ఏకైక విరుగుడు, మానవుడు ఇలాహ్‌లు, రబ్‌లందరిని తిరస్కరించి కేవలం విశ్వసృష్టికర్త, విశ్వపోషకుడు అయిన ఆ ఏకైక ప్రభువునే తన పోషకునిగా, ఆరాధ్యునిగా

ఖరారు చేసుకోవడం. అంతకంటే వేరే మార్గం లేదు. మోక్షసాధనకు అంతకంటే మరో వికల్పం లేదు. ఎందుకంటే మనిషి నాస్తికుడైనప్పటికీ, అతనో అవిశ్వాసి అయినప్పటికీ ఇతరత్రా ఇలాహ్‌లు, రబ్‌ల బారి నుండి తప్పించుకోలేకపోతున్నాడు.

దైవప్రవక్తలు చేసిన అసలు సంస్కరణ

దైవప్రవక్తలు మానవ జీవితానికి సంబంధించి చేసిన అసలు సంస్కరణలు అన్నీ ఇవే. మనిషి మనిషిపై చెలాయించే దైవత్వాన్ని రూపుమాపడానికే వీరు భువిలో ప్రభవించారు. ఆ దౌర్భాగ్యం, దౌర్జన్యం, ఆ అసత్యదేవుళ్ళ దాస్యాల నుండి, ఆ అతిక్రమణ (Transgression), బూటకపు ప్రయోజనాల నుండి మనిషికి విముక్తిని కలిగించడమే వీరి కార్యక్రమం. మానవత్వపు పరిమితులను అతిక్రమించడం వలన మనిషి ఏ అధోగతికి దిగజారిపోతున్నాడో ఆ దుస్థితి నుండి అతణ్ణి పైకిలేపి, అందరికీ ఆమోదయోగ్యమైన సమన్యాయంగల జీవన వ్యవస్థకు కట్టుబడి ఉండేటట్లు చేయడం ఆ వ్యవస్థ పరమ లక్ష్యం. ఆ జీవన వ్యవస్థలో ఏ మనిషి కూడా మరో మనిషికి దాసుడుగాగాని, ఆరాధ్యుడుగాగాని ఉండకుండా అందరూ ఒకే ఒక దేవునికి దాసులై ఉండేటట్లు చేయడమే వారి ధ్యేయం. సృష్టి ప్రారంభం నుండి ఎందరు ప్రవక్తలైతే ఈ ప్రపంచంలో ప్రభవించారో వారి సందేశం కూడా ఒక్కటిగానే ఉంది. ఆ సందేశం ఏమిటో దివ్యఖుర్‌ఆన్ ఇలా సెలవిస్తోంది:

يَا قَوْمِ اعْبُدُوا اللَّهَ مَا لَكُمْ مِنْ إِلَٰهٍ غَيْرُهُ

"ప్రజలారా! అల్లాహ్ దాస్యమే చేయండి. ఆయన తప్ప మరెవ్వరూ మీకు ఆరాధ్యుడు కాడు."

ప్రవక్త హజ్రత్ నూహ్ (అస), హజ్రత్ హూద్ (అస) చెప్పింది కూడా అదే. హజ్రత్ సాలెహ్ (అస) గారి సందేశం కూడా అదే. హజ్రత్ షుఅయిబ్ (అస) ఈ సందేశం వైపునకే మానవాళిని ఆహ్వానించడం జరిగింది. చిట్టచివరిగా హజ్రత్ ముహమ్మద్ (సఅసం) చేసిన ప్రకటన కూడా అదే.

إِنَّمَا أَنَا مُنْذِرٌ ۖ وَمَا مِنْ إِلَٰهٍ إِلَّا اللَّهُ الْوَاحِدُ الْقَهَّارُ
رَبُّ السَّمَاوَاتِ وَالْأَرْضِ وَمَا بَيْنَهُمَا ‎(ص : ٦٥، ٦٦)

"నేను కేవలం హెచ్చరిక చేసేవాణ్ణి మాత్రమే. ఏకేశ్వరుడైన అల్లాహ్ తప్ప మరో ఆరాధ్యుడు లేడు. ఆయన సర్వాధికుడు, భూమ్యాకాశాలకు, వాటి మధ్యవున్న వాటికి యజమాని." (సాద్:65,66)

إِنَّ رَبَّكُمُ اللَّهُ الَّذِي خَلَقَ السَّمَاوَاتِ وَالْأَرْضَ فِي سِتَّةِ أَيَّامٍ ثُمَّ اسْتَوَىٰ عَلَى الْعَرْشِ
يُغْشِي اللَّيْلَ النَّهَارَ يَطْلُبُهُ حَثِيثًا وَالشَّمْسَ وَالْقَمَرَ وَالنُّجُومَ مُسَخَّرَاتٍ
بِأَمْرِهِ ۗ أَلَا لَهُ الْخَلْقُ وَالْأَمْرُ ‎(الاعراف : ٥٤)

"వాస్తవానికి అల్లాహ్‌యే మీ ప్రభువు, పోషకుడు. ఆయనే భూమ్యాకాశాలను ఆరుదినాలలో సృష్టించాడు. తరువాత తన అధికార సింహాసనం అధిష్టించాడు. ఆయనే రాత్రిని పగటిపై కప్పుతున్నాడు. తిరిగి పగటి వెనుక రాత్రి పరుగెడుతు వస్తుంది. ఆయనే సూర్యచంద్ర నక్షత్రాలను సృష్టించినవాడు. సకల సృష్టిరాసులూ ఆయన ఆజ్ఞనే శిరసావహిస్తున్నాయి. వినండి! సృష్టి ఆయనదే. ఆజ్ఞ(అధికారం) కూడా ఆయనదే." (ఆరాఫ్:54)

ذٰلِكُمُ اللّٰهُ رَبُّكُمْ ۚ لَآ إِلٰهَ إِلَّا هُوَ ۚ خَالِقُ
كُلِّ شَيْءٍ فَاعْبُدُوْهُ ۚ وَهُوَ عَلٰى كُلِّ شَيْءٍ وَّكِيْلٌ ۝
(الانعام: ١٠٢)

"అలాంటి దేవుడే మీ ప్రభువు. ఆయన తప్ప మరో దేవుడు లేడు. ఆయనే సర్వసృష్టికర్త. కనుక మీరు ఆయన్నే ఆరాధించండి. ఆయనే అందరికీ సంరక్షకుడూను." (అన్ఆమ్-102)

وَمَآ أُمِرُوْٓا إِلَّا لِيَعْبُدُوا اللّٰهَ مُخْلِصِيْنَ لَهُ الدِّيْنَ
حُنَفَآءَ ۔ (البينة: ٥)

"(తమ) జీవన విధానాన్ని దేవుని కోసం ప్రత్యేకించి ఏకాగ్రచిత్తులై ఆయన్నే ఆరాధించాలని, అదే సత్యధర్మమని మాత్రమే వారికి ఆదేశించబడింది." (అల్‌బయ్యినహ్:5)

تَعَالَوْا إِلٰى كَلِمَةٍ سَوَآءٍۢ بَيْنَنَا وَبَيْنَكُمْ أَلَّا نَعْبُدَ
إِلَّا اللّٰهَ وَلَا نُشْرِكَ بِهٖ شَيْـًٔا وَّلَا يَتَّخِذَ بَعْضُنَا
بَعْضًا أَرْبَابًا مِّنْ دُوْنِ اللّٰهِ ۔ (آل عمران: ٦٤)

"మీకూ మాకూ మధ్య ఉమ్మడిగా ఉన్న విషయాన్ని అంగీకరిద్దాం, రండి, మనం అల్లాహ్‌ను తప్ప మరెవ్వరినీ ఆరాధించకూడదు. మనలో ఎవరూ అల్లాహ్‌ను తప్ప ఇతరుల్ని ప్రభువుగా, పోషకుడుగా స్వీకరించకూడదు." (ఆలిఇమ్రాన్:64)

అప్పటి వరకు బానిసత్వ బంధనాల్లో చిక్కుకొని ఉన్న మనిషి ఆత్మను, అతని ఆలోచనలను, అతని మానసిక, శారీరక శక్తులను ఆ సంకెళ్ళ నుండి విముక్తి ప్రసాదించిన ప్రకటన అది. అదేకాదు, ఇది మానవుని అసలు స్వేచ్ఛా స్వాతంత్ర్యాల ఛార్టరు కూడాను. దైవప్రవక్త ముహమ్మద్ (స) గారి ఈ ఘనకార్యాన్ని దివ్యఖుర్‌ఆన్ ఆరాఫ్ అధ్యాయంలోని 157 వ ఆయత్‌లో ప్రశంసిస్తూ, "ఆ ప్రవక్త (స), వారి మీద పడిన (ఆంక్షల) భారాన్ని తొలగిస్తాడు, వారు చిక్కుకున్న (దురాచార) బంధనాల నుండి వారికి విముక్తి కలిగిస్తాడు" అని చెప్పడం జరిగింది.

ఎలాగైతేనేమి, మనం మన శ్రేయాన్ని కోరుకుంటే, దేవుణ్ణి విశ్వ సించడం, ఆయన పాలనకు విధేయులైన పౌరుల్లా ఆయనకు సమర్పించుకోవడం కంటే మార్గాం తరం లేదు. అలాగే, ఆయన మన ప్రత్యక్ష, పరోక్ష కార్యకలాపాలన్నిటిని ఎరిగినవాడని, ఓ రోజు మనం ఆయన న్యాయస్థానంలో మన ఇహలోక జీవితంలో చేసిన కర్మ లన్నిటికి జవాబు చెప్పుకోవలసి ఉన్నదనే విశ్వాసంతో జీవితం గడపవలసి ఉంటుంది. జీవితానికి సంబంధించిన ఈ సిద్ధాంతంలోనే మనిషి శ్రేయం, హితం దాగుంది.

అల్లాహ్ తన దాసులను ఆ మార్గం వైపునకు ఆహ్వానించడానికి, దాన్ని ప్రచారం చేయడానికిగాను ఆదేశించిన సత్యధర్మం అదొక్కటే.

(ఇస్లామీయ జీవన వ్యవస్థ- దాని మౌలిక భావనలు, పుట:100, 101)

సందేశ ప్రచార ప్రాధాన్యత

ఆ సందేశ ప్రచారం అందించవలసిన బాధ్యత స్వయంగా దేవునిదే. అయితే, ఆయన సందేశ ప్రచార కార్యక్రమంలో పాలుపంచుకునే దైవదాసుడు దైవానికి అత్యంత ప్రీతిపాత్రుడు, సహాయకుడూ అవుతాడు. ఈ విషయం గురించి దివ్యఖుర్ఆన్ ఇలా సెలవిస్తోంది:

فَلَمَّآ أَحَسَّ عِيسَىٰ مِنْهُمُ ٱلْكُفْرَ قَالَ مَنْ أَنصَارِىٓ إِلَى ٱللَّهِ ۖ
قَالَ ٱلْحَوَارِيُّونَ نَحْنُ أَنصَارُ ٱللَّهِ ءَامَنَّا بِٱللَّهِ وَٱشْهَدْ
بِأَنَّا مُسْلِمُونَ ○ (آل عمران : ۵۲)

"ఈసా (ప్రవక్త) వారిలో (బనీ ఇస్రాయీల్ జాతి) అవిధేయత, అవిశ్వాసాల ధోరణి చూసి, దైవమార్గంలో నాకు తోడుగా నిల్చేవారు ఎవరైనా ఉన్నారా మీలో?" అని అడిగాడు. దానికి 'హవారీలు' (శిష్యులు) ఇలా అన్నారు: "మేము దేవుని (మార్గంలో మీకు తోడుగా నిలిచే) సహాయకులం. మేము దేవుణ్ణి విశ్వసిస్తున్నాము. ఆయనకు విధేయులై (ముస్లిములై) పోయాము. దీనికి మీరే సాక్షి." (ఆలి ఇమ్రాన్:52)

సత్యానికి చేయూత

దివ్యఖుర్ఆన్‌లో అనేకచోట్ల, ఇస్లామ్ ధర్మసంస్థాపనలో పాలుపంచుకునే కార్యక్రమానికి, అనేక సందర్భాల్లో, "దేవునికి సహాయపడడం"గా వర్ణించడం జరిగింది. ఇది ఓ ప్రధానమైన విషయం. జీవితంలోని ప్రతి రంగంలోనూ, మనిషికి తన ఇష్ట పూర్వకంగా మసలుకునే స్వేచ్ఛ ఇవ్వడం జరిగింది. ఈ విషయంలో అతను దైవ తిరస్కార మార్గం (కుఫ్ర్) లేదా విశ్వాస మార్గం (ఈమాన్); దైవధిక్కారం లేదా దైవ విధేయతల్లో ఏదో ఒక మార్గాన్ని అవలంబించడానికి దేవుడు బలవంతం చేయలేదు. దీనికి భిన్నంగా మనిషికి తిరస్కారం, అవిధేయత, ధిక్కారాల స్వేచ్ఛ ఉంది. అయి

నప్పటికీ, దైవదాస్యం, దైవవిధేయతలను అవలంబించడంలోనే శుభం, శ్రేయం, ముక్తి కలిగివున్న మార్గాన్నే అవలంబించాలని దేవుడు సూచిస్తున్నాడు. హితబోధనల ద్వారా, ఆధారాల ద్వారా ఈ మార్గాన్నే అవలంబించమని మనిషిని ఒప్పిస్తాడు. ఈ విధమైన ఉపదేశాలతో, హెచ్చరికలతో దాసుల్ని అల్లాహ్ మార్గం వైపునకు ఆహ్వానించడమనేదే ఆయన అసలు కార్యం. ఏ దాసులైతే ఈ కార్యంలో అల్లాహ్‌కు తోడ్పడుతూ ఉంటారో వారిని ఆయన తన సహచరులుగా, మిత్రులుగా ఖరారు చేస్తాడు. ఈ హోదా అన్ని హోదాలకంటే ఉత్తమమైన హోదా. ఆ హోదాను ఏ దాసుడైనా పొందే అవకాశం ఉంది. నమాజు, రోజా, ఇంకా ఇలాంటి ఆరాధన విధానాలన్నింటిలోనూ మనిషి కేవలం ఆజ్ఞలను శిరసావహించే దాసుడుగానే మిగిలిపోతాడు కాని, ధర్మసందేశ ప్రచారం, దాని సంస్థాపనలో కృషి చేసే దైవదాసులకు మాత్రం దైవ సహచర్యం, సహకారాలు లభించడం విశేషం. ఈ ఇహలోకంలో ఆ హోదా, ఆధ్యాత్మికతకు సంబంధించిన అత్యుత్తమమైన స్థానం.

సత్యధర్మ సంరక్షణ

وَلَيَنْصُرَنَّ اللّٰهُ مَنْ يَّنْصُرُهٗ (الحج : ٤٠)

"అల్లాహ్ (తన ధర్మానికి) సహాయం చేసే వారిని తప్పకుండా ఆదుకుంటాడు."
(అల్‌హజ్:40)

దౌర్జన్యానికి, దురాగతాలకు, అన్యాయ, అక్రమాలకు, హింసకు గురిఅవుతూ ఉండిన సత్యధర్మావలంబీకులకు, దైవమార్గంలో పోరాడడంలోగల ఔచిత్యం ఏమిటో, దాని అవసరం ఎందుకు ఏర్పడిందో అని ఈ ఆయత్‌లో చెప్పిన తరువాతనే జిహాద్ (ధర్మసంస్థాపన కోసం చేసే పోరాటం) అనుమతిని ఇవ్వడం జరిగింది. ఎందుకంటే, ఒకవేళ దౌర్జన్యపరులకు, నియంతలకు విచ్చలవిడిగా తమ దౌర్జన్యకాండను సాగించే అవకాశం ఇచ్చినట్లయితే, ఈ భూమండలం పూర్తిగా దురాగతాలతో, దుశ్చర్యలతో నిండిపోగలదు. ప్రపంచంలో దేవుని పేరును ఉచ్చరించే ప్రదేశాలు సైతం సురక్షితంగా ఉండలేవు. కాబట్టి, ఎవరైతే మానవాళిని దైవ ఏకత్వం వైపునకు ఆహ్వానిస్తున్నారో వారు దుర్మార్గం స్థానంలో సన్మార్గాన్ని ప్రతిష్టించే ప్రయత్నం చేస్తున్నందున ఇలాంటి వారు వాస్తవంగా అల్లాహ్‌కు సహాయపడుతున్నట్లే లెక్క. (తఫ్హీముల్ ఖుర్ఆన్)

సత్యం పెట్టే పరీక్ష

అల్లాహ్‌కు సహాయకులుగా ఉండాలంటే ప్రచారకుని ఈ ప్రమాణ స్థాయిని కూడా పరీక్షించడం అవసరం.

ذٰلِكَ ۛ وَلَوْ يَشَآءُ اللّٰهُ لَانْتَصَرَ مِنْهُمْ وَلٰكِنْ لِّيَبْلُوَا بَعْضَكُمْ بِبَعْضٍ ۭ (محمد : ۴)

"ఇదీ మీరు చేయవలసిన పని. అల్లాహ్ తలుచుకుంటే (మీ జోక్యం లేకుండా) స్వయంగానే వారిని ఎదుర్కొనేవాడు. కాని ఆయన మిమ్మల్ని ఒకరి ద్వారా మరొకర్ని పరీక్షించడానికి (ఈ పద్ధతిని అవలంబించాడు)."

(ముహమ్మద్:4); (తఫ్హీముల్ ఖుర్ఆన్)

జిహాద్‌లో ముస్లిములకు బోధించబడిన పద్ధతులే అసలు నెరవేర్చవలసిన పని. ఈ పద్ధతిలో విశ్వాసులకు పరీక్ష ఉంది. దుష్టుల్ని, దుర్మార్గుల్ని, అసత్యవాదులను మట్టుబెట్టదలచుకుంటే అల్లాహ్‌కు మీతోడు అవసరం ఏ మాత్రం లేదు. ఈ పనిని ఒక్క భూకంపమో, యే ఒక్క తుఫానో క్షణాల్లో చేసిపారేసేది. కాని మానవుల్లోని సత్యమార్గగాములు, అసత్యవాదులను ఎదిరించాలని వారికి వ్యతిరేకంగా కృషి చేయడం మూలంగా వారిలోని గుణగణాలు ఈ పరీక్షలో నిగ్గుతేలి బయటకు రావాలని, తద్వారా ప్రతి వ్యక్తి తన నడవడికి అనుగుణంగా ఏ స్థానాన్ని, మరే హోదాను పొందడానికి అర్హుడో తెలిసిపోవాలనే ఈ పరీక్ష పెట్టడం జరిగింది.

దైవదాసునికి దేవుని తోడ్పాటు

يٰٓاَيُّهَا الَّذِيْنَ اٰمَنُوْٓا اِنْ تَنْصُرُوا اللّٰهَ يَنْصُرْكُمْ وَيُثَبِّتْ اَقْدَامَكُمْ ۝ (محمد : ۷)

"విశ్వాసులారా! మీరు అల్లాహ్‌కు సహాయం చేస్తే, ఆయన మీకు సహాయం చేస్తాడు. మీ పాదాలను సుస్థిరం చేస్తాడు." (ముహమ్మద్:7, తఫ్హీముల్ ఖుర్ఆన్)

అల్లాహ్‌కు సహాయపడడమంటే సాదాసీదా భావం, ఆయన ఆదేశాన్ని ఉన్నతం చేయడానికి ధనప్రాణాలొడ్డి జిహాద్ చేయడం. కాని ఇందులో మరోభావం కూడా దాగుంది. అది ఈసా ప్రవక్త (అస) పిలుపు, مَنْ اَنْصَارِیْٓ اِلَی اللّٰهِ "దైవమార్గంలో నాకు తోడుగా నిలిచే వారెవరైనా ఉన్నారా?" అని అడగడంలోగల భావమే. ఆ వివరణ పై పంక్తుల్లో మనం చదువుకున్నాం. అంటే హితబోధ ద్వారా, విషయాన్ని వివరించడం ద్వారా ప్రజలను దైవధిక్కారం, అవిధేయతలకు బదులు, దైవవిధేయులయ్యేటట్లు ఒప్పించడం అన్నమాట. ఈ ఆహ్వానకార్యాన్ని ప్రారంభించగానే అల్లాహ్ ఆ ప్రచారకుణ్ణి దరిద్రునిగా గాని, అసహాయునిగా గాని వదిలి పెట్టడు. పైగా అల్లాహ్ అతనికి తన సహాయ సహకారాలను కూడా అందిస్తాడు. దానికోసం వనరుల్ని సమకూరుస్తాడు. తద్వారా సందేశ ప్రచారకుడు స్థిరంగా నిలబడడం వలన తన ప్రత్యర్థి దృష్టిలో బలహీనుడిగా అగుపించడు.

وَلِيَعْلَمَ اللّٰهُ مَنْ يَّنْصُرُهٗ وَرُسُلَهٗ بِالْغَيْبِ ۭ
اِنَّ اللّٰهَ قَوِيٌّ عَزِيْزٌ ۝ (الحديد : ٢٥)

"ఇలా ఎందుకు చేయబడిందంటే, ఆయనను చూడకుండానే ఎవడు ఆయనకూ, ఆయన ప్రవక్తలకూ సహాయపడతాడో అల్లాహ్‌కు తెలియాలని. నిశ్చయంగా అల్లాహ్ ఎంతో దృఢమైనవాడు, సర్వశక్తిమంతుడూను."

(అల్‌హదీద్:25, తఫ్హీముల్ ఖుర్‌ఆన్)

అంటే, సందేశ ప్రచారకుడు బలహీనుడని, అతను తన శక్తిని ఉపయోగించి పనిచేయలేని స్థితిలో ఉన్నాడని, దానికి అల్లాహ్ సహాయపడుతున్నాడని కాదు దీని అర్థం. ఆయన మనుషులను పరీక్షించడానికి ఎంచుకున్న విధానమది. ఈ పరీక్షకు గురియైన తరువాతే మనిషి తన వృద్ధివికాసాల మార్గంపై ముందుకు సాగగలడు. అల్లాహ్‌కు తన మహిమ ద్వారా దైవతిరస్కారుల్ని ఒకే ఒక సైగతో మట్టి కరిపించే శక్తి ఉన్నప్పటికీ, తన ప్రవక్తలకు ప్రాబల్యం ప్రసాదించే శక్తి సామర్థ్యాలు కూడా ఉన్నప్పటికీ, దైవప్రవక్తలను నమ్మేవారిని, ఎలాంటి ఆధారం లేకుండా అల్లాహ్ ప్రసాదించే బహుమానాన్ని పొందే అర్హతకు పరీక్ష పెట్టడం అవసరంలేదా? ఆకారణం చేతనే అల్లాహ్ ఈ కార్యాన్ని తన దైవత్వపు శక్తిని ఉపయోగించి నిర్వహించే బదులు, ప్రవక్తలకు సూచనలిచ్చి, గ్రంథాలను ప్రసాదించి న్యాయన్యాయాల విచక్షణ జ్ఞానాన్ని ప్రసాదించి ప్రజల్లో ప్రభవింపజేసింది. వారు న్యాయమార్గం ఏదో ప్రజల ముందుంచి తద్వారా దౌర్జన్యం, అన్యాయాలకు దూరంగా ఉండమని ఆహ్వానించడం జరిగింది. ఎవరైనా సరే దైవప్రవక్తల ఈ సందేశాన్ని శిరసావహించవచ్చు లేదా దాన్ని రద్దు చేసి తిరస్కరించవచ్చు. ఈ స్వేచ్ఛను కూడా వారికి ప్రసాదించాడు దైవం. అలాగే, ప్రవక్తల ఆహ్వానాన్ని స్వీకరించిన వారిని, ఈ న్యాయబద్ధమైన వ్యవస్థను స్థాపించడానికి నాకూ, నా ప్రవక్తలకు సహాయపడండని, భువిలో కల్లోలాన్ని రేపుతూ అన్యాయాక్రమాలకు, దౌర్జన్యానికి పాల్పడుతూ ఆ వ్యవస్థనే నెలకొల్ప చూస్తున్న వారిని అడ్డుకునేందుకు సర్వశక్తులను ధారపోయండని పిలుపునివ్వడం జరిగింది. ఇలా, మనుషుల్లో న్యాయం వైపునకు మొగ్గేవారు ఎవరు? ఆ న్యాయవ్యవస్థకు వ్యతిరేకంగా అక్రమమైన అన్యాయమైన వ్యవస్థను నెలకొల్పడానికి, దైవేతర మార్గాల్లో తమ ప్రాణాలను సైతం అర్పించడానికి సిద్ధంగా ఉన్న వారెవరు? అన్నది అల్లాహ్ చూడదలిచాడు. అదేకాకుండా, న్యాయసమ్మతమైన ఈ ధర్మాన్ని స్వీకరించి కూడా దాన్ని బలపర్చడానికి దాని కోసం ప్రయత్నించడానికి వెనుకాడుతున్నదెవరు? అప్రత్యక్ష దైవం కోసం ఈ భువిలో సత్యాన్ని ప్రబలింపజేయడానికి తమ ప్రాణాలను సైతం త్యాగం చేయడానికి సిద్ధపడేవారెవరు? అన్నది చూడదలిచాడు దైవం. ఈ పరీక్షలో నెగ్గి బయటకు వచ్చినవారి కోసం భవిష్యత్తులో మోక్ష ద్వారాలు తెరుచుకుంటాయి.

اَلَّذِیْنَ اُخْرِجُوْا مِنْ دِیَارِهِمْ وَ اَمْوَالِهِمْ یَبْتَغُوْنَ فَضْلًا مِّنَ اللّٰهِ وَ رِضْوَانًا وَّ یَنْصُرُوْنَ اللّٰهَ وَ رَسُوْلَهٗ ؕ اُولٰٓئِكَ هُمُ الصّٰدِقُوْنَ ۚ (الحشر : ٨)

"తమ ఇండ్ల నుండి, తమ ఆస్తిపాస్తుల నుండి తరిమి వేయబడిన నిరుపేద శరణార్థులకు కూడా హక్కు ఉంది. వారు అల్లాహ్ అనుగ్రహాన్ని ఆయన ప్రసన్నతనూ కోరుకుంటున్నారు. ఇంకా వారు అల్లాహ్‌కూ ఆయన ప్రవక్తకూ సహాయపడేందుకు సిద్ధంగా ఉంటారు. వారే రుజువర్తనులు." (అల్ హష్ర్:8)

వీరికే పదోన్నతులు, ఉజ్వలభవిష్యత్తూను

یٰۤاَیُّهَا الَّذِیْنَ اٰمَنُوْا كُوْنُوْۤا اَنْصَارَ اللّٰهِ كَمَا قَالَ عِیْسَی ابْنُ مَرْیَمَ لِلْحَوَارِیّٖنَ مَنْ اَنْصَارِیْۤ اِلَی اللّٰهِ ؕ قَالَ الْحَوَارِیُّوْنَ نَحْنُ اَنْصَارُ اللّٰهِ فَاٰمَنَتْ طَّآئِفَةٌ مِّنْۢ بَنِیْۤ اِسْرَآءِیْلَ وَ كَفَرَتْ طَّآئِفَةٌ ۚ فَاَیَّدْنَا الَّذِیْنَ اٰمَنُوْا عَلٰی عَدُوِّهِمْ فَاَصْبَحُوْا ظٰهِرِیْنَ ۟ (الصف : ١٤)

"విశ్వసించిన ఓ ప్రజలారా! మర్యమ్ కుమారుడు, ఈసా, హవారీలతో చెప్పినట్లుగా, 'మీరు అల్లాహ్‌కు సహాయకులుకండి.' ఈసా వారితో ఇలా అన్నాడు: "అల్లాహ్ వైపునకు (పిలిచేపనిలో) నాకు సహాయపడేవారెవరైనా ఉన్నారా?" దానికి హవారీలు, "మేము ఉన్నాము అల్లాహ్‌కు సహాయకులం" అని సమాధానమిచ్చారు. అప్పుడు ఇస్రాయీల్ సంతతిలోని ఒక వర్గం విశ్వసించింది. మరొక వర్గం తిరస్కరించింది. తరువాత మేము విశ్వసించిన వారిని వారి శత్రువులకు వ్యతిరేకంగా బలపరిచాము. వారే ఆధిక్యం వహించారు." (అస్సఫ్ : 14)

దివ్యఖుర్ఆన్‌లో 'అల్లాహ్‌కు సహాయకులుగా వర్ణించబడినవారి అత్యుత్తమ స్థానం అదొక్కటే. ఈ కోవకు చెందినవారు మానవులను దైవధర్మం వైపునకు ఆహ్వానిస్తారు. దైవతిరస్కారానికి (కుఫ్ర్‌కు) వ్యతిరేకంగా ప్రాబల్యం సాధించడానికి కృషి చేసేవారు వీరే. అందుకని వారికా ఉత్తమ స్థానం ప్రాప్తమౌతుంది. పై పంక్తుల్లో ఆలి ఇమ్రాన్ అధ్యాయం ఆయత్-52, హజ్ అధ్యాయం ఆయత్-4, ముహమ్మద్ అధ్యాయం ఆయత్-7, హదీద్ అధ్యాయం ఆయత్-25, హష్ర్ అధ్యాయం ఆయత్-8లలో ఈ విషయమే చెప్పడం జరిగింది.

"అల్లాహ్ సర్వశక్తిమంతుడు, సృష్టి ఏర్పాటులో ఆయనకు ఎలాంటి సహకారం అవసరం లేదు, ఆయన నిరాపేక్షాపరుడు, అందరూ ఆయన పైన్నే ఆధారపడి ఉన్నారు" అన్నప్పుడు ఓ దాసుడు ఆయనకు సహాయకుడు ఎలా కాగలడు? అనే

ప్రశ్న ఉదయించడం సహజం. ఈ అనుమానాన్ని దూరం చేయడానికే మేమిక్కడ ప్రయత్నం చేస్తున్నాం.

అయితే, సర్వసృష్టికర్త అయిన అల్లాహ్ తన కార్యంలో ఇలాంటి వ్యక్తుల సహాయంపై ఆధారపడి ఉన్నాడా అనే భావం ఏమాత్రం కాదిక్కడ (దైవం క్షమించుగాక). ఆయన ఈవిధంగా చెప్పడానికి గల కారణం ఏమిటీ అని పరిశీలిస్తే, జీవితంలోని ఏ పరిధిలోనైతే అల్లాహ్ స్వయంగా మనిషికి, ఆయన్ను తిరస్కరించే లేదా ఆయన్ను విశ్వసించే అవకాశాన్ని, ఆయనను విధేయించే లేదా ఆయన ఆదేశాలను జవదాటే స్వాతంత్ర్యాన్నైతే ఒసిగాడో, అందులో తన ప్రచండ శక్తినుపయోగించి మనిషిని విశ్వాసిగానో, విధేయునిగానో చేయదలచలేదు. దానికోసం తన ప్రవక్తలు, తన గ్రంథాల ద్వారా వారికి సన్మార్గం చూపించేందుకు సద్బోధ, అవగాహన, హితోపదేశాల విధానాన్నే అవలంభిస్తాడు. పైన చెప్పిన ఖుర్‌ఆన్ ఆయత్‌లలో ఈ సద్బోధను ఐచ్ఛికంగా స్వీకరించినవాడే మోమిన్ (విశ్వాసి). భయభీతులు ప్రదర్శించినవాడే 'ముత్తకీ.' సత్కర్మల వైపునకు ముందడుగు వేసినవాడే 'మొహ్సిన్.' మరింత ముందుకు వెళ్ళి ఈ సద్బోధ ద్వారా మానవాళి సంస్కరణ కోసం ప్రయత్నిస్తూ, దైవతిరస్కారం (కుఫ్ర్), దైవధిక్కారాల (Impiety) స్థానంలో దైవవిధేయతా వ్యవస్థను నెలకొల్ప డానికి కృషి చేసిన వారికే దైవసహాయకులుగా కితాబునిచ్చాడు. ఆయన అసలు ఉద్దేశ్యం అల్లాహ్‌కు కాకుండా ఆయన ధర్మానికే సహాయపడడం అయి ఉన్నట్లయితే అన్సారుల్లాహ్‌కు బదులు 'అన్సారదీనిల్లాహ్' అని, 'యన్సురూనల్లాహ్'కు బదులు 'యన్సురూన దీనల్లాహ్' అని, ఇన్‌తన్‌సురుల్లాహ్‌కుబదులు 'ఇన్‌తన్సురూ దీనల్లాహ్' అని చెప్పడం జరిగి ఉండేది. ఈ విషయాన్ని విశదీకరించడానికి అల్లాహ్ మాటిమాటికీ అనేకచోట్ల ఒకే ఒక నిర్దిష్టమైన వివరణాశైలిని ఉపయోగించినప్పుడు దాని అసలు ఉద్దేశ్యం, అలాంటి వారిని అల్లాహ్‌కు సహాయకులుగా చెప్పడమే అవుతుంది. అయితే ఇది నఊజుబిల్లహ్ (అల్లాహ్ క్షమించుగాక), వీరు అల్లాహ్ అవసరాలను తీర్చేవారని, వారి సహాయం ఆయనకు అవసరం వచ్చింది అని కాదు. దాని అర్థం, అల్లాహ్ తన శక్తినుపయోగించి ఆ పని చేసే బదులు తన ప్రవక్తలు, తన గ్రంథాల ద్వారా చేసే పనిలో సహాయపడుతున్నారని అర్థం.

సత్యధర్మ సందేశం - దాని ధ్యేయం

وَمَا يُدْرِيكَ لَعَلَّهُ يَزَّكَّىٰ ۝ أَوْ يَذَّكَّرُ فَتَنفَعَهُ الذِّكْرَىٰ ۝

(عبس : ۳، ۴)

"నీకేమి తెలుసు, బహుశా అతను దారికి రావచ్చు లేదా హితోపదేశం గురించి ఆలోచించవచ్చు. హితోపదేశం అతనికి లాభదాయకం కూడా కావచ్చు." (అబస-3,4)

అంటే సత్యధర్మసందేశ ప్రచార ధ్యేయం కేవలం చెడిపోయినవారు, దైవ విధేయతను ధిక్కరించేవారి సంస్కరణకు సంబంధించింది. వారు సృష్టికర్త దాస్యాన్ని స్వీకరించి కల్లోలాన్ని వీడి, అనైతిక వైఖరిని త్యజించి పరిశుద్ధమైన నైతిక విలువలను అవలంబించడానికే.

إِذْهَبْ إِلَىٰ فِرْعَوْنَ إِنَّهُ طَغَىٰ ۝ فَقُلْ هَل لَّكَ إِلَىٰ
أَن تَزَكَّىٰ ۝ وَأَهْدِيَكَ إِلَىٰ رَبِّكَ فَتَخْشَىٰ ۝
(النّزعات : ١٧، ١٨، ١٩)

"ఫిర్ఔన్ వద్దకు వెళ్ళు, అతడు హద్దులు మీరి ప్రవర్తిస్తున్నాడు; అతనికి ఇలా బోధించు, పరిశుద్ధ జీవితం గడపడానికి నీవు సిద్ధంగా ఉన్నావా? నేను నీ ప్రభువు మార్గాన్ని నీకు చూపితే, నీలో ఆయనపట్ల భయభక్తులు కలుగుతాయా?"

(అన్నాజియాత్ : 17,18,19)

ఫిర్ఔన్ యొక్క ఏ ధిక్కారాన్నైతే ఇక్కడ చెప్పడం జరిగిందో, అది అతను దైవదాస్యపు హద్దుల్ని అతిక్రమించి సృష్టికర్త మరియు సృష్టితాల పట్ల తలబిరుసు తనాన్ని అవలంబించడం. సృష్టికర్త పట్ల అతను అవలంబించిన ధిక్కార మార్గం ఎలాంటిదో ఈ సూరాలోనే ఇలా వివరించడం జరిగింది:

فَحَشَرَ فَنَادَىٰ، فَقَالَ أَنَا رَبُّكُمُ الْأَعْلَىٰ

"ప్రజలను సమావేశపరచి అతడు, 'మీకు నేను అందరికంటే గొప్ప ప్రభువును" అని ఎలుగెత్తి చాటాడు."

(అన్నాజియాత్ : 21, 22)

ఇక ప్రజల పట్ల అతని ధిక్కారధోరణి ఎలాగుండిందంటే, తన సామ్రాజ్యంలో నివసించే ప్రజలను వివిధ వర్గాలుగా, తరగతులుగా విభజించడం, బలహీన వర్గాలపై జులుం చేస్తూ మొత్తం జాతినే బానిసగా మార్చడం. దివ్యఖుర్ఆన్‌లోని అల్‌ఖసస్ అధ్యాయంలో ఈ విషయం ఈ విధంగా వివరించబడింది:

إِنَّ فِرْعَوْنَ عَلَا فِي الْأَرْضِ وَجَعَلَ أَهْلَهَا شِيَعًا
يَسْتَضْعِفُ طَائِفَةً مِّنْهُمْ يُذَبِّحُ أَبْنَاءَهُمْ وَيَسْتَحْيِي
نِسَاءَهُمْ ۚ إِنَّهُ كَانَ مِنَ الْمُفْسِدِينَ ۝ (القصص: ٤)

"అసలు విషయం ఏమిటంటే, ఫిర్ఔను భూమి మీద తిరుగుబాటు వైఖరిని అవలంబించాడు. దాని ప్రజలను వర్గాలుగా విభజించాడు. వారిలోని ఒక వర్గాన్ని అతడు నీచపరిచేవాడు. వారి బాలురను హతమార్చేవాడు; వారి బాలికలను మాత్రం బ్రతుకనిచ్చేవాడు. నిశ్చయంగా అతను దుష్టులలోనివాడు." (అల్ ఖసస్-4)

జుఖ్రుఫ్ అధ్యాయంలో ఇలా ఉంది:

فَاسْتَخَفَّ قَوْمَهٗ فَاَطَاعُوْهُ ؕ اِنَّهُمْ كَانُوْا قَوْمًا فٰسِقِيْنَ ○ (زخرف : ٥٤)

"అతడు తన జాతివారిని తేలికగా చూశాడు. వారూ అతడు చెప్పినట్లే విన్నారు. వాస్తవానికి వారు పాపాత్ములు."

ఫిర్ఔనును, అతని ఈ తిరుగుబాటు, నిరంకుశత్వం నుండి బయటకు తీయడానికి యే పదాలనైతే ఉపయోగించడం జరిగిందో ఆ పదాలు 'తజ్కియహ్' (ప్రక్షాళన, సంస్కరణ)కు సంబంధించినవి. వాటి ద్వారా అతను తన దైవం మరియు దైవదాసుల ఎడల ఏ ధిక్కార వైఖరినైతే అవలంబించాడో దాన్ని వదలివేయాలని. ఇది దైవభీతివల్లనే సాధ్యం అవుతుంది. అందుకే, మూసా (అ) అతనితో "నేను నీ ప్రభువు వైపునకు వెళ్ళే మార్గాన్ని చూపగలను. తద్వారా నీ మనసులో ఆయన భీతి, నీ అశక్తత, దాస్యభావం పొడచూపగలదు. దీనికోసం నీవు నీ ప్రభువు మరియు దైవదాసుల పట్ల అవలంబిస్తున్న నిరంకుశ విధానాన్ని వదలాల్సి ఉంటుంది" అని చెప్పడం జరిగింది.

తజ్కియహ్ అంటే...

قَدْ اَفْلَحَ مَنْ تَزَكّٰى (الاعلیٰ : ١٤)

(పరిశుద్ధతను పాటించి, తన ప్రభువు నామాన్ని స్మరించి, ఆ తరువాత నమాజు చేసినవాడు తప్పక సాఫల్యం పొందుతాడు.) (అల్ ఆలా : 14)

పరిశుద్ధత అంటే దైవతిరస్కారాన్ని, బహుదైవారాధనను వదిలి విశ్వసించడం, చెడు నడతలను విసర్జించి నైతికతను అలవరచుకోవడం, దుర్మార్గపు పనులను వదిలి సత్కార్యాలను అవలంభించడం అని. ఫలాహ్ (శ్రేయం) అంటే ప్రాపంచిక అయిశ్వర్యాలు కావు. అసలు విజయం అని అర్థం. అది ప్రాపంచిక భోగభాగ్యాలతో కూడుకున్నది అయినా, కానిదైనా సరే.

సత్యం వైపునకు ఆహ్వానించడం ఓ హితబోధ

كَلَّآ اِنَّهَا تَذْكِرَةٌ ○ فَمَنْ شَآءَ ذَكَرَهٗ ○ (عبس : ١١، ١٢)

"ఎంత మాత్రం కాదు. ఇదసలు ఒక హితబోధ, ఇష్టమైన వారు దీన్ని స్వీకరించవచ్చు." (అబస : 11,12)

అంటే సత్యసందేశాన్ని రద్దుచేసేవారి గొంతెమ్మ కోరికలను, డిమాండ్లను తీర్చేవీల్లేదు. ఉదాహరణకు, "ఒకవేళ హజ్రత్ ముహమ్మద్ (స)ను అల్లాహ్ తన ప్రవక్తగా నియమించదలిస్తే, మక్కాకు చెందిన ఒక్కో సర్దారు, ఒక్కో షేఖ్‌కు, ముహమ్మద్ (స) నా ప్రవక్త అని ఆయనను అనుసరించమని లేఖలు ఎందుకు రాయలేదు? ఈ లేఖలు కూడా ఎలాగుండాలంటే వాటిని చూడగానే ఇవి అల్లాహ్‌యే స్వయంగా రాసి పంపించాడన్నట్లుండాలి" అనే డిమాండ్లు. మరోచోట దివ్యఖుర్‌ఆన్‌లో మక్కాకు చెందిన దైవతిరస్కారుల మాటలు ఇలా ఉంటాయని చెప్పడం జరిగింది:

"అల్లాహ్ ప్రవక్తలకు ఇవ్వబడినది మాకు కూడా ఇవ్వబడలేదే. మేము ఆ విషయాన్ని ఒప్పుకునేది లేదు."

మరో చోట వారి మరో డిమాండును కోట్ చేయడం జరిగింది.

"నీవు ఆకాశాన్ని అధిరోహించాలి. అంతవరకు నీ మాటలను మేము నమ్మము. అంతేకాదు మేము చదవడానికి నీవు మాపై ఓ రచనను అవతరించేటట్లు చేయనంతవరకు మేము నీ అధిరోహణను కూడా నమ్మము." (బనీఇస్రాయీల్: 93)

ఈ పిలుపు సంపూర్ణమైన హితబోధ కావడం వలన ఇష్టమైనవారు దీన్ని స్వీకరించవచ్చు.

إِنَّ هَٰذِهِ تَذْكِرَةٌ ۖ فَمَن شَاءَ اتَّخَذَ إِلَىٰ رَبِّهِ سَبِيلًا ۝
(الدهر: ٢٩)

"ఇదొక హితోపదేశం. ఇప్పుడిక ఇష్టమైనవారు తమ ప్రభువు వైపునకు పోయే మార్గాన్ని అవలంభించవచ్చు." (అద్ దహ్ర్ : 29)

హితోపదేశాన్ని (జిక్ర్) అవలంబించేవారెవరు, తిరస్కరించేవారెవరై ఉంటారు?

سَيَذَّكَّرُ مَن يَخْشَىٰ ۝ وَيَتَجَنَّبُهَا الْأَشْقَى ۝ الَّذِي
يَصْلَى النَّارَ الْكُبْرَىٰ ۝ ثُمَّ لَا يَمُوتُ فِيهَا وَلَا يَحْيَىٰ ۝
(الاعلیٰ: ١٠، ١١، ١٢، ١٣)

"(దేవునికి) భయపడేవాడు హితబోధను స్వీకరిస్తాడు. దానిని పెడచెవిన పెట్టేవాడే పరమ దౌర్భాగ్యుడు. అతడు ఘోరమైన అగ్నిలో పడతాడు. ఇక అందులో అతడు చావడూ, బ్రతకడూ." (అల్‌ఆలా : 10-13)

అంటే ఏ వ్యక్తి హృదయంలోనైతే దైవభీతి, దుష్పరిణామాల భయం ఉంటుందో, నేను ఎక్కడ అపమార్గం పట్టడం లేదు కదా అనే అనుమానం ఉండదో అలాంటి వ్యక్తే, అతడు సన్మార్గం మరియు దుర్మార్గులలోగల తేడాలను చూసి శ్రేయస్కర మార్గం వైపునకు పిలిచేవాని మాటలను ఆలకించగలడు.

'అల్అష్ఖా' అనే అరబిక్ పదానికి అర్థం, చివరి శ్వాస వరకు దైవతిరస్కారం, బహుదైవారాధన లేదా నాస్తికత్వంపై నిలకడగా ఉండే వ్యక్తి అని అర్థం. అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త హితోపదేశాలను పెడచెవిన పెట్టినందుకు అతనికి పడే శిక్ష నరక కూపంలో పడవేయడం. అక్కడ అతనికి మరణంగాని, ఆ నరకయాతనల నుండి విముక్తిగాని లభించదు. అతను బ్రతికినా జీవితంలోని హాయి అతనికి లభించదు.

సత్యమార్గగామి

اَفَمَنْ يَّمْشِيْ مُكِبًّا عَلٰى وَجْهِهٖٓ اَهْدٰٓى اَمَّنْ يَّمْشِيْ
سَوِيًّا عَلٰى صِرَاطٍ مُّسْتَقِيْمٍ ○ (الملك : ٢٢)

"బోర్లాపడుతూ లేస్తూ నడిచే వ్యక్తి సరైన గమ్యానికి చేరుకుంటాడా? లేక చదునైన బాటపై తలెత్తి నిటారుగా నడిచే వ్యక్తి గమ్యానికి చేరుకుంటాడా? కాస్త ఆలోచించండి!" (అల్ముల్క్ : 22)

మరింత విశదంగా ఈ వాక్యాల్లో వివరించడం జరిగింది.

قُلْ هُوَ الَّذِيْٓ اَنْشَاَكُمْ وَجَعَلَ لَكُمُ السَّمْعَ
وَالْاَبْصَارَ وَالْاَفْـِٕدَةَ ۗ قَلِيْلًا مَّا تَشْكُرُوْنَ ○

"వారితో ఇలా అనండి! మిమ్మల్ని పుట్టించినవాడు అల్లాహ్యే; ఆయనే మీకు వినే చూసే శక్తులు ఇచ్చాడు. ఇంకా ఆయనే మీకు ఆలోచించే, అర్థం చేసుకునే మనస్సు కూడా ఇచ్చాడు. కాని మీరు చాలా తక్కువగా కృతజ్ఞత తెలుపుతారు." (అల్ముల్క్ : 23)

అంటే, అల్లాహ్ మిమ్మల్ని మానవులుగా పుట్టించాడు, పశువులుగా కాదు. ఏ మార్గభ్రష్టత్వం అయితే భూమిలో వ్యాపించి ఉందో దాని వెనుక కళ్ళు మూసుకొని నడవకుండా ఉండడం, మీరు ఏ మార్గాన్ని అనుసరిస్తున్నారో అది సరైన మార్గం అవునా కాదా అనే విచక్షణా జ్ఞానం మీకు ఉండవలసి ఉండింది. ఎవరైతే మీకు మంచీచెడుల భేదాలను వివరిస్తున్నారో వారి మాటలను చెవియొగ్గి వినకుండా ఉండడానికి, ఏ చెడు ఆలోచనలైతే ఇది వరకే మీ మనసులో చోటు చేసుకొని ఉన్నాయో వాటినే పట్టుకొని ఊగలాడడానికి కాదు అల్లాహ్ మీకు ఈ చెవులను ఇచ్చింది. అలాగే, గ్రుడ్డివాళ్ళ వలె ఇతరులను అనుసరిస్తూ, మీకు లభించిన దృష్టిని ఉపయోగించి, ఈ భూమ్యాకాశాల్లో విస్తరించి ఉన్న దైవసూచనలు దైవ ఏకత్వాన్ని బలపరుస్తున్నాయా? లేదా? ఈ విశ్వాన్ని అనేకమంది దేవతలు నడుపుతున్నారా? అని ఆలోచించడానికి దైవం మీకు కళ్ళు ప్రసాదించాడు. మీకిచ్చిన మేధ, మీరు

ఆలోచించేదంతా సత్యమా? అసత్యమా? అని తెలుసు కోకుండా ఉండడానికి కాదు. దైవం ప్రసాదించిన జ్ఞానం, బుద్ధి, వినేశక్తి, చూసేశక్తి కేవలం సత్యాన్ని తెలుసుకోడానికే. కాని మీరు ఆయనకు కృతఘ్నత చూపుతూ వాటిని ఉపయోగించే తీరులో ఉపయో గించక ఆయన అభిష్టానికి వ్యతిరేకమైన మార్గంలో ఉపయోగిస్తున్నారు.

సత్యతిరస్కారులు

اَفَمَنْ يَّمْشِىْ مُكِبًّا عَلٰى وَجْهِهٖٓ اَهْدٰٓى (الملك : ٢٢)

బోర్లాపడుతూ లేస్తూ నడిచే వ్యక్తి సరైన గమ్యానికి చేరుకుంటాడా?

(అల్‌ముల్క్ : 22)

అంటే పశువుల్లా ముఖం క్రిందికి వంచుకొని కాపరి తోలుతూ వెడుతున్న మార్గం పైనే నడిచినట్లు నడుస్తున్నాడు మనిషి.

فَمَا لَهُمْ عَنِ التَّذْكِرَةِ مُعْرِضِيْنَ ۝ كَاَنَّهُمْ حُمُرٌ

مُّسْتَنْفِرَةٌ ۝ فَرَّتْ مِنْ قَسْوَرَةٍ ۝ (المدثر : ٤٩، ٥٠، ٥١)

"అసలు వారికేమయింది, ఈ హితబోధ నుండి ముఖం త్రిప్పుకుంటున్నారు, సింహాన్ని చూసి పారిపోయే అడవిగాడిదల మాదిరిగా?" (అల్‌ముద్దస్సిర్ : 49,50,51)

ఇది ఓ అరబిక్ సామెత. అడవి గాడిదల్లోవున్న ప్రత్యేకత ఏమిటంటే ప్రమాదాన్ని శంకించగానే, మరే జంతువులు పారిపోనట్లుగా బెదిరి పారిపోవడం. కాబట్టి అరబ్బులు ప్రతి చిన్న విషయంలోనూ బెదిరిపోయేవారిని, సింహం లేదా వేటగాళ్ళ అలికిడిని గ్రహించి బెదిరిపారిపోయే అడవిగాడిదలుగా ఉదహరిస్తారు.

సత్యోపదేశం

وَتَوَاصَوْا بِالْحَقِّ (العصر: ٣)

"ఒకరికొకరు సత్యోపదేశం, సహనబోధ చేసుకునేవారు." (అల్‌అస్ర్ : 3)

ఈ ఆయత్‌లో సామూహిక నష్టం మరియు సమాజాన్ని విచ్ఛిన్నం నుండి రక్షించే ఉపాయం చెప్పడం జరిగింది. సమాజపు ప్రతి సభ్యుడు వ్యక్తిగతంగా సద్వర్తనుడు, సచ్ఛీలుడు అయ్యే ప్రయత్నం చేయాలి. అలాగే వారందరి కలయిక వలన ఓ విశ్వాసం గల మరియు సచ్ఛీలమైన సమాజం ఉనికిలోనికి రావాలి.

అలాగే ఈ సమాజానికి చెందిన ప్రతి వ్యక్తి తన బాధ్యతలేమిటో గ్రహించి ఆ సమాజాన్ని చెడిపోకుండా చూడాలి. దానికోసం వారు పరస్పరం ఒకరికొకరు సత్యోపదేశం మరియు సహనబోధ గావించే బాధ్యత విధిగా చేయడం జరిగింది.

సత్యం అసత్యానికి వ్యతిరేకం. ఇది సాధారణంగా రెండు అర్థాల్లో ఉపయోగించబడు తుంది. ఒకటి, మత విశ్వాసం లేదా ప్రాపంచిక వ్యవహారాలకు సంబంధించిందే ఆ విషయం. అది న్యాయానికి, ధర్మానికి అనుగుణంగా ఉండే యదార్థమైన, సరైన మాట. రెండవది, సత్యవాక్కును బహిరంగంగా ప్రచారం చేయడం. అది దైవానికి సంబంధించిన హక్కులకు చెందినది అయినా లేదా దైవదాసుల హక్కులకు సంబంధించినదైనా, తన సొంతహక్కుకు సంబంధించినదైనా సరే. కాబట్టి ఒకరికొకరు సత్యోపదేశం మరియు సహనబోధ చేయడమంటే, విశ్వాసుల సమాజంలో ఎలాంటి అసత్యపోకడలు తలెత్తకుండా జాగ్రత్తపడడం అన్నమాట. సత్యానికి వ్యతిరేకమైన కార్యకలాపాలు సాగుతుంటే, సమాజంలోని వ్యక్తులు తమకు పట్టనట్లు తమాషా చూసే సమాజంగా ఉండకూడదు. కాగా, ఎక్కడైతే అసత్యం తల ఎత్తుతుందో అక్కడ సత్యవాక్కును బలపరిచే ప్రతి వ్యక్తి దానికి వ్యతిరేకంగా లేచి నిలబడాలి, తన గళాన్ని విప్పాలి. సమాజానికి చెందిన వ్యక్తి తానొక్కడే న్యాయం, ధర్మం, నీతినిజాయితీలపై స్థిరంగా ఉండడమే కాకుండా ఇతరులను కూడా ఈ వైఖరిని అవలంభించాలని హితబోధ చేస్తూ ఉండాలి. ఇదొక్కటే సమాజాన్ని పతనం నుండి, అనైతికతల నుండి కాపాడగలదు. ఒకవేళ చైతన్యమే కరువైపోతే ఆ సమాజం వినాశనం నుండి రక్షించబడజాలదు.

వ్యక్తిగతంగా తాము ఎంత సచ్ఛీలురైనా, నీతినిజాయితీలను అవలంబిస్తున్నా, ధార్మికతలను పాటిస్తున్నా, సమాజంలో సత్యానికి విఘాతం కలుగుతూ ఉండగా చూసి తమకు పట్టనట్లు ఊరుకునే ఆ వ్యక్తులు కూడా ఆ వినాశనపు వరదల్లో కొట్టుకుపోక తప్పదు. ఈ విషయాన్నే దివ్యఖుర్ఆన్ అల్ మాయిదా సూరాలో ఈ విధంగా వివరించింది:

"ఇస్రాయీలు సంతతివారిలో విశ్వాసమార్గం అవలంబించిన వారిని దావూద్ నోట, మర్యమ్ కుమారుడు అయిన మసీహ్ నోట శపించడం జరిగింది. ఎందుకంటే వారు అవిధేయులయ్యారు. అత్యాచారాలు చేయసాగారు. చెడు పనులు చేయకుండా వారు ఒకరినొకరు నిరోధించడం మానివేశారు. వారు అవలంబించిన మార్గం చాలా చెడ్డది." (అల్‌మాయిదా : 78, 79)

ఆ మాటనే అరాఫ్ సూరాలో, బనీ ఇస్రాయీల్ బాహటంగా సబ్బత్ (శనివారం) రోజున దైవాదేశాలను ధిక్కరించి చేపలు పట్టనారంభిస్తే వారిపై దైవశాపం విరుచుకు పడింది. దాన్నుండి కేవలం రక్షించబడినవారు ఆ పాపం గురించి బనీ ఇస్రాయీల్‌ను అడ్డుకునే ప్రయత్నం చేసినవారు మాత్రమే. (ఆరాఫ్: 163-166)

ఈ విషయాన్నే అన్ఫాల్ అధ్యాయంలో ఇలా చెప్పడం జరిగింది:

"ఆ ఉపద్రవం నుండి మిమ్మల్ని మీరు కాపాడుకోండి. దానివల్ల కలిగే హాని

ప్రత్యేకంగా మీలో పాపం చేసిన వారికే పరిమితమై ఉండదు."(అల్ అన్ఫాల్ : 25)

కాబట్టే మంచిని ప్రచారం చేసే, చెడును నిరోధించే బృహత్తరమైన బాధ్యతను ముస్లిమ్ సమాజం భుజస్కంధాలపై వేయడం జరిగింది. (ఆలి ఇమ్రాన్ : 104)

అలాగే ఈ విధి నిర్వహించే ముస్లిమ్ సమాజాన్ని మహోన్నతమైన సమాజంగా ఖరారు చేయడం జరిగింది. (ఆలి ఇమ్రాన్ :110)

సత్యధర్మ సాఫల్యం

ثُمَّ بَعَثْنَا مِنْ بَعْدِهِمْ مُّوسٰى بِاٰيٰتِنَا اِلٰى
فِرْعَوْنَ وَمَلَاۡئِهٖ (الاعراف : ١٠٣)

"(పైన పేర్కొనబడిన) ఈ జాతుల తరువాత మేము మూసాను మా సూచనలతో ఫిర్ఔను వద్దకూ అతని జాతి సర్దారుల వద్దకూ పంపాము."(అల్ ఆరాఫ్ :103)

పైన పేర్కొన్న జాతుల గాథలు చెప్పి, దైవాదేశాలు పొందిన తరువాత ఏ జాతి అయితే వాటిని పెడచెవిన పెడుతుందో దాన్ని నాశనం చేయకుండా వదిలి పెట్టడం జరగదు అన్న యదార్థాన్ని గుర్తింపజేయడం అని ఉద్దేశ్యం. ఆ తరువాత మూసా, ఫిరౌను మరియు బనీ ఇస్రాయీలుల గాథల విషయం అనేక పారాగ్రాఫుల వరకు కొనసాగింది. ఈ విషయమే కాకుండా, దైవతిరస్కారులైన ఖురైషీలకు, యూదులకు మరియు విశ్వసించిన ప్రజలకు కూడా కొన్ని హితోపదేశాలు ఇవ్వడం జరిగింది.

ఖురైషీ ధిక్కారులకు ఈ గాథలను వివరిస్తూ, దైవసందేశ ప్రచార ప్రథమ దశల్లో సత్యాసత్యాల శక్తిసామర్థ్యాల్లో ఏ తేడా అయితే అగుపడుతోందో, సత్యాన్ని అవలంబించేవారు ఎంత అల్పమైన సంఖ్యలో ఉన్నట్లు అగుపడుతున్నప్పటికీ, చివరకు వారిదే పైచెయ్యి అవుతుంది. సత్యానికి సంబంధించిన చరిత్రే ఇందుకు సాక్ష్యం. శక్తివంతమైన సామ్రాజ్యాల బలం అసత్యాన్ని సాధ్యమైనంతగా బలపరిచినప్పటికి వారు ఎలాంటి సరంజామా లేకుండానే అసత్యానికి వ్యతిరేకంగా తిరగబడి విజయాన్ని సాధించగలిగారు. అదేకాకుండా, సత్యధర్మం వైపునకు ఆహ్వానించేవారికి వ్యతిరేకంగా ఎన్ని ఎత్తుగడలు వేసి, ఎన్ని ఉపాయాలతో అసత్యాన్ని అణచడానికి ప్రయత్నం చేసినా అవి ఎలా బెడిసికొడతాయో సత్యతిరస్కారులకు చివరి విశ్వాసపు తీర్పు ఇచ్చే ముందు ఎంత సుదీర్ఘకాలం వరకు వారు సక్రమ మార్గం వైపునకు మరలేందుకు అవకాశం ఇస్తాడో, గుణపాఠం గరిపే సంఘటనలు జరిగినప్పుడుగాని, హెచ్చరికలు చేసినప్పుడుగాని, విస్పష్టమైన సూచనలు కనపడినప్పుడుగాని వారు ప్రభావితులు కాకపోతే వారిపై ఘోరమైన శిక్షను అవతరింపజేస్తాడు అని ఆ గాథల ద్వారా తెలియజేయడం జరిగింది.

ఎవరైతే దైవప్రవక్త (స)ను విశ్వసించారో వారికి ఈ గాథల ద్వారా రెట్టింపు బోధగావించడం జరిగింది. మొదటి బోధ ఏమిటంటే తమ అల్పసంఖ్య, తమ బలహీనత, సత్యావగాహనలేనివారి ఆధిక్యతను చూసి అధైర్యపడవద్దని, దైవసహాయం రావడంలో ఆలస్యం జరిగినప్పుడు నిరాశా నిస్పృహలకు లోనుకాకూడదు అన్నది. ఇక రెండవ బోధ ప్రకారం, విశ్వసించిన తరువాత ఏ వర్గాలైతే యూదుల మార్గాన్ని అవలంబిస్తాయో అవి యూదులు శాపగ్రస్తులైనట్లు గానే దైవశాపానికి గురౌతాయి అన్నది.

హజ్రత్ యూసుఫ్ (అ)గారి గాథలో ఎంతో గుణపాఠం ఉంది. ఓ విశ్వాసి యదార్థమైన ఇస్లామీయ సచ్చరితాన్ని పుణికిపుచ్చుకుంటే, దానికితోడు అతనికి విషయజ్ఞానం కూడా ఉంటే కేవలం తన మూర్తిత్వం మరియు నైతికతల బలంతోనే మొత్తం సామ్రాజ్యాన్నే వశపర్చుకోగలడు. యూసుఫ్ (అ)ను చూడండి! పదిహేడేళ్ళ వయస్సు, ఒంటరివాడు, ఎలాంటి సహాయం అందనివాడు, తెలియని దేశం, ఆపై అశక్తత ఏమిటంటే బానిసగా అమ్ముడుపోవడం, చరిత్రకు సంబంధించిన ఆ కాలంలో బానిసల పరిస్థితి ఎలాగుండేదో అందరికీ తెలిసిందే. అదేకాదు తీవ్రమైన అనైతిక నేరం మోపి ఆయన్ను జైలుకు పంపించడం జరిగింది. ఆ నేరానికి పడేశిక్షకు కూడా ఎలాంటి కాలపరిమితి లేదు. ఇంత అధోగతికి దిగజార్చినప్పటికీ ఆయన కేవలం తన విశ్వాసం మరియు నైతిక విలువల ఆధారంగా మొత్తం దేశాన్నే లోబరుచుకో గలిగారు.

وَكَذٰلِكَ مَكَّنَّا لِيُوسُفَ فِي الْاَرْضِ يَتَبَوَّاُ مِنْهَا
حَيْثُ يَشَآءُ ۭ نُصِيْبُ بِرَحْمَتِنَا مَنْ نَّشَآءُ وَلَا نُضِيْعُ
اَجْرَ الْمُحْسِنِيْنَ ۝ (یوسف : ۵۶)

"ఇలా మేము ఆ భూభాగంపై యూసుఫ్ కొరకు అధికార మార్గాన్ని సుగమం చేశాము. ఆ భూభాగంపై తాను కోరినచోట తన స్థానాన్ని ఏర్పాటు చేసుకునే హక్కు అతనికి ఉంది. మాకు ఇష్టమైన వారికి మా కారుణ్యభాగాన్ని మేము కలుగజేస్తాము. సజ్జనుల ప్రతిఫలం మా వద్ద వృథా కాదు." (యూసుఫ్ :56)

అంటే ఇప్పుడు ఈజిప్టు భూభాగం పూర్తిగా ఆయనదే. దాని ప్రతి ప్రాంతాన్ని ఆయన తనదని చెప్పుకోగలడు. ఏ ప్రదేశం నుండైనా ఆయన్ను అడ్డుకునేందుకు వీలులేదు. అంటే ఇది హజ్రత్ యూసుఫ్ (అ)కు ఆ దేశంపైగల సంపూర్ణ సార్వభౌమత్వం, పరిపూర్ణ అధికారానికి సంబంధించిన శాసనం అన్నమాట. ప్రాచీన వ్యాఖ్యాన కర్తలు కూడా ఈ ఆయత్‌ను ఈ విధంగా వ్యాఖ్యానించడం జరిగింది. అదేమిటంటే- "మేము యూసుఫ్‌కు, ఈజిప్టులోని సమస్త సామగ్రికి యజమానిగా చేశాము, ప్రపంచంలోని ఆ భూభాగంలో అతను అనుకున్నది చేసి చూపగలడు. ఆ భూభాగాన్ని

ఆయనకు అప్పజెప్పడం జరిగింది. చివరికి అతను అనుకుంటే ఫిర్ఔనును కూడా తన సామంతునిగా చేసుకొని అతనికి ప్రభువు కాగలిగేవాడు" (అల్లామా ఇబ్నె జరీర్ తబ్రీ). రెండవ ఉల్లేఖనాన్ని ఆయన ముజాహిద్ మాటల్లో ఇలా చెప్పారు: ముజాహిద్ గొప్ప ఖుర్ఆన్ వ్యాఖ్యాన కర్తల్లో ఒకరు. "ఈజిప్టు పాదుషా యూసుఫ్ (అ) చేతి మీదుగా ఇస్లామ్ స్వీకరించాడు."

సత్యధర్మ సందేశ ప్రచారానికి అల్లాహ్ అండదండలు తప్పక ఉంటాయి

فَإِنَّمَا عَلَيْكَ الْبَلَاغُ وَعَلَيْنَا الْحِسَابُ (الرعد ۴۰)

"నీ పని కేవలం సందేశాన్ని అందజేయడమే. లెక్కతీసుకోవడంమట్టుకు మా పని." (అర్రాద్ :40)

అంటే, మీ ఈ సందేశ ప్రచారాన్ని నిరాకరించే వారి పరిణామం ఏం జరగబోతోందో, అది ఎప్పుడు సంభవిస్తుందో? అనే ఆలోచనల్లో పడిపోకండి. మీకు అప్పగించిన పనిని పూర్తి ఏకాగ్రతతో చేసుకుపోతూ ఉండండి. ఆపై తీర్పును మాపై వదిలి వేయండి అని అర్థం. ఇక్కడ సంబోధించింది దైవప్రవక్త ముహమ్మద్ (స)గారినే అయినప్పటికీ ఆ మాటలను వినిపించింది మాత్రం ఆ సందేశాన్ని తిరస్కరించేవారికే.

వీరు దైవప్రవక్త (స)ను ఛాలెంజి చేస్తూ మాటిమాటికి, "నీవు భయపెడుతున్న ఆ విపత్తు మాపై ఎందుకు విరుచుకుపడడం లేదు?" అని అడుగుతూ ఉండేవారు.

أَوَلَمْ يَرَوْا أَنَّا نَأْتِي الْأَرْضَ نَنقُصُهَا مِنْ
أَطْرَافِهَا ۚ وَاللَّهُ يَحْكُمُ لَا مُعَقِّبَ لِحُكْمِهِ ۚ وَهُوَ
سَرِيعُ الْحِسَابِ ○ وَقَدْ مَكَرَ الَّذِينَ مِن قَبْلِهِمْ
فَلِلَّهِ الْمَكْرُ جَمِيعًا ۖ يَعْلَمُ مَا تَكْسِبُ كُلُّ نَفْسٍ ۗ
وَسَيَعْلَمُ الْكُفَّارُ لِمَنْ عُقْبَى الدَّارِ ○ (الرعد: ۴۱، ۴۲)

"ఈ ప్రజలు చూడడం లేదా, మేము ఈ భూభాగంపై పురోగమిస్తూ దాని పరిధిని అన్ని వైపుల నుండి తగ్గిస్తూ వస్తున్నాము? అల్లాహ్ సృష్టిని శాసిస్తున్నాడు. ఆయన నిర్ణయాలను పునఃపరిశీలించగలవాడెవడూ లేడు. లెక్కతీసుకోవడం ఆయనకు ఎంతసేపు పట్టదు. వారికి పూర్వం గతించిన ప్రజలు కూడా పెద్ద పెద్ద పన్నాగాలు పన్నారు. కాని నిర్ణయాత్మకమైన అసలు పన్నాగం పూర్తిగా అల్లాహ్ చేతుల్లోనే ఉంది. ఎవరు ఏమేమి సంపాదిస్తున్నారో ఆయనకు తెలుసు. త్వరలోనే ఈ సత్యతిరస్కారులు చూస్తారు ఎవరి పర్యవసానం ఏమౌతుందో!" (అర్రాద్ :41-42)

“దాని పరిధిని అన్ని వైపుల నుండి తగ్గిస్తూ వస్తున్నాము” అనే సంజ్ఞ ఎంతో విపులంగా ఉంది. అంటే, మీ వ్యతిరేకులకు, ఇస్లామ్ ప్రభావం అరేబియా మూల మూలనా వ్యాపిస్తూపోతుందని, నలువైపుల నుండి ఆ పరిధి తగ్గిపోతూ వస్తోందని మీరు గ్రహించడం లేదా? ఇది మీపై వచ్చిపడుతున్న విపత్తుకాక మరేమిటి? అని హెచ్చరించడం జరిగింది. అలాగే, “మేము ఈ భూభాగంపై పురోగమిస్తున్నాము” అనే అల్లాహ్ పలుకుల్లో ఆలోచించేవారికి ఎంతో భోగట్టా లభిస్తుంది. దైవసందేశ ప్రచారం దైవం తరఫున జరుగుతోంది కాబట్టి ఆ ప్రచారం వైపునకు ప్రజలను ఆహ్వానించే వారి వెంటే ఉంటాడాయన. అందుకని ఏ భూభాగంలోనైనా ఆ సందేశ ప్రచారం విస్తరిస్తూ పోతూఉంటే దాన్ని ఆయన, మేమే ఆ భూభాగంపై పురోగమిస్తూ ఉన్నాం అని చెప్పడం జరిగింది.

وَقَدْ مَكَرَ الَّذِيْنَ مِنْ قَبْلِهِمْ فَلِلّٰهِ الْمَكْرُ جَمِيْعًا (الرعد: ۴۲)

“వారికి పూర్వం గతించిన ప్రజలు కూడా పెద్దపెద్ద పన్నాగాలు పన్నారు. కాని నిర్ణయాత్మకమైన అసలు పన్నాగం పూర్తిగా అల్లాహ్ చేతుల్లోనే ఉంది.” (అర్రాద్ : 42)

అంటే, సత్యవాక్కును అణచడం కోసం అసత్యం, మోసం మరియు దౌర్జన్యపు ఆయుధాలను ఉపయోగించడం క్రొత్తదేమీ కాదు. చరిత్రలో అనేకమార్లు ఇలాంటి ఎత్తుగడలు పన్ని సత్యాన్ని అపజయం పాలుచేసే ప్రయత్నాలూ జరిగి ఉన్నాయి అని అర్థం.

اَتٰٓى اَمْرُ اللّٰهِ فَلَا تَسْتَعْجِلُوْهُ (النحل: ۱۰)

“అల్లాహ్ తీర్పు వచ్చేసింది. ఇక దాని కొరకు తొందరపెట్టకండి.”(అన్నహ్ల్:10)

ఆ సమయం రావడానికి ఇంకెంతో ఆలస్యం లేదు. అది ప్రత్యక్షమై అమలు జరిగే సమయం ఆసన్నమైపోయింది. ‘వచ్చేసింది’ అనే భూతకాల పదాన్నుపయోగించి, బహుశా అది రావడం తథ్యం అని, దానికి ఎంతో సమయం పట్టదు అనే భావాన్ని కలిగించడం జరిగి ఉండవచ్చు. లేదా ఖురైషీ దైవతిరస్కారుల తిరుగుబాటు, దుర్మార్గాలు తారస్థాయికి చేరిపోవడం వలన నిర్ణయాత్మకమైన తీర్పును ఇచ్చే సమయం ఆసన్నమైంది అని చెప్పడం కావచ్చు.

ఆ తీర్పు ఏమిటి? ఏ రూపంలో ఉంటుంది అనే ప్రశ్న ఉత్పన్నం కావచ్చు. అది దైవానికే తెలుసు అని మేము భావిస్తున్నాము. బహుశా అది మహాప్రవక్త (స)కు మక్కా నుండి హిజ్రత్ చేసి మదీనాకు వెళ్ళిపోయిన కొద్ది కాలానికే వెలువడి ఉంటుంది. దివ్యఖుర్ఆన్ అధ్యయనం ద్వారా మనకు తెలిసేదేమిటంటే- ప్రవక్త ఏ జాతిలోనైతే ప్రభవిస్తాడో ఆ జాతి దుర్మాగ్గాలు, తిరస్కారాలు తారస్థాయికి చేరినప్పుడే

హిజ్రత్ చేసి వెళ్ళిపోయే ఆదేశం లభిస్తుంది. ఈ ఆదేశం వారి అదృష్టానికి సంబంధించిన తీర్పు. ఆ తరువాత ఆ జాతిపై ఘోరమైన విపత్తయినా రావచ్చు లేదా ఆ ప్రవక్త మరియు ఆయన అనుచరగణం చేతుల మీదుగా ఆ జాతి మూలాలు పెకిలించి వేయబడనూ వచ్చు. ఈ విషయమే చరిత్ర చెబుతోంది. హిజ్రత్ జరిగినప్పుడు మక్కా దైవతిరస్కారులు తీర్పు వారికి అనుకూలమైందిగా వెలువడింది అనుకున్నారు. కాని ఎనిమిది, పది సంవత్సరాలలోపలే, కేవలం మక్కా నగరం నుండే కాకుండా పూర్తి అరేబియా భూభాగం నుండి కుఫ్ర్ (దైవ తిరస్కారం), షిర్క్ (బహుదైవారాధన)ను కూకటి వ్రేళ్ళతో సహా పెకిలించి వేయడం జరిగింది.

إِنَّ الَّذِينَ يُحَادُّونَ اللَّهَ وَرَسُولَهُ كُبِتُوا كَمَا كُبِتَ
الَّذِينَ مِن قَبْلِهِمْ وَقَدْ أَنزَلْنَا آيَاتٍ بَيِّنَاتٍ ط
وَلِلْكَافِرِينَ عَذَابٌ مُّهِينٌ ○ (المجادلہ: ٥)

"అల్లాహ్‌ను ఆయన ప్రవక్తనూ వ్యతిరేకించేవారు తీవ్రంగా అవమానం పాలుచేయబడతారు. వారికి పూర్వం గతించిన వారు అవమానంపాలు చేయబడిన విధంగా. మేము స్పష్టమైన ఆయతులను అవతరింపజేశాము, ఇక తిరస్కారులకు తీవ్ర అవమానంతో కూడుకున్న శిక్ష పడుతుంది." (అల్‌ముజాదలహ్ :5)

ఈ ఆయత్‌లో 'కుబిత' అనే పదం ఉపయోగించడం జరిగింది. దానికి అర్థం అవమానపర్చడం, హతమార్చడం, శపించడం, ఈసడించుకోవడం, గెంటివేయడం, నీచపర్చడం వగైరా. అల్లాహ్, ఆయన ప్రవక్త (స)గారి పట్ల వ్యతిరేకత, దైవాదేశాల ధిక్కారానికిగాను, గతించిన జాతులు యే పరిణామాన్నైతే చవిచూశాయో, ప్రస్తుతం ముస్లిములు కూడా ఆ మార్గాన్నే అవలంభిస్తే అలాంటి దుష్పరిణామాలనే చవిజూడక తప్పదు అని ఈ పదాన్ని ఉపయోగించడం జరిగింది. ఆ జాతులు కూడా దైవచట్టాలకు వ్యతిరేకంగా వారే చట్టాలను చేసుకోవడం లేదా ఇతరులు చేసిన చట్టాలను అవలంబించడం జరిగింది. అప్పుడుగాని వారు దైవకారుణ్యానికి, ఆయన కటాక్షానికి దూరం కాలేదు. దానివలన కలిగిన దుష్పరిణామం ఏమిటంటే, వారి జీవితాలు వక్రమార్గంలో, దుర్మార్గాల్లో, నైతిక మరియు నాగరిక చెడుల్లో లీనమైపోయి చివరకు వీరు ప్రపంచంలోనే అవమానాలకు గురైపోయారు. ఈ తప్పిదాన్నే ఇప్పుడు ముస్లిం సమాజం కూడా అవలంభిస్తే వారు అల్లాహ్‌కు ప్రియమైనవారుగా, అవమానానికి గురికాకుండా ఎలా ఉండగలరు! గతించిన తన ప్రవక్తల సమాజాలతో అల్లాహ్‌కు ఎలాంటి వైరం లేదు.

"దైవతిరస్కారులకు తీవ్రమైన శిక్షపడుతుంది" అనే వాక్యాన్ని గనక మనం దాని సందర్భాన్ని బట్టి చూస్తే, ఇక్కడ ఆ మార్గాన నడిచే వారికి రెట్టింపు శిక్షల మాట చెప్పడం జరిగింది అని గ్రహించగలం. ఒకటి 'కుబిత్' అంటే ఈ ఇహలోకంలో

వారు అవమానాలకు కృంగిపోవడం, రెండవది పరలోకంలోనూ వారు తీవ్రమైన శిక్షకు గురికావడం.

అంతిమ విజయం విశ్వాసులదే

وَسَيَعْلَمُ الْكُفَّارُ لِمَنْ عُقْبَى الدَّارِ (الرعد: ۴۲)

"త్వరలోనే ఈ సత్యతిరస్కారులు చూస్తారు, ఎవరి పర్యవసానం మేలైంది అవుతుందో." (అర్రాద్: 42)

ఇది అజ్ఞానంతో కూడిన సమాజంలో ఎలాంటి సంచలనం రేకెత్తిస్తుందో చూడండి.

قَالُوا يٰصٰلِحُ قَدْ كُنْتَ فِيْنَا مَرْجُوًّا قَبْلَ هٰذَآ
اَتَنْهٰنَآ اَنْ نَّعْبُدَ مَا يَعْبُدُ اٰبَآؤُنَا وَاِنَّنَا لَفِيْ شَكٍّ
مِّمَّا تَدْعُوْنَآ اِلَيْهِ مُرِيْبٍ ۝ (ہود: ۶۲)

"వారు ఇలా అన్నారు: "సాలెహ్! నిన్నటి వరకు మా మధ్య ఉన్న నీ మీద మేము పెద్దపెద్ద ఆశలు పెట్టుకున్నాము. మా తాత ముత్తాతలు పూజించిన దేవుళ్ళను పూజించకుండా మమ్మల్ని ఆపదలుచుకున్నావా? నీవు ఏ మార్గం వైపునకు మమ్మల్ని పిలుస్తున్నావో, ఆ మార్గాన్ని గురించి మాకు పెద్ద అనుమానం ఉంది. అది మమ్మల్ని కలతకు గురిచేసింది." (హూద్ : 62)

పై ఆయత్ ద్వారా మూడు విషయాలు వెలుగులోనికి వస్తున్నాయి. దైవప్రవక్త సాలెహ్(అ)కు ప్రవక్త పదవి లభించక పూర్వం ఆయన ఎడల ప్రజల భావాలు ఎలాగుండేవి? ఆయనకు ప్రవక్త పదవి లభించిన తరువాత హతాశులై ఆయనతో يٰصٰلِحُ قَدْ كُنْتَ فِيْنَا مَرْجُوًّا 'ఓ సాలెహ్! నిన్నటివరకు మా మధ్య ఉన్న నీ మీద మేము పెద్దపెద్ద ఆశలు పెట్టు కున్నాము' అని అనడం.

అంటే నీ తెలివితేటలు, నీ దూరదృష్టి, నీ గౌరవనీయమైన మూర్తిమత్వం వగైరాలను చూసి నీవు ఓ గొప్ప వ్యక్తివి కాగలవని ఆశలు పెట్టుకున్నాం. నీవు నీ భౌతిక జీవితాన్ని తీర్చిదిద్దుకుంటావని, నీ దూరదృష్టి ద్వారా మేము ఇతర జాతులు తెగల్లో తలపైకెత్తి తిరిగే గౌరవాన్ని పొందే అవకాశం లభిస్తుందని అనుకున్నాం. కాని నీవు దైవ ఏకత్వం, పరలోక జీవితం రాగాలాపన చేసి మా ఆశలని అడియాశలుగా మార్చేశావు అన్నవి. ఇలాగే ఇలాంటి ఆశలే అంతిమ దైవప్రవక్త (స)పట్ల ఆయన జాతివారు కూడా పెట్టుకొని ఉన్నారు. ఆయన (స)కు ప్రవక్త పదవి లభించకపూర్వం ఆయన ఉత్తమ గుణగణాలను కొనియాడేవారు. ఈ వ్యక్తి గొప్ప వర్తకుడు కాగలడని, ఆయన తెలివితేటలు, బుద్ధివివేచనాల వల్ల మాకు ఎంతో లాభం చేకూరగలదని భావించేవారు. కాని వారి ఆశలకు వ్యతిరేకంగా ఆయన దైవ ఏకత్వం, పరలోక

జీవితం, సచ్ఛీలత, నైతిక విలువల వైపునకు పిలిచినప్పుడు వారు ఆయన ఎడల నిరాశే చెందడం కాకుండా, ఆయనంటే చిరాకును ప్రదర్శించ నారంభించారు. "ఏమిటీ! ఇతను ప్రయోజకుడు, మంచి మనిషి అని అనుకుంటే, ఇతనికి ఈ పిచ్చి పట్టిందేమిటి? తన జీవితాన్ని నాశనం చేసుకోవడమే కాకుండా మన ఆశలను కూడ అడియాశలు చేశాడేమిటీ? అని అనుకోవడం ఒకటి.

రెండవది, ఈ ఆయత్‌లోని ఇంకో విషయం, اَتَنْهٰنَا اَنْ نَّعْبُدَ مَا يَعْبُدُ اٰبَآؤُنَا-

"మా తాతముత్తాతలు పూజించిన దేవుళ్ళను పూజించకుండా మమ్మల్ని ఆపదలుచుకున్నావా?" అన్నది. ఇది ఇస్లామ్ మరియు అజ్ఞానం మధ్య సంఘర్షణకు మూలకారణమైంది. ఈ రెండు ఆర్యూమెంట్లలోని తేడా కొట్టొచ్చినట్లు అగుపడుతోంది.

అంటే, ఈ ఆరాధ్యులను ఎందుకు ఆరాధించాలి? వీరి పూజ ఎందుకు జరుగుతోంది? అనే దానికి ఇది ఓ ఆర్గ్యుమెంటు. ఇక్కడ ఇస్లామ్ మరియు అజ్ఞానాల్లోగల తేడా కొట్టొచ్చినట్లుగా కనపడుతోంది. హజ్రత్ సాలెహ్ (అ) ఏమన్నారు? అల్లాహ్ తప్ప ఇంకెవ్వరూ యదార్థమైన ఆరాధ్యుడు కాడు అన్నదే కదా! దానికి ఆయన చూపిన ఆధారం, ఆయనే మిమ్మల్ని పుట్టించాడు, పుట్టించి ఈ భువిలో జీవించడానికి సకల సదుపాయాలను సమకూర్చాడు అన్నది. దీనికి సమాధానంగా ఆ ముష్రిక్ (బహుదైవారాధన) జాతి చెప్పిందేమిటి? మా ఆరాధ్యులు కూడా ఆరాధనకు అర్హులు. వారి ఆరాధనకు జరిగే పూజాపునస్కారాలు ఏ మాత్రం ఆపబడవు, ఎందుకంటే అవి మా తాతముత్తాతల కాలం నుండి జరుగుతూ వస్తున్నాయి అనేకదా! మక్కీకి మక్కీ. అంటే ఎప్పుడో ఒకప్పుడు అక్కడ ఓ అజ్ఞాని ఓ మక్కీని (ఈగ) చంపాడు. ఇప్పుడు అదేచోట ఆ ఈగను చంపడానికి, తాతముత్తాతల కాలం నుండి అక్కడ ఈగను చంపడం జరుగుతోంది అనేసాకు చాలు. అంతకంటే మరేకారణం చూపినా వినేది లేదు.

మూడవది, సత్యధర్మం ప్రత్యక్షమైనప్పుడు సాధారణమైన అజ్ఞానపు సొసైటీలో ఏ కలత, యే సంచలనం అయితే పుట్టుకొస్తుందో అది. ఈ ఆయత్‌లో ఇలా ఉంది:

وَاِنَّنَا لَفِىْ شَكٍّ مِّمَّا تَدْعُوْنَآ اِلَيْهِ مُرِيْبٍ ۝ (تفہیم القرآن)

"నీవు ఏ మార్గం వైపునకు మమ్మల్ని పిలుస్తున్నావో, ఆ మార్గాన్ని గురించి మాకు పెద్ద అనుమానం ఉంది. అది మమ్మల్ని కలతకు గురిచేసింది."

ఈ అనుమానం, ఈ కలత దేనికోసం? దీని వివరణ ఆ ఆయత్‌లో లేదు. ఆ కలతకు అందరూ గురైనవారే. కాని ఓ కలత మాత్రం ఇంకోరకమైన కలత. ఇది సత్యధర్మం ప్రత్యేకతల్లో ఒకటి. అది బహిర్గతం కాగానే ప్రజలకు ప్రశాంతత కరువై పోతుంది. అందరిలోను ఓ రకమైన కలకలం చెలరేగుతుంది. దాని ప్రభావం కూడా ఒక్కొక్కరిపై ఒక్కో విధంగా పడుతుంది. అంతకంటే పూర్వం, ఎవరైతే ఆ మార్గ

భ్రష్టత్వంలో నింపాదిగా కాలం వెళ్ళబుచ్చుతూ వచ్చారో, తమ ఈ వైఖరి గురించి ఆలోచించే అవసరం కూడా వారికి రాలేదో, ఇప్పుడు ఆ నింపాది సందేశ ప్రచారం తరువాత ఏ మాత్రం మిగిలి ఉండదు. అజ్ఞానపు వ్యవస్థలోని బలహీనతలపై సత్య సందేశ ప్రచారమేని విమర్శ, సత్యాన్ని స్వీకరించమని అతను చూపుతున్న పటిష్టమైన మరియు మనస్సుకు హత్తుకునే ఆధారాలు, ఆర్గ్యుమెంట్లు, ఆపై అతని ఉన్నతమైన నైతికత, అతని పట్టుదల అతని విజ్ఞానం, అతని గౌరవనీయమైన వ్యక్తిత్వం, అతని కల్తీలేని సచ్ఛీల వైఖరి గొప్పగొప్ప మంకుపట్టుగల ధర్మవిరోధుల మనస్సులను కూడా కదిలించి వేస్తాయి. ఆపై ఆ కాలపు సొసైటీలోని ఉత్తమ గుణసంపన్నులు అతని పలుకులకు ప్రభావితం కావడం, వారి జీవితాల్లో సత్యసందేశ ప్రభావం వలన అసాధారణమైన విప్లవం రావడం వగైరా విషయాలన్నీ వెరసి, సత్యం వచ్చిన తరువాత ఆ భ్రష్టుపట్టిన అజ్ఞానాన్నే నిలిపి ఉంచడానికి ప్రయత్నం చేసే వారిని పట్టుకుని ఊగులాడే వారికి కలతలకు, అశాంతికి గురిచేస్తాయి.

اَلَمْ يَاْتِكُمْ نَبَؤُا الَّذِيْنَ مِنْ قَبْلِكُمْ قَوْمِ نُوْحٍ
وَّعَادٍ وَّثَمُوْدَ ۛ وَالَّذِيْنَ مِنْۢ بَعْدِهِمْ ۛ لَا يَعْلَمُهُمْ
اِلَّا اللّٰهُ ۭ جَاۗءَتْهُمْ رُسُلُهُمْ بِالْبَيِّنٰتِ فَرَدُّوْٓا
اَيْدِيَهُمْ فِيْٓ اَفْوَاهِهِمْ وَقَالُوْٓا اِنَّا كَفَرْنَا
بِمَآ اُرْسِلْتُمْ بِهٖ وَاِنَّا لَفِيْ مِّمَّا تَدْعُوْنَنَآ اِلَيْهِ
مُرِيْبٍ ۝
(ابراہیم : ۹)

"మీకు పూర్వం గతించిన జాతుల గాధలు మీదాకా చేరలేదా? నూహ్ జాతి, ఆద్ జాతి, సమూద్ జాతి ఇంకా వాటి తరువాత వచ్చిన అనేక జాతులూ, వాటి సంఖ్యా అల్లాహ్‌కు మాత్రమే తెలుసు. వారి ప్రవక్తలు వారి వద్దకు స్పష్టమైన మాటలనూ, ప్రస్ఫుటమైన నిదర్శనాలనూ తీసుకొనివచ్చినప్పుడు వారు తమ నోళ్ళల్లో చేతులు బిగబట్టి ఇలా అన్నారు: 'యే సందేశంతో నీవు పంపబడ్డావో ఆ సందేశాన్ని మేము విశ్వసించము, యే విషయం వైపునకు నీవు మమ్మల్ని ఆహ్వానిస్తున్నావో, మేము ఆ విషయాన్ని గురించి కలతలో, సందేహంలో పడ్డాము." (ఇబ్రాహీం:9)

మూసా (అ)గారి ప్రసంగం ముగిసిన తరువాత మక్కావాసులకు నేరుగా సంబోధిస్తూ, ముహమ్మద్ (స)గారి సందేశ ప్రచారం పట్ల మీ క్రోధం, మీ ఆశ్చర్యం, మీ తిరస్కారాలు క్రొత్తవేమీ కాదు, మీకంటే పూర్వం ఎన్ని జాతులైతే గతించాయో, వారి పరిస్థితికూడా ఇదే అని చెప్పడం జరిగింది.

جَآءَتْهُمْ رُسُلُهُمْ بِالْبَيِّنٰتِ فَرَدُّوْٓا اَيْدِيَهُمْ فِيْٓ اَفْوَاهِهِمْ (تفہیم القرآن)

"వారి ప్రవక్తలు వారి వద్దకు స్పష్టమైన మాటలను, ప్రస్ఫుటమైన నిదర్శ నాలనూ తీసుకొనివచ్చినప్పుడు వారు తమ నోళ్ళలో చేతులు బిగబట్టారు."

(తఫ్హీముల్ ఖుర్అన్-ఇబ్రాహీం:9)

క్రోధం, తిరస్కారం, అసహాయతను ప్రదర్శించడం, ఆశ్చర్యం వల్ల ఏర్పడిన పరిస్థితి ఇది. అందుకనే వారు సమాధానంగా ఇలా చెప్పడం జరిగింది:

اِنَّا كَفَرْنَا بِمَآ اُرْسِلْتُمْ بِهٖ وَاِنَّا لَفِيْ شَكٍّ مِّمَّا
تَدْعُوْنَنَآ اِلَيْهِ مُرِيْبٍ ۝

"ఏ సందేశంతో నీవు పంపబడ్డావో ఆ సందేశాన్ని మేము విశ్వసించం. యే విషయం వైపునకు నీవు మమ్మల్ని ఆహ్వానిస్తున్నావో, మేము ఆ విషయాన్ని గురించి కలతలో, సందేహంలో పడ్డాము."

(ఇబ్రాహీం:9)

అంటే మనశ్శాంతికి గురిచేసిన సందేహం అన్నమాట. సత్యసందేశ ప్రచారం లోని ప్రత్యేకత ఏమిటంటే, అది బహిర్గతం అయినప్పుడు ఓ విధమైన సంచలనం రేగుతుంది. తిరస్కరించేవారు, దాన్ని వ్యతిరేకించేవారు కూడా పూర్తి నమ్మకంతో దాన్ని తిరస్కరించడంగాని చేయలేదు. సత్యసందేశం యదార్థత, అది చూపే సరైన ఆధారాలు, నిష్పక్షపాతమైన మరియు ముక్కుసూటి అయిన విషయాలు, మనస్సును హత్తుకునే భాష, సందేశకుని మచ్చలేని జీవితం, ఆయన్ను విశ్వసించే వారి జీవితాల్లో వస్తున్న విప్లవం, వారు ప్రచారం చేసే సత్యధర్మానికి అనుగుణమైన వారి పరిశుద్ధ కర్మలు వగైరాలన్నీ కలిసి గొప్ప దురభిమాని మనస్సులోను సంచలనాన్ని లేవనెత్తు తాయి. సందేశ ప్రచారకులను కలతలకు గురి చేసేవాడే స్వయంగా తన మనశ్శాంతిని పోగొట్టుకుంటాడు.

సత్యధర్మ ప్రచారమార్గంలో ఎదురయ్యే కీలక ఘట్టాలు

దివ్యఖుర్అన్ యూనుస్ అధ్యాయంలో హజ్రత్ మూసా (అ)ను విశ్వసించిన కొందరు యువకులు దైవాన్ని వేడుకున్న తీరును వారికి ఎదురైన సంక్లిష్టమైన ఘట్టాలను వివరించే ముందు, బనీ ఇస్రాయీల్ అధ్యాయంలో బనీ ఇస్రాయీల్ మరియు ఫిర్ఔన్ పరిస్థితిని వివరించే సంగ్రహమైన మరో వేడుకోలు ఎలాగుండిందో ఇప్పుడు చూద్దాం.

فَمَآ اٰمَنَ لِمُوْسٰٓى اِلَّا ذُرِّيَّةٌ مِّنْ قَوْمِهٖ عَلٰى خَوْفٍ
مِّنْ فِرْعَوْنَ وَمَلَا۟ئِهِمْ اَنْ يَّفْتِنَهُمْ ؕ وَاِنَّ فِرْعَوْنَ

لَعَالٍ فِي الْأَرْضِ ۚ وَإِنَّهُ لَمِنَ الْمُسْرِفِينَ ٥ (یونس: ٨٣)

"(చూడండి) మూసాను అతని జాతిలోని కొందరు యువకులు తప్ప మరెవ్వరూ విశ్వసించలేదు. ఎందుకంటే వారు ఫిర్ఔనుకు భయపడ్డారు. స్వయంగా తమ జాతిలో పెద్దలుగా ఉన్నవారికి భయపడ్డారు. (ఆ పెద్దలు) ఫిర్ఔన్ తమను యాతనకు గురిచేస్తాడని భయపడ్డారు. యదార్థం ఏమిటంటే, ఫిర్ఔను భూమిపై ప్రాబల్యం కలిగి ఉండేవాడు. అతడు ఏ హద్దునూ లెక్కచేయని వారి కోవకు చెందినవాడు." (యూనుస్:83)

ఈ ఆయత్‌లో ఉన్న వివరణ ఏమిటంటే- కొందరు యువకులు మాత్రమే విశ్వసించారని, వయస్సు పైబడిన తక్కిన వారెవరూ విశ్వసించలేదనేది. అరబిక్ మూలంలో 'జుర్రియత్' అనే పదం ఉపయోగించబడింది. దానికి అర్థం సంతానం అని. అయితే మేము యువకులని అనువదించాం. అయితే ఓ ప్రత్యేకమైన పద ప్రయోగం వలన యే విషయాన్నైతే ఖుర్‌ఆన్ చెప్పదలిచిందో అది అసలు ఆ దుర్భర మైన ప్రమాదంలో కూడుకొని ఉన్న కాలంలో సత్యానికి వెన్నుదన్నుగా నిలబడడానికి, సత్యధర్మ ధ్వజవాహకులనుతమ నాయకులుగా గుర్తించడానికి ధైర్యం చేసి ముందుకొచ్చింది కొందరు యువకులు, యువతులు మాత్రమే. కాని వారి తల్లిదండ్రులుగాని, జాతికి సంబంధించిన వయోవృద్ధులుగాని ముందుకు రాలేదు. వారు అవకాశవాదం, లౌకిక ప్రయోజనాలు, ప్రాపంచిక శ్రేయాలను దృష్టిలో ఉంచు కొని, ప్రమాదాల్లో పడేమార్గాన్ని అవలంభించడానికి ససేమిరా ఒప్పుకోలేదు. పైగా వారు ఆ యువతనే మూసా (అ) దగ్గరకు పోకుండా అడ్డుకునేవారు. ఈ యువకులు ఫిరౌను ఆగడాలకు ఎక్కడబలౌతారో వారితో సహా వారు కూడా ఆ యాతనలకు ఎక్కడ బలౌతామో అన్నదే వారి భయమల్లా.

దివ్యఖుర్‌ఆన్‌లో ఈ విషయాన్ని ప్రత్యేకంగా విస్పష్టం చేసి ఎందుకు చెప్పడం జరిగిందంటే, మక్కా జనాభాలో దైవప్రవక్త ముహమ్మద్ (స)ను అనుసరించేందుకు ఏ వ్యక్తులైతే ముందుకు వచ్చారో వారు జాతికి చెందిన వయస్సుపైబడిన వారుగాని, వృద్ధులుగాని కారు. కేవలం కొందరు యువకులు మాత్రమే. ఈ ఆయతుల అవతరణ జరిగినప్పుడు జాతి మొత్తం ఆయన సందేశాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నప్పటికీ వీరు ఆ సత్యాన్ని ధృవపరుస్తూ దానికి వెన్నుదన్నుగా నిలిచినవారు. దౌర్జన్యం, జులుంకు సంబంధించిన ఈ ఉప్పెనలు వారు ఎదురొడ్డి నిలిచినవారు. వారిలో అవకాశవాదాన్ని అవలంబిస్తున్న ఏ ఒక్క వృద్ధుడూ లేడు. అందరూ యువకులే. అలీ బిన్ అబీతాలిబ్ (ర), జాఫర్ తయ్యార్ (ర), జుబైర్(ర), తల్హా (ర), సఅద్ బిన్ అబీవిఖాస్ (ర), ముస్‌అబ్ బిన్ ఉమైర్(ర), అబ్దుల్లాహ్ బిన్ మస్‌ఊద్ (ర) లాంటి వారి వయస్సు ఇస్లామ్ స్వీకరించేటప్పుడు 20 సంవత్సరాలకు లోపే. వారికంటే ఇంకొంచెం పెద్దవారు

అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (ర), బిలాల్(ర), సుహైబ్(ర)లు. అప్పుడు వారి వయస్సు 20-30 సంవత్సరాల మధ్యన ఉంది. అబూ ఉబైదా బిన్ జర్రాహ్(ర), జైద్ బిన్ హారిసా(ర), ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్(ర), ఉమర్ ఫారూఖ్ (ర)లు 30-35 సంవత్సరాల నడుమ వయసుకు కలిగి ఉన్నారు. వారికంటే మరీ పెద్దవారు హజ్రత్ అబూబక్ర్ సిద్దీఖ్ (ర). ఇస్లామ్ ధర్మం స్వీకరించినప్పుడు ఆయన వయస్సు 38 సంవత్సరాలకంటే అధికం కాదు. ప్రారంభ ముస్లిములలో కేవలం ఒకే ఒక పేరు లభిస్తుంది. ఆయన వయస్సు దైవప్రవక్త (స)గారి వయసుకంటే కొంత ఎక్కువ. అంటే ఉబైదుల్లాహ్ బిన్ హారిస్ మత్‌లబీ(ర). బహుశా మొత్తం గ్రూపులో ఒకే ఒక సహాబీ హజ్రత్ ముహమ్మద్ (స)కు సమాన వయస్కులు. ఆయనే హజ్రత్ అమ్మార్ బిన్ యాసిర్ (ర).

పై ఆయత్‌లో 'ఫమా అమన లిమూసా' పదాలను చూసి, బహుశా బనీ ఇస్రాయీల్‌లో అందరికందరూ కాఫిర్లు (దైవతిరస్కారులు)గా ఉన్నారేమో, కొందరు మట్టుకే విశ్వసించారేమో అనే అనుమానాన్ని వెలిబుచ్చుతారు కొందరు. ఈమాన్ అనే పదానికి 'లి' అనే ప్రత్యయం తోడైనప్పుడు సాధారణంగా 'విధేయత' అనే అర్థం వస్తుంది. అంటే ఓ విషయాన్ని విశ్వసించడం, దాన్ని అనుసరించడం అని. కాబట్టి ఈ పదాల భావం ఏమిటంటే, కొందరు యువకులను తప్పనిడిచి బనీ ఇస్రాయీల్ జాతి మొత్తంలో ఏ ఒక్కరూ మూసాను తమ నాయకునిగా విశ్వసించి విధేయించడానికి సిద్ధంగా లేరు, ఇస్లామియ సందేశ ప్రచారంలో ఆయనకు సహకరించడానికి సిద్ధంగాలేరనేదే ఆ విషయం. ఆ తరువాత వచ్చిన వాక్యంలో, వారు ఈ వైఖరిని అవలంభించడానికి గల కారణం హజ్రత్ మూసా సత్యసంధుడు కాదని, ఆయన ఇచ్చిన సందేశంలో ఏదైనా అనుమానం ఉంది అనిగాని కాదు అనే విషయాన్ని తేటతెల్లం చేయడం జరిగింది. అసలు కారణం ఏమిటంటే, వారు ముఖ్యంగా వారి పలుకుబడిగలిగిన పెద్దలు హజ్రత్ మూసాను అనుసరించి తమను తాము ఫిర్‌ఔను దౌర్జన్యానికి గురిచేయడానికి సిద్ధంగా లేరు అన్నది. వారు సంతతిపరంగా, మతపరంగానూ హజ్రత్ ఇబ్రాహీమ్ (అ), హజ్రత్ ఇస్‌హాక్ (అ), హజ్రత్ యాకూబ్ (అ), హజ్రత్ యూసుఫ్ (అ)ల సమాజాలకు చెందినవారే. ఆకారణంగా వారంతా ముస్లిములుగానే ఉన్నారు. కాని ఓ సుదీర్ఘకాలంలో జరిగిన మార్పులు, మనస్సులో ఏర్పడిన భీరత్వం వారిని అణిగిమణిగి ఉండేటట్లు చేసింది. కుఫ్ర్ (దైవతిరస్కారం) మరియు నియంతృత్వపు పాలనకు వ్యతిరేకంగా విశ్వాసపు ధ్వజాన్ని ఎగురవేసే ధైర్యంగాని, లేదా దానికి మదత్తు పలికే సత్తువగాని వారిలో కరువైపోయింది.

హజ్రత్ మూసా (అ) మరియు ఫిర్‌ఔనుల మధ్య జరిగిన ఈ సంఘర్షణలో సాధారణ ఇస్రాయేలుల వైఖరి ఎలా గుండింది అనేది బైబిల్‌లోని ఈ వాక్యాల ద్వారా అర్థం అవుతుంది.

"వారు ఫిర్‌ఔను చెర నుండి బయటపడి వస్తున్నప్పుడు వారికి మూసా మరియు హారూనులు కలిసి వారిని కలువడానికి మార్గమధ్యంలో నిలబడి కనబడ్డారు. అప్పుడు వారు వారిద్దరితో ఇలా అన్నారు: దేవుడే మిమ్మల్ని చూడాలి, మీకు న్యాయం చేయాలి. మీరు మమ్మల్ని ఫిర్‌ఔను మరియు అతని సేవకుల దృష్టిలో ఎంత దిగజార్చారంటే, మా హత్యకోసం మీరు వారి చేతుల్లో ఖడ్గాన్ని పెట్టారు."

(ఖురూజ్ : 20-21)

బనీ ఇస్రాయీల్ మూసా, హారూన్ (అ)లతో ఇలా అంటూ ఉండేవారని 'తోరా'లో ఉంది.

"మా ఉపమానం ఎలాంటిదంటే ఓ తోడేలు మేకను పట్టింది. కాపరి వచ్చి దాన్ని రక్షించే ప్రయత్నం చేశాడు. ఆ ఇరువురి సంఘర్షణలో మేక ముక్కముక్కలై పోయింది. అచ్చం ఇలాగే మీకు, ఫిరౌనుకు నడుమ జరుగుతున్న సంఘర్షణలో మేము నాశనం అయిపోకతప్పదు."

ఆరాఫ్ అధ్యాయంలో ఈ విషయం వైపునకే దృష్టి మళ్ళించడం జరిగింది. బనీ ఇస్రాయీల్ మూసా (అ)తో ఇలా అన్నారు:

اُوْذِيْنَا مِنْ قَبْلِ اَنْ تَاْتِيَنَا وَمِنْ بَعْدِ مَا جِئْتَنَا

(تفہیم القرآن)

"అతని జాతివారు ఇలా అన్నారు: "నీవు రాక పూర్వం కూడా మేము బాధింపడే వారము. ఇప్పుడు నీవు వచ్చిన తరువాత కూడా బాధింపబడుతున్నాము."

(అల్ ఆరాఫ్ :129)

యువకులైన చిత్తశుద్ధిగల విశ్వాసుల పరిస్థితి ఒకలాగుంటే, అవకాశ వాదులైన ప్రజల పరిస్థితి మరో రకమైంది. ఈ ఆయత్‌లోనే (యూనుస్:83) ఫిర్‌ఔను దౌర్జన్యాలు దమనకాండ, జులుంల తీరు ఎలాంటిదో చెప్పడం జరిగింది.

وَاِنَّ فِرْعَوْنَ لَعَالٍ فِي الْاَرْضِ وَاِنَّهٗ لَمِنَ الْمُسْرِفِيْنَ ۝

"యదార్థం ఏమిటంటే, ఫిర్‌ఔను భూమిపై ప్రాబల్యం కలిగి ఉండేవాడు. అతడు ఏ హద్దునూ లెక్కచేయనివారి కోవకు చెందినవాడు." (యూనుస్:83)

ఈ ఆయత్‌లో ఫిర్‌ఔను కోసం 'ముస్రిఫీన్' అనే పదం ఉపయోగించబడింది. దీని అర్థం హద్దులను అతిక్రమించేవాడు అని. అయితే ఆ అర్థాన్ని ఆ వాక్యంలో ఉన్నది ఉన్నట్లుగానే ఉపయోగిస్తే ఆ వాక్యం యొక్క అసలు భావం బయటకురాదు. 'ముస్రిఫీన్ అంటే, తమ ప్రయోజన కోసం ఎంతటి నీచమైన వైఖరినైనా సరే అవలంబించేందుకు వెనుకాడని వారని అర్థం. ఎంతటి జులుంనైనా, మరెంతటి అనైతిక

చర్యనైనా, ఎంతటి ఉగ్రవాదాన్నైనా అవలంబించడానికి వెనుకాడని వారు, తమ కోరికల సాధనకు ఎంతమేరకైనా వెళ్ళగలవారు, దుష్కార్యాలను ఆపు చేయడానికి ఒక హద్దుంటూ లేనివారు ముస్రిఫీన్.

హజ్రత్ మూసా (అ) గారి సంబోధన

قَالَ مُوسَىٰ يَٰقَوْمِ إِن كُنتُمْ ءَامَنتُم بِٱللَّهِ فَعَلَيْهِ تَوَكَّلُوٓا۟ إِن كُنتُم مُّسْلِمِينَ ۝

"మూసా (అ) తన జాతి వారితో ఇలా అన్నాడు: ప్రజలారా! మీకు నిజంగానే అల్లాహ్‌పై విశ్వాసం ఉంటే, ఆయనను నమ్మండి, మీరు గనక ముస్లిములే అయితే." (యూనుస్:84)

ఆలోచించండి! ఈ పలుకులు అల్లాహ్‌ను తిరస్కరించేవారిని సంబోధిస్తూ పలికిన పలుకులా! హజ్రత్ మూసా (అ) గారి ఈ సంబోధన, ఇస్రాయీల్ జాతినుద్దేశించింది. ఆ జాతి మొత్తమే అప్పుడు ముస్లిం జాతి. మూసా (అ) వారిని ఉద్దేశించి, మీకు నిజంగానే అల్లాహ్‌పై విశ్వాసం ఉంటే ఫిర్ఔను శక్తికి భయపడకండి, అల్లాహ్ శక్తిపైన్నే భరోసా ఉంచండి అని బోధించడం జరిగింది.

విశ్వాస పటిమగల యువత సమాధానం

فَقَالُوا۟ عَلَى ٱللَّهِ تَوَكَّلْنَا رَبَّنَا لَا تَجْعَلْنَا فِتْنَةً لِّلْقَوْمِ ٱلظَّٰلِمِينَ ۝

"వారు ఇలా జవాబు పలికారు: మేము అల్లాహ్‌నే నమ్ముకున్నాము. మా ప్రభు! మమ్మల్ని దుర్మార్గులకు పరీక్షా సాధనంగా చెయ్యకు." (యూనుస్:83)

విశ్వాసంలో చిత్తశుద్ధి కలిగిన ఆ యువకుల వేడుకోలు, 'ప్రభూ, మమ్మల్ని దుర్మార్గులకు పరీక్షా సాధనంగా చెయ్యకు' అన్నదానిలో విశాలభావం నిక్షిప్తమై ఉంది. మార్గభ్రష్టత్వం, నియంతృత్వం ఎల్లెడల వ్యాపించి ఉన్న ఆ పరిస్థితిలో కొందరు సత్యాన్ని నెలకొల్పేందుకు నడుంబిగిస్తారు. వారికి రకరకాల దౌర్జన్యాలు ఎదురౌతాయి. ఒకవంక అసత్య ధ్వజవాహకులు తమ పూర్తి శక్తియుక్తులతో సత్యధర్మ ప్రచారకుల్ని అణచివేయడానికి ప్రయత్నం చేస్తూ ఉంటే మరోవంక, పేరుకు మాత్రమే విశ్వాసాన్ని ప్రకటించేవారి పెద్ద సంఖ్యే కానవస్తుంది. అయితే ఈ వర్గం సత్యాన్ని విశ్వసించాము అని వాదించినప్పటికీ అసత్యపు ప్రచండ అధికారానికి వ్యతిరేకంగా జరుగుతున్న ఈ ప్రయత్నాలను అసందర్భమైన ప్రయత్నాలుగా, వృధా ప్రయాసగా కొట్టివేస్తారు. సత్యానికి విరుద్ధంగా వీరు అవలంబించే ఈ వైఖరిని ఎలాగైనా సరైనదే అని రుజువు

చేసుకోవడానికి, సత్యధర్మాన్ని నెలకొల్పడానికి ప్రయత్నం చేస్తున్నవారి ప్రయత్నాలను త్రిప్పిగొట్టడానికి ప్రయత్నాలు ప్రారంభిస్తారు. వారి అంతరాత్మల్లో దాగివున్న ఆ మనస్సాక్షిని ఎలాగైనా అణచుకోడానికి ప్రయత్నం చేస్తూ ఉంటారు. ఇక ఇంకో రకం మనుషులు సాధారణ పౌరులు. అంటీముట్టకుండా తమాషా చూసే రకం వీరిది. మొగ్గ ఎవరి వైపునకు ఉంటుందో వారివైపే ఉంటారు వీరు. అది సత్యమైనా, అసత్యమైనాసరే. ఈ పరిస్థితిలో సందేశ ప్రచారకుని ప్రతి వైఫల్యం, ప్రతి ఆపద, ప్రతి పొరపాటు, ప్రతి బలహీనత, ప్రతి లోపం ఆ రకరకాల వర్గాల నడుమ వివిధ రీతుల్లో ఓ ఉపద్రవంగా మారిపోతుంది. వారు అణచివేయబడినా, అపజయం పాలైనా మొదటి వర్గం, "సత్యం మా వెంటే ఉంది కాబట్టి ఈ ఉన్మాదులకు ఈ గతి పట్టింది" అని ఆర్గ్యూ చేస్తుంది. ఇక రెండో వర్గం వారు, "చూశారా! ఇంత పెద్ద సూపర్‌పవర్‌తో తలపడడం వలన కొన్ని విలువైన ప్రాణాలు పోవడం తప్ప ఫలితం ఏముంటుంది? అసలు ఈ పరిస్థితిని కొని తెచ్చుకోమని మమ్మల్ని ఏ షరీఅత్ కట్టడి చేసింది గనక! ధర్మానికి సంబంధించిన కనీస డిమాండ్లు ఈ ఫిర్ఔనులు మనకిచ్చిన స్వేచ్ఛ ద్వారా పూర్తి అవుతూనే ఉన్నాయి! ఎంత వారించినా వీరు విన్నారా?"అని అంటారు. ఇక మూడవ రకం, జయించిందే అసలైన సత్యం అని తీర్పునిస్తారు. ఇలా సందేశ ప్రచారకులు తమ సందేశ ప్రచారంలో ఎలాంటి పొరపాటు చేసినా, ఆపదలు, కష్టాలను భరించలేక ఏదైనా బలహీనతను ప్రదర్శించినా లేదా వారి ద్వారా మరీ చెప్పాలంటే, వారికి సంబంధించిన ఏ వ్యక్తి ద్వారానైనా నైతికపరమైన ఏ తప్పైనా దొరలిపోతే చాలా మందికి అసత్యాన్ని అంటిపెట్టుకొని ఉండడానికి కావలసిన సాకులు అనేకం లభిస్తాయి. ఆ తరువాత ఈ సందేశ ప్రచారం వైఫల్యాన్ని చవిజూస్తే, ఓ సుదీర్ఘ కాలం వరకు మరో సత్యప్రచారం నినాదం వినబడడం అసాధ్యమైపోతుంది. కాబట్టి మూసా (అ)గారి అనుయాయులైన ఈ యువకులు వేడుకున్న ఈ వేడుకోలులో ఎంతో అర్థం దాగుంది.

"ప్రభూ! మమ్మల్ని ఈ దుర్మార్గులకు పరీక్షా సాధనంగా చేయకుండా మాపై కరుణజూపు" అని అంటే, మమ్మల్ని పొరపాట్ల నుండి, లోపాల నుండి, బలహీనతల నుండి కాపాడు. మా ఈ ప్రయత్నాన్ని ఫలింపజెయ్యి. మా ఉనికిని నీ ప్రజల కోసం శ్రేయం అయ్యేటట్లు చెయ్యిగాని దుర్మార్గుల కోసం పరీక్షాసాధనంగా మాత్రం చెయ్యకు అని అర్థం.

సాఫల్య గమ్యాన్ని చేరే సందేశ ప్రచారోద్యమం

సత్యంపై దృఢంగా నిలిచేవారు, ప్రమాదాలను స్థిరచిత్తంతో ఎదుర్కొనేవారే సత్యధర్మ ధ్వజవాహకులు.

نَحْنُ نَقُصُّ عَلَيْكَ نَبَأَهُمْ بِالْحَقِّ ۚ إِنَّهُمْ فِتْيَةٌ
آمَنُوا بِرَبِّهِمْ وَزِدْنَاهُمْ هُدًى ۝ وَرَبَطْنَا عَلَىٰ قُلُوبِهِمْ
إِذْ قَامُوا فَقَالُوا رَبُّنَا رَبُّ السَّمَاوَاتِ وَالْأَرْضِ لَنْ نَدْعُوَ
مِنْ دُونِهِ إِلَٰهًا لَقَدْ قُلْنَا إِذًا شَطَطًا ۝ هَٰؤُلَاءِ قَوْمُنَا
اتَّخَذُوا مِنْ دُونِهِ آلِهَةً ۖ لَوْلَا يَأْتُونَ عَلَيْهِمْ بِسُلْطَانٍ
بَيِّنٍ ۖ فَمَنْ أَظْلَمُ مِمَّنِ افْتَرَىٰ عَلَى اللَّهِ كَذِبًا ۝
(الکہف : ١٣ تا ١٥)

"మేము వారి అసలు గాథను నీకు వినిపిస్తున్నాము. వారు తమ ప్రభువును విశ్వసించిన కొందరు యువకులు. మేము వారికి సన్మార్గంపై నడవటంలో అభివృద్ధిని ప్రసాదించాము. వారు లేచి ఈ ప్రకటన చేసినప్పుడు మేము వారి హృదయాలకు దృఢత్వాన్ని కలుగజేశాము. "ఆకాశాలకు భూమికీ ప్రభువైనవాడే మా ప్రభువు. మేము ఆయనను త్రోసిరాజని మరొకణ్ణి దేవుడుగా చేసుకొని వేడుకోము. ఒకవేళ మేము అలా చేస్తే, పూర్తిగా అనుచితమైన దానిని చేసిన వారౌతాము." (తరువాత వారు పరస్పరం ఇలా అనుకున్నారు) "మన జాతివారైన వీరు విశ్వప్రభువును కాదని ఇతర దైవాలను సృష్టించుకున్నారు. ఈ దైవాలు ఆరాధ్యులని స్పష్టమైన ప్రమాణాన్ని దేన్నైనా ఈ ప్రజలు ఎందుకు తీసుకురారు? అల్లాహ్ విషయంలో అభూత కల్పనకు పాల్పడే వాడిని మించిన దుర్మార్గుడెవడు?" (అల్ కహఫ్: 13-15)

కహఫ్ (గుహ) వారికి (అస్హాబెకహఫ్) చెందిన కొందరు యువకులు హజ్రత్ ఈసా (అ)ను విశ్వసించినప్పుడు వారికి ఎదురైన పరిస్థితి ఇది. కహఫ్ వారు విశ్వసించడం, బాహాటంగా అందరిముందు నిలబడి "ఆకాశాలకూ, భూమికీ ప్రభువైనవాడే మా ప్రభువు. మేము ఆయన్ను త్రోసిరాజని మరొకణ్ణి దేవుడుగా చేసుకొని వేడుకోము, ఒకవేళ మేము అలా చేస్తే, పూర్తిగా అనుచితమైన దానిని చేసిన వారౌతాము అని చెప్పడం, అంతటితో ఆగకుండా తమ జాతిని, చుట్టుపట్ల నివసించే ప్రజలను ఉద్దేశించి, మన జాతివారైన మీరు విశ్వప్రభువును కాదని ఇతర దైవాలను సృష్టించుకున్నారు. ఈ దైవాలు ఆరాధ్యులని స్పష్టమైన ప్రమాణాన్ని దేన్నైనా మీరు ఎందుకు చూపరు? అని గట్టిగా విమర్శించడమూ జరిగింది. ఇంకొంత ముందుకు అడుగేసి ఈ విశ్వాసం పూర్తిగా అసత్యమైన విశ్వాసమేకాకుండా పెద్ద దుర్మార్గం అని, ఎందుకంటే సృష్టికర్తను కాదని ఇతరులను దైవాలుగా చేసుకోవడం అల్లాహ్‌పై పెద్ద అభూత కల్పన చేయడం లాంటిది అని ప్రకటిస్తారు.

ఈ యువకులు ప్రకటించిన ప్రకటన 'ఇఫ్స్' అనే నగరంలో. ఇది ఆసియా కోచెక్‌లో కెల్లా గొప్ప విగ్రహారాధన క్షేత్రం, గొప్ప ఇంద్రజాలిక కేంద్రమూను. 'డాయినా' దేవతకు చెందిన గొప్ప మందిరం ఉండేది అక్కడ. మొత్తం ప్రపంచంలోనే అది

ఖ్యాతిగాంచిన పుణ్యక్షేత్రం. దూరప్రదేశాల నుండి అనేక మంది భక్తులు పూజాపునస్కారాల కోసం అక్కడికి వస్తూ ఉండేవారు. అక్కడి ఇంద్రజాలికులు, భూతవైద్యులు, జ్యోతిష్కులు, మంత్ర తంత్రగాళ్ళు ప్రపంచంలోనే ప్రసిద్ధిగాంచిన వారు. సిరియా, పాలస్తీనా, ఈజిప్టు దేశాల వరకు వారి వ్యాపారం జోరుగా సాగుతుండేది. ఈ వ్యాపారంలో యూదులకు కూడా చెప్పుకోదగ్గ వాటా ఉండేది. ఈ యూదులు హజ్రత్ సులైమాన్ (అ) ద్వారా తమకు ఈ కళ అబ్బింది అని చెప్పుకునేవారు. (ఎన్‌సైక్లోపిడియా ఆఫ్ బైబిల్ లిటరేచర్-శీర్షిక-EPHCOLI)

బహుదైవారాధన, మూఢనమ్మకాల ఈ వాతావరణంలో ఏకేశ్వరవాదులకు ఎదురైన దుర్భర పరిస్థితి ఎలాంటిదో ఆ యువకుల మాటల్లోనే దివ్యఖుర్‌ఆన్ కహఫ్ సూరాలోని ఈ ఆయత్‌లలో వివరించడం జరిగింది.

إِنَّهُمْ إِن يَظْهَرُوا عَلَيْكُمْ يَرْجُمُوكُمْ أَوْ
يُعِيدُوكُمْ فِي مِلَّتِهِمْ وَلَن تُفْلِحُوا إِذًا أَبَدًا ۝

(الكهف : ٢٠)

"ఒకవేళ వారు మనల్ని పట్టుకుంటే, రాళ్ళతో కొట్టి చంపేస్తారు, లేదా బలవంతంగా మనలను తమ సంఘంలో మళ్ళీ కలుపుకుంటారు. అలా జరిగితే మనం ఎన్నిటికీ సాఫల్యం పొందలేము." (అల్ కహఫ్:20)

వారు అన్నివిధాలా ఆలోచించే విశ్వాస మార్గాన్ని అవలంబించారు. సంక్లిష్టమైన పరిస్థితుల్లో ఆ ప్రకటన చేసినప్పుడు దానికి అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

وَزِدْنٰهُمْ هُدًى ۝ وَّرَبَطْنَا عَلٰى قُلُوْبِهِمْ

"మేము వారికి సన్మార్గంపై నడవడంలో అభివృద్ధిని ప్రసాదించాము. వారు లేచి ఈ ప్రకటన చేసినప్పుడు మేము వారి హృదయాలకు దృఢత్వాన్ని కలుగజేశాము." (కహఫ్:13)

అంటే చిత్తశుద్ధితో విశ్వసించినప్పుడు అల్లాహ్ వారికి ఆ మార్గంలో నడిచేందుకు మరింత వీలును కలిగించాడు. వారు ఆ మార్గంపై నిలకడగా ఉండేందుకుగాను వారి హృదయాలను దృఢపరిచాడు. తద్వారా వారు తమను తాము ప్రమాదాల్లో పడేయడానికైనా సిద్ధంగా ఉన్నారుగాని అసత్యం ముందు తలవంచడానికి మాత్రం సిద్ధపడలేదు.

వనరులకంటే అల్లాహ్‌పైన్నే భారం

అస్‌హాబె కహఫ్‌కు చెందిన ఆ యువ ముస్లిముల విశ్వాసం, వారి ప్రకటన ద్వారా మనకు లభించే మరో బోధ ఏమిటంటే, సత్యాన్ని స్వీకరించేవాడు అగుపడే

ప్రాపంచిక వనరులపై ఏ మాత్రం భారం వేయడన్నది. అతని భరోసా అంతా అల్లాహ్ పైన్నే. అతను సత్యమార్గంలో ఏ అనుకూలమైన సూచనలు కానరాకపోయినప్పటికీ అల్లాహ్‌పై గల నమ్మకం, భరోసాల బలంతో ఆ మార్గంపై అడుగు ముందుకు వేస్తాడు. అల్లాహ్‌పై ఈ యువకుల నమ్మకం అననుకూలమైన పరిస్థితుల్లో సత్యాన్ని ప్రకటించేటట్లు చేసింది. అలాగే, వారు సత్యసందేశాన్ని ప్రకటిస్తూ ఏ దుర్భర పరిస్థితికి లోనయ్యారో, అది 'ఇఫ్స్' నగరంలో వారి మనుగడనే అసాధ్యంగా చేసి పారేసింది. అప్పుడూ వారు ఓ గుహలో శరణు పొందేందుకు వెడుతూ పరస్పరం ఇలా మాట్లాడు కోవడం జరిగింది.

وَاِذِ اعْتَزَلْتُمُوْهُمْ وَمَا يَعْبُدُوْنَ اِلَّا اللّٰهَ فَاْوٗٓا
اِلَى الْكَهْفِ يَنْشُرْ لَكُمْ رَبُّكُمْ مِّنْ رَّحْمَتِهٖ وَيُهَيِّئْ لَكُمْ
مِّنْ اَمْرِكُمْ مِّرْفَقًا ○ (الکہف : ١٦)

"ఇప్పుడు మీరు వారితోను, అల్లాహ్‌ను కాదని వారు ఆరాధించే దేవుళ్ళతోను సంబంధాలు త్రెంచుకున్నారు. కనుక, ఇక పదండి, ఫలానా గుహలో ప్రవేశించి ఆశ్రయం పొందండి. మీ ప్రభువు మీపై తన కారుణ్యచ్ఛాయను విస్తరింపజేస్తాడు. మీ కార్యసిద్ధికై సకల సామగ్రిని సమకూరుస్తాడు." (అల్ కహఫ్:16)

అల్లాహ్ పరోక్ష సహాయం

అస్‌హాబె కహఫ్‌కు సంబంధించిన ఈ సంఘటన ద్వారా మరో విషయం మన ముందుకు వస్తోంది. ప్రపంచంలో సతతం జరుగుతున్న సంఘటనలను ప్రజలు ప్రకృతి సిద్ధాంతాల క్రిందనే లెక్క కట్టడం జరుగుతుంది. ఆ సిద్ధాంతాలకు భిన్నంగా ప్రపంచంలో మరేదీ జరగడానికి వీల్లేదని తలుస్తూ ఉంటారు. ఈ ప్రపంచాన్ని సృష్టించినవాడు ఆ సిద్ధాంతాలకు యేమాత్రం కట్టుబడి ఉండడు. తాను తలిస్తే ఆ సిద్ధాంతాన్ని మార్చి ఓ అసాధారణమైన కార్యాన్ని కూడా చేసి చూపెట్టగలడు. ఒకరిని రెండువందల ఏళ్ళ వరకు పడుకోబెట్టి, అతణ్ణికొన్ని గంటల క్రిందటే పడుకునేవాడిగా తిరిగి లేపగలడు. ఈ రెండొందల సంవత్సరాల కాలంలో అతని వయస్సు, అతని రూపం, అతని వస్త్రధారణ, అతని ఆరోగ్యాలపై ఈ సుదీర్ఘకాలం ఎలాంటి ప్రభావాన్ని చూపకుండా చేయగలడు. అచ్చం అలాగే, అసత్య ధ్వజవాహక శక్తులు ఈ ప్రపంచపు సకల భౌతిక వనరులు కూడగట్టుకొని, సమస్త యుద్ధసామగ్రిని ఉపయోగించి, సత్యధర్మానుయాయులపై విరుచుకుపడినప్పుడు వీరివద్ద అలాంటి సరంజామా ఏదీ ఉండదు. కాని సత్యాన్ని సత్యంగా భావించి, ఆ సత్యాన్ని నెలకొల్పడానికి ప్రయత్నం చేయగా అసత్యం తన పూర్తి శక్తితో వారిపై విరుచుకుపడినప్పుడు, ఆ సత్యంపై స్థిరంగా ఉండే ఏలాంటి మార్గమూ వారికి అగుపడనప్పుడు అల్లాహ్ తన మహత్యం

ద్వారా ఆ సత్యం పాదాలను స్థిరంగా ఉంచగలడు. అసత్యపు కారుమేఘాలు ధూళి రేణువుల్లా చెల్లాచెదురైపోగలవు.

సత్యాసత్యాల నడుమ సంఘర్షణ

కహఫ్ అధ్యాయం, 60 నుండి 82వ ఆయత్‌లలో హజ్రత్ మూసా (అ), మరో పుణ్యపురుషుడు (ఖిజర్-అ)ల గాధ చెప్పడం జరిగింది. ఈ గాధను వివరించి దైవతిరస్కారులు మరియు విశ్వాసులకు ఓ యదార్థాన్ని గురించి హెచ్చరించడం దాని ఉద్దేశ్యం. అదేమిటంటే, ప్రత్యక్షంగా అగుపడే విషయానికి మన దృష్టి పూర్తి భిన్నమైన భావాన్ని గ్రహించడం. అల్లాహ్ తాను దేన్ని దృష్టిలో ఉంచుకొని ఆ కార్యాన్ని కొనసాగిస్తున్నాడో దాని ఔచిత్యం వేరు. దుర్మార్గుల వృద్ధివికాసాలు మరియు అమాయకులు కష్టనష్టాలకు గురికావడం, ధిక్కారులపై కురిసే వరాల జల్లులు, దైవవిధేయులపై విరుచుకుపడే కడగండ్లు; దుష్టుల అయిశ్వర్యం, పుణ్యాత్ముల దారిద్ర్యం వగైరాల్లాంటివే ఆ దృశ్యాలు. ఇవి ప్రతిరోజు మనుషులు చూస్తున్న సత్యాలు. ప్రజలు వాటి గురించి అర్థం చేసుకోకపోవడం వలన సాధారణంగా మనస్సుల్లో అనుమానాలు, తప్పుడు ఆలోచనలు పుట్టుకురావడం జరుగుతుంది.

దైవతిరస్కారులు, దుర్మార్గులు ఈ పరిస్థితిని చూసి ఈ ప్రపంచం అంతా ఓ గ్రుడ్డి ప్రపంచం దానికి రాజంటూ ఎవడూ లేడు, ఉన్నా అసమర్థుడు. ఇక్కడ మనం మన ఇష్టారాజ్యంగా నడుచుకోవచ్చు, అడిగే నాథుడే లేడు అనే ఓ నిర్ణయానికి వచ్చేస్తారు. ఇక విశ్వాసుల మాటకొస్తే, వారు ఈ సంఘటనలనుగని నిరుత్సాహానికి లోనైపోతారు. కొన్ని సందర్భాల్లో గట్టి పరీక్షా సమయాల్లో వారి విశ్వాసం కూడా ప్రమాదంలో పడుతుంది. ఇలాంటి పరిస్థితుల్లోనే, అల్లాహ్ తన కార్యక్రమం ఎలాగుంటుందో, రేయింబవళ్ళు జరుగుతున్న సంఘటనల వెనుక ఏ ఔచిత్యం దాగివుందో, సంఘటనల ప్రత్యక్షరూపం వెనుక దృష్టికి అగోచరమైన నిజం ఎలాంటిదో హజ్రత్ మూసా (అ)కు లీలమాత్రంగా చూపించడం జరిగింది.

హజ్రత్ మూసా (అ)కు లీలామాత్రంగా వీక్షింపజేసిన ఈ దృశ్యాలు ఎప్పుడు చూపించడం జరిగింది? అనే విషయానికొస్తే, ఈ సంఘటనను లోతుగా పరిశీలించినప్పుడు రెండు విషయాలు మనకు తెలుస్తాయి. ఒక విషయం ఏమిటంటే, ఈ దృశ్యాలు హజ్రత్ మూసా (అ)కు ఆయన దైవదౌత్య ప్రారంభదశలో చూపబడి ఉండవచ్చు. ఎందుకంటే, దైవదౌత్య ప్రారంభదశలోనే దైవప్రవక్తలకు ఇలాంటి శిక్షణ గరపబడుతుంది కాబట్టి. రెండవ విషయం, హజ్రత్ మూసా (అ)కు ఈ సూచనలను చూయించే అవసరం, బనీ ఇస్రాయీలుకు కూడా మక్కాలో ముస్లిములు ఎదుర్కొంటున్న పరిస్థితులే తారసపడ్డాయి. ఈ కారణాల వల్ల మా అంచనా ప్రకారం (నిజం ఆ దేవునికే తెలుసు), ఆ సంఘటన ఈజిప్టులో బనీ ఇస్రాయీల్‌పై ఫిర్‌ఔన్ దుర్మార్గాలు

తారస్థాయికి చేరిన కాలంలో జరిగి ఉంటుంది. ఇక్కడ ఖురైష్ సర్దారులకు మల్లే ఫిర్ఔను అతని దర్బారీలు (సభాసదులు) దైవశిక్ష వారిపై విరుచుకుపడడం లేదని గ్రహించి, వారిని అడిగేవాడు ఎవ్వరూ లేరు అని తలచడం. మక్కాలో జరుగుతున్న హింసాకాండ లాంటిదే అప్పుడు ఈజిప్టుకు చెందిన నిస్సహాయ ముస్లిములపై కూడా విరుచుకుపడుతూ ఉంది. ఈ నిస్సహాయ ముస్లిములు, ప్రభూ! ఈ దుర్మార్గులపై వరాల జల్లులు ఎందుకు కురుస్తున్నాయి? మాపై ఈ దౌర్జన్యకాండ ఎప్పటివరకు కొనసాగుతుంది? అని అడగడం జరిగింది. చివరకు హజ్రత్ మూసా దైవాన్ని సంబోధిస్తూ ఇలా వేడుకోవడం జరిగింది కూడా.

رَبَّنَآ اِنَّكَ اٰتَيْتَ فِرْعَوْنَ وَمَلَاَهٗ زِيْنَةً وَّاَمْوَالًا
فِي الْحَيٰوةِ الدُّنْيَا رَبَّنَا لِيُضِلُّوْا عَنْ سَبِيْلِكَ (يونس: ٨٨)

"మూసా ఇలా ప్రార్థించాడు: "మా ప్రభూ! నీవు ఫిర్ఔనుకు అతని సర్దారులకూ ఇహలోక జీవితంలో వైభవాన్ని, సంపదను ప్రసాదించావు. ప్రభూ! వారు ప్రజలను నీ మార్గం నుంచి తప్పించడానికా ఇవి?" (యూనుస్:88)

సత్యసందేశ ప్రచార మార్గంలో ఎదురయ్యే పరీక్షలు

ప్రారంభ దశలో దైవసందేశ ప్రచారాన్ని నీరుగార్చడానికి హేళన, ఎగతాళి చేసి దాని ప్రభావం లేకుండా చేయడం జరుగుతుంది. ఆ తరువాత అసత్యపు నేరాలు మోపడం జరుగుతుంది. ఈ ఎత్తుగడలు వమ్మైపోయిన తరువాత బెదిరింపులు ప్రారంభం అవుతాయి. అవి కూడా పనిజేయకపోతే ఆశలు జూపి ధర్మసందేశ ప్రచారకులను ఆ మార్గం నుండి తప్పించడం జరుగుతుంది. దైవప్రవక్త (స) దైవ దౌత్యాన్ని ప్రకటించినప్పటి నుండి హింసాదౌర్జన్యాలు ఈ ఉపద్రవం ప్రారంభం అయినప్పటి వరకు మొత్తం రెండు సంవత్సరాల వరకు కొనసాగాయి. మొదట వ్యతిరేకత ప్రారంభం అయింది. అది ఆ తరువాత ఆటంకాలు సృష్టించేంతమట్టుకు వెళ్ళాయి. ఆపై హేళన, ఎగతాళి, నేరారోపణలు, దౌర్జన్యకాండ, అసత్యపు ప్రచారాలు, వ్యతిరేకంగా ముఠాలు కట్టడం వగైరాల వరకు వచ్చింది వ్యవహారం. వాటికి సంబంధించిన కొన్ని ఉదాహరణలు ఇక్కడ ఇస్తున్నాము.

كَلَّآ اِنَّ الْاِنْسَانَ لَيَطْغٰىٓ ۙ اَنْ رَّاٰهُ اسْتَغْنٰى ۗ اِنَّ اِلٰى
رَبِّكَ الرُّجْعٰى ۗ اَرَاَيْتَ الَّذِيْ يَنْهٰى ۙ عَبْدًا اِذَا صَلّٰى ۗ

"ఎంతమాత్రం కాదు, మానవుడు తనను తాను ఎవరి అక్కరలేని వాడనీ, సర్వస్వతంత్రుడనని మితిమీరి ప్రవర్తిస్తున్నాడు. (అయితే) చివరికి అందరూ నీ ప్రభువు వైపునకే తప్పనిసరిగా మరలిపోవలసి ఉంటుంది. ఒక దాసుడు నమాజు చేస్తుంటే అతనిని నిరోధించే వ్యక్తిని నీవు చూశావా?" (అల్ అలక్: 6-10)

ఈ ఆయత్‌లు అవతరించింది దైవప్రవక్త(స) కాబాలో ఇస్లామీయ పద్ధతిలో నమాజు చేస్తుండగా అబూజహల్ ఆయన్ను బెదిరించి నమాజు చేయకుండా నిరోధించే ప్రయత్నం చేసినప్పుడు. దైవప్రవక్త (స) ఇస్లామ్‌ను బాహాటంగా ప్రకటించడానికి ముందు 'హరమ్'లో (కాబా గృహం) అల్లాహ్ ఆయనకు బోధించిన రీతిలో నమాజు చేయడం ప్రారంభించారు. ఇది చూసిన ఖురైష్ వర్గం, దైవప్రవక్త (స) ఏదో క్రొత్త మతాన్ని అవలంభించారని భావించడం జరిగింది. ఇతరులు ఈ నమాజు విధానాన్ని ఆశ్చర్యంగా చూస్తున్నారు. కాని అబూజహల్ అజ్ఞానం కట్టలు త్రెంచుకుంది. అతడు ఆయన్ను ఈ రకంగా నమాజు చేయవద్దని బెదిరించనారంభించాడు. ఈ విషయంలో అబ్దుల్లాబిన్ అబ్బాస్ (ర), హజ్రత్ అబూ హురైరా (ర)లు ఉల్లేఖించిన అనేక హదీసులున్నాయి. వాటిలో అబూజహల్ దుష్ప్రవర్తన ఎలాగుండిందో చెప్పడం జరిగింది.

హజ్రత్ అబూహురైరా (ర) గారి ఉల్లేఖనం ప్రకారం, అబూజహల్ ప్రజలను ఇలా అడిగాడు:

"ముహమ్మద్ (స) మీ ముందు భూమ్మీద ముఖం ఆనించడం లేదా?"

"అవును" అన్నారు వారంతా.

"లాత్ మరియు ఉజ్జా దేవతల సాక్షి! నేను ఆయన్ను అసలే ఈ విధంగా నమాజు చేయగా చూసినట్లయితే ఆయన మెడపై కాలుపెట్టి ఆయన ముఖాన్ని భూమిపై రుద్దేస్తాను" అన్నాడు కసిగా.

ఆ తరువాత దైవప్రవక్త (స)ను అదే రీతిలో నమాజు చేయగా చూసి అతను ఆయన మెడపై కాలుపెట్టడానికి ముందుకు కదిలాడు. వెంటనే అతను వెనక్కు తగ్గుతూ, తన ముఖాన్ని ఏదో ఓ వస్తువు నుండి రక్షించుకునే ప్రయత్నం చేస్తూ ఉండడం చూశారు అక్కడున్నవారు. ఆయన్ను, అలా ఎందుకు చేశావు? నీకేమైంది అలా ప్రవర్తించావు అని అడుగగా అతను:

"నాకు, ఆయనకు మధ్య ఓ అగడ్త మరియు భయంకరమైన వస్తువు ఏదో ఉంది. మరేవో ఈకలు అగుపడ్డాయి" అని అన్నాడు.

దైవప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు:

"ఒకవేళ అతను నాదాపుకైనా వచ్చి ఉంటే దైవదూతలు అతనిని ముక్క ముక్కలుగా చేసి ఉండేవారు."

(అహ్మద్, తిర్మిజీ, నిసాయీ, ఇబ్నెజరీత్; ఇబ్నెఅబీషైబా, ఇబ్నుల్‌మున్జిర్, తిబ్రానీ, ఇబ్నెమర్దుయా)

జగమెరిగిన నైతికతల విధ్వంసం

దివ్యఖుర్ఆన్ మొత్తంలో ఒకే ఒక అధ్యాయం 'లహబ్' సూరాలో ఇస్లామ్ విరోధుల్లోని ఓ వ్యక్తిని పేరుబెట్టి అభిశపించిన తీరు ఒక్కటే కానవస్తుంది. మక్కాలోను హిజ్రత్ (వలస) తరువాత, మదీనాలోను చాలా మంది దైవప్రవక్త (స)గారిని విరోధించినవారు అబూ లహబ్ కంటే తక్కువవారు కాకపోయినప్పటికీ, లహబ్ సూరాలో ప్రత్యేకంగా ఆ వ్యక్తి పేరుబెట్టి ఎందుకు అభిశపించడం జరిగింది? దీన్ని అర్థం చేసుకోవాలంటే, అప్పటి అరేబియా సమాజాన్ని అర్థం చేసుకోవలసి ఉంటుంది. ఆ సమాజంలో అబూలహబ్ వైఖరి ఎలాంటిదో తెలుసుకోవలసి ఉంటుంది.

ప్రాచీన కాలంలో అరేబియా మొత్తానా అశాంతి, వినాశనం, అరాచకం వ్యాపించి ఉండేది. శతాబ్దాల తరబడి ఏ వ్యక్తి అయినా తన కుటుంబం, తన రక్తసంబంధం మద్దత్తు తప్ప మరొకరి ప్రాణానికిగాని, శీలానికిగాని ఎలాంటి సంరక్షణ లేదా గ్యారంటీ ఇవ్వని కాలమది. కాబట్టి అరేబియా సమాజపు నైతిక విలువల్లో బంధు ప్రీతికి (అంటే బంధువుల పట్ల సద్వర్తనగా మెలగడం) గొప్ప ప్రాధాన్యత ఇవ్వడం జరిగింది. బంధుత్వాలను త్రుంచడం ఓ గొప్ప పాపంగా పరిగణించబడేది. అరేబియా సంప్రదాయపు ఆ ప్రభావం వలన, దైవప్రవక్త (స) ఇస్లామ్ వైపుకు ప్రజలను ఆహ్వానించినప్పుడు ఖురైష్ తెగకు చెందిన ఇతర కుటుంబాలు మరియు వాటి సర్దారులు దైవప్రవక్త (స)ను తీవ్రంగా ప్రతిఘటించారు. అయినప్పటికీ బనీ హాషిమ్, బనీ ముత్తలిబ్‌లు (హాషిమ్ సోదరుడు ముత్తలిబ్ సంతతి) ఆయనను వ్యతిరేకించక పోవడమే కాకుండా, అందులో చాలా మంది ఆయన్ను విశ్వసించకపోయినప్పటికీ బాహాటంగా ఆయనకు వెన్నుదన్నుగా నిలిచారు. ఖురైష్‌కు చెందిన ఇతర కుటుంబాలు, దైవప్రవక్త(స)కు సహాయంగా నిలిచిన ఆ రక్తసంబంధీకుల వైఖరిని అప్పటి సంప్రదాయంగా తలచి మిన్నకుండిపోయారు. ఆ కారణంగానే వారు బనీ హాషిమ్, బనీ ముత్తలిబ్‌లకు, మీరు ఓ క్రొత్త మతాన్ని బోధిస్తున్నవానికి సహాయంగా నిలబడి ధర్మభ్రష్టులెందుకు అవుతున్నారని ఎత్తిపొడవలేదు. తమ కుటుంబానికి చెందిన ఓ వ్యక్తిని ఎట్టి పరిస్థితుల్లోనూ అతని శత్రువులకు అప్పజెప్పలేదు, తమ బంధువుకు వెన్నుదన్నుగా నిలబడడం ఖురైష్ మరియు అరబ్బుల దృష్టిలో అది ఓ సహజమైన ప్రతిక్రియే.

అజ్ఞానపు కాలంలోను అరబ్బులు పవిత్రంగా తలచి గౌరవించే ఈ నైతిక సూత్రాన్ని, ఇస్లామ్ పట్ల గల శత్రుత్వంలో మితిమీరిపోయిన ఒకే ఒక వ్యక్తి అతిక్రమించి ధ్వంసం చేయడం జరిగింది. అతనే అబూ లహబ్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్. ఇతను దైవప్రవక్త ముహమ్మద్ (స)కు స్వయానా పినతండ్రి. దైవప్రవక్త (స)గారి తండ్రి మరియు ఇతను ఒకే తండ్రి సంతానం అరబ్బుల్లో పినతండ్రిని తండ్రిగానే

తలచేవారు. ముఖ్యంగా సోదరుడు చనిపోతే అరేబియా సమాజంలో అతని కుమారుడు సొంత కుమారునిలా పోషించబడేవాడు. కాని అతను ఇస్లామ్ విరోధంలో ఈ అరేబియా సంప్రదాయాలన్నిటిని ధ్వంసం చేయడం జరిగింది.

ఇబ్నెఅబ్బాస్ (ర)గారి ఉల్లేఖనాలను హదీసువేత్తలు ఈ రకంగా పొందుపర్చడం జరిగింది:

"దైవప్రవక్త (స)కు బహిరంగంగా ఇస్లామ్ గురించి ప్రచారం చేయమని ఆదేశాలు జారీ చేస్తూ అల్లాహ్, మీరు మొట్టమొదట మీ దగ్గరి బంధువులను దైవశిక్ష గురించి భయపెట్టడం అనే ఖుర్ఆన్ ఆదేశాలను అవతరింపజేశాడు. అప్పుడాయన వేకువనే లేచి సఫా కొండపైకెక్కి బిగ్గరగా ఇలా కేక పెట్టారు: "యా సబా హాహ్" (అయ్యో! ఉదయంపూట వచ్చిపడ్డ ప్రమాదం!) అని. అరేబియాలో, వేకువనే ఏ శత్రువైనా తమ తెగపై దండెత్తి వస్తూ ఉండగా చూసి పెట్టే కేక ఇది. మహాప్రవక్త (స) పెట్టిన ఈ కేక విని ప్రజలు ఎవరా కేక పెట్టింది? అని పరస్పరం అనుకోజొచ్చారు. ఇది దైవప్రవక్త ముహమ్మద్ (స) గారి కేక అని తెలిసిన ఖురైషీల కుటుంబాల ప్రజలంతా అక్కడి పరుగెడుతూ వచ్చేశారు. అక్కడికి రాలేనివాడు తన తరపున మరొకణ్ణి పంపించాడు. అందరూ ఓ చోట చేరగానే దైవప్రవక్త (స) ఖురైష్ తెగకు చెందిన ఒక్కో పేరు పెట్టి, ఓ బనీ హాషిమ్, ఓ బనీ అబ్దుల్ ముత్తలిబ్, ఓ బనీ ఫహద్, ఓ బనీ ఫలానా, ఓ బనీ ఫలానా! నేను, ఈ కొండ వెనుక మీపై దాడి చేయ డానికి సిద్ధంగా ఉన్న ఓ దండును గురించి చెబితే మీరు నా మాటలను విశ్వసిస్తారా?" అని అడిగారు. దానికి ఖురైష్ తెగకు చెందిన కుటుంబాలన్నీ ముక్త కంఠంతో, 'మీరు ఇప్పటి వరకు అబద్ధమాడినట్లు మేము చూడలేదు' అని పలికారు. అప్పుడు దైవప్రవక్త (స) వారిని ఉద్దేశించి, 'మునుముందు ఓ తీవ్రమైన యాతన మిమ్ములను చుట్టు ముట్టడానికి సిద్ధంగా ఉందని హెచ్చరించడానికే మిమ్మల్ని ఇక్కడికి పిలిపించాను" అని పలికారు. ఆ జనం దానికి సమాధానంగా ఏదైనా చెప్పేలోపే దైవప్రవక్త (స)గారి సొంత పినతండ్రి అయిన అబూ లహబ్ కల్పించుకొని, "నీ నాశనంగాను! ఈ మాట చెప్పడానికేనా నీవు మమ్ములను ఇక్కడకు పిలిచింది?" అని పలికాడు. మరో ఉల్లేఖనంలో దైవప్రవక్తను కొట్టేందుకు అతను ఓ బండరాయిని కూడా ఎత్తాడని ఉంది. (ముస్నదె అహ్మద్; బుకారి, ముస్లిమ్, తిర్మిజీ, ఇబ్నెజరీర్ వగైరా)

ఇబ్నె జైద్ (ర)గారి ఉల్లేఖనం ప్రకారం, అబూ లహబ్ ఓ రోజున దైవప్రవక్తను ఇలా అడిగాడు. నేను నీ ధర్మాన్ని విశ్వసిస్తే నాకు లభించేది ఏమిటి?" అని. సమాధానంగా మహాప్రవక్త (స), అందరూ విశ్వాసులకు లభించేదే నీకు లభిస్తుంది" అన్నారు.

"నాకు ఎలాంటి ప్రత్యేకత లేదా?' మళ్ళీ అడిగాడు అబూలహబ్.

"ఇంకా నీవు కోరేది మరేముంటుంది?" అన్నారు మహాప్రవక్త (స).

దానికి అతడు, "నేను మరియు విశ్వసించిన వారంతా సమమయ్యే ఆ ధర్మం నాశనం అయిపోను!" అని అన్నాడు.

మక్కాలో నివసించే కాలంలో దైవప్రవక్త(స)కు అబూలహబ్ పొరుగున్నే నివసిస్తూ ఉండేవాడు. వారి రెండిండ్లకు మధ్య ఒక గోడే అడ్డం. అదే కాకుండా 'హకం బిన్ ఆస్' (మర్వాన్ తండ్రి) ఉక్బా బిన్ అబీ ముఖీత్; అదియా బిన్ హమ్రా, ఇబ్నె అవురస్దా అల్‌హాజీలు కూడా దైవప్రవక్త(స)కు పొరుగువారే. వీరు కూడా మహాప్రవక్త (స)ను తీరిగ్గా కూర్చోనిచ్చేవారు కాదు. ఆయన నమాజుచేసేటప్పుడు పైనుండి ఆయనపై మేక పొట్టప్రేవుల్లో నుండి తీసి పారేసిన అశుద్ధ పదార్థాన్ని ఆయనపై కుమ్మరించేవారు. ఆరు బయట వంట చేస్తుంటే ఆ పాత్రపై అశుద్ధాన్ని విసిరేవారు. దైవప్రవక్త (స) బయటకు వచ్చి వారినుద్దేశించి, ఓ బనీ అబ్దుల్ మునాఫ్ మీరెలాంటి పొరుగువారయ్యా? అని అడిగేవారు. అబూ లహబ్ భార్య ఉమ్మె జమీల్ (అబూ సుఫ్‌యాన్ చెల్లెలు) అయితే, రాత్రిపూట గుమ్మానికి అడ్డంగా ముళ్ళకంపను తెచ్చి పడవేసేది. ఉదయం ఆయన, ఆయన పిల్లలు బయటకు వస్తే వారికి ఆ ముళ్ళు గ్రుచ్చుకోవాలనే ఉద్దేశ్యంతో. (బైహఖీ, ఇబ్నె అబీ హాతిమ్, ఇబ్నె జరీర్, ఇబ్నె అసాకిర్, ఇబ్నె హిషామ్)

ప్రవక్తకాక పూర్వం మహాప్రవక్త (స) గారి ఇద్దరు కుమార్తెలకు, అబూ లహబ్ ఇద్దరు కుమారులు 'ఉత్బా' మరియు 'ఉతైబా' లతో వివాహం జరిగివుంది. దైవప్రవక్త అయిన తరువాత హజ్రత్ ముహమ్మద్(స) ఇస్లామ్ ధర్మం వైపుకు రండని ప్రజలను ఆహ్వానించినప్పుడు అతను తన ఇద్దరు కుమారులతో, "మీరేగనక ముహమ్మద్ కుమార్తెలకు విడాకులు ఇవ్వకుంటే మీ ముఖం చూడడం కూడా హరామ్ అవుతుంది నాకు" అనిపలికాడు. కాబట్టి ఆ ఇద్దరు ఆ అమ్మాయిలకు తలాక్ ఇచ్చేశారు. ఉతైబా అయితే, తన ఆగడాల్లో మరింత మితిమీరిపోయి దైవప్రవక్త (స), ఎదురుగా వచ్చి, 'వన్నజ్మి ఇజాహవా' మరియు 'అల్లజీ దనా ఫతదల్లా' అనే ఖుర్‌ఆన్ ఆయత్‌లను నేను తిరస్కరిస్తున్నాను అంటూ ఆయన వైపు ఉమ్మి వేశాడు. ఆ ఉమ్మి అయితే మహాప్రవక్త (స)గారిపై పడలేదు కాని దైవప్రవక్త నొచ్చుకొని ఓ ప్రభూ! నీ కుక్కల్లో నుండి ఓ కుక్కను ఇతనిపై ఉసిగొలుపు అని వేడుకున్నారు. కొంతకాలం తరువాత ఉతైబా తన తండ్రి వెంట సిరియాకు పయనమయ్యాడు. ఓ చోట బిడారం విడిది చేయాల్సి వచ్చింది. అక్కడి స్థానికులు రాత్రిపూట ఇక్కడికి క్రూరమృగాలు వస్తుంటాయి. జాగ్రత్తగా ఉండండని హెచ్చరించడం జరిగింది. అబూ లహబ్ తన తోటి ఖురైషీలతో, "నా కుమారుణ్ణి సంరక్షించండి. ఎందుకంటే ముహమ్మద్ ఇచ్చిన శాపానికి అతను బలౌతాడని భయంగా వుంది అని చెప్పాడు. ఆ బిడారంలోని వారంతా ఉతైబా

చుట్టు తమ ఒంటెల్ని కూర్చోబెట్టి ఆదమరిచి నిద్రపోయారు, రాత్రి సమయంలో ఓ పులి ఆ ఒంటెలను దాటొచ్చి ఉతైబాను చీల్చి చంపేసింది. (అల్ ఇస్తియాబుల్ ఇబ్నె అబ్దుల్ బర్, అల్ అసాబుల్ ఇబ్నుల్ హజర్, దలాయిలున్నబువ్వా అబీ నయీముల్ అస్ఫహాని, రౌజుల్ అన్ఫ్-అస్సుహైలీ)

ఉల్లేఖనాల్లో గల తేడా ఏమిటంటే, కొందరు ఉల్లేఖకులు ఈ సంఘటనను దైవదౌత్య ప్రకటన తరువాతి సంఘటనగా ఉల్లేఖించారు. మరికొందరు 'తబ్బత్ యదా అబీ లహబ్' అవతరణ తరువాత జరిగిన సంఘటన అని చెబుతారు. అలాగే పులి చంపిన అబూ లహబ్ కుమారుడు ఉతబానా లేదా ఉతైబానా అనే విషయం లోనూ విభేదం ఉంది. కాని మక్కా విజయం తరువాత ఉతబా దైవప్రవక్త (స) గారి చేతుల మీదుగా బైత్ చేసి ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించాడనడానికి ఆధారాలున్నాయి. కాబట్టి అతను ఉతైబాయే అని గట్టిగా చెప్పవచ్చు.

అబూ లహబ్ దుష్ట మనస్తత్వం ఎలాగుండిందంటే, దైవప్రవక్త (స) గారి కుమారుడు హజ్రత్ ఖాసిం తరువాత ఇంకో కుమారుడు హజ్రత్ అబ్దుల్లాహ్ కూడా చనిపోయినప్పుడు అతను తన సోదర కుమారుని దుఃఖంలో పాల్పంచుకునే బదులు సంబరపడుతూ ఖురైష్ సర్దారుల దగ్గరకు పరుగెత్తి, "చూశారా! ఈ రోజు ముహమ్మద్ (స) నామరూపాల్లేకుండా పోయే సంఘటన జరిగింది" అని చెప్పుకోవడం.

దైవప్రవక్త (స) ఇస్లామ్ వైపునకు ఆహ్వానించడానికి ఎక్కడికైతే వెళ్ళేవారో అతను ఆయన్ను అనుసరిస్తూ వెళ్ళి ప్రజలకు ఆయన సందేశం అందించకుండా, ప్రజలు దాన్ని చెవియొగ్గి వినకుండా ఉండేటట్లు ప్రయత్నాలు చేసేవాడు. రబియా (ర) బిన్ అబ్బాదుస్ సిదేలీ ఇలా ఉల్లేఖిస్తున్నారు: "నేనింకా పిన్న వయస్కుణ్ణి. నేను నా తండ్రి వెంట జుల్మజాజ్ సంతకు వెళ్ళినప్పుడు దైవప్రవక్త (స) ఇలా చెబుతూ ఉండగా విన్నాను. 'ప్రజలారా! అనండి అల్లాహ్ తప్ప వేరే యే ఆరాధ్యుడు లేడని, మీకు శ్రేయం కలుగుతుంది' ఆయన మాటలు పూర్తికాగానే మరో వ్యక్తి ఇలా పలికేవాడు: 'ఇతను అసత్యవాది, అబద్ధాలకోరు. తన తాతముత్తాతల ధర్మాన్ని వదిలి ధర్మభ్రష్టుడయ్యాడు.' ఇతనెవరని నేనడగ్గా, 'ఇతను ఆయన పినతండ్రి అబూ లహబ్' అని బదులిచ్చారు అక్కడున్నవారు. (ముస్నదె అహ్మద్, బైహఖీ)

ఇంకో ఉల్లేఖనం ఆ హజ్రత్ రబీయా (ర)గారిదే. ఆ ఉల్లేఖనంలో ఆయన ఇలా అంటారు:

"ఓ తెగ విడిది చేసిన చోటికి దైవప్రవక్త (స) వెళ్ళడాన్ని నేను చూశాను. అక్కడ ఆయన వారినుద్దేశించి, "ఓ బనీ ఫలానా! నేను మీ వైపుకు పంపబడిన దైవప్రవక్తను, మీరు కేవలం అల్లాహ్‌నే ఆరాధించాలని, ఆయనకు మరెవ్వరిని సాటి కల్పించకండని హితబోధ చేస్తున్నాను, మీరు నన్ను బలపర్చండి. అల్లాహ్ నాకు

యే పని అప్పగించి పూర్తి చేయడానికి నన్ను పంపించాడో ఆ కార్యంలో నాకు తోడ్పడండి!" ఆయన వెనుకాల మరో వ్యక్తి వస్తాడు- అతను ఇలా అంటాడు: "ఓ బనీ ఫలానా! ఇతను మిమ్ములను 'లాత్' మరియు 'ఉజ్జా' దేవతల నుండి వెనక్కు త్రిప్పి, ఇతను తెచ్చిన మార్గభ్రష్టత్వం మరియు బిద్అత్ వైపుకు తీసుకుపోదలుస్తున్నాడు, ఇతని మాటలను అసలు నమ్మకండి. ఇతణ్ణి అనుసరించకండి." నేను నా బాబాయితో ఇతనెవరూ? అని అడగగా ఆయన, "ఇతను ఆయనగారి పినతండ్రి అబూ లహబ్" అని బదులిచ్చారు. (ముస్నదె అహ్మద్, తిబ్రానీ)

తారిక్ బిన్ అబ్దుల్లాహ్ ముహారిబీ (ర)గారి ఉల్లేఖనం కూడా ఇలాగే ఉంది. ఆయన ఇలా అంటారు:

"నేను జుల్‌మజాజ్ సంతలో దైవప్రవక్త (స) ప్రజలను ఇలా సంబోధిస్తూ ఉండగా చూశాను. "ప్రజలారా! లా ఇలాహ ఇల్లల్లాహ్ అనండి. శ్రేయాన్ని పొందుతారు" ఆయన వెనుకాలే మరో వ్యక్తి ఆయన్ను రాళ్ళతో కొడుతున్నాడు. ఆ దెబ్బలకు ఆయన పాదాలు రక్తసిక్తమౌతూ ఉన్నాయి. అతను ఇలా రాళ్ళు విసురుతూ, 'ఇతను అసత్య వాది, ఇతని మాటలను నమ్మకండి' అని చెబుతున్నాడు. ఇతనెవరూ? అని నేనడగ్గా, 'ఇతను ఆయన పినతండ్రి అబూ లహబ్' అని బదులిచ్చారు జనం." (తిర్మిజీ)

దైవదౌత్య పదవి వచ్చిన ఏడేళ్ళ తరువాత ఖురైష్‌కు చెందిన కుటుంబాలన్ని కలిసి బనీ హాషిమ్, బనీ ముత్తలిబ్‌ల సామాజిక మరియు ఔపాధిక బైకాట్ చేసినప్పుడు కూడా ఈ రెండు కుటుంబాల వాళ్ళు దైవప్రవక్త (స)కు సహకారం అందించడంలో దృఢచిత్తులయ్యే ఉన్నాయి. దైవప్రవక్త (స) వెంట అబీతాలిబ్ అనే లోయలో బంధించబడ్డారు. అప్పుడు ఈ అబూ లహబ్ ఒక్కడే తన కుటుంబంతో వేరుపడి ఖురైష్‌కు సహకారాన్ని అందించాడు. ఈ బైకాట్ మొత్తం మూడేళ్ళ వరకు కొనసాగింది. ఈలోపు బనీ హాషిమ్ మరియు బనీ అబ్దుల్ ముత్తలిబ్‌కు సంబంధించిన వారు పస్తులుండాల్సి వచ్చింది. కాని అబూ లహబ్ మట్టుకు, మక్కాకు ఏదైనా వర్తక బిడారం వస్తే, అబీ తాలిబ్ లోయలో బంధించబడిన వారు ఆ వర్తక బిడారం నుండి ఏదైనా తినుబండారాలను కొనడానికి దాని దాపుకు వచ్చినప్పుడు ఇతను ఆ వర్తకులతో వాళ్ళు కొనలేనటువంటి ధర చెప్పండి, మీకు నష్టం కలిగితే ఆ నష్టాన్ని నేనే పూడుస్తాను అని బిగ్గరగా అరిచి చెప్పేవాడు. కాబట్టి వారు మితిమీరిన ధర చెప్పడం వలన కొనే వాడు పాపం పస్తులతో తల్లడిల్లిపోతున్న భార్యాపిల్లల వద్దకు ఉత్త చేతుల్తోనే వెనక్కు మరలేవాడు. ఆ తరువాత అదే వస్తువును అబూ లహబ్ బజారు రేటు బెట్టి కొనక్కునే వాడు. (ఇబ్నె సఅద్, ఇబ్నె హిషామ్)

కష్టాలను వెన్నంటి వచ్చే సుఖాలు

أَلَمْ نَشْرَحْ لَكَ صَدْرَكَ ۝ وَوَضَعْنَا عَنْكَ وِزْرَكَ ۝
الَّذِي أَنْقَضَ ظَهْرَكَ ۝ وَرَفَعْنَا لَكَ ذِكْرَكَ ۝ فَإِنَّ
مَعَ الْعُسْرِ يُسْرًا ۝ إِنَّ مَعَ الْعُسْرِ يُسْرًا ۝ فَإِذَا
فَرَغْتَ فَانْصَبْ ۝ وَإِلَىٰ رَبِّكَ فَارْغَبْ ۝ (الم نشرح)

"(ఓ ప్రవక్తా!) మేము నీ హృదయాన్ని నీ కొరకు తెరువలేదా? నీ నడుమును విరిచేస్తూ ఉండిన ఒక పెద్ద భారాన్ని నీపై నుండి దించి వేశాము. నీ కొరకు నీ పేరు ప్రఖ్యాతులను ఇనుమడింపజేశాము. కనుక కష్టాలతో పాటు తప్పనిసరిగా సుఖాలు కూడా ఉన్నాయి. ఇందులో ఎలాంటి సందేహం లేదు. కష్టాలతోపాటు తప్పనిసరిగా సుఖాలు కూడా ఉన్నాయి. కాబట్టి నీవు తీరిక లభించినప్పుడు, కఠోరమైన ఆరాధన లతో నిమగ్నమైపో. నీ ప్రభువు మీదనే నీ మనస్సు లగ్నం చెయ్యి." (అలమ్‌నష్రహ్:1-8)

ఈ ఆయతుల అవతరణోద్దేశ్యం దైవప్రవక్త (స)కు ధైర్యం చెప్పడం. ప్రవక్త పదవిపై నియమించబడక పూర్వం ఇలాంటి పరిస్థితులు ఆయనకు తారసపడలేదు. తాను దైవప్రవక్తనని ప్రకటిస్తూనే దైవసందేశం వైపుకు ప్రజలను ఆహ్వానించ మొదలు పెట్టగానే ఈ దుమారం చెలరేగింది. ఇది ఆయన స్వీయ జీవితంలో ఓ మహోన్నత విప్లవం. దైవదౌత్యానికి పూర్వం ఇలా జరగబోతుంది అని ఆయన కలలోనూ అనుకోలేదు. ఇస్లామీ ప్రచారం ప్రారంభించగానే ఒక్కసారిగా ఆయన సమాజ ప్రజలు ఆయనకు శత్రువులై పోయారు. అంతకు పూర్వం అదే సమాజం ఆయన్ను ఎంతో గౌరవంగా చూస్తూ వచ్చింది. ఆ బంధువర్గమే, ఆ మిత్ర సముదాయమే, ఆ కుటుంబ సదస్సులే, ఆయన వాడకు చెందిన ప్రజలే ఆయన పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ దుర్భాషలకు పాల్పడ్డారు. మక్కాలో ఏ ఒక్కడూ ఆయన మాటలను వినడా నికి సిద్ధపడలేదు. దారంట నడుస్తూ ఉంటే ఎగతాళి చేస్తూ ఏవేవో పేర్లుబెట్టి పిలిచేవారు. అడుగడుగునా ఆయనకు అడ్డంకుల్ని సృష్టించేవారు. క్రమక్రమంగా ఆయనకు ఈ పరిస్థితి, ఇంకా చెప్పాలంటే అంతకంటే గడ్డు పరిస్థితి ఎదురైనా దాన్ని ఎదుర్కొనే అలవాటు పడిపోయినప్పటికీ, ప్రారంభకాలం మాత్రం ఎంతో మనస్తాపానికి గురిచేసిన కాలం. ఆ కారణంగానే ఆయన(స)కు సాంత్వన, ధైర్యం చేకూరుస్తూ 'జుహా సూరా' అవతరించింది. ఆ తరువాత ఈ సూరా 'అలమ్ నష్రహ్' అవతరించింది.

ఇందులో మొట్టమొదటగా అల్లాహ్ ఆయనకు, మేము నీకు మూడు మహోన్నతమైన వరాలందించాము. అవి ఉండగా నీవు మనస్తాపానికి గురికావలసిన పనే లేదు అని ధైర్యం చెప్పాడు. వాటిలో ఒకటి, నీకు జ్ఞానోదయాన్ని కలిగించే వరం. రెండవది, దైవప్రవక్త అయినప్పటి నుండి నీ నడ్డి విరుస్తున్న ఆ భారాన్ని

తొలగించడం. మూడవది, నీకంటే మరెవ్వరికీ పేరు ప్రఖ్యాతులు కలిగించడం అటుంచి, నీకు సమానమైన పేరు ప్రఖ్యాతులు కూడా ఏ ఒక్కనికి సంక్రమించకుండా చూడడం.

ఆ తరువాత విశ్వప్రభువు తన దాసుడు మరియు తన ప్రవక్త అయిన ముహమ్మద్ (స)కు, కష్టాల ఈ పరంపర ఏదైతే నీ మీదకు వచ్చి పడుతోందో అది మరెంతో కాలం కొనసాగబోదు. పైగా ఈ పరిస్థితికి తోడుగా సుఖాలు కూడా వెన్నంటే వస్తున్నాయి అని ధైర్యం చెబుతున్నాడు. ఇదే విషయాన్ని 'జుహా' అధ్యాయంలో ఈ విధంగా చెప్పడం జరిగింది. "నిశ్చయంగా రాబోయే కాలంలో నీ కొరకు గత కాలం కన్నా మేలైనదిగా ఉంటుంది. త్వరలోనే నీకు నీ ప్రభువు నీవు సంతోషపడేటంత అధికంగా ప్రసాదిస్తాడు."

చివరగా దైవప్రవక్త (స)కు, ప్రారంభకాలపు ఈ కష్టాలను ఎదుర్కొనే శక్తి నీకు ఒకే ఒక విషయం ద్వారా లభించగలదు, అది నీవు నీ ప్రచారం పూర్తి చేసుకున్న తరువాత కఠోరమైన ఆరాధనల్లో నిమగ్నమైపో. అన్నిటిని వదిలేసి నీ ప్రభువు మీదనే నీ మనస్సును లగ్నం చెయ్యి అని బోధించడం జరిగింది. దానికి తోడు ఈ సూచనలను కూడా ఇవ్వడం జరిగింది.

إِنَّا أَعْطَيْنَاكَ الْكَوْثَرَ ۝ فَصَلِّ لِرَبِّكَ وَانْحَرْ ۝
إِنَّ شَانِئَكَ هُوَ الْأَبْتَرُ ۝ (الكوثر)

"(ప్రవక్తా!) మేము నీకు కౌసర్ ప్రసాదించాము. కనుక నీవు నీ ప్రభువు కొరకే నమాజు చెయ్యి. ఖుర్బానీ కూడా ఇవ్వు. నిస్సందేహంగా నీ శత్రువువే నామరూపాల్లేకుండా పోయేవాడు." (అల్ కౌసర్: 1-3)

ఇంతకు పూర్వం జుహా అధ్యాయం మరియు అలమ్ నష్రహ్ అధ్యాయంలో, దైవదౌత్య ప్రారంభ కాలంలో దైవప్రవక్త(స) కఠినమైన కష్టాలకు బలి అవుతున్నప్పుడు ఆయన జాతికి జాతే ఆయనకు శత్రువు అయిపోయిందని, విరోధాల నిరోధకాలను ఆయన మార్గంలో అడ్డంకులుగా సృష్టించడం జరిగిందని, వ్యతిరేకతా తుఫానులు ఆయన్ను పడగొట్టే ప్రయత్నాలు చేశాయని, దైవప్రవక్త (స) మరియు ఆయన అల్పసంఖ్యలోవున్న సహచరులకు విజయం పొందే సూచనలు ఎక్కడా కానరాలేదని, ఆ సమయంలోనే అల్లాహ్ ఆయనకు ధైర్యం చెబుతూ, సాంత్వన చేకూర్చడానికి అనేక ఖుర్‌ఆన్ ఆయత్‌లను అవతరింపజేశాడనే విషయం మనకు తెలిసిందే.

జుహా సూరాలో ఇలా సెలవియ్యడం జరిగింది:

وَلَلْآخِرَةُ خَيْرٌ لَّكَ مِنَ الْأُولَىٰ ۝ وَلَسَوْفَ يُعْطِيكَ
رَبُّكَ فَتَرْضَىٰ ۝

"నిశ్చయంగా రాబోయే కాలం నీ కొరకు గత కాలంకన్నా మేలైనదిగా ఉంటుంది. త్వరలోనే నీకు నీ ప్రభువు నీవు సంతోషపడేంత అధికంగా ప్రసాదిస్తాడు."

وَرَفَعْنَا لَكَ ذِكْرَكَ

"నీ కొరకు నీ పేరు ప్రఖ్యాతులను ఇనుమడింపజేశాము."

అంటే శత్రువులు నిన్ను దేశం మొత్తంలో చెడ్డవానిగా ప్రచారం చేస్తున్నారు. కాని మేము వారికి వ్యతిరేకంగా నీ పేరుప్రఖ్యాతులను వెలుగొందేటట్లు చేయడానికి, నీకు ప్రఖ్యాతిని కలిగించడానికి అన్ని సదుపాయాలను చేసి ఉంచాము అని అర్థం. ఆ తరువాత...

فَإِنَّ مَعَ الْعُسْرِ يُسْرًا ○ إِنَّ مَعَ الْعُسْرِ يُسْرًا ○

"కష్టాలతోపాటు తప్పనిసరిగా సుఖాలు కూడా ఉన్నాయి. ఇందులో ఎలాంటి సందేహం లేదు. కష్టాలతోపాటు తప్పనిసరిగా సుఖాలు ఉన్నాయి." అని అంటే, ఆ నాటి పరిస్థితుల పీడనకు భయపడి పోకు. త్వరలోనే ఈ కష్టాలు గట్టెక్కనున్నాయి. విజయ పరంపరల ఓ కాలం రానుంది అని చెప్పడం అన్నమాట.

ఇలాంటి పరిస్థితుల్లోనే కౌసర్ అధ్యాయం అవతరించింది. దాన్ని అవతరింప జేసి అల్లాహ్ దైవప్రవక్త (స)కు ధైర్యం చెబుతూనే ఆయన (స) శత్రువులు నామ రూపాల్లేకుండా పోతారనే భవిష్యవాణిని కూడా చేశాడు. ఖురైష్‌కు చెందిన తిరస్కారులు ముహమ్మద్ (స) మొత్తం జాతినుండే వేరైపోయాడు, ఆయన ఇప్పుడు ఒంటరివాడై నిస్సహాయుడైన వ్యక్తిగా మిగిలిపోయాడు అని హేళన చేసేవారు. ఇక్రమా (ర)గారి ఉల్లేఖనం ప్రకారం, దైవప్రవక్త (స)కు ప్రవక్త పదవి లభించిన తరువాత ఆయన ఖురైష్ ఎదుట దైవసందేశాన్ని ప్రకటించ నారంభించగా, ఖురైషీలు, "ముహమ్మద్ (స) తన జాతి నుండే వేరైపోయాడు" అని చెప్పేవారు. (ఇబ్నె జరీర్)

అంటే ముహమ్మద్ (స) తన జాతి నుండి వేరైపోయి వేళ్ళతో సహా ఊడబెరికిన చెట్టులా మారిపోయాడు, కొంతకాలం అయిన తరువాత అది సుష్కించి మట్టిలో కలిసిపోతుంది అని అర్థం. ముహమ్మద్ ఇబ్నె ఇస్‌హాఖ్ కథనం ప్రకారం, మక్కా సర్దారు అయిన ఆస్ బిన్ వాయిల్ సహ్మీ ఎదుట దైవప్రవక్త (స) గారి ప్రస్తావన వస్తే అతను, "పోనిద్దురూ! అతను ఓ ఊడబెరికిన చెట్టు (అబ్తర్), అతనికి యే మగ సంతానమూ లేదు. చనిపోతే ఆయన పేరును తలిచేవాడూ ఉండడు" అని ఎగతాళి చేసేవాడు. షమర్ బిన్ అతియా కథనం ప్రకారం, ఉక్బా బిన్ అబీ ముఅయిత్ కూడా ఇలాంటి ప్రలాపనలే తరుచూ చేసేవాడు. ఇలాంటి మాటలనే అబూ లహబ్ కూడా దైవప్రవక్త(స) గారి కుమారుడు చనిపోయినప్పుడు, 'ఇక ముహమ్మద్ వ్రేళ్ళు తెగిపోయాయి" అని అనడం జరిగింది.

దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) పై కౌసర్ సూరా అవతరించినప్పుడు నెలకొని ఉన్న అతి గడ్డు పరిస్థితి అది. ఖురైష్ తెగవారు ఆయనపై తిరగబడినది, ఆయన (స) కేవలం అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించడం, వారి బహుదైవారాధనను బాహాటంగా ఖండించినందుకే. ఆ కారణంగానే, దైవదౌత్యం రాకపూర్వం జాతి మొత్తం మీద ఆయన పట్ల ఉన్న గౌరవాన్ని ఆయన్నుండి లాక్కోవడం, ఆయన్ను హింసించడం జరిగింది. అదేకాదు ఆయన తన కుమారుడు, చనిపోయినందుకు దుఖసాగరంలో మునిగిపోయినప్పుడు బంధువులు, కుటుంబీకులు, ఆయన తెగకు చెందినవారు, పొరుగువారు సైతం ఆయన్ను ఓదార్చే బదులు సంబరాల్లో మునిగిపోయారు. ఓ గౌరవనీయుని మనస్సును నొప్పించే మాటలతో ఆయన్ను ఎత్తిపొడవడం జరిగింది. ఇదివరకు ఇతరులతో సద్వర్తనగా మెలుగుతున్న ఆయన్ను మనస్తాపానికి గురిచేశారు. ఈ నేపథ్యంలో అల్లాహ్ ఓ క్లుప్తమైన సూరాలోని ఒకే ఒక వాక్యంలో, ప్రపంచంలోని మరే వ్యక్తికి వినిపించని శుభవార్తను వినిపిస్తూ, మిమ్మల్ని వ్యతిరేకించేవారే వ్రేళ్ళతో సహా పెకిలించబడడం ఖాయం అని ఓదార్చడం జరిగింది.

మహాప్రవక్త (స) దైవధర్మం సందేశాన్ని ప్రచారం చేస్తూ దాని పరిపూర్తికి కష్టబడుతున్న పరిస్థితులివి. రాబోయే కాలంలోను ఎవరైతే ఈ సందేశ ప్రచారం బావుటాను ఎగుర వేస్తారో ధర్మంకోరే ఈ డిమాండ్లన్నిటిని నిర్వర్తించవలసి ఉంటుంది.

అధ్యాయం-2

పరీక్షా సమయంలో స్థిరచిత్తప్రదర్శన

తొలిపలుకులు

ఏ జీవన వ్యవస్థ అయినా సరే, అది కేవలం ఊహాలోకాల్లో మట్టుకే విహరిస్తున్నప్పుడు లేదా కేవలం తన సిద్ధాంతాలనే ప్రచారం చేస్తున్నప్పుడు, అధికార పీఠం సాధారణంగా దాని ఉనికిని పసిగట్టలేదు. పసిగట్టినా దాని గురించి అంతగా పట్టించుకోదు కూడా. చివరికి మెల్లమెల్లగా ఆ జీవన వ్యవస్థ దివ్వె చుట్టూ దీపపు పురుగులు వచ్చి చేరుతుండడం, ఆ చేరడం కూడా అసాధారణమైన పరిస్థితులను ఏర్పర్చి, వ్యవహారాల విషయంలో జోక్యం కలుగజేసుకుంటున్నప్పుడు అధికార పీఠం సావధానమైపోతుంది. ఓహో! ఈ అడవిలో మరో పులి కూడా పెరుగుతోంది, దాన్ని అంతమొందించకపోతే మన రాజధానికే ముప్పు వాటిల్లేలా ఉందని గ్రహిస్తుంది. కాబట్టి అది తన పంజాల వాడి గోళ్ళన్నిటిని బయటకు తీసి దానిపై విరుచుకుపడుతుంది. ఇక్కడి నుండే ఉద్యమం యొక్క పరీక్షా సమయం ఆరంభం అయ్యేది. ఇక్కడి నుండే సందేశ ప్రచారం ఓ క్రొత్త మలుపు తిరుగేది. ఇక్కడి నుండే ఈ క్రొత్త ప్రయాణీకుల సమూహం (కార్వాన్) అన్నిటికంటే కష్టతరమైన మజిలీలో ప్రవేశించేది. ఇక్కడి నుండే ఓ క్రొత్త చరిత్రాధ్యాయం ప్రారంభం అయ్యేది. మనిషి తాను ఈ క్రొత్త మూసలో పోతపోయబడాలా వద్దా? ఇది వరకు తాను పోతపోయబడి ఉన్న ఆ పాత మూసను పగులగొట్టాలా లేదా? అనే నిర్ణయం గైకొనే కాలం అది.

పరీక్షా సమయం

పరీక్షలకు సంబంధించిన ఈ కాలంలో దైవాదేశాలకు అనుగుణంగా నడిచే ఉద్యమాలు మరియు మానవ మేధపై ఆధారపడి నడిచే ఉద్యమాల సహన శక్తిలోగల తేడా కొట్టొచ్చినట్లుగా అగుపడుతుంది. ఈ కాలమే ఆ తేడాను మరింతగా అగుపడేటట్లు చేస్తుంది. నైతిక విలువల సంస్థాపన కోసం పాటుబడే విప్లవాల మీద వైపరీత్యాల తుఫానులు విరుచుకుపడినప్పుడు దానికి సంబంధించిన కార్యకర్తలు తమ స్వామి, ప్రభువు అయిన అల్లాహ్‌పై మరింత భారం వేస్తారు. ఈ సృష్టికర్తకు

వారు మరింతగా చేరువైపోతారు. తమ ధ్యేయసాధన, తమ లక్ష్యం పట్ల వారు ఎంత లోతైన సంబం ధాలు కలిగి ఉన్నారనే విషయాన్ని వారి ప్రభువు, ఈ కడగండ్ల రూపంలో వారిని పరీక్షిస్తున్నాడనే భావన కలిగి ఉంటారు. వారిపై వచ్చి పడుతున్న ఈ కష్టాల పరంపర వారిని కడతేర్చడానికి కాకుండా, వారిలో ఉన్న కల్మషాన్ని తీసివేయడానికి తమను పరీక్షల కొలిమిలో వేసి మండించి కుందనంగా మారుస్తు న్నాడని విశ్వసిస్తారు. ఇలా చేయడం వలన వారి చొక్కా చెరుగులపై పడిన సొంత కోరికలు, ప్రాపంచిక ఆకాంక్షల మరకలన్నీ తొలిగిపోయి హృదయ ఫలకంపై కేవలం ఒకే ఒక దేవుని ఆరాధనా గురుతు తప్ప మరే గురుతు ఉండకుండా ఉంటుందని భావిస్తారు. ఈ కారణం వల్లనే ఇలాంటి ఉద్యమకారులపై ఎలాంటి ఆపద, పరీక్ష వచ్చిపడ్డప్పుడు వారు నిరాశా నిస్పృహలు, అపజయం భావాలకు అతీతంగా చిత్తశుద్ధితో వారు యే మార్గంపై తమ ఆలోచనలను, తమ మేధను పడవేయడం జరిగిందో ఆ చిత్తశుద్ధితోనే వారు తమ సహజమైన బలహీనతలకు అతీతంగా ఉండగలుగుతారు. ఇంకా చెప్పాలంటే, సాధారణంగా ప్రపంచంలో చెలామణిలో ఉన్న జయాపజయాలను తూచే ఏ ప్రమాణం (త్రాసు) కూడా వారికి పనికి రాదు. వారు చూసేదల్లా తమ లక్ష్యసాధన కోసం వారు ఎంత వరకు త్యాగం చేశారన్నదే. ఏ మేరకైతే వారు పోగొట్టుకుంటారో ఆ మేరకే వారు తమ లాభాల ఖాతాలో జమ చేసుకుంటూ ఉంటారు. ఈ మార్గంలో వారు పోగొట్టుకున్న మేరకు వారిపై ఉన్న బరువు, భారమూ తగ్గిపోతుందని తలపోస్తారు.

ఎంత మేరకైతే అప్పగింత బరువు తగ్గుతుందో అంతమేరకు వారిపై ఉన్న భారం తగ్గిందని భావిస్తారు. చివరికి, ఒకవేళ ఈ మార్గంలో వారి ప్రాణాలు పోతున్నా, చివరి క్షణాల్లో వారి పెదవుల నుండి వెలువడే పదాలు ఇలా ఉంటాయి:

"ప్రాణాలను అర్పించాము. ఆ ప్రాణాలు కూడా ఆయన ప్రసాదించినవే. నిజం చెప్పాలంటే మేము బాధ్యతను నెరవేర్చవలసి ఉండిందో ఆ మేరకు ఆ బాధ్యతను నెరవేర్చలేకపోయామే!" అనే పశ్చాత్తాపంతోనే ప్రాణాలు వదులుతారు.

పరీక్షలు, కష్టాల పరంపర వారిని నలువైపుల నుండి చుట్టుముట్టినప్పటికీ, ఓ వైపు వారు శరణాగత రక్షకుడైన అల్లాహ్ ఎదుట, తమకు హృదయ సాత్వనను, మనశ్శాంతిని చేకూర్చమని, ఆ మార్గంలో మమ్మల్ని స్థిరంగా ఉంచమని వేడు కుంటారు. వారి ఈ పరిస్థితిని గమనించే మరోవైపు వారు ఓ రకమైన అసూయకు లోనౌతూ, మేము కూడా మాకు ప్రియమైన ఆ మార్గంపై ఎందుకు నడవలేకపోయాము? మా ప్రభువు మమ్మల్ని కూడా వాటికి అర్హులైనవారిగా చేస్తే ఎంత బాగుండేది? మా మార్గంలోనూ కడగండ్ల ముళ్ళు ఎందుకు పర్చబడలేదు? మమ్మల్ని కూడా వారిలా హేళనకు గురిచేస్తే, మా రక్తం కూడా ఆ మార్గాన్ని తడిపేస్తే, ఆ మార్గంపై నడిచిన

నేరానికి మా వక్షస్థలం కూడా రక్తసిక్తమైపోతే ఎంత బాగుండు! అనే కోరికను వెల్లడిస్తారు. అలాగే వారి ఈ తపన వారిని పడకలపై పడుకోనివ్వదు. తమ ప్రియప్రవక్త (స) గారి మార్గంలో పరచబడిన ముళ్ళు తమ మార్గంలోనూ ఎందుకు పర్చబడలేదు? ఆయన మార్గాన్ని అనుసరించడం వలన సంక్రమించిన కష్టాలన్నీ యే అనర్హత వలన తమకు లభించలేకపోయాయి? ఒకవేళ తమను అసమర్థులుగా భావించడం జరగలేదు కదా? అనే అనుమానాలకు లోనౌతూ ఉంటారు.

పరీక్షల కాలం ఓ విధంగా ఉద్యమ కార్యకర్తలను వడబోసే కాలం అని చెప్పవచ్చు. ఓ రైతు ఎలాగైతే తన పంట కల్లాలలో ధాన్యపు కంకుల్ని వేసి త్రొక్కించి ధాన్యాన్ని, తాలుతప్పల్ని ఎలా వేరు చేస్తాడో అదే విధంగా పరీక్షలు, కడగండ్ల పరం పర ధ్యేయసాధన కోసం శ్రమిస్తున్న కార్యకర్తలను నూర్చి, నురిపిడిచేసి తూర్పారబట్టి ధాన్యం, తాలుతప్పల్లా; లక్ష్యసాధనలో చిత్తశుద్ధిగలవారిని మరియు అవకాశవాదు లను వేరుచేసి పారేస్తుంది. కష్టాల ఈ కొలిమి, ఉద్యమంలోని పూర్తి కల్తీనీ పాగొట్టి స్వచ్ఛమైన మేలిమిని ప్రస్ఫుటం చేస్తుంది. ఇది శరీరంలోని చెడు రక్తపు కల్మషాన్ని బయటకు తీసి శుద్ధమైన రక్తం మాత్రమే ప్రసరించేటట్లు చేస్తుంది. ఈ దశలో ప్రవేశించిన ఉద్యమం, ఓ రోగి రోగం తగ్గిపోయిన తరువాత ఆరోగ్య స్నానం చేసి హుషారుగా తన పడకపై నుండి లేచినట్లు ఓ క్రొత్త శక్తిని పుంజుకొని ముందుకు పురోగమిస్తుంది. ఈ కొలిమి నుండి బయటకు వచ్చిన బంగారు పూత ఆభరణాలు మరియు మేలిమి బంగారు ఆభరణాలు ఒకే షోకేసులో ఉండలేవు. ఆ రెంటి విలువ ఏమిటో ఖరారు చేయబడుతుంది. వాటి స్థాయి ప్రకారమే ఆ రెంటి స్థానాలు, సింగారాలు వేరుగానే ఉంటాయి.

చరిత్రలో నేటి వరకు ఎవరైనా 'అనల్‌హక్' (నేనే సత్యాన్ని) అనే నినాదం లేవదీస్తే అతని ముందు బలిపీఠం ప్రత్యక్షం కాకపోవడం జరగలేదు. ఎవరైనా నదీ ప్రవాహానికి వ్యతిరేక దిశలో ఈదడానికి ప్రయత్నిస్తే పరిస్థితుల నదీ ప్రచండ కెరటాలు అతణ్ణి తన వెంట కొట్టుకొనిపోకుండా ఉండలేదు. విగ్రహారాధనాలయాల నియమ నిబంధనలను అతిక్రమించిన వాణ్ణి అగ్నిలో బడవేయకుండా ఉండడం జరగలేదు. ఎప్పుడైనా అలాంటి తెగువకు ఎవరైనా పాల్పడితే, అప్పటి సూపర్ పవర్లు అతని మార్గాన్ని అడ్డగించడానికే ప్రయత్నించాయి. జీవన్మరణాల సమస్యలను సృష్టించి ప్రాణాంతకమైన ఎదురు దాడికి దిగాయి. ఓసారైతే క్రొత్త భావాల ధ్వజవాహకులను తమ దమన నీతి ఉచ్చులో బిగించి వారి రక్తాన్నంతటినీ పీల్చి వేయడమూ జరిగింది.

అసత్యం బహుశా కల్తీని కూడా సొంతం చేసుకొనే స్థితిలో ఉంటుంది. ఎందు కంటే అది అసత్యపు పునాదులపైన్నే లేచింది గనుక. జీవితంలోని తప్పుడు కోణాలను ప్రదర్శించడానికే అది ప్రయత్నం చేస్తుంది. జీవితాన్ని సక్రమ మార్గం నుండి తప్పించే

సమస్యల్నే అది సృష్టిస్తుంది. అదే కాకుండా అసత్యం మరియు భ్రష్టుపట్టిన ఆలోచనలకు, మంచీ-చెడు; మేలిమి-కల్తీలను పరీక్షించేటంత సున్నిత ఔత్సుక్యము గాని, అంత ప్రావీణ్యంగాని ఉండవు. విచక్షణా జ్ఞాన రాహిత్యం కారణంగా దాని పౌరుషం, ఆత్మాభిమానాలు కూడా అంత దృఢంగా ఉండవు. అది తన బలప్రదర్శన కోసం, తన దండు సంఖ్యను పెద్దగా చూయించేందుకు కర్ర దుంగలకు సైతం యూనిఫాము తొడిగి యుద్ధరంగంలో దించగలదు. వారి ఆగడాలకు బలైన వారి భుజాలపై తన తుపాకుల్ని పెట్టి బెదిరించగలదు. కాని సత్యం మట్టుకు, తన మౌలిక సిద్ధాంతాలతో ఏకీభవించకుండా కేవలం తన అధికారాన్ని బలపరిచేవారు లేదా దానియందు విశ్వాసం ప్రకటించే ప్రజల సైనిక సేవలను సైతం తిరస్కరించేటంత సూక్ష్మదర్శి. బలవంతం అనే ప్రశ్నే ఉత్పన్నం కాదు. ఇక్కడ చూడబడేదల్లా మొగ్గు, తపన, దీక్షాదక్షతలు. అంతకంటే అధికంగా, ఆ సిద్ధాంతాల పట్ల అతని వెర్రి, మోహోద్రేకాలు. ఈ సిద్ధాంతాల పట్ల ఎవరి వెర్రి అయితే అధికంగా ఉంటుందో అతడే మేలిమి అయినవాడు.

తన నిత్య జీవితపు వ్యవహారాల్లో మిత్రుడెవరో, శత్రువు ఎవరో తెలుసుకునే దూరదృష్టి, విచక్షణా జ్ఞానాన్ని వాటిని పరీక్షించే గీటురాయిని కలిగి ఉంటాడు మనిషి. సాధారణమైన ఓ మిత్రత్వం కోసం అతను ఓ వ్యక్తిలో త్యాగనిరతి, చిత్తశుద్ధి, సానుభూతి మరియు అవసరం బడినప్పుడు తనను ఆదుకొనే భావోద్రేకాలు అతనిలో ఉన్నాయా? లేదా అనే విషయాలను పరిక్షించి చూసుకుంటాడు. ఓ మామూలు సరుకు కొనే ముందు ఆ సరుకును అనేకమార్లు మరీ పరీక్షించి తాను చెల్లించే ధర సరైందా కాదా అనే విషయాన్ని బేరీజు వేసుకుంటాడు. ఆ సరుకు ఒరిజినలు సరుకే, తాను చెల్లించబోయే సొమ్ముకు దానికి సరిపడినదే అని తలచినప్పుడే ఆ సరుకును కొంటాడు. అలా కాకుండా తాను పెట్టే డబ్బుకు సరితూగని సరుకు అయితే దాన్ని వదిలేస్తాడు. మరి సత్యం అంత అమాయకమైనదా? అన్ని రకాల ఒరిజినల్, డూప్లికేటు తేడా లేకుండా సరుకు మొత్తాన్ని తన సంచిలో వేసుకోవడానికి? ప్రతి మనిషిని నమ్మి అతనితో స్నేహసంబంధాలు పెంచుకోడానికి తొందర ఎందుకు పడుతుంది? ఓ సాధారణ మనిషి రేపటి పరిణామాలను దృష్టిలో ఉంచుకొని, స్నేహం చేసే ముందు, మరో మనిషిని పరీక్షించడం, అవసరం వచ్చినప్పుడు ఆదుకొనే సుగుణాన్ని చూడ్డం లాంటి సుగుణాలను చూసే స్నేహం చేస్తున్నప్పుడు, ప్రపంచంలోనే అత్యుత్తమమైన బుద్ధివివేచనాలు, ఆత్మాభిమానాలు గల సత్యం అలా పరీక్షించకుండా ఎందుకు స్నేహం చేస్తుంది? అందుకే దివ్యఖుర్‌ఆన్‌లో ఇలా సెలవియ్యబడింది:

"స్వర్గ ప్రవేశం ఊరకే లభిస్తుందని మీరు అపోహపడుతున్నారా? మీకు పూర్వం విశ్వాసులకు సంభవించినవన్ని ఇంకా మీకు సంభవించలేదే! వారిపై ఆపదలు, ఎనలేని వ్యధలు విరుచుకుపడ్డాయి, వారు కుదిపివేయబడ్డారు. చివరకు

అప్పటి ప్రవక్త, విశ్వాసులైన అతని అనుచరులు "అల్లాహ్ సహాయం ఇంకా ఎప్పుడొస్తుంది" అని ఆక్రోశించారు. (బఖర:214)

"మీరు ఊరికే వదిలిపెట్టబడతారని అనుకుంటున్నారా? వాస్తవానికి మీలో (తన మార్గంలో) ప్రాణాలొడ్డి పోరాడినవారు ఎవరో, ఇంకా, అల్లాహ్‌ను, సందేశకుణ్ణీ, విశ్వాసులనూ తప్ప మరెవ్వరినీ ఆప్తమిత్రులుగా చేసుకోని వారెవరో ఇంకా అల్లాహ్ చూడనేలేదు. మీరు ఏది చేస్తారో అది అల్లాహ్‌కు తెలుసు." (తౌబా:16)

"కేవలం మేము విశ్వసించాము" అని అన్నంత మాత్రాన్నే వారిని వదిలి వేయటం జరుగదనీ, వారిని పరీక్షించటం జరగదనీ ప్రజలు భావిస్తున్నారా? వాస్తవానికి మేము వారికి పూర్వం గతించినవారందరినీ పరీక్షించాము, అల్లాహ్‌కు సత్యవాదులెవరో, అసత్యవాదులెవరో తప్పనిసరిగా చూడవలసి ఉంది." (అల్ అన్‌కబూత్:1)

కాబట్టి, అల్లాహ్ మార్గంపై నడవడం అంటే పూలబాటపై నడవడం కాదని, అది ముళ్ళపొదలతో నిండిన కీకారణ్యంలో అడుగుపెట్టడం లాంటిదని, ఈ అరణ్యపు ముళ్ళపై పాదాలు మోపే అసలు లక్ష్యాన్ని, గమ్యాన్ని చేరుకోవడం అనే యదార్థాన్ని తేటతెల్లం చేయడం జరిగింది. దైవప్రవక్త(స) గారి ప్రవచనం ఇలా ఉంది:

"ఎవరి పాదాలైతే అల్లాహ్ మార్గంలో దుమ్ముకొట్టుకుపోతాయో ఆ పాదాలకు నరకాగ్ని సోకదు."

ఇక్కడ దుమ్ముకొట్టుకుపోవడం అంటే కేవలం పాదాలపై దుమ్ము పడడమే కాదు, అల్లాహ్ మార్గంలో కష్టాలను ఎదుర్కొంటు ఆ మార్గంలో పురోగమించాలని. తన యదార్థమైన లక్ష్యసాధనకు నిరంతర కృషి చేయడం అని.

హజ్రత్ ఖబ్బాబ్ (ర)గారి ఉల్లేఖనం ఇలా ఉంది:

"మేము దైవప్రవక్త (స)గారి సన్నిధిలో మా కష్టాల గురించి ఏకరువు పెట్టాము. అప్పుడాయన కాబా గృహం నీడలో తన దుప్పటిని మెత్తగా చేసుకొని మేను ఆనించి కూర్చుని ఉన్నారు. మక్కా ముష్రిక్‌ల ఆగడాలను ఎదుర్కొంటున్న రోజులవి. మేము ఆయనతో "దైవప్రవక్తా! తమరు మా కోసం (అల్లాహ్) సహాయాన్ని వేడరా?" అని అడిగాము.

అప్పుడాయన ఇలా సెలవిచ్చాడు:

"మీకు పూర్వం గతించిన వారి పరిస్థితి ఎలాగుండిందో చూశారా? ఓ విశ్వాసిని పట్టుకొని భూమిని త్రవ్వి అతణ్ణి అందులో (నిలువునా) పాతేవారు. ఆ తరువాత రంపం తెచ్చి అతని తలపై పెట్టడం జరిగేది. (అలా దానితో) అతణ్ణి రెండు ముక్కలుగా చీల్చి వేసేవారు. మాంసం మరియు ఎముకల్లో ఇనుప దువ్వెనలు గ్రుచ్చి (అతని మాంసాన్ని ఎముకల్ని వేరు చేయడానికి) దువ్వేవారు. అయినప్పటికి ఇదంతా అతణ్ణి

సత్యధర్మం నుండి వెనక్కు మరలేటట్లు చేయలేకపోయేది. దైవసాక్షిగా చెబుతున్నాను మీరే చూస్తారు, అల్లాహ్ ఈ కార్యాన్ని సంపూర్ణంగావిస్తాడు. చివరకు ఓ బాటసారి తన స్వారీపై ప్రయాణం చేస్తూ యమన్‌లోని 'సన్‌ఆ' నుండి 'హజర్‌మౌత్' వరకు (నిరాటంకంగా) ప్రయాణం సాగిస్తాడు, అతనికి దైవభీతి తప్ప, అతని గొర్రెలపై తోడేలు విరుచుకుపడుతుందేమో అనే భయం తప్ప మరెవ్వరి భయమూ ఉండదు. కాని మీరు తొందరపడుతున్నారు."

మొత్తానికి, ఎవరైనా ధర్మసంస్థాపన లాంటి అత్యున్నత లక్ష్యం కోసం నడుంబిగించగా, అతను ఏ మేరకు ఆ కార్యంలో చిత్తశుద్ధి కలిగి ఉన్నాడు? తన సర్వస్వాన్ని ఎంతవరకు పణంగా పెట్టడానికి సిద్ధపడ్డాడు? అనే విషయాన్ని పరీక్షించక పోవడం జరుగుతుందా? అతనికి ఎంతమట్టుకు ఆ కార్యం పట్ల ఉత్సాహం ఉంది? తను ఎంతవరకు తన మనోవాంఛలను త్యాగం చేయగలడు అనే విషయాన్ని బేరీజు వేయడం జరగదా? కనుక, సత్యమార్గంలో కృషి చేసినవారి ఘనకార్యాలనేవైతే చరిత్ర భద్రపరిచిందో ఆ ఘనకార్యాలను పరిశీలించి చూస్తే మనకు అగుపడేది కేవలం వారిపై జరిగిన దౌర్జన్యాలు, జరిగిన హత్యాకాండ, పడిన మరణదండనలే. ఈ పరీక్షలో నెగ్గకుండా ఎవరైనా ఆ మార్గంపై ముందడుగు వేయదలిస్తే వారికి ఆ మార్గంపై నడిచే అనుమతి పత్రం మాత్రం ఇవ్వడం జరగలేదు. మొత్తానికి మనకు తెలిసే దేమిటంటే, ఈ మార్గంలో దైవదాసులు ఏ సంక్లిష్టమైన పరీక్షలకు గురయ్యారో ఆ పరీక్షలు చరిత్రలోని స్వర్ణాధ్యాయాలుగా నిలిచాయి. ప్రళయదినాన మానవత్వం వాటిని గర్వంగా తీర్పు దినాధిపతి అయిన సర్వేశ్వరుని ఎదుట ప్రవేశపెడ్తుంది.

స్థిరత్వం

హజ్రత్ నూహ్ (అ) తొమ్మిదివందల ఏళ్ళ వరకు చేసిన సత్యసందేశ ప్రచారం గురించి ఎవరికి తెలియదు? ఆ ప్రచారం మత్తును అయన తొమ్మిది వందల యాభై ఏళ్ళ వరకు తన జాతిలో నిరంతరంగా ప్రచార కార్యక్రమాన్ని కొనసాగించారు. ఉత్తమ విప్లవాన్ని సాధించడానికి కావలసిన మార్గాలన్నీ మూసుకుపోయినప్పటికీ ఆయన సహన శక్తి సన్నగిల్లలేదు. ఓ జాతి ప్రజలకు ఒకే ఒక సత్యసందేశాన్ని తొమ్మిదివందల ఏండ్లవరకు అందించడం, రాళ్ళతో బాధించబడడం, ఉన్మాదిగా, పిచ్చివానిగా పిలువబడడం అనేది సత్యం పట్ల అభిరుచిని, లోతైన సంబంధాన్ని తెలియజేసే ఓ మహోన్నతమైన విషయం. ఇలాంటి ఉదాహరణ చరిత్రలోనే అగుపడదు.

హిమాలయాల్లాంటి సహనశక్తికి వ్యతిరేకంగా ఏ మానవ ప్రయత్నమూ సఫలం కాలేదు. దైవశిక్ష ఆ భూభాగాన్ని ముంచివేసినంతవరకు ఆయన ప్రయత్నం కొనసాగింది. తుఫాను వస్తుంది. సత్య ప్రచార ఆ కృషీవలుని నిరంతర కృషి ముందు పూనిక

పుల్లకంటే అధిక విలువలేనటువంటి వారు ఆ తుఫాను వెల్లువలో మునిగి పోనారంభిస్తారు. వారిలోనే ఆయన కుమారుడు కూడా ఉన్నాడు. అతను నూహ్ (అ) ఇంట పుట్టి పెరిగి యువకుడైనప్పటికీ ఆయన కళ్ళముందే జలసమాధి అయి పోతున్నాడు.

కుమారుడు మునిగిపోతూ ఉండగా చూసిన నూహ్ (అ), "కుమారా! నీవు కూడా మా వెంట పడవలోనికి ఎక్కేయ్. ఈ రోజు దైవక్రోధం నుండి ఏదీ నిన్ను రక్షించజాలదు" అని కేక వేసి పిలిచారు.

దీనికి దైవం 'నూహ్! నీ పిలుపు సక్రమమైనది కాదు. అతను ఓ చెడిపోయిన వ్యక్తి. అతను నీ కుమారుడు ఎలా అవుతాడు?' అని హెచ్చరించాడు. ఆ హెచ్చరికకు ఆ మహోన్నత తపస్వి భయకంపితుడై, "అయ్యో! నేను నా కుమారుని పట్ల ఆ మాత్రం ప్రేమానురాగాలను ఎందుకు ప్రదర్శించాను? అతనికి సత్యధర్మంతో ఎలాంటి సంబంధం లేదే" అంటూ క్షమాపణ కొరకు దేవుని సన్నిధిలో సాష్టాంగపడ్డాడు. తండ్రి కళ్ళ ముందు కుమారుడు జలసమాధి అయిపోతున్నా అదేమీ పట్టించుకోకుండా ఆయన, దైవం తలచని దాన్ని తానెందుకు తలచినట్లు? అని పశ్చాత్తాపంలో మునిగిపోయాడు. అసలు బంధుత్వం కేవలం దైవం నిర్ణయించిందే. ప్రజలు అనుకునేది బంధుత్వం కాదు అని తలపోయనారంభించారు.

దేవుని హక్కు

హజ్రత్ ఇబ్రాహీం (అ), దైవత్వపు దావాదారుడైన ఓ ఉన్మాది, గర్విష్టిని, "నా ప్రభువు సూర్యుణ్ణి తూర్పు దిక్కు నుండి ఉదయింపజేస్తున్నాడు, నీకు చేతనైతే దాన్ని పడమర నుండి ఉదయింపజెయ్యి" అని సవాలు విసిరినప్పుడు అతను తెల్లమొహం వేసుకున్నాడు. దానికి ప్రతిగా అతను ఇబ్రాహీం (అ)ను ఇరాక్ భూభాగం లోనే ఉండకుండాజేశాడు. ఆయన్ను అగ్నిగుండంలో పడవేసే ప్రణాళికలు సిద్ధ మయ్యాయి. దైవత్వపు దావాదారులను అయోగ్యులుగా, హేయమైనవారిగా తలచి నిర్లక్ష్యం చేసినందుకు ఫలితంగా ఆయనకు ఎదురైన పరీక్షలివి. ఆయన కుటుంబానికి కుటుంబమే కందిరీగల తుట్టెగా మారిపోయింది. జాతికిజాతే ఆయన్ను మట్టు పెట్టేందుకు ముందుకు ఉరికింది. అగ్నిగుండంలోను విసిరి వేయబడ్డాడాయన. చివరికి తన దేశాన్నే వదిలేసి పరాయి దేశానికి వలస వెళ్లిపోయారు. దేశదిమ్మరిగా తిరిగే ఆ సుదీర్ఘ కాలంలో, తన కుమారుణ్ణి బలి ఇవ్వమనే ఆదేశం అందింది. దైవాదేశం మేరకు కన్న తండ్రి తన కుమారుని గొంతు కోయడానికి కత్తినూరాడు. తన కుమారుడి కాళ్ళు చేతులు కట్టేసి అతణ్ణి బోర్లాపడుకోబెట్టాడు. ఈ సంఘటన జరిగింది ఓ తన దేశం కాని దేశంలో. ఆయన బంధువులుగాని, మిత్రులుగాని ఎవరులేని చోట. ఆకాశం క్రింద జరిగిన మొట్టమొదటిదీ చివరిదీ అయిన సంఘటన

ఇది. విశ్వం అంతా ఊపిరి బిగబట్టి, ఇలా కూడా జరుగుతుందా? అని అచ్చెరువొంది చూసిన సంఘటన అది. దేవుని రాజ్యంలో కల్లోలాన్ని సృష్టించే యే అపనింద అయితే మానవ జాతిపై మోపడం జరిగిందో ఆ జాతికి చెందిన ఆ మానవ మాత్రుడే దైవప్రసన్నత పొందడానికి, ఆయన ప్రేమానురాగాలు పొందడానికి తన కన్న కుమారుని గొంతుపై కత్తి త్రిప్పేందుకు సిద్ధమవగలడా? దైవవిధేయత, ఆయన ప్రేమ మార్గంలో ఆయన చేతులు వణకలేదు, బెణకలేదు. ఆయన గొంతు జీరపోవడంగాని, అయనవెనక్కు తగ్గడంగాని జరగలేదు. కత్తి మెడపై కదలాడింది కూడా. మానవ చరిత్రలోనే ఇది ఓ అసాధారణ ఘట్టం. కదలాడిన కత్తి, ఆదం కుమారుడు దైవవిధేయతలో ప్రతి బంధుత్వంపై, ప్రతి ప్రియమైన వస్తువుపై చివరికి విశ్వంలోని ప్రతి సొత్తుపై కత్తిని త్రిప్పగలడు అని రుజువు చేసింది. మానవత్వం, సత్య ధర్మ మార్గంలో త్యాగం చేసే ఓ కొలమానాన్ని ఖరారు చేసింది. మానవత్వం సతతం గర్వించదగ్గ కొలమానం అది. ప్రియుని తరఫున వచ్చే ప్రతి పరీక్షలో తన జీవిత సర్వస్వాన్ని త్యాగంచేసే విధానాన్నే ఓ విశ్వాసి అనుసరిస్తాడు. ఆ మార్గంపై స్థిరంగా, నిలకడగా ఉండాలనే దేవుణ్ణి కోరుకుంటాడు. రాబోయే పరీక్షలో స్థయిర్యాన్ని ప్రదర్శించడమే ఓ విశ్వాసి వైఖరి.

హజ్రత్ మూసా (అ), ఆయన అనుచరులు కూడా ఓ సుదీర్ఘమైన కష్టాల పరంపరకు లోనయ్యారు. ఆ కష్టాల పరంపర శిక్ష ఏ మాత్రం కాదు. అది కేవలం వారిని పరీక్షకు గురిచేయటం మాత్రమే. అదేగనక శిక్ష అయితే దైవప్రవక్తలకు ఎందుకు ఎదురౌతుంది? కాని యదార్థం ఏమిటంటే, ఏ దైవదాసుడు దైవానికి ఎంత ప్రియమైన వాడయ్యాడో అతనికి ఆ మేరకే కష్టాలు ఎదుర్కొవలసి వచ్చింది. అతని స్థాయి, హోదా ఎంత ఉన్నతమైందో అతనికి పెట్టే పరీక్ష కూడా అంతే తీవ్రంగా ఉంది. హజ్రత్ మూసా (అ) మరియు ఆయన సహచరులను ఫిర్ఔన్ ఈజిప్టు భూభాగంలోనే ఉండకుండా చేశాడు. బనీ ఇస్రాయీల్‌కు చెందిన మగ సంతానాన్ని సంహరించడం, వారి ఆడ సంతానాన్ని జీవించి ఉండేటట్లు చేశాడు ఆ దుర్మార్గుడు. ఇలా మొత్తం జాతినే తుదముట్టించే ప్రణాళికపై అమలు జరిగింది ఓ సుదీర్ఘ కాలం వరకు. బనీ ఇస్రాయీల్ పట్ల హేయమైన రీతితో ప్రవర్తించడం జరిగింది. హజ్రత్ మూసా (అ) పై ఇంద్రజాలికుల ఓ సైన్యాన్నే ఉసికొల్పడం జరిగింది. వీరు తమ మంత్రతంత్రాలతో దండెత్తి ఆయనపై విరుచుకుపడ్డారు. సత్యం అసత్యాన్ని పూర్తిగా అపజయం పాలుచేసినప్పుడుగాని ఈ ఆపద తొలగిలేదు.

హజ్రత్ ఈసా (అ)కు కూడా, రోమన్ చక్రవర్తి కైజరును మరియు యూదుల సామ్రాజ్యాన్ని ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడింది. 'ఫరీసీ' మరియు 'సుదీఖీ' (మత గురువు)ల ప్రాబల్యం హెచ్చుగా ఉన్న కాలమది. వారు 'తోరా' గ్రంథంలో మార్పులు చేస్తూ తమ మనోవాంఛలనే గ్రంథవాక్కుగా మార్చివేశారు. హజ్రత్ ఈసా (అ)గారి

సత్యసందేశ ప్రచారం ప్రారంభం కాగానే వీరు కందిరీగలా అయనపై పడ్డారు. సత్య సందేశ ప్రచారంలో వారి అధికారపు అంతం, దైవ గ్రంథంలో వారు చేసిన మార్పులు బయటబడతాయనే భయం వారికి పట్టుకుంది. ప్రతి ఫరీసీకి, ప్రతి ధార్మిక పండితునికి తమ అధికార పీఠం ఈ సందేశ ప్రచారవెల్లువలో ఎక్కడ కొట్టుకుపోతుందో అనే భయం పీడించింది. ధర్మాన్ని అడ్డుపెట్టుకొని నాటకాలాడే ప్రతి అవకాశవాదికి ఈ సత్యధర్మ ప్రచారపు ఉనికి తమ వ్యాపారాన్ని ఎక్కడ దివాలా తీయిస్తుందో అనే భావం గలిగింది. కాబట్టి సత్యసందేశం ప్రారంభం కాగానే వారి ఉపద్రవాలు కట్టలు త్రెంచు కున్నాయి. వారి ఎత్తుగడల పాశాలు నలువైపులా అల్లుకోనారంభించాయి. ఈ రకంగా హ|జత్ ఈసా (అ) గారి సందేశ ప్రచార ఆరంభం పరీక్షలు, కష్టాల పరంపరలతోనే మొదలైంది. సందేశ ప్రచారం తన గళాన్ని ఇంకా విప్పిందో లేదో నలువైపుల నుండి ఉపద్రవాలు పూర్తి శక్తితో ముట్టడించాయి. బైబిల్ గ్రంథంలో హ|జత్ ఈసా (అ) గారి వివిధ ప్రసంగాలు, బోధనలు ఏవైతే మనకు లభిస్తాయో వాటిని పరిశీలిస్తే, కష్టాల పరంపరల్లో ఓ నేత ప్రజలకు రాబోయే కష్టకాలం ఎలాగుంటుందో, ఈ మార్గంలో వచ్చే ఒడుదుడుకులెలా ఉంటాయో హెచ్చరించే ధోరణిలా ఉండడం గమనించగలం. రాబోయే కాలంలో ప్రజల బలహీనతలను విశ్లేషించి వారిని స్థిరంగా ఉండమని బోధించేవిగా ఉండడం చూడగలం.

కాబట్టి దైవప్రవక్త హ|జత్ ఈసా (అ) ప్రబోధనలు కూడా, దైవసందేశ ప్రచారం కష్టాలతోనే ప్రారంభం అయిందన్న సత్యాన్ని రుజువు చేస్తున్నాయి. సాధారణ పరిస్థితుల్లోనే ఓ ఉద్యమ కార్యకర్తగా నిలవడం మామూలు విషయం కాదు. ఎందుకంటే ఆ పరిస్థితులు ఎడతెగని కృషికి సంబంధించినవి గనుక. కాని ఆ ఉద్యమమే గనక పరీక్షలకు గురి అయినప్పుడు దాన్ని సహకరించడం అంటే, తాను వధ్యశిలపై నిలబడడం లాంటిది; తన అరికాళ్ళను ముళ్ళ కంపపై పెట్టడం లాంటిది; తన మెడలో ఉరివేసుకోవడం లాంటిది. అధికార వ్యవస్థ పట్ల తాను పెట్టుకున్న ఆశలు అడియాసలుగా మారే కాలమది. సత్యం తన కార్యకలాపాల్లో యే శక్తిముందు వంగేది కాదు. పైగా, అది పైకి లేచే తత్వం గలది. అపజయం పాలుకావడం కాదు, విజయాన్ని సాధించడమే దాని నైజం. నిరాశ నిస్పృహలకు లోనుకాకుండా, ఎదుటివారిని నిరాశకు లోబర్చడం దాని పని. అందుకని ఎన్ని కష్టాలు వచ్చిపడినా దాన్ని ఎదిరిస్తూ ముందుకే సాగుతుంది. అది అసత్యవాదులకు సత్యాన్ని విక్రయించే బేరం ఎన్నటికీ చేయదు. దైవతిరస్కారం విషయంలో తాను చనిపోవడానికే ఎక్కువ ప్రాధాన్యతనిస్తుంది. కాబట్టి అది దానితో ఎప్పుడూ కపటమైన ఒప్పందాన్ని కుదుర్చుకోలేదు. హ|జత్ ఈసా (అ) ఈ విధంగా సెలవిచ్చారు:

"ఎవరైతే నన్ను అనుసరించదలిచారో వారు తమ శిలువను ఎత్తుకొని నా వెంట రావాలి."

ఇక్కడ శిలువ ఎత్తుకొని రావడం అంటే, మరణ శిక్షకు సిద్ధపడి రావాలని అర్థం. ఈ మార్గంలో వచ్చే ప్రమాదాలు అలాంటివి. ఎవరైనా తనకు ఏదైనా రాయితీ (Reservation) లభిస్తుందేమో అని తలిస్తే అతను ఈ మార్గం నుండి తప్పుకోవడమే మేలు. లక్ష్య సాధనకు నడుము బిగించిన ప్రతి వానికి ఎదురయ్యే ఘట్టమిది. అతను ఉద్యోగి అయితే ఆ ఉద్యోగానికి నీళ్ళువదులుకోవడం, వ్యాపారస్తుడైతే ఆ వ్యాపారంలో నష్టం రావడం పరిపాటే. ఆ కష్టాలు వచ్చే మార్గాలు అనేకం. విశ్వప్రభువు తన సిపాయిని, అతను ప్రాణాలొడ్డి పోరాడే యోధుడా లేదా కేవలం ఒకటే బొమ్మ మాత్రమేనా అని పరీక్షించడానికి వేలాది మార్గాలున్నాయి. ఎవరైనా ఓ మార్గాన్ని తప్పించుకుంటే అతను మరో మార్గం ద్వారా అతను సత్యమార్గాన్ని వీడేంతవరకు, ఆ లక్ష్యం నుండి వైదొలగే వరకు పరీక్షిస్తూనే ఉంటాడు. ఆ లక్ష్యం పట్ల అతనికి గల ప్రేమ ఎంతలోతైనదో తెలుసుకునే పరీక్ష అది.

ఓ లక్ష్యం పట్ల దీక్షను ప్రకటించడం మాటలు కాదు. దాన్ని రుజువు చేసుకోవ డానికి ఆ దీక్షాపరుడు మామూలు యాతనల లగాయత్తు ప్రాణాలను సైతం అర్పించ వలసి ఉంటుంది. ఓ అసత్య వ్యవస్థలో ఉంటూ దానికి వ్యతిరేకంగా యుద్ధాన్ని ప్రకటించడం మామూలు విషయం కాదు. ఎందుకంటే అలాంటి ఉద్యమం పట్ల ఆసక్తి, సానుభూతి లేదా దాని సభ్యత్వానికి సంబంధించి ఏ మాత్రం ప్రకటన వెలువడినా అతని చుట్టూ ఉన్న వాతావరణమంతా అతనికి శత్రువు అయిపోతుంది. ప్రేమాను రాగాలు ప్రదర్శించిన అతని బంధుమిత్రులంతా శత్రువులుగా మారిపోతారు. అంటే అతను మానవుల బస్తీలోనుండి తోడేళ్ళ అడవిలోనికి అడుగు బెడతాడని అర్థం. అతనికి వ్యతిరేకంగా కుట్రలు పన్నడం జరుగుతుంది. అతనిపై అపనిందలు మోపబడతాయి. అతణ్ణి ద్రోహిగా, ఉగ్రవాదిగా చిత్రీకరించడం జరుగుతుంది. అతణ్ణి న్యాయస్థానాలకు, జైళ్ళకు అప్పజెప్పడం జరుగుతుంది. ఆరాధనాలయాల నుండి అతణ్ణి గెంటివేయడం జరుగుతుంది. అతని జీవితాన్నే నరకప్రాయంగా మారుస్తారు. అందుకనే హజ్రత్ ఈసా (అ) తన సహచరులతో ఇలా చెప్పడం జరిగింది:

"చూడండి! నేను మిమ్మల్ని తోడేళ్ళ గుంపులోనికి పంపిస్తున్నాను- మనుషుల నుండి అప్రమత్తులై ఉండండి. ఎందుకంటే వారు మిమ్మల్ని న్యాయస్థానాలకు అప్పజెబుతారు. తమ ఆరాధనాలయాల్లో మిమ్మల్ని కొరడాలతో బాదుతారు. మీరు నా కోసం రాజులు, పాలకుల ముందు ప్రవేశపెట్టబడతారు."

ఇంకా ఇలా సెలవిచ్చారాయన:

"నా వద్దకు వచ్చినవాడు తన తల్లిదండ్రులు, భార్యాబిడ్డలు, అన్నాచెల్లెళ్ళు ఇంకా చెప్పాలంటే తన ప్రాణాలతోను శత్రుత్వం పెంచుకోకపోతే అతను నా శిష్యుడు కాలేడు. మీలో ఎవరైనా తన సర్వస్వాన్ని త్యజించకపోతే నా శిష్యుడు కాజాలడు."

ఈ ప్రవచనంలోని గూడార్థం దివ్యఖుర్ఆన్‌లోని ఈ ఆయత్‌తో ఎంత పోలి ఉందో గమనించండి.

"ప్రవక్తా! ఇలా అను: ఒకవేళ మీ తండ్రులు, మీ కుమారులు, మీ సోదరులు, మీ భార్యలు, మీ బంధువులు, మీ ఆప్తులు, మీరు సంపాదించిన ఆస్తిపాస్తులు, మందగిస్తాయెమో అని మీరు భయపడే మీ వ్యాపారాలు, మీరు ఇష్టపడే మీ గృహాలు అల్లాహ్‌కంటే ఆయన ప్రవక్తకంటే ఆయన మార్గంలో శ్రమించడం కంటే మీకు గనక ఎక్కువ ప్రియతరమైతే, అల్లాహ్ తన తీర్పును మీ ముందుకు తీసుకువచ్చే వరకు నిరీక్షించండి. అల్లాహ్ దోషులకు మార్గం చూపడు." (తౌబా:24)

ఉద్యమ ప్రారంభదశలోనే ఎదురయ్యే ఈ పరీక్షలో యే వైఖరిని, మరే విధానాన్ని ఓ మోమిన్ (విశ్వాసి) అవలంబించవలసి ఉంటుందో, సత్యధర్మ ధ్వజవాహకుడు ఎలాంటి సహన, సంయమనాలను ప్రదర్శించవలసి ఉంటుందో దాన్ని హజ్రత్ ఈసా (అ) ఈ విధంగా వివరించి చెప్పడం జరిగింది:

"దుష్టుణ్ణి ఎదురొడ్డి నిలువకు. నీ కుడి చెంపపై ఎవరైనా కొడితే నీ రెండో చెంపను కూడా అతనికి అందించు. ఎవరైనా దావా వేసి నీ అంగిని తీసుకోదలిస్తే నీవు నీ చొక్కా (చూగా)ను కూడా అతను తీసుకునేటట్లు చెయ్యి. ఎవరైనా నిన్ను బానిసగా చేసి ఓ కోసు దూరం తీసుకువెళ్ళదలిస్తే అతని వెంట నీవు రెండు కోసుల వరకు వెళ్ళు."

దైవప్రవక్త (స)గారి సందేశ ప్రచార ప్రారంభ దశలోనూ ఇలాంటి తీరు అగుపడుతోంది. ముస్లిములను మండే ఇసుకపై పడుకోబెట్టి ఈడ్చినప్పుడు, ఎర్రని నిప్పు కణికలపై పడుకోబెట్టినప్పుడు, కాలే రాళ్ళ స్తంభాల క్రింద వారిని అణచినప్పుడు, కొరడాలతో కొట్టి రక్తసిక్తం చేసినప్పుడు, స్త్రీలను సైతం బరిసెలతో పొడిచి చంపినప్పుడు ప్రతి ఉద్యమ కార్యకర్త వారి ఆగడాలను సంయమనంగా సహించేవాడు.

హజ్రత్ ఈసా (అ) ఆ పరీక్షా ఘడియల్లో తమ సహచరుల ఎదుట లక్ష్యం ఔన్నత్యాన్ని, అసత్యవాదుల పట్ల ఆయన నిర్భయత్వాన్ని ఈ విధంగా ప్రదర్శించారు:

"శరీరాన్ని హతమార్చేవారు ఆత్మను హతమార్చలేరు. వారికి భయపడకండి. శరీరాన్ని, ఆత్మను పుట్టించిన వానికే మీరు భయపడాలి."

ఇలా, కేవలం దైవంపైన్నే ఆశలు పెట్టుకోవడం, పరలోక కర్మల పత్రంపైన్నే దృష్టి ఉంచుకోవాలని బోధించడమే కాకుండా, ఎవరైనా సరే పరీక్షల నుండి గట్టెక్కడానికి భౌతిక వాదులతోనూ స్నేహం చేసి ఆపై దైవహక్కులను కూడా నిర్వర్తించడంగాని, దైవసామ్రాజ్య సంస్థాపనా ధ్యేయానికి శత్రువులైన వారితో కలగలిసి పోవడం ఆపై దేవుని పట్ల కూడా ప్రేమను ప్రకటించడంగాని అసాధ్యమైన విషయమని వివరించారు.

"ఏ ఒక్కడు ఏకకాలంలో ఇద్దరు యజమానులకు సేవ చేయలేడు. మీరు దేవుని సేవ చేస్తూనే ధన సేవ ఎలా చేయగలరు?"

సత్యమార్గానుసరణ కత్తిపై సాములాంటిది

దైవప్రవక్త (స) మక్కాలో ఇస్లామియోద్యమాన్ని ప్రారంభించినప్పుడు, ఆ ఉద్యమానికి, ఓ సైద్ధాంతికమైన, రాజ్యాంగపరమైన విప్లవానికి ఎదురయ్యే సహజమైన ఘట్టాలన్నీ ఎదురయ్యాయి. ఆ ఘట్టాలన్నింటిలోను ఆయన (స), ఆయన అనుచరగణం ఎంతో గొప్ప నైతికతలను, సంయమాన్ని, సహనాన్ని ప్రదర్శించారు. ఇలాంటి ఉదాహరణలు ఏ కాలంలోను యే ఉద్యమ కార్యకర్తలకు, వారి నాయకులకు అబ్బినట్లు చరిత్రలో అగుపడదు. సహనం, స్థయిర్యం, పట్టుదల, లక్ష్యం పట్ల వారి దీక్ష, ప్రతి దైవేతర శక్తి పట్ల వారి తిరుగుబాటు, జులుము, దౌర్జన్యాలు మరియు ప్రతి అవకతవక పట్ల వారి చిరాకు లాంటివి మరెక్కడా కనిపించవు. అలాగే దైవతిరస్కారులు, పెత్తందార్లకు వ్యతిరేకంగా తమ ఔన్నత్యాన్ని, నిర్భయత్వాన్ని ప్రదర్శించడం, దానికోసం తమ సర్వస్వాన్ని ధారపోయడం, సంతానం, వ్యాపారం బంధుత్వాల తెగతెంపులు లాంటి ఉదాహరణలు బహుశా ప్రపంచ చరిత్రలోనే కానరావు. ఈ పరీక్షలు కొన్ని రోజులవి కావు. ఏండ్ల తరబడి కొనసాగిన పరీక్షలివి. అదేకాకుండా వారిని లోబరుచుకోవడానికి సామ, దాన, భేద దండోపాయాలను కూడా అనుసరించడం జరిగింది. ప్రాణాలు తీస్తామనే బెదిరింపులు, బంధువర్గం చేత వత్తిడి, శక్తినుపయోగించి భయభీతులుగా చేయడం, ఇంట నుండనివ్వక, బయటకు వెళ్ళనివ్వక చేసిన కట్టడి వర్ణనాతీతం. ఇలాంటి పరిస్థితుల్లో దైవప్రవక్త (స) గారి నేతృత్వంలో కొనసాగింది ఈ ఇస్లామియోద్యమం. ఈ పరీక్షల్లో ఉద్యమ నాయకునితో సహా ఆ ఉద్యమ కార్యకర్త ప్రతి ఒక్కడూ ప్రభావితుడైనవాడే. అలా సంవత్సరాల తరబడి వారి ఆగడాలకు గురిఅయిన వారేవీరంతా. ఆ పరీక్షల నుండి గట్టెక్కే మార్గం ఏదీ కానరాలేదు వారికి. అయినప్పటికీ, దైవతిరస్కారపు ఈ తిమిరాన్నైనా తరిమి కొట్టాలి లేదా ఒక్కొక్కరుగా తమ ప్రాణాలనైనా అర్పించాలన్నదే ఆ ఉద్యమ ధ్వజవాహకుల పట్టుదలంతా. ఈ మార్గంలోనికి వచ్చే ప్రతివాడు తమ సర్వస్వాన్ని వదిలేసి ఇందుకాలిడిన వాడు. ఎవరైతే ఈ కష్టాల రుచి చూశారో వారు తమ భోగభాగ్యాలను సైతం త్యజించి దానికే అంకితం అయిపోయారు. పురుషులే కాదు స్త్రీల విశ్వాస పటిమకు దైవదూతలు కూడా అసూయబడడం జరిగింది.

హజ్రత్ ఉమర్ (ర) ఈ ఉద్యమాన్ని తుదముట్టించే ఉద్దేశ్యంతో ఒర నుండి కరవాలం దూసి మక్కా పురవీధుల్లో తిరుగాడుతున్నారు. ఓ వ్యక్తి ఆయనకు తారసపడి, "ఓ ఉమర్! ముహమ్మద్ (స)ను హతమార్చే ముందు నీవు నీ ఇంటివైపు కూడా కాస్త దృష్టిని సారించు. నీ సోదరి, నీ బావ ఇద్దరూ ముస్లిములైపోయారు" అని

చెప్పగానే ఆయన క్రోధం తన సోదరి వైపుకు మళ్ళింది. క్రోధంతో కుతకుతలాడుతూ ఆయన కొట్టిన దెబ్బలకు సోదరి శరీరమంతా రక్తసిక్తమైపోయింది. ఆ బాధలో ఆమె తన సోదరునితో "ఉమర్! నీవేం చేసుకుంటావో చేసుకో, ఇస్లామ్ మాత్రం నా హృదయాంతరాళం నుండి బయటకు వెళ్ళేది కాదు" అని బదులిచ్చారు.

ఈ వాక్యం ఏ పరిస్థితిలో మరే తీరుగా చెప్పబడిందంటే, దాన్ని విన్న యే కఠిన హృదయుణ్ణి కూడా కదిలించకుండా ఉండదు. ఇలా అబల దైవధిక్కారపు పటిష్టమైన కోటనే జయించింది.

హ్జ్రత్ సుమయ్యా (ర)ను కఠోరమైన శిక్షకు గురిచేస్తూ అబూ జహల్ ఆమె తొడలో బల్లెం పొడిచి చంపేశాడు. ప్రాణాలు పోయేటప్పుడు ఆమె నోట వెలువడిన మాటలు ఇలా ఉన్నాయి: "ఇక ఇస్లామ్ నుండి వైదొలగడం అసాధ్యం".

హ్జ్రత్ బిలాల్ (ర)ను ఆయన యజమాని మండిపోతున్న ఇసుకపై పడేసి ఈడ్చేవాడు. దానిపై పడుకోబెట్టేవాడు. ఎర్రగా మండే ఎండలో ఎండకు కాలుతున్న బండరాళ్ళ క్రిందవేసి అణచేవాడు.

హ్జ్రత్ ఖబ్బాబ్ (ర)గారిని కణకణలాడే నిప్పుకణికలపై పడుకోబెట్టడం వలన ఆయన క్రొవ్వు కాలి, కరిగి బయటకు వచ్చేది.

విశ్వాసులను అబీతాలిబ్ లోయలో మూడేళ్ళవరకు ఎడతెగని ఆకలికి గురిచేయడం జరిగింది. అక్కడ వారు ఎండిపోయిన చర్మాన్ని నీటిలో తడిపి కాల్చి తినవలసి వచ్చింది. ఇస్లామీయ ఉద్యమపు ఈ ప్రాథమిక సభ్యుల మెడలో త్రాళ్ళు వేసి లాగడం, బాధడం జరిగింది. సామాజిక బాయ్‌కాట్‌కు లోనుచేయబడ్డారు. వారికి భోజనం లేకుండా, నీరివ్వకుండా ఖైదు చేయడం జరిగింది. ఇలా వారు అబిసీనియా వైపుకు వలస వెళ్ళేందుకు వివశులైపోయారు. అక్కడ కూడా వారిని వదలలేదు. కుట్రలుపన్ని అబిసీనియా సరిహద్దుల నుండి వెళ్ళగొట్టేందుకు ప్రయత్నాలు జరిగాయి.

మక్కాలో ప్రారంభకాలపు పదమూడు సంవత్సరాలు ఉద్యమపు అతిఘోరమైన కాలం. ఆ కరుడుగట్టిన కటువైన నేలలో ఇస్లామ్ వ్రేళ్ళూనుకోవడానికి దైవప్రవక్త (స) యే కఠినమైన కృషి చేశారో ఆ కష్టాలు నేటి ఉద్యమ కార్యకర్తలకు తమ ప్రాణాలనైనాసరే అర్పించేందుకు, వారికి ఆ స్థయిర్యాన్ని ప్రసాదించడానికి చాలు. మహాప్రవక్త (స)ను ఉన్మాదిగా, కవిగా, మాంత్రికునిగా ఖరారు చేసిన కాలమది. ఆయన్ను 'అమీన్'గా పిలిచినవారే, 'హ్జ్రే అస్వద్' ప్రతిష్ఠాపనలో తలెత్తిన భయంకరమైన తగాదాలో ఆయన్ను న్యాయాధిపతిగా నిర్ణయించినవారే, ముప్పుతిప్పలకు గురిచేశారాయనను. సజ్దాలో తల భూమికి ఆనించినప్పుడు ఒంటె పొట్టప్రేవుల్లోని అశుద్ధాన్ని ఆయన తలపై కుమ్మరించారు. ఆయన మెడలో వస్త్రం వేసి గొంతునులిమి

నప్పుడు ఆయన ఉక్కిరిబిక్కిరి అయిపోయారు. హేళనచేసి నవ్వారు. దారిలో ముళ్ళకంప వేసి బాధించారు. వీరి ఆగడాలకు వేగలేక ఆయన తన ధర్మసందేశ ప్రచారం కోసం తాయిఫ్‌కు వెడితే, అక్కడ ఆయన్ను రాళ్ళతో కొట్టి రక్తసిక్తమయ్యేటట్లు చేశారు. పోకిరి పిల్లలు, గూండాలను ఉసిగొలిపి ఆయన్ను అక్కడి నుండి తరిమారు. ఆ బాధలకు తాళలేక ఆయన ఓ చెట్టునీడన కూర్చుంటే రెక్కపట్టుకొని లేపి నిలబెట్టారు. ఈ విశ్వంలోకెల్లా గొప్ప కారుణ్యమూర్తి అయిన మానవుని పట్ల ప్రదర్శించిన ఆగడాలు ఇన్నీ అన్నీకావు. కాళ్ళు రక్తసిక్తమైపోయినా ఆయననోట వెలువడ్డ మాటలు ఇలా ఉన్నాయి:

"నా ప్రభూ! నా జాతికి సన్మార్గం జూపు. నేనెవరినో వారికి తెలియదు."

ఈ యాతనలు ఓ ఎత్తయితే, మొత్తం ఖురైషీ తెగలు ఆయన సత్యసందేశానికి భయపడి ఆయన్ను ఆశకు లోనుచేయడం మరో పరీక్ష. వారు దైవసందేశ హరుడిని (స) ఈ విధంగా ప్రలోభపెట్టజూశారు.

1. మీకు ధనం కావాలా? అరేబియాలో ఉన్న ధనమంతా తెచ్చి మీకాళ్ళ ముందు గుట్టగా పోస్తాం.

2. మీకు రాజు కావాలనే ఆశ ఉంటే చెప్పండి. మా తెగల సర్దారులంతా కలిసి మిమ్మల్ని మా రాజుగా స్వీకరించడానికీ సిద్ధంగా ఉన్నాం.

3. మీరు అందగత్తెనెవరినైనా వివాహమాడదలిస్తే చెప్పండి. దానికోసం కూడా మేము సిద్ధమే.

అయితే ఒక షరతు. సత్యసందేశ ప్రచారాన్ని మాత్రం మీరు వదిలేయాలి. ఈ ప్రలోభాలకు దైవప్రవక్త (స) ఇచ్చిన సమాధానం చూడండి.

"దైవసాక్షిగా చెబుతున్నాను! మీరే గనక నా ఓ చేతిలో సూర్యుణ్ణి, మరో చేతిలో చంద్రుణ్ణి తీసుకొచ్చి పెట్టినా దాన్ని మాత్రం నేను వదులుకోలేను. నా బొందిలో ప్రాణం ఉన్నంతమట్టుకు అది అసాధ్యం."

ఈ విధంగా చివరికి ఆ భూభాగంలో ఇస్లామ్ కొరకు సైద్ధాంతికంగా, నైతికంగా మరింతకాలం పనిచేసే దారులను మూసివేశారు దైవధిక్కారులు. ఇలా వారు ఇస్లామ్ మనుగడపై నేరుగా దాడి చేసే ప్రణాళికలను సిద్ధం చేశారు. ప్రతి తెగకు చెందిన ఒక్కో వ్యక్తి దొమ్మిలా దైవప్రవక్త (స) పై రాత్రి పూట నిద్రలో కత్తులు దూసి విరుచుకు పడడానికి సిద్ధపడ్డారు. దీని ద్వారా ఖిసాస్ ప్రశ్నే ఉత్పన్నం కాదని, బనీ హాషిమ్ మహా అయితే ఫిదియా (నష్టపరిహారం) మట్టుకే తీసుకుంటారనే ఉద్దేశ్యంతో. దైవతిర స్కారుల ఈ కుట్రలను సర్వజ్ఞాని అయిన అల్లాహ్ గమనిస్తూనే ఉన్నాడు. ఆయన ఈ ఉద్యమానికి వెన్నుకాసేవాడు మరి. ఎవరైతే తన వైపునకు నడుచుకుంటూ వస్తాడో

అతని వైపునకు ఆయన పరుగిడుతూ వచ్చేవాడుకదా! ఆ మార్గంలో బాణం వదిలే చేయి తన చేయ్యే అవుతుంది.

హిజ్రత్ చేయమనే సార్వత్రిక ఆదేశాలు వెలువడ్డాయి. ముస్లిములు ఒక్కొక్కరుగా మదీనావైపుకు బయలుదేరారు. ధనం, సంతానం, ఆస్తిపాస్తులు, ఇల్లూవాకిళ్ళు, వ్యవసాయం, తెగల సంబంధాలు, రక్తసంబంధాలు అన్నీ ఒక్కొక్కటిగా వారి ముందుకు వచ్చి వారి మార్గాన్ని అడ్డుకునే ప్రయత్నాలు చేశాయి. వెళ్ళేవారిలో ఏ ఒక్కడూ వాటి ప్రభావానికి లోనుకాలేదు. ప్రతి ఉద్యమ కార్యకర్త వాటిన్నిటిని తమ పాదాల క్రింద నలిపేస్తూ మదీనాకు వెళ్ళిపోయాడు. యే రాత్రి అయితే దైవప్రవక్త(స) మదీనాకు వెళ్ళవలసి ఉందో ఆ కాళరాత్రి భయంకరమైన కఠోర రాత్రి. షైతాను తన సహచరులతో ఆయనపై దాడిచేయడానికి వచ్చాడు. అయినా అతని ఎత్తుగడ పారలేదు.

దైవప్రవక్త (స) గారి శయ్య ఓ మరణశయ్యగా మారిపోయింది. ఆ శయ్యపై నిద్రించేవారు దైవప్రవక్త (స) కాకుండా మరొకరు దానిపై పడుకోడానికి హజ్రత్ అలి (ర) ముందుకొచ్చారు. ప్రణాళిక అంతా తారుమారైపోయింది. మహాప్రవక్త (స)ను వెదకడానికి ప్రజలు పర్వతాల్లో, లోయల్లో, ఎడారుల్లో విస్తరించారు. ఆయన తల విలువ ఖరారు చేయడం జరిగింది. ధనం, బంగారం మరియు ఎర్ర ఒంటెలను సొంతం చేసుకోడానికి ఉవ్విళ్ళూరిన వారు ఆయన్ను వెదకనారంభించారు. దైవప్రవక్త (స) తన మిత్రుడు తోడుగా ఓ కొండగుహలో ఆశ్రయం పొందారు. ఆ గుహ పేరు 'సవర్.' వెదికేవారి కాళ్ళ చప్పుడుకూడా వినవచ్చేది వారిద్దరికి. అనుకోకుండా ఓ నాడు ఓ వ్యక్తి వాహనంపై స్వారీ చేస్తూ తమ వైపే వస్తూ అగుపడ్డాడు. హజ్రత్ అబూ బక్ర్ సిద్దీఖ్ (ర) అతణ్ణి చూసి, ప్రవక్తా! నా తల్లిదండ్రులు మీకై అర్పితం! మనం పట్టుబడ్డట్టే" అని ఆందోళనగా అన్నారు.

దైవప్రవక్త (స), "లా తహ్జన్ ఇన్నల్లాహ మఅనా" (భయపడకు, అల్లాహ్ మన వెంటే ఉన్నాడు) అని నింపాదిగా బదులిచ్చారు. నిజమే మరి! అల్లాహ్ వారి వెంటే ఉన్నాడు. ఆ ఇద్దరికీ తోడున్న మూడోవాడు వారిని సంరక్షించేవాడు, అదుకునే వాడూను.

బద్ర్ యుద్ధంలో ఓ వైపు వెయ్యి మందికంటే ఎక్కువే సైనికులున్నారు. వారంతా కవచధారులు, యుద్ధ సరంజామాతో వచ్చినవారు. మరోవంక ఎలాంటి ఆయుధ సంపత్తి లేకుండా బక్కచిక్కిన ముస్లిములు. వారిసంఖ్య కేవలం మూడు వందల పదమూడే. విరిగిపోయిన ఖడ్గాలు, చిరుగుబట్టలతో వెయ్యిమంది సైనికులను ఎదుర్కొన్న మూడువందల పదమూడు మందిని ఎప్పుడూ, ఎక్కడా చూడలేదు ఏ యుద్ధరంగం.

ఉహద్ యుద్ధంలో ఆ దృశ్యాన్ని కూడా కొంత ఊహించండి. దైవప్రవక్త (స) గోతిలో పడిపోయి ఉన్నారు. ఆయన మునిపళ్ళు విరిగిపోయివున్నాయి. శిరస్త్రాణం విరిగి దాని ముక్కలు ఆయన నొసటలో దిగబడి ఉన్నాయి. హజ్రత్ ఫాతిమా (ర) ఆయన గాయాలను కడుగుతున్నారు. హజ్రత్ అలీ నీరుపోస్తున్నారు. నలువైపుల నుండి బాణాల వర్షం కురుస్తోంది. ఆయన మేరుపర్వతంలా ఆ శరపరంపరల నడుమ నిలబడి తమ సహచరులను పిలుస్తున్నారు. వారి మనోస్థయిర్యాన్ని పెంచుతున్నారు. అలాగే ఆయన తన ముగ్గురు సహచరుల వెంట ఉహద్ కొండపైకెక్కి రక్షణపొంది ఉన్నప్పుడు ఆ కొండ క్రింద దైవతిరస్కారులు ఆయనకు సవాళ్ళు విసురుతున్నారు. ఇలా మానవుల్లో మహోన్నతుడైన వ్యక్తి సత్యధర్మ ప్రచార ఘట్టాలను అధిగమిస్తున్న ఘడియలవి. ఆ తరువాత ఈ కష్టకాలం గడిచి వచ్చిన మంచిరోజుల్లో ఆ కారుణ్యమూర్తి ప్రదర్శించిన వైఖరిని కూడా చూడండి. మక్కా విజయం రోజున తన ప్రాణ శత్రువులను ఉద్దేశించి, "ఈ రోజు శాంతి రోజు, ఈ రోజు మన్నింపు రోజు"అని ప్రకటించారాయన. ఆ ఘట్టాలన్ని అధిగమించిన తరువాత వచ్చిన మరో ఘట్టం తండోపతండాలుగా ప్రజలు సత్యధర్మంలోనికి వచ్చి చేరిన ఘట్టం.

సత్యాన్ని ఓ ఉద్యమంగా చేసుకొని ముందుకు నడిపించడం, దాన్ని ఓ జీవన వ్యవస్థగా మలచడం, లోతుగా వ్రేళ్ళూనుకొని ఉన్న అసత్య జీవన వ్యవస్థను కూకటి వ్రేళ్ళతో సహా ఊడబెరకడం అనేది ఓ కష్టతరమైన కార్యమే. ఇవి తప్పకుండా గొప్ప త్యాగాలనే కోరుతాయి. పెద్దపెద్ద పరీక్షలనే ఎదుర్కోవలసి ఉంటుంది. ఎవరైనా వ్యక్తిగతంగానైనాసరే, అసత్యానికి వ్యతిరేకంగా సత్యధర్మపు ఓ చిన్న విషయాన్నైనా ప్రకటిస్తే లేదా దాన్ని బలపరిచే ఏ ఒక్క పదమైనా పలికితే, లేదా దానికోసం అతను అంకితమైపోతే ఆ వ్యక్తిపై కూడా పరీక్షలు, కడగండ్ల తుఫాను వచ్చిపడ్డట్టే. ఇది చరిత్ర చెప్పే సత్యం. ఓ అవకాశవాది దాన్ని ఊహించనైనా ఊహించలేడు.

ఆచరణలో పెట్టగలిగిందే అసలు విజ్ఞానం

హజ్రత్ అబూ హనీఫా (రహ్మలై) సత్యాన్ని ప్రకటించారు. అసత్యంతో రాజీ పడేందుకు నిరాకరించారు. ఆయన ఒక్కరే ఒక్కరు. ఎలాంటి ఉద్యమాన్ని కూడా నడపడం లేదు. ఈయన ప్రకటన విన్నంతనే ప్రభుత్వానికి తన అధికారం ఎక్కడ పోతుందో అనే బెంగ పట్టుకుంది. అప్పటి పాలన దాన్ని ఏమాత్రం సహసించలేక పోయింది. దీనికిగాను ఆయన్ను ఖైదు చేసింది. అక్కడ ఆయన్ను అన్ని రకాలుగా హింసించారు. బనీ ఉమయ్యా మరియు బనీ అబ్బాస్ పాలకులు ఆయన్ను కొరడాల శిక్ష విధించారు. చివరికి జైల్లోనే ఆయనకు విషమిచ్చి హతమార్చరడం జరిగింది.

ఇమామె మాలిక్ (రహ్మలై)ను మాన్సూర్ అబ్బాసీ కాలంలో డెబ్బై కొరడాల శిక్ష విధించడం జరిగింది. దానికితోడు ఆయన రెక్కలను విరిచి కట్టడం వలన

గూడల్లో నుండి ఆయన బాహువులు వేరైపోయాయి. అయితే సత్యధర్మంపై ఆయన నిలకడ ఎలాగుండిందంటే అదే పరిస్థితిలో ఒంటెపై నిలబడ్డారు. ఆయన్ను అగౌరవపర్చడానికిగాను, ప్రజలు గుణపాఠం నేర్చుకోవాలనే ఉద్దేశ్యంతో ఒంటెపై ఎక్కించి నగరమంతా త్రిప్పారు. ఆయన ఒంటెపై నుండే, యే నేరం క్రింద ఆయన్ను ఇలా త్రిప్పుతున్నారో దాన్ని బాహాటంగా ప్రజలకు వినిపిస్తూ వెళ్ళారు.

ఇమామె అహ్మద్ బిన్ హంబల్ (రహ్మలై)ను మామూన్ మరియు మోతసిమ్ అనే రాజుల కాలంలో భయంకరమైన హింసకు గురిచేయడం జరిగింది. 'ఖల్కె ఖుర్‌అన్' ఉపద్రవం కారణంగా ఆయనపై జరిగిన అన్యాయాక్రమాల ఉదాహరణ మరెక్కడా లభించదు. ఆ సమయంలో ఉలమా (ధార్మిక పండితులు)లందరూ బిక్కుబిక్కుమంటూ దాక్కొని ఉండడమో లేదా అప్పటి పాలకుల చేతిపై బైత్ చేసి వారిని అనుసరించడమో జరిగింది. అయినప్పటికీ ఆ దైవదాసుడు ఒంటరిగానే సత్యాన్ని బాహాటంగా ప్రకటించాడు. ఆ నేరం క్రింద ఆయన్ను పట్టుకొని ఖైదు చేయడం జరిగింది. బరువుగల నాల్గేసి బేడీలు కాళ్ళకు తొడిగారు. నడి రమజాన్ నెలలో ఉపవాసాల వ్రతం పాటిస్తున్నప్పుడు, కాళ్ళు చేతులు సంకెళ్ళలో బంధించబడిన ఆయన్ను ఎండలో కూర్చోబెట్టడం జరిగింది. అలా కూర్చున్న ఆయన వీపుపై కొరడాలు ఝుళిపించడమూ జరిగింది. ఒక్కో తలారి ముందుకొచ్చి రెండు దెబ్బలు కొట్టి వెనక్కు వెళ్ళేవాడు. అతని తరువాత ఉత్సాహంగా మరో తలారి వచ్చి మరి రెండు కొరడాలు కొట్టేవాడు. అలా ఒక్కొక్కడు రెండేసి కొరడాలు కొట్టి వెనక్కువెళ్ళేవారు.

ఇంత శిక్షకు గురిఅయినప్పటికీ ఆయన్ను, "కరవాలం క్రింద నిలబడితే నీవు ఒప్పుకుంటావా?" అని అడగగా ఆయన ఇచ్చిన సమాధానం ఎలాంటిదో అది కూడా వినండి:

"లేదు, నా తలను వంచేవి రెండే రెండు విషయాలు. ఒకటి అల్లాహ్ గ్రంథం అయిన దివ్యఖుర్‌అన్, రెండవది దైవప్రవక్త (స) గారి సంప్రదాయం."

పాదుషా రక్షణాధికారి (కోత్వాల్) ఆయన స్థిరత్వాన్ని ఈ విధంగా వివరిస్తున్నాడు:

"పాదుషాల ఎదుట అహ్మద్ బిన్ హంబల్ (రహ్మలై)లా గంభీరంగా నిలబడ్డ మరే వ్యక్తిని నేను ఇంతవరకు చూడలేదు. మాబోటి ప్రభుత్వాధికారులైతే ఆయన దృష్టిలో ఈగకంటే తుచ్ఛమైనవాళ్ళం."

సాకులు వెదికే ఉలమాలు ఆయన దగ్గరకు వెళ్ళి, ప్రాణాలను రక్షించుకోడానికి అనుమతినిచ్చే ఆదేశాలను ఉటంకించినప్పుడు ఆయన, వారినుద్దేశించి, దైవప్రవక్తగారి ఈ క్రింది ప్రవచనాన్ని వారి ముందుంచి దీనికి మీ సమాధానం ఏమిటీ అని అడిగారు. ఆ ప్రవచనం పూర్తి పాఠం ఇది:

సహాబా (ర) (దైవప్రవక్త (స)గారి అనుచరగణం) ఆయన (స)తో తమ కష్టాలను ఏకరువు పెడుతూ దైవసహాయం ఎప్పుడు వస్తుంది అని అడగగా ఆయన ఇలా సెలవిచ్చారు:

"మీకంటే పూర్వం గతించినవారిని దౌర్జన్యపరులు గోతులు త్రవ్వి వాటిలో నిలబెట్టేవారు. ఆ తరువాత రంపాలతో వారి తలలను రెండు భాగాలుగా చీల్చేవారు. అయినప్పటికీ వారు సత్యం నుండి రవ్వంత కదలలేదు. అలాగే ఈ సత్యధర్మ పిపాసుల చర్మంలో (ఇనుప) దువ్వెనలు గ్రుచ్చి మాంసాన్ని, కండరాలను ఎముకల నుండి వేరుచేసేవారు. అయినప్పటికీ వారు దాన్ని సహనంతో భరించారు. కాని సత్యం నుండి వీసమంతైనా కదలలేదు." సాకులు వెదికే ఉలమాలు ఈ సమాధానం విని మిన్నకుండా వెనక్కు మళ్ళిపోయారు.

దైవసందేశ ప్రచార నగధీరులు

ఆ తరువాత భారత భూభాగంపై ఉద్యమించిన సత్యధర్మోద్యమానికి వద్దాం. ఇది భారత ఖండంలో పెల్లుబికిన మొట్టమొదటి ఉద్యమం. ఇంకా చెప్పాలంటే సంపూర్ణమైన ఇస్లామ్ సంస్థాపన కోసం, ఖిలాఫతె రాషిదా (నలుగురు ఖలీఫాల సుపరిపాలన) తరువాత ప్రప్రథమంగా లేవనెత్తబడిన ఇస్లామియోద్యమమిది. ఇస్లామ్ సిద్ధాంతాలపై భారతదేశంలో అది ఓ పకడ్బందీగా నెలకొల్పబడిన జమాఅత్ అని చెప్పాలి. సయ్యద్ అహ్మద్ షహీద్ మరియు సయ్యద్ ఇస్మాయీల్ షహీద్‌ల నేతృత్వంలో ఢిల్లీ, బరేలీ నుండి పెల్లుబికి బిహార్, బెంగాల్ వరకు చేరింది. సరిహద్దు రాష్ట్రాలకు చెందిన గిరిజన తెగల్లో వేళ్ళూనుకొనిపోయింది. పంజాబ్, సరిహద్దు రాష్ట్రాలకు చెందిన సిక్కులను ఎదుర్కొంది. చరిత్రకారుల కథనం ప్రకారం, సహాబా (ర) తరహా మనుషులను మొట్టమొదటిసారిగా చూడ్డం జరిగింది అని చెప్పబడుతోంది. వీరు పగలు గుర్రాలపై స్వారీ చేస్తూ రాత్రిపూట నమాజుల్లో లీనమై ఉండేవారు. దాదాపు యాభైఏళ్ళ వరకు ఈ ఉద్యమకారులు సరిహద్దు రాష్ట్రంలో జిహాద్ పతాకాన్ని ఎగురవేస్తూ యే పరీక్షలకు లోనయ్యారో, వారిలోని ప్రతి కార్యకర్త పట్టుదల, స్థయిర్యం, ధైర్యాలను ఎలా ప్రదర్శించాడో, ఎలా సహనం వహించాడో, దైవంపై భారం వేసి ఎలా మసలుకున్నాడో సహనశీలుర చరిత్రలో నిలిచిపోయిన ఘట్టమది.

1857లో జరిగిన సిపాయీల తిరుగుబాటు, స్వాతంత్రోద్యమ మార్గాలన్నిటినీ మూసి పరిస్థితిని ప్రమాదకరంగా మార్చివేసింది. సరిహద్దు ముజాహిద్‌లకు బెంగాల్, బిహార్ల నుండి అందే సహాయమార్గాలు తెగిపోయాయి. పస్తులు ముజాహిద్‌ల పరిస్థితిని మరింత అధ్వాన్నంగా మార్చివేశాయి. వారు చెట్ల ఆకులు, చిగుళ్ళు తిని కాలం గడిపారు. నెలల తరబడి ధాన్యం గింజైనా వారికి అగుపడలేదు. ఈ పరిస్థితిలో వారికి రక్తవిరోచనాల వ్యాధి సోకిపోయింది.

అ తరువాత కుట్ర పన్నారనే నేరాలు వారిపై మోపబడ్డాయి. బ్రిటీషువారు ఈ ఉద్యమంతో సంబంధం పెట్టుకున్నవారి కోట్లాది రూపాయల ఆస్తుల్ని జప్తు చేశారు. ఈ పరిస్థితుల్లో వారి పట్టుదల ఎలాగుండిందో చూడండి! బెంగాల్, బిహార్ల నుండి కాలినడకన వందలాది మైళ్ళు నడిచి సరిహద్దు రాష్ట్రంలో ఓ కొత్త ప్రదేశంలో శత్రువుతో ఢీకొనడం మాటలుకాదు. ఇలాంటి పట్టుదల నమూనాలే ఓ ఉద్యమానికి ప్రాణాలు. కుట్రల కేసుల్లో ముజాహిద్‌లను అరెస్టు చేయడం జరిగింది. వారిని నరక కూపాల్లాంటి జైళ్ళ గదుల్లో బంధించారు. అ గదుల పొడవు వెడల్పులు 4 x 5 అడుగులే. ఆ గదుల ఇరుకు, దానిపై వారు అనుభవించిన ఉక్కపోత, శ్వాసకూడా సరిగ్గా పీల్చలేని పరిస్థితి అది. ఇలా నెలలతరబడి అ ఇరుకు కారాగారాల్లో బంధించబడ్డారు వీరు. భోజనం విషయానికొస్తే అది ఎంతో నాసిరకమైనది, ఆకలి తీర్చనిది. ఆకలిని తీర్చుకోడానికి వారు జైలులోని గడ్డీ తినాల్సి వచ్చేది.

'మౌల్వీ ముహమ్మద్ జాఫర్ థానేసరి' అంబాల జైలు నుండి తనను లాహోరు జైలుకు తరలించే విధం ఎలాంటిదో వివరిస్తూ రాశారు.

"కంబళికప్పుకొని, కాళ్ళు, చేతులకు సంకెళ్ళు ఆభరణాలతో (Shackels and Hand Cuffs) కాలినడకన మెడలో ఇనుప గంటల కడియం మ్రోయగా మజిలీలు దాటుతూ వెడుతున్నాము."

లాహోర్‌కు చేరిన తరువాత ఇంకొంత సింగారించుకోవలసి వచ్చింది. అక్కడి జైల్లో మాకు లభించిన చేతి బేడీలకు తోడు ఓ ఇనుప అరదండ. అది కాలి సంకెళ్ళలో అడ్డంగా వేసి లావుపాటి ఇనుప గొలుసుతో కట్టడం జరిగింది. దాని బరువు వల్ల కదలడం మెదలడం అసలే కుదరదు. అండమాన్ జైలుకు తీసుకెళ్ళడానికి మమ్ముల్ను కరాచీ ఓడరేవుకు తీసుకువెళ్ళడం జరిగింది. మా కాళ్ళ క్రింద సింధూనది ప్రవహిస్తున్నా అలా పడుకునే మేము తయమ్ముమ్ చేసి నమాజు చేసుకున్నాం.

తప్పుడు సాక్ష్యులను, తప్పుడు సాక్ష్యం పలకడానికి హింసించడం జరిగింది. కొందరు వివశులైపోయారు. మరికొందరు ప్రాణాలను వదిలారు. మౌల్వీ జాఫర్ తన జీవిత చరిత్రలో ఆయన ద్వారా ముజాహిదీన్‌ల భోగట్టా తెలుసుకునేందుకు ఆయనపై జరిగిన జులుం గురించి ఇలా రాస్తున్నారు.

"పార్సన్ సాబ్ నన్ను మొదట బెదిరించాడు. ఆ తరువాత కొట్టనారంభించాడు. ఆ దెబ్బలను భరించలేక నేను క్రిందపడిపోయాను. అయినా నేను ఆయనకు ఏమాత్రం వారి ఆచూకీ గురించి తెలపలేదు. అతను నిరాశ చెంది వెనక్కు వెళ్ళిపోయాడు. ఇక నన్ను ప్రాణాలతో వదిలిపెట్టడు అనే పూర్తి నమ్మకం కుదిరిన తరువాత, ఇది వరకు తప్పిపోయిన రమజాన్ రోజాల ఖజాను మరుసటి రోజు నుండే ప్రారంభించాను. రెండో రోజు 'పార్సన్' నన్ను వేరు గదిలోనికి తీసుకువెళ్ళి

కొట్టనారంభించాడు. ఉదయం ఎనిమిది గంటల నుండి రాత్రి ఎనిమిది గంటల వరకు నన్ను హింసించిన తీరు మరువలేనిది. నేను అల్లాహ్‌ను, "దేవా! ఇదే పరీక్షా సమయం, నన్ను స్థిరంగా ఉంచు అని వేడుకుంటూ ఉండేవాణ్ణి."

ఇక అమీరె జమాఅత్ అయిన మౌలానా యహ్యా అలీగారి విషయమే వేరు. "ఈ దెబ్బలకు, హింసలకు మేమంతా తడబాటుకు, భయభీతులకు లోనైపోతే మా అమీరె జమాఅత్ మాత్రం ఆనందంలో ఓలలాడుతూ అగుపడేవారు. ఆయన ముఖంపై ఎలాంటి విచారంగాని, బాధగాని కనబడేదికాదు. పైగా ఆయన దైవధ్యానం చేస్తూ ఉండేవాడు. తరుచుగా హజ్రత్ ఖబీబ్ (ర)గారి ఈ పద్యపాదాలను వల్లిస్తూ ఉండేవారు.

"ఓ ముస్లిముగా నేను చంపబడితే, అల్లాహ్ మార్గంలో నేను ఏ ప్రక్కన పడిపోయి ప్రాణాలొదిలినా అది అల్లాహ్ మార్గంలో ప్రాణాలొదిలినట్లే. ఆయన తలిస్తే నా శరీరం ముక్కలైపోయినా వాటికి శుభాన్ని, పెంపుదలను ప్రసాదిస్తాడు."

కాబట్టి ఉరిశిక్షకు బదులు జీవిత ఖైదు శిక్ష వేయబడినప్పుడు ముజాహిద్‌ల వస్త్రాలను మార్చి గడ్డాలు మీసాలను, తల వెంట్రుకలను కూడా కత్తిరించడం జరిగింది. అప్పుడు మౌలానా యహ్యా అలీ తన కత్తిరించిన గడ్డం వెంట్రుకలను పైకెత్తి ఇలా అన్నారు.

"బాధపడకు! నీవు దైవమార్గంలో పట్టుకోబడ్డావు. ఆ మార్గంలోనే కత్తిరించ బడ్డావు."

ఆ తరువాత మౌలానా ఓ మోటుబావిపై మోటలాగడానికి నియమించ బడ్డారు. ఆయన దాన్ని రెండు మూడు రోజులు మండే ఎండలో లాగడం వలన రక్తంతో కూడిన మూత్రం వచ్చేది ఆయనకు.

ఇటీవలి కాలంలోనూ సత్యధర్మ సంస్థాపన కృషి చేసిన జమాఅత్‌లలో ఈజిప్టుకు చెందిన 'ఇక్వానుల్ ముస్లిమీన్' పరిస్థితులు ఎలాగున్నాయో ఎరుగని వారుండరు. ఈ ఇస్లామీయ ఉద్యమంపై ఓ ముస్లిమ్ పాలన దమనకాండ మరే ముస్లిమేతర పాలన దమన కాండకంటే తీసిపోనిది. ఎందుకంటే, ముస్లిమ్‌పాలన అని చెప్పబడుతున్న ఓ అధికార పీఠం, ఇస్లామ్ ధర్మాన్ని తుదముట్టించే ప్రయత్నం చేసినప్పుడు దాని దౌర్జన్యం, దుర్మార్గాలు తారస్థాయికి ఎదిగిపోతాయి. అది ప్రతి జులుంను అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త (స) పేరు చెప్పే చేస్తుంది. ప్రతి పీడితుని గొంతుపై కత్తి త్రిప్పేటప్పుడు బిస్మిల్లాహి అల్లాహు అక్బర్ అంటూనే గొంతు కోస్తుంది. ప్రతి అమాయకుణ్ణి కాఫిర్‌గా చిత్రీకరిస్తుంది. ప్రతి దుర్మార్గంపై ఇస్లామ్ లేబుల్ అంటించి దాన్ని మరీ కొనసాగిస్తుంది. ఈ అధికార పీఠం నడిపే మద్యపానశాలలకు 'ఇస్లామీయ

మద్యపానశాలలనే పేరుపెట్టి నడుపుతుంది. దీని దృష్టిలో అది నడిపే వేశ్యాగృహాలు, ఇస్లామియా క్లబ్బులు. ఇస్లామియా సినిమాలు, ఇస్లామియా సంగీతం, ఇస్లామీయ డాన్సులుగా పేర్లు పెడుతుంది. అవన్నీ ఇస్లామియా కళలుగా చెప్పబడతాయి. ఇలాంటి అధికార పీఠానికి ఇఖ్వానుల్ ముస్లిమీన్ సంస్థ అడ్డురాగా దాని గొంతుల్ని కోయడానికి ఆ సోకాల్డ్ ముస్లిమ్ పాలన, మరే ప్రభుత్వం అవలంబించని హింసాదౌర్జన్యాలను అవలంబించింది. వారి నాయకులను మోసగించి అతిభయంకరమైన విధంగా కాల్చిచంపారు. వారి జమాఅత్‌పై మొత్తం దేశంలోనే నిషేధం విధించడం జరిగింది. దేశానికి పనికి వచ్చే అమూల్యమైన ముస్లిమ్ యువకులను వేలు కాదు, లక్షల మందిని జైళ్ళలో కుక్కింది. వారిపై ఓ సుదీర్ఘ కాలం వరకు హింసలు, దౌర్జన్యాలు జరిగాయి. వారికి యాతనతో కూడిన కొరడాల శిక్ష విధించడం జరిగింది. శ్వాస కూడా ఆడని ఇరుకైన జైలు గదుల్లో కుక్కడం జరిగింది. ఒకటేమిటి, ఓ జమాఅత్‌ను లేదా ఆ జమాఅత్‌కు సంబంధించిన వ్యక్తిని తుదముట్టించడానికి, అగౌరవపర్చడానికి ఎన్ని ఎత్తుగడలైతే అవలంబించబడతాయో అవన్నీ అవలంబించబడ్డాయి. చివరికి వారి మేధావులను ఉరికంబం ఎక్కించి చంపడం జరిగింది.

త్యాగనిరతి

ఈ పరీక్షలు, ఈ కష్టాలు ఒక సత్య మార్గంలోనే రావు, అసత్యప్రచారకుల మార్గాల్లోనూ వస్తుంటాయి. త్యాగనిరతి లేకుండా అసత్యం కూడా అడుగుముందుకు వేయలేదు. పరీక్షల కొలిమిలో కాలిన తరువాతే మేలిమేదో, కల్మషమేదో బయటపడేది. తన లక్ష్యంతో ఎవరికి ఎంత ప్రేముందో పరీక్షిస్తుంది ప్రకృతి. దైవం మీద విశ్వాసం లేని దైవధిక్కారులు సైతం తమ లక్ష్యసాధన కోసం త్యాగాలు చేస్తున్నారు. వారికి పరలోకంపై ఎలాంటి విశ్వాసం కూడా లేదు. కేవలం ఇహలోకపు పరిమిత జీవిత సాఫల్యం కోసం, భోగభాగ్యాలకోసం వారింత గొప్ప త్యాగాలు చేస్తున్నారు. అలాంటప్పుడు, ఈ జీవితం కేవలం పరీక్షా కాలమని, ఇది పరలోక వ్యవసాయిక క్షేత్రమని, ఈ అల్పమైన జీవితం తరువాత శాశ్వతమైన జీవితం ప్రారంభం అవుతుందని, ఆ జీవితపు బాగోగులన్నీ ఈ స్వల్ప జీవన కాలవ్యవధిలో సంపాదించిన దానిపై ఆధారపడి ఉంటుందని నమ్మేవారి త్యాగాలు ఎలా ఉండాలి? దేవుడున్నాడు, ఈ జీవితపు ప్రతి విషయం గురించి లెక్క అడుగుతాడు, ఆయన ప్రవక్తల ద్వారా తన దాసులకు చేరవేసిన ఆదేశాల ప్రకారమే అక్కడ లెక్క తీసుకోవడం జరుగుతుంది, మనం ఇక్కడచేసే ప్రతి కర్మ రాయబడుతూ ఉంది, మనం దైవమార్గంలో ఖర్చు చేసే ప్రతి పైసాకు అక్కడ బహుమానం లభిస్తుంది. అది కూడా అనేక రెట్లు అధికంగా అని నమ్మేవాళ్ళం మనం. అదేకాకుండా, మనకు లభించిందంతా మనది కాదని ఆయన ప్రసాదించిందేనని, ఆయన అమానత్తేనని దాన్ని ఆయనకే అప్పజెబుతున్నామని,

చివరికి మన ప్రాణం కూడా ఆయన మార్గంలోనే అర్పిస్తామని ప్రతిజ్ఞ చేసిన వాళ్లం. ఈ విశ్వాసం, ఈ భావన కలిగి ఉన్న వానిపై పడే బాధ్యత ఎంత మహోన్నతమైనదో! చేసే త్యాగం ఎంత విలువైనదో! పైపెచ్చు ఇస్లామీయ ఉద్యమ ధ్వజవాహకుడు ఈ భావనలను తన లోతైన మౌలిక విశ్వాసాలుగా కలిగి ఉండేవాడు కాబట్టి, అతని దృక్పథం కూడా అంతే విశాలంగా ఉంటుంది. అసత్యపు ధ్యేయ సాధన కోసం పాటుబడే వ్యక్తి ఒక్క పైసా అయినా ఖర్చుబెడితే అది తన చేజారిపోతోందని బాధ పడతాడు. తాను ఏదో పోగొట్టుకున్న వానిగా ఫీలౌతాడు. కాని దానికి భిన్నంగా ఓ విశ్వాసి సత్యధర్మ మార్గంలో తన సమస్తమూ వెచ్చించి ఓ రకమైన ఆనందాన్ని పొందుతాడు. ఎందుకంటే తనదంటూ ఏదీ ఉండదు కాబట్టి. ఓ రుణగ్రస్తుడు రుణం తీర్చిన తరువాత అనుభవించే హాయే అతను అనుభవిస్తాడు.

మరి సత్యం శాశ్వతమైంది. అది ప్రారంభం నుండి ఉంది, చివరి వరకు ఒకే మార్గంలో ప్రయాణం చేసేది. దాని ధ్యేయాలు, లక్ష్యాల్లో మార్పులుండవు. అలాగే తన మార్గంలో శ్రమించేవారికి అక్షయమైన, శాశ్వతమైన బహుమానాలు ఇస్తానని వాగ్దానం చేసేది. అలాంటప్పుడు శాశ్వత ప్రాతిపదికపై చేసే కృషి మరిన్ని త్యాగాలను కోరుకోదా?

విజయ సోపానం

సత్యమార్గంలో జరిపే కృషిలో అపజయమన్నదే ఎదురుకాదు. అలా ఆ కృషిలోనే గమ్యానికి చేరుకున్నవానికి లాభనష్టాల బేరీజులు వేసేవారు సైతం విజయం సాధించాడనే చెబుతారు. కాని ఆ గమ్యం చేరుకోడానికి తన ప్రాణాన్ని సైతం పోగొట్టుకున్నవాడు కూడా విజయం సాధించినవాడే. అతను ఆ విజయాన్ని దగ్గరి మార్గం ద్వారా పొందినవాడు. అతను తన సర్వస్వాన్ని సత్యధర్మమార్గంలో వెచ్చించ వలసి ఉంది. అలా తాను తన సర్వస్వాన్నే ధారపోసినప్పుడు అతనికి లభించే విజ యంలో సందేహం ఎక్కడిది? అతను తన డ్యూటీని నిర్వహించినవాడు. బాధ్యతా యుతంగా తన డ్యూటీని నిర్వహించడమే ఓ కార్యకర్త విజయం. ఫలితాలను లెక్క కట్టడం, అతణ్ణి ఆ డ్యూటీలో నియమించిన వాని పని. ఆ డ్యూటీని నిర్వర్తిస్తూ ప్రాణాలను అర్పించిన వాని పని కాదది. అపజయం అనేది కేవలం, పరలోక వ్యవ సాయంలో ముళ్ళకంప తప్ప మరేదీ పండించని వానిది. చరిత్రకారుడు కూడా పూర్తి నమ్మకంతో చెప్పిన సత్యం కూడా ఇదే. ఎవరైతే సత్యమార్గంలో అడ్డుపడ్డారో, లేదా ఆ మార్గంలో అడ్డుపెట్టడానికి ప్రయత్నించారో వారే అసలుకు పరాభవం మరియు అపజయం పాలైపోయారు. కొన్ని రోజుల వరకు వారి అధికారం చెల్లినప్పటికీ చివరకు వారు పరాభవం పొందకుండా ఉండలేదు. కాబట్టి నిరాశా నిస్పృహలు ఓ విశ్వాసి దాపుకు కూడా రాలేవు. ఎందుకంటే నిరాశా అనేది సైతానుకు సొంతం. ఇలాగే

సత్యాసత్యాల మార్గాలు కూడా పరస్పర వ్యతిరేక దిశలో పయనిస్తాయి. కేవలం విధి నిర్వహణా ప్రమాణాలే తీర్పునిచ్చేవి. ఎవరైతే ఈ మార్గంలో తన బాధ్యతను నిర్వహిస్తాడో అతను ఆ త్రాసులో తన పెద్ద బరువును వేసినట్లే. విధి నిర్వహణ హెచ్చు తగ్గులు కూడా ఆ స్థాయిలోనే ఉంటాయి. దైవతిరస్కారానికి, ఇస్లాంకు మధ్య సంఘర్షణ ఏ మేరకు, ఏ స్థాయిలో జరుగుతుంది? ఒకవేళ దైవధిక్కార తత్వమే ప్రాబల్యం సంపాదిస్తే అక్కడ ఆ బాధ్యత మరింత పెరిగిపోతుంది. డ్యూటీ మరింత కఠినమైపోతుంది. దైవధిక్కారం వెనక్కుతగ్గుతుంటే బాధ్యత కూడా తగ్గిపోయి డ్యూటీలో కొంత వెసలుబాటు కలుగుతుంది.

ఉదాహరణకు ఓ బస్తీలో ఆరోగ్య సమస్య ఉత్పన్నం కాకపోయినప్పటికీ అక్కడి ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించడంలో ఆ ఊరి డాక్టరు సతతం కృషి చేస్తూనే ఉంటాడు. అదే ఆ ఊరిలో ఓ మహమ్మారి వ్యాపిస్తే అతను రేయనక పగలనక ఆ మహమ్మారిని పారద్రోలేందుకు కృషి చేస్తూనే ఉంటాడు. ప్రతి రోగి వద్దకు వెళ్ళడం అతని బాధ్యత. అది రాత్రిగాని, పగలుగాని. అతని డ్యూటీకి ఓ కాలపరిమితి అంటూ ఉండదు. అలాంటి సమయంలో ఏ డాక్టరు అయినా తన సరదాల కోసం ఓ సమయాన్ని కేటాయించుకుంటే అతను ఓ నేరస్తుని క్రిందే లెక్కించబడతాడు.

ఏ విశ్వాసులైతే అల్లాహ్‌యే గొప్పవాడని భావిస్తారో, తమ జీవన్మరణాలు ఆ ఘనమైన దైవానికే అంకితం చేస్తారో, ఆయన ప్రసన్నత బడయడానికే కృషి చేస్తూ ఉంటారో వారి మనస్సుల్లో ఇతర అల్పుల భయం ఏ మాత్రం చోటుచేసుకో జాలదు.

ఇలాంటి వారి పైన్నే మానవాళి ఆశలన్నీ. వీరే విశ్వాన్ని శాంతి, సంరక్షణ, నైతికతలు, సదాచారాలతో నింపేది. సత్యమార్గంలో వచ్చే కష్టాల్లో స్థయిర్యంగా నిలబడడం ఓ విశ్వాసి యదార్థమైన జీవన ధ్యేయం.

నిలకడ

విశ్వాస చిత్తశుద్ధి, త్యాగం, ప్రాణదానం ప్రతి ధర్మ సంస్థాపనకు తప్పనిసరే - అది సత్యధర్మమైనా, అసత్య ధర్మమైనా- అయినప్పటికీ సత్యధర్మం మాత్రం అసత్య ధర్మం కోరేదానికంటే అధికమైన చిత్తశుద్ధి, త్యాగనిరతిని కోరు కుంటుంది. సత్యం సూక్ష్మదర్శి గలిగిన షరాబు లాంటిది. యే కొంచెం కల్మషం కలిగి ఉన్నా బంగారాన్నైనా అది స్వీకరించేది కాదు. దానికి కావలసింది మేలిమి బంగారం. పరీక్షల కొలిమిలో కాలి తనలోని కాలుష్యాన్నంతటిని పోగొట్టుకున్న తరువాతనే, పూర్తి స్టాండర్డ్ మేలిమి బంగారం బయటకు రానంత వరకు తన పేరున దాన్ని బజారులో తెచ్చే బాధ్యతను స్వీకరించదు. ఎందుకంటే, అదే సత్యం కాబట్టి. అసత్యం కాదు కాబట్టి. సత్తు నాణాలు, బంగారుపూతపూసిన (Gold Plated) నగలు అమ్మదది. ఈ కారణంగానే దివ్య ఖుర్‌ఆన్ మాటిమాటికి హెచ్చరించే విషయం ఇదే:

مَاكَانَ اللّٰهُ لِيَذَرَ الْمُؤْمِنِيْنَ عَلٰى مَآ اَنْتُمْ عَلَيْهِ حَتّٰى
يَمِيْزَ الْخَبِيْثَ مِنَ الطَّيِّبِ ؕ (آل عمران : ۱۷۹)

"మీరు ప్రస్తుతం ఉన్నటువంటి స్థితిలో అల్లాహ్ విశ్వాసులను ఏ మాత్రం ఉండనివ్వడు. ఆయన పవిత్రులను అపవిత్రుల నుండి తప్పకుండా వేరు చేస్తాడు."

(అలి ఇమ్రాన్:179)

اَحَسِبَ النَّاسُ اَنْ يُّتْرَكُوْٓا اَنْ يَّقُوْلُوْٓا اٰمَنَّا وَهُمْ
لَا يُفْتَنُوْنَ ○ وَلَقَدْ فَتَنَّا الَّذِيْنَ مِنْ قَبْلِهِمْ
فَلَيَعْلَمَنَّ اللّٰهُ الَّذِيْنَ صَدَقُوْا وَلَيَعْلَمَنَّ الْكٰذِبِيْنَ ○

"కేవలం మేము విశ్వసించాము" అని అన్నంత మాత్రాన్నే వారిని వదిలి వేయడం జరుగుతుందనీ, వారిని పరీక్షించడం జరగదనీ ప్రజలు భావిస్తున్నారా? వాస్తవానికి మేము వారికి పూర్వం గతించిన వారందరినీ పరీక్షించాము. అల్లాహ్‌కు సత్యవాదులెవరో, అసత్యవాదులెవరో తప్పనిసరిగా చూడవలసి ఉంది."

(అల్ అన్కబూత్:2,3)

اَمْ حَسِبْتُمْ اَنْ تَدْخُلُوا الْجَنَّةَ وَلَمَّا يَاْتِكُمْ مَّثَلُ
الَّذِيْنَ خَلَوْا مِنْ قَبْلِكُمْ مَسَّتْهُمُ الْبَاْسَآءُ وَالضَّرَّآءُ
وَزُلْزِلُوْا حَتّٰى يَقُوْلَ الرَّسُوْلُ وَالَّذِيْنَ اٰمَنُوْا مَعَهٗ
مَتٰى نَصْرُ اللّٰهِ - (بقرہ : ۲۱۴)

"స్వర్గ ప్రవేశం ఊరకే లభిస్తుందని మీరు అపోహ పడుతున్నారా? మీకు పూర్వం విశ్వాసులకు సంభవించినవన్నీ ఇంకా మీకు సంభవించనేలేదే! వారిపై ఆపదలు, ఎనలేని వ్యథలు విరుచుకుపడ్డాయి. వారు కుదిపివేయబడ్డారు. చివరకు అప్పటి ప్రవక్త, విశ్వాసులైన అతని అనుచరులు, "అల్లాహ్ సహాయం ఇంకా ఎప్పుడొస్తుంది" అని ఆక్రోశించారు.

(అల్ బకర : 214)

اَمْ حَسِبْتُمْ اَنْ تُتْرَكُوْا وَلَمَّا يَعْلَمِ اللّٰهُ الَّذِيْنَ جٰهَدُوْا
مِنْكُمْ وَلَمْ يَتَّخِذُوْا مِنْ دُوْنِ اللّٰهِ وَلَا رَسُوْلِهٖ
وَلَا الْمُؤْمِنِيْنَ وَلِيْجَةً - (توبہ : ۱۶)

"మీరు ఊరికే వదిలి పెట్టబడతారని అనుకుంటున్నారా? వాస్తవానికి మీలో (తన మార్గంలో) ప్రాణాలొడ్డి పోరాడిన వారు ఎవరో, ఇంకా, అల్లాహ్‌నూ సందేశహరుణ్ణి విశ్వాసులనూ తప్ప మరెవరినీ ఆప్తమిత్రులుగా చేసుకోనివారు ఎవరో ఇంకా అల్లాహ్ చూడనేలేదు."

(అత్‌తౌబా:16)

وَمِنَ النَّاسِ مَنْ يَّقُوْلُ اٰمَنَّا بِاللّٰهِ فَاِذَآ اُوْذِيَ
فِي اللّٰهِ جَعَلَ فِتْنَةَ النَّاسِ كَعَذَابِ اللّٰهِ ؕ وَلَئِنْ جَآءَ
نَصْرٌ مِّنْ رَّبِّكَ لَيَقُوْلُنَّ اِنَّا كُنَّا مَعَكُمْ ؕ اَوَلَيْسَ اللّٰهُ
بِاَعْلَمَ بِمَا فِيْ صُدُوْرِ الْعٰلَمِيْنَ ۝ وَلَيَعْلَمَنَّ اللّٰهُ الَّذِيْنَ
اٰمَنُوْا وَلَيَعْلَمَنَّ الْمُنٰفِقِيْنَ ۝ (عنكبوت : ١٠، ١١)

"ప్రజలలో మేము అల్లాహ్‌ను విశ్వసించాము" అని అనే వ్యక్తి ఒకడున్నాడు. కాని అతడు అల్లాహ్ మార్గంలో హింసించబడినప్పుడు, లోకులు పెట్టిన పరీక్షను అల్లాహ్ విధించిన శిక్షగా భావిస్తాడు. ఇప్పుడు ఒకవేళ నీ ప్రభువు తరపు నుండి సహాయం, విజయం వచ్చినట్లయితే, ఈ వ్యక్తియే మేము మీతోనే ఉన్నాము అని అంటాడు. భూలోక వాసుల హృదయాల స్థితి అల్లాహ్‌కు బాగా తెలియదా? అల్లాహ్‌కు విశ్వాసులెవరో, కపటులెవరో తప్పనిసరిగా చూడవలసి ఉంది."

(అల్ అన్‌కబూత్ : 10,11)

وَلَنَبْلُوَنَّكُمْ بِشَيْءٍ مِّنَ الْخَوْفِ وَالْجُوْعِ وَنَقْصٍ
مِّنَ الْاَمْوَالِ وَالْاَنْفُسِ وَالثَّمَرٰتِ ؕ وَبَشِّرِ الصّٰبِرِيْنَ ۝
الَّذِيْنَ اِذَآ اَصَابَتْهُمْ مُّصِيْبَةٌ ۙ قَالُوْٓا اِنَّا لِلّٰهِ وَاِنَّآ
اِلَيْهِ رٰجِعُوْنَ ۝ اُولٰٓئِكَ عَلَيْهِمْ صَلَوٰتٌ مِّنْ رَّبِّهِمْ
وَرَحْمَةٌ ۫ وَاُولٰٓئِكَ هُمُ الْمُهْتَدُوْنَ ۝ (البقرہ: ١٥٥تا١٥٧)

"భయ ప్రమాదాలకు, ఆకలి బాధలకు, ధన,ప్రాణ ఆదాయాల నష్టానికి గురిచేసి మేము మిమ్ములను తప్పకుండా పరీక్షిస్తాము. ఈ పరిస్థితిలో మనో స్థయిర్యంతో ఉండేవారు కష్టకాలం దాపురించినప్పుడు, "మేమంతా అల్లాహ్‌కే చెందిన వారము, అల్లాహ్ వైపునకే మరలి పోవలసినవారము" అని అనేవారికి శుభవార్తను తెలుపు. వారిపై వారిప్రభువు తన అపూర్వ అనుగ్రహాలను కురిపిస్తాడు. ఆయన కారుణ్యచ్ఛాయలు వారికి ఆశ్రయమిస్తాయి. వారే సన్మార్గగాములు."

(అల్ బఖర:155-157)

وَلَوْ يَشَآءُ اللّٰهُ لَانْتَصَرَ مِنْهُمْ وَلٰكِنْ لِّيَبْلُوَا بَعْضَكُمْ
بِبَعْضٍ ؕ (محمد : ٤)

"అల్లాహ్ తలచుకుంటే స్వయంగా ఆయనే వారిని ఎదుర్కొనేవాడు. అయితే మిమ్ములను ఒకరి ద్వారా మరొకరిని పరీక్షించడానికి (ఆయన ఈ పద్ధతిని అవలంబించాడు)." (ముహమ్మద్:4)

అంటే, అల్లాహ్ తన పట్ల తిరుగుబాటు చేసిన వారిని అణచలేడని లేదా దానికోసం మీ సహాయం పొందుతున్నాడని అనుకోకండి అన్నది ఇక్కడ అర్థం. అలా కాదు, ఆయన ఎంత సర్వశక్తిమంతుడంటే ఒకే ఒక సైగతో వారిని నామ రూపాల్లేకుండా తుడిచిపెట్టేయగలడు. తన ధర్మాన్ని స్థాపించనూగలడు. కాని, ఆయన జిహాద్ మరియు కృషి, త్యాగం అనే భారాన్ని మీపై మోపి మానవులైన మిమ్ములను ఒకరి ద్వారా మరొకరిని పరీక్షించదలుచుకున్నాడు. అసత్యవాదులను మీరు అడ్డుకో నంతవరకు, ఆ సంఘర్షణలో మీకు కష్టాలు, ప్రమాదాలు ఎదురుకానంతవరకు నిజమైన విశ్వాసులెవరో, దొంగవిశ్వాసులెవరో ఎలా గుర్తించగలరు మీరు! పనికిరాని చెత్త వ్యక్తుల్లో నుండి పనికి వచ్చే మనుషులు వేరుకానట్లయితే, ఖిలాఫతే ఇలాహియా (అల్లాహ్కు ప్రాతినిధ్యం వహించే) బాధ్యతను స్వీకరించే మరియు దాన్ని నిర్వర్తించే ఓ సమాజం ఎలా ఉనికిలోనికి వస్తుంది?

కాబట్టి నేడు ప్రపంచం భవిష్యత్తు పూర్తిగా, సత్యధర్మ సిద్ధాంతం మనిషికి లభిస్తుందా లేదా అనే విషయంపైన్నే ఆధారపడిలేదు. ఒకవేళ అది ఆధారపడి ఉందంటే కేవలం, మనుషుల్లో నిజమైన విశ్వాసం కలిగిన వారు, పట్టుదలగల వారు, తమకు ప్రియమైన వస్తువును దైవమార్గంలో త్యాగం చేసేవారికి సంబంధించిన ఆ వర్గంపైన్నే ఆధారపడి ఉంటుంది.

అలాంటి వ్యక్తులు ఇప్పుడెక్కడ లభిస్తారు? వారుకేవలం ఆ పరిశుద్ధమైన శుభమైన కాలంలోనే పుట్టారు, ఆ పుట్టించిన వాడు కూడా ఆ మాడల్ను శాశ్వతంగా రద్దు చేశాడు కదా అని అడగడం జరుగుతోంది. ఇది కేవలం ఓ అనుమానం, దురభిప్రాయం మాత్రమే. ఈ అనుమానం పుట్టేది కేవలం నిరాశ నిస్పృహలకు లోనైపోయేవారిలోనే. ప్రపంచంలో రకరకాల సామర్థ్యాలుగల వ్యక్తులు ప్రతి కాలం లోనూ జన్మిస్తూ వచ్చారు. కపట మనస్తత్వం, నిర్ణయ బలహీనతలుగల వ్యక్తులు, వెసలుబాటును కోరుకునేవారు కూడా ప్రతికాలంలో ఉంటూ వచ్చారు. భవిష్యత్తులోను ఉండగలరు. ఓ విషయాన్ని నమ్మిన తరువాత దానికోసం సర్వస్వాన్ని త్యాగం చేసేవారు కూడా ఉన్నారు.

మనం నేడు మన కళ్ళతో, ఒకరిద్దరుకాదు వేలాదిమంది హిట్లర్* మరియు జర్మనీనే విశ్వసించి, ఆ విశ్వాసాన్ని పరిరక్షించుకోవడానికి శత్రు దేశంలోనికి చొరబడు తున్నారు. వారికి తెలుసు అక్కడ అనేకమంది వేటగాళ్ళు వారి కోసం కాచుకొని ఉన్నారని. రష్యా విప్లవం వచ్చింది ఎప్పుడో కాదు కేవలం పాతికేళ్ళకు పూర్వమే కదా! దీని చరిత్రపై దృష్టిసారిస్తే ఆ విప్లవ సిద్ధాంతాలను నమ్మేవారు దాదాపు అర్ధ శతాబ్దం

*ఈ వ్యాసం ఏప్రిల్ 1941లో రాయబడింది.

వరకు అన్ని రకాల త్యాగాలు చేసినవారే. సైబేరియా నరకంలోనికి నెట్టబడినవారే. ఉరికంబాలు ఎక్కినవారే. దేశ బహిష్కరణ పరిస్థితిలో సంవత్సరాల తరబడి దేశ విదేశాల్లో దేశ దిమ్మరుల్లా తిరిగినవారే. వీరు తమ కోరికలను, తమ భోగభాగ్యాలను ఆ సిద్ధాంతం కోసం పణంగా పెట్టారు. తమ చేతులారా వినాశనాన్ని కొనితెచ్చు కున్నారు. అదంతా జరిగిందెప్పుడు? జార్ చక్రవర్తిని ఎదుర్కొనే భావన ఊహామాత్రంగా రాని రోజుల్లో. అంతదూరం ఎందుకు, ఖుద్దు మన భారతదేశాన్నే తీసుకుందాం.** ఇక్కడి యువకుల్లో కొందరు, రక్తపాతం ద్వారా తమ దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావచ్చనే తప్పుడు ఆలోచనకు గురయ్యారు. వారు తమ ధ్యేయం కోసం తమజీవితాలనే నాశనం చేసుకోవడానికి, ప్రమాదాలను ఎదుర్కోడానికి వెనుకాడారా? ఊహకు తట్టని ఏ ఆపదను వారు ఎదుర్కోలేదు. జైళ్ళలో తీవ్రమైన యాతనలకు గురయ్యారు. జీవితఖైదు శిక్షల్లో తమ జీవితాల్నే గడిపేశారు. ఉరికంబాలపైకెక్కారు. ఆ విధానం సరైందా కాదా అనేది ఇక్కడ చర్చనియాంశం కాదు. దీనివల్ల రుజువయ్యే విషయం మాత్రం ఒకటే. తమ ధ్యేయాన్ని విశ్వసించిన తరువాత దానికోసం తమ ధన ప్రాణ ఆదాయాల నష్టాలను, త్యాగాలను సహించే సుగుణం నేటికి మనుషుల్లో లేకుండా లేదు. మాతృభూమి మట్టిలోనే అంత ఆకర్షణ ఉన్నప్పుడు, దైవప్రసన్నతలో, ఆయనకు మరింత దగ్గరవడంలో ఆ ఆకర్షణ కరువైపోయిందా?

కాబట్టి ఎవరైతే పిరికిపందలో, సంకల్పశుద్ధి లేనివారో, వారికి ఈ మహాకార్యం కోసం పట్టుదలగలవారు లభించరు అని చెప్పే హక్కు ఎక్కడిది? అయితే వారు వ్యక్తిగతంగా తమ గురించి మాత్రం ఇలా చెప్పుకోవచ్చు.

اِذْهَبْ اَنْتَ وَرَبُّكَ فَقَاتِلَآ اِنَّا هٰهُنَا قٰعِدُوْنَ ○

"నీవూ, నీ ప్రభువూ ఉభయులూ పోయి పోరాడండి, మేము ఇక్కడే కూర్చుని ఉంటాము." (అల్ మాయిదా: 24)***

హిజ్రత్ సంకటం

దైవసందేశ ప్రచారం మొదలైతే ఆ మార్గంలో కష్టాలు, సంకటాలు కూడా వస్తాయి. సత్యధర్మ ప్రచార సందర్భంగా సాధారణంగా నిలకడను, దేశాన్ని, ధనాన్ని బంధుత్వాన్ని త్యాగం చేసుకోవలసి ఉంటుంది.

**భారతస్వాతంత్ర్య పోరాటానికి సంబంధించిన కర్షకుల ఓ ఉద్యమం.

***ఈ వ్యాసం ప్రచురించబడిన నాల్గు నెలలకే ఆగస్టు 26, 1941న జమాఅతె ఇస్లామీ సంస్థ స్థాపన అమల్లోనికి వచ్చిందని గ్రహించగలరు.

'కహఫ్' సూరా మరియు 'మరియమ్' సూరాలు దైవదౌత్యపు మూడవ దశ మరియు వ్యతిరేకత, వైరాలకు చెందిన రెండవ దశకు సంబంధించిన కాలంలో అవతరించిన సూరాలు. ఈ కాలం దైవదైత్యం ప్రారంభం అయిన ఐదు నుండి పది సంవత్సరాల వరకు కొనసాగింది. ఆ కాలంలో ఏ పరిస్థితులైతే చోటుచేసుకున్నాయో వాటిని కొంత వివరంగా చెప్పవలసిన అవసరం ఉంది. అదేకాకుండా ఈ రెండు సూరాల మాధ్యమంగా ఏ సందేశం అయితే ఇవ్వడం జరిగిందో దాన్ని కూడా విశ్లేషించి చూడవలసి ఉంది.

ఖురైష్ సర్దారులు, సామ దాన భేద దండోపాయాలనుపయోగించి, అసత్యపు నేరాలు మోపి ఇస్లామి ఉద్యమాన్ని నీరుకార్చడంలో విఫలురైన పిదప వారు హింసా దౌర్జన్యాలకు దిగారు. ఆర్థికంగా వత్తిడికి గురిచేశారు. ప్రతి తెగవారు తమ తెగకు చెందిన నవముస్లిములను రాచిరంపాన పెట్టనారంభించారు. వారిని ఖైదుచేసి ఆహారం, నీరు ఇవ్వకుండా బాధించారు. చివరకు శారీరక యాతనలకు గురిచేసి వారిని ఇస్లామ్ ధర్మం నుండి మరలడానికి వివశులుగా చేసే ప్రయత్నమూ చేశారు. ఈ విషయంలో ప్రత్యేకంగా నిరుపేద ప్రజలు, బానిసలు, వారి ఆధీనంలో ఉన్న వారు బాగా నలిగిపోయారు. ఉదాహరణకు బిలాల్ (ర), ఆమిర్ బిన్ ఫహీరా (ర), ఉమ్మె ఉబైస్ (ర), జన్నీరా (ర), అమ్మార్ బిన్ యాసిర్ (ర), ఆయన తల్లిదండ్రులు వగైరా. వీరిని చితకబాదుతూ సొమ్మసిల్లేటట్లు చేశారు. పస్తులుంచేవారు. త్రాగడానికి నీరు కూడా ఇచ్చేవారుకాదు. మక్కా మండే ఇసుకపై మిట్ట మధ్యాహ్నం పడుకోబెట్టి ఛాతీపై బరువైన బండరాళ్ళను పెట్టి గంటల తరబడి హింసించేవారు. వృత్తి చేసుకొని బ్రతికే వారితో పనులు చేయించి కూలీ కూడా ఇవ్వకుండా త్రిప్పుకునేవారు. ఈ విషయం గురించి సహీహైన్ హదీసు గ్రంథంలో హజ్రత్ ఖబ్బాబ్(ర) బిన్ అరత్‌గారి ఉల్లేఖనం ఇలా ఉంది:

"నేను మక్కాలో కమ్మరి వృత్తి చేసుకుని బ్రతికేవాణ్ణి. ఆమిర్ బిన్ వాయిల్ నా చేత పని చేయించుకున్నాడు. కూలీ అడగడానికి నేను అతని వద్దకు వెళ్ళినప్పుడు అతను, 'నీవు ముహమ్మద్(స)ను నిరాకరిస్తేనే నీకు కూలి ఇచ్చేది' అని చెప్పాడు.

ఇలాగే వ్యాపారం చేసుకుని బ్రతికే వారి వ్యాపారాన్ని తుడిచివేయడానికి ప్రయత్నించారు. ఎంతో కొంత గౌరవం కలిగిన వ్యక్తుల గౌరవాన్ని మంటకలిపి వారిని బజారుకు ఈడ్చేవారు. ఆ కాలపు ఓ సంఘటనను వివరిస్తూ హజ్రత్ ఖబ్బాబ్ (ర) ఇలా అంటారు:

"ఓ రోజు దైవప్రవక్త (స) కాబా గృహం నీడలో కూర్చుని ఉన్నారు. నేను ఆయన సన్నిధిలోనికి వెళ్ళి, "ఓ దైవప్రవక్తా! దౌర్జన్యం హద్దుమీరిపోతుంది. తమరు దైవాన్ని ఎందుకు వేడుకోరు?" అని. ఇది విన్న మహాప్రవక్త (స)గారి ముఖారవిందం

ఎరుపెక్కిపోయింది. ఆయన ఇలా సెలవిచ్చారు: "మీకంటే పూర్వం గతించిన విశ్వాసులు ఇంతకంటే అధికంగా హింసించబడ్డారు. వారి ఎముకల నుండి మాంసాన్ని లాగడానికి (ఇనుప) దువ్వెనలు గ్రుచ్చడం జరిగింది. వారి తలలపై... రంపాలు ఆడించడం జరిగింది. అయినా వారు తమ ధర్మం నుండి వెనక్కు మరలలేదు. "అల్లాహ్ ఈ కార్యాన్ని పరిపూర్ణం చేస్తాడు అని విశ్వసించండి. చివరికి ఆ రోజు వస్తుంది. ఓ వ్యక్తి సన్ఆ నుండి బయలుదేరి హజర్‌మౌత్ వరకు ఒంటరిగా వెడతాడు. అతనికి అల్లాహ్‌కు తప్ప మరెవరి భయమూ ఉండదు. మీరు త్వరపడుతున్నారు."

(బుఖారీ)

ఈ పరిస్థితులు సహించలేనంత వరకు వెళ్ళినతరువాత, రజబ్ నెల (45 ఆముల్‌ఫీల్ అంటే ప్రవక్త పదవి లభించిన అయిదవ సంవత్సరం)లో మహాప్రవక్త (స) తమ అనుచరులతో ఇలా చెప్పడం జరిగింది:

"మీరు బయలుదేరి అబిసీనియాకు వెళ్ళిపోతే బాగుంటుంది. అక్కడి రాజు ఎవరిపైనా దౌర్జన్యం చేయడు. ఆ భూభాగం మేలు కలిగి ఉన్న భూభాగం. అల్లాహ్ మీ కష్టాలను కడతేర్చే వరకు మీరక్కడ ఉండండి."

ఈ అనుమతి అందిన తరువాత మొట్టమొదట అబిసీనియాకు బయలుదేరిన వాళ్ళు పదకొండు మంది పురుషులు, నలుగురు స్త్రీలు. శత్రువులు వారిని సముద్ర తీరం వరకు వెంబడించారు. కాని అదృష్టవశాత్తు 'షాబియా' ఓడరేవులో వారికి సమయానికి ఓ పడవ లభించడం వల్ల పట్టుబడకుండా తప్పించుకున్నారు. మరికొన్ని నెలల్లో మరికొంత మంది హిజ్రత్ చేసి అబిసీనియాకు వెళ్ళిపోయారు. వారి సంఖ్య మొత్తం ఎనభై ఇద్దరు పురుషులు, పదకొండుగురు స్త్రీలు, ఇంకా ఏడుగురు ఖురైషీయేతరులకు చేరింది. ఈ ముస్లిములంతా అబిసీనియాలో ఒకే చోట కలిసి ఉన్నారు. ఇటు మక్కాలో దైవప్రవక్త (స) గారి వెంట కేవలం నలభై మంది మాత్రమే మిగిలిపోయారు.

ఈ హిజ్రత్ వల్ల మక్కాలో ప్రతి ఇల్లు శోకసముద్రంలో మునిగిపోయింది. ఎందుకంటే, చిన్నాపెద్దా ప్రతి కుటుంబంలోనూ ఎవరో ఒకరు ఆ ముహాజిర్లతో కలిసి అబిసీనియాకు వెళ్ళకుండా లేడు. ఒకరి కుమారుడు వెళ్ళిపోతే మరొకరి అల్లుడు, ఇంకొకరి కుమార్తె వెళ్ళిపోయిన వారిలో ఉన్నారు. అలాగే ఒకరి సోదరుడు మరొకరి సోదరి హిజ్రత్ చేసి అబిసీనియాకు వెళ్ళినవారే. అబూజహల్ సోదరుడు సల్మా (ర) ఇబ్నె హిషామ్, అతని పినతండ్రి కుమారుడు హిషామ్ బిన్ అబీ హుజైఫా (ర), అయ్యాష్ (ర) బిన్ అబీ రబీయా, అతని పినతండ్రి కుమార్తె హజ్రత్ ఉమ్మె సల్మా మరియు అబూ సుఫ్యాన్ కమార్తె ఉమ్మె హబీబా (ర), ఇలాగే ఇతర ఖురైష్ సర్దారులు, ఇస్లామ్ శత్రుత్వంలో ఖ్యాతిగడించినవారి సంతానం కూడా దైవధర్మం కోసం తమ

ఇల్లూ వాకిలి సమస్తమూ వదిలేసి బయలుదేరిన వారిలో ఉన్నారు. కాబట్టి ఏ ఇల్లూ ఆ సంఘటనకు ప్రభావితం కాకుండా ఉండలేదు. కొందరైతే ఈ కారణంచేత ఇస్లామ్ పట్ల తన శత్రుత్వంలో మరింత కఠినులుగా మారిపోయారు. మరికొందరు ఈ సంఘటన ద్వారా మరింత ప్రభావితులై ముస్లిములుగా మారిపోవడమూ జరిగింది. మరీ మితిమీరిపోయి ఉన్న హజ్రత్ ఉమర్ (ర) ఇస్లామ్ శత్రుత్వంపై పడిన మొట్టమొదటి వేటు అది. ఆయన దగ్గరి బంధువు లైలా బిన్తె అబీ హష్మా ఆ పరిస్థితిని ఇలా వివరిస్తున్నారు:

"నేను హిజ్రత్ చేసి అబిసీనియాకు వెళ్ళడానికి నా సామాను సర్దుకుంటున్నాను. నా భర్త ఆమిర్ బిన్ అబీయా ఏదో పనిమీద బయటకు వెళ్ళి ఉన్నారు. అంతలోనే ఉమర్ వచ్చారు. నా పనులను నిలబడే వీక్షించనారంభించారు. కొంతసేపైన తరువాత, 'అబ్దుల్లా తల్లీ! ఎక్కడికి వెడుతున్నావు?' అని అడిగారు.

"అవును వెడుతున్నాను! దైవసాక్షి! మీరు మమ్మల్ని చాలా హింసించారు. దైవసాక్షి! మేము ఎటైనా వెళ్ళి పోతాము. అక్కడ మాకు అల్లాహ్ స్వాంతన చేకూరుస్తాడు' అని సమాధానమిచ్చాను పనుల్లో నిమగ్నమై తల ఎత్తకుండానే. నా మాటలు విన్న హజ్రత్ ఉమర్ ముఖంపై దుఃఖఛాయలు గోచరించాయి. అలాంటివి నేను మునుపెన్నడూ ఆయన ముఖంపై చూడలేదు. ఆయన ఒకే ఒక మాట చెప్పి బయటకువెళ్ళిపోయారు.

"దైవం మీకు తోడుగా ఉండుగాక" అని.

హిజ్రత్ చేసివెళ్ళిపోయిన తరువాత ఖురైష్ సర్దారులందరూ సమావేశ మయ్యారు. అబూజహల్ సోదరుడైన అబ్దుల్లాహ్ బిన్ రబీయా మరియు అమ్రూ బిన్ ఆస్‌లకు అనేక విలువైన కానుకలిచ్చి అబిసీనియాకు పంపించాలని, వీరు నజాషీకి (అబిసీనియా చక్రవర్తి) నచ్చజెప్పి వారిని తిరిగి మక్కాకు పంపించేటట్లు ఒప్పిస్తారని తీర్మానించారు. ఉమ్ముల్ మోమినీన్ (ముస్లిముల మాతృమూర్తి) హజ్రత్ ఉమ్మె సల్మా (ర) (ఈమె స్వయంగా అబిసీనియా ముహాజిర్లలోనివారు) ఈ సంఘటనను విపులంగా వివరించడం జరిగింది.

రాజకీయ నైపుణ్యం కలిగిన ఈ ఇద్దరు దూతలు మమ్మల్ని వెంటాడుతూ అబిసీనియాకు చేరారు. వారు నజాషీ దర్బారీలకు అనేక కానుకలను సమర్పించి అందరు కలిసి ముహాజిర్లను వెనక్కు పంపించడానికి నజాషీపై వత్తిడి తెచ్చేందుకు ఒప్పించారు. ఆ తరువాత నజాషీ దర్బారుకు వెళ్ళి ఆయనకూ విలువైన కానుకలను సమర్పించుకొని ఇలా వేడుకున్నారు.

"మా నగరానికి చెందిన కొందరు అమాయక యువకులు మీ దేశానికి పారిపోయి వచ్చారు, మా జాతి కులీనులు వారిని వెనక్కు పంపించమనే విజ్ఞప్తి

చేస్తూ మమ్ములను మీ సన్నిధికి పంపించారు. ఈ యువకులు మా ధర్మాన్ని వదిలివేశారు, మీ ధర్మాన్ని కూడా స్వీకరించలేదు. పైగా వారు ఓ క్రొత్త ధర్మాన్ని సృష్టించుకున్నారు."

వారి మాటలు పూర్తికాగానే దర్బారీలు అన్నివైపుల నుండి, "ఇలాంటి వారిని తప్పకుండా వెనక్కుపంపించేయాలి. వారిలోవున్న లోపాన్ని వారి జాతివారే బాగా ఎరుగుదురు. ఇక్కడుంచడం సరైనది కాదు' అంటూ ముక్త కంఠంతో సిఫార్సు చేశారు. కాని నజాషి కోపోద్రిక్తుడై, "ఇలా వారిని నేను వెనక్కు పంపించడం కుదరదు. ఎవరైతే ఇతర దేశాలను వదిలి నా మీదా, నా దేశం మీద నమ్మకంతో శరణు పొందడానికి ఇక్కడికి వచ్చారో వారిపట్ల విశ్వాస ఘాతుకానికి నేనొడిగట్టను. నేను వారిని పిలిపించి విచారిస్తాను. వారికి వ్యతిరేకంగా మీరు చెప్పిన దానిలో నిజమెంతుందో తెలుసు కుంటాను"అని పలుకుతూ, దైవప్రవక్త (స)గారి అనుచరగణాన్ని తన దర్బారులో హాజరుకమ్మని ఆదేశించాడు.

నజాషీ ఆదేశం విన్న ముహాజిర్లు (మక్కా నుండి వలస వచ్చినవారు) అందరూ ఓ చోటచేరి పరస్పరం, రాజుకు ఏ సమాధానం చెప్పాలో అనే విషయం మీద తర్జన భర్జన పడి, చివరికి ఓ నిర్ణయానికివచ్చారు. నజాషీ తమను అబిసీనియాలో ఉండ నిచ్చినా, వెళ్ళగొట్టినా సరే, దైవప్రవక్త (స) గారి బోధనలను పొల్లుపోకుండా అతనికి తెలియచేద్దామని తీర్మానించుకున్నారు. వీరు దార్బరులోనికి రాగానే నజాషీ,"ఏమిటీ మీరు చేసింది, మీ జాతి ధర్మాన్ని కూడా వదిలేశారట. నా ధర్మాన్ని కూడా స్వీకరించ లేదు. అలాగే ప్రపంచంలోని ఇతర ధర్మాల్లో దేన్నీ అనుసరించడం లేదు? అసలు ఆ క్రొత్త ధర్మం ఏమిటి?" అని ప్రశ్నించాడు.

ఈ ప్రశ్నకు సమాధానం ఇవ్వడానికి ముహాజిర్లు హజ్రత్ జాఫర్ (ర) బిన్ అబీ తాలిబ్‌ను ముందుకునెట్టారు. ఆయన సందర్భోచితమైన ఓ ప్రసంగం చేస్తూ, అరేబియా అజ్ఞానపు నైతిక, ధార్మిక మరియు సామాజిక రుగ్మతలను వివరించారు. ఆ తరువాత దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స)గారి దైవదౌత్యం గురించి చెబుతూ ఆయన బోధనలను వివరించారు. ఆ పిదప దైవప్రవక్త (స)గారిని అనుసరించిన వారిపై ఖురైషుల ఆగడాలను, హింసలను ఏకరువు పెట్టారు. ఇదంతా చెప్పి, "మాపై ఎలాంటి దౌర్జన్యం జరుగదు అనే ఆశతో మేము ఇతర దేశాలకు పోకుండా మీ దేశానికి వలస వచ్చామ"ని చెబుతూ తన ప్రసంగాన్ని ముగించారు. నజాషీ ఈ ప్రసంగం విన్న తరువాత; "ఏదీ! దైవం తరఫున మీ ప్రవక్తపై అవతరించిన ఆ వాణి ఏదో కొంత వినిపించు" అని అడగగా, హజ్రత్ జాఫర్(ర), హజ్రత్ యహ్యా (అ) మరియు హజ్రత్ ఈసా (అ)కు సంబంధించిన వివరాలతో కూడిన దివ్యఖుర్ఆన్‌లోని 'మరియం' అధ్యాయపు ప్రారంభ వాక్యాలను పఠించనారంభించారు. నజాషీ ఈ ఆయతలను వింటూ రోదించసాగాడు. అలా రోదించడం వలన అతని గడ్డం కూడా

కన్నీటితో తడిసి ముద్దయిపోయింది. హజ్రత్ జాఫర్(ర) గ్రంథపఠనం పూర్తి చేసిన తరువాత అతను, "నిశ్చయంగా ఈ వాణి, హజ్రత్ ఈసా (అ) తెచ్చిన వాణి రెండూ ఒకే చెలమ నుండి పుట్టినవి. దైవసాక్షిగా చెబుతున్నాను, నేను వీరిని మీకు అప్పజెప్పేదేలేదు" అని పలికాడు.

మరునాడు అమ్రూ బినుల్ ఆస్ నజాషీ వద్దకు వచ్చి, "తమరు వారిని మరలా పిలిపించి, మరియం కుమారుడైన హజ్రత్ ఈసా (అ) గురించి వారి అభిప్రాయం ఏమిటో అడగండి, వీరు ఆయన గారి (ఈసా-అ) పట్ల అపచారమైన పదాలను పలుకుతున్నారు' అని ప్రేరేపించాడు. నజాషీ అతని మాటలను విని తిరిగి ముహాజిర్లను దర్బారుకు రమ్మని ఆదేశించడం జరిగింది. ముహాజిర్లకు మొదటి నుండే అమ్రూ ఎత్తుగడలు ఏమిటో బాగా తెలుసు. తిరిగి వారు సమావేశమై, నజాషీ హజ్రత్ ఈసా (అ) గారి గురించి ప్రశ్నిస్తే ఏ సమాధానం చెబుదాం అనే ఆలోచనల్లో పడ్డారు. అది సంక్లిష్టమైన సందర్భం. భయానికి లోనైపోయారంతా. అయితే, "అతను ఈసా (అ) గురించి అడిగినా, అల్లాహ్ చెప్పిన విషయాన్నే చెబుదాం, ఏది జరిగినా ఫరవా లేదు' అంటూ అందరూ ఓ నిర్ణయానికి వచ్చారు.

అందరూ కలిసి దర్బారుకు వచ్చారు. నజాషీ, అమ్రూ బిన్ ఆస్ సమస్యను వారి ముందుంచి, 'ఏమిటి మీ సమాధానం' అని అడిగాడు. హజ్రత్ జాఫర్ (ర) నిలబడి ఎలాంటి సంకోచం లేకుండా ఖుర్ఆన్‌లోని ఈ ఆయత్‌ను పఠించారు.

"మసీహ్, మరియం కుమారుడైన ఈసా, అల్లాహ్ పంపిన ఓ ప్రవక్త; అల్లాహ్ మరియం వైపునకు పంపిన ఓ ఆజ్ఞ. అల్లాహ్ తరపు నుండి వచ్చిన (మరియంకు గర్భంలో బిడ్డరూపం దాల్చిన) ఒక ఆత్మ." (నిసా: 171)

ఇది విన్న నజాషీ భూమ్మీదనుండి ఓ పూచిక పుల్లనెత్తి చూపుతూ, "దైవసాక్షిగా, ఈసా (అ) నీవు చెప్పినదానికంటే ఈ గడ్డిపోచ అంత కూడా అధికం కాదు" అని పలికాడు. ఆ తరువాత అతను ఖురైషీలు పంపిన కానుకలన్నింటిని వెనక్కు తిరిగి ఇచ్చివేస్తూ, నేను లంచం పుచ్చుకునే వాణ్ణికాదు అని చెప్పి ముహాజిర్లను సంభోదిస్తూ మీరు పూర్తి నిశ్చింతగా ఇక్కడ ఉండవచ్చు అని అనడం జరిగింది.

సందేశ ప్రచారం నేర్పే పాఠాలు

1. అస్హాబె కహఫ్ (గుహవారి) సంఘటనలో, ఒకవేళ దైవతిరస్కారులు ఎంత ఆధిక్యతను సంతరించుకొని ఉన్నా, ఆ దుర్మార్గ సమాజంలో ఓ విశ్వాసికి

శ్వాసను పీల్చుకునే వెసలుబాటు కూడా లభించకపోయినప్పటికీ ఆ అసత్యం ముందు తలను వంచకూడదు అనే పాఠం లభిస్తుంది.

2) అబిసీనియాకు వలస వెళ్ళిన ముహాజిర్ల సంఘటనల్లో మనకు లభించే గుణపాఠం ఏమిటంటే, ఓ దుర్మార్గపు సమాజంలో అసత్యం ముందు తలవంచ కూడదు, పైగా అల్లాహ్‌పై భారంవేసి వలస వెళ్ళిపోవాలన్నది. మరో విషయం ఈ సంఘటన ద్వారా ప్రస్ఫుటం అయ్యేదేమిటంటే, ముస్లిములు ఓ పీడిత శరణార్థులుగా తమ దేశాన్ని వదిలి మరో దేశానికి వెడుతున్నప్పటికీ ఆ పరిస్థితిలో అల్లాహ్ వారికి ధర్మం విషయంలో రవ్వంతైనా రాజీపడే అనుమతి ఇవ్వలేదని, పైగా వెడుతూ వారు దారి భత్యంగా 'మరియం సూరాను' తమ వెంట తీసుకువెళ్ళారు. తద్వారా వారు క్రైస్తవుల దేశంలోనికి వెళ్ళి హజ్రత్ ఈసా (అ) నిజమైన స్థితి ఏమిటో ప్రదర్శించే మరియు ఆయన దైవకుమారుడు అనే విషయాన్ని నిక్కచ్చిగా తిరస్కరించే ధైర్యం కలిగి ఉన్నారు అన్నది.

3) పై రెండు సంఘటనల ద్వారా మనకు లభించే మూడవ పాఠం ఏమిటంటే, సత్యధర్మాన్ని స్వీకరించేవారు తమ కార్యచరణ, తమ నడవడి ద్వారా వారు స్వీకరించిన సత్యాన్ని రుజువు చేసుకోనంతవరకు, దైవసహాయానికి అర్హులు కాలేరు అన్నది. అలాగే వీరు ఆ మార్గంలో తమ బంధువులతో సహా సంబంధాలను తెగ తెంపులు చేసుకోగలరు. మాతృభూమిని వదిలిపెట్టనూగలరు, తమ ప్రాణాలను త్యజించనూగలరు కాని సత్యధర్మాన్ని వీడడంగాని, దాన్ని దాచిపెట్టుకోవడంగాని, అసత్యం ముందు తలవంచడం గాని చేయరు. అలా చేయని పక్షంలో వారు తమ గమ్యం వరకు చేరుకోవడంగాని, దైవసహాయాన్ని బడయడంగాని జరుగదు అనే పాఠం అది.

4) నాల్గవ పాఠం ఏమిటంటే, సత్యధర్మాన్ని స్వీకరించేవారు దైవంపై భారం వేసి ప్రపంచంలోని అన్ని సంబంధ బాంధవ్యాలను, అన్ని రకాల వనరుల్ని వదిలి వేసినప్పుడు అల్లాహ్ వారిని ఒంటరిగా వదిలేయడు, వారికి నష్టం కలగకుండా కాపాడగలడు. వారు చివరికి అందరికీ ప్రియమైన వారుగానే వినుతికెక్కగలరు అన్నది.

సత్యపిపాసులకు సంబంధించిన ఓ చారిత్రక సంఘటన

قَالَ أَرَاغِبٌ أَنتَ عَنْ آلِهَتِي يَا إِبْرَاهِيمُ ۖ لَئِن لَّمْ
تَنتَهِ لَأَرْجُمَنَّكَ ۖ وَاهْجُرْنِي مَلِيًّا ○ قَالَ سَلَامٌ عَلَيْكَ ۖ
سَأَسْتَغْفِرُ لَكَ رَبِّي ۖ إِنَّهُ كَانَ بِي حَفِيًّا ○ وَأَعْتَزِلُكُمْ
وَمَا تَدْعُونَ مِن دُونِ اللَّهِ وَأَدْعُو رَبِّي عَسَىٰ أَلَّا

اَكُوْنَ بِدُعَاۤءِ رَبِّیْ شَقِیًّا۝ فَلَمَّا اعْتَزَلَهُمْ وَمَا یَعْبُدُوْنَ
مِنْ دُوْنِ اللّٰهِ ۙ وَهَبْنَا لَهٗۤ اِسْحٰقَ وَیَعْقُوْبَ ؕ وَكُلًّا جَعَلْنَا
نَبِیًّا۝ وَوَهَبْنَا لَهُمْ مِّنْ رَّحْمَتِنَا وَجَعَلْنَا لَهُمْ لِسَانَ
صِدْقٍ عَلِیًّا۝ (مریم: ۴۶ تا ۵۰)

తండ్రి ఇలా అన్నాడు: ఓ ఇబ్రాహీం నీవు నాకు ఆరాధ్యులైన వారికి విముఖుడవు అయ్యావా? నీవు దీనిని మానుకోకపోతే నేను నిన్ను రాళ్ళతో కొట్టి చంపేస్తాను. కనుక నీవు శాశ్వతంగా నాకు దూరంగా వెళ్ళిపో." ఇబ్రాహీం ఇలా అన్నాడు: "మీకు సలామ్. మిమ్మల్ని మన్నించ వలసిందని నేను నా ప్రభువును ప్రార్థిస్తాను. నా ప్రభువు నాపై ఎంతో దయకలవాడు. నేను మిమ్మల్ని కూడా విడిచిపోతున్నాను. మీరు దేవుణ్ణి కాదని ప్రార్థిస్తున్న శక్తులను కూడా విడిచిపోతున్నారు. నేను నా ప్రభువునే ప్రార్థిస్తాను. నా ప్రభువును ప్రార్థించి నేను విఫలుణ్ణి కాబోనని నమ్ముతున్నాను."

ఈ విధంగా అతను వారి నుండి, వారి అల్లాహ్‌యేతర ఆరాధ్యుల నుండి వేరైపోయినప్పుడు, మేము అతనికి ఇస్‌హాక్, యాకూబ్‌ల వంటి సంతానాన్ని ప్రసాదించాము. ప్రతి ఒక్కరినీ ప్రవక్తగా చేశాము. వారికి మా కరుణను ప్రసాదించాము. వారికి నిజమైన, ఉన్నతమైన కీర్తి ప్రతిష్ఠలను కలుగజేశాము."
(మరియమ్: 46-50)

ఈ అభయహస్తం, ఇల్లూవాకిలి వదిలి వలస వెళ్ళే ముహాజిర్ల కోసం. ఇబ్రాహీం (అ) ఎలాగైతే తెగతెంపులు చేసుకొని తమ కుటుంబాన్ని వదిలేసి ఏ విధమైన నష్టాలకు గురికాలేదు; పైగా ఆయన పేరు ప్రఖ్యాతులు సంతరించుకోగలిగారో అలానే మీరు కూడా నష్టాలకు గురికారని, గౌరవాన్నే పొందగలరని, అజ్ఞానాంధకారంలో కొట్టుమిట్టాడుతున్న ఖురైష్ దైవధిక్కారులకు ఇది ఊహామాత్రంగానైనా తట్టే విషయం కాదు అని తెలియజేయడం అన్నమాట.

దైవసందేశ ప్రచారం - ప్రజాదరణ

اِنَّ الَّذِیْنَ اٰمَنُوْا وَعَمِلُوا الصّٰلِحٰتِ سَیَجْعَلُ
لَهُمُ الرَّحْمٰنُ وُدًّا۝ (مریم: ۹۶)

"నిశ్చయంగా, విశ్వసించి, సత్కార్యాలు చేస్తూఉన్నవారి పట్ల త్వరలోనే కరుణామయుడు హృదయాలలో ప్రేమను కలుగజేస్తాడు." (మరియమ్-96)

అంటే నేడు మక్కా వీధుల్లో వీరు అగౌరవానికి గురౌతున్నారు. కాని ఈ పరిస్థితి చాలాకాలం ఉండేదికాదు. వారు తమ కర్మల కారణంగా, నైతిక విలువలు

ప్రదర్శించడం మూలంగా ప్రజాదరణ పొంది వారి మనస్సుల్లో చోటు సంపాదించుకునే కాలం ఎంతోదూరం లేదు. ప్రజల హృదయాలు వారివైపుకు ఆకర్షించబడతాయి. ప్రపంచం వారిని ఆదరిస్తోంది. దుర్మార్గాలు, తలబిరుసుతనం, గర్వం మరియు ప్రదర్శనాబుద్ధిబలంపై యే అధికారం అయితే చెలామణి అవుతుందో అది బల వంతంగా తలలను తన ముందు వంచేటట్లు చేసుకున్నా, వారి హృదయాలను మాత్రం తన వైపునకు మొగ్గేటట్లు చేసుకోలేదు. దీనికి భిన్నంగా ఎవరైతే సత్యం, న్యాయం, నైతికవిలువలు, చిత్తశుద్ధితో సన్మార్గం వైపుకు పిలుస్తున్నారో వారి వైపునకు, ప్రారంభంలో ప్రజలు దగ్గరకు రాకుండా ఉన్నా చివరికి వీరి సుగుణాలు హృదయాలను చూరగొంటాయి. అన్యాయాక్రమాలకు పాల్పడేవారి అసత్యవైఖరి మరింతకాలం వారిని నిలువరించజాలదు.

సత్యాన్ని ఢీకొనే అసత్యవాద శక్తులు

(అ) దివ్యఖుర్ఆన్‌లోని 'ఫలిక్' మరియు 'నాస్' అధ్యాయాల్లో అల్లాహ్ విశ్వాసులకు అవలంభించవలసిన వైఖరిని ఏమిటో వివరించడం జరిగింది. అసత్య వాదశక్తులు చివరి పోరాటంగా వారిని ఢీకొనేందుకే సిద్ధమైనప్పుడు వారు నిర్ణయించు కోవలసింది మిగిలి ఉండేది తామా? లేదా అసత్యమా? అని. అయితే అసత్యానికి తన సంఖ్యాబలం మరియు వనరులపైన్నే భరోసా ఎక్కువ. బ్రతికి ఉండే హక్కు దానిదే అనే నమ్మకంతో ముందుకు వస్తుంది. సత్యవాదులు అల్పసంఖ్యా కులు, ఎలాంటి సహాయం లేనివారు, మరేరకమైన వనరులు లేనివారు కాబట్టి వారు తుడిచిపెట్టుకుపోవలసిందే, వారిని నామరూపాల్లేకుండా తుదముట్టించ వలసిందే అనే భావనను కలిగి ఉంటుందది. అలాంటప్పుడే అల్లాహ్ తీర్పు వెలువడేది. మక్కాలో అవతరించిన పై రెండు అధ్యాయాల సందర్భం కూడా అదే. ఇస్లామ్ ధర్మప్రచారం ప్రారంభం కాగానే, దైవప్రవక్త (స) కందిరీగల తుట్టెలో చెయ్యి పెట్టారా అని అనిపించింది. ఆయన (స) సందేశం విస్తరించుకుపోతున్నకొలది దైవధిక్కారులైన ఖురైష్ ప్రతిఘటన, వ్యతిరేకతలు కూడా పెరుగుతూపోయాయి. చివరికి ఓ దశలో బహుశా ఆశ చూపి, బుజ్జగించి ఆయన్ను ఆ కార్యం నుండి అడ్డుకునే ప్రయత్నాలు కూడా జరిగాయి. ఆ సమయంలో ఖురైషీల వైరంలో కొంత తగ్గుదల అగుపించింది కూడా. కాని దైవప్రవక్త (స) వారిని ఆ విషయంలో పూర్తిగా నిరాశకు గురిచేశారు. ధర్మం విషయంలో ఎలాంటి రాజీకి సిద్ధం కాకపోయినప్పుడు, దివ్యఖుర్ఆన్‌లోని 'కాఫిరూన్' సూరాలో "ఎవరినైతే మీరు ఆరాధిస్తున్నారో వారిని నేనేమాత్రం ఆరాధించే వాడను కాను. అలాగే నేనెవరిని ఆరాధిస్తున్నానో మీరు ఆయన్ను ఆరాధించేవారు కాదు. "నా మార్గం వేరు, మీ మార్గం వేర"ని నికచ్చిగా చెప్పడం జరిగింది. ఇంకేముంది! దైవతిరస్కారుల విరోధం తారస్థాయికి చేరుకుంది. ప్రత్యేకంగా ఏ కుటుంబాల వ్యక్తులైతే (స్త్రీలు మరియు పురుషులు, యువకులు మరియు యువతులు) ఇస్లామ్ ధర్మాన్ని

స్వీకరించారో వారికీ, దైవప్రవక్త (స)గారికి వ్యతిరేకంగా అగ్గిమీద గుగ్గిలం అయిపోవడం జరిగింది. ప్రతి ఇంటా ఆయన్ను తిట్టడం జరిగేది. రాత్రిపూట రహస్యంగా దైవప్రవక్త (స)ను హతమార్చే పన్నాగాలు ప్రారంభం అయ్యాయి. ఆయనను హత్యచేస్తే బనూ హాషిమ్‌కు హంతకుడెవరో తెలియకుండా ఎలా ఉంచాలా అనే ఉపాయాలు ఆలోచింప బడసాగాయి. దైవప్రవక్త (స) చనిపోవడానికి, లేదా ఆయన రోగగ్రస్తుడు కావడానికి లేదా పిచ్చివానిగా మారిపోవడానికిగాను ఆయనకు వ్యతిరేకంగా ఇంద్ర జాలం, మంత్రతంత్రాలు చేసే పన్నాగాలూ పన్నసాగారు. జిన్నులు మరియు మానవ సైతానులు అన్ని వైపులకు విస్తరించి దైవప్రవక్త (స)కు ఆయన తెచ్చిన ధర్మానికి వ్యతిరేకంగా మరియు దివ్యఖుర్‌అన్‌కు వ్యతిరేకంగా ప్రజల మనస్సుల్లో దుర్బుద్ధులు పుట్టించేందుకు కృషి ప్రారంభించారు. చాలా మంది హృదయాల్లో అసూయాగ్ని ప్రజ్వరిల్లుతూ ఉండేది. ఎందుకంటే, వారి తప్ప, వారి తెగకు చెందిన ఓ వ్యక్తి తప్ప మరొకరి కీర్తి ప్రతిష్ఠలు పెరగడం వారికి నచ్చేదికాదు. ఉదాహరణకు ఏ కారణం చేతనైతే దైవప్రవక్త(స)గారి వ్యతిరేకతలో అబూజహల్ ముందడుగులో ఉన్నాడో ఆ కారణం అతను స్వయంగా తన నోటి ద్వారా తెలియజేయడం జరిగింది.

"మాకూ, బనీ అబ్దె మునాఫ్‌కు (అంటే దైవప్రవక్త (స)గారి కుటుంబం) నడుమే పోటీ అంతా. వారు అన్నదానాలు, సంతర్పణలు చేస్తే మేమూ చేసేవారం. వారు ప్రజలకు వాహనాలను సమకూరిస్తే మేమూ సమకూర్చేవారం. వారు చందాలు ఇస్తూ ఉంటే మేమూ ఇచ్చేవారం. చివరికి వారూ మేమూ సమవుజ్జీలుగా నిలిచాము. ఇప్పుడువారు మాలో ఒక ప్రవక్త ఉద్భవించాడని, ఆయనపై ఆకాశం నుండి దైవవాణి అవతరిస్తూ ఉంది అని అంటే, మేమెలా వారిని ఎదుర్కోగలం? దైవసాక్షి! మేము దాన్ని అసలే స్వీకరించం, మేమసలే దాన్ని ధృవపరచం."

(ఇబ్నెహిషామ్-పుట-337-338)

ఈ పరిస్థితుల్లోనే అల్లాహ్ దైవప్రవక్తను సంబోధిస్తూ:

"ఇలా అను: నేను ఉదయం ప్రభువు శరణు కోరుతున్నాను. ఆయన సృష్టించిన ప్రతిదాని కీడు నుండి, కమ్ముకునే చీకటి రాత్రి నుండి, ముడులపై మంత్రించేవారి కీడు నుండి, అసూయాపరుడు అసూయ పడేటప్పటి కీడు నుండి మరియు మానవుల ఆరాధ్య దైవం (అయిన అల్లాహ్) శరణు కోరుతున్నాను- దుష్టభావాలు రేకెత్తించేవాడి కీడు నుండి, వాడు మాటిమాటికి మరలివస్తూ ప్రజల మనస్సుల్లో దుష్టభావాలను రేకెత్తిస్తాడు. వాడు జిన్నాతు జాతికి చెందినవాడైనా కావచ్చు లేదా మానవజాతికి చెందిన వాడైనా కావచ్చు."

ఫిర్‌ఔను దర్బారులో హజ్రత్ మూసా (అ)ను హతమార్చే అభిప్రాయం పొడసూపినప్పుడు ఏర్పడిన పరిస్థితిలాంటిదే ఈ పరిస్థితి. అప్పుడు మూసా (అ) వారితో ఇలా అనడం జరిగింది:

إِنِّي عُذْتُ بِرَبِّي وَرَبِّكُم مِّن كُلِّ مُتَكَبِّرٍ لَّا يُؤْمِنُ بِيَوْمِ الْحِسَابِ (المؤمن : ٢٧)

"లెక్కల రోజును విశ్వసించని ప్రతి దురహంకారి బారి నుండి కాపాడు అని నా ప్రభువూ, మీ ప్రభువును శరణుకోరాను." (అల్ మోమిన్-27)

وَإِنِّي عُذْتُ بِرَبِّي وَرَبِّكُمْ أَن تَرْجُمُونِ (الدخان)

"మీరు నా మీద దాడి చేయకుండా నేను మన ప్రభువు యొక్క శరణు పొందాను." (అద్‌దుఖాన్:20)

రెండు సందర్భాల్లోనూ ఈ ఇద్దరు మహాప్రవక్తలు, గొప్ప మందీమార్బలం కలిగి, అన్ని రకాల వనరులు కలిగి నిక్కనీలిగే వారిని నిస్సహాయస్థితిలో ఎదుర్కొన వలసి వచ్చింది. రెండు సందర్భాల్లోనూ వారు శక్తివంతులైన శత్రువుల ముందు దైవసందేశ ప్రచారమార్గంపై స్థిరంగా నిలబడ్డవారే. విశ్వాస పటిమ తప్ప వారిని ఎదుర్కొవడానికి తమవద్ద ఎలాంటి భౌతికమైన సరంజామా లేదు. ఈ రెండు సందర్భాల్లోనూ, శత్రువుల బెదిరింపులు, ప్రమాదకరమైన వారి ఎత్తుగడలను చూచి వారు, మేము మా విశ్వప్రభువు యొక్క శరణు జొచ్చామనే చెబుతూ వాటిని త్రిప్పికొట్టడం జరిగింది. ఈ పట్టుదల, ఈ స్థయిర్యం, నిలకడలు ప్రదర్శించేది కేవలం దైవశక్తే సర్వోన్నతమైన శక్తి అనే తిరుగులేని నమ్మకంగలవారే. ఆ దైవం ముందు ఈ ఇహలోక శక్తి యుక్తులన్నీ దిగదుడుపే. ఆయన శరణు ఎవరికైతే లభిస్తుందో అతనికి మరేశక్తి కీడును తలపెట్టలేదు. అలాంటి వ్యక్తి సత్యధర్మ ప్రకటన చేయడానికి ఏమాత్రం వెనుకాడడు. దానిపై నిలకడగానే ఉంటాడు. 'నేను మీ ప్రభువూ, నా ప్రభువూ, ఈ విశ్వానికే ప్రభువు అయిన అల్లాహ్ శరణు పొందాను. కాబట్టి మీరేమి చేసుకున్నా ఫరవాలేదు. దాన్ని నేను పట్టించుకునేవాడిని కాను అని ప్రకటించేస్తాడు.

అపజయం, వినాశాలు చివరకు అసత్యానివే

దివ్యఖుర్ఆన్‌లోని 'ఇబ్రాహీమ్' అధ్యాయం అవతరించిన కాలం, ఈ సంఘర్షణ చివరి ఘట్టంలో ప్రవేశించినకాలం. ఇందులో గత ప్రవక్తలు మరియు వారికి వ్యతిరేకంగా పనిజేసిన శక్తులకు సంబంధించిన సంగ్రహమైన చరిత్ర చెప్పడం జరిగింది. ఆ ప్రవక్తలు తమ సమాజ ప్రజలకు సత్యధర్మాన్ని ఎంత సమర్ధవంతంగా చేరవేయగలిగారో, దైవంపై భారంవేసి వారు దౌర్జన్యపరుల దుర్మార్గాలను ఎంత

మనోస్థయిర్యంతో ఎదుర్కొన్నారో చెప్పడం జరిగింది. దౌర్జన్యం, దుర్మార్గాలు మరీ మితిమీరిపోయినప్పుడు ఆ దుర్మార్గులపై అల్లాహ్ శిక్ష విరుచుకుపడింది.

وَمَا لَنَآ اَلَّا نَتَوَكَّلَ عَلَى اللّٰهِ وَقَدْ هَدٰىنَا سُبُلَنَا ۭ
وَلَنَصْبِرَنَّ عَلٰى مَآ اٰذَيْتُمُوْنَا ۭ وَعَلَى اللّٰهِ فَلْيَتَوَكَّلِ
الْمُتَوَكِّلُوْنَ ۝ (ابراہیم : ۱۲)

ఆ ప్రవక్తలు ఇలా అన్నారు: "మనం అల్లాహ్‌ను ఎందుకు నమ్ముకోకూడదు? మీరు మాకు పెడుతున్న బాధలను ఓర్పుతో సహిస్తాము. నమ్ముకునేవారు అల్లాహ్‌ను మాత్రమే నమ్ముకోవాలి." (ఇబ్రాహీం:12)

సత్యానికి వ్యతిరేకంగా దైవతిరస్కారుల వైఖరి

وَقَالَ الَّذِيْنَ كَفَرُوْا لِرُسُلِهِمْ لَنُخْرِجَنَّكُمْ مِّنْ اَرْضِنَآ
اَوْ لَتَعُوْدُنَّ فِيْ مِلَّتِنَا ۭ فَاَوْحٰٓى اِلَيْهِمْ رَبُّهُمْ لَنُهْلِكَنَّ
الظّٰلِمِيْنَ ۝ وَلَنُسْكِنَنَّكُمُ الْاَرْضَ مِنْۢ بَعْدِهِمْ ۭ
ذٰلِكَ لِمَنْ خَافَ مَقَامِيْ وَخَافَ وَعِيْدِ ۝ (ابراہیم: ۱۳،۱۴)

చివరకు తిరస్కారులు తమ ప్రవక్తలతో ఇలా అన్నారు: "మీరు మా మతంలోకి తిరిగి రావాలి. లేకపోతే మేము మిమ్మల్ని మా దేశం నుండి బహిష్కరిస్తాము." అప్పుడు వారి ప్రభువు వారికి ఇలా 'వహీ'ని పంపాడు. "మేము ఈ దుర్మార్గులను నాశనం చేస్తాము. వారి తరువాత మిమ్మల్ని భూమిపై వసింపజేస్తాము. నా సాన్నిధ్యంలో సమాధానం చెప్పుకోవలసి ఉందని భయపడుతూ నా శిక్షకు భయపడే వ్యక్తికే ఈ బహుమానం." (ఇబ్రాహీం:13,14)

అంటే, "భయపడకండి, మీరు ఈ దేశంలో ఉండలేరనే కదా వీరంటున్నది! కాని, మిమ్మల్ని విశ్వసించేవారు తప్ప ఈ భూభాగంలో మరెవ్వరూ ఉండలేరు అని మేమంటున్నాం" అనేది దాని భావం.

నేరగాళ్ళ పీచమణిచే దైవవిధానం

وَمَا كُنَّا مُعَذِّبِيْنَ حَتّٰى نَبْعَثَ رَسُوْلًا ۝

"(ప్రజలకు సత్యాసత్యాల మధ్య తేడా ఏదో చూపడానికిగాను) ఓ ప్రవక్తను పంపనంతవరకు మేము వారిని శిక్షించే వారముగాము." (ఖుర్ఆన్)

ఇది ఓ సైద్ధాంతికమైన యదార్థం. దీన్ని మాటిమాటికి ఖుర్ఆన్ వివిధ రకాలుగా మనిషి హృదయంలో నాటడానికి ప్రయత్నం చేస్తుంది. దీన్ని వివరంగా చెప్పాలంటే,

అల్లాహ్ న్యాయవ్యవస్థలో ప్రవక్తకు ఓ మౌలికమైన ప్రాధాన్యత ఉందని, ప్రవక్త మరియు ఆయన తెచ్చిన సందేశమే ఓ హేతువు లేదా ఆర్గ్యుమెంటు అన్నది. అది లేకుండా దాసులను శిక్షించడం న్యాయానికే వ్యతిరేకమైన చర్య అవుతుంది. ఎందుకంటే అలా జరిగితే వారు, అసలు మాకు ఆ విషయమే తెలియదు, మరి మాపై ఈ శిక్ష ఎందుకు వేయవలసి వచ్చిందని వాదించవచ్చు. ప్రవక్తల ద్వారా ఆ విషయం వారికి తెలిసిన తరువాత కూడా అల్లాహ్ పంపిన సందేశాన్ని తిరస్కరించి నందుకు లేదా దాన్ని జవదాటినందుకు వారిని శిక్షించడంలో ఔచిత్యం ఉంది. అయితే, ఈ రకమైన ఆయతులను పఠించి కొందరు బుద్ధిమందగించినవారు, మరెవరికైతే ప్రవక్త సందేశం అందలేదో వారి పొజిషన్ ఏమిటి? అని ప్రశ్నిస్తారు కూడా. మరి నీ వద్దకు ఆ సందేశం వచ్చింది, నీవు దాని గురించి ఆలోచించిందేమిటి? ఇప్పుడు నీ పొజిషన్ ఏమిటి? అని ఆలోచించవలసి ఉంది ఓ బుద్ధిమంతుడు. తక్కిన వారి విషయం అంటావా? ఎవరి వద్దకు ఎప్పుడు, ఏ విధంగా, ఎంతవరకు ఆయన సందేశం చేరింది అన్నది అల్లాహ్‌కే బాగా తెలుసు. ఈ విషయంలో అతనిపట్ల ఆయన వైఖరి ఎలా ఉంటుంది? ఎవరి వద్దకు ఆ సందేశం చేరింది, ఎవరి వద్దకు అది చేరలేదు అన్నది పరోక్ష జ్ఞానం కలిగిన ఆ సర్వేశ్వరుని తప్ప మరెవరికీ తెలియని సత్యం.

మార్గభ్రష్టమైన మానవ సమాజాలు - దైవనిర్ణయం

وَإِذَا أَرَدْنَا أَنْ نُهْلِكَ قَرْيَةً أَمَرْنَا مُتْرَفِيهَا
فَفَسَقُوا فِيهَا فَحَقَّ عَلَيْهَا الْقَوْلُ فَدَمَّرْنَاهَا تَدْمِيرًا
(بنی اسرائیل : ۱۶)

"మేము ఒక పట్టణాన్ని నాశనం చేయదలుచుకున్నప్పుడు, అందరి స్థితిమంతు లకు మొదట ఒక ఆజ్ఞను పంపుతాము. వారు ఆ ఆజ్ఞ విషయంలో అవిధేయతకు పాల్పడతారు. అప్పుడు శిక్ష నిర్ణయానికి ఆ పట్టణం అర్హమౌతుంది."

(బనీఇస్రాయీల్:16)

ఈ ఆయత్‌లో ఆజ్ఞ అంటే భౌతికమైన, మరియు ప్రకృతి సిద్ధమైన ఆజ్ఞ అని అర్థం. అంటే, దైవికంగా ఏ జాతికైనా రోజులు తీరిపోయినప్పుడు ఆ జాతికి సంబం ధించిన కులీనులు, స్థితిమంతులు మార్గభ్రష్టులైపోవడం పరిపాటే. శిక్షకు అర్హమవడం అంటే, ఎలాంటి తప్పిదం చేయని ఓ పట్టణాన్ని తుదముట్టించడానికి నిర్ణయించు కోవడం అని కాదిక్కడ అర్థం. అసలు భావం ఏమిటంటే, ఎప్పుడైనా ఓ మానవ సమాజం చెడు మార్గాలను అవలంభిస్తూ ఆ మార్గంపైన్నే నడవడానికి నిర్ణయం గైకొంటుందో ఆ సమాజాన్ని నాశనం చేయదలచుకున్నప్పుడే ఆయన ఆజ్ఞ వెలువడు తుందని అర్థం.

ఈ ఆయత్‌లో యే యదార్థం గురించైతే హెచ్చరించడం జరిగిందో అది అప్పటి ఆ సమాజాల్లోని స్థితి మంతులు, కులీనులు, ఉన్నతవర్గం ప్రజలు చెడిపోయి నందువలననే ఆ సమాజం పూర్తిగా చెడిపోతుంది అన్నది. ఎప్పుడైనా ఓ జాతికి కాలం తీరిపోయినప్పుడు ఆ జాతికి సంబంధించిన అధికార మదాంధులు చెడు వాంఛల్లో లీనమైపోతారు. దౌర్జన్యం, హింస, వ్యభిచారం, అశ్లీలాల్లో చిక్కుకుపోతారు. ఈ ఉపద్రవం చివరికి వారితోపాటే ఆ జాతి మొత్తాన్ని సర్వనాశనం చేసేస్తుంది. కాబట్టి ఏ జాతి అయినా తన శ్రేయం కోరుకున్నట్లయితే అది అధికార పగ్గాలను, ఆర్థిక వనరుల తాళపుచెవులను ఆ దుర్మార్గుల చేతికి పోకుండా జాగ్రత్తవహించవలసి ఉంటుంది.

నామరూపాల్లేకుండా పోయేది చివరికి అసత్యమే

وَاسْتَفْتَحُوا وَخَابَ كُلُّ جَبَّارٍ عَنِيدٍ ۝

"వారు తీర్పును కోరుకున్నారు" (అప్పుడు తీర్పు ఇలా జరిగింది) ప్రతి దౌర్జన్య పరుడైన సత్యతిరస్కారుడు అవమానం పాలయ్యాడు."

చెడిపోయిన జాతులు తమ కాలపు ప్రవక్తలతో చేసిన యుద్ధం అలాంటిదే. వారు తమ అంగబలం, అర్థబలం, బాహ్యాపటాటోపాలకు గర్వపడ్డారు. సత్యావలంబీకులు నిస్సహాయులు, బలహీనులని, వారిని నామరూపాల్లేకుండా తుడిచి వేయగల మనే గర్వంతో నిక్కుతూ, నీల్గుతూ యుద్ధరంగంలో అడుగుపెట్టారు. కాని సత్యపిపాసులు, తాము ఎంత బలహీనులు, ఎలాంటి యుద్ధ సంపత్తి లేనప్పటికీ కేవలం అల్లాహ్‌పై నమ్మకం ఉంచి శత్రువుల పటాటోపాన్ని ఏమాత్రం పట్టించుకోకుండా యుద్ధమైదానంలో మేరు పర్వతాల్లా నిలబడ్డారు. అప్పుడు అల్లాహ్ అభయహస్తం ఆ దుర్మార్గుల ప్రణాళికలన్నిటినీ మట్టిలో కలిపేసింది.

మక్కా దైవతిరస్కారులకు, దైవప్రవక్త ముహమ్మద్ (స) పట్ల వారు ప్రవర్తిస్తున్న అసభ్య ప్రవర్తనకు జవాబుగా ఈ చారిత్రక సంఘటన దివ్యఖుర్‌ఆన్‌లో వివరించడం జరిగింది. చూడడానికి ఈ సంఘటన గతించిన ప్రవక్తలు మరియు జాతులకు సంబంధించిందే అయినా, ఈ సూరా అవతరించినప్పుడు ఎదురౌతున్న పరిస్థితులకు ఇది పూర్తిగా అతుకుతోంది. ఇక మక్కా దైవతిరస్కారులు, బహుదైవారాధకులకు, మీ భవిష్యత్తు, మీరు అవలంబించే వైఖరిపైన్నే పూర్తిగా ఆధారపడి ఉందని, ఒకవేళ దైవసందేశాన్ని మీరు స్వీకరిస్తే అరేబియా భూభాగంలో మనగలుగుతారు, దాన్ని తిరస్కరిస్తే మాత్రం మీ నామరూపాలు కూడా లేకుండా తుడిచివేయబడతారు అని ఎలాంటి అరమరికలు లేకుండా హెచ్చరించడం జరిగింది.

ఈ హెచ్చరికను ఆ తరువాత సంభవించిన సంఘటనలు నిజం చేసి చూపాయి. ఈ భవిష్యవాణికి పదిహేను సంవత్సరాలు కూడా గడవకముందే మొత్తం అరేబియాలోనే ఏ ఒక్క బహుదైవారాధకుడూ మిగిలి ఉండలేదు.

దేవుని అంతిమ తీర్పు

وَإِنْ كَادُوا لَيَسْتَفِزُّونَكَ مِنَ الْأَرْضِ لِيُخْرِجُوكَ مِنْهَا وَإِذًا لَا يَلْبَثُونَ خِلَافَكَ إِلَّا قَلِيلًا ۝ (بنی اسرائیل:۷۶)

"వారు నీకు ఈ భూభాగంలో నిలువనీడలేకుండా చెయ్యడానికి, నిన్ను ఇక్కడి నుండి వెళ్ళగొట్టడానికి పూనుకున్నారు,. కాని ఒకవేళ వారు అలా చేస్తే నీ తరువాత వారు కూడా ఇక్కడ ఎంతో కాలం నిలువలేరు." (బనీ ఇస్రాయీల్-76)

ఇదో స్పష్టమైన భవిష్యవాణి. అప్పుడది ఓ అదిరింపుగా కానవచ్చినప్పటికీ పది, పదకొండేళ్ళలోపే అది అక్షరాల నిజమైనదిగా రుజువైంది. ఈ సూరా అవతరించి ఒక్క సంవత్సరం కూడా గడవలేదు, మక్కా దైవతిరస్కారులు దైవ ప్రవక్త (స)ను మాతృభూమినుండి వెళ్ళిపోయేటట్లు వివశులుగా చేశారు. ఆ తరువాత ఎనిమిది సంవత్సరాలు గడిచాయో లేదో ఆయన (స) ఓ విజయునిగా తిరిగి మక్కాలో ప్రవేశించడం జరిగింది. మరి రెండు సంవత్సరాల్లోపే అరేబియా భూభాగం నుండి అరబ్బు బహుదైవారాధకుల ఉనికి తుడుచు పెడుకుపోయింది. ఈ దేశంలో నివసించే ప్రతి ఒక్కడూ బహుదైవారాధకుడుగా కాకుండా ముస్లింగానే ఉండి మనుగడ సాగించడం జరిగింది.

దైవ సంప్రదాయం ఏమిటి?

سُنَّةَ مَنْ قَدْ أَرْسَلْنَا قَبْلَكَ مِنْ رُّسُلِنَا وَلَا تَجِدُ لِسُنَّتِنَا تَحْوِيلًا ۝ (بنی اسرائیل:۷۷)

"ఇది మా సనాతన సంప్రదాయం. దీనినే నీకు పూర్వం మేము పంపిన ప్రవక్తలందరి విషయంలోనూ అనుస రించాము. మా సంప్రదాయంలో నీవు ఏ మార్పునూ చూడలేవు." (బనీ ఇస్రాయీల్-77)

అంటే, ప్రవక్తలందరిపట్లా అల్లాహ్ వ్యవహరించిన తీరు అలాంటిదే. ఏ జాతి అయినా వారిని హతమార్చడమో, దేశ బహిష్కరణకు గురిచేయడమో జరిగినప్పుడు ఆ జాతి కూడా మరింతకాలం అక్కడ నిలువలేకపోయింది అన్నది. దానిపై దైవశిక్ష విరుచుకుపడడమో లేదా మరే శత్రువును వారిపైకి అధికారం చెలాయించడానికి పంపడమో లేదా స్వయం ఆ ప్రవక్త అనుయాయుల ద్వారానే ఆ జాతి అణచివేయ బడడమో జరిగింది అని అర్థం.

దైవసహాయం అందే విధానం

మానసిక మార్గభ్రష్టత్వం మరియు కృతఘ్నతలు తీవ్రమైన నేరాల క్రిందికి వస్తాయి:

وَإِذَا مَسَّكُمُ الضُّرُّ فِي الْبَحْرِ ضَلَّ مَنْ تَدْعُونَ
إِلَّا إِيَّاهُ ۖ فَلَمَّا نَجَّاكُمْ إِلَى الْبَرِّ أَعْرَضْتُمْ ۚ وَكَانَ الْإِنْسَانُ
كَفُورًا ○ (بنی اسرائیل : ٦٧)

"సముద్రంలో మీకేదన్నా ఆపద కలిగినప్పుడు ఆయనొక్కడు తప్ప మీరు పిలిచే వారంతా మటుమాయమై పోతారు. కాని ఆయన మిమ్మల్ని రక్షించి నేలపైకి చేర్చినప్పుడు మీరు ఆయన నుండి ముఖం తిప్పుకుంటారు. మానవుడు నిజంగా చాలా కృతఘ్నుడు." (బనీ ఇస్రాయీల్-67)

"అందరూ మటుమాయమైపోతారు" అని అంటే మీ అసలు నైజం అల్లాహ్ తప్ప మరెవ్వరినీ ప్రభువుగా స్వీకరించరు, లాభనష్టాలు కలిగించే అసలు అధికారం ఆయన ఒక్కడికే ఉందని మీ హృదయాంతరాళం ఘోషిస్తుంది అని అర్థం. అలాకాని పక్షంలో అసలు ఆదుకోవలసి ఉన్న ఆ సమయంలో ఆ దైవం తప్ప మీరు మరింకెవ్వరినీ పిలువ కుండా ఎందుకుంటారు? అయితే, మనోవాంఛలనే అనుసరించే ఈ అలవాటు మీ అసలు నైజాన్నే అణిచివేస్తుంది. సర్వేశ్వరుడైన అల్లాహ్ మీకు తన కారుణ్యం ద్వారా ఆదుకుంటే ఆయనకు కృతజ్ఞతలు చెప్పుకునే బదులు మీరు మీ అయిశ్వర్యాలకు సంబంధించిన ఇతర మార్గాలను అన్వేషిస్తున్నారు. రక్షించబడడానికి మీ బుద్ధివివేకాలే కారణం అని తలిస్తే మరోసారి దేవతలే మిమ్మల్ని రక్షించారని భావిస్తారని భావం.

కాని తమ దుష్కర్మల గురించి ఆ దైవం ప్రశ్నిస్తాడని మాత్రం భావించరు, ఆయనకు భయపడరు.

أَفَأَمِنْتُمْ أَنْ يَخْسِفَ بِكُمْ جَانِبَ الْبَرِّ أَوْ يُرْسِلَ
عَلَيْكُمْ حَاصِبًا ثُمَّ لَا تَجِدُوا لَكُمْ وَكِيلًا ○ (بنی اسرائیل : ٦٨)

"సరే! మీరు ఈ విషయాన్ని గురించి పూర్తిగా నిర్భయంగా ఉన్నారా? దేవుడు మిమ్మల్ని ఎన్నడూ సముద్రం వెలుపలే భూమిలోనికి అణగద్రొక్కడని లేదా మీపైకి రాళ్ళను కురిపించే తుఫానును పంపడనీ మీరు నిర్భయంగా ఉన్నారా? అప్పుడు మిమ్మల్ని రక్షించే ఏ సహాయకుణ్ణీ మీరు పొందలేరు.' (బనీ ఇస్రాయీల్-68)

أَمْ أَمِنْتُمْ أَنْ يُعِيدَكُمْ فِيهِ تَارَةً أُخْرَىٰ
فَيُرْسِلَ عَلَيْكُمْ قَاصِفًا مِنَ الرِّيحِ فَيُغْرِقَكُمْ بِمَا
كَفَرْتُمْ ثُمَّ لَا تَجِدُوا لَكُمْ عَلَيْنَا بِهِ تَبِيعًا ○ (بنی اسرائیل: 69)

ఆయన లీల ఇలా కూడా ఉండవచ్చు: "దేవుడు మళ్ళీ ఎప్పుడైనా మిమ్మల్ని సముద్రంలోనికి తీసుకుపోతాడని, మీ కృతఘ్నతకు ఫలితంగా మీపైకి తీవ్రమైన

తుఫానుగాలులను పంపి మిమ్మల్ని ముంచివేస్తాడనీ, మీ ముగింపును గురించి ఆయనను అడిగే వాడెవ్వడూ మీకు లభించడనీ మీరు భయపడడం లేదా?"
(బనీ ఇస్రాయీల్-69)

وَإِنْ كَادُوا لَيَفْتِنُونَكَ عَنِ الَّذِي أَوْحَيْنَا إِلَيْكَ
لِتَفْتَرِيَ عَلَيْنَا غَيْرَهُ وَإِذًا لَّاتَّخَذُوكَ خَلِيلًا ○ (بنی اسرائیل: 73)

"ప్రవక్తా! ఈ ప్రజలు నిన్ను పరీక్షకు గురిచేసి మేము నీవైపునకు పంపిన 'వహీ' నుండి నిన్ను మరలించడానికి ప్రయత్నం చేయడంలో ఏ కొరతా చేయలేదు. నీవు మా పేరుతో నీ తరఫు నుండి ఏదైనా విషయాన్ని కల్పించాలని వారుఇలా చేశారు. ఒకవేళ నీవు అలా కల్పించి ఉంటే వారు తప్పకుండా నిన్ను తమ మిత్రుడుగా చేసుకొని ఉండేవారు." (బనీ ఇస్రాయీల్-73)

మక్కాలో దైవప్రవక్త (స)గారి గత పది, పన్నెండు సంవత్సరాలుగా ఎదురౌతున్న పరిస్థితులను సూచించే వాక్యాలవి. ఎలాగైనా సరే ఆయన(స)ను ఏకేశ్వరవాద ప్రచారం నుండి అడ్డగించేందుకు, ఏ మార్గం అవలంభించైనాసరే ఆయన షిర్క్ (బహుదైవా రాధన) మరియు అజ్ఞానకాలం నాటి సంప్రదాయాలతో ఎంతోకొంత రాజీపడేటట్లు చేయడానికి జరిగిన ప్రయత్నాలివి. దానికోసం వారు ఆయన్ను వంచించేందుకు చేతనైనంతమట్టుకు కృషి చేశారు. మోసగించీ చూశారు, ప్రలోభపెట్ట ప్రయత్నమూ చేశారు, బెదిరించారు, అసత్యపు ప్రచారాలూ చేశారు, దౌర్జన్యానికి దిగారు, ఆర్థిక వత్తిడికిలోనుచేశారు, సామాజికంగా వెలి కూడా వేశారు. ఓ మనిషి పట్టుదలను నీరుగార్చడానికి ఎన్ని ఎత్తుగడలైతే పన్నబడతాయో అవన్ని ప్రయోగించి చూశారు.

ఇలాంటి గడ్డు పరిస్థితుల్లో నిలకడ, స్థిరత్వం అనేది కేవలం అల్లాహ్ సహాయం ద్వారానే సాధ్యం అవుతుంది.

وَلَوْلَا أَنْ ثَبَّتْنَاكَ لَقَدْ كِدْتَّ تَرْكَنُ إِلَيْهِمْ شَيْئًا
قَلِيلًا ○ (بنی اسرائیل: ۷۴)

"మేము గనక నీకు మనోబలాన్ని ఇచ్చి ఉండకపోతే నీవు వారివైపునకు కొంతైనా మొగ్గి ఉండేవాడవు." (బనీ ఇస్రాయీల్:74)

సందేశ ప్రచారపు ఈ ఘట్టంలో, సత్యసందేశపు రాజీపడే ఈ ధోరణిని అవలంబించడం అల్లాహ్ క్రోధాన్ని కొని తెచ్చుకోవడమే అన్నమాట.

إِذًا لَّأَذَقْنَاكَ ضِعْفَ الْحَيٰوةِ وَضِعْفَ الْمَمَاتِ
ثُمَّ لَا تَجِدُ لَكَ عَلَيْنَا نَصِيرًا ○ (بنی اسرائیل: ۷۵)

"కాని ఒకవేళ నీవు అలా మొగ్గి ఉంటే, మేము నీకు ప్రపంచంలో కూడా రెట్టింపు శిక్షను రుచి చూపించి ఉండేవారము. పరలోకంలో కూడా రెట్టింపు శిక్షే. మాకు వ్యతిరేకంగా నీవు ఏ సహాయకుడినీ పొంది ఉండేవాడవుకావు."

(బనీ ఇస్రాయీల్:75)

అల్లాహ్ ఇలాంటి వైఖరి మొత్తాన్నే సమీక్షిస్తూ రెండేరెండు విషయాలను వివరిస్తున్నాడు. నీవే గనక సత్యాన్ని సత్యమని గ్రహించిన తరువాత అసత్యంతో ఏదైనా రాజీపడి ఉంటే, ఈ మార్గభ్రష్టమైన జాతి ఎలాగూ నీ పట్ల సంతోషాన్ని వ్యక్తం చేసి ఉండేది. కాని దైవాగ్రహం మిన్నంటి ఇహపరలోకాల్లో రెంటిలోనూ ఇచ్చేడి శిక్ష మాత్రం నీకు పడి ఉండేది అన్న విషయం ఒకటైతే, రెండవ విషయం, మనిషి అతను ప్రవక్తకైనాసరే, దైవసహాయం లేకుండా కేవలం తనశక్తి సామర్థ్యాల ఆధారంగా ఆ తుఫానులను అడ్డగించి గట్టెక్కలేడన్నది. నూటికి నూరుపాళ్ళా అల్లాహ్ ప్రసాదించిన సహనం, స్థైర్యం కారణంగానే దైవప్రవక్త (స) సత్యంపై ఓ పర్వతంలా స్థిరంగా నిలబడగలిగారు. ఎలాంటి కష్టాల వెల్లువ కూడా ఆయన్ను ఏమాత్రం తన స్థానం నుండి కదిలించలేకపోయింది.

సత్యసందేశ ప్రచారపు అతి కీలకమైన దశ

పై రెండు ఆయత్‌ల వెలుగులో రెండు విషయాలు మన ముందుకు ప్రస్ఫుటమై కానవస్తున్నాయి.

1. ఒకటేమిటంటే, సత్యసందేశ ప్రచారస్థానం ఎంతో మహోన్నతమైన స్థానం. ఆ కార్యాన్ని నెరవేర్చేవారు మామూలు మనుషులు కారు. సొసైటీలో మహోన్నతమైన స్థానాన్ని అలంకరించేవారు, ధైర్యవంతులు మరియు ఉన్నతమైన మూర్తిత్వం కలిగినవారు. అన్నిటికంటే గొప్ప విషయం ఏమిటంటే, ఈ కార్యం దైవం యొక్క సొంతకార్యం కాబట్టి ఆ మార్గంలో శ్రమించేవారు ఎప్పుడు, ఎక్కడ, ఏ పరిస్థితుల్లో ఉండి పనిచేస్తున్నప్పటికీ అల్లాహ్ వారి వెన్నంటే ఉంటాడు. అడుగడుగున వారికి దారి చూపుతుంటాడు, శక్తిని ప్రసాదిస్తూ ఉంటాడు.

2. రెండవ విషయం ఏమిటంటే, ఈ కీలకమైన సమయంలో సందేశ ప్రచారకుడు తన సందేశ ప్రచారంలో యే కొంచెం మెతకదనాన్ని ప్రదర్శించి అసత్యంతో రాజీకుదిరే అవకాశాన్ని కల్పించి బ్రతకండి, బ్రతకనివ్వండి అనే సూత్రాన్ని అవలంభిస్తే సందేశ ప్రచారకుల నిలువనీడ కూడా లేకుండా పోగలదు. దానికి భిన్నంగా సత్యానుయాయులు ఆ సంక్లిష్ట పరిస్థితుల్లో ఎలాంటి రాజీ లేకుండా స్థిరంగా నిలబడి పనిచేస్తే, అప్పుడు అసత్యవాదులు తమ ఉనికిని కోల్పోగలరు. చివరికి వారు తుడిచిపెట్టుకుపోవడం కూడా ఖాయం.

సత్యానుయాయులు మరియు స్థిరచిత్తం

وَإِن كَادُوا لَيَسْتَفِزُّونَكَ مِنَ الْأَرْضِ لِيُخْرِجُوكَ مِنْهَا
وَإِذًا لَّا يَلْبَثُونَ خِلَافَكَ إِلَّا قَلِيلًا ۝ (بنی اسرائیل : ۷۶)

"వారు నీకు ఈ భూభాగంలో నిలువనీడ లేకుండా చెయ్యడానికి నిన్ను ఇక్కడి నుండి వెళ్ళగొట్టడానికి పూనుకున్నారు. కాని ఒకవేళ వారు అలాచేస్తే నీ తరువాత వారు కూడా ఇక్కడ ఎంతో కాలం నిలువలేరు." (బనీ ఇస్రాయీల్-76)

అసత్యవాదుల ఎత్తుగడలు - అల్లాహ్ సంప్రదాయం

నేటి ఈ ఇస్లామీయ ఉద్యమం మరియు దాన్ని అణచివేయడానికి కంకణం కట్టుకున్న అధికార శక్తులే దీనికి సజీవ సాక్ష్యం. ఇలాంటి తరుణంలో ఉద్యమ కార్యకర్తలు పూర్తి స్థిరచిత్తంతో, వారు ఈ మార్గంలో తమ ధనప్రాణాలను సైతం త్యాగం చేయడానికే సిద్ధం గాని, ఆ అణచివేతకు మాత్రం సిద్ధంగా లేరని రుజువు చేశారు. ఒకే ఒకరాత్రి లక్షలాది వ్యక్తుల్ని హతమార్చే ప్రణాళికను రూపొందించింది అప్పటి ప్రభుత్వం. కాని అల్లాహ్ దాని సొంత బలగాన్ని దానిపైన్నే ఎదురుతిరిగేటట్లు చేశాడు. ప్రభుత్వం ఎందరో సీనియర్ కమాండర్ల హక్కులను కాలరాచి ప్రమోషనులిచ్చి, నమ్మినబంటుగా తలచిన ఆ ప్రభుత్వపు కమాండర్ ఇన్‌చీఫ్ ఆ ప్రభుత్వాన్ని కూల్చివేశాడు. ప్రజలు ఈ గుణపాఠం నేర్పే సంఘటనను తమ కళ్ళారా చూచారు ఆనాడు.

وَكَذَٰلِكَ جَعَلْنَا لِكُلِّ نَبِيٍّ عَدُوًّا مِّنَ الْمُجْرِمِينَ ۗ وَكَفَىٰ
بِرَبِّكَ هَادِيًا وَنَصِيرًا ۝ (الفرقان : ۳۱)

"ప్రవక్తా! మేము ఇలానే అపరాధులను ప్రతి దైవప్రవక్తకు శత్రువులుగా చేశాము. నీ కొరకు మార్గదర్శకత్వం చేయడానికి, సహాయపడడానికి నీ ప్రభువే సరిపోతాడు." (అల్ ఫుర్కాన్-31)

"శత్రువులుగా చేశాము" అని అంటే, నేడు ఏ శత్రుత్వం అయితే నీ పట్ల ప్రదర్శించబడుతోందో ఇది క్రొత్త విషయం ఏమీ కాదు, గతంలోనూ ఇలా జరుగుతూ వచ్చింది, ఎప్పుడైనా ఓ ప్రవక్త సత్యం, ధర్మాన్ని ప్రబోధించడానికి నడుముకడితే నేర ప్రవృత్తిగల ప్రజలంతా ఆయనకు వ్యతిరేకంగా ఏకమయ్యారు అని అర్థం. ఈ విషయాన్ని 'అన్‌ఆమ్' సూరాలోనూ చెప్పడం జరిగింది.

وَكَذَٰلِكَ جَعَلْنَا لِكُلِّ نَبِيٍّ عَدُوًّا شَيَاطِينَ الْإِنسِ وَالْجِنِّ
يُوحِي بَعْضُهُمْ إِلَىٰ بَعْضٍ زُخْرُفَ الْقَوْلِ غُرُورًا ۚ (الانعام : ۱۱۲)

"మేము ఇదే విధంగా ఎల్లప్పుడూ మానవ షైతానులను, జిన్నాతు షైతానులను ప్రతి ప్రవక్తకు శత్రువులుగా చేశాము. ప్రజలను వంచించే నిమిత్తం వారు సొంపైన మాటలను పరస్పరం ప్రేరేపించుకుంటారు." (అల్ అన్ఆమ్:112)

నేడు మానవ, జిన్నాతుల షైతానులు కూడగట్టుకొని నీకు వ్యతిరేకంగా పన్నాగాలన్నీ పన్నుతున్నప్పటికీ ఓ ప్రవక్తా! నీవు భయపడవలసిన పనిలేదు. నీ పట్ల జరుగుతున్న కుతంత్రాలు క్రొత్త విషయం ఏమీ కాదు. ప్రతి కాలంలోనూ ఇలా జరుగుతూ వచ్చిందే. ఎప్పుడైనా ఓ ప్రవక్త ప్రపంచానికి రుజుమార్గం ఏదో చూపడానికి ప్రభవించినప్పుడు ఈ షైతాను శక్తులన్నీ ఆ కార్యాన్ని విఫలం చేయడానికే నడుము కట్టాయి.

'సొంపైన మాటలు' అంటే అర్థం, ప్రజలను సత్యసందేశ ప్రచారకునికి, అతని సందేశానికి వ్యతిరేకంగా ఉసిగొలిపే, కోపోద్రిక్తులుగా చేసే రకరకాల ఎత్తుగడలు, ప్రణాళికలు, అనుమానాలను రేపే మాటలు, ఆక్షేపణలు అన్నమాట. వీటన్నిటిని కలిపి మోసం, దగాగా చెప్పడం జరిగింది. ఎందుకంటే సత్యంతో పోరాడడానికి ఏ ఆయుధాలు సత్యవిరోధులు ఉపయోగిస్తారో అవి కేవలం ఇతరులకు, మరీ చెప్పాలంటే స్వయంగా వారి విషయంలోను ఓ మోసంగానే పరిణమిస్తాయి. చూడ డానికి అవి వారి దృష్టికి ఎంతో మేలైనవిగా, సరైన ఆయుధాలుగా అగుపడినా సరే.

'వారిని శత్రువులుగా చేశాము' అని అంటే దాని అర్థం, మా ప్రకృతి ధర్మాలు కూడా ఇవే అని. కాబట్టి మా నిర్ణయం పట్ల సహనం వహించు మరియు ప్రకృతి చట్టం ప్రకారం ఏ పరిస్థితులకు లోనుకావలసి ఉంటుందో ఆ పరిస్థితులను ఎదిరించు. సంయమనంతో, దృఢ నిశ్చయంతో ఆ కార్యాన్ని నెరవేరుస్తూ ఉండు. నీవు ఇటు సత్యాన్ని చాటి చెప్పగానే, అటు ప్రపంచం మొత్తం దాన్ని స్వీకరించడానికి మూకుమ్మడిగా నీవైపుకు పరుగిడుతుందని, తమ తప్పులను ఇట్టే వదిలి పెట్టేస్తుందని అనుకోబాకు అని అర్థం.

మార్గదర్శనం అంటే, సత్యజ్ఞానం ఏదో ప్రబోధించడమే కాదు, ఇస్లామీయ ఉద్యమాన్ని విజయవంతంగా నడపడం కోసం శత్రువుల ఎత్తుగడలను చిత్తు చేయడానికి సమయస్ఫూర్తిని ప్రదర్శిస్తూ సరైన విధానాలను తెలియపర్చడం అని కూడా. సహాయం అంటే, అన్నిరకాల సహాయం అన్నమాట. సత్యాసత్యాల నడుమ జరిగే సంఘర్షణలో ఎన్ని యుద్ధమోర్చాలు (War Fronts) తెరువబడినప్పటికీ ప్రతి యుద్ధమోర్చాలో సత్యానుయాయుల కొమ్ముగాయడం అల్లాహ్ పని. అర్ధ్యాచేసే అవసరం వస్తే సత్యానుయాయులను సరైన అర్ధ్యాచేసే జ్ఞానాన్ని ప్రసాదిస్తాడు. అదే నైతిక సంఘర్షణ అయితే అన్ని కోణాల నుండి వారికే విజయాన్ని చేకూరుస్తాడు. వ్యవస్థకు సంబంధించిన పోటీ జరిగితే ఆయనే అసత్యవాదుల హృదయాలను

ఛిన్నాభిన్నం చేసి సత్యానుయాయుల హృదయాలను పరస్పరం కలిపేస్తాడు. మానవశక్తి పరీక్ష జరిగినప్పుడు ఆయనే ప్రతి ఘట్టంలోనూ, తగినవారిని, పనికివచ్చే వారిని మరియు ఆ కోవకు చెందిన ప్రజా సమూహాలను తెచ్చి సత్యానుయాయుల సంఖ్యను పెంచుతాడు. భౌతిక వనరుల ఆధిక్యం పూర్తిగా, కేవలం ఓ భ్రమగా మిగిలిపోయేటట్లు చేస్తాడు. మొత్తానికి, సహాయం మరియు మార్గదర్శనపు ఏ కోణం కూడా, అల్లాహ్ సహాయం లేకుండా లేదా మరొకరిపై భారం వేసేలా ఉండే అవకాశమే లేదు. అయితే, వారు అల్లాహ్ సంరక్షణపై విశ్వాసాన్నుంచడం, సోమరులై కూర్చోకుండా చురుకుగా అసత్యానికి వ్యతిరేకంగా సత్యసందేశ ధ్వజాన్ని ఎగురవేయడానికి ప్రాణాలను సైతం పణంగా పెట్టాలన్నది షరతు.

ఈ ఆయత్‌కు సంబంధించిన ఈ రెండవ భాగమే లేకుండా ఉండివుంటే, మొదటి భాగం తీవ్రమైన నిరాశకు లోను చేసి ఉండేది. ఓ వ్యక్తికి, 'మేము కావాలని ఓ కార్యాన్ని నీకప్పగించాము, దాన్ని ప్రారంభించగానే ప్రపంచంలోని కుక్కలు, తోడేళ్ళన్నీ నీపైకి ఎగబడతాయి'' అని తెలియచేయగానే అతడు నిరాశ నిస్పృహలకు లోనైపోవడం సహజం. కాని "నిన్ను ఈ ప్రాణాంతకమైన యుద్ధరంగంలో దించి మేము నిన్ను ఒంటరిగా వదలివేయడం లేదు. పైగా మేమే స్వయంగా నిన్ను ఆదుకోడానికి వెన్నుదన్నుగా నిలిచాము' అని ప్రకటించినప్పుడు అంతకంటే ధైర్యం చెప్పే విషయం మరేమై ఉండగలదు? దైవమే స్వయంగా మన సహాయానికి, మన పరిరక్షణకు బాధ్యత స్వీకరించినప్పుడు కేవలం ఓ పిరికిపంద మాత్రమే వెనకడుగు వేయగలడు.

وَالَّذِينَ جَاهَدُوا فِينَا لَنَهْدِيَنَّهُمْ سُبُلَنَا ۚ وَإِنَّ اللَّهَ
لَمَعَ الْمُحْسِنِينَ ○ (العنكبوت : ٦٩)

"మా కొరకు తీవ్ర ప్రయత్నం చేసేవారికి మేము మా మార్గాలను చూపుతాము. నిశ్చయంగా అల్లాహ్ సజ్జనులతో పాటే ఉంటాడు." (అల్ అన్‌కబూత్:69)

'తీవ్ర ప్రయత్నం చేయడం' అంటే వ్యతిరేక శక్తికి విరుద్ధంగా పెనుగులాడడం, సంఘర్షణ చేయడం అని అర్థం. ఓ ప్రత్యేకమైన వైర శక్తి ఫలానా అని సూచించకుండా కేవలం ముజాహిదా (తీవ్ర ప్రయత్నం) అనే పదాన్ని వాడినప్పుడు, దాని భావం ఓ సార్వజనీనమైన, అన్ని దిశల్లో జరిగే సంఘర్షణ అని. ఓ విశ్వాసి ఈ ప్రపంచంలో ఏ సంఘర్షణ అయితే చేయవలసి ఉంటుందో అది షైతాను బెదిరింపులు, ప్రలోభాలకు వ్యతిరేకంగానే. షైతాను సతతం, సత్కార్యాల దుష్పరిణామాల గురించి భయపెడతాడు, దుష్కార్యాల ద్వారా లభించే ప్రయోజనం గురించి ప్రలోభపెడుతూ ఉంటాడు. ఓ విశ్వాసి తన మనస్సుతోనూ పోరాడవలసి ఉంటుంది. అది సతతం అతనికి తన కోరికలకు దాసోహం కమ్మని ప్రేరేపిస్తూ ఉంటుంది. తాను ఉంటున్న

ఇల్లు మొదలు బయటి ప్రపంచంతోనూ పోరాడవలసి ఉంటుంది ఓ విశ్వాసికి. సత్యధర్మానికి విరుద్ధమైన భావాలు, సిద్ధాంతాలు, నైతిక విలువలు, ఆచార సంప్రదాయాలు, సభ్యతా సంస్కారాలు, ఆర్థిక, ఔపాధిక చట్టాలు, సామాజిక కట్టుబాట్లు గల వ్యక్తులతో అతను పోరాడవలసి ఉంటుంది. అలాగే, దైవవిధేయతను పట్టించుకో కుండా స్వతంత్రంగా తన చట్టాన్నే అమలుపరిచే మరియు మంచికి బదులు చెడునే ప్రేరేపించే ఆ ప్రభుత్వంతోను పోరాడవలసి ఉంటుంది. ఈ 'ముజాహిదా' ఒకటి రెండు రోజుల ముజాహిదా కాదు. జీవితాంతం చేసే ముజాహిదా. రోజులోని ఇరవైనాల్గు గంటల్లో ప్రతి క్షణానికి సంబంధించిన ముజాహిదా. ఏదో ఒక రంగంలో కాకుండా జీవితంలోని ప్రతి రంగంలోనూ చేసే ముజాహిదా. ఈ ముజాహిదా గురించి హజ్రత్ హసన్ బస్రీ (రహ్మాలై) ఇలా సెలవిచ్చారు:

"మనిషి ఎప్పుడూ ఒక్క మారైనా ఖడ్గం ఉపయోగించకుండానే జిహాద్ చేస్తాడు."

ముజాహిదా (తీవ్ర ప్రయత్నం) గురించి ఇదే సూరా అన్‌కబూత్‌లోని ఆరవ ఆయత్‌లోనూ ఉంది. అక్కడ ముజాహిదా ధ్యేయం తన సొంత మేలుకోసమే అని ఉంది. ఇక్కడ, ఎవరైతే అల్లాహ్ మార్గంలో చిత్తశుద్ధితో ప్రపంచం మొత్తంతో సంఘర్షణ ప్రమాదాన్ని కొనితెచ్చుకుంటారో, అల్లాహ్ వారిని అలానే వదిలేయడు. పైగా వారిని ఆదుకొని మార్గం చూపెడతాడు, తన వైపుకు వచ్చే మార్గాలను తెరుస్తాడు. ఆయన అడుగడుగునా వారికి, తన ప్రసన్నతను ఎలా బడయగలరో అని సూచిస్తాడు. ప్రతి మలుపున వారికి వెలుగు చూపుతూ సరైన మార్గం ఎటుపోతుంది? తప్పుడు మార్గాల దిశ ఎటు ఉంది అని తెలియజేస్తాడు. ఎంత చిత్తశుద్ధి, మరెంత శుభాకాంక్ష వారిలో ఉంటుందో వారికి అదే మోతాదులో దైవసహాయం, ఆయన తోడు కూడా ఉంటుంది.

సత్యమార్గంలోని అడ్డంకులు

قَالَ مُوسَىٰ رَبَّنَا إِنَّكَ آتَيْتَ فِرْعَوْنَ وَمَلَأَهُ زِينَةً
وَأَمْوَالًا فِي الْحَيَاةِ الدُّنْيَا رَبَّنَا لِيُضِلُّوا عَنْ سَبِيلِكَ
(يونس: ٨٨)

"మూసా ఇలా ప్రార్థించాడు! "మా ప్రభూ! నీవు ఫిరౌనుకూ అతని సర్దారులకూ ఇహలోక జీవితంలో వైభవమును, సంపదను ప్రసాదించావు. ప్రభూ! వారు ప్రజలను నీ మార్గం నుంచి తప్పించడానికా ఇవి?" (యూనుస్:88)

'వైభవం' అంటే, డంబాచారం, ప్రభ, ప్రపంచాన్ని వారి ఆచార సంప్రదాయాల వైపుకు ఆకర్షించి, తాము కూడా అంతటివారు కావాలనే కోరికలు కలిగించే సభ్యతా సంస్కృతులు అని అర్థం.

'సంపద' అంటే, తమ ఎత్తుగడలను, కుతంత్రాలను అమలుచేసేందుకు అన్ని రకాల సదుపాయాలు గలవి, అవి కొరవడడం వలన సత్యధర్మానుయాయులు తమ ప్రణాళికలను అమలు జరపలేకపోయే వనరులు, మాధ్యమాలు అన్నమాట.

అంటే ఎవరికైతే ఇహలోక జీవితంలో డంబాచారం, ప్రభ, నాగరికత, సభ్యతా సంస్కృతులు ఉంటాయో మరియు ఎవరికైతే ప్రపంచపు వనరులు, మాధ్యమాలు లభిస్తాయో అలాంటివారు కేవలం సత్యధర్మాన్నే తిరస్కరించడం కాకుండా ఇతరులను కూడా ఆ సత్యధర్మాన్ని, సత్యసందేశాన్ని స్వీకరించకుండా అడ్డుకుంటారని అర్థం.

సత్యసందేశ ప్రచారంలో సహనం ప్రాముఖ్యత

قَالَ قَدْ أُجِيبَت دَّعْوَتُكُمَا فَاسْتَقِيمَا وَلَا تَتَّبِعَانِّ سَبِيلَ الَّذِينَ لَا يَعْلَمُونَ ٥ (يونس : ٨١)

(మూసా-అ) ప్రార్థనకు) సమాధానంగా అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: "మీ ఉభయుల ప్రార్థన అంగీకరించబడింది. దృఢచిత్తులై ఉండండి. జ్ఞానహీనుల మార్గాన్ని ఎంతమాత్రం అనుసరించకండి." (యూనుస్:81)

యదార్థం ఏమిటో తెలియనివారు, అల్లాహ్ యుక్తిని అర్థం చేసుకోజాలరు. వారు అసత్యం కంటే సత్యమే బలహీనమైనదని తలుస్తారు. సత్యధర్మ సంస్థాపనా కృషిలో పాల్గొనేవారి నిరంతర అపజయాలు, వాటికి భిన్నంగా అసత్య వాదుల విజయ పరంపరలను చూసి వారు, బహుశా అల్లాహ్ కూడా ఇదే తలుస్తున్నాడేమో అనే అనుమానాలకు లోనైపోతారు. బహుశా వీరు సత్యాసత్యాలకు నడుమ జరుగుతున్న ఈ సంఘర్షణలో సత్యానికి మద్దత్తు పలకకుండా మిన్నకుండి పోవడం జరుగుతుందేమో. ఇలాంటివారే చివరకు, సత్యధర్మసంస్థాపన కోసం జరుగుతున్న కృషి అంతా నిరర్థకమని, దైవధిక్కారం, దైవతిరస్కార ప్రభుత్వంలో తమకు లభిస్తున్న ఆ కొంత స్వాతంత్ర్యం పైన్నే రాజీపడి ఎదురు తిరగకుండా కాలం గడిపేస్తుంటారు. ఈ ఆయత్‌లో హజ్రత్ మూసా (అ) మరియు ఆయన అనుయాయుల్ని ఈ తప్పిదం నుండి కాపాడుకునే తాకీదు చేయడం జరిగింది. ఈ ఆయత్‌లో ఇలాంటి అనుకూల పరిస్థితుల్లో మీ కార్యాన్ని కొనసాగిస్తూ ఉండండి, అజ్ఞానులు, అమాయకులు ఏ అపోహలకు గురవుతున్నారో ఆ అపోహలకు మీరు లోనుకాకుండా ఉండండి అని చెప్పడమే దైవ ఉద్దేశ్యం.

وَاتَّبِعْ مَا يُوحَىٰ إِلَيْكَ وَاصْبِرْ حَتَّىٰ يَحْكُمَ اللَّهُ ۚ وَهُوَ خَيْرُ الْحَاكِمِينَ ٥ (يونس : ١٠٩)

"ప్రవక్తా! నీవు నీ వద్దకు వహీ ద్వారా పంపబడుతూ ఉన్న హితబోధను అనుసరిస్తూ ఉండు. అల్లాహ్ తీర్పు చేసే వరకు ఓర్పు వహించు, ఆయన మాత్రమే ఉత్తమంగా తీర్పు చేసేవాడు." (యూనుస్:109)

అంటే, మూసా (అ) మరియు ఆయన అనుయాయులకు సహనం, ఓర్పుల గురించి ఎలా బోధించడం జరిగిందో, అననుకూల పరిస్థితుల్లో కార్యాన్ని కొనసాగించే తాకీదు ఎలా చేయబడిందో, అజ్ఞానులు, అమాయకుల వైఖరి నుండి తమను తాము ఎలా కాపాడుకునే ఆదేశం ఇవ్వడం జరిగిందో అలాగే దైవప్రవక్త (స)కు కూడా అలాంటి అననుకూల పరిస్థితుల్లో ఓర్పు వహించే తాకీదు చేయడం జరిగింది. నిరంతర కృషి సల్పడమే అల్లాహ్ విధేయత అని తెలియజేయడం జరిగింది.

సత్యవిరోధుల అసభ్య ప్రవర్తన

وَلَئِنْ أَذَقْنَا الْإِنسَانَ مِنَّا رَحْمَةً ثُمَّ نَزَعْنَاهَا
مِنْهُ إِنَّهُ لَيَئُوسٌ كَفُورٌ ۝ وَلَئِنْ أَذَقْنَاهُ نَعْمَاءَ بَعْدَ
ضَرَّاءَ مَسَّتْهُ لَيَقُولَنَّ ذَهَبَ السَّيِّئَاتُ عَنِّي ۚ إِنَّهُ لَفَرِحٌ فَخُورٌ ۝ (هود :9,10)

"ఒకవేళ మేము ఎప్పుడైనా మానవునికి మా కారుణ్యాన్ని ప్రసాదించి, తరువాత అది అతనికి లేకుండా చేస్తే అతడు నిరాశ చెందుతాడు. కృతఘ్నుత చూపుతాడు. అతనిపై పడిన ఆపద (తొలగిన) తరువాత, ఒకవేళ మేము అతనికి అనుగ్రహాన్ని రుచి చూపిస్తే, "కష్టాలన్నీ తొలగిపోయాయి" అని అంటాడు. అతడు తరువాత ఉబ్బి తబ్బిబ్బౌతాడు. విర్రవీగుతాడు." (హూద్:9,10)

ఇది మనిషి హ్రస్వదృష్టి, వెలికితనం, ఆలోచనా రాహిత్యానికి ప్రతీక. ఇది జీవితంలో ప్రతి అడుగునా అగుపించే ప్రవర్తన. దీన్ని సాధారణంగా ప్రజలు ఆత్మ పరిశీలన ద్వారా స్వయంగా తమలోను అది ఉందని గ్రహించగలరు. సంపన్నులు, బలవంతులైపోతే ఉబ్బితబ్బిబ్బైపోవడం, విర్రవీగడం నేడు జరిగే విషయమే. వర్షరుతువురాగానే అగుపించే పచ్చదనమే వారికి అగుపిస్తుంది. కాని ఒకనాడు ఈ పచ్చదనం మాయమైపోయి గ్రీష్మరుతువు కూడా వస్తుందని అనుకోరు. రేపు ఏదైనా ఆపదలో చిక్కుకుంటే తల్లడిల్లిపోవడం, నిరాశా నిస్పృహలకు లోనుకావడం, మరీ బాధ కలిగితే దేవుణ్ణి ఆడిపోసుకుంటూ ఆయన దైవత్వాన్ని తూలనాడి తృప్తి పడుతూ ఉంటారు. ఆ కష్టకాలం కాస్తా పోయీ మంచి రోజులు రాగానే అదే విర్రవీగడం, అవే గొప్పలు చెప్పుకోవడం, ఆ మత్తులో మరిన్ని దురాగతాలకు పాల్పడడం జరుగుతుంది.

మనిషికి ఉన్న ఈ దిగజారిపోయే గుణాన్ని ఇక్కడ ఎందుకు చెప్పడం జరిగింది? నేడు మీకు లభించిన వసతులు, సంతృప్తికరమైన ఈ వాతావరణంలో

దైవధిక్కార మార్గాన్ని ఇలానే కొనసాగిస్తూ ఉంటే దైవశిక్ష మీపై వచ్చిపడుతుందని మా ప్రవక్త హెచ్చరిస్తున్నాడు. మీరు ఆయన మాటలను నిర్లక్ష్యం చేస్తూ, "పిచ్చివాడా! మాపై ఎన్ని వరాల జల్లులు కురుస్తున్నాయో చూడు, పట్టపగలు మాపై దైవశిక్ష విరుచుకుపడుతుందనే కల ఎలా కన్నావు? అని అవహేళన చేస్తున్నారు అని చెప్పడం. ప్రవక్త ప్రబోధానికి సమాధానంగా మీ అవహేళన ఈ అసభ్య ప్రవర్తనకు ప్రతీక. ఇలా మీ మార్గభ్రష్టత్వం, దౌష్ట్యాలు కొనసాగుతున్నప్పటికీ దైవం తన కారుణ్యంతో మిమ్మల్ని ఇంకా శిక్షించకుండా ఆలస్యం చేస్తున్నాడు. బహుశా మీరు ఇప్పటికైనా నిలదొక్కుకోగలరేమోనని. అయితే, మీకిచ్చిన ఈ అవకాశ కాలంలో మీరు, "మా సుభిక్షిత, మా అయిశ్వర్యం అంతా బహుపటిష్టమైన పునాదులపైన్నే నెలకొని ఉందని, దీనికి ఎలాంటి క్షామం రాబోదని, నిత్యవసంతంగా ఉండి ఎలాంటి ప్రమాదానికి లోనుకాబోదని భావిస్తున్నారు.

సత్యధర్మ ప్రచారం ఓర్పు, కృతజ్ఞతల మార్గం

إِلَّا الَّذِينَ صَبَرُوا وَعَمِلُوا الصَّالِحَاتِ أُولَٰئِكَ لَهُم مَّغْفِرَةٌ وَأَجْرٌ كَبِيرٌ ۝ (هود : ١١)

"సహనశీలురు, సత్కార్య పరాయణులూ అయిన వారు మాత్రమే ఈ దోషానికి అతీతులు. వారికే మన్నింపూ, పెద్ద బహుమానమూను." (హూద్:11)

ఇక్కడ సహనానికి సంబంధించిన మరో కోణం వెలుగుచూస్తోంది. ఓర్పు లేదా సహనం అనే సద్గుణం, పైన చెప్పిన అసభ్య ప్రవర్తనకు పూర్తిగా వ్యతిరేకం. కాలగమనం వల్ల ఏ పరిస్థితులైతే ఉనికిలోనికి వస్తాయో ఆ పరిస్థితుల్లో తన మానసిక సమతౌల్యాన్ని నిలిపి ఉంచి, కాలగమనం ద్వారా గుణపాఠాలు నేర్చుకుంటూ తన రంగును మాత్రం మార్చుకోనివాడే సహనశీలుడు. పైగా, ఓ సరైన, సక్రమమైన వైఖరిపైన్నే నిలకడగా ఉండేవాడు. పరిస్థితులు అనుకూలించి అతనికి అధికారం, అయిశ్వర్యం, పేరు ప్రఖ్యాతులు వచ్చినప్పుడు బడాయి మత్తులో ఊగిపోనివాడు. ఆ పరిస్థితులే బెడిసికొట్టి కష్టకాలం అతణ్ణి వివశునిగా చేసినప్పుడు కూడా మానవత్వాన్ని వీడనివాడు. దైవం తరపున వచ్చిన పరీక్ష- అది వరాల రూపంలో వచ్చినా, కడగండ్ల రూపంలో వచ్చినా- ఆ రెండు సందర్భాల్లోనూ అతని సహనం, సంయమనం మాత్రం ఒకే తీరుగా ఉంటుంది. అతని వ్యక్తిత్వం ఏ వస్తువు పరిమాణాన్ని చూసి తొణకకుండా, బెణకకుండా ఉండేంత విశాలంగా ఉంటుంది.

సత్యసందేశ ప్రచారం - మనశ్శాంతి

సత్యసందేశ ప్రచారకులు సహన స్థయిర్యాలు, మనశ్శాంతికి సంబంధించిన ఓ పటిష్టమైన గోపురాన్ని నిర్మించుకోవలసి ఉంటుంది. వ్యతిరేకతా తుఫానులు,

సంక్షోభ వరదలు దాన్ని తాకి వెనకకు వెళ్ళి పోవాలేగాని, అతను మనశ్శాంతి ఫలకంపై ఎలాంటి మచ్చ మాత్రం ఏర్పడకుండా ఉండేంత పటిష్టంగా ఉండాలది.

فَلَعَلَّكَ تَارِكٌ بَعْضَ مَا يُوحَىٰ إِلَيْكَ وَضَائِقٌ بِهِ صَدْرُكَ
أَن يَقُولُوا لَوْلَا أُنزِلَ عَلَيْهِ كَنزٌ أَوْ جَاءَ مَعَهُ مَلَكٌ ۚ إِنَّمَا أَنتَ
نَذِيرٌ ۚ وَاللَّهُ عَلَىٰ كُلِّ شَيْءٍ وَكِيلٌ ○ (ہود : ۱۲)

"ప్రవక్తా! వహీ ద్వారా నీకు తెలుపబడుతున్న విషయాలలో దేనినైనా (ప్రకటించ కుండా) వదిలిపెట్టబోకు సుమా! వారు "ఈ వ్యక్తిపై ఏదైనా నిధి ఎందుకు దింపబడ లేదు?" లేదా "ఇతనితోపాటు దైవదూత ఎవడైనా ఎందుకు రాలేదు?" అని అంటారని నీ మనస్సు బాధపడకూడదు. నీవు కేవలం హెచ్చరిక చేసేవాడవే. ఆపై అన్నింటికి అల్లాహ్‌యే బాధ్యుడు." (హూద్:12)

పై ఖుర్‌ఆన్ సందేశాన్ని అర్థం చేసుకోవాలంటే, ఆ వాక్యాల్లో చెప్పిన విషయా నికి సంబంధించిన పరిస్థితులను అర్థం చేసుకోవడం అవసరం. మొత్తం అరేబియా ద్వీపకల్పం పైన్నే తన మతాధికారాన్ని, తన ధనం మరియు తన వ్యాపారంతో రాజ్యమేలుతున్న ఒకానొక తెగకు సంబంధించిన కేంద్ర రాజధాని మక్కా నగరం. ఇది తమ అధికారంలో వీర్రవీగుతున్న సమయంలోనే ఓ వ్యక్తి లేచి, 'మీరు ఏ మతానికి అధికారులో ఆ మతం పూర్తి భ్రష్టమతం, ఏ సభ్యతకైతే మీరు సర్దారులో ఆ వ్యవస్థ దాని మొదలంటూ కుళ్ళిపోయిన వ్యవస్థ, దైవశిక్ష మీాపై విరుచుకు పడడానికి సిద్ధంగా ఉంది, దాన్నుండి తప్పించుకోవాలంటే ఆ దైవం తరపున నేను ఏ సద్వ్యవస్థనైతే తెచ్చానో దాన్ని స్వీకరించవలసి ఉంటుంది అని బహిరంగంగా ప్రకటిస్తాడు. ఆ వ్యక్తి వెంట అతని పవిత్ర జీవితం మరియు అతని హేతుబద్ధమైన మాటలు తప్ప మరేదీ ఉండదు. ఆ శిక్షకు సంబంధించిన మరే సూచనలు అతను చూయించడం లేదు. పైగా ఆ తెగవారికి దైవం (వారి విశ్వాసం ప్రకారం) దేవతల కారుణ్యం ఉంది, వారు చేసేదంతా సక్రమమైనదే అని తలుస్తున్నారు. ఇలాంటి సందర్భంలో ఈ ప్రకటన చేయడం వల్ల జరిగేదేమిటి? యదార్థాన్ని గ్రహించిన వారు, సరైన ఆలోచనగల వారు తప్ప మిగతా ప్రజలంతా ఆ వ్యక్తి వెంట పడతారు. కొందరు దౌర్జన్యం చేసి అతణ్ణి అణగద్రొక్కజూస్తే, మరికొందరు తప్పుడు నేరాలు మోపి, ఆక్షేపణలు చేసి అతని నోరునొక్కిజూస్తారు. మరి కొందరు వైరం వహించి అతణ్ణి నిరాశ పరిస్తే, ఇంకొందరు అవహేళనతో అతని మనస్సును నొప్పింపజూస్తారు. ఇలా ఈ వైఖరి అనేక సంవత్సరాల వరకు కొనసాగుతుంది అతని ఎడల. ఇలాంటి పరిస్థితుల్లో ఆ వ్యక్తి ఎంత నిరాశా నిస్పృహలకు లోనైపోతాడో ఆలోచించండి! అదే, ఈ పరిస్థితుల్లోనే అల్లాహ్ తన ప్రవక్తలకు ధైర్యం చెప్పడానికే పై వాక్యాలను అవతరింప జేసింది. మంచికాలం వచ్చినప్పుడు దైవాన్ని మరిచిపోవడం, గడ్డుకాలం వచ్చినప్పుడు

నిస్పృహకు లోనై అసభ్యప్రవర్తనకు ఒడిగట్టడం అలాంటి వారికే చెల్లుతుంది. సన్మార్గంలో ఓర్పుతో సహనంతో ధైర్యంగా ముందుకు నడిచేవాడే పుణ్యపురుషుడు. కాబట్టి ఏ వైరం ద్వారా, మరే అలక్ష్యంతోనూ, యే ఎగతాళి మరియు యే అజ్ఞానపు ఆక్షేపణలు చేసి మిమ్మల్ని వారు ఎదుర్కొంటున్నారో వాటివల్ల మీ స్థిరత్వానికి ఏ మాత్రం విఘాతం కలగకుండా ఉండాలి. యే సత్యమైతే దివ్యావిష్కృతి (వహీ) ద్వారా మీ ముందుకు వచ్చిందో దాన్ని ప్రకటించడంలో మరియు దానివైపుకు ప్రజలను ఆహ్వానించడంలో మీరు వెనుకడుగు వేయడానికి వీల్లేదు. ఫలానా విషయం ఎలా చెప్పాలి? దాన్ని విన్నంతనే ప్రజలు ఎగతాళి చేస్తున్నారే! ఫలానా యదార్థాన్ని ఎలా వెలిబుచ్చాలి, దాన్ని వినడానికే ప్రజలు సిద్ధంగా లేరే! అనే ఆలోచనే మీకు రాకూడదు. ఎవరు విన్నావినకపోయినా, స్వీకరించినా స్వీకరించకపోయినాసరే దాన్ని ఉన్నది ఉన్నట్లుగా ఎలాంటి జంకు, గొంకు లేకుండా ప్రకటించండి. ఆపై విషయాలన్నీ అల్లాహ్‌కే వదిలేయండి.

సత్యమార్గంలో నిరాశా నిస్పృహలకు లోనుకావడం పాపం

وَلَقَدْ آتَيْنَا مُوسَى الْكِتَابَ فَاخْتُلِفَ فِيهِ ۗ (هود : ١١٠)

"మేము ఇది వరకు మూసాకు కూడా గ్రంథాన్ని ఇచ్చి ఉన్నాము. దాని విషయంలో కూడా విభేదించడం జరిగింది. (ఇప్పుడూ నీకు ఇవ్వబడిన ఈ గ్రంథం విషయంలో విభేదించడం జరుగుతున్నట్లుగా.)" (హూద్:110)

అంటే ఇది క్రొత్త విషయం ఏమికాదు. నేడు ఖుర్ఆన్ విషయంలో వివిధ రకాల ప్రజలు, వివిధ రీతుల్లో ఆక్షేపణలు చేయడం జరుగుతోంది. ఇంతకంటే పూర్వం కూడా మూసా (అ) కు గ్రంథం ఇవ్వడం జరిగింది. అప్పుడు కూడా రకరకాలుగా ఆ గ్రంథం విషయంలో వ్యాఖ్యలు చేయబడ్డాయి. కాబట్టి ఓ ముహమ్మద్ (స)! నీవు ఇది చూసి నిరాశ చెందే అవసరం లేదు. ఇంత చక్కని, సక్రమమైనవీ అయిన విషయాలు ఖుర్ఆన్‌లో చెప్పబడుతున్నప్పటికీ ప్రజలు వాటిని స్వీకరించడం లేదు.

నేరస్థులకు లభించిన సుదీర్ఘమైన గడువు పట్ల అసహనాన్ని ప్రదర్శించడం

وَلَوْلَا كَلِمَةٌ سَبَقَتْ مِن رَّبِّكَ لَقُضِيَ بَيْنَهُمْ ۚ (هود:110)

"నీ ప్రభువు తరఫు నుండి ఒక విషయం ముందే గనక నిర్ణయించబడి ఉండకపోతే, ఈ విభేదించేవారి విషయంలో ఎప్పుడో తీర్పు జరిగి ఉండేది." (హూద్:110)

ఈ వాక్యం కూడా దైవప్రవక్త (స) మరియు విశ్వాసులకు స్వాంతన చేకూర్చేందుకు మరియు సహనం వహించేందుకు అవతరించిందే. దీని భావం ఏమిటంటే, వారు ఈ ఖుర్ఆన్ విషయంలో విభేదిస్తున్నారని, అందుకని వారి గురించి తీర్పు వీలైనంత త్వరలో వెలువడాలని మీరు త్వరపడుతున్నారు. సమయం రాకుముందే ఆ తీర్పు వెలువడకూడదని అల్లాహ్ నిర్ణయం తీసుకొని ఉన్నాడు, ఈ భూలోకవాసులు తీర్పుకోసం ఎలా తాపత్రయపడతారో అల్లాహ్ మాత్రం త్వరపడేవాడు కాడు అని తెలియజేయడం అన్నమాట.

తీర్పు ఘడియ కోసం ఎదురు చూపు

وَاِنَّ السَّاعَةَ لَاٰتِيَةٌ فَاصْفَحِ الصَّفْحَ الْجَمِيْلَ ۝ اِنَّ رَبَّكَ هُوَ الْخَلّٰقُ الْعَلِيْمُ ۝ (الحجر : ٨٥-٨٦)

"తీర్పు ఘడియ నిశ్చయంగా రానున్నది. కనుక ప్రవక్తా! నీవు (వారి కుచేష్టలను) పెద్ద మనిషి తరహాలో మన్నించు. నిశ్చయంగా నీ ప్రభువు అందరినీ సృష్టించినవాడూ, అంతా తెలిసినవాడూను." (అల్‌హిజ్ర్ : 85,86)

అంటే ఓ సృజనకారునిగా ఆయన సృష్టితాలపై సంపూర్ణమైన అధికారం, ఔన్నత్యాన్ని కలిగి ఉన్నాడు. ఏ ప్రాణి కూడా ఆయన పట్టు నుండి తప్పించుకోజాలదు. ఆయన అంతా తెలిసినవాడు కూడా. నీవు వీరి సంస్కరణకోసం చేసేదంతా ఆయన ఎరుగు. వారు ఏయే ఎత్తుగడలతో నీ సంస్కరణా కార్యాన్ని విఫలం చేయడానికి ప్రయత్నం చేస్తున్నారో, ఆ ప్రయత్నాలేవో ఆయనకు బాగా తెలుసు. కాబట్టి ప్రవక్తా! నీవు వారికి భయపడే, త్వరపడే అవసరమే లేదు. పరిపూర్ణమైన ఏకాగ్రతతో, ప్రశాంతంగా ఉండు. సరైన సమయం రాగానే న్యాయబద్ధంగా తీర్పు వెలువడుతుంది.

అసత్యవాదుల ప్రభావం తాత్కాలికమైనదే

وَمَا خَلَقْنَا السَّمٰوٰتِ وَالْاَرْضَ وَمَا بَيْنَهُمَآ اِلَّا بِالْحَقِّ (الحجر : ٨٥)

"మేము భూమినీ, ఆకాశాలనూ వాటిలో ఉన్న సమస్తాన్నీ సత్యం పునాదిగా తప్ప మరొకటే పునాదిగా సృష్టించలేదు." (అల్‌హిజ్ర్ : 85)

ఈ వాక్యం ఇది వరకు చెప్పిన ఆయత్ మొదటి భాగమే. దైవప్రవక్త (స)గారికి సాంత్వన వచనాలు చెప్పి మనశ్శాంతిని ప్రేరేపించడానికి చెప్పబడిన వాక్యం. అంటే, ప్రస్తుతం కనబడడానికైతే అసత్యం తన అధికారం వెలగబెడుతున్నప్పటికీ, సత్యమార్గంలో మీరు ఏ కష్టాలను, కడగండ్లను ఎదుర్కోవలసి వస్తున్నప్పటికీ వాటిని చూసి ఏమాత్రం చలించవద్దు. ఇదంతా తాత్కాలికమైన ప్రభే. శాశ్వతమైన పరిస్థితి

ఏదీ కాదు. కాబట్టి భూమ్యాకాశాల వ్యవస్థ సమస్తమూ సత్యపునాదులపైన్నే నిర్మించ బడివుంది. అసత్యంపై కాదు. కాబట్టి ఏదైనా శాశ్వత ప్రాతిపదిక ఉంటే అది సత్యానిదే. అసత్యానిది కాదు. దీనికి సంబంధించిన మరింత వివరణ తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్, ఇబ్రాహీం అధ్యాయం, పాద సూచిక 25, 26లో ఇలా ఉంది:

مَثَلُ الَّذِينَ كَفَرُوا بِرَبِّهِمْ أَعْمَالُهُمْ كَرَمَادٍ اشْتَدَّتْ بِهِ الرِّيحُ فِي يَوْمٍ عَاصِفٍ ۖ لَا يَقْدِرُونَ مِمَّا كَسَبُوا عَلَىٰ شَيْءٍ ۚ ذَٰلِكَ هُوَ الضَّلَالُ الْبَعِيدُ (ابراہیم: ۱۸)

"తమ ప్రభువును విశ్వసించని వారి పనులను తుఫాను రోజున వీచే పెనుగాలి ఎగురవేసే బూడిదతో పోల్చవచ్చు. వారు తాము చేసిన దానికి ఎటువంటి ప్రతిఫలాన్ని పొందలేరు. ఇదే మార్గభ్రష్టత్వానికి పరాకాష్ట అంటే." (ఇబ్రాహీమ్ : 18)

అంటే, ఎవరైతే కృతఘ్నత, విశ్వాస ఘాతుకం, సర్వం తామే అని విర్రవీగే వైఖరి, అవిధేయత, హద్దులను అతిక్రమించే మార్గాన్ని అవలంభిస్తూ, దైవప్రవక్తలు తెచ్చిన విధేయతా మార్గాన్ని, ఆరాధనా విధానాలను కాదంటారో, వారి జీవిత ఘనకార్యాలు, సర్వసత్కార్యాలన్నీ, ఓ సుదీర్ఘ కాలం వరకు పెరిగిపోయిన ఓ బూడిద గుట్టగా తయారౌతాయి అని. కేవలం ఒకే ఒక రోజున వీచే తుఫాను గాలి ఆ గుట్టలోని ఒక్క అణువును కూడా మిగల్చకుండా ఎగరేసుకొని పోగలదు. చూపరులను మాయ గొలిపే వారి సభ్యతా సంస్కృతులు, ఘనమైన వారి నాగరికత, ఆశ్చర్యానికి గురిచేసే వారి పరిశ్రమలు, పటిష్టమైన వారి సామ్రాజ్యాలు, మహోన్నతమైన వారి యూని వర్శిటీలు, కళాసంస్కృతులు, వారి శాస్త్రీయ, లలిత కళాఖండాలు చివరకు వారి ఆరా ధనలు, ప్రదర్శనాబుద్ధితో ఆచరించేవారి సత్కార్యాలు, ప్రపంచం ముందు గర్వ కారణంగా నిలిచిన వారి పెద్దపెద్ద సంక్షేమ సంస్థలు ఒక్కటేమిటీ అన్నీ ఓ బూడిద గుట్టగానే మిగిలిపోతాయి. ప్రళయ దినం నాటి పెనుగాలి ఒక్కటేచాలు. ఆ గుట్టను పూర్తిగా ఎగరేసుకొని పోవడానికి. పరలోకంలో దానికి సంబంధించిన ఒక్క అణువు కూడా మిగిలుండదు కర్మల త్రాసులో వేసి తూయడానికి.

أَلَمْ تَرَ أَنَّ اللَّهَ خَلَقَ السَّمَاوَاتِ وَالْأَرْضَ بِالْحَقِّ ۚ (ابراہیم: 19)

"అల్లాహ్ భూమ్యాకాశాల సృష్టిని సత్యంపై నెలకొల్పడాన్ని నీవు చూడడం లేదా?" (ఇబ్రాహీమ్-19)

ఇది పైన చెప్పిన ఆయత్‌కు తరువాత వచ్చిన ఆయత్. అలాగే, ఆ ఆయత్‌లో దేన్నైతే గట్టిగా వారించడం జరిగిందో దానికి ఆధారం చూపే ఆయత్ ఇది. అంటే, ఈ విషయాన్ని విని మీరు ఎందుకింత ఆశ్చర్యపడిపోతున్నారు? భూమ్యాకాశాల ఈ మహోన్నత సృజన కార్యక్రమం కేవలం సత్యం పునాదులపైన్నే నెలకొని ఉంది,

అసత్యంపై కాదు అన్నది. యదార్థం మరియు సత్యం పునాదులపై కాకుండా అర్థం లేని ఊహలు, పిచ్చిఆలోచనా పునాదులపై ఏ సౌధం అయితే నిర్మితమై నిలబడు తుందో దానికి ఎలాంటి పటిష్టతగాని, మనగలిగే అవకాశంగాని ఉండదు. దాన్నే నమ్ముకొని పనిచేసేవాడు ఎన్నటికీ సఫలం కాలేడు. నీటిపై బొమ్మగీచో, ఇసుక రేణువులపై పెద్ద సౌధం నిర్మించో, ఆ బొమ్మ నిలిచి ఉంటుందని, ఆ భవనం నిలబడి ఉండగలుగుతుందని ఆశపడితే అతని ఆ ఆశ ఎంతోసేపు నిలిచేది కాదు. ఎందుకంటే గీచిన బొమ్మను స్వీకరించి ఉంచే శక్తి నీటికి లేదు. అలాగే ఇసుక కూడా కట్టడాల కోసం గట్టి పునాది కాజాలదు. కాబట్టి యదార్థాన్ని, నిజాన్ని కాదని ఏవరైనా అసత్యపు పునాదులపై తన కర్మల సౌధాలను నిర్మించుకుంటే అతను విఫలం కాక తప్పదు. దేవుని ఈ సృష్టిలో, ఆయన విధేయతను, దాస్యాన్ని కాదని స్వతంత్రంగా తన కార్యకలాపాలను సాగించే వ్యక్తి లేదా దైవానికితోడు ఇంకొకరి దైవత్వాన్ని స్వీకరించి (నిజంగా అతనికి ఆ దైవత్వం ఉండనే ఉండదు) జీవితం గడిపే వాని జీవిత కర్మలన్నీ బూడిదలో బోసిన పన్నీరు చందంగా మారిపోతాయి అనే యదార్థాన్ని విని మీరు ఎందుకు ఆశ్చర్యపడుతున్నట్లు? మనిషి ఇక్కడ సర్వస్వతంత్రుడు లేదా దైవానికి కాక మరొకరి దాసుడు కావడం యదార్థం కానప్పుడు, ఈ యదార్థానికి విరుద్ధమైన సిద్ధాంతంపై తన ఆలోచనా, ఆచరణల వ్యవస్థకు పునాదులుంచేవాడు మీ దృష్టిలో నీటిపై చిత్రాలు వేసే ఉన్మాది లాంటివాడే కదా! మరి ఇదే యదార్థం అయినప్పుడు ఆ పిచ్చివానికి ఎదురయ్యే పరిణామం కంటే మేలైన పరిణామం ఎదురౌతుందని ఎందుకు ఆశిస్తున్నారు?

أَلَمْ تَرَ كَيْفَ ضَرَبَ اللَّهُ مَثَلًا كَلِمَةً طَيِّبَةً كَشَجَرَةٍ
طَيِّبَةٍ أَصْلُهَا ثَابِتٌ وَفَرْعُهَا فِي السَّمَاءِ ۙ (ابراهيم : ٢٤)

"పరిశుద్ధ వాక్కును అల్లాహ్ ఏ వస్తువుతో పోల్చాడో మీరు గమనించడం లేదా? దాని పోలిక ఇలా ఉంది: ఒక మేలుజాతి చెట్టు ఉంది. దాని వేరు భూమిలో లోతుగా నాటుకుపోయింది. కొమ్మలు ఆకాశాన్ని అంటాయి." (ఇబ్రాహీం:24)

మరో విధంగా చెప్పాలంటే, భూమి నుండి ఆకాశం వరకు సమస్త విశ్వవ్యవస్థ, ఓ విశ్వాసి తన సద్వచనంలో ప్రకటించినట్లుగా, యదార్థం పైన్నే ఆధారపడి ఉంది. కాబట్టి ప్రకృతి ధర్మం ఏ కోణంలోనూ దానితో విరోధించడం లేదు. ఏ వస్తువుకు సంబంధించిన అసలు స్వభావం దాన్ని నిరాకరించదు. ఏ యదార్థం, ఏ సత్యమూ దానితో ఢీ కొనవు. అందుకోసమే భూమి, దాని సమస్త వ్యవస్థ దానికి తోడ్పాటు అందిస్తాయి. ఆకాశం మరియు దాని సర్వశక్తులు దాన్ని ఆహ్వానిస్తాయి.

تُؤْتِي أُكُلَهَا كُلَّ حِينٍ بِإِذْنِ رَبِّهَا ۗ (ابراهيم : ٢٥)

"ప్రతి క్షణం అది తన ప్రభువు ఆజ్ఞానుసారం ఫలాలను అందిస్తోంది."
(ఇబ్రాహీం:25)

అంటే ఆ వాక్కు ఫలవంతమైన, సత్ఫలితాన్నిచ్చే వాక్కు. ఏ వ్యక్తి అయినా మరే జాతి అయినా, దాన్నే పునాదిగా చేసుకొని తన జీవన వ్యవస్థను నిర్మించు కుంటుందో, దానికే సతతం ఆ వ్యవస్థ ప్రయోజనకరమైన ఫలితాలు లభిస్తూ ఉంటాయి. ఆ వాక్కు ఆలోచనల చిక్కులను విడదీయగలదు. స్వభావంలో ప్రశాంతత, అలవాట్లలో సంతులనం, వ్యక్తిత్వంలో దృఢత్వం, నైతికతల్లో పవిత్రతలను పుట్టిస్తుంది. దానికి భిన్నంగా అపరిశుద్ధమైన వాక్కు వినాశకరమైన చెట్టులాంటిది. ఆ చెట్టు ఉన్నంతకాలం చేదు, వగరు ఫలాలనే అందిస్తూ ఉంటుంది. వాతావరణం మారిపోగానే పరిస్థితుల ఒక్క వ్రేటే దాన్ని సమూలంగా పెకిలించి వేయగలదు.

పరిశుద్ధ వాక్కు, అపరిశుద్ధ వాక్కుల మధ్యగల తేడాను, ప్రపంచపు ధార్మిక, నైతిక, ఆలోచనాత్మక మరియు నాగరికతా చరిత్రను అధ్యయనం చేసే ప్రతి వ్యక్తి ఇట్టే గుర్తించగలడు. చరిత్ర ప్రారంభకాలం లగాయత్తు నేటి వరకూ, పరిశుద్ధ వాక్కు ఎప్పుడూ ఒక్కటిగానే ఉంటూ వచ్చిందని, అపరిశుద్ధ వాక్కులు అనేకంగా పుట్టుకొచ్చాయని, పరిశుద్ధ వాక్కును ఎప్పుడూ దాని మూలంతో సహా పెకిలించడం జరగలేదని తెలుసుకోగలడు. కాని అపరిశుద్ధ వాక్కుల పట్టిక వేలాది నిర్జీవమైన పదాల పేర్లతో నిండి ఉంది. చివరికి, వాటిలో చాలామట్టుకు నేటి చరిత్ర పుటల్లో తప్ప మరెక్కడా కానరాకుండా పోయాయి. ఒకానొక కాలంలో అతిగా ప్రచారంలో వున్న ఆ సిద్ధాంతాల గురించి చెబితే, ఔరా! మనిషి ఇలాంటి అల్పమైన పిచ్చి విషయాలకు కూడా పాల్పడ్డాడా? అని ఆశ్చర్యపోగలరు.

పరిశుద్ధ వాక్కును ఎప్పుడైనా, ఎక్కడైనా ఏ వ్యక్తి లేదా ఏ జాతి అయినా దాని నిజ స్వరూపంలో అనుసరించిందో ఆ వాతావరణమే దాని సుగంధంతో గుబాళిం చింది. దాని శుభాల వల్ల ఆ వ్యక్తి లేదా ఆ జాతి ఒక్కటే ప్రయోజనం పొందలేదు, దాని పరిసర ప్రపంచం కూడా ఆ శుభాలను అనుభవించింది. కాని అపరిశుద్ధ వాక్కు ఎక్కడ, ఏ వ్యక్తిగత లేదా సామూహిక జీవితంలోనైనా వెళ్ళూనుకొనిపోతే దాని దుర్గంధంతో ఆ వాతావరణమే కలుషితమై కంపుగొట్టనారంభించింది. దాని ముళ్ళ బాధ వలన దాన్ని అనుసరించేవాడూ, అతనితో సంబంధం గలవాడూ ఉభయులూ తల్లడిల్లి ప్రశాంతంగా బ్రతకలేకపోయారు.

"తమ ప్రభువును విశ్వసించనివారు పనులను తుఫాను రోజున వీచే పెనుగాలి ఎగురవేసే బూడిదతో పోల్చవచ్చు" అని చెప్పబడిన పై విషయాన్ని ఇక్కడ ఉపమాన రూపంలో చెప్పడం జరిగింది. ఈ విషయమే ఇంతకు పూర్వం మరో విధంగా, వరదలు మరియు కరిగించిన లోహాల ఉపమానంలో చెప్పడం జరిగింది.

يُثَبِّتُ اللّٰهُ الَّذِيْنَ اٰمَنُوْا بِالْقَوْلِ الثَّابِتِ فِي الْحَيٰوةِ
الدُّنْيَا وَفِي الْاٰخِرَةِ ۚ وَيُضِلُّ اللّٰهُ الظّٰلِمِيْنَ ﴿ابراہیم:۲۷﴾

"ఒక స్థిరమైన వాక్కు ఆధారంగా ఇహలోకంలోనూ, పరలోకంలోనూ విశ్వాసులకు అల్లాహ్ నిలకడను ప్రసాదిస్తాడు. అల్లాహ్ దుర్మార్గులను మార్గభ్రష్టులుగా చేస్తాడు." (ఇబ్రాహీమ్:27)

అంటే, ఈ స్థిరమైన వాక్కు ద్వారా ఓ పటిష్టమైన సూత్రం, ఓ స్థిరమైన ఆలోచనా విధానం, ఓ సమగ్రమైన సిద్ధాంతం లభిస్తుంది; అది ప్రతి చిక్కుముడిని విడదీయడానికి, క్లిష్టమైన ప్రతి సమస్యను పరిష్కరించడానికి 'మాస్టర్ కీ'లా పనిజేస్తుంది అని అర్థం. దీనివలన సుగుణాల్లో దృఢత్వం, నైతిక విలువల్లో వికాసం లభిస్తుంది. ఓ వైపు ఇది మనస్సుకు ప్రశాంతతను ప్రసాదిస్తే మరోవైపు మనిషిని తన ప్రయత్నంలో తప్పటడుగు వేయకుండా, పొరబడకుండా, చపలచిత్తానికి లోను కాకుండా రక్షిస్తుంది. ఆ పిదప అతను మరణం అనే సరిహద్దును దాటి పరలోక హద్దుల్లోనికి అడుగుపెట్టగానే అక్కడ అతనికి ఎలాంటి కలవరంగాని, తత్తరపాటుగాని కలుగదు. ఎందుకంటే, అక్కడ సమస్తమూ తాను ఊహించిన విధంగానే ఉంటుంది కాబట్టి. అంటే, అక్కడి నియమ నిబంధనల గురించి ముందే తెలిసివారిలా ఆ లోకంలో అడుగు పెడ్తారు. "ముందుగానే హెచ్చరించడం జరగలేదు, ఆ కారణంగా దాని కోసం వారు సిద్ధంగా లేరు" అనే ఎలాంటి సందర్భం వారికి ఎదురుకాదు. కాబట్టి వారు అక్కడి ప్రతి మజిలీని అధిగమిస్తూ పోతుంటారు. దైవతిరస్కారులు చనిపోగానే, తమ ఊహలకు పూర్తి వ్యతిరేకంగా, అనుకోని పరిస్థితికి భిన్నంగా ఉంటుంది అక్కడ వారి పరిస్థితి. "అల్లాహ్ దుర్మార్గులను మార్గభ్రష్టులుగా చేస్తాడు" అని అంటే, ఏ దుర్మార్గులైతే పరిశుద్ధ వాక్కును కాదని మరో అపరిశుద్ధ వాక్కును అవలంబిస్తారో. అల్లాహ్ వారి మేధను చీకాకు పరిచి, వారి ప్రయత్నాలను వమ్ము చేస్తాడు; ఏ కోణంలోను వారు సక్రమమైన మార్గాన్ని పొందలేరు, వారి లక్ష్యం నెరవేరదు అని చెప్పడం అన్నమాట.

బాధాకరమైన పరిస్థితుల పట్ల ఓర్పు

وَيَدْعُ الْاِنْسَانُ بِالشَّرِّ دُعَآءَهٗ بِالْخَيْرِ ۭ وَكَانَ الْاِنْسَانُ
عَجُوْلًا ۝ ﴿بنی اسرائیل : ۱۱﴾

"మానవుడు మేలును అర్థించే బదులు కీడును అర్థిస్తాడు. నిజంగానే మానవుడు తొందరపాటు కలవాడు. ఓర్పు లేనివాడు." (బనీ ఇస్రాయీల్:11)

మక్కా దైవతిరస్కారులు దైవప్రవక్త(స)ను ఉద్దేశించి, ఏదీ! నీవు మమ్మల్ని భయపెడుతున్న ఆ శిక్ష ఎలాంటిదో; ఎందుకు తీసుకురావు? అని మాటిమాటికీ అడిగే అర్థం లేని ప్రశ్నలకు జవాబు ఇది. పై విషయం చెప్పిన వెంటనే ఈ వాక్యం చెప్పడంలో గల ఔచిత్యం ఏమిటంటే, "పిచ్చివారా! మేలును కోరాల్సిందిబోయి, మీరు దైవ శిక్షను కోరుకుంటున్నారా? దైవ శిక్ష ఏ జాతిపైనైతే విరుచుకుబడుతుందో ఆ జాతి గతి ఏమైపోతుందో మీకేమైనా తెలుసా?" అన్నది.

దానికితోడు ఈ వాక్యంలో, దైవ తిరస్కారుల ఆగడాలకు, వారి మంకుపట్టుకు విసిగిపోయి, అప్పుడప్పుడు వారిపై దైవశిక్ష విరుచుకుపడితే బాగుండు అనే ప్రార్థనలు చేసే ముస్లిములకు కూడా మందలిపు ఉంది. ఆ దైవతిరస్కారుల్లోనే చాలా మంది భవిష్యత్తులో ముస్లిములుగా మారేవారు, ప్రపంచంలో ఇస్లామ్ పతాకాన్ని ఉన్నతం చేసేవారు కూడా ఉన్నారనే విషయం వారికి తెలియదు. అందుకని అల్లాహ్, "మనిషి నిజంగానే ఓర్పును కోల్పోయి, సమయానికి ఏ వస్తువు అవసరమో దాన్నే అడిగేస్తాడు, ఆ తరువాత అనుభవంరీత్యా ఆ ప్రార్థన అప్పుడే మన్నించబడి ఉంటే, అది తన పాలిట మేలుకాకుండా చెడుగానే పరిణమించేదని గ్రహిస్తాడు" అని హెచ్చరించడం జరిగింది.

ఓర్పు ప్రాముఖ్యత- దాని అవసరం

فَاعْبُدْهُ وَاصْطَبِرْ لِعِبَادَتِهِ ۚ هَلْ تَعْلَمُ لَهُ سَمِيًّا ○

(مریم : ٦٥)

"కాబట్టి మీరు ఆయనకు దాస్యం చేయండి. ఆయన దాస్యంలోనే స్థిరంగా ఉండండి. మీకు తెలిసినంతవరకు, ఆయనతో సమానమైన స్థాయి గలవాడెవడైనా ఉన్నాడా?" (మర్యమ్:65)

"స్థిరంగా ఉండండి" అంటే ఆయన దాస్యమార్గంపై దృఢంగా నడవండి, ఆ మార్గంలో ఎన్ని కష్టాలు, కడగండ్లు ఎదురైనా వాటిని ఓర్పుగా ఎదుర్కోండి, ఆయన తరపున సాంత్వన లభించడంలో కొంత ఆలస్యం జరిగినప్పటికీ బెంబేలెత్తకండి, ఓ విధేయుడైన దాసునిలా ఆయన ఇష్టానికి తలొగ్గి ఉండండి, ఓ ప్రవక్తా మీపై వేసిన బాధ్యతను దృఢచిత్తంతో నిర్వర్తించుకుంటూ పొండి అని అర్థం.

'సమానమైన స్థాయి గలవాడు" అనే భావానికి 'సమియ్యా' అనే పదం వాడడం జరిగింది. ఆ పదానికి నిఘంటువు అర్థం 'అదే పేరుగలవాడు' అని. అంటే, అల్లాహ్ ఆరాధ్యుడు. ఆయన తప్ప మరే ఆరాధ్యుడు (అల్లాహ్) మీ దృష్టిలో ఉన్నాడా? ఒకవేళ లేకపోతే- లేడని మీకు తెలుసు- అలాంటప్పుడు ఆయన దాస్యం చేసే మరేమార్గం ఉందని గాని, ఆయన తప్ప మరెవ్వరి దాసుడుగా ఉండాలనిగాని ఎలా భావిస్తారు?

وَلَوْلَا كَلِمَةٌ سَبَقَتْ مِن رَّبِّكَ لَكَانَ لِزَامًا وَّأَجَلٌ
مُّسَمًّى ۝ فَاصْبِرْ عَلَىٰ مَا يَقُولُونَ وَسَبِّحْ بِحَمْدِ رَبِّكَ قَبْلَ
طُلُوعِ الشَّمْسِ وَقَبْلَ غُرُوبِهَا ۖ وَمِنْ آنَاءِ اللَّيْلِ فَسَبِّحْ
وَأَطْرَافَ النَّهَارِ لَعَلَّكَ تَرْضَىٰ ۝ (طٰہٰ: ۱۲۹، ۱۳۰)

"నీ ప్రభువు తరపు నుండి మొదట్లోనే ఒక విషయం నిశ్చయమై ఉండకపోతే, ఒక గడువు నిర్ణయమై ఉండకపోతే, వీరి తీర్పు కూడా జరిగి ఉండేది. కనుక ఓ ప్రవక్తా! వీరు కల్పించే మాటల పట్ల సహనం వహించు; సూర్యుడు ఉదయించే ముందు, అస్తమించేముందు, రాత్రి సమయాల్లో కూడా పగటి అంచులలో కూడా ఆయనను స్తుతించు. బహుశా నీవు సంతుష్టుడవౌతావేమో." (తాహా:129,130)

"వీరు కల్పించే మాటల పట్ల సహనం వహించు" అని అంటే, అల్లాహ్ వారిని చంపదలచలేదు, వారికి వారి కోసం ఓ గడువు నిర్ణయించాడు, అందుకని అయన ఇచ్చిన ఈ గడువు లోపల వారు మీ పట్ల ప్రవర్తించే వైఖరిని మీరు సహించాల్సి ఉంటుంది. సహనం మరియు ఓర్పులతో వారి చేదుమాటలను దిగమ్రింగుతూ మీ సందేశ ప్రచార బాధ్యతను నిర్వర్తించాల్సి ఉంటుంది. ఈ సహనం ఓర్పులను భరించే శక్తి మీకు నమాజు ద్వారా లభ్యం కాగలదు. కాబట్టి ఆ నమాజుల కోసం ఏ వేళలైతే నిర్దేశించబడ్డాయో ఆ సమయాల్లో నమాజులను క్రమంతప్పకుండా పాటించాల్సి ఉంటుంది అని అర్థం.

'బహుశా నీవు సంతుష్టుడవౌతావేమో' అనే పదానికి రెండు అర్థాలు చెప్పవచ్చు. ఆ రెండు కూడా ఇక్కడ అన్వయించేవే. ఒక అర్థం ఏమిటంటే ప్రస్తుతం, మీరు నిర్వర్తిస్తున్న కార్యానికిగాను, మీ మనస్సు బాధపడే యే మాటలనైతే వింటున్నారో ఆ పరిస్థితికి రాజీపడిపోండి. మీపై అన్యాయంగా ఏ జులుం జరుగుతూ ఉందో దానికి అల్లాహ్ వారిని ఇప్పుడే శిక్షించదలచలేదనే తీర్పుకు తలొగ్గి ఉండండి. వారు ధర్మ ప్రచారకుణ్ణి సతాయిస్తూనే ఉంటారు. భూమిలో అడ్డుఅదుపు లేకుండా ప్రవర్తిస్తూనూ ఉంటారు అని.

రెండవ భావం ఏమిటంటే, ఆ కార్యాన్ని కాస్తా నిర్వర్తించి చూడండి! దాని ఫలితం ముందుకు రాగానే మీరు ఎలా సంతోషబడతారో చూద్దురుగాని అని. ఈ రెండవ భావం దివ్యఖుర్‌ఆన్‌లో అనేక చోట్ల అనేక రకాలుగా చెప్పడం జరిగింది. ఉదాహరణకు బనీ ఇస్రాయీల్ అధ్యాయంలో నమాజ్‌కు ఆదేశించినవెంటనే ఈ వాక్యాలు ఇలా చెప్పడం జరిగింది.

عَسَىٰ أَن يَبْعَثَكَ رَبُّكَ مَقَامًا مَّحْمُودًا ۝ (۷۹)

"నీ ప్రభువు నిన్ను ప్రశంసనీయమైన ఉన్నత స్థానంలో ప్రతిష్టింపజేయడం అసంభవమేమీ కాదు." (79)

అలాగే జుహా అధ్యాయంలో ఇలా సెలవియ్యబడింది:

وَلَلْاٰخِرَةُ خَيْرٌ لَّكَ مِنَ الْاُوْلٰى ۝ وَلَسَوْفَ يُعْطِيْكَ رَبُّكَ فَتَرْضٰى ۝

"నిశ్చయంగా రాబోయే కాలం నీ కొరకు గతకాలం కన్నా మేలైనదిగా ఉంటుంది. త్వరలోనే నీకు, నీ ప్రభువు సంతోషపడేటంత అధికంగా ప్రసాదిస్తాడు." (3,4)

సందేశ ప్రచారం శాశ్వతమైనది, విశాలమైన సహనంతో కూడుకున్నది

وَجَزٰىهُمْ بِمَا صَبَرُوْا جَنَّةً وَّحَرِيْرًا ۝ (الدهر : ١٢)

"వారి సహనానికి ప్రతిగా వారికి స్వర్గం మరియు పట్టువస్త్రాలను బహూకరిస్తాడు." (అద్దహ్ర్:12)

ఇక్కడ సహనం అనే పదం విశాలమైన అర్థంలో ఉపయోగించడం జరిగింది. పైగా, సద్వర్తనులైన విశ్వాసుల పూర్తి ఇహలోక జీవితాన్నే సహనంతో కూడిన జీవితంగా ఖరారు చేసి చెప్పడం జరిగింది. ఎలాగంటే, ఓ విశ్వాసి తాను ప్రాజ్ఞుడైన తరువాత లేదా విశ్వసించిన తరువాత తాను మరణించేవరకు ధర్మసమ్మతం కాని మనోవాంఛలను అణచుకుంటాడు. అల్లాహ్ నిర్దేశించిన హద్దులకే పరిమితం అయిపోతాడు. అల్లాహ్ తనకై నిర్దేశించిన విధులను పాటిస్తాడు. అల్లాహ్ ప్రసన్నత బడయడానికి తన సమయాన్ని, తన ధనాన్ని, తన శక్తిని ధారపోయడమే కాకుండా చివరికి అవసరం వస్తే తన ప్రాణాన్నైనా త్యాగం చేయడానికి సిద్ధపడతాడు. అల్లాహ్ మార్గం నుండి తప్పించేందుకు ఎదురైన ప్రతి పేరాశను, ప్రోత్సాహాన్ని నిరాకరిస్తాడు. సన్మార్గంపైన నడవడంలో అడ్డొచ్చే ప్రతి ప్రమాదాన్ని, ప్రతి కష్టాన్ని ఓర్పుతో సహిస్తాడు. హరామ్ మార్గాల ద్వారా లభించే ప్రతి లాభాన్ని మరియు ఐశ్వర్యాన్ని కాలదన్నుతాడు. సత్యంపై నిలకడగా ఉండడం వలన అతనికి కలిగే ప్రతి నష్టాన్ని, ప్రతి బాధను భరిస్తాడు. ఈ సత్కర్మలకు ఫలితం ఈ ఇహలోకంలో కాకుండా పరలోకంలో లభిస్తాయి అనే దైవ వాగ్దానాన్ని నమ్మి చేసే సత్కర్మలు ఇవన్నీ. ఇలాంటి వైఖరి ఓ విశ్వాసి పూర్తి జీవితాన్నే ఓర్పు, సహనాల జీవితంగా మలుస్తుంది. ఇది ప్రతి క్షణం వహించే సహనం. శాశ్వతమైన సహనం; సార్వజనీనమైన సహనం మరియు జీవిత కాలపు సహనమూను.

విశ్వాసులు ఒకరినిమించిన సహనం మరొకరు కలిగి ఉండడానికి ప్రోత్సహించడం జరిగింది.

ثُمَّ كَانَ مِنَ الَّذِينَ آمَنُوا وَتَوَاصَوْا بِالصَّبْرِ
وَتَوَاصَوْا بِالْمَرْحَمَةِ ۝ (البلد : ١٧)

"విశ్వసించి, సహనం, సానుభూతుల్ని గురించి ఒకరికొకరు బోధించుకునే వారిలో మనిషి చేరిపోవాలి." (అల్‌బలద్:17)

సహనానికి సంబంధించినంత మట్టుకు ఆ పదాన్ని దివ్యఖుర్‌ఆన్ విశాలమైన అర్థంలో ఉపయోగిస్తోంది. దాని ప్రకారం ఓ మోమిన్ (విశ్వాసి) జీవితం మొత్తం సహనంతో కూడిన జీవితమే. విశ్వాస మార్గంపై అడుగుపెట్టగానే మనిషి సహన పరీక్ష ప్రారంభం అయిపోతుంది. దైవంచేత విధిగా చేయబడిన ఆరాధనలను నిర్వ ర్తించడంలో సహనం అవసరం ఎంతైనా ఉంటుంది. దైవాదేశాల విధేయతలోను సహనం అవసరం. దైవం నిషేధించిన విషయాల నుండి తమను తాము కాపాడుకోవా లంటే సహనం లేనిదే అది సాధ్యం కాదు. నైతికపరమైన చెడుగులను విడనాడడం, పరిశుద్ధమైన నైతికవిలువలను అవలంబించాలన్నా సహనం కావాలి. పాపపంకిలం లోనికి లాగే ప్రేరకాలు అడుగడుగునా ఎదురౌతుంటాయి. వాటిని సహనం ద్వారానే ఎదురించగలం.

దైవాదేశాలపాలన కారణంగా కొన్ని సందర్భాల్లో నష్టాలకు, కష్టాలకు గురి కావడం మరియు అనేక ప్రయోజనాలను వదులుకునే పరిస్థితులు ఏర్పడవచ్చు కూడా. అయితే, దానికి భిన్నమైన మార్గాన్ని అవలంబించడం వలన అనేక ప్రయోజ నాలు, ఐశ్వర్యాలు లభిస్తాయి. కాబట్టి ఇలాంటి సందర్భాల్లో ఓ విశ్వాసికి పరీక్షలు ప్రారంభం అవుతాయి. అదేకాకుండా విశ్వాస మార్గాన్ని అవలంబించగానే మనిషికి, తన మనోవాంఛల మొదలు తన భార్యాపిల్లలు, తన కుటుంబ సభ్యులు, తన దేశం, తన జాతితో మరియు మొత్తం ప్రపంచంలోని మానవులతో జిన్ను, షైతానులతో సంఘర్షించవలసి ఉంటుంది. చివరికి దైవమార్గంలో హిజ్రత్ మరియు జిహాద్ చేసే అవసరం కూడా ఏర్పడుతుంది. ఈ పరిస్థితులన్నిటిలోనూ సహనం అనే సుగుణమే మనిషిని స్థిరంగా ఉంచగలుగుతుంది. అయితే, ఇప్పుడు ఒక్కొక్కడుగా ప్రతి మోమిన్, ఈ కఠిన పరీక్షకు గురైనప్పుడు అతను ఓడిపోయే ప్రమాదముంటుంది. గెలవాలన్నా ఎంతో కష్టబడవలసి వస్తుంది. దీనికి భిన్నంగా మోమిన్లందరూ కలిసి ప్రతి ఒక్కడూ సహశీలుడై వారంతా కలిసికట్టుగా పరస్పరం ఒకరికొకరు సహనాన్ని బోధించుకుంటూ ఆ పరీక్షలో ఒకరికొకరు చేదోడువాదోడుగా ఉండే ఓ సమాజాన్ని నిర్మించుకుంటే విజయాలు ఆ సమాజాన్ని తప్పక వరిస్తాయి. చెడుకు ధీటుగా వారిలో ఎనలేని శక్తి ఉద్భవిస్తుంది. మానవ సమాజాన్ని సన్మార్గంపై నడపడానికి ఓ పటిష్టమైన బలగం తయారౌతుంది.

ప్రవక్తలకు కూడా, సత్యధర్మమార్గంలో వచ్చే ఈ కష్టాలను ఎదుర్కొనే బోధనలు చేయడం జరిగింది.

فَاصْبِرْ لِحُكْمِ رَبِّكَ وَلَا تَكُنْ كَصَاحِبِ الْحُوتِ إِذْ نَادَىٰ وَهُوَ مَكْظُومٌ

1. "కాబట్టి మీ ప్రభువు ఆదేశం వెలువడే వరకు సహనం వహించండి. ఆ 'చేపవాని' (యూనుస్-అ) లా ప్రవర్తించకండి." (ఖుర్ఆన్)

'సహనం వహించండి' అని అంటే, అల్లాహ్ మీ విజయం కోసం, మీ సహాయం కోసం ఆ విరోధుల అపజయం కోసం నిర్ణయం తీసుకునే సమయం ఆసన్నమైనంత వరకు వేచి చూడండి, ఈ సందేశప్రచారంలో మీకు ఏ కష్టాలు, కడగండ్ల యితే ఎదురౌతున్నాయో వాటిని సహనంతో ఓర్చుకోండి అని అర్థం. అంటే హజ్రత్ యూనుస్ (అ)లా తొందరపాటు ప్రదర్శించకండి, ఆ తొందరపాటు కారణం గానే ఆయనను చేప పొట్టలోనికి పంపించవేయడం జరిగింది అని చెప్పడం అన్న మాట. దైవప్రవక్త (స) కూడా దైవనిర్ణయం రాకముందే బహుశా ఏదో ఒక తొందరపాటు పనికి పూనుకొన్నారేమో ఆ కారణంగా దైవం తరఫున ఆయనకు హెచ్చరిక వెలువడింది.

فَاصْبِرْ صَبْرًا جَمِيلًا (المعارج:٥)

2. "ఓ ప్రవక్తా! సహనం వహించు, హుందాతనంతో కూడిన సహనం." (అల్‌ముఆరిజ్:5)

وَلِرَبِّكَ فَاصْبِرْ (المدثر)

3. "నీ ప్రభువు కొరకు సహనం వహించు." (అల్‌ముద్దసిర్:7)

అంటే ఏ కార్యాన్నైతే మీకు అప్పగించడం జరుగుతుందో అది ఘనమైన కార్యం. ఇందులో తీవ్రమైన కష్టాలు, బాధలు మీకు ఎదురుకాగలవు. మీ సొంత జాతే మీకు శత్రువుగా మారిపోతుంది. అరేబియా ద్వీపకల్పం మొత్తం మీకు వ్యతిరేకంగా ఏకమౌతుంది. ఈ మార్గంలో సంభవించనున్న దాన్ని మీ ప్రభువు కొరకు సహనం వహించే ఎదుర్కొనండి. మీ విధిని పూర్తి స్థిరచిత్తంతో, స్థయిర్యంతో నిర్వర్తిం చండి. దాన్నుండి అడ్డుకోవడానికి సామ,దాన భేద దండోపాయాలు ఉపయోగించ బడతాయి. మీ మార్గంలో స్నేహం, వైరం, ప్రేమ వగైరాల అడ్డుగోడలు పెట్టి నిలు వరించే ప్రయత్నం చేస్తారు. ఆ విషయాలన్నిటికి విరుద్ధంగా మీరు మీ కార్యంలో దృఢంగా నిలబడండి అని చెప్పడం అన్నమాట.

فَاصْبِرْ لِحُكْمِ رَبِّكَ وَلَا تُطِعْ مِنْهُمْ آثِمًا أَوْ كَفُورًا ٥١

4. "దైవ నిర్ణయంపై సహనం వహించండి, వీరిలోని దుష్టుని, దైవతిరస్కారుని ప్రతి మాటను నిరాకరించండి."

"దైవ నిర్ణయంపై సహనం వహించండి" అని అంటే, యే మహోన్నత కార్య నిర్వహణ కొరకు మిమ్మల్ని నియమించడం జరిగిందో ఆ కార్య నిర్వహణలో ఎదురయ్యే వత్తిళ్ళను, కష్టాలను సహనంతో అడ్డుకోండి. ఏ ఆపద వచ్చిపడినప్పటికీ దాన్ని స్థయిర్యంగా ఓర్చుకోండి. తడబాటుకు గురికావద్దు అని చెప్పడం అన్నమాట.

"ప్రతి మాటను నిరాకరించండి" అని అంటే, వారిలో ఎవ్వరికీ అణిగిమణిగి సత్యధర్మ ప్రచారాన్ని మానుకోకండి అని అర్థం. అలాగే ఏ దుష్టుని గరిపే నైతిక బోధనలు లేదా యే దైవతిరస్కారి కోసం, ధర్మం విశ్వాసాల్లో రవ్వంతైనా మార్పులు చేర్పులు చేయడానికి సిద్ధపడకండి, యేదైతే ధర్మసమ్మతం కానిదో, మరేదైతే నిషిద్ధమైనదో దాన్ని ధర్మసమ్మతం కాదు అని బాహాటంగా చాటండి. యే దుష్టుడైనా మీపై ఎంత వత్తిడి తెచ్చినా మీరు అతడిని ఖండించడంలో ఏమాత్రం వెనుకాడ కండి. యే విశ్వాసాలైతే భ్రష్టుబట్టినవో వాటిని భ్రష్టుపట్టిన విశ్వాసాలని, మరేదైతే సత్యమో దాన్ని సత్యమని బాహాటంగా చెప్పేయండి. దైవతిరస్కారులు మీ నోరునొక్కడానికి లేదా ఆ విషయంలో ఏదైనా రాజీపడమని మీపై ఎంత వత్తిడి తీసుకువచ్చినాసరే.

వ్యతిరేకతల విషయంలో అల్లాహ్‌నే వకీలుగా చేసుకోండి

وَاصْبِرْ عَلٰى مَا يَقُوْلُوْنَ وَاهْجُرْهُمْ هَجْرًا جَمِيْلًا

(المزمل: ١٠)

"లోకులు కల్పించే మాటల పట్ల సహనం వహించి, మంచితనంతో వారి నుండి వైదొలగిపో." (అల్ ముజమ్మిల్:10)

'వైదొలగిపో' అనే పదానికి, వారితో తెగతెంపులు చేసుకొని నీ సందేశ ప్రచారాన్ని మానుకో అన్నది కాదిక్కడ భావం. కాగా దీని భావం ఏమిటంటే, వారితో కయ్యానికి దిగకు, వారి దౌష్ట్యాన్ని పూర్తిగా ఉపేక్షించు, వారి దుర్మార్గాలకు సమాధానంగా ఎలాంటి చర్యగైకొనకు అన్నది. అదేకాకుండా ఈ వైఖరిలో ఎలాంటి క్రోధంగాని, ఎలాంటి చీకాకుగాని ఉండడానికి వీల్లేదు. పైగా ఇది, ఓ సంస్కారవంతుడు ఓ బజారు పోకిరి మాటలు విని ఎలా మిన్నకుండిపోతాడో, అతణ్ణి ఎలా ద్వేషించడో అలా మసలుకునే విధానంలా ఉండాలి. అయితే ఇక్కడ, దైవప్రవక్త (స) గారి వైఖరి దానికి భిన్నంగా ఉండిందా అనే అపోహకు లోనుకాకూడదు. ఎందుకంటే ఆయన (స) ప్రారంభం నుండీ ఈ విధానాన్నే అవలంబిస్తూ ఉండేవారు. కాని దివ్యఖుర్‌అన్‌లో ఈ ఆదేశం వెలువడడానికి గల కారణం, దైవతిరస్కారులకు, మీరు ఏ వైఖరినైతే అవలంబిస్తు న్నారో దానికి సమాధానం ఇవ్వకపోవడానికి కారణం మా బలహీనత కాదు. అల్లాహ్‌యే అలాంటి మాటలకు సమాధానంగా గౌరవనీయమైన వైఖరిని అవలంబించాలని,

ఇతర సందేశ ప్రచారకులు కూడా అలాంటి వైఖరినే అవలంభించాలని ఆదేశా లిచ్చాడని తెలియపర్చడం అన్నమాట.

వ్యతిరేకతలన్నిటికీ అల్లాహ్‌నే వకీలుగా చేసుకోవాలనే బోధ

رَبُّ الْمَشْرِقِ وَالْمَغْرِبِ لَآ اِلٰهَ اِلَّا هُوَ فَاتَّخِذْهُ
وَكِيْلًا ۝ وَاصْبِرْ عَلٰى مَا يَقُوْلُوْنَ وَاهْجُرْهُمْ هَجْرًا
جَمِيْلًا ۝ (المزمل: ٩-١٠)

"ఆయన తూర్పు పడమరలకు స్వామి, ఆయననే వకీలుగా చేసుకో. లోకులు కల్పించే మాటల పట్ల సహనం వహించి, మంచితనంతో వారి నుండి వైదొలగిపో."

(అల్ ముజ్జమ్మిల్: 9-10)

ఒక వ్యక్తిని ఎవరైనా మనఃపూర్వకంగా నమ్మి అతనికి తమ వ్యవహారాలను అప్పగిస్తే, ఆ వ్యక్తిని 'వకీలు' అని అంటారు. దాదాపు ఇదే అర్థంలో ఉర్దూ భాషలో వకీలు అనే పదం వ్యవహరించబడుతోంది. ఒక వ్యక్తికి ఎవరైనా తమ వ్యాజ్యాన్ని అప్పజెప్పి ఇకతను ప్రమేయం లేకుండా ఆ వ్యాజ్యాన్ని అతను న్యాయస్థానంలో చక్కగా వాదిస్తాడని నిశ్చింతగా ఉంటే, ఆ వ్యక్తిని వకీలు అంటారు. కాబట్టి ఈ ఆతయ్‌కు అర్థం ఏమిటంటే, ఈ సందేశాన్ని వారి ముందుంచడం వలన నీకు వ్యతిరేకంగా యే తుఫాను అయితే చుట్టు ముట్టిందో, ఏ కష్టాలైతే ఎదురౌతున్నాయో వాటికి నీ వెలాంటి చింతకు లోనుకాకూడదు, నీ ప్రభువు తూర్పు పడమరలకు స్వామి. అంటే ఈ సమస్త విశ్వానికీ ప్రభువు, ఆయన తప్ప ఆయన దైవత్వంలో మరెవ్వరి భాగస్వామ్యం లేదు, నీవు నీ వ్యాజ్యాన్ని ఆయనకే అప్పజెప్పి నిశ్చింతగా ఉండిపో. ఇక ఆయనే నీ వ్యాజ్యాన్ని చూసుకుంటాడు. నీ వ్యతిరేకుల ఎత్తుగడలను వమ్ముచేసి నీ పనులన్నిటిని చక్కబెడ్తాడు అని.

సత్యసందేశ ప్రచార హోదా మహోన్నతమైనది

وَمَنْ اَحْسَنُ قَوْلًا مِّمَّنْ دَعَآ اِلَى اللّٰهِ وَعَمِلَ
صَالِحًا وَّقَالَ اِنَّنِيْ مِنَ الْمُسْلِمِيْنَ ۝ (حٰمٓ السجدہ: ٣٣)

"అల్లాహ్ వైపునకు పిలిచి, మంచి పనులు చేసి, నేను ముస్లిమ్‌ను అని ప్రకటించే వ్యక్తి మాటకంటే మంచిమాట మరెవరిది కాగలదు?"

(హామీమ్ అస్సజ్దహ్:33)

ఇంతకుముందు చెప్పిన ఆయత్‌లలో, అల్లాహ్ దాస్యంపై స్థిరంగా ఉండడం, ఆ మార్గాన్ని అవలంబించిన తరువాత దాన్నుండి విముఖత చూపకపోవడం అన్నది స్వయంగా ఓ పుణ్యకార్యమని, అది మనిషిని దైవదూతలకు మిత్రునిగా మరియు

స్వర్గానికి అర్హునిగా చేసే పుణ్యకార్యం అని చెప్పడం జరిగింది. ఇప్పుడు ఈ అయత్ లలో ఆ తరువాతి హోదా, ఆ హోదాకంటే మహోన్నతమైనది అని చెప్పడం జరిగింది. ఎందుకంటే, మీరు స్వయంగా పుణ్యకార్యాలు చేస్తూ ఇతరులకు కూడా అల్లాహ్ దాస్యం వైపునకు పిలుస్తారు కాబట్టి. ఇస్లామ్ ధర్మం పేరును ప్రకటించిన తోడనే తీవ్రమైన వ్యతిరేకతల్ని, భరింపరాని కష్టాల పరంపరను కొనిదెచ్చుకునే ఈ వాతావరణంలో మీరు, నేనో ముస్లిమును అని ప్రకటిస్తున్నారు గనుక. ఈ వాక్యపు పూర్తి ప్రాధాన్యతను అర్థం చేసుకోవాలంటే, అది అవతరించిన ఆ వాతావరణాన్ని కూడా దృష్టిలో ఉంచుకోవలసి ఉంటుంది. ఈ అయత్ అవతరించినప్పుడున్న పరిస్థితి ఏమిటంటే, ఏ వ్యక్తి అయినా తాను ముస్లిమునయ్యాను అని ప్రకటించగానే, అతను ఓ క్రూర మృగాల అడవిలో అడుగుపెట్టానా అని భావించేవాడు. ఆ మృగాలు అతణ్ణి పీక్కుతినడానికి పైకి ఎగబడుతున్నాయా అని తలిచేవాడు. ఒక అడుగు ముందుకు వేసి అతను ఇస్లామ్ ప్రచారం కోసం గొంతెత్తాడే అనుకోండి, ఇంకేముంది! అతను ఆ మృగాలను రండి నన్ను పీక్కుతినండి అని పిలవడం లాంటిదే ఆ పరిస్థితి. ఈ పరిస్థితుల్లో ఎవరైనా అల్లాహ్‌ను తన ప్రభువుగా స్వీకరించి సన్మార్గాన్ని అవలంభించడం, దాన్నుండి వైదొలగకుండా ఉండడమే గొప్ప పుణ్యకార్యం కాగలదు. అయితే సంపూర్ణమైన పుణ్యకార్యం, మనిషి నిలబడి, నేను ముస్లిమును అని ప్రకటించి, రాబోయే పరిణామాలను లెక్క చేయక అల్లాహ్ దాస్యం వైపునకు ప్రజలను పిలవడం. అలా ఆహ్వానిస్తూ, ఇస్లామ్ మరియు దాని ధ్వజవాహకులపై ఎలాంటి మచ్చపడకుండా ఉండే పరిశుద్ధమైన కార్యాన్ని నిర్వర్తించడం.

దైవాభీష్టాన్ని ఆనందంగా స్వీకరించండి

فَاعْبُدْهُ وَاصْطَبِرْ لِعِبَادَتِهِ هَلْ تَعْلَمُ لَهُ سَمِيًّا ○ (مریم: ۶۵)

"కాబట్టి మీరు ఆయనకు దాస్యం చేయండి. ఆయన దాస్యంలోనే స్థిరంగా ఉండండి. మీకు తెలిసినంతవరకు, ఆయనతో సమానమైన స్థాయి గలవాడెవడైనా ఉన్నాడా?" (మరియమ్:65)

అంటే ఆయన దాస్యమార్గంపై దృఢచిత్తులై నడవండి. ఆ మార్గంలో ఎదురయ్యే యే కష్టాలు, కడగండ్లనైనా సహనంతో అడ్డుకోండి. ఒకవేళ ఆయన తరఫున సాంత్వన లభించడంలో కొంత ఆలస్యం జరిగినప్పటికీ బెంబేలెత్తిపోకండి. యే పరిస్థితిలోనైనా సరే ఆయన అభీష్టాన్ని ఆనందంగా స్వీకరించండి. ఓ దాసునిగా, ఓ ప్రవక్తగా మీపై వేయబడిన బాధ్యతను పూర్తి దృఢచిత్తంతో నిర్వర్తించండి అని అర్థం.

సందేశ ప్రచారంలో విజ్ఞతకు గల ప్రాధాన్యత

قَالَ قَدْ اُجِيْبَتْ دَّعْوَتُكُمَا فَاسْتَقِيْمَا وَلَا تَتَّبِعٰٓنِّ سَبِيْلَ الَّذِيْنَ لَا يَعْلَمُوْنَ ۝ (يونس : ٨٩)

"సమాధానంగా అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: మీ ఉభయుల ప్రార్థన అంగీ కరించబడినది. దృఢచిత్తులై ఉండండి. జ్ఞానహీనుల మార్గాన్ని ఎంతమాత్రం అనుసరించకండి." (యూనుస్:89)

యదార్థాన్ని ఎరుగనివారు అల్లాహ్ దూరదృష్టిని అర్థం చేసుకోలేరు. వారు అసత్యం ముందు సత్యం బలహీనపడడం, సత్యధర్మం కోసం పాటుబడేవారి ఎడతెగని అపజయాలు, అసత్యవాదుల ప్రభ వెలిగిపోవడం, వారి భౌతిక జీవితం వైభవంగా వెలిగిపోవడాన్ని జూసి, బహుశా ఈ అసత్యవాదులకు వ్యతిరేకం దైవం సత్యవాదులను బలపర్చదలచ లేదేమోననే అపోహకు గురిఅయిపోతారు. చివరికి ఈ అపోహల కారణంగానే, సత్యధర్మం గురించిపడే శ్రమకు విలువలేదని, అసత్యం మరియు దైవతిరస్కారాల పాలనలో ధర్మంపై నడిచే అనుమతి తమకు ఎంతో కొంత లభిస్తోంది, అది సరిపోతుందని భావిస్తూ ఉంటారు. ఈ ఆయత్‌లో అల్లాహ్ హజ్రత్ మూసా (అ)ను, ఆయన అనుయాయులను ఈ తప్పిదం నుండి తమను తాము కాపాడు కొమ్మనే తాకీదు చేయడం జరిగింది. ఈ ఆయత్‌లో దైవం చెప్పదలచుకున్న విషయం ఏమిటంటే, సహనం వహించి, ఆ అననుకూల పరిస్థితుల్లోనూ మీ పని మీరు చేసుకుంటూపోండి. సాధారణంగా, అమాయకులు, అజ్ఞానులు ఏ అపోహలకైతే గురిఅవుతుంటారో ఆ అపోహలకు గురికాకండి అని చెప్పడం అన్నమాట.

సందేశ ప్రచారంలో నమాజు ప్రాముఖ్యత

وَاَقِمِ الصَّلٰوةَ طَرَفَيِ النَّهَارِ وَزُلَفًا مِّنَ الَّيْلِ ؕ اِنَّ الْحَسَنٰتِ يُذْهِبْنَ السَّيِّاٰتِ ؕ ذٰلِكَ ذِكْرٰى لِلذّٰكِرِيْنَ ۝ (هود: ١١٣)

'చూడు! నమాజును స్థాపించు, పగటి రెండు సరిహద్దుల సమయం లోనూ, కొంత రాత్రి గడిచిన తరువాతనూ. వాస్తవానికి సత్కార్యాలు దుష్కార్యాలను దూరం చేస్తాయి. అల్లాహ్‌ను జ్ఞాపకం ఉంచుకునేవారికి ఇది ఓ జ్ఞాపిక." (హూద్:113)

అంటే, యే దుష్కార్యాలైతే ప్రపంచంలో వ్యాపించి ఉన్నాయో, సత్యధర్మ సందేశ ప్రచారం చేసినందుకు మరే చెడు ప్రవర్తన అయితే మీ పట్ల ప్రదర్శించ బడుతోందో, ఆ సత్యధర్మం పట్ల ఏ వైరం అయితే ప్రదర్శించబడుతోందో వాటన్నిటినీ పారద్రోలేందుకు అవలంబించవలసిన విధానం స్వయంగా మీరు అధికంగా సత్కార్యా లను ఆచరించడం. ఆ సత్కార్యాల ద్వారానే ఆ దుష్కర్మలను రూపుమాప వచ్చు.

మిమ్మల్ని సత్పురుషులుగా మార్చేది నమాజు ఒక్కటే. మీరు ఆ దుర్మార్గులు లేవనెత్తే తుఫానును ఎదుర్కోవడమే కాకుండా దాన్ని లేకుండా చేసి ప్రపంచంలో సద్వ్యవస్థను స్థాపించనూ గలరు.

وَلَقَدْ نَعْلَمُ اَنَّكَ يَضِيْقُ صَدْرُكَ بِمَا يَقُوْلُوْنَ ٥ فَسَبِّحْ بِحَمْدِ رَبِّكَ وَكُنْ مِّنَ السّٰجِدِيْنَ ٥ وَاعْبُدْ رَبَّكَ حَتّٰى يَاْتِيَكَ الْيَقِيْنُ ٥ (الحجر : ٩٧ تا ٩٩)

"వారు నిన్ను గురించి కల్పిస్తున్న మాటల వల్ల నీ మనస్సుకు మిక్కిలి కష్టం కలుగుతోందని మాకు తెలుసు. (దానికి చికిత్స ఏమిటంటే) నీ ప్రభువు స్తోత్రం చేస్తూ ఆయన పవిత్ర నామాన్ని స్మరించు. ఆయన సన్నిధానంలో సాష్టాంగ పడు. తప్పకుండా వచ్చే చివరి ఘడియ వరకూ నీ ప్రభువు దాస్యం చేస్తూ ఉండు."

(అల్ హిజ్ర్: 97-99)

అంటే, సత్యసందేశాన్ని చేరవేయడం, సంస్కరణల వైపుకు పిలిచే ప్రయత్నాల్లో ఏ కష్టాలు కడగండ్లయితే నీకు ఎదురౌతున్నాయో, వాటిని ఎదిరించే శక్తి నీకు లభించాలంటే అది కేవలం నమాజు మరియు దైవదాస్యంపై నిలకడగా ఉన్నప్పుడే లభించగలదు. ఇదే నీకు సాంత్వనను, సహనాన్ని చేకూర్చి ధైర్యం కలిగించగలదు. లోకుల తిట్లు, అపవాదులు మరియు వారి ఆగడాలకు వ్యతిరేకంగా నీ కార్యంపై స్థిరంగా నిలబడి దాన్ని నిర్వర్తించడంలోనే దైవసంతుష్టిని పొందేటంత సామర్థ్యాన్ని చేకూర్చగలదు.

اَقِمِ الصَّلٰوةَ لِدُلُوْكِ الشَّمْسِ اِلٰى غَسَقِ الَّيْلِ وَقُرْاٰنَ الْفَجْرِ ؕ اِنَّ قُرْاٰنَ الْفَجْرِ كَانَ مَشْهُوْدًا ٥ وَمِنَ الَّيْلِ فَتَهَجَّدْ بِهٖ نَافِلَةً لَّكَ ۖ عَسٰى اَنْ يَّبْعَثَكَ رَبُّكَ مَقَامًا مَّحْمُوْدًا ٥ (بنی اسرائیل : ۷۸-۷۹)

"నమాజును స్థాపించు, పొద్దువాలినప్పటి నుండి రాత్రి చీకటి పడేవరకు. ప్రాతఃకాలంలో ఖుర్‌ఆన్ పారాయణం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించు. ఎందుకంటే, ప్రాతఃకాలపు ఖుర్‌ఆన్ పారాయణం సాక్ష్యంగా ఉంటుంది. రాత్రిపూట 'తహజ్జుద్' నమాజు చెయ్యి. ఇది నీకు అదనపు నమాజు. నీ ప్రభువు నిన్ను ప్రశంసనీయమైన ఉన్నత స్థానంలో ప్రతిష్ఠింపజేయడం అసంభవమేమీ కాదు."

(బనీ ఇస్రాయీల్: 78,79)

ఈ సూరా (అధ్యాయంలో) ఆ తుఫానును ప్రస్తావించిన వెంటనే, 'నమాజును స్థాపించు' అనే ఈ ఆదేశం ఇవ్వడానికి గల కారణం, ఆ పరిస్థితుల్లో ఓ మోమిన్

(విశ్వాసి)కు అవసరమైన స్థయిర్యం, నిలకడలు కేవలం నమాజు స్థాపన ద్వారానే సాధ్యం కాగలవు అని.

చివరి వాక్యంలో ప్రశంసనీయమైన ఉన్నతస్థానంలో ప్రతిష్ఠించడం అనే శుభవార్త ఏదైతే అందించడం జరిగిందో, అంటే ఏ నిలకడ అయితే నమాజు స్థాపించడం ద్వారా లభించగలదో, దాని ఫలితంగా నీకు ప్రశంసనీయమైన ఉన్నత స్థానం లభిస్తుంది అని. అలాగే ఇహపరలోకాల్లో నీకులభించబోయే హోదా ద్వారా మానవాళి నంతటికీ ప్రియమైనవాడవు కాగలవు, అన్నివైపుల నుండి నీపై ప్రశంసల వర్షం కురుస్తుంది. నీ వ్యక్తిత్వం ప్రశంసనీయమైన వ్యక్తిత్వంగా మారిపోగలదు. ప్రస్తుతం దేశం మొత్తానా నిన్ను అపనిందలకు అగౌరవానికి గురిచేయడం కోసం వీరు ఏ తప్పుడు ఆరోపణలైతే నీపై మోపుతున్నారో, దానికి బదులుగా ప్రపంచం మొత్తాన నీ ప్రశంసనా గీతాలతో మారుమ్రోగే ఆ సమయం ఎంతో దూరంగా లేదు. పరలోకంలోనూ సృష్టి మొత్తానికి ప్రశంసనీయుడవు కాగలవు. ప్రళయదినాన ప్రవక్త ముహమ్మద్ (స) వారు 'షఫాఅత్' స్థానంలో నిలబడడం కూడా ఈ ప్రశంసలోని ఓ భాగమే.

సత్యధర్మ ప్రచారంలో సామూహిక నమాజు ప్రాధాన్యత

وَاَوْحَيْنَا اِلٰى مُوسٰى وَاَخِيْهِ اَنْ تَبَوَّاٰ لِقَوْمِكُمَا
بِمِصْرَ بُيُوْتًا وَّاجْعَلُوْا بُيُوْتَكُمْ قِبْلَةً وَّاَقِيْمُوا الصَّلٰوةَ
وَبَشِّرِ الْمُؤْمِنِيْنَ ○ (يونس : ٨٧)

"మేము మూసాకూ, అతని సోదరునికీ ఇలా సూచించాము. "ఈజిప్టులో మీ జాతివారి కొరకు కొన్ని గృహాలను సమకూర్చండి. ఆ గృహాలను ఖిబ్లాగా నిర్ణయించు కొనండి. నమాజును స్థాపించండి. విశ్వాసులకు శుభవార్తను అందజేయండి."
(యూనుస్:87)

ఈ ఆయతను, ఈ వాక్యాలు చెప్పబడిన ఆ వాతావరణాన్ని గనక తరచిచూస్తే, బహుశా ఈజిప్టులో, ప్రభుత్వం అవలంబించిన హింస కారణంగానైతేనేమి, మరియు స్వయంగా బనీ ఇస్రాయీలుల విశ్వాస బలహీనత కారణంగానైతేనేమి ఇస్రాయేలు ప్రజలు మరియు ముస్లిములలో సామూహిక నమాజు వ్యవస్థ పూర్తిగా అంతమైపోయిందని వారు ఛిన్నాభిన్నమై వారి ఆధ్యాత్మికత అడుగంటిపోవడానికి ఓ గొప్ప కారణమనే విషయం అర్థం అవుతుంది. అందుకని ఆ వ్యవస్తను తిరిగి స్థాపించాలని, ఈజిప్టులో కొన్ని గృహాలనైనా ఈ కార్యం కోసం నిర్మించుకోవడమో, లేదా ఎన్నుకోవడమో చేసి అక్కడ సామూహిక నమాజును పునరుద్ధరించమని హజ్రత్ మూసా (అ)ను ఆదేశించడం జరిగింది. ఎందుకంటే ఓ చెడిపోయిన, దారీదిక్కూలేని ముస్లిం జాతిలో ఆధ్యాత్మికతను తిరిగి చిగురింపజేయడానికి, ఛిన్నాభిన్నమైవున్న శక్తిని తిరిగి

సమీకరించడానికి ఇస్లామీయ పద్ధతిలో ఏ ప్రయత్నం అయితే జరుగగలదో దానికి వేసే ప్రథమ అడుగు ఆ జాతిలో సామూహిక నమాజు వ్యవస్థను నెలకొల్పడం. ఆ గృహాలను ఖిబ్లాగా చేయడం అంటే, వాటిని జాతి మొత్తానికి కేంద్రాలుగా మలచడం. ఆ తరువాతనే 'నమాజును స్థాపించండి' అని చెప్పడంలోని పరమార్థం ఏమిటంటే, వేరువేరుగా మీ నమాజులను ఆచరించే బదులు ప్రజలంతా కలిసి ఆ నిర్ణీత ప్రదేశాలలో సమావేశమై కలసి నమాజు చేయాలన్నది. ఎందుకంటే, ఖుర్‌ఆన్ పరిభాషలో 'ఇకామతిస్సలాత్' అనే పదంలోనే సామూహిక నమాజు చేయాలనే భావం ఉంది కాబట్టి.

విశ్వాసులకు (ముస్లిములకు) శుభవార్త అందజేయడం అంటే విశ్వాసుల్లో యే నిరాశా నిస్పృహలు, భయభీతులు అలుముకొని ఉన్నాయో వాటిని పారద్రోలండి అని. వారిని ఆశావాదులుగా చేసి ధైర్యం చెప్పండి అనే అర్థం శుభవార్త అందించండి అనే పదంలోనే దాగి ఉంది.

నమాజు విశ్వాసుల్లో సహనాన్ని, సంయమనాన్ని, ఉన్నంతలోనే తృప్తి పడడం, దైవనిర్ణయానికి కట్టుబడడం లాంటి సుగుణాలను పుట్టిస్తుంది. ఇది సందేశ ప్రచార విషయంలో ఎంతైనా అవసరం.

وَأْمُرْ أَهْلَكَ بِالصَّلٰوةِ وَاصْطَبِرْ عَلَيْهَا (طٰهٰ : ١٣٢)

"మీ కుటుంబ సభ్యులకు నమాజు చేయమని బోధించండి. మీరు కూడా దానికి కట్టుబడి ఉండండి." (తాహా:132)

అంటే దారిద్ర్యంలో మ్రగ్గుతూ దీనావస్థలో ఉన్న మీ భార్యాపిల్లలు ఆ అక్రమ సంపాదనాపరుల భోగభాగ్యాలను, ఐశ్వర్యాలను చూసి క్రుంగిపోకుండా ఉండాలి. వారికి నమాజు చేయమని బోధించు. ఇది వారి దృష్టికోణాన్ని మార్చివేసి వారి నైతిక విలువలను పెంపొందించగలదు. వారి ఆలోచనలను మార్చివేసి పరిశుద్ధమైన ఉపాధిపైన్నే సంతృప్తి పడేటట్లు చేస్తుంది నమాజు. విశ్వాసం, దైవభీతి నుండి లభించే భుక్తి శ్రేష్ఠమైనది. పాపభూయిష్టమైన మార్గాల నుండి సంపాదించే భుక్తి, భౌతికవాదం హేయమైనవి.

ఇస్లామ్ ధర్మం సత్యంతో ముడిపడింది

فَخَلَفَ مِنْ بَعْدِهِمْ خَلْفٌ اَضَاعُوا الصَّلٰوةَ وَاتَّبَعُوا
الشَّهَوٰتِ فَسَوْفَ يَلْقَوْنَ غَيًّا (مريم : ٥٩)

"వారి తరువాత కొందరు అయోగ్యులు వారి స్థానంలో వచ్చారు. వారు నమాజును త్యజించారు. మనోవాంఛలను అనుసరించారు. కనుక వారు త్వరలోనే మార్గం తప్పినదానికి ఫలితం అనుభవిస్తారు." (మర్యమ్:59)

'త్యజించారు' అంటే నమాజు చేయడం మానేశారు, లేదా నమాజు పట్ల అశ్రద్ధ వహించనారంభించారని అర్థం. ప్రతి సమాజపు పతనానికి మొదటి మెట్టు ఇది. నమాజు మాత్రమే ఓ విశ్వాసిని దైవంతో రేయింబవళ్ళు కలిపి ఉంచే సంబంధం. అతనిని దైవధేయతా పరిధి నుండి దాటి వెళ్ళనీయదు. ఈ సంబంధం తెగిపోగానే మనిషి దైవానికి దూరమౌతూపోతాడు. చివరికి ఆ కార్యాచరణ సంబంధాన్ని దాటి మనిషి దైవంతో తన భావపరమైన సంబంధాన్ని కూడా పొగొట్టుకోగలడు. కాబట్టి ఇక్కడ చెప్పబడిన సూత్రం ఏమిటంటే గతించిన ప్రవక్తల సమాజాలు చెడిపోవడానికి కారణం ప్రారంభం అయింది నమాజును త్యజించడం వల్లనే.

'మనోవాంఛలను అనుసరించారు' అన్నది దైవంతో తమకు గల సంబంధ బాంధవ్యాల లోటును సూచించే వాక్యం. దైవధ్యానం అన్నది హృదయం నుండి బయటకు వెళ్ళిపోయే కొలది అశ్రద్ధ, మనోవాంఛలకు దాసోహం అయ్యే ప్రవృత్తి పెరిగిపోతుంది. చివరకు వారి నైతికతలు, వ్యవహారాలకు సంబంధించిన ప్రతి అంశం దైవాదేశాలకు బదులు తమ ఇష్టారాజ్యంగా నడుచుకునే ప్రయత్నం జరుగుతుంది.

وَمَنْ أَحْسَنُ قَوْلًا مِّمَّنْ دَعَآ إِلَى اللّٰهِ وَعَمِلَ
صَالِحًا وَّقَالَ إِنَّنِيْ مِنَ الْمُسْلِمِيْنَ ۝ (حٰمٓ السجدہ: ٣٣)

అల్లాహ్ వైపునకు పిలిచి, మంచిపనులు చేసి, "నేను ముస్లిమ్‌ను అని ప్రకటించే వ్యక్తి మాటకంటే మంచిమాట మరెవరిది కాగలదు?"

(హామీమ్ అస్సజ్దహ్:33)

విశ్వాసులకు ధైర్యం చెప్పి, సాంత్వన చేకూర్చిన తరువాతనే వారికి అసలు కార్యం వైపునకు ఆహ్వానించడం జరుగుతోంది. అంతకు ముందు చెప్పబడిన ఆయత్‌లు వారికి, అల్లాహ్ దాస్యంపై నిలకడగా ఉండడం, ఆ మార్గాన్ని అనుస రించిన తరువాత దాన్ని ఏ మాత్రం విడువకుండా ఉండడం ఓ గొప్ప మౌలికమైన సత్కార్యమని, అది మానవుణ్ణి దైవదూతల మిత్రునిగా, స్వర్గానికి అర్హునిగా జేస్తుందని చెప్పడం జరిగింది. ఇప్పుడూ ఈ ఆయత్‌లో వారికి బోధించే విషయం ఏమిటంటే, మీరు స్వయంగా సత్కార్యాలు చేస్తూ ఇతరులను అల్లాహ్ దాస్యం వైపుకు పిలువండి. ఇస్లామ్ ధర్మపు ప్రకటన చేయడం వలన మీపైకి కడగండ్ల పరంపర వచ్చి పడడం సహజం. 'నిర్భయంగా నేను ముస్లిమ్‌ను అని చెప్పండి" అని చెప్పే దైవవచనం ప్రాధాన్యతను అర్థం చేసుకోవాలంటే ఈ వాక్యం చెప్పబడిన ఆనాటి వాతా వరణాన్ని దృష్టిలో ఉంచుకోవడం అవసరం. ఆనాడు పరిస్థితి ఎలాంటిదంటే, ఏ వ్యక్తి అయినా తాను ముస్లిమ్ అని ప్రకటించగానే, అతను ఓ క్రూరమృగాల కారడవిలో కాలిడినట్లు, అన్ని వైపుల నుండి తోడేళ్ళ గుంపు అతణ్ణి చీల్చిచెండాడడానికి లంఘిస్తు న్నాయా అన్నట్లు భయవిహ్వాలుడయ్యేవాడు. ఇంకా ఒక అడుగు ముందుకువేసి అతను

ఇస్లామ్ ధర్మ ప్రచారం కోసం నోరు విప్పాడంటే, ఇంకేముంది! ఆ తోడేళ్ళ మూకను, "రండి, నన్ను చీల్చిచెండాడండి" అని ఆహ్వానించడం లాంటిదే ఆ పరిస్థితి. ఇలాంటి పరిస్థితుల్లోనే, ఏ వ్యక్తి అయినా అల్లాహ్‌ను తన ప్రభువుగా స్వీకరించి సన్మార్గాన్ని అవలంబించడం, ఆ మార్గం నుండి రవ్వంతైనా కదలకుండా ఉండడం ఓ గొప్ప సత్కార్యంగా చెప్పడం జరిగింది. అయితే అత్యుత్తమమైన సత్కార్యం మాత్రం ఆ పరిస్థితుల్లో మనిషి లేచి నిలబడి, 'నేను ముస్లిమ్‌ను' అని ప్రకటించడం రాబోయే పరిణామాలను లెక్కజేయకుండా ఆ దైవ దాస్యం వైపునకు ప్రజలను పిలవడం, ఆ కార్యాన్ని నిర్వర్తిస్తూ, ఇస్లామ్‌పైగాని, ఇస్లామీయ సందేశ ప్రచారకులపై గాని ఎలాంటి మచ్చ రాకుండా పవిత్రతను పాటించడం.

ధర్మసందేశ ప్రచార మార్గంలో తలొగ్గే, రాజీపడే ప్రసక్తే లేదు

فَلَا تُطِعِ الْمُكَذِّبِينَ ۝ وَدُّوا لَوْ تُدْهِنُ فَيُدْهِنُونَ ۝ (القلم: ٨-٩)

"కనుక నీవు ఈ సత్యతిరస్కారుల ఒత్తిడికి ఏ మాత్రం తలబగ్గకు. నీవు గనక రాజీపడితే, వారు కూడా రాజీపడదామని అనుకుంటున్నారు." (అల్‌ఖలమ్: 8,9)

అంటే మీరు ఇస్లామ్ సందేశ ప్రచారంలో ఏ మాత్రం బలహీనత చూయించినా, వీరు కూడా మీ వ్యతిరేకతలో కొంత రాజీకి దిగి వస్తామంటారు. లేదా మీరు వారి అపమార్గాలను ఒప్పుకుని మీ ధర్మంలో కొంత మార్పులు చేర్పులు చేసుకోడానికి సిద్ధపడితే వారు మీతో రాజీపడతామంటారు అని అర్థం.

قُلْ يَا أَيُّهَا الْكَافِرُونَ ۝ لَا أَعْبُدُ مَا تَعْبُدُونَ ۝ وَلَا أَنتُمْ عَابِدُونَ مَا أَعْبُدُ ۝ وَلَا أَنَا عَابِدٌ مَّا عَبَدتُّمْ ۝ وَلَا أَنتُمْ عَابِدُونَ مَا أَعْبُدُ ۝ لَكُمْ دِينُكُمْ وَلِيَ دِينِ ۝ (الكافرون: ١-٦)

"ఇలా ప్రకటించు, ఓ అవిశ్వాసులారా! మీరు ఆరాధించేవాటిని నేను ఆరాధించను. అలాగే నేను ఆరాధించే ఆయన్ని మీరు ఆరాధించరు. మీరు ఆరాధిస్తున్న వాటిని నేను ఆరాధించేవాణ్ణి కాను. అలాగే నేను ఆరాధించే ఆయన్ని మీరు ఆరాధించేవారు కారు. మీ ధర్మం మీదే. నా ధర్మం నాదే." (అల్ కాఫిరూన్: 1-6)

దృఢసంకల్పంతో సత్యాన్నే పాటించడం

చారిత్రక నేపథ్యం: దైవప్రవక్త (స)గారి సందేశ ప్రచారానికి వ్యతిరేకంగా బహుదైవారాధక సమాజంలో అప్పటికే ఓ తుఫాను ఎగిసి ఆ సమాజాన్ని అతలాకుతలం చేసింది. అయితే ఖురైష్ సర్దారులు మాత్రం, దైవప్రవక్త (స)ను ఏదో విధంగా రాజీకి

తెస్తామనే ధీమాను మాత్రం వదలలేదు. అందుకని అప్పుడప్పుడు ఆయన వద్దకు రాజీ ప్రతిపాదనలతో వస్తూఉండేవారు. ఈ ప్రతిపాదనలను ఆయన ఒప్పుకుంటే అసలు సమస్యే తీరిపోతుందన్నది వారి ఆశ. ఈ విషయానికి సంబంధించిన అనేక ఉల్లేఖనాలు హదీసు గ్రంథాల్లో పొందుపర్చబడి ఉన్నాయి.

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (ర)గారి ఓ ఉల్లేఖనం ఇలా ఉంది: ఖురైషీయులు దైవప్రవక్త ముహమ్మద్ (స)తో, "మేము మీకు మక్కాలోనే అతి ధనవంతుడు అయ్యేటట్లు ధనాన్ని ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాము. మీరు ఏ స్త్రీని కోరుకుంటే ఆమెతో మీ వివాహం చేయిస్తాము. మేము మీ వెనకాలే నడవడానికి సిద్ధంగా ఉన్నాము. కేవలం మీరు మా ఒక్క మాటను మాత్రం ఒప్పుకోవాలి. అది మా ఆరాధ్యులను తూలనాడకుండా ఉండడం. ఇదే గనక మీకు సమ్మతం కాకపోతే మరో ప్రతిపాదనను మీ ముందుంచుతాం. అందులో మీ శ్రేయమూ ఉంది మా శ్రేయమూ ఉంది."

"ఆ ప్రతిపాదన ఏమిటి?" అని మహాప్రవక్త (స) వారిని అడగగా వారు ఇలా బదులిచ్చారు.

"ఒక సంవత్సరం మీరు మా ఆరాధ్య దైవాలైన 'లాత్', 'ఉజ్జా'లను పూజించాలి. మరో సంవత్సరం మేము మీ ఆరాధ్యుణ్ణి కొలుస్తాము."

దానికి సమాధానంగా 'నా దైవం తరఫున ఏ ఆదేశం వస్తుందో చూస్తాను, ఆగండి' అన్నారు దైవప్రవక్త (స). అప్పుడు ఈ వాణి అవతరించింది.

قُلْ اَفَغَيْرَ اللّٰهِ تَاْمُرُوْٓنِّيْٓ اَعْبُدُ اَيُّهَا الْجٰهِلُوْنَ ۝ (الزمر: ٦٤)

"(ఓ ప్రవక్తా!) వారితో ఇలా అను. 'అయితే ఓ మూర్ఖుల్లారా! అల్లాహ్‌ను కాదని మరొకరికి దాస్యం చేయమని మీరు నాకు చెబుతున్నారా? (ఈ విషయాన్ని నీవు వారికి స్పష్టంగా చెప్పు)" (అజ్జుమర్ : 64)

ఇబ్నుజరీర్; ఇబ్ను అబీహాతిమ్‌లో ఇబ్నె అబ్బాస్ (ర)గారి మరో ఉల్లేఖనం ఉంది:

"ఖురైషీయులు దైవప్రవక్త (స)తో, ఓ ముహమ్మద్! ఒకవేళ నీవు మా ఆరాధ్యులైన విగ్రహాలను ముద్దాడితే చాలు మేము నీ ఆరాధ్యుణ్ణి కొలుస్తాము" అన్నప్పుడు ఈ సూరహ్ అవతరించింది. (అబ్దబిన్ హమీద్)

అబుల్ బక్తరీ చేత స్వాతంత్ర్యం పొందిన బానిస సఈద్ (ర) బిన్ మీనా ఉల్లేఖనం ఇలా ఉంది:

"వలీద్ బిన్ ముగైరా, ఆస్‌బిన్ వాయిల్, అస్వద్ బిన్ ముత్తలిబ్, ఉమయ్యా బిన్ ఖల్ఫ్'లు కలిసి దైవప్రవక్త (స)ను వెళ్ళికలిశారు. వారు ఆయనతో మాట్లాడిన విధం ఇలావుంది.

"ఓ ముహమ్మద్! నీవు మా ఆరాధ్యులను పూజించే షరతుపై మేము నీ ఆరాధ్యుణ్ణి పూజిస్తాము. (అలా జరిగితే) మేము మా కార్యాలన్నిటిలో నిన్ను పాలుపంచుకునేటట్లు చేస్తాము. ఒకవేళ నీవు తెచ్చింది (బోధన) మా దగ్గర ఉన్నదాని కంటే మేలైంది అయితే మేము దాన్నుండి భాగం పొందుతాము. అలాకాక మా దగ్గర ఉన్నదే నీవు తెచ్చిన దానికంటే మేలైనది అయివుంటే నీవు అందుండి నీ భాగాన్ని పొందగలవు." అప్పుడు ఈ దైవవాణి 'ఖుల్ యా అయ్యుహల్ కాఫిరూన్' అవతరించింది.

ఇబ్నుజరీర్, ఇబ్ను అబీహాతిమ్, ఇబ్నె హిష్షామ్‌లు కూడా ఈ సంఘటనను పొందుపర్చడం జరిగింది.

వహబ్ ఇబ్నె మంబా ఉల్లేఖనం ప్రకారం-

"ఖురైషీయులు దైవప్రవక్త (స)తో, మీరు ఔనంటే, ఓ సంవత్సరం వరకు మేము మీ ధర్మంలో చేరిపోతాము. మీరు కూడా ఓ సంవత్సరం వరకు మా ధర్మాన్ని స్వీకరించాలి" అని చెప్పడం జరిగింది. (అబ్ద్‌బిన్ హమీద్, ఇబ్ను అబీహాతిమ్)

ఈ ఉల్లేఖనాలను దృష్టిలో పరిశీలిస్తే, ఖురైష్ బహుదైవారాధకులు దైవప్రవక్త (స) ముందు ఒకే తడవ కాకుండా వివిధ సమయాల్లో ఇల్లాంటి ప్రతిపాదనలు పెట్టారని, ఆ ప్రతిపాదనల ద్వారాలు శాశ్వతంగా మూయడానికి వారికి తిరుగులేని సమాధానం ఇచ్చి వాళ్ళ నోళ్ళను నొక్కవలసిన అవసరం ఏర్పడిందని అర్థం అవుతుంది. ధర్మం విషయంలో దైవప్రవక్త (స), ఇచ్చిపుచ్చుకునే విధానాన్ని స్వీకరించి వారితో రాజీపడతారేమో అనే ఆశ లేకుండా చేయడం జరిగింది.

ఈ నేపథ్యాన్ని దృష్టిలో ఉంచుకొని చూస్తే ఈ సూరా (అధ్యాయం), దైవతిరస్కారుల మార్గాన్ని, వారి పూజా విధానాన్ని, వారి దేవతల పట్ల విముఖతను ప్రకటించడానికి, అదేకాకుండా, ఇస్లామ్ ధర్మం, దైవతిరస్కార మార్గం పరస్పరం పూర్తి వ్యతిరేకమైన మార్గాలని పైగా, ఆ రెండూ పరస్పరం కలిసిపోయేందుకు ఎలాంటి ఆస్కారమే లేదని చెప్పడానికే అవతరించిందేమో అని అనిపిస్తోంది. ఈ మాటలు, ప్రారంభదశలో ఖురైష్ దైవతిరస్కారులను సంబోధించి, వారి ప్రతిపాదనలకు జవాబుగా చెప్పబడి నప్పటికీ, ఈ విషయం వారిమట్టుకే పరిమితంగాలేదు. పైగా వాటిని ఖుర్‌ఆన్ గ్రంథంలో పొందుపరచి, దైవతిరస్కార మార్గం ఎక్కడ, ఏ రూపంలోఉన్నా ముస్లిములు అంతిమదినం వరకు తమ మాటలు, తమ ఆచరణల ద్వారా దాన్ని ఖండించవలసి ఉందని, ఎలాంటి మొహమాటం లేకుండా 'ధర్మం విషయంలో

దైవతిరస్కారులతో ఎలాంటి రాజీపడే ప్రసక్తే ఉత్పన్నం కాజాలదని చెప్పడం జరిగింది. కాబట్టే ఈ సూరా అప్పుడు ఆ కాలం వారికి సమాధానంగా అవతరింపబడి వారు మరణించి మట్టిపాలై పోయినప్పటికీ పఠించబడింది. ఆ కాలంలో దైవతిరస్కారులుగా ఉంటూ తదుపరి ముస్లిములైన వారు కూడా దాన్ని పఠించారు. వారు గతించిన శతాబ్దాల తరువాత కూడా నేటి ముస్లిములు దాన్ని పఠిస్తూనే ఉన్నారు. ఎందుకంటే దైవతిరస్కారంతో ఎలాంటి సంబంధాలు లేకుండా ఉండడమే అసలు విశ్వాస ధ్యేయం.

"మీ ధర్మం మీదే, నా ధర్మం నాదే" అంటే నా ధర్మం వేరు, మీ ధర్మం వేరు; మీరు ఆరాధించే వాటిని నేను ఆరాధించను, అలాగే నేను ఆరాధించే ఆయన్ను మీరూ ఆరాధించరు; నేను మీ ఆరాధ్యులను పూజించే వాణ్ణికాను, మీరు కూడా నా ఆరాధ్యుణ్ణి పూజించడానికి సిద్ధంగా లేరు కాబట్టి మీ మార్గం నా మార్గం ఎప్పుడూ ఒక్కటి కాజాలదు." ఇది దైవతిరస్కారులతో రాజీపడే ధోరణి కాకుండా, వారు దైవతిరస్కారులుగా ఉన్నంతమట్టుకు వారి నుండి తెగతెంపులు చేసుకునే ప్రకటన. దీని ద్వారా వారికి చెప్పొచ్చిందేమిటంటే దైవం, దైవప్రవక్త (స)ను విశ్వసించిన జనం ఎప్పుడైనా మీతో రాజీపడతారేమో అనే అపోహకు గురికాకుండా ఉండండి అని వారిని నిరాశపర్చడం అన్నమాట.

ఈ తెగతెంపుల ప్రకటన ఈ సూరా అవతరించిన తరువాత అవతరించబడిన మక్కీసూరాలో ఒకదాని తరువాత మరొకటిగా చేయడం జరిగింది.

యూనుస్ అధ్యాయంలో:

"వారు గనక నిన్ను తిరస్కరిస్తే వారితో ఇలా అను: 'నా పనులు నావే, మీ పనులు మీవే. నేను చేసే పని బాధ్యత మీపై లేదు. మీరు చేసే పని బాధ్యత నాపై లేదు." (యూనుస్:41)

ఇదే సూరాలో మరో చోట ఇలా సెలవియ్యడం జరిగింది:

"ప్రవక్తా! ఇలా అను, 'మానవులారా! మీరు గనక ఇంకా నా ధర్మం గురించి ఏదైనా సంశయం కలిగి ఉంటే వినండి, మీరు అల్లాహ్‌ను కాదని ఆరాధించే వారిని ఆరాధించను. ఏ దేవుని ఆధీనంలో మీ మరణం ఉన్నదో ఆ దేవుడినే నేను ఆరాధిస్తాను." (యూనుస్:104)

'సబా' అధ్యాయంలో ఇలా ఉంది:

"ఇంకా వారితో ఇలా అను, 'మేము చేసిన తప్పులను గురించి మిమ్మల్ని ఏ మాత్రం ప్రశ్నించడం జరగదు. మీరు చేస్తూ ఉన్న దానిని గురించి మమ్మల్ని అడగడం జరగదు. ఇలా అను, 'మన ప్రభువు మనల్ని సమావేశపరుస్తాడు. తరువాత మన మధ్య సరైన తీర్పు చేస్తాడు." (సబా:25,26)

అలాగే జుమర్ అధ్యాయంలో:

"నా జాతి ప్రజలారా! మీరు మీ ఇష్టం ప్రకారం మీ పనులు చేస్తూ ఉండండి. నా పనేదో నేను చేస్తూ ఉంటాను. త్వరలోనే మీకు తెలిసిపోతుంది. ఎవరి మీదకు అవమానకరమైన శిక్ష వచ్చి పడుతుందో, ఇంకా ఎవరికీ ఎన్నడూ తొలగిపోని శిక్ష లభిస్తుందో." (జుమర్: 39,40)

ఇదే గుణపాఠాన్ని అల్ ముమ్తహినా సూరాలో ముస్లిములను బోధిస్తూ చెప్పడం జరిగింది:

"ఇబ్రాహీంలో, ఆయన సహచరులలో మీకై ఒక మంచి ఆదర్శం ఉంది. వారు తమ జాతివారితో స్పష్టంగా ఇలా అన్నారు, 'మీపట్ల, దేవుణ్ణి వదిలి మీరు పూజించే ఇతర దైవాల పట్ల మేము పూర్తిగా విసిగిపోయాము. మేము మిమ్మల్ని తిరస్కరించాము. మీరు ఏకైక ప్రభువు అయిన అల్లాహ్‌ను విశ్వసించనంతవరకు మాకూ మీకు మధ్య విరోధ విద్వేషాలు ఉండిపోతాయి." (అల్ ముమ్తహినా:4)

దివ్యఖుర్‌ఆన్‌లో మాటిమాటికి వచ్చిన పై వివరణల ద్వారా, 'లకుమ్ దీనుకుమ్' (మీ ధర్మం మీది, నా ధర్మం నాది) అనే మాటకు, మీరు మీ ధర్మంపైన్నే నిలకడగా ఉండండి, నన్ను నా ధర్మం పైన్నే నడవనియ్యండి అనే అర్థానికి అసలే తావులేదు అని అర్థం చేసుకోగలం. పైగా ఇది జుమర్ సూరా, 14వ వాక్యంలో చెప్పబడిన విషయం లాంటిది. ఆ వాక్యంలో ఇలా సెలవియ్యబడింది.

"(ఓ ప్రవక్తా!) ఇలా కూడా చెప్పు; 'నేను మాత్రం నా ధర్మాన్ని అల్లాహ్‌కే ప్రత్యేకించి, ఆయనకు మాత్రమే దాస్యం చేస్తాను. మీరు ఆయన దాస్యం తప్ప, ఎవరెవరి దాస్యం చేయదలుచుకున్నారో, చేస్తూ ఉండండి." (జుమర్:14)

అవిశ్వాసంతో తనకు ఎలాంటి సంబంధం లేదు అనే విశ్వాసి ప్రకటన

కాఫిరూన్ సూరాకు సంబంధించి, పై శీర్షికలో వివరించబడిన వివరాల్లో ఈ విషయాన్ని మనం గమనించగలం. వాటిలో, వ్యతిరేక శక్తులు ఎంత బలం కలిగి ఉన్నప్పటికీ అల్లాహ్ ఔన్నత్యాన్నే చాటాలి, వారిని రవ్వంతైనా లెక్కచేయవద్దు అన్న విషయాన్ని గట్టిగా చెప్పడం జరిగింది.

يٰٓاَيُّهَا الْمُدَّثِّرُ ۝ قُمْ فَاَنْذِرْ ۝ وَرَبَّكَ فَكَبِّرْ ۝

(المدثر : ۱ تا ۳)

"వస్త్రం కప్పుకొని పడుకున్న మనిషీ! లే; లేచి హెచ్చరించు, నీ ప్రభువు ఘనతను చాటిచెప్పు." (అల్ ముద్దస్సిర్: 1-3)

ఇది ఓ ప్రవక్త చేసే ప్రప్రథమమైన కార్యం. దాన్ని ఆయన నెరవేర్చవలసిన బాధ్యతను కలిగి ఉంటాడు. అతని మొట్టమొదటి పనే అజ్ఞానాంధకారంలో కొట్టు

మిట్టాడే అజ్ఞానులైన ప్రజలను, వారు ఎవరెవరి ఘనతనైతే కొనియాడుతున్నారో, ఆ ఘనతలన్నిటిని నిరాకరించేటట్లు చేయడం. ఈ విశ్వంలో ఔన్నత్యం కేవలం ఒకే ఒక దేవుని ఇస్లామ్‌లో 'అల్లాహు అక్బర్' అనే వాక్యానికి అన్నిటికంటే అధికమైన ప్రాధాన్యత ఇవ్వడం జరిగింది. అజాన్ ప్రారంభం అయ్యేది అల్లాహు అక్బర్ ప్రకటనతోనే. నమాజులు కూడా ముస్లింలు అల్లాహు అక్బర్ అంటూనే ప్రారంభిస్తారు. మాటిమాటికి అల్లాహు అక్బర్ అంటూనే నమాజులోని అన్ని అంశాలను నెరవేరుస్తూ ఉంటారు. జంతువును జిబహ్ చేసేటప్పుడు కూడా బిస్మిల్లాహి అల్లాహు అక్బర్ అని పలికే జిబహ్ చేస్తారు. 'నారయే తక్బీర్' (తక్బీరు నినాదం) నేడు ప్రపంచంలో ముస్లిము లందరి ప్రస్ఫుటమైన గుర్తింపు చిహ్నం. ఎందుకంటే ఈ సమాజపు ప్రవక్త తన కార్యాన్ని అల్లాహు అక్బర్ అంటూనే ప్రారంభించారు గనుక.

ఈ వాక్యాల అవతరణ ద్వారా అర్థం చేసుకోవలసిన మరో సున్నిత అంశాన్ని కూడా మనం దృష్టిలో ఉంచుకోవాలి. దైవప్రవక్త (స)కు ప్రవక్త పదవీ బాధ్యతలను నిర్వర్తించే ఏ మహోన్నత కార్యాన్నైతే అప్పజెప్పి లేచి హెచ్చరించాలని ఆదేశించడం జరిగిందో; అలాగే ఆ సమాజంలో ఈ కార్యాన్ని నిర్వర్తించమని ఆజ్ఞాపించడం జరిగిందో, అప్పుడు ఆ సమాజ పరిస్థితి ఎలాంటిది? అన్నది. ఆ నగరం మొత్తమే బహుదైవారాధనకు కేంద్రం. అంతవరకైతే ఫర్వాలేదు. పైగా అక్కడి ప్రజలు సాధారణ అరబ్బుల్లా ముష్రిక్‌లే కాదు, అంతకుమించి మక్కానగరం అరబ్బు బహుదైవారాధకు లకు గొప్ప తీర్థస్థలంగా కూడా భాసిల్లుతోంది. ఖురైషీలు దానికి పురోహితులుగా కూడా చెలామణి అవుతున్నారు. అలాంటి ప్రదేశంలో ఎవరైనా ఒంటరిగా లేచి హెచ్చరిస్తూ, బహుదైవారాధనకు దీటుగా ఏకేశ్వరవాద పతాకాన్ని ఎగురవేయడం అంటే ప్రాణాలను ప్రమాదంలో పడవేయడం లాంటిదే. అందుకనే 'లే! లేచి హెచ్చరించు" అని చెప్పిన వెంటనే, 'నీ ప్రభువు ఘనతను చాటి చెప్పు' అని అనడంలో గల ఔచిత్యం ఏమిటంటే, ఏయే భయంకరమైన శక్తులు నీకు ఈ కార్యనిర్వహణలో అడ్డుగా నిలుస్తున్నాయో వాటికి రవ్వంతైనా ప్రాధాన్యమివ్వకు, 'నా ప్రభువు, నా ఈ సందేశప్రచార మార్గాన్ని అడ్డుకునే ఆ శక్తులన్నిటికంటే గొప్పవాడు' అని నిక్కచ్చిగా చెప్పమనే భావం స్ఫురిస్తోంది. అల్లాహ్ కార్యాన్ని ప్రారంభించే ప్రతి వ్యక్తికి ఇది ఎంతో ప్రోత్సాహాన్నిస్తుంది. అల్లాహ్ ఔన్నత్యపు ఈ ముద్ర ఏ వ్యక్తి మనోఫలకంపై గట్టిగా పడుతుందో ఆ వ్యక్తి ఒంటరిగానే మొత్తం ప్రపంచంతో తలపడడానికి రవ్వంతైనా వెనుకాడడు.

సత్యధర్మ ధ్వజవాహకులకు దైవమార్గంలో చేయవలసిందల్లా, దైవదాస్యం కోసం, తమ మాతృభూమి పట్ల గల ప్రేమనుగాని, జాత్యాభిమానాన్నిగాని ఏ మాత్రం లెక్కచేయకుండా ఉండడం.

يٰعِبَادِيَ الَّذِينَ آمَنُوا إِنَّ أَرْضِي وَاسِعَةٌ فَإِيَّايَ فَاعْبُدُونِ ○

"విశ్వసించిన ఓ దాసుల్లారా! నా భూమి చాలా విశాలమైనది. కాబట్టి మీరు నా దాస్యాన్నే చేయండి."

ఈ ఆదేశం హిజ్రత్ కోసం ఇచ్చిన ఆదేశం. అర్థం ఏమిటంటే, మక్కా నగరంలో దైవదాస్యం చేయడం మీకు కష్టతరం అవుతుంటే, దాన్ని వదిలేసి బయటకు వెళ్ళిపొండి. దైవం భూమి ఇరుకైంది కాదు. దేవుని దాసులుగా ఉండి ఆయన దాస్యం చేసే చోటుకు వెళ్ళిపొండి. మీ మాతృభూమికి, మీ జాతికి దాస్యం చేయడం కాదు, మీ దేవుని దాస్యం చేయవలసి ఉంది మీకు. ఎప్పుడైనా మీ దేశం, మీ జాతి, మీ మాతృభూమి ప్రేమలు, అల్లాహ్ దాస్యానికి అడ్డొస్తే, అదే విశ్వాసి పరీక్షా సమయం అనుకోవాలి. ఎవరైతే నిజమైన విశ్వాసో అతను అల్లాహ్ దాస్యమే చేస్తాడు. మిగతా ప్రేమలు, అభిమానాలన్నిటిని వదిలేస్తాడు. కాని ఎవరైతే విశ్వసించానని కపట నాటకమాడుతున్నాడో అతను విశ్వాసాన్ని వదిలేస్తాడు. అతను తన జాతిని, తన మాతృభూమిని మరియు తన జాత్యాభిమానాన్నే అంటిపెట్టుకొని ఉంటాడు. ఈ వాక్యం (ఆయత్), ఓ నిజమైన విశ్వాసి దైవదాసుడుగా, తన జాతి మరియు తన దేశ ప్రేమికుడుగా మాత్రమే ఉండగలడు గాని, జాతీయవాదిగాగాని, స్వదేశాన్నే పూజించేవాడుగాగాని ఉండలేడన్న విషయాన్ని విడమర్చి చెబుతోంది. అతనికి దైవదాస్యమే ప్రతి విషయంకంటే ప్రియమైనది. దానికోసం ప్రపంచంలో ప్రతి వస్తువును త్యాగం చేయడానికి సిద్ధంగా ఉంటాడు కాని తన విశ్వాసాన్ని మాత్రం ప్రపంచంలోని మరే వస్తువు కోసం త్యాగం చేయలేడు.

كُلُّ نَفْسٍ ذَائِقَةُ الْمَوْتِ ثُمَّ إِلَيْنَا تُرْجَعُونَ ○

"ప్రతి ప్రాణీ మరణాన్ని రుచి చూడవలసి ఉంది. తరువాత మీరందరూ మా వైపునకే మరలింపబడతారు." (అల్ అన్‌కబూత్:57)

అంటే, ప్రాణం గురించి మీరు ఎలాంటి చింతకు లోనుకాకుండా ఉండండి. ఇది ఎప్పుడో ఒకప్పుడు పోయేదే. శాశ్వతంగా ఉండడానికి ఎవ్వరూ ఈ భూమ్మీదికి రాలేదు. కాబట్టి మీరు ఈ ప్రపంచంలో ప్రాణాన్ని ఎలా కాపాడుకోవాలనే విషయం గురించి చింతించడమే అసలు సమస్యకాదు. చింతించవలసిన అసలు సమస్య మీ విశ్వాసాన్ని ఎలా కాపాడుకోవాలి, దైవదాస్య డిమాండ్లను ఎలా పూరించాలన్నదే. చివరికి మీరంతా మా వైపునకే తిరిగిరావలసి ఉంది. ప్రపంచంలో ప్రాణాలను కాపాడు కోవడానికిగాను మీరు మీ విశ్వాసాన్ని పోగొట్టుకొని వస్తే దాని పరిణామం మరోలా ఉంటుంది. అందుకని ఏదైనా చింతించవలసిన విషయం ఉంటే, మీరు మా వైపునకు

మరలివచ్చేటప్పుడు ఏది వెంట బెట్టుకొని మరలి వస్తారన్నది. ప్రాణం కోసం త్యాగం చేసిన విశ్వాసమా? లేదా విశ్వాసం కోసం త్యాగం చేసిన ప్రాణమా?

దైవదాస్యమే శ్రేయస్కర మార్గం

وَالَّذِينَ آمَنُوا وَعَمِلُوا الصَّالِحَاتِ لَنُبَوِّئَنَّهُم
مِّنَ الْجَنَّةِ غُرَفًا تَجْرِي مِن تَحْتِهَا الْأَنْهَارُ خَالِدِينَ
فِيهَا ۚ نِعْمَ أَجْرُ الْعَامِلِينَ ٥ (عنکبوت : ٥٨)

"విశ్వసించి మంచిపనులు చేసేవారిని మేము స్వర్గంలోని ఎత్తయిన భవనాలలో ఉంచుతాము. వాటి క్రింద సెలయేళ్ళు ప్రవహిస్తూ ఉంటాయి. అక్కడనే వారు శాశ్వతంగా ఉంటారు. ఎంత మంచి ప్రతిఫలం- ఆచరించేవారికి!"

(అల్అన్కబూత్:58)

అంటే, విశ్వాసం మరియు సదాచార మార్గంపై నడిచి మీరు ప్రపంచంలోని సకల వరాలకు దూరమైపోయినప్పటికీ, ప్రాపంచిక దృష్టికోణంతో మీరు అపజయం పొంది మరణించినప్పటికి, ఆ నష్టాన్ని భర్తీచేయడం జరుగుతుందని, భర్తిమాత్రమేకాదు అంతకంటే మేలైన ప్రతిఫలం మీకు అందుతుందని పూర్తినమ్మకం కలిగి ఉండండి అని అర్థం.

దైవదాస్య మార్గాన్ని అవలంబించే వారి గుణగణాలు ఇలా ఉంటాయని చెప్పడం జరిగింది:

الَّذِينَ صَبَرُوا وَعَلَىٰ رَبِّهِمْ يَتَوَكَّلُونَ ٥ (العنکبوت:٥٩)

"సహనం వహించేవారికి, ఇంకా తమ ప్రభువునే నమ్ముకునేవారికి ఎంత మంచి ప్రతిఫలం!"

(అల్అన్ కబూత్:59)

(అ) 'సహనం వహించేవారికి' అంటే, అన్ని రకాల కష్టాలు, నష్టాలు కడగండ్లు మరియు బాధలను సహిస్తూ విశ్వాసంపై నిలకడను ప్రదర్శించినవారు, విశ్వసించి నందుకు వచ్చిపడే ప్రమాదాలను తమ ప్రాణాలను అడ్డుపెట్టి సహించిన వారు, విశ్వాసానికి నీళ్ళొదినప్పుడు కలిగే ప్రయోజనాలు, లాభాలను తమ కళ్ళతో చూసినా వాటివైపుకు ఏమాత్రం మొగ్గుజూపనివారు, అవిశ్వాసులు, అధర్మపరులను తమ కళ్ళ ఎదుటే దినదిన ప్రవర్థమానంగా పైకి రావడం చూసి వారి ఐశ్వర్యంపై ఎలాంటి చెడు దృష్టిని కూడా వేయనివారే సహనం వహించేవారని అర్థం.

(ఆ) 'తమ ప్రభువునే నమ్ముకునేవారికి' అంటే ఎవరైతే తమ ఆస్తిపాస్తులను, తమ వ్యాపారాలను, నివాసగృహాలనే నమ్ముకోకుండా కేవలం తమ ప్రభువునే నమ్ముకున్నవారు; ప్రాపంచిక వనరులను నమ్ముకోకుండా కేవలం తమ ప్రభువు

భరోసాపై విశ్వాసం కోసం ప్రతి ఆపదను, ప్రతి ప్రమాదాన్ని సహించి ప్రతి శక్తితోనూ ఢీ కొనేందుకు సిద్ధపడినవారు; అవసరం వస్తే తమ సర్వస్వాన్ని త్యజించి ఇల్లు వదలి బయలు దేరినవారు; విశ్వాసం, సదాచారాలపై నిలకడగా ఉన్నందుకు లభించే ప్రతిఫలం ఎన్నటికీ వ్యర్థం కాజాలదు అనే విశ్వాసంతో ఉన్న వారు; దైవం తన విశ్వసించిన మరియు సదాచారులైన దాసులను ఈ లోకంలో ఆదుకుంటాడు, పరలోకంలోను వారి ఆచరణలకు మేలైన ప్రతిఫలం ఒసుగుతాడు అనే నమ్మకంతో ఉన్నవారు అని అర్థం.

స్థాయిని పెంచే మార్గం హిజ్రత్

وَكَأَيِّن مِّن دَآبَّةٍ لَّا تَحْمِلُ رِزْقَهَا ٱللَّهُ يَرْزُقُهَا
وَإِيَّاكُمْ وَهُوَ ٱلسَّمِيعُ ٱلْعَلِيمُ - (العنكبوت : ٦٠)

"తమ ఆహారాన్ని మోసుకు తిరగని జంతువులెన్నో ఉన్నాయి. అల్లాహ్ వాటికి ఉపాధిని సమకూరుస్తాడు, మీ ఉపాధి ప్రదాత కూడా ఆయనే. ఆయన అన్నీ వినేవాడూ, అన్నీ ఎరిగినవాడూను." (అల్ అన్‌కబూత్:60)

అంటే హిజ్రత్ చేయడంలో, మీరు మీ ప్రాణాల గురించి బెంగలేకుండడంలా మీఉపాధి సంపాదన గురించి కూడా బెంగపెట్టుకోనవసరం లేదు. మీ కళ్ళముందు గాలిలో, భూమ్మీద మరియు నీటిలో తిరుగాడే పక్షులు, భూచరాలు, జలచరాల్లో యేదీ తన ఉపాధిని మోసుకు తిరుగుతోంది గనుక? అల్లాహ్‌యే కదా వాటన్నిటిని పోషిస్తూ ఉంది. అవి ఎక్కడికెళ్ళినా ఆయన కారుణ్యంతో ఏదో ఓ రూపంలో వాటి భుక్తి వాటికి లభిస్తోంది. కాబట్టి మీరు, ఒకవేళ విశ్వాసం కోసం మీ నివాసాలను వదిలి ఎక్కడికైనా వెళ్ళిపోతే తినేదేమిటి? అని అధైర్యపడనవసరం లేదు. అల్లాహ్ ఏయే మార్గాల ద్వారానైతే తన అసంఖ్యాకమైన సృష్టితాలకు భుక్తి ఏర్పాట్లు చేస్తున్నాడో అతనే మీకూ భుక్తినొసగగలడు.

అచ్చం అవే మాటలు హజ్రత్ ఈసా (అ) తమ హవారీలకు కూడా చెప్పడం జరిగింది.

"ఏ మనిషి ఇద్దరు యజమానుల సేవ చేయలేడు. ఎందుకంటే వారిలో ఒకరితో వైరం మరొకరితో ప్రేమను కలిగి ఉంటాడు. లేదా ఒకరినే సర్వస్వం అనుకొని అతనితో కూడి ఉండి మరొకరిని విలువలేనివాడుగా తలుస్తాడు గనుక. మీరు దేవునికి మరియు ధనానికి ఒకేసారి సేవ చేయలేరు. కాబట్టి నేను చెప్పే విషయం ఏమిటంటే మీరు మీ ప్రాణం గురించి ఆలోచిస్తూ, మా భుక్తి ఏమిటి? మనం తొడిగేదేమిటి అని ఆలోచించొద్దు. మీ ప్రాణం, మీ భుక్తికంటే, మీ శరీరం మీ వస్త్రాలకంటే మిన్న అయినది కదా? గాలిలో ఎగిరే పక్షులను చూడండి! అవి మాట్లాడన్న,

నూలువడకవు, ఆహారాన్ని బంగళాలలో నిలువజేసుకోవు. అయినప్పటికీ మీ దైవం వాటిని పోషిస్తున్నాడు. మీరు వాటికంటే అధికమైన విలువను కలిగిలేరా?

బెంగపెట్టుకొని ఆయుష్షును ఒక్క గడియ కూడా పెంచుకోగలిగినవాడు మీలో ఎవరైనా ఉన్నారా? అడవి అయిరిస్ పూలగడ్డిని జాగ్రత్తగా గమనించండి? అది ఎలా పెరుగుతోందో! అది కష్టపడడంగాని, నూలు వడకడంగాని చేయదు. అయినప్పటికీ మీతో నేను చెప్పేదేమిటంటే, సులైమాన్ (ర) (సాలమన్) కూడా తన ఐశ్వర్యంలో దానిలా వస్త్రధారి అయిలేడు. కాబట్టి దేవుడు, మైదానాలలో పెరిగే గడ్డిని ఏదైతే రేపు పొయ్యిలో వేసి కాల్చబడుతుందో, దానికి కూడా ఇలాంటి వస్త్రాలను చేకూరుస్తూ ఉంటే, ఓ అపనమ్మకంగల వ్యక్తుల్లారా! మీకు కూడా వస్త్రాలను ఎందుకు సమకూర్చలేడు? కాబట్టి మేము ఏం తింటాం? ఏ త్రాగుతాం? ఏ వస్త్రాలను ధరిస్తాం అని ఎందుకు బెంగపడతారు? వీటన్నిటిని వెదికేది ఇతర జాతులవారు. మీ ఆకాశ దైవానికి బాగా తెలుసు మీకు ఇవన్నీ అవసరం అని. మొదట మీరు ఆయన ప్రాభవాన్ని, ఆయన సత్యాన్ని వెదకండి. ఇవన్నీ మీకు లభించగలవు. రేపటి కోసం చింతబెట్టుకోకండి. రేపటి రోజు స్వయంగా దాని గురించి అదే ఆలోచించుకోగలదు. నేటి కోసం నేటి దుఃఖమే చాలు." (మత్తయిసువార్త: అధ్యాయం -6, వాక్యం 24-34)

దివ్యఖుర్ఆన్ మరియు బైబిల్‌లో ఇవ్వబడిన ఈ సూచనల నేపథ్యం కూడా ఒక్కటే. అదేమిటంటే, సందేశప్రచార మార్గంలో ఓ సత్యపిపాసి, భౌతిక వనరులకు సంబంధించిన అన్ని ఆసరాలను వదిలి కేవలం అల్లాహ్ భరోసాపై తన ప్రాణాలను పణంగా పెట్టే సందర్భం ఒకటి రాగలదు. ఈ పరిస్థితుల్లో మీనమేషాలు మోస్తూ తమ భవిష్యత్తు గురించి ఆలోచించేవారు, ఏదైనా పని ప్రారంభించేటప్పుడు తమ ప్రాణాల రక్షణ మరియు తమ ఉపాధి కోసం వెంపర్లాడేవారు ఎలాంటి కార్యాన్ని నిర్వర్తించలేరు. ఇలాంటి పరిస్థితులు మారేదల్లా, ప్రాణాలను పణంగా బెట్టి ప్రతి ప్రమాదాన్ని ఎదుర్కొనేందుకు వెనుకాముందు ఆలోచించక సిద్ధపడేవారి ద్వారానే. వారి త్యాగాలే చివరకు ఫలించి, దైవనామం ఉన్నతమై తక్కిన వాదాలన్నీ వీగిపోయే సమయం ఆసన్నం కాగలదు.

అధ్యాయం-3

ప్రచార ఉపాయం

ముందుమాట

ఇస్లామీయోద్యమం మానవ సమాజాన్ని దైవదాస్యం వైపునకు ఆహ్వానించడానికి ఉనికిలోనికి వచ్చింది. ఇది ఓ స్వచ్ఛమైన సైద్ధాంతిక ప్రచారోద్యమం. దాని సిద్ధాంతాన్ని ఉపాయంతో పట్టుదలగా ప్రజల ముందుకు తీసుకొని వచ్చే ఉద్యమం.

(సయ్యద్ అసఅద్ గీలానీ)

కొన్ని సైద్ధాంతిక దృష్టి కోణాలు

ప్రతి ఇస్లామీయ ఉద్యమం, మనిషి పూర్తి జీవితాన్ని దైవదాస్య సంస్థాపన వైపునకు ఆహ్వానించేదిగా ఉంటూ, అది దైవాదేశాలను ఉన్నది ఉన్నట్లు అమలు చేయమని సమాజానికి పిలుపునిచ్చే ఉద్యమం. కాబట్టి ఈ ఉద్యమ సంబంధం మనిషి వ్యక్తిగత మరియు సామూహిక జీవితంలోని ఈ రెండు కోణాలను స్పృశించే సంబంధం. అందుకని అది ఏకకాలంలో వ్యక్తి, సమాజం మరియు ప్రభుత్వం సంస్కరణకు పూనుకుంటుంది. వ్యక్తి సంస్కరణ కోసం, చెడిపోయిన సమాజంలో నుండి, సంస్కరణను స్వీకరించి దాన్ని తమ జీవితంలో అమలుపరిచే వారిని గుర్తించి ఎన్నుకోవాల్సి ఉంటుంది. ఈ ఉద్యమ సభ్యత్వం పొందేవారికోసం సంస్కరణలను స్వీకరించేవారికి, స్వీకరించనివారికి నడుమ ఎలాంటి భేదముండాలో ఆ భేదాన్ని ప్రస్ఫుటమైందిగా తెలిపే మార్గమొకటి చూయించడం ఎంతైనా అవసరం. ఎందుకంటే, ఏ రకమైన సమాజాన్నైతే నిర్మించడానికి, అది కృషి చేస్తూ ఉందో, ఆ సమాజపు ఓ తేలికపాటి ఆదర్శం ఆ ఉద్యమపు సామూహిక జీవితంలో కానరావాలి. ఆ తరువాత, ఆ వ్యక్తుల సహాయం మరియు ఆ సంస్థ తోడ్పాటుతో అది సమాజ సంస్కరణ కోసం కృషి చేయగలదు. సమాజ సంస్కరణ దామాషా ప్రకారమే ప్రభుత్వాన్ని కూడా సంస్కరించడం సాధ్యం కాగలదు.

ఇస్లామీయోద్యమం, ఓ దైవధిక్కార వ్యవస్థ బాగా వేళ్ళూనుకొని ఉన్న తరుణంలో, దాని తీవ్రతను ఛిన్నాభిన్నం చేయడానికే ఉనికిలోనికి వస్తుంది. ఇస్లామీయ వ్యవస్థ ఉనికిలో ఉన్నప్పుడు, ధర్మసంస్థాపనకు సంబంధించిన మరే ఉద్యమం అవసరం రాదు. స్వయం ఇస్లామీయ ప్రభుత్వం మరియు ఆ ప్రభుత్వాధికారులే

ఇస్లామీయ కార్యకర్తల్లా పనిచేస్తారు కాబట్టి. దైవధిక్కార ప్రభుత్వ వ్యవస్థ ప్రాబల్యం, ఓ అవిశ్వాస సమాజంలోనూ మరియు పేరుకుమట్టుకే పరిమితమై చెడిపోయిన ముస్లిం సమాజంలోనూ పొడసూపవచ్చు.

స్వచ్ఛమైన అవిశ్వాసి సమాజంలో, దైవధిక్కార వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడడంలో ఇస్లామీయోద్యమానికి ప్రాప్తమయ్యే వెసులుబాటు ఏమిటంటే, సమాజంలోని యే వక్తియైనా ఆ ఇస్లామీయ ఉద్యమ ఆహ్వానానికి ప్రభావితుడై దానికి అనుయాయుడైపోతే, అతను తన వ్యక్తిత్వం, తన కుటుంబం మరియు సమాజంతో మొదటి ఘట్టంలోనే పోరాడి తాను ఓ స్వచ్ఛమైన అనుయాయుణ్ణని, త్యాగమూర్తినని, ధైర్యవంతుణ్ణని నిరూపించుకుంటాడు. ఆ ఉద్యమం ఆహ్వానాన్ని స్వీకరించే మొదటి ఘట్టంలోనే అతను ఆ ఉద్యమం యొక్క మేలైన కార్యకర్తల్లో చేరిపోతాడు. ఆ తరువాత ఆ ఉద్యమం ఏ శిక్షణనైతే అతనికి అందిస్తూ పోతుందో దాన్ని అతను త్రికరణశుద్ధిగా స్వీకరిస్తూ పోతుంటాడు. ఉద్యమం కోసం అతను ఎంతటి ప్రయోజనాలనైనా త్యజించి, తీవ్రమైన పరీక్షల కొలిమి నుండి బయటపడ గలుగుతాడు. మనోవాంఛల మొదలు, మరులుగొలిపే మహాసౌధాలు సైతం అతని మార్గంలో అడ్డుగా నిలవలేవు. అయితే చెడిపోయిన ముస్లిం సమాజంలో, ఎక్కడైతే దైవధిక్కార వ్యవస్థ వేళ్ళూనుకొనిపోయిందో, ఆ వ్యవస్థ 'విశ్వాసులం' అనబడేవారి ఓ పెద్ద సంఖ్యను తన ప్రభావాలతో మైమరిపించి రాజీపడేందుకు ప్రయత్నం చేస్తుంది. ఫలితంగా వారి విశ్వాస ప్రకటన కోసం కేవలం ఈ ఆహ్వానం సరిపోదు. ఎందుకంటే, దిగజారిపోయిన ఏ స్థాయి వరకు వారు చేరుకున్నారో ఆ స్థాయిలో వారు తాము ముస్లిలమే అనే ధీమాతో ఉండిపోవడమే కాబట్టి. ఇలాంటి ముస్లిమ్ సమాజంలో పనిజేసే ప్రాథమిక వెసులుబాటు ఏమిటంటే, ఇస్లామీయోద్యమానికి దైవ తిరస్కారులతో ఎలాంటి అడ్డంకులు ఉండకుండా ఉండడమే. కాని ఇలాంటి సమాజంలో నుండి చిత్తశుద్ధిగల కార్యకర్తలను ఏరుకోవడం, వారిని సుశిక్షితులుగా తీర్చిదిద్దడం లోనే ఆలస్యం జరుగుతుంది. ఎందుకంటే, విశ్వాసానికి వ్యతిరేకమైన భావాలు మరియు నైతిక రుగ్మతలు వారిని చుట్టుముట్టి ఉండడం వలన వాటిని ఒక్కొక్కటిగా ఏరిపారవేయడం ఎంతో సంక్లిష్టమైన మరియు సుదీర్ఘమైన కార్యం కాబట్టి.

ఇస్లామీయ చట్టం, అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త (స) ఆదేశాలు వాటి హంగులతో అమలయ్యే సమాజంలోనే సుసాధ్యం. దాన్ని నడిపే అధికారులు కూడా చట్టాలకు బద్ధులై ఉండాలి. అయితే అల్లాహ్, ఆయన ప్రవక్త (స) ఆదేశాలకు తోడు ఇతరుల ఆదేశాలు, చట్టాలు అమలు అయ్యేచోట, వాటిని నడిపేవారు పేరుకు మట్టుకే ముస్లిములు అయినాసరే, కేవలం అల్లాహ్ ఆదేశాలను మరియు చట్టాలను తిరిగి అమలుపరిచేలా చేయడమే ఇస్లామీ యోద్యమ ధ్యేయం. ఈ ధ్యేయమే ప్రతి ముస్లిం జీవితపు వ్యక్తిగత ధ్యేయంగ నిర్ధారించడం జరిగింది.

సందేశ ప్రచార విధానం ఎలా ఉండాలి?

అయితే, వ్యక్తిగత సంస్కరణ, సామాజిక సంస్కరణల కోసం అవలంబించే యే మార్గాన్నైతే ఇస్లామీయోద్యమం అవలంబిస్తుందో మరియు దాని సహాయంతో అది తమ మార్గాన్ని సుగమం చేసుకుంటుందో ఆ మార్గం మాత్రం సాధారణ ప్రాపంచిక శక్తులు అవలంబించే మార్గానికి భిన్నమైనదన్నది అందరికి తెలిసిన విషయం. ఎందు కంటే ఆ మార్గం నైతిక కట్టుబాట్లను ఉపేక్షించి ఎదుటి మనిషితో సత్యం పట్ల సంతృప్తిని కలిగించే బదులు అతనిలో దూరాశలను, మనోవాంఛలను, స్వార్థాన్ని రేపే మార్గం గనుక. ఇలాంటి తీరును అవలంబించి ఇస్లామీయోద్యమం విజయం సాధిస్తుంది అని అనలేము. ఈ విధానాన్నే అవలంబిస్తే ఇక ఇస్లామీయోద్యమం అవసరం ఎక్కడుంటుంది? ప్రపంచంలోని మహోన్నతమైన ఇస్లామీయ ఉద్యమానికి యే దైవమార్గదర్శక సూత్రాలైతే ఇవ్వబడ్డాయో, ఆ మార్గదర్శక సూత్రాలకు ఏ ఇస్లామీయ ఉద్యమం అయితే కట్టుబడి ఉందో, ప్రళయదినం వరకు మరే ఉద్యమాలైతే ఉనికిలోనికి వస్తాయో ఆ ఉద్యమాల సూత్రాల వెలుగులోనే దైవధిక్కారు లకు ఆయా కాలపు ప్రవక్త "ఓ నా జాతి ప్రజలారా! ఓ నా జాతి నాయకు లారా!" అంటూ సంబోధించడం జరిగింది. ఆ ప్రవక్తకు ప్రస్ఫుటమైన ఆదేశం ఇలా ఇవ్వడం జరిగింది:

ادْعُ إِلَىٰ سَبِيلِ رَبِّكَ بِالْحِكْمَةِ وَالْمَوْعِظَةِ
الْحَسَنَةِ وَجَادِلْهُم بِالَّتِي هِيَ أَحْسَنُ (النحل: ١٢٥)

"ప్రవక్తా! నీ ప్రభువు మార్గంవైపునకు ఆహ్వానించు, వివేకంతో, చక్కని హితబోధతో. ప్రజలతో ఉత్తమమైన రీతిలో వాదించు." (అన్‌నహ్ల్:125)

ఇస్లామీయ ఉద్యమం ఏ ఇస్లామీ సందేశ ప్రచార భారాన్నైతే తన భుజ స్కంధాలపై వేసుకుందో, ఆ సందేశ ప్రచారాన్ని విధిగా ఖరారు చేసిన సృష్టికర్త, దాన్ని ప్రచారంచేసే విధానాన్ని కూడా తానే చూయించడం జరిగింది. ఈ ప్రత్యేక విధానం కారణంగానే ఇస్లామీయోద్యమం ఇతర జమాఅత్‌లకంటే మిన్నదైనదిగా, ప్రత్యేకమైనదిగా కానవస్తోంది. ఈ విధానాన్నే విడనాడినట్లయితే, ఇక మిగిలేదల్లా, ఆవేశకావేశాలు కలిగిన ఓ వర్గం, నోటికొచ్చినట్లు మాట్లాడే ఓ గుంపు మాత్రమే. అది తన సహజరీతి, వైఖరి, కార్యాచరణ విధానాలరీత్యా ఓ ఇస్లామీ యోద్యమం మాత్రం కాజాలదు. ఇది ఇస్లామీయోద్యమానికి మచ్చతెచ్చే వర్గంగానే మిగిలిపోగలదు, దైవం ఎదుట జవాబుదారులం అనే భయం లేకుండా ఇష్టమొచ్చి నట్లు ప్రలాపనలు చేసే ఉపన్యాసకులను ఇస్లామీయోద్యమ కార్యకర్తలని భావించడం పొరపాటే. వారు ఏ సందేశం వైపుకైతే ఆహ్వానిస్తున్నారో ఆ సందేశాన్ని ఇస్లామీ సందేశం అని అనడం కష్టమే. వారు బోధించే ఇస్లామీ వ్యవస్థను ఇస్లామీ వ్యవస్థ అని తలచి, దాని ద్వారా మానవ సమాజ సంస్కరణ జరుగుతుందని ఆశించడం కూడా మిథ్యేకాగలదు.

ఇస్లామీ సందేశ ప్రచారానికి కొండంత ఓర్పు అవసరం

ఇస్లామియోద్యమ మార్గం ఎంతో సహనంతో కూడినది మరియు సుదీర్ఘమైనది. ఇది యదార్థం. త్వరపడేవారికి, సహనం లేనివారికి ఇది అచ్చిరాని మార్గం. ప్రతి ప్రయాణానికి ప్రయాణబత్తెం ఉంటుంది. ఇస్లామ్ మార్గంలో ప్రయాణించేవారికి ఉండవలసిన బత్తెం సహనం మరియు దైవంపై భారం మాత్రమే. హసనుల్‌బన్నా షహీద్ తన సహచరులను సంబోధిస్తూ ఎంత మంచి మాటలన్నారో చూడండి:

"మీ మార్గం నిర్ధారించబడిన మార్గం. ఇది గమ్యానికి చేరడానికి సురక్షితమైన మార్గమని పూర్తి నమ్మకం ఉంది. ఇలా ఈ మార్గం ఎంతో సుదీర్ఘమైపోతుందనడంలో సందేహం లేదు. కాని ఇంతకంటే మరేమార్గం కూడాలేదు. ఎడతెగని ప్రయత్నం, సహనం మరియు నిశ్శబ్దకార్యమే చేయవలసిన పని. పంటకు రాక మునుపే ఫలాన్ని కోయడానికి చేయిజాపినవాడు సమయానికి ముందే దాన్ని త్రుంచ ప్రయత్నం చేస్తున్నాడన్న మాట. నేను ఈ తొందరపాటుకు పూర్తి వ్యతిరేకిని. తొందరపడేవారు ఈ ఓర్పుతో కూడిన సందేశ ప్రచార మార్గాన్ని వదిలి ఇతర జమాఅత్‌లలో (సంస్థల్లో) చేరిపోవడం ఉత్తమమని భావిస్తున్నాను. అక్కడ వారికి, వారి తొందరపాటుకు కావలసిన వెసులుబాటు సంతృప్తి ఉండవచ్చు. ఎవరైతే మా వెంట ఉండి సహనాన్ని ప్రదర్శిస్తాడో అతనికి లభించే సత్ఫలితం అల్లాహ్ వద్ద సురక్షితంగా ఉంది . అది ఎన్నటికీ వృథా కానిది. ఈ మార్గాన్ని అవలంబించినప్పుడు ఉన్నత విజయం మనకు వరిస్తుంది లేదా మనం షహాదత్ (అమరత్వం)నైనా మూటగట్టుకుంటాం."

సందేశ ప్రచారానికి సంబంధించిన కార్యకలాపాలన్నింటిలోనూ ప్రతిక్షణం మరువరాని విషయం ఒకటుంది. అది ఎవరి కార్యాన్ని నిర్వహిస్తున్నాం? మనం నిర్వహించే కార్యం గురించి ఆయనకు తెలుసా లేదా? ఆయనే దాని గురించి బాగా ఎరిగినవాడైతే, ఆ సర్వసృష్టికర్త, యజమాని దానికి ప్రతిఫలం ఇవ్వగల సమర్థుడా కాదా? అన్నది. ఆయనే గనక దానికి సమర్థుడు అయినప్పుడు, తాను కోరినప్పుడు విజయమార్గాన్ని సుగమం చేయగలడు. కూలికి పని చేసేవాడు, తన యజమాని దానికి కూలీ ఇస్తానని ఇచ్చిన ఆశ్వాసన మేరకు పని చేసుకుంటూనే పోవాలి. సర్వాధికారి అయిన దైవకార్యం నిర్వహించే వారికి వారి ప్రతిఫలం లభిస్తుందనే జామీను ఉంది.

సహనంతో కూడిన ఈ సుదీర్ఘమైన ప్రయాణమార్గం వైపునకు దైవప్రవక్త (స) కూడా స్వయంగా మార్గదర్శనం చేయడం జరిగింది. దైవప్రవక్త (స) వారు మక్కా నగర కడగండ్ల వాతావరణంలో ఇస్లామీ సందేశాన్ని ప్రచారం చేస్తున్నారు. అన్ని వైపుల నుండి ధిక్కారం, తిరస్కారం పెల్లుబికుతోంది. ఆయన (స) కాబా గృహం గోడకు వీపును ఆనించి,కూర్చుని ఉన్నారు. ఇంతలోనే ఆయన(స) పై తన ప్రాణాలనైనా

అర్పించడానికి సిద్ధంగా ఉన్న సహచరుడొకరు ఆయన సన్నిధికి వస్తారు. ఆ సహాబీ అనుభవించిన కష్టాలు, కడగండ్ల గురించి మక్కావాసులందరికి తెలిసినదే. గాయాల నుండి రక్తం కారుతుండగా, చొక్కా చినిగిపోయి, హింసలకు ప్రతీకగా నిలిచిన ఆ సహాబీ ఓ ఇస్లామీయ ఉద్యమ కార్యకర్తగా దైవప్రవక్త (స)గారి ముందుకు వచ్చి నిలబడి అందరి మనస్సుల్లోనూ మెదలాడుతున్న ప్రశ్నను ఇలా అడుగుతారు:

"ప్రవక్తా! ఇస్లామీయ వ్యవస్థ ఎప్పుడు వస్తుంది? ఈ కష్టకాలం నుండి మనం గట్టెక్కేది ఎప్పుడు?"

ఈ ప్రశ్నను విన్న దైవప్రవక్త (స) గారి ముఖారవిందం, తన ప్రాణ స్నేహితుని ఈ ప్రశ్న ఆయనకు ఇబ్బంది పెట్టిందా అన్నట్లుగా ఎరుపెక్కింది. కాబా గృహ గోడకు వీపును ఆనించి కూర్చున్న ఆయన వెంటనే నిటారుగా కూర్చుని ;

"ఓ అర్త్ తనయుడా! ఖబ్బాబ్! అప్పుడే బెంబేలెత్తిపోయావా? నీకంటే పూర్వం ఈ కార్యాన్ని నిర్వహించినవారిలో కొందరిని గోతులు తీసి (నిలువుగా) పూడ్చారు. ఆ తరువాత వారి తలలో రంపాలు ఆడించి రెండుగా చీల్చారు. కొందరిని అలానే పాతిపెట్టి ఇనుప దువ్వెనలతో వారి మాంసాన్ని ఎముకల నుండి వేరుచేయడం జరిగింది. నీవు ఇప్పుడే భయపడిపోయావు?"

కొంత తడవు ఆగి;

"ఓ సమయం వస్తుంది. అప్పుడు అల్లాహ్ ధర్మం ఔన్నత్యం సాధిస్తుంది. ఓ సాధారణ యువతి దేశం ఒక మూల నుండి మరోమూల వరకు బంగారాన్ని ఎగిరేసుకుంటూ వెళ్ళగలదు. అయితే నీవు అసహనాన్ని ప్రదర్శిస్తున్నావు."

సత్యధర్మపథం దారి బత్తెములు - ఓర్పు, నేర్పు

1. సహనం (ఓర్పు): నిరంతర కార్యదీక్ష, పరీక్షా సమయంలో స్థైర్యం. వ్యతిరేకత పెల్లుబికినప్పుడు సామ్యాన్ని ప్రదర్శించడం, తిట్లు శాపనార్థాలు ఎదురయ్యే సమయంలో దీవించడం. దైవధర్మం మార్గంలో నడిచే ప్రతి ప్రమాణీకుడు ఇంతకు పూర్వం ఈ దారిబత్తేలను తీసుకొనే నడిచాడు. చరిత్రకు సంబంధించిన ప్రతి కాలంలోనూ, సందేశ ప్రచారాన్నే తన గమ్యంగా చేసుకొని, దైవప్రసన్నతే తన జీవిత పరమార్థంగా చేసుకున్నవారందరి వైఖరి ఇలానే ఉంటూ వచ్చింది.

హజ్రత్ అనస్ (ర) బిన్ మాలిక్ ఉల్లేఖనాన్ని తిర్మిజీ గ్రంథం ఇలా ఉల్లేఖిస్తోంది:

"దైవప్రవక్త (స) వారు ఇలా సెలవిచ్చారు: పరీక్ష ఎంత కఠినమైపోతే దానికి తగినట్లుగానే గొప్ప బహుమానం లభిస్తుంది. అయితే మనిషి ఆ అగచాట్లు, కష్టాలకు వెరచి సత్యధర్మం నుండి పారిపోకుండా ఉండడం ముఖ్యం. అల్లాహ్ యే వర్గాన్నైతే ప్రేమిస్తాడో, మరింత రాటుదేలడానికి, ప్రక్షాళించడానికిగాను ఆ వర్గాన్ని పరీక్షల్లో

బడవేస్తాడు. కాబట్టి ఎవరైతే అల్లాహ్ నిర్ణయాన్ని సంతోషంగా స్వీకరించి సహనం వహిస్తారో వారిపట్ల ఆయన ప్రసన్నుడౌతాడు. మరెవరైతే ఈ పరీక్షల్లో అల్లాహ్ పట్ల అసహనాన్ని, అయిష్టాన్ని ప్రదర్శిస్తారో వారి ఎడల అల్లాహ్ అయిష్టంగానే ఉంటాడు."
(తిర్మిజీ)

ఈ మార్గంలో చెడును మంచి ద్వారా దూరం చేయాలని బోధించడం జరిగింది.

وَلَا تَسْتَوِي الْحَسَنَةُ وَلَا السَّيِّئَةُ ادْفَعْ بِالَّتِي هِيَ أَحْسَنُ (حم السجدہ:۳۴)

"ప్రవక్తా! మంచీ, చెడూ ఒకటికావు. నీవు చెడును శ్రేష్ఠమైన మంచి ద్వారా తొలగించు." (హామీమ్ సజ్దహ్:34)

ఓర్పు, నేర్పులు ఇస్లామియోద్యమం మౌలిక వైఖరి భాగాలు. ఉద్యమం కోసం సన్నద్ధమయ్యేకాలం తీవ్రమైన పరీక్షలను ఎదుర్కొనే కాలం. ఈ కాలంలో ఉద్యమ ప్రతికార్యకర్త, ప్రతి కష్టాన్ని సహనం, ఓర్పులనవలంబించి నడవాలని, పట్టుదలగా నిలబడ్డాలని ఆదేశించడం జరిగింది. దైవప్రవక్త (స) తను ఓ సహచరునికి ఇలా సెలవిచ్చారు: "ఇస్లామ్‌కు సంబంధించినంతమటుకు అన్నిటికంటే ఉత్తమమైన విషయం ఏమిటంటే, ఆమంతుబిల్లాహ్ (నేను అల్లాహ్‌ను విశ్వసించాను) అని అను, ఆ తరువాత దానిపై స్థిరంగా నిలిచిపో."

దైవప్రవక్త (స) వారి మక్కా ఇస్లామియోద్యమ కాలమే దానికి మేలైన ఉదాహరణ. ఆ తరువాత కాలంలో, రోము మరియు ఇరాన్ సామ్రాజ్యాలను జయించినవారు, ఖైబర్ కోట ద్వారాన్ని తమ బాహుబలంతో పెకిలించినవారు, బద్ర్ యుద్ధంలో దైవతిరస్కారుల పహిల్వానులను దోసకాయల్లా నరికిన యువకులు మక్కా నగర వీధుల్లో ఈడ్చబడినవారు, హింసించబడడం వలన రక్తసిక్తమైనవారే. అయితే ఓర్పు స్థయిర్యాలు వారి అడుగుల్ని తడబడనివ్వలేదు. ఎందుకంటే, అప్పటివరకు ఎదురుతిరిగే అనుమతి ఇవ్వడం జరగలేదు. ఉద్యమం దానికి సిద్ధంగా కూడా లేదు. అప్పటికి బంగారాన్ని కొలిమిలో వేసి కరిగించి అందులోని కల్మషాల్ని బయటకు తీయడం మట్టుకే జరిగింది. అప్పటికి ఇంకా ఎదురు తిరగడానికి సరైన శక్తి వారికిలేదు. కాబట్టి ఆ కాలంలోనే దైవప్రవక్త (స) తన ఓ సహచరునికి గతంలో ఓ ప్రవక్తకు జరిగిన సంఘటనను వినిపించారు. ఆ సంఘటనలో స్వయంగా దైవప్రవక్త(స) వారిపట్ల జరిగిన దురుసు ప్రవర్తన ఆనవాళ్ళు కూడా కనిపిస్తాయి. దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు:

"ఆ దృశ్యం ఇంకా నా కళ్ళ ముందే ఉంది. సత్యం వైపుకు ఆహ్వానించిన నేరానికి ఓ ప్రవక్తను వారు పాశవికంగా హింసించినందుకు ఆయన శరీరం రక్తసిక్తమై

పోయింది. అప్పుడు ఆ పరిస్థితి ఎలాగుందంటే, ఆయన తన ముఖం నుండి రక్తాన్ని తుడుచుకుంటూ ఇలా పలుకుతూ ఉన్నారు. "ఓ దేవా! నా ఈ జాతి చేసిన ఈ నేరాన్ని మన్నించు. వీరు అమాయకులు, అసలు యదార్థం ఏమిటో వీరికి తెలియదు."

మక్కా నుండి మదీనాకు వెళ్ళిన వలసలో, ఆ మహోన్నత ఇస్లామీయ ఉద్యమానికి, బలహీనంగా ఉండి ఎలాంటి ప్రతిక్రియకు కూడా పూనుకోకుండా అశక్తతను ప్రదర్శించేకాలం మరియు శక్తిని పుంజుకొని ఎదురుదాడి చేయగల సామర్థ్యం గల కాలానికి నడుమ తేడా ఏమిటో బాగా తెలిసివచ్చింది. మరో మాటలో చెప్పాలంటే, శక్తిని ఉపయోగించకపోవడం మరియు శక్తిని ఉపయోగించ డంలో గల తేడా ఏమిటో అర్థమైంది. మదీనా వలస, నేరుగా చర్యగైకొనే ప్రస్ఫుటమైన ముందడుగు చిహ్నంగా బహిర్గతం అయింది. అయితే, ఇలాంటి ప్రస్ఫుటమైన యే సూచన అయినా ఓ ఉద్యమం దృష్టికి కానరాకపోతే, నేరుగా చర్యగైకొనే ఆలోచన చేసే ముందు వెయ్యిసార్లయినా ఆలోచించవలసి ఉంటుంది. ఎందుకంటే, చిన్న పిల్లల్లా ఇష్టమొచ్చినప్పుడు పగలగొట్టడానికి, ఇష్టమొచ్చినప్పుడు తిరిగి తయారు చేసుకోవడానికి ఇస్లామీయోద్యమం ఓ ఆటబొమ్మకాదు గనుక. శతాబ్దాల తరువాత ఓ చిత్తశుద్ధిగల ముస్లిం వర్గానికి అప్పగించబడిన ఒక అమానత్తు అది.

ఉద్యమంతో కలిసి నడుస్తూ దైవమార్గంలో సహనాన్ని, స్థయిర్యాన్ని అవలం బించవలసి ఉంటుంది అని చెబుతూ, స్వయంగా ఈ సృష్టికి యజమాని, కర్త అయిన అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు:

اَمْ حَسِبْتُمْ اَنْ تَدْخُلُوا الْجَنَّةَ وَلَمَّا يَاْتِكُمْ مَّثَلُ الَّذِيْنَ
خَلَوْا مِنْ قَبْلِكُمْ مَسَّتْهُمُ الْبَاْسَآءُ وَالضَّرَّآءُ وَزُلْزِلُوْا
حَتّٰى يَقُوْلَ الرَّسُوْلُ وَالَّذِيْنَ اٰمَنُوْا مَعَهٗ مَتٰى نَصْرُ اللّٰهِ
اَلَآ اِنَّ نَصْرَ اللّٰهِ قَرِيْبٌ۔ (البقرہ : ۲۱۴)

"స్వర్గ ప్రవేశం ఊరకే లభిస్తుందని మీరు అపోహపడుతున్నారా? మీకు పూర్వం విశ్వాసులకు సంభవించినవన్నీ ఇంకా మీకు సంభవించనేలేదే! వారిపై ఆపదలు, ఎనలేని వ్యధలు విరుచుకుపడ్డాయి, వారు కుదిపివేయబడ్డారు. చివరకు అప్పటి ప్రవక్త, విశ్వాసులైన అతని అనుచరులు, 'అల్లాహ్ సహాయం ఇంకా ఎప్పుడొస్తుంది' అని ఆక్రోశించారు. అప్పుడు, 'అదిగో, అల్లాహ్ సహాయం సమీపంలోనే ఉంది" (అని వారిని ఓదార్చడం జరిగింది)." (అల్ బఖరా:214)

మన ఈ కాలానికే చెందిన ఇస్లామీయోద్యమ మహోన్నత రథసారథి సయ్యద్ మౌదూదీ (రహ్మాలై) 1963లో ఓ నిరంకుశ ప్రభుత్వం అవలంబించిన హింసా దౌర్జన్యాల తుపాకిగుండ్ల నడుమ నిల్చొని తమ అనుచరులనుద్దేశించి ఎంత మంచి మాటలు చెప్పడం జరిగిందో చూడండి:

"ఓ నా ప్రియ సహచరులారా! అల్లాహ్ ధర్మం కోసం మీరేకార్యం అయితే నిర్వహించవలసి ఉందో, ఆ కార్యంలో రెండు గుణగణాలు తప్పకుండా ఉండాలి. ఒకటి సహనం, రెండవది నేర్పు. సహనం లేదా ఓర్పు కోరుకునేదేమిటంటే, మీ మార్గంలో ఏ అడ్డంకి అయినా కల్పించబడితే దానికి మీరు కోపోద్రిక్తులై మీ మానసిక సమతౌల్యాన్ని విడనాడకూడదు. అలాగే నిస్పృహకు లోనై మీ లక్ష్యసాధనకు బదులు ఆ అడ్డంకులు సృష్టించే మన కాంక్షల్ని నెరవేర్చకూడదు. దానికి భిన్నంగా ప్రతి అడ్డంకి ఎదురైనప్పుడు మీ పట్టుదల మునుపటిలాగే స్థిరంగా ఉండాలి. భావోద్రేకాలు కలిగించే తొందరపాటు నుండి మీ మనోమస్తిష్కాలను సంరక్షించుకుంటూ, నేర్పుకు అనుగుణంగా ఉండే మార్గాన్నే అవలంబించండి."

నేర్పు, నైపుణ్యం గురించి వివరిస్తూ ఇలా బోధించారు

"నేర్పు అంటే, కళ్లు మూసుకుని నిర్ధారితమైన ఒకే ఒక మార్గంపై నడిచేందుకు అలవాటుబడడం కాదు. కాగా, ఓ మార్గం మూసుకుపోతే అలాంటి పదిమార్గాలను సమయోచితంగా వెతుక్కోవడం. ఎవరిలోనైతే ఈ నేర్పు ఉండదో అతను ఆ మార్గం మూసుకుపోవడం చూసి మిన్నకుండా కూర్చుండిపోతాడు. దానికితోడు అతనిలో అసహనం కూడా ఉండివుంటే అతను ఆ అడ్డంకిపై తన తలను బాదుకొని పగులగొట్టుకుంటాడు. లేదా తన ప్రయాణాన్నే మానుకుంటాడు. కాని ఎవరికైతే అల్లాహ్ నేర్పు మరియు ఓర్పులు ప్రసాదిస్తాడో అతను నదీ ప్రవాహంలాంటివాడు. దాని గమ్యాన్ని ఏ వస్తువు అడ్డుకోజాలదు. కొండశిలలు సైతం తమ చేతగానితనాన్ని ప్రదర్శిస్తూ అలా నిలబడిపోతాయి. నదిమట్టుకు ఏదో ఒక మార్గాన్ని అన్వేషించి తన గమ్యానికి చేరుకుంటుంది."

మూసుకుపోయిన మార్గాలకు బదులు వేరే మార్గాలెలా ఉంటాయి అని వివరిస్తూ మౌలానా ఇలా సెలవిచ్చారు:

"మన సందేశాన్ని మన ప్రచారాన్ని వ్యాపింపజేయడానికి మనం సభల్లో ప్రసంగించి వేలాదిమంది దాన్ని వినాలన్నది మన కోసం మిగిలిపోయిన మార్గం ఒక్కటేకాదు. ఇది మన కార్యంలోని ఓ విధానం. మీరు ముగ్గురేసి, నల్గురేసి మంది కలిసి ఓ వర్గంగా ఏర్పడి మీ ప్రాంతంలోనికి బయలుదేరండి. ఇంటింటికి వెళ్ళండి. షాపు షాపుకు పోండి. మసీదు మసీదుకు వెళ్ళండి. వ్యక్తిగతంగా ప్రజలను కలుసుకొని ఒక్కొక్కరికి, ఇస్లామీయోద్యమం అంటే ఏమిటి? దాని వ్యవస్థ ఎలా ఉంటుంది? దాని ధ్యేయం ఏమిటి? దాని కార్యాచరణ విధానం ఎలాగుంటుంది? అది ఏయే విషయాలను సంస్కరించదలిచింది? మరే సత్కార్యాలను నెలకొల్పదలిచింది అని వివరించండి. ఎవరైనా మీతో వాదనకు దిగితే ఆ వాదనలో చిక్కుకోకుండా వెళ్ళిపోండి. మీ విధానం "ఉద్ఊ ఇలా సబీలి రబ్బిక బిల్ హిక్మతి వల్ మౌఇజతిల్ హసనా"

(ప్రవక్తా! నీ ప్రభువు మార్గంవైపునకు ఆహ్వానించు, వివేకంతో చక్కని హితబోధతో, ప్రజలతో ఉత్తమమైన రీతిలో వాదించు) అన్నట్లుగా ఉండాలి. మీరు మాట్లాడే తీరు అమృతం చిలికినట్లుగా ఉండాలి. మీ నైతికతలు పవిత్రమైనవిగా ఉండాలి. మీ వైఖరి గౌరవప్రదంగా ఉండాలి. దురుసుతనానికి జవాబుగా సౌమ్యాన్ని ప్రదర్శించండి, మీ మాటల ద్వారానే కాదు మీ వైఖరి ద్వారానూ, మీరు నిజంగానే చెడుకు బదులు మంచిని నెలకొల్పడానికే ప్రయత్నిస్తున్నారని రుజువుచేయండి. ఆ తరువాత, అల్లాహ్ కారుణ్యం మీ వెంటే ఉంది. మీరు ఎంత పని అయితే చేస్తారో అంతకు మించిన పని దైవదూతలు చేసుకుంటూపోతారు. ఇది ముమ్మాటికీ నిజం అని నమ్మండి."

ఇక ఇప్పుడు, దైవదౌత్యకాలం నాటి ఇస్లామియోద్యమంలోని వివేకం మరియు నేర్పుకు సంబంధించిన ఉదాహరణను చూద్దాం. ఇది హుదైబియా ఒప్పందానికి సంబంధించిన ఉదాహరణ. దైవధిక్కారులు పెనుగులాటకు, దాడికి సిద్ధంగా ఉన్నారు. ఇటు చూస్తే ముస్లిములు తమ సంఖ్యరీత్యా, తమ పరిస్థితులరీత్యా అలాగే వారున్న ఆ ప్రదేశం మరియు వారి శక్తిరీత్యా బహుస్వల్పం. ధర్మ ప్రచారం కోసం కొంగ్రొత్త మార్గాలను అన్వేషించవలసి ఉంది. ఉద్యమ నాయకుడు దైవతిర స్కారుల దుందుడుకు విధానాల విషయంలో ఓ ఒప్పందం కుదుర్చుకుంటున్నారు. ఆ ఒప్పందంలోని కొన్ని షరతులు ముస్లిములకు నచ్చడం లేదు. అవి వారి బలహీనతను చాటుతున్నట్లుగా ఉన్నాయి. అయితే ఉద్యమనాయకుడు భవిష్యత్తులో విశాలమైన ప్రచార అవకాశాలను కల్పించడానికి ఒప్పందపు ఈ మార్గాన్నే అవలంభిస్తారు. దివ్యఖుర్ఆన్ ఈ ఒప్పందపు కార్యక్రమాన్ని 'ఫత్హెముబీన్' (ప్రస్ఫుటమైన విజయం)గా ఖరారు చేస్తోంది. చివరకు నిజంగానే అది ఓ ప్రస్ఫుటమైన విజయంగానే రుజువు అయింది. ఓ గొప్ప శత్రువుతో నిరంతర సంఘర్షణ నుండి ఉద్యమానికి కొంతకాలం వరకు విశ్రాంతి లభిస్తుంది. దాని ద్వారా ప్రయోజనం పొందుతూ అనేక చిన్నచిన్న విజయాలు, తెగలతో ఒప్పందాలు, ప్రచార కార్యక్రమం ద్వారా ఉద్యమ విజయం కోసం అనేక మార్గాలు సుగమం అవుతాయి. భావోద్రేకాలు లేకుండా కేవలం ఒక వివేకం, నేర్పు మాత్రమే ఉంటే మార్గం సుదీర్ఘమై ప్రయాణం విసుగెత్తిస్తుంది. అలాగే కేవలం భావోద్రేకాలు మట్టుకే ఉండి వివేకం, నేర్పులు లేకపోతే ఉద్యమం దాని మార్గంలో వచ్చే ఏదో ఒక బండరాయితో తలను బాదుకొని అంతమైపోవడమో లేదా మైళ్ళకొలది వెనక్కు వెళ్ళిపోవడమో జరుగుతుంది. భావోద్రేకాల ఉపమానం పెట్రోలు లాంటిది. పెట్రోలుతో నిండిన డ్రమ్ముకు నిప్పంటించి చూడండి. అది వినాశనాన్ని సృష్టిస్తుంది. దాన్నే వాహన టాంకులోపోసి కంట్రోలుతో ఇంజనులో పంపి నడిపితే సుదూర తీరాలు కూడా చేరువైపోతాయి.

మొత్తానికి ధర్మసందేశ ప్రచారంలో ప్రచార నైపుణ్యత, వివేకం ఉపాయాలు ఎంతో అవసరం. ఇది ప్రతి ఇస్లామీయోద్యమ కార్యకర్త గుర్తించవలసిన యదార్థం. ఒకవేళ కార్యకర్తకు ప్రచార నైపుణ్యం కరువైపోతే ధర్మసందేశ ప్రచార కార్యక్రమాన్ని నడపడం అసాధ్యం అయిపోతుంది.

ఇస్లామ్ - ఒక ఉద్యమం

ఏకేశ్వరుడైన అల్లాహ్ పాలనా సిద్ధాంతంపై మనిషి జీవితం సంపూర్ణ జీవిత కట్టడాన్ని నిర్మించతలపెట్టిన ఉద్యమమే ఇస్లామ్. ఈ ఉద్యమం అనాది కాలంగా ఒకే ఒక పునాది మరియు ఒకే తీరుగా కొనసాగుతూ వస్తోంది. దీని నాయకులనే 'రుసుల్లల్లాహ్' (అల్లాహ్ ఎంపిక చేసిన సత్పురుషులు) అని అనడం జరిగింది. మనం ఈ ఉద్యమాన్నే గనక నడిపించదలచినట్లయితే, ఇష్టమున్నా లేకున్నా, ఆ నాయకుల వైఖరినే అవలంబించవలసి ఉంటుంది. ఎందుకంటే, అంతకంటే ఈ ప్రత్యేక ఉద్యమం కోసం మరో రకమైన విధానం ఏదీ లేదు, ఉండజాలదు గనుక.

ప్రవక్తల అడుగుజాడలను అనుసరించడమే ఏకైక మార్గం

దైవప్రవక్తల (అ.స.) అడుగుజాడలను వెదక ప్రయత్నించినప్పుడు మనకు ఓ క్లిష్టమైన పరిస్థితి ఎదురౌతుంది. పూర్వకాలంలో ఏ ప్రవక్తలైతే ప్రభవించారో వారికి సంబంధించి కావలసినన్ని వివరాలు మనకు లభించవు. దివ్యఖుర్ఆన్‌లో కొన్ని సూచనలు మనకు టూకీగా మాత్రమే లభిస్తాయి. అయితే వాటి ద్వారా మనం సమగ్రమైన ప్రణాళికను తయారుచేసుకోలేము. బైబిల్ కొత్త నిబంధనలో హజ్రత్ ఈసా మసీహ్ (అ)గారి కొన్ని బోధనలు లభిస్తాయి. అవి కూడా అంత ప్రామాణికమైనవి కావు. అయినా వాటి ద్వారా కొంతమట్టుకు, ఇస్లామీయోద్యమం దాని ప్రారంభదశలో ఏ విధంగా నడుపబడింది, ఎలాంటి వాతావరణం దానికి ఎదురైంది అన్న విషయాన్ని అర్థం చేసుకోగలం. అయితే ఆ తరువాతి సమస్యలు ఈసా (అ)కు ఎదురుకాలేదు. ఆ సూచనలు మనకు అక్కడ అగుపించవు. ఈ విషయంలో మనకు ఒకే ఒక చోట ప్రస్ఫుటమైన, సంపూర్ణమైన మార్గదర్శకం లభించేది కేవలం అంతిమ దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స)గారి జీవితంలోనే. దాని వైపునకు మొగ్గుజూపడానికి కారణం ఆయనపైగల ప్రేమ, నమ్మకం ఒక్కటేకాదు, పైగా, ఈ మార్గం ఎగుడు దిగుళ్ళను తెలుసుకోవడానికి మనకు అంతకంటే మరో మార్గం కూడా కానరాదు. ఇస్లామీ ఉద్యమ నాయకులందిరిలోనూ, హజ్రత్ ముహమ్మద్ (స)వారి ఒక్కరి జీవితంలోనే మనకు ఈ ఉద్యమ ప్రారంభ ప్రచార దశ మొదలు ఇస్లామీ సామ్రాజ్య స్థాపన వరకు; ఆ స్థాపన తరువాత ఆ సామ్రాజ్య రూపురేఖలు, శాశనాంగం, దేశీయ మరియు విదేశాంగ నీతి, రాజ్యపాలనా వ్యవస్థలకు సంబంధించిన ప్రతి ఘట్టంలోని ఒక్కో పార్శ్వం పూర్తి వివరణలతో, ఎంతో ప్రామాణిక వివరాలతో లభిస్తాయి. కాబట్టి ఈ

ఒనరు నుండే నేను ఈ ఉద్యమం కార్యాచరణ విధానపు సంగ్రహ చిత్రాన్ని మీ ముందు ఉంచదలిచాను.

దైవ ఏకత్వం వైపునకు ప్రజలను ఆహ్వానించడమే ప్రప్రథమ కార్యం

దైవప్రవక్త (స) వారు ఇస్లామ్ సందేశ ప్రచార కార్యక్రమానికి నడుము బిగించినప్పుడు, ప్రపంచంలో అనేక నైతిక, సామాజిక, ఆర్థిక, రాజకీయ సమస్యలు పరిష్కరించబడవలసి ఉందనే యదార్థం బాగా ఎరుగుదురాయన. అదేకాకుండా రోమను, ఇరాన్ ఇంపీరియలిజం కూడా చెక్కుచెదరకుండా నడుస్తోంది. ప్రజల్లో నిమ్నోన్నతా భావాలూ ఉన్నాయి. అక్రమమైన ఆర్థిక దోపిడీ జరుగుతోంది. నైతిక పతనం తారస్థాయికి చేరుకొని ఉంది. స్వయంగా ఆయన దేశంలోనే, ఓ నాయకుడు సంస్కరించవలసిన క్లిష్టమైన రుగ్మతలన్నీ చోటుచేసుకొని ఉన్నాయి. జాతికి జాతే అజ్ఞానం, నైతిక పతనం, దారిద్ర్యం, అరాచకం, అంతర్యుద్ధాల్లో సతమౌతూఉంది. బహ్రైన్ నుండి యమన్ వరకు అరేబియా తీరప్రాంతాలన్నీను ఈరాక్ సుభిక్షమైన రాష్ట్రం కూడా పూర్తిగా ఇరాన్ ఆధీనంలో ఉన్నాయి. ఉత్తరాన హిజాజ్ సరిహద్దు వరకు గల భూభాగం అంతా రోమన్ పాలనలోకి వచ్చేసింది. స్వయంగా హిజాజ్‌లోనూ యూదు పెట్టుబడిదారుల పెద్దపెద్ద కోటలు కట్టబడి ఉన్నాయి. వీరు అరబ్బులను వడ్డీ వలలో వేసి బంధించినవారు. తూర్పుతీరం ఎదురుగా గల ఆఫ్రికాలో నీగ్రో క్రైస్తవ పాలన కొనసాగుతోంది. అప్పటికి కొన్ని సంవత్సరాల క్రితమే మక్కాపై దండెత్తి వచ్చిన పాలన అది. ఆ క్రైస్తవులు, దానితో ఆర్థిక, రాజకీయ సంబంధాలు పెట్టుకున్న ఓ వర్గం ఖుద్దు హిజాజ్ మరియు యమన్‌కు మధ్య ప్రాంతమైన నజ్రాన్‌లో నివసిస్తోంది. కాని యే నాయకుణ్ణయితే అల్లాహ్ మార్గదర్శనం కోసం నియమించాడో, ఆ నాయకుడు ఈ ప్రపంచంలోనే కాకుండా స్వయంగా తన దేశంలోని ఆ అనేక సమస్యల్లో ఏ ఒక్క సమస్య వైపునకు దృష్టి మరల్చలేదు. పైగా, అల్లాహ్ తప్ప మీరు కొలుస్తున్న దేవుళ్ళందరినీ వదిలివేసి కేవలం ఆ అల్లాహ్ దాస్యాన్నే స్వీకరించండి అని ఎలుగెత్తి చాటాడు.

దేవుడు ఒక్కడు అన్నదే ప్రధాన సమస్య

ఆ నాయకుని దృష్టిలో ఇతర సమస్యలకు ఎలాంటి ప్రాధాన్యత లేదు అనిగాని లేదా వాటి గురించి ఆలోచించే అవసరమే లేదు అనిగాని అన్నది కాదు. భవిష్యత్తులో ఆయన ఆ సమస్యలన్నిటి వైపునకు దృష్టిని సారించడం జరిగింది. ఒక్కొక్కటిగా ఆ సమస్యలన్నిటిని పరిష్కరించడం కూడా జరిగింది. కాని ప్రారంభంలో ఆ సమస్యలన్నిటి నుండి దృష్టిని మరల్చి, ఇస్లామియోద్యమం దృష్టికోణంతో, మనిషి నైతిక, సామాజిక జీవితంలో ఏయే రుగ్మతలైతే తలెత్తగలవో వాటిలో ప్రధానమైన రుగ్మత మనిషి తానే సర్వస్వతంత్రునిగా, బాధ్యతారహితునిగా తలచడం. మరో విధంగా

చెప్పాలంటే, తానే దేవునిగా తయారైపోవడం. లేదా సర్వసృష్టికర్తకు బదులు మరొకరిని దేవునిగా తలచడం. ఆ మరొకరు అన్నది ఆ మానవమాత్రుడైనా, మానవేతర శక్తి అయినా సరే. ఈ భావన వేళ్ళూనుకొని ఉన్నంతమట్టుకు, ఇస్లామియ దృక్పథం ప్రకారం, పైపైకి చేసే యే సంస్కరణా వ్యక్తిగత దిశ జారుడుతనాన్ని లేదా సామాజిక రుగ్మతలను దూరం చేయడంలో సఫలీకృతం కాజాలదు. ఓ వైపు నుండి ఆ చెడును సంస్కరించుకుంటూపోతుంటే ఏదో ఒక వైపు నుండి అది తలెత్తుతూనే ఉంటుంది. కాబట్టి ఒకవేళ సంస్కరణ అనేది ప్రారంభం గనకా జరిగితే అది, ఓ వైపు మనిషి మనోమస్తిష్కాల నుండి తాను సర్వస్వతంత్రుడు అనే భావనను తొలగించి, నీవు ఏ లోకంలోనైతే శ్వాస పీలుస్తున్నావో ఆ లోకం రాజులేని సామ్రాజ్యం ఏమీ కాదు; దానికి ఓ పాలకుడు అంటూ ఉన్నాడు; అతని రాచరికం నీ గుర్తింపుపై ఆధారపడిలేదు; నీవు దాన్ని నిర్మూలించదలిస్తే నిర్మూలమయ్యేది కాదు; ఆయన సామ్రాజ్య పరిధుల నుండి ఒక్క అంగుళం కూడా బయటకు పోలేవు అన్న యదార్థాన్ని వివరించవలసి ఉంటుంది. అలాగే, ఈ తిరుగులేని సత్యం ఇలా ఉన్నప్పుడు, నీ సార్వభౌమత్వపు ధీమా ఓ పిచ్చి ఆలోచన తప్ప మరేది కాదు; దాని దుష్పరిణామాన్ని నీవు తప్పకుండా అనుభవించితీరాల్సి ఉంటుంది. కాబట్టి నీవు ఆయన సమక్షంలో తలను వంచి ఆయనకే దాసుడైపోవాలనే సత్యం నీ బుద్ధి జ్ఞానాలు కూడా ఘోషిస్తున్నాయి అనే సత్యాన్ని విడమర్చి చెప్పవలసి ఉంటుంది. ఇంకోవైపు, ఈ విశ్వం మొత్తానికి కేవలం ఒకే ఒక చక్రవర్తి, ఒకే ఒక యజమాని ఉన్నాడు; అతనే సార్వభౌమాధికారాన్ని కలిగి ఉన్నాడు; ఇతరులకు ఇక్కడ తమ హుకుం చెలాయించే హక్కు యే మాత్రం లేదు; మరెవ్వరి హుకుం కూడా ఇక్కడ నడవదు. కాబట్టి నీవు ఆయనకు కాకుండా మరెవరి దాస్యాన్ని స్వీకరించకు, మరెవరి ఎదుట నీ తలను వంచకు. ఇక్కడ 'మెజెస్టీ' ఎవ్వడూ లేడు; మెజెస్టీతనం ఆయన ఒక్కనికే పరిమితం; ఇక్కడ మరెవ్వరి హిజ్ హోలీనెస్ కాలేరు. హోలీనెస్ పూర్తిగా ఆయనకే పరిమితం. ఇక్కడు మరెవ్వరూ హిజ్ హైనెస్‌కాడు. 'హిజ్‌హైనెస్' కేవలం ఆయన ఒక్కనికే. ఇక్కడ ఎవ్వరూ 'హిజ్ లార్డ్‌షిప్' కాడు, హిజ్ లార్డ్‌షిప్ పూర్తిగా ఆయనలోని భాగమే. ఇక్కడ ఎవ్వరూ శాసన నిర్మాతగాడు. శాశనాంగం పూర్తిగా ఆయనదే. ఆయన ఒక్కడే శాసనం చేయడానికి అర్హుడు. ఇక్కడ యే సర్కారు (ప్రభుత్వం)గాని, యే అన్నదాతగాని, మరే రాజు, మహారాజుగాని, యే వలీ లేదా కష్టాలను గట్టెక్కించేవాడుగాని, మొరలాలకించేవాడుగాని, ఆదుకునే వాడుగాని లేరు. ఎవరివద్దా అధికారపు తాళాలు లేవు. ఎవరూ ఒకరికంటే మరొకరు అధికులుకారు. భూమి నుండి ఆకాశం వరకు అందరూ దాసులే. యజమాని కేవలం ఒక్కడే ఒక్కడు. కాబట్టి నీవు ప్రతి దాస్యాన్ని, ప్రతి విధేయతను, ప్రతి కట్టుబాటును నిరాకరించు. కేవలం ఆయన ఒక్కనికే దాసుడవు, విధేయుడవు, ఆదేశపాలకుడవు అయిపో అని బోధించవలసి ఉంటుంది.

ఈ సంస్కరణలన్నిటికి మూలం ఈ భావాలే. వ్యక్తిగత అలవాట్లను మరియు సామాజిక వ్యవస్థ పూర్తి కట్టడాన్ని పడగొట్టి ఈ పునాదులపైన్నే సరిక్రొత్త కట్టడ నిర్మాణ కార్యక్రమం చేబూనడం జరుగుతుంది. ఆదం (అ) నుండి ఇప్పటి వరకు ఉద్భవించిన మానవజీవితపు సమస్యలన్నీ, ఇక ప్రళయం వరకు రాబోయే వారి సమస్యలన్నీను, ఈ పునాదులపైన్నే ఓ క్రొత్త పంథాలో పరిష్కరించబడగలవు.

ఏకేశ్వరవాదం తప్ప తక్కిన వాటి నుండి దృష్టి మరల్చడం

దైవప్రవక్త ముహమ్మద్ (స) వారు ఎలాంటి ముందస్తు తయారీ లేకుండానే, ఎలాంటి ప్రారంభ కార్యాన్ని చేబట్టకుండానే ఈ మౌలిక సంస్కరణను ప్రారంభించేశారు. ఆయన ఈ సందేశ ప్రచార గమ్యాన్ని చేరుకోవడానికి, మొదట ఏవో రాజకీయ మరియు సామాజికమైన పనులు చేసి ప్రజల్లో ప్రాచుర్యం పొంది ఆ ప్రభావం ద్వారా ప్రజలను లోబరుచుకొని ఈ స్థానం వరకు తీసుకురావడానికి అర్థం పర్థంలేని అడ్డ దిడ్డమైన మార్గాలను ఎంచుకోవడం జరగలేదు. అక్కడ జరిగిందల్లా ఓ వ్యక్తి నిలబడి, నిలబడగానే 'లా ఇలాహ ఇల్లల్లాహ్'అనే సద్వచనాన్ని ప్రకటించడం మనం చూశాం. అంతకంటే తక్కువగా మరే విషయం మీద ఆయన దృష్టి నిలువలేదు. దీనికి కారణం దైవదౌత్యపు తెగింపు మరియు సందేశ ప్రచార ఉద్రేకమే కాదు, అసలు ఇస్లామీ యోద్యమ కార్యాచరణ విధానం కూడా అదే- అధికారం ద్వారా లేదా ఇతర మార్గాల ద్వారా సంపాదించిన పలుకుబడి, ప్రభావాలు ఈ సంస్కరణోద్యమ మార్గంలో ఏ మాత్రం సహాయబడజాలవు. ఎవరైతే లా ఇలాహ ఇల్లల్లాహ్ తప్ప మరే పునాదులపై మీ వెంట వస్తారో వారు ఈ పునాదిపై నవనిర్మాణ కార్యంలో మీకు ఏ విధంగానూ సహకరించలేరు. ఈ కార్యంలో మీకు పనికి వచ్చేవారు, లా ఇలాహ ఇల్లల్లాహ్ పిలుపును విని మాత్రమే మీ వైపునకు వచ్చేవారు. ఈ నినాదంలోనే వారికి ఆకర్షణ ఉంటుంది. ఈ యదార్థాన్నే వారు వారి జీవన పరమార్థంగా చేసుకున్నవారు, ఆ మూల సూత్రాధారం మీదనే పనిజేయడానికి నడుము బిగించారు. కాబట్టి ఇస్లామీ ఉద్యమాన్ని నడపడానికి ఓ ప్రత్యేకమైన ఆలోచన, కార్యాచరణ అవసర ముంటుంది. ఎలాంటి ఉపోద్ఘాతం లేకుండానే ఆ కార్య ప్రారంభం దైవ ఏకత్వభావ ప్రకటనతోనే ప్రారంభించడం దీని ఉద్దేశ్యం.

దైవ ఏకత్వం - జీవన పరమార్థం

ఈ దైవ ఏకత్వ భావనలో నేనిప్పుడు చెప్పినట్లుగా కేవలం ఓ ధార్మిక విశ్వాసమే కాకుండా, ఇందులో మానవుని సార్వభౌమత్వం లేదా దైవేతరుల దైవత్వం మరియు వారి అధికార దురహంకారపు యే విషయం అయితే దాగుందో అది కూకటి వ్రేళ్ళతో పెకిలించబడే భావం ఇందులో దాగుంది. నేడు ప్రపంచంలో 'అష్హదుఅల్లా ఇలాహ ఇల్లల్లాహ్' అని మీరు నినదించిన వెంటనే ఆ పిలుపును శ్రావ్యమైన పిలుపుగా

అలకించే వైఖరి వారిలో అగుపడదు. అలాగే అలా పిలిచేవాడు, నేను ఏ విషయం వైపునకు పిలుస్తున్నాను అని తెలుసుకొని పిలువడంగాని, వినేవారిలో దాని అర్థం ఏమిటో తెలుసుకునే ఆసక్తిగాని ఉండదు. కాని అదే, ఆ పిలుపు ఉద్దేశ్యం ఏమిటి? పిలుపునిచ్చే వాడు పూర్తి స్పృహతో తాను నాకు ఎలాంటి ప్రభువుగాని పాలకుడుగాని లేడు; నేను ఏ పాలననూ గుర్తించను, ఏ చట్టాన్నీ స్వీకరించను, మరే న్యాయస్థానాల తీర్పును నేను ఖాతరుచేయను, ఎవ్వరి ఆదేశం నాకు శిరోధార్యం కాదు, ఏ ఒక్కరి ప్రత్యేక హక్కులు, మరెవ్వరి సామ్రాజ్యం, ఇంకెవరి గౌరవోన్నతులు, అధికారాలను నేనొప్పు కోను, కేవలం అల్లాహ్ తప్ప అందరి పట్ల నేను తిరుగుబాటు బావుటాను ఎగురవేస్తున్నాను అని ప్రకటిస్తే, ఆ ప్రకటనను ఎక్కడైనా, మరెవరైనా తేలిగ్గా తీసుకోలేరు. మీరు ఎవరితో పోరుకు వెళ్ళినా వెళ్ళకపోయినా ప్రపంచం అంతా కట్టకట్టుకొని మీతో పోరుకు సమాయత్తమౌతుంది. ఈ నినాదం మీనోటి నుండి బయటకురాగానే, ఒక్కసారే ఈ భూమ్యాకాశాలు మీకు శత్రువులైపోయాయా అని అనిపిస్తుంది. నలువైపుల నుండి పాములు, జెర్రులు, తేళ్ళూ క్రూరమృగాలు మీపైకి వాడికి దిగుతున్నాయా అని అనిపిస్తుంది.

దైవ ఏకత్వానికి సంబంధించిన సంఘర్షణ

ఇల్లాంటి పరిస్థితే, దైవప్రవక్త ముహమ్మద్ (స) వారు ఏకేశ్వరవాద ప్రకటన చేసినప్పుడు తారసపడింది. పిలుపునిచ్చేవాడు తాను ఏ విషయం వైపునకు పిలుస్తున్నాను అని తెలుసుకొనే పిలిచాడు. వినేవారు కూడా ఆయన పిలుపులోని సారాంశం ఏదో తెలుసుకున్నారు. అందుకే ఆయన ఏ యే విధంగా పిలిచినా ఆ పిలుపుపై వ్రేటుపడుతూపోయింది. వారు ఈ పిలుపును అణచడానికి సిద్ధపడి లేచారు. పూజారులకు తమ పౌరోహిత్యం, పోపత్వంలో ప్రమాద ఘంటికలు వినబడ్డాయి. ధనవంతులకు తమ పెత్తనంలోను, వ్యాపారస్తులకు తమ వ్యాపారంలోను, జాతీయ వాదులకు తమ జాతీయవాదంలోను, సాంతతికవాదుల్లో తమ సంతతి ఔన్నత్యం లోను, తాతముత్తాత సంప్రదాయాన్ని పట్టుకొని వ్రేళ్ళాడేవారికి వారి సంప్రదాయాల్లోను, ఒక్కటేమిటి ప్రతి రకపు మనిషికి తాను ప్రతిష్ఠించుకున్న సిద్ధాంత విగ్రహం ఎక్కడ తునాతునకలైపోతుందో అనే బెంగపట్టుకుంది. అందుకని 'అల్ కుఫ్ర్ మిల్లతున్ వాహిదా' (దైవధిక్కారులంతా ఒకే సమాజం)గా తయారై, పరస్పరం వారిలోవున్న కీచులాటలను మరిచి ఓ క్రొత్త స్ఫూర్తితో ఆయనతో తలపడడానికి సిద్ధమైపోయారు. ఈ పరిస్థితిలో, నిష్కల్మషమైన ఆలోచనలు గలవారు, యదార్థాన్ని అర్థం చేసుకొని దాన్ని గుర్తించే శక్తిగలవారు, ఓ విషయం సత్యమని గ్రహించి, దాని కోసం అగ్నిలో దుమకడానికి కూడా, ప్రాణాలతో చెలగాటమాడడానికి కూడా సిద్ధంగా ఉన్నవారు మాత్రమే ఆయన వైపుకు వచ్చారు. ఈ ఉద్యమానికి అలాంటి వారి అవసరమే

ఉండింది. వారు ఒక్కొక్కరుగా, ఇద్దరిద్దరుగా, నలుగురునలుగురుగా ఆ పిలుపు వైపుకు రానారంభించారు. అలా సంఘర్షణ పెరుగుతూ పోయింది. కొందరు ఉపాధి కోల్పోగా, మరికొందరిని వారి ఇంటివారు ఇంటి నుండి తరిమేయడం జరిగింది. కొందరు బంధుమిత్రులకు దురమైపోయారు. కొందరు దండించబడ్డారు. మరికొందరిని ఖైదు చేయడం జరిగింది. కొందరిని ఎండకు వేడెక్కిన ఇసుకపై వేసి ఈడ్చడం జరగగా మరికొందరిని నడిబజారులో రాళ్ళతో కొట్టడం, తిట్టడం జరిగింది. కొందరికి స్త్రీ, ధన, అధికారం ఆస్తి వగైరాల ఆశలు చూపి కొనే ప్రయత్నం చేయడం జరిగింది. ఇలాంటి పరిస్థితులన్నీ ఎదురైనవే. అవి తప్పక వచ్చేవి కూడాను. అవి లేకుండా ఇస్లామియోద్యమానికి స్థిరత్వం సిద్ధించడంగాని, అది పెరగడంగాని జరిగే విషయం కాదు.

పరీక్షలన్నీ సుశీల మూర్తిత్వ నిర్మాణం కోసమే

వీటివల్ల ఒనగూడే మొదటి ప్రయోజనం ఏమిటంటే, నాశిరకపు అపరిపక్వపు నడవడి మరియు బలహీనమైన అభిప్రాయాలు గలవారు దాని వైపునకు మొగ్గుచూపే ధైర్యమే చేయలేరు. అటువైపుకు మొగ్గుజూపే ప్రతివాడు మానవ జాతిలోనే అత్యుత్తమమైనవాడు.అతడే దానికి అవసరం కూడాను. మరో విధంగా, ఆ వచ్చినవాడు ఈ పరీక్షల కొలిమి నుండి బయటకు వచ్చినవాడై ఉండాలి. ఆ పనికిమాలినవారి నుండి ఆ వ్యక్తిని ఏరి ఎంపిక చేయడంలో ఇంతకంటే మరో మార్గం కూడా లేదు. ఇక వచ్చిన వారు కూడా, తమ సొంత ప్రయోజనం కోసమో లేదా మరే కౌటుంబిక, జాతీయ లక్ష్యాలను సాధించడానికోసమో ఆ పరీక్షలను ఎదుర్కోలేదు. పైగా వారంతా సత్యం కోసం, దైవం మరియు ఆయన ప్రసన్నత కోసం ఈ ఉద్యమంలో వచ్చి చేరినవారు. ఆ లక్ష్యం కోసమే హింసించబడ్డారు, దానికోసమే పస్తులున్నారు, దాని కోసమే సమస్త మోసాలకు గురయ్యారు. దీని ఫలితంగా వారిలో అవసరమైన ఇస్లామీ ఆలోచనలు రేకెత్తాయి. స్వచ్ఛమైన ఇస్లామీ క్యారెక్టరు వారిలో చోటుచేసుకుంది. అలాగే, వారి దైవారాధనలో చిత్తశుద్ధి రావడం మరియు అది వికసించడమూ జరిగింది. ప్రచండమైన ఈ శిక్షణశాలలో ఇస్లామీ భావాలు చోటుచేసుకోవడం సహజ పరిణామమే. ఏ వ్యక్తి అయినా ఓ లక్ష్య సాధన కోసం నడుం బిగిస్తే అతని మార్గంలో సంఘర్షణ, కష్టాలు, బాధలు, మనోవేదన, దండన, ఖైదు, పస్తులు, దేశ బహిష్కరణలు వగైరాలన్నీ ఎదురౌతాయి. అప్పుడా వ్యక్తి మనోమస్తిష్కాలపై అతని సొంత అనుభవం కారణంగా దాని బాగోగుల ముద్రపడుతుంది. అతను నిలువెల్లా ఓ ధ్యేయంగా మారిపోతాడు. ఈ పరిపూర్ణతా సాధనకు సహకారిగా ఉండేందుకు అతనిపై 'నమాజు' విధిగా చేయబడింది. అతని దృష్టిలోని చంచలత్వాన్ని దూరం చేసి తన లక్ష్యం పైన్నే దృష్టిని నిలిపేందుకు గోహదపడుతుంది నమాజు. ఏ శక్తినైతే వారు పాలకునిగా

విశ్వసిస్తున్నారో ఆయన సార్వభౌమత్వాన్ని పదేపదే ప్రకటిస్తూ తమ విశ్వాసంపై దృఢంగా నిలబడగలుగుతారు. ఆయన ఆదేశం మేరకే వారిప్పుడు ప్రపంచంలో కార్యోన్ముఖులు కావలసి ఉంది. ఆయన 'ఆలిముల్గైబ్ వష్షహాదా' (ప్రత్యక్ష మరియు పరోక్ష జ్ఞానం కలిగిన వాడు) కావడం, 'మాలికి యౌమిద్దీన్' (తీర్పు దినపు యజమాని) కావడం, 'ఖాహిరున్ ఫౌఖ ఇబాదిహీ' (తన దాసులపై సర్వాధికారాలుగలవాడు) కావడం అనే విషయం వారికి పూర్తిగా అవగతం అయిపోతుంది. ఎట్టి పరిస్థితిలోనూ ఆయన విధేయత తప్ప ఇతరుల విధేయత లేదు అనే బలమైన నమ్మకం వారి హృదయాల్లో నాటుకుపోతుంది. దానికి విరుద్ధమైన ఆలోచన యేది వారి మనస్సులో రాకూడదు.

సత్యాన్ని గుర్తించేందుకే ఈ పరీక్షలు

వచ్చేవారికి ఓ వైపు ఇలా శిక్షణ జరుగుతూ వుంటే, మరోవైపు ఈ సంఘర్షణ వల్ల ఇస్లామీ ఉద్యమం వ్యాపిస్తూ ఉండింది. కొందరు హింసలకు గురికావడం, ఖైదు చేయబడడం, ఇండ్లనుండి గెంటివేయబడడం చూసిన ప్రజలకు, ఇదంతా ఎందుకు జరుగుతోంది అనే సత్యాన్ని గ్రహించే జిజ్ఞాస తానంతట అదే పుట్టుకు రానారంభిం చింది. ఇదంతా ఏదో భూమి కోసమో, ధనం కోసమో లేదా మహిళల కోసమో, లేదా సొంత ప్రయోజనం కోసం జరిగే సంఘర్షణ కాదు, ఈ దైవదాసులు ఏదో సత్యాన్ని కనుగొన్నారని తెలుసుకొన్నవారికి ఆ సత్యమేదో తెలుసుకోవాలన్న తపన దానంతట అదే వారి మనస్సుల్లో మెదలనారంభించింది. వీరు ఇన్ని కష్టాలను కడగండ్లను సైతం ఎదుర్కొని మేరుపర్వతంలా ఎందుకు సహిస్తున్నారనే భావన వారిలో కలిగింది. కేవలం లా ఇలాహ ఇల్లల్లాహ్ను నినదించడం మరియు దాని ద్వారా మానవ జీవితంలో ఇలాంటి విప్లవం పొడసూపడం, పొడసూపడమే కాదు ఆ నినాదం వైపుకు ఆహ్వానించే వారు కేవలం యదార్థం మరియు సత్యం కోసం తమ ప్రాపంచిక ప్రయోజనాలన్నిటిని పణంగా పెట్టి ధన ప్రాణాలను, ప్రతి వస్తువును సైతం త్యాగం చేస్తున్నారని తెలుసుకోగానే ఆశ్చర్యచకితులైపోతున్నారు. వారి హృదయాలపై పడివున్న చీకటి పొరలన్నీ చిరిగిపోతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ సత్యం అనే బాణం వారి మనో ఫలకంపై సూటిగా వచ్చి నాటుకుపోతుంది. ఈ కారణంగానే, ఎవరికైతే తమ సొంత అంతస్తు, హోదాలకు గర్వపడ్డారో, మరెవరైతే తమ తాత ముత్తాతల అజ్ఞాన సంప్రదాయం లేదా ప్రాపంచిక సుఖభోగాలకు అంధులై ప్రవర్తించారో వారి తప్ప మిగతా వారంతా ఈ ఉద్యమం వైపుకు ఆకర్షింపబడుతూ వచ్చారు. ఒకరు వెంటనే అటువైపుకు ఆకర్షించబడితే మరొకరు ఈ ఆకర్షణలో బడకుండా కొంతకాలం పెనుగులాడారు. ఎలాగైతేనేమి ప్రతి సత్యపిపాసి, ప్రతి నిస్వార్థపరుడు దీనివైపునకు ఆకర్షింపబడక తప్పలేదు.

ఈ సందర్భంలో ఆ ఉద్యమ నాయకుడు, తన వ్యక్తిగత జీవితం మరియు యే ధ్యేయం కోసం ఈ ఉద్యమం ఊపిరిపోసుకుందో ఆ ఉద్యమ సిద్ధాంతాలను

పరిపూర్ణంగా ప్రదర్శించి చూపడం జరిగింది. ఆయన ప్రతిమాట, ప్రతి కదలికలో ఇస్లామ్ ధర్మపు యదార్థత బహిర్గతమైంది. దాని ద్వారా ఇస్లామ్ అంటే ఏమిటో ప్రతి ఒక్కడు అర్థం చేసుకోగలిగాడు. ఈ చర్చ కోసం ఎంతో వివరణ అవసరం. అయితే ఇక్కడ అది సాధ్యం కాదు కాని టూకీగా కొన్ని విషయాలను మాత్రం ఇక్కడ చెప్ప దలిచాను.

ఉద్యమ నాయకుని త్యాగనిరతి

ఆయన (స) వారి సతీమణి హజ్రత్ ఖదీజా(ర)వారు హిజాజ్‌లో కెల్లా ధనవంతు రాలైన మహిళ. ఆయన ఆమె పెట్టుబడితోనే వ్యాపారం చేసేవారు. ఇస్లామ్ ధర్మ ప్రచారం ప్రారంభమైనప్పుడు దైవప్రవక్త (స) గారి వ్యాపారం పూర్తిగా ఆగిపోయింది. ఎందుకంటే ఆయన ధర్మప్రచారంలో నిమగ్నం కావడం, మొత్తం అరేబియాకే శత్రువుగా మారిపోవడం వలన ఈ వ్యాపారం ఎలా సాగుతుంది మరి? ఇదివరకు సంపాదించిన సంపదనంతా భార్యాభర్తలిద్దరు కలిసి ఈ ఉద్యమాన్ని నడపడానికి కొన్ని సంవత్సరాల్లోనే వెచ్చించడం జరిగిపోయింది. చివరికి, దైవప్రవక్త (స) ధర్మ్ర పచారం కోసం 'తాయెఫ్'కు వెళ్ళినప్పుడు, అరేబియాలోనే వ్యాపార సామ్రాట్టుగా పలుకుబడి సంపాదించిన దైవప్రవక్తకు ప్రయాణించడానికి ఓ కంచరగాడిద కూడా కరువైపోయింది.

ఖురైషీయులు ఆయన (స)కు "మీరు గనుక మీ ఉద్యమాన్ని వదులుకుంటే హిజాజ్ పాలనా సింహాసనాన్ని మీకు కట్టబెడ్తాము, మిమ్మల్ని మా రాజుగా చేసు కుంటాము, అరేబియాలోనే అందగత్తె అయిన స్త్రీనిచ్చి మీ వివాహం చేస్తాము, ధన సంపదను మీ కాళ్ళ దగ్గర గుట్టగా పోస్తాము" అని ఆశచూపడం జరిగింది. కాని ఏవ్యక్తి అయితే సంస్కరణార్థం నడుము బిగించాడో ఆ వ్యక్తి (స) ఆ ఆశలన్నిటిని కాలదన్ని, రౌడీల రాళ్ళదెబ్బలు, తిట్లను తినడానికే సిద్ధమయ్యాడు.

సమానత్వం

ఖురైష్‌కు చెందిన అరబ్బు సర్దారులు ఆయనతో, "ముహమ్మద్ (స)! మీరు కూర్చునేచోట, మీ సభల్లో ఎల్లవేళలా బానిసలు, దరిద్రులు, నీచులు (దైవం క్షమించు గాక) వచ్చి కూర్చుంటూ ఉండగా మేమెలా వచ్చి కూర్చోము? మనలోని అతి నీచ జాతికి చెందిన వారిని నీవు నీచుట్టూ కూర్చోబెట్టుకుంటున్నావు. వారిని అక్కడి నుండి తరిమేస్తేగాని మేము నీ వద్దకు వచ్చేదిలేదు" అని అనగా, ఏ వ్యక్తి అయితే మానవుల్లోని నిమ్నోన్నతాలను సమంచేయడానికి వచ్చాడో, ఆయన ధన వంతులకోసం నిరుపేదల్ని ధిక్కరించడాన్ని నిరాకరించాడు.

మానవ శ్రేయం కోసం ఇచ్చిన పిలుపు

తమ ఉద్యమం కోసం దైవప్రవక్త (స), తన దేశం, తన జాతి, తన కుటుంబం తన తెగకు సంబంధించిన ఏ ప్రయోజనాన్ని కూడా లెక్కచేయలేదు. ఆ ఒక్క విషయమే ప్రపంచానికి, ఆయన నిజంగానే మానవశ్రేయం కోసమే నడుముబిగించారనే సత్యాన్ని చాటిచెప్పింది. ఆ పిలుపే ప్రతి జాతి ప్రజలను ఆయన వైపుకు ఆకర్షించింది. ఒకవేళ ఆయన (స) తన కుటుంబం గురించే ఆలోచిస్తే, హాషిమీలకు ఆయన ఆలోచనలో ఆసక్తి ఎలా కలిగేది? ఒకవేళ ఖురైష్ పాలనాధికారాన్ని ఏదో ఒక విధంగా చేజిక్కించుకోవాలని తహతహలాడినట్లయితే, ఖురైషీయేతర అరబ్బులు ఈ కార్యంలో పాలుపంచుకొనే అవసరం ఎందుకొచ్చేది? ఒకవేళ ఆయన (స) అరబ్బుల ఔన్నత్యానికే కృషి చేసి ఉంటే, అబిసీనియాకు చెందిన నీగ్రో బానిస అయిన బిలాల్ (ర) రోముకు చెందిన సుహైబ్ (ర)మరియు పర్షియాకు చెందిన సల్మాన్ (ర)లు ఈ కార్యంలో ఆయనకు సహకరించడానికి ఎందుకు ముందుకొచ్చేవారు? ఏ విషయమైతే వారందరినీ ఆయన వైపునకు ఆకర్షించిందో అది స్వచ్ఛమైన దైవదాస్యం. అది కూడ ప్రతి స్వార్థం మరియు కౌటుంబిక, జాతీయ స్వదేశీయ ప్రయోజనాలకు అతీతమైనది.

సత్యసంధత - అమానతుల అప్పగింత

దైవప్రవక్త (స) మక్కా నుండి హిజ్రత్ చేయవలసి వచ్చినప్పుడు ఆయన శత్రువులు ఆయన వద్ద అమానతుగా ఉంచిన సొమ్ములను హజ్రత్ అలి (ర)గారికి అప్పజెబుతూ నేను వెళ్ళిపోయిన తరువాత ఈ అమానతులను ఫలానా, ఫలానా వారికి అప్పగించాలి అని చెప్పి మరీ బయలుదేరారు. భౌతికవాదులు ఇలాంటి సమయాల్లో తమకు దక్కిందేచాలని వాటిని తీసుకొని ఉడాయించడం కద్దు. కాని ఓ దైవవిశ్వాసి ఇలాంటి సందర్భాల్లో, తన ప్రాణాలను సైతం హరించడానికి సిద్ధంగా ఉన్న శత్రువులు, రక్తపిపాసుల సొమ్ములను కూడా వారికి అప్పజెప్పే ప్రయత్నం చేశాడు. తనను హత్యచేస్తారనే నిర్ణయం గైకొన్న శత్రువులకు కూడా. ఈ నైతికతను, సత్యసంధతను చూసిన అరేబియా ప్రజలు కూడా ఆశ్చర్యచకితులయ్యారు. రెండేళ్ళ తరువాత జరిగిన బద్ర్ యుద్ధంలో వారు దైవప్రవక్త (స)కు విరుద్ధంగా రణరంగంలో నిలుచున్నప్పుడు, ఏమిటీ! మనం ఎవరితో తలపడడానికి ఇక్కడికి వచ్చినట్లు? బలిపీఠం నుండి వెళ్ళిపోయేటప్పుడు కూడా మానవ హక్కులను మరువని ఆ దైవదూతల గుణగణాలుగల వ్యక్తిని సంహరించడానికా మనం వచ్చింది? అనే ప్రశ్నలు వారి మదిలో మెదులుతూ ఉండవచ్చు. ఆ సమయంలో వారి చేతులు మంకు పట్టుకోసమే పోరాడుతున్నప్పటికీ వారి హృదయాలు మాత్రం లోలోపలే పీడనకు గురి అవుతూ ఉండవచ్చు. బద్ర్ యుద్ధంలో దైవధిక్కారుల అపజయానికి కారణభూతమైన నైతిక కారణాల్లో ఇది కూడా ఒకటై ఉండవచ్చు.

ఇస్లామీయ జీవనసరళిని ప్రదర్శించడం

పదమూడు సంవత్సరాల తీవ్ర సంఘర్షణ అనంతరం, మదీనాలో ఓ చిన్న రాజ్యాన్ని స్థాపించే అవకాశం ఏర్పడింది. అప్పుడు రెండువందల యాభై లేదా మూడొందలలోపు సంఖ్యలో ఉండి ప్రతి వ్యక్తి ఇస్లామ్ ధర్మశిక్షణ పొంది ఓ ముస్లిమ్‌గా పనిజేసే సామర్థ్యం పొందగలిగాడు. ఇప్పుడు వీరే ఇస్లామీయ స్టేటును (రాజ్యాన్ని) నడపడానికి సిద్ధంగా ఉన్నారు. కాబట్టి ఇస్లామీయ సామ్రాజ్యం నెలకొల్పడం జరిగింది. పదేళ్ళ వరకు మహాప్రవక్త (స) ఆ రాజ్యానికి మార్గదర్శకంగా నిలిచారు. ఈ అనతికాలంలోనే వారికి ప్రతి పాలనారంగాన్ని ఇస్లామీయ సరళిపై నడిపే సంపూర్ణ శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ కాలం ఇస్లామీయ అయిడియాలజీ ఏకైక భావన నుండి పైకి ఎదిగి ఓ సంపూర్ణ నాగరిక వ్యవస్థగా రూపుదాల్చిన కాలం. ఇందులో పాలన, విద్య, న్యాయపాలక, ఆర్థిక, సామాజిక, సైనిక మరియు అంతర్జాతీయ పాలసీల ఒక్కో పార్శ్వం బహిర్గతం అయింది. ప్రతి జీవన రంగానికి అవసరమైన చట్టాలు చేయబడ్డాయి. ఈ చట్టాలను అమలుపర్చడమూ జరిగింది. ఈ ప్రత్యేక రీతిలో పనిజేసే కార్యకర్తలు పూర్తిగా శిక్షణ మరియు కార్యాచరణానుభావం ద్వారా తయారుచేయబడ్డవారే. వీరు, ఎనిమిది ఏళ్ళ అతి తక్కువ కాలంలోనే మదీనా లాంటి ఓ చిన్న టౌను రాజ్యాన్ని మొత్తం అరబ్బు సామ్రాజ్యంగా మార్చే పాలనా వ్యవస్థగా మార్చివేశారు. ఇస్లామ్ ధర్మంలోనికి వచ్చి చేరే ప్రతి వ్యక్తి, ఈ వ్యవస్థ పని తీరును, దాని సత్ఫలితాలను చూసి, నిజంగానే మానవత్వం అంటే ఇదే, మానవశ్రేయం ఇందులోనే దాగుంది అని తన్మయత్వం చెందేవాడు. ఇస్లామ్ ధర్మంతో బద్ధవిరోధం పెంచుకున్నవారు సైతం దీన్ని ఒప్పుకొని ఈ పంథానే అనుసరించవలసి వచ్చింది. ఇస్లామ్‌కు విరుద్ధంగా సంవత్సరాల తరబడి పోరాడిన ఖాలిద్ బిన్ వలీద్ (ర), అబూజహెల్ కుమారుడు ఇక్రమా (ర), అబూసుఫ్‌యాన్, హజ్రత్ హమ్జా (ర)ను హతమార్చిన వహ్‌షీ (ర), కాలేయాన్ని నమిలిన హింద్ కూడా దీన్ని ఒప్పుకొని ఈ సత్యం ముందు తలవంచక తప్పలేదు.

రక్తపాత రహిత విప్లవం

పొరపాటున చరిత్రకారులు గజ్వాత్ (పోరాటాలు)ను అతిగొప్పగా చిత్రీకరించడం వలన ప్రజలు, అరేబియాకు చెందిన ఈ విప్లవం యుద్ధాల ద్వారా సాధ్యమైంది అని భావిస్తున్నారు. నిజం చెప్పాలంటే, అయిదేళ్ళలో జరిగిన పోరాటాల వలన అరబ్బుల్లాంటి యుద్ధపిపాస జాతి అదుపులోనికి రాగలిగింది. ఇరువర్గాలకు చెందినవారి ప్రాణనష్టం వేయి లేదా పన్నెండు వందలకంటే పెరగలేదు. విప్లవ చరిత్రే గనక మీ దృష్టిలో ఉండి ఉన్నట్లయితే, ఈ విప్లవం రక్తపాత రహిత విప్లవం అనబడడానికి పూర్తిగా అర్హమైనదని మీరు ఒప్పుకోగలరు.

అదేకాదు ఈ విప్లవంలో కేవలం దేశ పాలనా వ్యవస్థే మారిపోలేదు, ఆలోచనా విధానాలు కూడా మారిపోయాయి. దృష్టికోణం మారిపోయింది. జీవన విధానం మారిపోయింది. నైతికతాలోకమే మారిపోయింది. అలవాట్లు, గుణగణాలే మారి పోయాయి. మొత్తానికి జాతి మొత్తమే మారిపోయింది.

సిద్ధాంతాలకు అనుగుణంగా మానవుడు

వ్యభిచారులు స్త్రీల మానానికి సంరక్షులైపోయారు. సారాయికి దాసులైపోయిన వారు మత్తుపానీయ నిషేధ ధ్వజవాహకులుగా మారిపోయారు. దొంగలు, దోపిడీగాళ్ళ నీతినిజాయితీ ఎంత వికసించిందంటే, స్నేహితుల ఇంట భోజనం చేసేటప్పుడు కూడా ఆ వంటకాల్లో ఎక్కడైనా అన్యాయంగా సంపాదించిన సొమ్ము మిళితం కాలేదు గదా! అనే మీమాంసలోపడి ఆ భోజనం తినడానికి కూడా జంకడం జరిగింది. చివరికి దివ్యఖుర్‌ఆన్ ఖుద్దుగా, అలా బంధు మిత్రుల ఇంట భోజనం చేయడం తప్పుకాదని ఆదేశాలు జారీ చేయడం జరగనంతవరకు భయపడుతూనే ఉన్నారు. స్వయంగా దోపిడీలు చేసే దొంగలుసైతం ఎంత ధార్మికులుగా మారిపోయారంటే, ఇరాన్ సామ్రాజ్యం జయించబడినప్పుడు, ఓ మామూలు సిపాయికి కోట్లాది రూపాయల రాచకిరీటం చేతికి చిక్కింది. అతను రాత్రి చీకటిలో తన అతుకులు వేయబడిన గొంగళిలో దాచుకొని, ఎవరైనా చూస్తే తన నిజాయితీ బయటపడిపోతుందనే భయంతో సైన్యాధ్యక్షుని చేతికి గప్‌చిప్పుగా అందించాడు. ఎవరి దృష్టిలో మానవ జీవితానికి ఏ మాత్రం విలువలేకుండా ఉండిందో, మరెవరైతే తమ కుమార్తెలను స్వహస్తాలతో సజీవంగా పూడ్చిపెట్టేవారో, వారిలో మానవ జీవితం విలువ ఎంత పెరిగిపోయిందంటే, ఏ పక్షినైనా నిర్దాక్షిణ్యంగా చంపడాన్ని కూడా సహించేవారుకాదు.

నీతి నిజాయితీ అనేది ఏ కోశానా కూడా లేనివారి నీతినిజాయితీలు ఎలా మారి పోయాయంటే, ఖైబర్ సంధి కుదిరిన తరువాత వారి రెవెన్యూ అధికారి ఒకరు యూదుల నుండి ప్రభుత్వ పన్ను వసూలుచేయడానికి వెళ్ళినప్పుడు, ప్రభుత్వానికి కట్టే డబ్బులో ఏదైనా తగ్గించమని ఓ పెద్ద మొత్తాన్ని అతనికి లంచం రూపంగా ఇవ్వజూపబడింది. కాని అతను ఆ లంచాన్ని నిరాకరిస్తూ, యూదుల నడుమ పంటలో చెరిసగం చేసి దాన్ని వారి ముందు కుప్పగా పోసి వారు దానిలో దేన్నైనా తీసుకునే అవకాశాన్ని కలిగించాడు. ఈ క్రొత్త రకం తహసీలుదారు వైఖరిని చూసిన యూదులు ఆశ్చర్యానికి గురయ్యారు. వారి నోట అనుకోకుండా, 'ఈ న్యాయం మీదనే ఈ భూమ్యాకాశాలు నిలబడి ఉన్నాయి" అనే మాటలు అన్నారు. వారిలో ఉద్భ వించిన గవర్నర్లు గవర్నమెంటు హౌస్సులో నివాసం ఏర్పర్చుకోకుండా ప్రజల నడుమే సామాన్య ప్రజలు నివసించే ఇండ్లలోనే ఉండేవారు. బజార్లలో కాలినడకన తిరిగేవారు. వారి గుమ్మాల వద్ద ఏ కాపలాదారు కూడా ఉండేవాడుకాదు. రాత్రి అనకా పగలనకా ఏ సమయంలోనైనా, ఏ వ్యక్తి అయినా సరే వారితో ఇంటర్వ్యూ చేయగలిగేవాడు.

వారిలోనే ఉద్భవించిన ఖాజీలు (న్యాయనిర్ణేతలు) ఒకరు, ఓ యూదునికి వ్యతిరేకంగా ఖుద్దు ఖలీఫాయే కేసు బెట్టినప్పుడు ఆ ఖాజీ అతని కేసును, సాక్ష్యంగా ఖలీఫా తన బానిస మరియు తన కుమారుడి తప్ప మరే సాక్ష్యాన్ని ప్రవేశపెట్టలేదనే నెపంతో కొట్టివేయడం జరిగింది. వారిలో పుట్టిన సైన్యాధ్యక్షుల్లో ఒకరు యుద్ధ సందర్భంలో ఓ నగరాన్ని ఖాళీ చేయాల్సి వచ్చింది. అక్కడ ముస్లిమేతరుల నుండి తీసుకున్న జిజియా పన్నును వెనక్కు ఇచ్చివేస్తూ అతను, 'ఇక మేము మీ సంరక్షణను చేబట్టలేము, మీరు ఏ టాక్సు అయితే మీ సంరక్షణ కోసం మాకు ఇవ్వడం జరిగిందో దాన్ని మాదగ్గర ఉంచుకునే హక్కు మాకు లేదు' అని చెప్పడమూ జరిగింది. అలాగే వారిలో పుట్టిన దౌత్యాధికారుల్లో ఒకరు, ఇరాన్ సైన్యాధ్యక్షులు, సర్వసేనాధిపతులతో నిండిన ఇరాన్ రాచదర్బారులో నిలబడి ఇస్లామ్ ధర్మం సమానత్వ సిద్ధాంతాలను ప్రదర్శిస్తూ, ఇరాన్‌లో నెలకొని ఉన్న వర్గవిభేదాలను ఎత్తి చూపిస్తూ సమయస్ఫూర్తిగా చేసిన ఉపన్యాసానికి ఎందరు ఇరాన్ సిపాయిల మనస్సులో మానవ వాద ధర్మమైన ఇస్లామ్ పట్ల గౌరవం బీజాలు నాటిందో! వారిలో జన్మించిన పౌరులు అనేకుల్లో నైతిక బాధ్యతలు ఎంతవరకు పెరిగిపోయాయంటే, ఇస్లామీ శిక్షాస్మృతిలో ఏ యే నేరాలకు చేతులు ఖండించడం, రాళ్ళతో కొట్టి చంపడం లాంటి శిక్షలు ఉన్నాయో, ఆ నేరాలకు అనుకోకుండా పాల్పడినవారు కూడా ఆ పాప పరిహారం కోసం ఖాజీల ఎదుటకు వచ్చి, పరలోకంలో దొంగలుగా, వ్యభిచారులుగా దేవుని ఎదుట నిలబడ కుండా ఉండడానికి తమకు ఆ శిక్షలను అమలుపర్చమని వేడుకునే వారు. వారిలో పుట్టిన సిపాయిలు కూడా వేతనాలు తీసుకుని పోరాడేవారుకారు. కాగా ఏ ఉద్యమాన్ని వారు విశ్వసించారో దానికోసం వారు తమ సొంతఖర్చులతో యుద్ధరంగంలోనికి దుమికేవారు. ఏ యుద్ధధనం అయితే వారి చేతికి అందేదో దాన్ని అమానత్తుగా తెచ్చి సైన్యాధ్యక్షుని ముందు కుప్పగా పోసేవారు. కేవలం యుద్ధాల జోరు ద్వారా ఇలాంటి సామూహిక నైతికతలు మరియు సామాజిక గుణగణాల మార్పు సంభవం అవు తుందంటారా? చరిత్ర మొత్తం మీ ముందు ఉంది. కేవలం ఖడ్గం ఒక్కటే మానవుల్ని ఇలా మార్చిన దాఖలాలు ఉన్నాయా?

సైద్ధాంతిక ప్రచార విప్లవం

నిజం చెప్పాలంటే, పదమూడేళ్ళ ఓ సుదీర్ఘకాలంలో కేవలం రెండొందల యాభై లేదా మూడొందల మంది మట్టుకే ముస్లిములుగా మారడం జరిగింది. కాని ఆ తరువాతి పది సంవత్సరాలలో సమస్త దేశ ప్రజలు ముస్లిములైపోయారంటే ఆశ్చర్యపడవలసిన విషయమే. ఈ విప్లవాత్మకమైన మార్పు ఎలా జరిగింది? అనే విషయాన్ని ప్రజలు జీర్ణించుకోలేకపోయారు. అందుకని దానికి రకరకాల కారణాలు చెప్పుకో జొచ్చారు. బాగా ఆలోచిస్తే అర్థం కాకపోవడానికి అది అంత జటిలమైన సమస్య కూడాకాదు. ఓ క్రొత్త అయిడియాలజీ గురించిన జీవితపు రేఖా చిత్రం

ఇంకా తయారుకాకపోవడం, ఈ విచిత్ర స్వభావంగల నాయకుడు తమను ఎలా మలచ దలుచుకున్నాడో తెలియకపోవడం వలన రకరకాల అనుమానాలకు ప్రజలు గురైపోవడం జరిగింది. ఆయన్ను కేవలం ఓ తత్వ బోధకుడుగా ఎంచి ఇష్టమొచ్చిన రీతిలో ఆయన విషయంలో ఏదో ఒకటి చెప్పడం పరిపాటైపోయింది. కాని అదే సమయంలో అసామాన్య బుద్ధివిజ్ఞానాలుగల వ్యక్తులు మాత్రమే ఆయన్ను విశ్వసించారు. వారి దృష్టి ఈ క్రొత్త పంథాలో మానవ శ్రేయం రేఖాచిత్రాన్ని ప్రస్ఫుటంగా చూడగలిగింది. అయితే, ఆ ఆలోచనా వ్యవస్థ పునాదులపై ఓ సంపూర్ణ జీవనవ్యవస్థ ఉనికిలోనికి రావడం, ప్రజలు ఆ వ్యవస్థ పనితీరును చూడడం, దాని ఫలితాలు వారి ముందుకు ప్రస్ఫుటమై రావడం వలన, ఆ పుణ్యపురుషుడు దీని కోసమే గదా ఇన్ని కష్టాలను, కడగండ్లను సహించిందీ! అనే యదార్థాన్ని అర్థం చేసుకోగలిగారు. వారు ఆ నిజాన్ని తమ చర్మచక్షువులతో చూశారు. ఆ కళ్ళలో తేజస్సు ఉండింది. ఆ కళ్ళతో చూసిన యదార్థాన్ని నిరాకరించడం అసాధ్యంగా మారిపోయింది.

ఇస్లామీ వ్యవస్థ ప్రతిష్ఠాపనం సంఘటన సహజమైంది

ఇస్లామ్ తీసుకురాదలచిన సామూహిక విప్లవం ప్రతిష్ఠాపనా విధానం ఇదే. ఈ మార్గమే అది అవలంబించే మార్గం. అది ఈ తీరుగానే ప్రారంభం అవుతుంది మరియు అదే తీరులో ముందుకు సాగుతుంది. ప్రజలు ఈ సంఘటనను ఏదో మహత్యంగా (Miraculous) భావించినప్పటికీ అది యదార్థంగా ఓ ప్రకృతి సిద్ధమైన సంఘటన. ఇందులో కారణకార్యముల పూర్తి తార్కిక మరియు శాస్త్రీయ దృక్కోణం మనకు కానవస్తోంది.

నేడు మనం గనక ఈ విధానాన్ని అవలంభిస్తూ పనిచేస్తే దాని ఫలితాలు వెలువడగలవు. అయితే, ఈ పని కోసం విశ్వాసం, ఇస్లామీయ దృక్పథం, ఏకాగ్రత, దృఢమైన నిర్ణయం గైకొనే శక్తి కావాలి. అలాగే వ్యక్తిగత భావోద్రేకాలు, కోరికలను త్యాగం చేసే ధైర్యం కూడా ఉండాలి. దాని కొరకు, సత్యాన్ని విశ్వసించిన తరువాత దానిపై పూర్తి దృష్టిని ఉంచగలవారు, మరో విషయం వైపునకు కన్నెత్తయినా చూడని దృఢసంకల్పుల అవసరం ఉంది. ప్రపంచం తల్లక్రిందులైపోతున్నాసరే, వారు తమ లక్ష్యం నుండి ఒక్క అంగుళమైనా కదలకుండా ఉండాలి. భౌతిక జీవితంలో వారు తమ వ్యక్తిగత వికాసం కోసం ఎదురుచూస్తున్న అవకాశాలన్నిటిని త్యాగం చేయవలసి ఉంటుంది. తమ ఆశలను, తమ తల్లిదండ్రులు తనపై పెట్టుకున్న ఆశలను (Ambitions) కూడా చంపేయడంలో వెనుకాడకూడదు. బంధుమిత్రులు తమకు దూరమైపోతున్నా సరే చింతించకూడదు. సమాజం, ప్రభుత్వం, చట్టం, జాతి, దేశం వగైరాల్లో ఏదైనా సరే తమ లక్ష్యానికి అడ్డుతగిలితే వాటిని ఎదిరించాలి. ఇలాంటి వ్యక్తులే ప్రప్రథమంగా అల్లాహ్ నామాన్ని చాటగలిగారు. నేడు కూడా ఇలాంటి వ్యక్తులే ఆ పని జేయగలరు. ఆ కార్యం అలాంటివారి ద్వారానే జరుగగలదు.

సందేశ ప్రచార విధానం

తమ పంథా ఏమిటో ఇతరులకు ఎరుకపరిచే విషయానికొస్తే, సాధారణంగా ముస్లిమ్ సంస్థలు అతిగా ప్రవర్తిస్తూ ఉంటాయి. భావోద్రేకాలను రెచ్చగొట్టడం, ఎత్తుగడలు వేస్తూ ప్రదర్శనలివ్వడం, ఉద్వేగాలను రెచ్చగొడుతూ ప్రజలను తమ సంస్థలో చేరేటట్లు చేస్తూ ఉంటాయి. కాని మన ప్రచారం కోసం ఈ విధానం సరైంది కాజాలదు. ఈ విషయంలో అత్యంత సహనాన్ని ప్రదర్శించవలసి ఉంటుంది. సాధారణంగా అమలులో ఉన్న ఉపన్యాస, వ్యాసరచనా ధోరణులను అవలంబిస్తూ సందేశ ప్రచారకుడు అనుకోకుండానే ఆత్మోద్రేకానికి లోనైపోతూ ఉంటాడు. తనకు ప్రియమైన లక్ష్యాన్ని తానే తన చేతులారా నరికివేస్తున్నాననే విషయాన్ని ఏమాత్రం గుర్తించడు. దానికి భిన్నంగా మనం ఓ డాక్టరులా పనిజేయవలసి ఉంటుంది. ఓ డాక్టరు చివరిదాకా రోగగ్రస్తమై ఉన్న శరీర భాగాన్ని చికిత్స ద్వారా నయం చేయడానికే ప్రయత్నిస్తాడు. ఒకవేళ ఆ శరీర అవయవాన్నే తొలగించవలసి వస్తే దానికి ముందు దాన్ని రక్షించడానికి అవసరమయ్యే ఉపాయాలన్నిటినీ ప్రయత్నించి చూసి, ఇక లాభం లేదని అనుకున్నప్పుడే దాన్ని తొలిగించి వేయడం జరుగుతుంది. అయితే పరిస్థితి ఏమిటంటే మన డాక్టర్లు మాత్రం అలాంటి ప్రయత్నాలను ఏవీ చేయకుండానే ఆ వ్యాధిగ్రస్తమైన అవయవాన్ని అన్నిటికంటే ముందే తొలగించ ప్రయత్నం చేస్తున్నారు.

ఒకటి మాత్రం గుర్తుంచుకోండి! ఈ ప్రజల సమూహం ఏదైతే మీ చుట్టూ విస్తరించి ఉందో, అందులో నాస్తిక, బహుదైవారాధక వ్యక్తులు, బాహాటంగా పాప పంకిలంలో మునిగితేలే రోగులు అనేకమంది ఉన్నారు. వారి చికిత్స చేయడంలో కోపాన్ని, అసహనాన్ని ప్రదర్శించడంకంటే సహనం, సంయమనం, సానుభూతులు ప్రదర్శించడం అవసరం. ఆ రోగగ్రస్త అవయవాలను ఒక్కమారే తొలగించి వేసే ముందు అన్నిరకాల ఇతర చికిత్సలు ప్రయత్నించి చూడడం మంచిది.

ప్రజల అసహాయతకు కారణం వారిలో అనేక బహుదైవారాధక విశ్వాసాలు, సంప్రదాయాలు ఖుద్దు మతం అనే పవిత్ర ద్వారాల గుండా వారిలో ప్రవేశించడం. ఈ కారణంగానే వారి సంస్కరణ సమస్య ఏంతో జటిలమైపోయింది. ఈ ఉద్యమాన్ని సహనం మరియు సంయమనాల ద్వారానే నడపగలం. అరేబియాలోను ఇలాంటి పరిస్థితులే అప్పుడు నెలకొని ఉండేవి. అక్కడ కూడా ఈ విధానాన్ని అవలంబించే సందేశ ప్రచార కార్యం కొనసాగించబడింది.

సందేశ ప్రచార విధానం

అన్నిటికంటే ముందు మన సందేశ ప్రచార విధానం ఏమిటో తెలుసుకోండి. మన సందేశ ప్రచార విధానం ఏమిటంటే, ఏది ముందు అవసరమో దాన్నే ముందుగా తీసుకోవడం. ఏ అంశం ఎంత ప్రాముఖ్యమైందో దాని గురించి అంతే ప్రధానంగా ఆలోచించవలసి ఉంటుంది. అలాగే దానిపైన్నే అధిక శ్రద్ధ చూపవలసి ఉంటుంది. అదే విధంగా ధార్మిక ప్రాముఖ్యత ఎంత తక్కువ ఉంటుందో ఆ విషయంపై ఆ తరువాతనే దృష్టి సారించవలసి ఉంటుంది. అలాంటి అంశం ప్రాధాన్యతను మరీ అంతగా ఎక్కువచేసి చూపకూడదు.

గుర్తించవలసిన మరో విషయం ఏమిటంటే, శాఖలు, ఉపశాఖలకు సంబం ధించిన విషయాలను వేరువేరుగా చర్చించే బదులు అసలు మూలసిద్ధాంతం గురించే ఆలోచించాలి. దాన్ని సంస్కరిస్తే శాఖలు, ఉపశాఖలు సహజంగా వాటంతట అవే సంస్కరించబడతాయి. ఉదాహరణకు అగ్నిప్రమాదంలో ఏ ఇల్లయినా ధగ్ధమైపోతూ దూలాలు, వాసాలు, చెక్కలు వగైరా కాలి క్రిందపడిపోతున్నాయనుకోండి. అలాంటి సందర్భంలో ఒక్కో దూలం లేదా వాసాన్ని పడిపోకుండా అడ్డుకోవడానికి వేరువేరుగా ప్రయత్నించడం జరగదు. పైగా, ఒకే విధానం ద్వారా ఆ అగ్నిని ఆర్పే ప్రయత్నం జరుగుతుంది. లేదా మరో ఉదాహరణలో చెప్పాలంటే, ఒకరి రక్తం చెడిపోయి అతని శరీరంపై అన్ని చోట్ల పుండ్లు కురుపులు ఏర్పడ్డాయనుకోండి, అప్పుడు ఒక్కోపుండును, ఒక్కో కురుపును శస్త్రచికిత్స చేసి తీసివేయడం లేదా ఒక్క పుండుకు మందు రాయడానికి బదులు అసలు ఆ రక్తాన్నే శుద్ధిచేసే ప్రయత్నం జరగాలి. ఈ సూత్రం ఆధారంగానే మన సందేశ ప్రచారకులు, స్థానిక పరిస్థితుల గురించి ఆలోచించి ప్రజలు చిక్కుకున్న ఆ రుగ్మతలకు అసలు కారణం ఏదై ఉంటుంది అని తెలుసు కోవడం ముఖ్యం. ఏ చర్య తీసుకున్నా ఆ అసలు మూలాన్ని దూరం చేయడానికే తీసుకోవాలి. ఈ కార్యంలో, ఆ రుగ్మతల శాఖోపశాఖలను చూసి ఏ మాత్రం భయభీతులు కానవసరం లేదు. అలాగే, సత్కార్యాలను పెంపొందించడం కూడా అవసరం. దాని మూలం ఏదో తెలుసుకునే ప్రయత్నమూ చేయాలి. దాన్ని పెంచి పోషించడానికి సమస్త శక్తి సామర్థ్యాలను ధారపోయాలి. ఈ మూలమే గనక దృఢంగా వేళ్ళూనుకొనిపోతే ఆ తరువాత ఆకులు, పూలు పండ్లు తమంతట తామే సాక్షాత్కరిస్తాయి.

జమాఅత్ పూర్తి సాహిత్యం ఈ సిద్ధాంతం లేదా ఈ సూత్రాన్ని దృష్టిలో పెట్టుకొనే రచించడం జరిగింది. ఇందులో మౌలిక విషయాల పటిష్టత కోసం బలమైన ఆధారాలు చూపెట్టడం జరిగింది. కాని శాఖలను సాధారణంగా స్పృశించడం జరుగ లేదు. శాఖలను కత్తిరించడం లేదా వాటిని ఒక్కొక్కటిగా ఏరి నరికి వేసే బదులు మూలం

మరియు కాండం వైపుకే దృష్టిని సారింపజేయడం జరిగింది. మీరు ముస్లిముల జీవన సౌధపు చెరిగిపోతున్న నగిషీలు, అందాల వైపుకు అతిగా దృష్టిని సారించడానికి బదులు దాని పునాదుల గురించి ఆలోచించండి. అలా జరుగని పక్షంలో ఆ కుడ్యాల అందాలు మరింత పెరిగిపోయినప్పటికీ ఆ అందచందాలు తమ ప్రాభవాన్ని పూర్తిగా సంతరించుకోకమునుపే ఆ కట్టడం నేలమట్టమైపోవడాన్ని చూడగలరు.

మన నోట సంస్కరణకు సంబంధించిన ఏ మాట వెలువడినా అది కేవలం చిన్నచిన్న రుగ్మతల వైపుకే మళ్ళుతోంది. ప్రతి సంస్కరణా శాస్త్రం ఆ పాత పద్ధతి వైపుకే మళ్ళిపోతోంది. కాని ఆ చిలువలు పలువలపై దాడిచేయడం వలన మనం మన లక్ష్యసాధనలో కృతకృత్యులం కాలేము. ఈ మార్గం వాదోపవాదాలు, ప్రదర్శనలగుండా వెళ్ళే మార్గం. ఈ తీరుగా పనిజేస్తూపోతూ ఉంటే అనవసరమైన ఉద్రేకాలు రగులుకుంటాయి. మనసును బాధించే రకరకాల 'వహ్హాబీ' బిద్అద్ లాంటి పదాలు దొరలుతూ పోతుండడమే కాకుండా, తలలు పగులగొట్టుకొనే సంఘటనలూ చోటుచేసుకోగలవు. ఇల్లాంటి ప్రచార విధానాన్ని పునరావృతం కాకుండా జాగ్రత్తపడండి.

లోతుగా పరిశీలిస్తే, ఈ సకల రుగ్మతలు దైవ ఏకత్వభావనను అర్థం చేసుకోకపోవడం వల్లనే ఉత్పన్నమౌతాయనే విషయాన్ని మీరు అర్థం చేసుకోక పోవడంవల్లనో లేదా దైవదౌత్యపు సత్యాన్ని తెలుసుకోకపోవడం వల్లనో లేదా పరలోకంపై ఉండవలసిన విశ్వాసాన్ని గుర్తించకపోవడం వల్లనో ఉద్భవిస్తాయన్న యదార్థాన్ని తెలుసుకోగలరు. దానికితోడు కొన్ని రుగ్మతలు ధర్మం మూలం ఏదో దాని శాఖలేవో తెలుసుకోకపోవడం వలన ఇంకా వాటిని తారుమారుచేయడం వలన ఉద్భవించేవి. అదేకాకుండా కొన్ని కారణాలు దైవగ్రంథం మరియు ప్రవక్త సంప్ర దాయాలతో సంబంధాలు ఏర్పర్చుకోకపోవడం కూడా. ఇవన్నీ అజ్ఞానుల్లోనే ఉన్నాయి అనుకోవడం పొరపాటే. చాలా మంది ఉలేమాల్లోనూ నేరుగా వాటి గురించిన లోతైన జ్ఞానం కరువైపోయింది. మనమే గనక ఈ పరిస్థితుల్ని మార్చివేయాలనుకుంటే సంస్కరణా కార్యక్రమాన్ని వాటి పునాదుల (మూలాల) నుండి ప్రారంభించి పైకి తీసుకొనిపోవలసి ఉంటుంది. అయితే ఒక మూలాన్నే తీసుకొని దాని శాఖలను ఉపేక్షించడం లేదా వాటికి పూర్తి స్వేచ్ఛ ఇవ్వడం జరిగింది అన్నది నా భావం అసలే కాదు. ప్రారంభంలోనే ఉప విషయాలపై ఎక్కువగా దృష్టిని కేంద్రీకరించకూడదన్నదే నా మనోగతం.

అతి తక్కువ మంది మాత్రమే తమ దురలవాట్లు, దురుసుతనం కారణంగా రుగ్మతలకు కొమ్ముగాస్తారన్నది నిరాకరించలేని నిజం. సామాన్య ప్రజలు పాపం కేవలం తమ అజ్ఞానం వల్ల దారి తప్పి ఉన్నారు.

ఎప్పటి నుండో వారికి బోధించడుతూ వచ్చిన తప్పుడు ప్రబోధనలు, గడప బడుతూ వచ్చిన తప్పుడు శిక్షణ, ఇప్పటి వరకు వారు అవలంబిస్తూ వచ్చిందే అసలు సిసలైన ధర్మం అనే భావన వారి మనోమస్తిష్కాల్లో వేళూనుకొనేటట్లు చేసింది. ఇలాంటి అమాయకుల సంస్కరణ కేవలం సహనాన్ని, సంయమనాన్ని ప్రదర్శిస్తూ అంచెలవారీగా దైవ ఏకత్వం, దైవదౌత్యం మరియు పరలోక చింతనకు సంబంధించిన ఇస్లామీ భావాలను వారి మనస్సుల్లో వేళ్ళూనుకొని పోయినట్లు చేయడం వలననే సాధ్యం కాగలదు. వారి విశ్వాసాల సంస్కరణలో మనమే గనక కృతకృత్యులం కాగలిగితే, వ్యతిరేకి కూడా 'వహ్హాబీ వహ్హాబీ' అనే పదాన్ని వల్లిస్తూ వారిని సమీకరించుకో జాలడు. పైగా తానే స్వయంగా వెనక్కు తగ్గి పలాయనం చిత్తగించగలడు.

అరేబియాలో వచ్చిన ఆ విప్లవం ఎలాంటిదో మీరే గనక నిశితంగా ఆలోచించి చూస్తే, దాని యదార్థం ఎలాంటిదో తేటతెల్లం అయిపోతుంది. ప్రవక్త మహనీయులు (స) గారి సందేశాన్ని తిరస్కరించేవారిలో కేవలం ఒక వర్గమే తమ స్వప్రయోజనాల కోసం ఆయన్ను విరోధించడం జరిగింది. తక్కినవారంతా మోసానికి గురైె వారి అడుగులకు మడుగులొత్తినవారే. ఉద్యమం విస్తరించి సత్యం పూర్తిగా వారి ముందుకు వచ్చినప్పుడు నిస్వార్థపరులైన సత్యపిపాసులకు ఆయన్ను తిరస్కరించే మార్గం ఏదీ అగుపడలేదు. ఆ దేశ సామాన్య ప్రజానీకం అంతా సత్యం ముందు తలవంచేసింది. చివరికి తేలిన ఫలితం ఏమిటంటే, ఎవరైతే తమ స్వార్థ ప్రయోజనాల కోసం ఆయన(స)తో పోరాడుతూ వచ్చారో వారు పూర్తిగా ఏకాకులైపోవడం జరిగింది. కాబట్టే వారు కూడా ఆయన ముందు తలవంచకుండా ఉండలేకపోయారు. నేడు కూడా సత్యధర్మ ప్రచార విజయానికిగల మార్గం ఏమిటంటే, మీరు యదార్థం ఏమిటో ఉన్నది ఉన్నట్లు ప్రజల ముందు పెట్టాలి. అప్పటి వరకు స్వార్థపరులైన నాయకుల మాయాజాలంలో పడిమోసానికి గురైవున్నవారు ఆ మాయాజాలంలో నుండి బయటపడి పోయి తమ తమ నాయకులను వదిలేసి మీతో వచ్చి చేరిపోతారు. అదే కాకుండా తమ స్వార్థం కోసం మీకు అడ్డుగా నిలిచేవారంతా చేసేది లేక నడుస్తున్న మన రైలు బండిని ఏమాత్రం నిలువరించలేనంత అసహాయులుగా మిగిలిపోగలరు.

ఈ ప్రణాళికనే మీరు అమలు చేయవలసివస్తే మీలో ఉన్న 'ఆమీన్ బిల్ జహ్ర్', 'తేజులు', 'ఖుల్', 'ఖుజీల్' లాంటి వివాదాలను అంతం చేయండి. దైవప్రవక్త (స) ఒక్క ఈ రుగ్మతలను సంస్కరించడానికే ప్రభవించారా? ఇస్లామ్ ధ్యేయం పూర్తిగా అదేనా? దివ్యఖుర్ఆన్ బోధనలు మన నుండి కోరేది ఈ విషయాలనేనా? కొంత ఆలోచించండి! కాదు, అలాంటివేవీ కావు అన్నప్పుడు, ప్రతి కాలంలోనూ దైవప్రవక్తలు తమ విరోధుల హింసలకు ఎందుకు బలౌతూవచ్చారో ఆ విషయాలవైపుకు మీ దృష్టి ఎందుకు పోవడం లేదు? నేడు ప్రాధాన్యతను సంతరించుకొని ఉన్న ఈ ఉపవిషయాలు ధర్మసంస్థాపనా కార్యంలో ఎలాంటి ప్రాముఖ్యతను కలిగిలేవు. మీగు

ఆలోచించవలసిందల్లా ప్రజలు దైవధర్మాన్ని అయిచ్ఛికంగా గుర్తించి, ప్రవక్త సంప్రదాయాలను సంతోషంగా విధేయించడానికి ముందుకురావడం గురించి. ఇదే గనక జరిగితే, దైవగ్రంథం మరియు ప్రవక్త సంప్రదాయం ద్వారా ఏ విషయం అయితే రూఢీ అయింది అని తలిచే ప్రతి వ్యక్తి దాన్నే అవలంబించే ప్రయత్నం చేస్తాడు. మరే విషయం అయితే వాటికి విరుద్ధం అని తెలుస్తుందో దాన్ని త్యజిస్తాడు. దృష్టి సారించవలసినదల్లా ఆ ఒక్క మౌలిక సంస్కరణ పైన్నే, కారుణ్యకార్యక్రమాల వైపుకు నడిచే యే క్రమం అయితే మనకు ప్రవక్త (స) గారి పవిత్ర జీవితంలో కానవస్తోందో దాన్ని విస్మరించి కేవలం హదీసు గ్రంథాలను అనుసరించడం ప్రారంభిస్తే అది హదీసు గ్రంథాలను అనుసరించడం మాత్రమే అవుతుంది. ప్రవక్త మహనీయుల జీవిత మార్గాన్ని అనుసరించడం కానేకాదు.

ఇస్లామ్ రాకకు పూర్వం అరేబియాలో నెలకొని ఉండిన రుగ్మతలు నేడు మనకాలంలో ఉన్న రుగ్మతలకు ఏమాత్రం తీసిపోవు. మరి ఆ రుగ్మతలన్నిటిపై ఒకేసారి వ్రేటు వేయడం జరిగిందా? సంస్కరణలన్నిటినీ ఒకే ఒక్క సారిగా అమలు చేయడం జరిగిందా? అలా జరుగలేదు. పైగా సంస్కరణా పునాదులను వేసి ఆ తరువాతనే నైతికతలను బోధించడం జరిగింది. ఆ పిదప జీవితం అనే చొక్కా చెరుగు నుండి ఒక్క మరకను కడిగే పని క్రమక్రమంగా చేబట్టడం జరిగింది. ఆ క్రమం ఎన్నో సంవత్సరాల వరకు కొనసాగింది. మీరే గనక దైవప్రవక్త (స) గారిని అనుసరించ దలుచుకుంటే, మొదట ప్రవక్త (స) గారి విధానాన్ని బాగా అర్థం చేసుకోండి. ఆ తరువాతే అడుగు ముందుకు వేయండి.

మరో విషయాన్ని కూడా నేను గమనించాను. అదేమిటంటే, మన సహచరుల్లో (రుఫకా) చేసిన పనిని గోరింతలు కొండంతలుగా చెప్పుకునే తపన అప్పుడప్పుడు ఉద్భవించడం. ఆ అలవాటు సమసిపోవాలన్నదే నా కోరిక. కేవలం తమ పని తనాన్ని ఎక్కువగా చూపించే అలవాటును ఉపయోగించకుండా ఉండడమే కాదు, ఆ పని ఎడల సంతృప్తిపడే అలవాటు కూడా మంచిది కాదు. సాధ్యమైనంత అమోఘంగా ఆ పని చేసి కూడా సంతృప్తి పడకండి. దాని మేలైన కోణాలను చూసి మురిసిపోయే బదులు ఆ కార్యం లొసుగులను చూసి తపించండి. ఏ పనైతే సక్రమంగా నెరవేరిందో ఆ పని అలా నెరవేరినందుకు దైవానికి కృతజ్ఞతలు చెప్పుకోండి. యే లోపం అయితే ఉండిపోయిందో దాన్ని సరిదిద్దమని ఆయన్ను వేడుకోండి. అదేకాకుండా, ఇతర సంస్థలకు చెందిన వ్యక్తులకు మీ సందేశాన్ని చేరవేసేటప్పుడు మీలో తర్కించి మాటను నెగ్గింపజేసుకొనే ధోరణి పెరిగిపోతోందేమో అన్న అనుమానం కూడా నాకు కలుగుతోంది. అలాంటి సందర్భాల్లో మీలో గర్వం మరియు ఔన్నత్యం చాటాలనే తత్వం కూడా ప్రబలవచ్చు. అలాంటిదేదీ లేకపోతే మంచిదే. కాని యదార్థంగా నా అనుమానమే నిజమైతే మీరు ఆ అలవాటును వెంటనే విడనాడండి.

ఈ సందర్భంగా ఇతర జమాఅత్‌ల అనుయాయులకు అర్థమయ్యేటట్లు మనం చెప్పవలసిన విషయం ఏమిటంటే, మేము మా వైఖరి ద్వారా గాని, మా మాటల తీరు ద్వారాగాని ఎలాంటి సంస్థాపరమైన వివాదాలను రెచ్చగొట్టేవారం కాము అని, కేవలం రుగ్మతల మూలాలను మాత్రమే నిర్మూలించదలిచామని, మా సంబోధన పూర్తిగా సత్యాన్ని తిరస్కరించే మానవాళి కోసం మాత్రమే అన్నది. మనం ఈ విషయాన్ని వారికి అర్థమయ్యే రీతిలో, విడమర్చి చెప్పగలిగితే, ముఖ్యంగా వారికి మనకు నడుమ ఎలాంటి వివాదం ఏర్పడదు. మొత్తానికి ఏ సంస్థా, మీ వైఖరిద్వారా, మీరు ఆ ధార్మిక సంస్థకు వ్యతిరేకంగా మసలుకుంటున్నారనే అనుమానాన్ని కలిగించే అవకాశం ఇవ్వకూడదు. మనం కేవలం దైవతిరస్కార వ్యవస్థ మరియు అజ్ఞానానికి మాత్రమే విరోధులం. దాన్నే ఎదుర్కోవలసి ఉంది. ఆ వ్యవస్థకు ఎవరు ఎంత మట్టుకు సంబంధాలను కలిగి ఉంటారో ఆ దామాషా ప్రకారమే మనం వారికి విరోధులం.

సాధారణ అన్జుమన్ (సంస్థ)ల ద్వారా నిర్వహించబడే సభల్లో లేదా ఉత్సవాల్లో మనం పాల్గొని ఉపన్యసించవచ్చునా? అని కొందరు నన్ను అడగడం జరిగింది. ఈ విధానం ద్వారా మన భావాలను విస్తరింపజేసే అవకాశాలు మనకు లభించినప్పటికీ, నా అనుభవం ద్వారా చెప్పదలచుకుందేమిటంటే, ఈ విధానం అంత ప్రయోజనకరం కాజాలన్నది. ఒకే వేదిక నుండి రకరకాల భావాలు వ్యక్తీకరించబడుతున్నప్పుడు, ఆ సందర్భంలోనే మన సందేశ ప్రచారమూ వ్యక్తీకరించబడుతుంది. అలాంటప్పుడు ఈ భావ వ్యక్తీకరణల కారణంగా ప్రజలు, ఆ అన్నిటిలోను ఇదొకటి, ఇదంతా మనలను బుజ్జగించడానికే జరుగుతోంది అని పెదవి విరుస్తారు. ఇదో మానసిక డైనింగ్ టేబుల్‌లాంటిది. ఆ డైనింగ్ టేబుల్‌పై రకరకాల ఊరగాయలు, పచ్చళ్ళు, హల్వాలు రకరకాల వంటకాలు వడ్డించబడి ఉన్నాయి. అందులోను ఇదో క్రొత్త రకం ఊరగాయ అని అనుకుంటారు. వివిధ సంస్థలు పోటీపడుతూ వాయించే డప్పుల చప్పుళ్ళలో ఒకవేళ మనం లయబద్ధంగా మన డప్పు వాయించినా, ప్రజలు మాత్రం దాన్ని ఆలకించి ఓహో! అది చక్కగా వాయించబడింది అని పొగడం మట్టుకే జరుగుతుంది. చెడిపోయిన మన జాతి పరిస్థితి అచ్చం ఓ చెడిపోయిన ధనవంతుని లాంటిది అతని చుట్టూచేరి అతణ్ణి పొగిడే భట్రాజుల్లో మనం ఒకరమై జీవిత సత్యాన్ని ధార్మిక సత్యాన్ని ఎంత సీరియస్‌గా ప్రచారం చేసినప్పటికీ అది ఫలితాన్ని ఇచ్చేది కాదు. మొత్తానికి ఇల్లాంటి భోగలాలస సమాజం తన భట్రాజుల పొగడ్తలు విన్నట్లే వింటుంది మన మాటను కూడా. ఈ కారణాల చేతనే నేను జమాఅత్ వక్తలకు ఇచ్చే సలహా ఏమిటంటే, మొదట మీరు మీ వ్యక్తిత్వాన్ని, మరో మాటలో చెప్పాలంటే మీ విశేష సామర్థ్యాన్ని బాగా పటిష్టపరుచుకొని క్రొత్త తరహాలో మీ సిద్ధాంతాలను ప్రజల దృష్టికి తీసుకురావడం. అయితే, మార్కెట్టులో మంచి వక్తృత్వ రికార్డులు బాగా ప్రాచుర్యంలో ఉన్నాయి. వాటిలో మీ మాటలను రికార్డు చేసుకుంటే అది ప్రయోజనం

కాగలదు. వివిధ రకాల నాయకులు, వక్తల ఉపన్యాసాలు మీ భావాలే మాటి మాటికి వచ్చేటట్లు మీరు మీ ప్రభావాన్ని గనక విస్తరింపజేస్తే, వారు కొంత కాలానికి తమ అంతరాత్మ ప్రబోధం కారణంగా మరియు ప్రజాభిప్రాయ వత్తిడి వలన తమ కార్యాచరణ విధానాన్ని మార్చుకోనూవచ్చు. ఈ ప్రణాళిక విస్తారంగా అమలుజరిగితే చివరకు, పూర్తిజాతి పరిస్థితినే మార్చివేసిన కిరాయి వక్తలు స్టేజీ నుండి క్రిందికి గెంటివేయబడతారో, వారికి అవసరమైన వారినే ప్రజలు స్టేజీమీదికి తీసుకొని రాగలరు.

విజ్ఞానం మరియు ఆచరణలలో లోపాలుంటే వాటివల్ల వచ్చిపడే చిక్కులు

సందేశ ప్రచారకుడు వ్యాధిగ్రస్తుని పేరెత్తకుండానే అతని వ్యాధి దుష్పరిణామాలను ఉపమానాల ద్వారా తెలియజేయడం ఎంతో అవసరం. దివ్యగ్రంథం అయిన ఖుర్‌ఆన్‌లో ఓ వ్యక్తి ఉదాహరణ ఇవ్వడం జరిగింది. అతను దైవ సూచనలను బాగా తెలిసినవాడు. అంటే యదార్థం ఏమిటో అతనికి బాగా తెలుసు. దాని ద్వారా అతనికి లభించిన ఆ విజ్ఞానం ఫలితంగా అతను తప్పుగా భావించిన వైఖరికి దూరంగా ఉంటూ అతని దృష్టిలో సరైన మార్గాన్ని ఎంచుకోవలసి ఉండింది. అయితే అతను ప్రాపంచిక ప్రయోజనాలు, భోగభాగ్యాల వైపుకే వంగిపోయాడు. మనోవాంఛలను ఎదుర్కొనేబదులు వాటికి బానిస అయిపోయాడు. ఆర్థిక వనరులను సమకూర్చుకోవడంలో పెల్లుబికే దురాశను, కోరికలను అధిగమించేబదులు, అతను పిసినారితనాన్ని, అత్యాశను అవలంబిస్తూ తన అత్యున్నతమైన ఆలోచనా నైతికతా వికాస అవకాశాలను సైతం కాలదన్నేశాడు. తన విజ్ఞానం ఏర్పర్చిన పరిధులను సైతం అధిగమించాడు. అదేకాకుండా అతను కేవలం తన నైతికలోపం వలన, కావాలని, సత్యాన్ని తిరస్కరించినప్పుడు, అతని దాపునే మాటువేసుకొని కూర్చున్న షైతాను అతని వెంటబడ్డాడు. అతణ్ణి ఓ అధోగతి నుండి మరో అధోగతికి తీసుకుపోజొచ్చాడు. చివరికి ఆ షైతాను తన ఉచ్చులో చిక్కుకొని తమ స్పృహను కోల్పోయేవారిలో అతణ్ణి చేర్చడం జరిగింది.

اُتْلُ عَلَيْهِمْ نَبَاَ الَّذِيْٓ اٰتَيْنٰهُ اٰيٰتِنَا فَانْسَلَخَ مِنْهَا فَاَتْبَعَهُ الشَّيْطٰنُ فَكَانَ مِنَ الْغٰوِيْنَ ۝ وَلَوْ شِئْنَا لَرَفَعْنٰهُ بِهَا وَلٰكِنَّهٗٓ اَخْلَدَ اِلَى الْاَرْضِ وَاتَّبَعَ هَوٰىهُ

(اعراف: ۱۷۵،۱۷۶)

"ప్రవక్తా! వారికి ఆ వ్యక్తి గాథను వినిపించు. అతనికి మేము మా ఆయతుల జ్ఞానాన్ని ప్రసాదించాము. కాని అతడు వాటిని పాటించకుండా విముఖుడైపోయాడు.

చివరకు షైతాను అతణ్ణి వెంబడించాడు. పర్యవసానంగా అతడు మార్గభ్రష్టులలో కలసిపోయాడు. మేము గనక కోరివున్నట్లయితే అతనికి ఆ ఆయతుల ద్వారా ఔన్నత్యాన్ని ప్రసాదించి ఉండేవారం. కాని అతడు భూమివైపునకే మొగ్గాడు. తన మనోవాంఛలనే అనుసరించాడు." (అల్ ఆరాఫ్: 175, 176)

ఆ తరువాత ఆ వ్యక్తి పరిస్థితిని కుక్క పరిస్థితితో పోలుస్తూ, ఆ కుక్క నాలుక ఎల్లప్పుడు చొంగకారుస్తూ వ్రేళ్ళాడుతూనే ఉంటుందని, అతని బుద్ధి ఎప్పుడూ ఆరని దురాశ మరియు ఎప్పుడు తృప్తిపడని బుద్ధి లాంటిదని సెలవిస్తాడు దైవం. మరోమాటలో చెప్పాలంటే మన భాషలో దాన్ని కుక్కబుద్ధి అని కూడా అనడం కద్దు. కుక్క నైజం ఏమిటీ? ఇంకా కావాలనే ఆశ. నడుస్తూనే, ఎక్కడైనా తిండి వాసన వస్తుందేమోనని దాని ముక్కు నేలను వాసన జూడడంలోనే నిమగ్నమై ఉంటుంది. దాన్ని విదిలించడానికి మీరు ఏ రాయినైతే విసురుతున్నారో బహుశా అది ఏ ఎముకో, ఏ రొట్టె ముక్కో అని దాన్ని తన నోట కరుచుకోడానికి వెనకాడదు కుక్క. దాని వైపునకు మన దృష్టిపోకపోయినా ఆ దురాశాజీవి ఏదైనా దొరక్కపోతుందా అని నాలుకను వ్రేళ్ళాడేసుకొని రొప్పుతూ రోజుతూ మీ వైపు చూస్తూనే నిలబడుతుంది. ప్రపంచాన్ని తన పొట్ట దృష్టితోనే చూస్తూ ఎక్కడైనా ఏదైనా మృత దేహం అగుపడినా, ఆ మృతదేహం అనేక కుక్కల పొట్టనింపడానికి సరిపోయినప్పటికీ దాని నుండి అది తన భాగాన్ని పొందేబదులు అదంతా తనకే కావాలని కోరుకుంటుంది. మరో కుక్కను కూడా దాని వైపునకు రానివ్వదు. ఈ పొట్టకు సంబంధించిన ఆరాటం కంటే, దేని గురించైతే అది ఎక్కువ ఆరాటపడుతుందో అది మర్మాంగానికి సంబంధించిన ఆరాటం. తన శరీరం మొత్తంలోనూ కేవలం ఒకేఒక అంగంపై ఎంతో మక్కువ కలిగి దాన్ని వాసన జూస్తూ, దాన్ని నాకడంలోనే నిమగ్నమై ఉంటుంది. కాబట్టి ప్రాపంచిక భోగభాగ్యాలను కోరుకునే భౌతికవాది తన జ్ఞానాన్ని, విశ్వాసాన్ని త్యజించి తన మనస్సును గ్రుడ్డివాంఛల ముందు మోకరిల్లజేసినప్పుడు కుక్క పరిస్థితికి చేరకుండా ఉండలేడని ఈ ఉపమానం ఉద్దేశ్యం. అతని పొట్టా, అతని మర్మాంగం పూర్తిగా కుక్కకు మల్లే మారిపోతుంది.

فَمَثَلُهٗ كَمَثَلِ الْكَلْبِ ۚ اِنْ تَحْمِلْ عَلَيْهِ يَلْهَثْ
اَوْ تَتْرُكْهُ يَلْهَثْ ۔ (الاعراف : ١٧٦)

"కనుక అతని బుద్ధి కుక్క వంటిదైపోయింది. మీరు దానిపై దాడిచేస్తే అప్పుడు కూడా అది నాలుకను వెళ్ళబెడుతుంది. దానిని వదిలిపెడ్తే అప్పుడు కూడా అది నాలుకను వెళ్ళబెడుతుంది." (అల్ ఆరాఫ్:176)

ذٰلِكَ مَثَلُ الْقَوْمِ الَّذِيْنَ كَذَّبُوْا بِاٰيٰتِنَا ۚ فَاقْصُصِ
الْقَصَصَ لَعَلَّهُمْ يَتَفَكَّرُوْنَ ○ (الاعراف : ١٧٦)

"మా ఆయతులను తిరస్కరించేవారి దృష్టాంతం కూడా ఇదే. నీవు వారికి ఈ గాథలను వినిపిస్తూ ఉండు, బహుశా వారు యోచిస్తారేమో." (అల్ ఆరాఫ్:176)

చెడును మంచి పద్ధతుల ద్వారా నివారించడం

ధర్మ సందేశ ప్రచార సందర్భంలో చెడును నివారించడానికి మంచిని ఉపయోగించి ఎదుర్కోవాలని తాకీదు చేయడం జరిగింది.

اِدْفَعْ بِالَّتِیْ هِیَ اَحْسَنُ السَّیِّئَةَ ؕ نَحْنُ اَعْلَمُ
بِمَا یَصِفُوْنَ ۟ وَقُلْ رَّبِّ اَعُوْذُ بِكَ مِنْ هَمَزٰتِ
الشَّیٰطِیْنِ ۝ وَاَعُوْذُ بِكَ رَبِّ اَنْ یَّحْضُرُوْنِ ۝ (المؤمنون: ۹۶-۹۸)

"ఓ ప్రవక్తా! చెడును ఉత్తమమైన పద్ధతి ద్వారా నివారించు. యే విషయాలను వారు నిన్ను గురించి కల్పిస్తున్నారో, అవి మాకు బాగా తెలుసు. ఇలా ప్రార్థించు: "ప్రభూ! షైతానుల ప్రేరణ నుండి నేను నీ శరణు వేడుకుంటున్నాను. నా ప్రభూ! అవి నా వద్దకు అసలు రాకుండేటట్లు నీ శరణు వేడుకుంటున్నాను."
(అల్ మోమినూన్:96-98)

దూషించేవారికి సద్వచనాలు చెప్పి ఎదుర్కోవడం

وَلَا تَسُبُّوا الَّذِیْنَ یَدْعُوْنَ مِنْ دُوْنِ اللّٰهِ فَیَسُبُّوا
اللّٰهَ عَدْوًۢا بِغَیْرِ عِلْمٍ (الانعام: ۱۰۸)

(ముస్లిములారా! వారు అల్లాహ్‌ను కాదని వేడుకునే ఇతరులను దూషించకండి. ఎందుకంటే, వారు షిర్కు కంటే ఇంకా ముందుకుపోయి అజ్ఞానంచేత అల్లాహ్‌ను దూషిస్తారేమో." (అల్ అన్ఆమ్:108)

ఈ హితబోధ దైవప్రవక్త (స) వారి అనుయాయులకు ఎందుకు చేయబడిందంటే, వారు సందేశప్రచార వెల్లువలో కొట్టుకునిపోయి ఇతరులను తూలనాడుతూ వారి విశ్వాసాలపై దెబ్బతీయడం వరకు వెళ్ళకూడదనే. వారి మత నాయకులను, వారి ఆరాధ్యులను దూషించడం వరకు వెళ్ళవద్దనే ఉద్దేశ్యంతోనే. ఎందుకంటే, ఈ విషయం వారిని సత్యం వైపునకు తీసుకురావడానికి బదులు మరింత దూరం చేయగలదు.

అందువల్లనే అలి ఇమ్రాన్ సూరా 97, 98 ఆయత్‌లలో షైతాన్ ప్రోద్బలం నుండి అల్లాహ్‌ను శరణు కోరాలని బోధించడం జరిగింది. కారణం, ఎదుటివారి దుర్భాషలు, దూషణలు, దురుసుతనం వల్ల అప్పుడప్పుడు ప్రతి చర్యగా మనిషి ఉద్రిక్తతకులోనై తాను కూడా దూషణలకు పూనుకుంటాడు. చివరకు వ్యవహారం కొట్లాట వరకు వెళ్ళిపోగలదు గనుక.

మంచిని చేసి చెడును రూపుమాపడం

وَلَا تَسْتَوِى الْحَسَنَةُ وَلَا السَّيِّئَةُ ادْفَعْ بِالَّتِى
هِىَ اَحْسَنُ فَاِذَا الَّذِى بَيْنَكَ وَبَيْنَهُ عَدَاوَةٌ كَاَنَّهُ
وَلِىٌّ حَمِيْمٌ (حٰمٓ السجدہ: ۳۴)

"ప్రవక్తా! మంచీ, చెడూ ఒకటి కావు. నీవు చెడును శ్రేష్ఠమైన మంచిద్వారా తొలగించు. అప్పుడు నీ పట్ల శత్రుభావం కలవాడు నీకు ప్రాణ స్నేహితుడైపోవడాన్ని గమనిస్తావు." (హామీమ్ అస్ సజ్దహ్:34)

ఈ ఆయత్‌ను పూర్తిగా అర్థం చేసుకోవడానికి, దైవప్రవక్త (స) వారికి, ఆయన ద్వారా ఆయన అనుయాయులకు ఈ బోధన గరపడానికి కారణభూతమైన ఆ పరిస్థితులను కూడా దృష్టిలో ఉంచుకోవలసి ఉంటుంది.

ఆనాటి పరిస్థితుల్లో, సత్యధర్మ ప్రచారాన్ని ఎంతో మంకుపట్టుగా, గట్టి దురాక్రమణ ద్వారా నిలువరించే ప్రయత్నం జరిగింది. సందేశ ప్రచారాన్ని అడ్డుకోవడంలో నైతికతలు, మానవత్వపు హద్దులన్నిటినీ అతిక్రమించడం జరిగింది. ప్రతి అసత్యాన్ని దైవప్రవక్త (స) మరియు ఆయన అనుయాయులకు అంటగట్టి, ఆయన్ను రకరకాల కుట్రల ద్వారా అభాసుపాలుచేసి, ప్రజల్లో ఆయన పట్ల అసహ్యతను సృష్టించడానికి ప్రయత్నాలు జరిగాయి. రకరకాల నేరాలు ఆయన (స)పై మోపడమూ జరిగింది. వ్యతిరేక ప్రచారం చేసే ఓ పెద్ద సైన్యమే, ఆయనకు వ్యతిరేకంగా ప్రజల మనస్సుల్లో కుశంకలను రేకెత్తించే ప్రయత్నాలు చేసింది. దైవప్రవక్త (స) మరియు ఆయన సహచరులను రకరకాలుగా హింసించడం వలన వారి హింసా దౌర్జన్యాలను తట్టుకోలేక ముస్లిముల ఓ పెద్ద సంఖ్య దేశాన్ని వదిలి పరదేశానికి వలస కూడా వెళ్ళింది. అదేకాదు, ఆయన సందేశాన్ని నిలువరించడానికి, పోకిరిమూకలను ఎల్లవేళలా ఆయన్ను అంటిపెట్టుకొని ఉండి, దైవప్రవక్త (స) ఎప్పుడైతే సత్యప్రచారం కోసం నోరు మెదుపుతారో అదే సమయంలో గోలచేసి ఆయన మాటలను ఎవరూ వినకుండా చేసేటట్లు ఓ ప్రణాళికను కూడా సిద్ధపర్చడం జరిగింది. స్థయిర్యాన్ని కోల్పోయే ఇలాంటి పరిస్థితుల్లో చూడడానికి సందేశప్రచార మార్గాలన్నీ మూసుకుపోయేటట్లు అగుపించినా, ఆ తరుణంలోనే ఆ వ్యతిరేకతను పటాపంచలు చేసే ఈ దివ్య ఔషధం దైవప్రవక్త (స)కు తెలియచేయడం జరిగింది.

దివ్యఖుర్ఆన్ ఈ ఆయతు వివరణపై మొట్టమొదటిగా చెప్పబడిన విషయం ఏమిటంటే, సత్కార్యాలు, దుష్కార్యాలు ఎప్పుడు ఒకటి కాజాలవన్నది. అంటే చూడడానికి మీ వ్యతిరేకులు దుర్మార్గాల భయంకర తుఫానులు ఎంతగా రేపినప్పటికీ, దానికి ఎదుర్కొవడంలో మీ సత్కార్యం ఎంత బలహీనంగా అగుపిస్తున్నా, దుర్మార్గాలు

మాత్రం బోలెడు లొసుగుల్ని కలిగి ఉంటాయి. చివరికి ఆ లొసుగులే వారిని నామరూపాల్లేకుండా చేయగలవు. కారణం, మనిషి మనిషిగా జీవించినంత కాలం అతని నైజం చెడును అసహ్యించుకోకుండా ఉండదు, చెడుకు వెన్నుకాచే వారే కాకుండా దాని ధ్వజవాహకులకు సైతం వారు అసత్య ప్రచారకుల మని, దౌర్జన్య పరులమని, తమ ప్రయోజనాలు, స్వార్థాల కోసమే మంకుపట్టు పడుతున్నామని ఎరుగకపోరు. ఈ విషయం ఇతరుల మనస్సుల్లో వారి ఔన్నత్యాన్ని పెంచే బదులు స్వయంగా వారు తమ దృష్టిలోనే అధములైనట్లుగా అనుభూతి చెందుతారు. వారి మనస్సుల్లోనే ఓ మూలన అపరాధ భావం చోటుచేసుకొని ఉండి ప్రతి వ్యతిరేక చర్యగైకొన్నప్పుడు లోపలి నుండే వారిధైర్యాన్ని, పట్టుదలను కొల్లగొడుతూ ఉంటుంది. ఈ దౌష్ట్యానికి బదులు యే సత్కార్యం అయితే ఇప్పటి వరకు బలహీనమైనదిగా అగుపడుతూ వచ్చిందో అదే నిరంతరంగా పనిచేస్తూపోతుంటే, చివరికి అదే విజయాన్ని సాధించగలదు. ఎందుకంటే సత్కార్యం అన్నది దానికదే మనస్సులను జయించే శక్తిగలది కనుక. మనిషి ఎంత చెడిపోయి ఉన్నప్పటికీ, అతను తన మనస్సులో దాని విలువను కాదనలేడు. దుష్కార్యం మరియు సత్కార్యం రెండూ పరస్పరం తమ పనిలో నిమగ్నమై ఆ రెంటి ఫలితాలు పూర్తిగా ముందుకు వచ్చి నప్పుడు, ఓ సుదీర్ఘ ఘర్షణ తరువాత చెడును అసహ్యించుతూ సత్కార్యం వైపుకు మరలని వారు బహు అరుదు.

చెప్పబడిన రెండో విషయం ఏమిటంటే, చెడును కేవలం సత్కార్యం ద్వారా తొలగించడమేకాదు, శ్రేష్టమైన మంచిద్వారా తొలగించడం, అంటే, ఎవరైనా మీపట్ల దౌర్జన్యంగా ప్రవర్తిస్తే మీరు అతణ్ణి క్షమించడం. ఇది కేవలం సత్కార్యం మట్టుకే. అదే మీరు అతని దుష్ప్రవర్తనకు మీకు అవకాశం వచ్చినప్పుడు అతణ్ణి ఆదుకుంటే అది శ్రేష్టమైన సత్కార్యం కాగలదు.

దీనివల్ల ఒనగూడే సత్ఫలితం ఏమిటంటే, మీకు బద్ధ శత్రువు కూడా చివరికి మీ ప్రాణ స్నేహితునిగా మారిపోగలడు అన్నది. ఇదే మానవ నైజం కూడాను. పరుష పదజాలానికి ప్రతిగా మీరు మిన్నకుండిపోతే అది తప్పకుండా ఓ పుణ్యకార్యమే కాగలదు. కాని మిమ్మల్ని తిట్టే వారి నోరును మాత్రం మీరు మూయజాలరు. అయితే, అదే తిట్టుకు బదులు మీరు అతణ్ణి దీవించినట్లయితే ఎంత సిగ్గుమాలిన వాడైనా సరే సిగ్గుబడకుండా ఉండలేడు. మిమ్మల్ని తిట్టడానికి అతనికి నోరురాదు. అలాగే మిమ్మల్ని నష్టపెట్టే ఏ అవకాశాన్ని కూడా వదులుకోనివాణ్ణే గనక మీరు సహనంతో భరిస్తూ పోతుంటే, అతను ఇంకా రెచ్చిపోయి మిమ్మల్ని మరింత నష్టపెట్టగలడు. అయితే, అతనికే ఏదైనా నష్టం వాటిల్లినప్పుడు ఆ అవకాశాన్ని వినియోగించుకొని మీరే గనక అతణ్ణి రక్షిస్తే అతడు మీ పాదాల వద్దకు రావడం ఖాయం. కారణం, ఏ చెడు కార్యం కూడా సత్కార్యం ముందు నిలువలేదు గనుక. అయితే, ఈ సిద్ధాంతాన్ని

ఆ అర్థంలోనే అన్వయించుకోవడం ఎప్పుడూ పనికిరాదు. మీరు వారి దౌర్జన్యాలను సహించి క్షమించివేసినా, వారి దుష్కర్మలకు శ్రేష్ఠమైన రీతిలో నివారించడంలో మీరు ఎంత నైపుణ్యాన్ని ప్రదర్శించినప్పటికీ ప్రపంచంలో నివసించే కొందరు దుర్మార్గుల విషం వారి తేలుకొండుల్లో నుండి లేశమైనా తగ్గిపోదు. అయితే అలాంటి విషం గల వారు మాత్రం బహుకొద్ది మందే, దానికి తగ్గట్లు నిలువెల్ల సత్కార్యం గలవారు కూడా మనకు అరుదుగానే కనిపిస్తారు ప్రపంచంలో.

సందేశ ప్రచారం, సహనాల నడుమగల అవినాభావ సంబంధం

సందేశ ప్రచారకుడు చెడుకు బదులు మంచిని పెంచే కార్యం చేబట్టడం ఓ మహోన్నత కార్యం. ఈ విషయం వైపుకు దివ్యఖుర్‌ఆన్‌లోని ఈ వాక్యం దృష్టిని మళ్ళిస్తోంది.

وَمَا يُلَقّٰهَا اِلَّا الَّذِيْنَ صَبَرُوْا (السجده)

"ఈ సుగుణయోగం సహనశీలురకు తప్ప మరెవరికీ లభ్యం కాదు."

(హామీమ్ అస్సజ్దా:34)

అంటే చెడును మంచి ద్వారా చెరిపివేసే పని ఫలవంతమయ్యేదే. అయితే దాన్ని ఉపయోగించడం మాత్రం మాటలుకాదు. దానికోసం కావలసిన ధైర్యసాహసాలు కూడా ఉండాలి. గొప్ప సహనశక్తి పొంది తన మనస్సును అదుపులో ఉంచుకొనే శక్తిని పొందవలసి ఉంటుంది. ఎప్పుడో ఒకప్పుడు ఓ వ్యక్తి ఓ చెడును రూపు మాపేందుకు సత్కార్యాన్ని అవలంబించగలడు గాని, సంవత్సరాల తరబడి ఒకే వ్యక్తి ఆ అసత్యవాదులైన తుంటరి వారికి ఎదురుగా నిలుచొని సత్యం కోసం పోరాడడం మాత్రం మాటలు కాదు. అధికారం, అంగబలం మత్తులో తూగుతూ అత్యాచారాలకు పాల్పడేవారికి ఎదురుగా నిలబడి ఓ సుదీర్ఘకాలం వరకు వారి దౌర్జన్యాలకు ప్రతిగా సత్కార్యాలు ఆచరించడం, ఆ సత్కార్యాలు కూడా గొప్పగా ఆచరించడం, ఏ సమయంలోనూ సహనాన్ని కోల్పోకుండా ఉండడం ఓ సామాన్య వ్యక్తివల్ల అయ్యే పనికాదు. ఈ పని చిత్తశుద్ధిగా సత్యధర్మ ధ్వజాన్ని ఎగురవేయడానికి మంచి పట్టుదల గలవాడు చేసే వ్యక్తి మాత్రమే. అతనే తన మనస్సును పూర్తిగా తన బుద్ధి విజ్ఞానాల గుప్పెట్లో ఉంచుకునే వ్యక్తి. ఏ వ్యక్తిలోనైతే సత్కార్యాలు, సత్ప్రవర్తన మూలాలు బాగా వ్రేళ్ళూనుకొని పోయి ఉంటాయో ఆ వ్యక్తిని అతని విరోధులు, వ్యతిరేకులు, కుట్రలు, కుతంత్రాలు, దౌర్జన్యాలు పన్ని కూడా అతను నిలబడిన ఆ ఉన్నత స్థానం నుండి క్రిందికి దించలేవు. కాబట్టే,

وَمَا يُلَقّٰهَا اِلَّا ذُوْ حَظٍّ عَظِيْمٍ (السجده: ١٣٥)

"ఈ స్థానం మహా అదృష్టవంతులకు తప్ప మరెవరికీ దక్కదు."(హామీమ్ అస్సజ్దా:135) అని చెప్పడం జరిగింది.

ఓ ఉన్నత స్థానాన్ని అలంకరించిన వ్యక్తే ఈ సుగుణాలను పుణికి పుచ్చుకో గలడన్నది ప్రకృతి చట్టం. మరెవరైతే ఇలాంటి సుగుణాలను కలిగి ఉంటాడో, ప్రపంచంలోని ఏ శక్తీ అతనిని విజయ లక్ష్యం వరకు చేరకుండా నిలువరించజాలదు.

షైతాను ప్రేరణల నుండి దైవ శరణు వేడుకోవడం

وَ اِمَّا يَنْزَغَنَّكَ مِنَ الشَّيْطٰنِ نَزْغٌ فَاسْتَعِذْ بِاللّٰهِ

“షైతాను తరపు నుండి ఏదైనా దుష్ప్రేరణ జరుగుతోంది అన్నప్పుడు మీరు అల్లాహ్ శరణు పొందండి” అని సెలవియ్యడం జరిగింది.

సత్యాసత్యాల నడుమ జరిగే పోరులో దుష్ప్రవర్తనకు బదులు మీరు సత్ప్రవర్తనను ప్రదర్శిస్తున్నారని, చెడుకు బదులు మంచిని అవలంబిస్తున్నారని షైతాను గమనిస్తే, అతడు ఈ విషయంలో తీవ్రమైన బాధకులోనై ఏదో ఓ రకంగా, ఒక్కసారైనా సరే, సత్యానికి కొమ్ముకాచేవారిని, ముఖ్యంగా బాధ్యతాయుతంగా మసులుకునే ఆ సత్యధర్మ నాయకుల చేత ఏదైనా తప్పు చేయించడానికి ప్రయత్నిస్తాడు. ఆ తప్పు ద్వారా సామాన్య ప్రజల్లో, చెడు అన్నది ఒకే పక్షానికి చెంది లేదు అనే భావనను సృష్టించాలన్నది అతని కోరిక. ఓ వైపు హేయమైన ఎత్తుగడలు పన్నబడు తున్నా, మరో పక్షం కూడా దీనికి ఏ మాత్రం తీసిపోనట్లుగా ప్రవర్తిస్తోంది అని అను కునేటట్లు చేస్తాడు. సామాన్య ప్రజల్లో, ఓ పక్షం చేసే దురాగతాలను, దానికి ప్రతిగా మరో పక్షం అవలంబించే మార్గాన్ని బేరీజు వేసే న్యాయమేదో పోల్చిచూసే సామర్థ్యం చాలా తక్కువ. వ్యతిరేకి సత్యధర్మ ధ్వజవాహకుల పట్ల హేయమైన ఎత్తుగడలను అవలంబిస్తున్నప్పటికీ వీరు మాత్రం ఎంతో సహనంగా, గౌరవప్రదంగా మంచి మరియు సత్కార్యాల మార్గాన్ని ఏ మాత్రం అవలంబించడం లేదన్నది తెలిసి, ఆ వైఖరి ద్వారా ఎంతో ప్రభావితులౌతుంటారు. కాని, ఒకవేళ ఆ అల్లరి మూక పెట్టే అల్లరికి జవాబుగా ఎప్పుడైనా వారి స్థాయికి విరుద్ధంగా ఏదైనా తప్పు జరిగిపోతే- అది ఎంత ఘోరమైన హింసకు జవాబుగానైనాసరే- వారి దృష్టిలో ఉభయులూ సమానులు గానే అగుపడ తారు. ఇలాంటి సందర్భాల్లో, ఆ ఒక్క మాటను సాకుగా తీసుకొని వ్యతిరేకులకు వేయి తిట్లు తిట్టే సాకు లభిస్తుంది. దీని కోసమే షైతాను వేసే ఎత్తుగడలను సావధానంగా ఎదుర్కోండి అని సెలవియ్యడం జరిగింది. అతను మీకు శ్రేయోభి లాషిగా నటిస్తూ మిమ్మల్ని ఉద్రేకపడేటట్లు చేస్తూ, ఫలానా దౌర్జన్యం అసలే సహించ కూడదు అని మాటకు మాట, దాడికి ప్రతిదాడి చేయాల్సిందే అని ప్రేరేపిస్తాడు. అలా జరగని పక్షంలో ఎదుటి విరోధి మిమ్మల్ని పిరికిపందలుగా భావిస్తాడు, మీ విలువ ఏమీ ఉండబోదు అనే భావాన్ని కలుగజేస్తాడు. ఇలాంటి ప్రేరణ ఏదైనా మీలో

ఉద్భవిస్తే వెంటనే జాగరూకులుకండి. ఇది షైతాను ప్రేరణ అని తెలుసుకోండి. మిమ్మల్ని ఉద్రేకానికి గురిచేసి మీచేత తప్పుదొరిలేటట్లు ప్రయత్నిస్తాడు. ఆ పిదప, జాగరూకులు అయిన తరువాత కూడా మీరు, "నా మనస్సును నియంత్రించు కున్నాను, ఇక షైతాను నా చేత ఎలాంటి తప్పు చేయించలేడు" అనే ధీమాలో పడిపోకండి. ఈ స్వయం నిర్ణయశక్తి, ఈ ధీమా అన్నది షైతాను మరో ప్రమాదకరమైన మోసం. దానికి బదులు మీరు దైవ శరణు కోరుకోవాలి. ఎందుకంటే ఆయన మిమ్మల్ని షైతాను ఎత్తుగడల నుండి సంరక్షించేవాడు. మీకు సద్బుద్ధిని ప్రసాదించేవాడూను.

ఈ విషయాన్ని మరింత వివరంగా అర్థం చేసుకోవడానికి ఇమామె అహ్మద్ (రహ్మాలై) తన గ్రంథం ముస్నదె అహ్మద్‌లో పొందుపరచిన ఓ సంఘటనను చద వాల్సిందే. హజ్రత్ అబూహురైరా (ర) ఉల్లేఖనం ఇది. ఆయన ఇలా చెబుతారు:

"ఓసారి ఓ వ్యక్తి దైవప్రవక్త (స) వింటూ ఉండగానే హజ్రత్ అబూబక్ర్ సిద్దీఖ్ (ర)గారిని ఎంతో పరుషపదజాలంతో తిట్టనారంభించాడు. హజ్రత్ అబూబక్ర్(ర) నిశ్శబ్దంగా అతని తిట్లను వింటూ మిన్నకుండిపోయారు. మహాప్రవక్త (స) అది గమనిస్తూ చిరునవ్వు చిందుస్తూపోయారు. చివరికి హజ్రత్ అబూబక్ర్(ర) అతని తిట్లను భరించలేక సహనం కోల్పోయి సమాధానంగా తానుకూడా ఓ పరుష పదాన్ని తమ నోటితో పలుకవలసి వచ్చింది. ఆయన (ర) నోట ఆ మాట వెలువడగానే దైవప్రవక్త (స) ముఖారవిందం కోపంతో ఎరుపెక్కింది. వెంటనే అక్కడి నుండి లేచి వెళ్ళి పోయారు. ఆయన (స) హజ్రత్ అబూబక్ర్ సిద్దీఖ్ (ర) కూడా ఆయన వెంటే బయలు దేరారు. దారిలో ప్రవక్త (స)నుద్దేశించి, "ప్రవక్తా! అతను నన్ను తిడుతున్నంత సేపూ మాట్లాడకుండా తమరు చిరునవ్వు ఎందుకు చిందించినట్లు? నేను అతని తిట్లకు సమాధానంగా ఒక్కమాట జారితే మీరు ఎందుకు కోపబడ్డట్లు?" అని ప్రశ్నించారు. దానికి మహాప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు:

"నీవు మిన్నకుండా ఆ తిట్లు వింటున్నంత వరకు ఓ దైవదూత నీ వెంటే ఉండి నీ తరఫున అతనికి సమాధానం ఇస్తూపోయాడు. కాని నీవు మాట్లాడగానే ఆ దైవదూత స్థానంలో షైతాను వచ్చేశాడు. నేను షైతాను ఉన్నచోట కూర్చోలేనుకదా!"

మొత్తానికి విరోధుల వ్యతిరేకతా తుఫానుల నడుమ గుర్తుంచుకోవలసిన విషయం, అల్లాహ్ జరిగే విషయాలను గమనిస్తూనే ఉన్నాడన్నది.

إِنَّهُ هُوَ السَّمِيعُ الْعَلِيمُ ○ (السجدہ : ٣٦)

"ఆయన సమస్తమూ ఎరిగినవాడు." (అస్సజ్దా:36)

వ్యతిరేక పవనాలు వీస్తున్నప్పుడు అల్లాహ్ శరణుకోరగా, యే అంశం అయితే ఓ మోమిన్ హృదయంలో సహనాన్ని, శాంతిని, సంతృప్తిని కలగజేస్తుందో అది "అల్లాహ్

మమ్మల్ని గమనించకుండా లేడు" అన్న విశ్వాసమే. కాబట్టి మనం చేస్తున్నదంతా ఆయనకు తెలుసు. అలాగే మన పట్ల ఇతరులు ప్రవర్తిస్తున్న తీరు కూడా ఆయన గమనిస్తూనే ఉన్నాడు; మనం మాట్లాడేదంతా ఆయన వినడమే కాకుండా, మన వ్యతిరేకులు పరుషపదజాలంతో మనలను దూషించేదంతా ఆయన వింటూనే ఉన్నాడు; ఉభయుల వైఖరి ఎలాంటిదో ఆయన చూస్తూనే ఉన్నాడు. ఈ భరోసా ఉండినట్లయితే ఓ విశ్వాసి, సత్యధర్మ విరోధుల వ్యవహారాన్ని అల్లాహ్‌కే అప్పగించి తాను పూర్తిగా నిశ్చింతతో ఉండిపోగలడు.

సందేశ ప్రచారంలో పాటించవలసిన నాల్గు అంశాలు

దివ్యఖుర్ఆన్ సందేశ ప్రచార వివేకం గురించి నాల్గు అంశాలను వివరించింది:

1. మృదుత్వం మరియు మన్నింపుల వైఖరి
2. సతతం మంచినే బోధించడం
3. మూర్ఖులతో వివాదానికి దిగకుండా ఉండడం
4. షైతాను ఉసిగొల్పినప్పుడు అల్లాహ్ శరణు వేడడం.

خُذِ الْعَفْوَ وَأْمُرْ بِالْعُرْفِ وَأَعْرِضْ عَنِ الْجَاهِلِينَ ۝
وَإِمَّا يَنْزَغَنَّكَ مِنَ الشَّيْطٰنِ نَزْغٌ فَاسْتَعِذْ بِاللّٰهِ ۚ
إِنَّهُ سَمِيعٌ عَلِيمٌ ۝ (اعراف: ۱۹۹، ۲۰۰)

"ప్రవక్తా! మృదుత్వం, మన్నింపుల వైఖరిని అవలంభించు. మంచిని ప్రబోధించు. మూర్ఖులతో వివాదానికి దిగకు. ఒకవేళ ఎప్పుడైనా షైతాను నిన్ను ఉసిగొలిపితే అల్లాహ్ శరణువేడు. ఆయన అన్నీ వినేవాడు, అన్నీ తెలిసినవాడూను."
(అల్ ఆరాఫ్: 199-200)

ఆ పిదప సందేశ ప్రచారకుని వైఖరిని వివరిస్తూ ఇలా సెలవియ్యడం జరిగింది:

إِنَّ الَّذِينَ اتَّقَوْا إِذَا مَسَّهُمْ طٰٓئِفٌ مِّنَ الشَّيْطٰنِ
تَذَكَّرُوا فَإِذَا هُمْ مُّبْصِرُونَ ۝ وَإِخْوَانُهُمْ يَمُدُّونَهُمْ
فِي الْغَيِّ ثُمَّ لَا يُقْصِرُونَ ۝ (اعراف: ۲۰۱، ۲۰۲)

"వాస్తవానికి భయభక్తులు కలవారి స్థితి ఇలా ఉంటుంది: ఎప్పుడైనా షైతాను ప్రభావం వల్ల వారికి ఏదైనా చెడు ఆలోచన తట్టినప్పటికీ, వారు తక్షణం అప్రమత్తులౌతారు, తరువాత వారు అవలంబించవలసిన సరైన మార్గమేమిటో వారికి స్పష్టంగా కనిపిస్తుంది. ఇక వారి (అంటే షైతానుల) సోదరుల, వారు వారిని తమ

వక్రమార్గంలోనికే లాక్కుపోతారు. వారిని భ్రష్టులుగా చేయడంలో ఏ మాత్రం లోపం చేయరు."
(అల్ ఆరాఫ్: 201-202)

ఈ ఖుర్ఆన్ వాక్యాల్లో దైవప్రవక్తకు, సందేశ ప్రచారం, హితబోధ మరియు సంస్కరణలకు సంబంధించిన కొన్ని ఉపాయాలు చెప్పడం జరిగింది. దాని ఉద్దేశ్యం కేవలం దైవప్రవక్త (స) వారికే బోధించడం కాకుండా ఆయన ద్వారా, ఆయన కార్యాన్ని నిర్వహించే వారసులై ప్రపంచానికి సన్మార్గం చూపడానికి నడుముగట్టిన వారందరికీ ఈ ఉపాయాలను, ఈ నైపుణ్యాన్ని నేర్పడం ప్రధాన ఉద్దేశ్యం. ఓ సందేశ ప్రచారకునిలో తప్పకుండా ఉండవలసిన సుగుణాలివి. వాటిని ఇప్పుడొక్కటొక్కటిగా విశ్లేషించి చూద్దాం.

ఓర్పు, నిలకడ, హుందాతనం కలిగి ఉండడం

సత్యధర్మ ప్రచారకునిలో ఉండవలసిన అతి ముఖ్యమైన సుగుణాల్లో మృదుత్వం, సహనశీలం, హుందాతనం కలిగి ఉండే సుగుణం ఒకటి. అతను తన సహచరుల పట్ల అనురాగం కలిగి, సర్వమానవాళి పట్ల కరుణను కలిగి ఉండడమే కాకుండా, తన విరోధులు పెట్టే ఇబ్బందులకు ఓర్పు వహించేవాడుగా ఉండాలి. అదే కాకుండా తన సహచరుల లోపాలను భరించడమే కాకుండా విరోధుల లోపాలను కూడా హుందాగా భరించవలసి ఉంటుంది. తీవ్రమైన, రెచ్చగొట్టే సందర్భాల్లోనూ అతను ఉద్రేకానికి లోనుకాకుండా ఉండాలి. పెద్ద మనిషి తరహాలో వారి తిట్లను, శాపనార్థాలను సైతం పెడచెవిన పెట్టాలి. వ్యతిరేకుల తరపు నుండి ఎంత దురుసు ప్రవర్తన ఎదురైనా, ఎన్ని అపనిందలు మోపబడినా, ఎంత హింసించడం జరిగినా అతను క్షమాదృష్టితో వాటిని ఎదుర్కోవాలి. ఒకవేళ అతనే గనక దురుసుతనం, దుర్భాషలు, కఠిన ప్రవర్తన, రెచ్చగొట్టే వైఖరిని ప్రదర్శిస్తే అది అతని పట్లే కాకుండా అతను ఏకార్యాన్నైతే చేబట్టాడో దానికి ఆ వైఖరి విషంలా పరిణమించవచ్చు. దీనివల్ల పని నెరవేరడం అటుంచి ఆ పని పూర్తిగా చెడిపోగలదు. ఈ విషయాన్నే దైవప్రవక్త (స) వారు ఇలా సెలవిచ్చారు:

"నాకు ఈ విధంగా ఆదేశించడం జరిగింది: నాకు ఉద్రేకం కలిగిన సమయం మరియు నేను ఎలాంటి ఉద్రేకానికి లోనుకాని సమయాలు రెంటిలోనూ, నేను న్యాయమైన మాటలనే మాట్లాడాలి, నన్ను కాదని నాకు దూరం అయిపోతున్నవానికి దగ్గరై వారిని అక్కున చేర్చుకోవాలి; నా హక్కులను నాకు దక్కకుండా చేసేవారికి నేను వారి హక్కులను ఇవ్వాలి. నన్ను హింసించినవారిని నేను క్షమించాలి."

ధార్మిక కార్యం కోసం పంపబడే ప్రతి వ్యక్తినీ, ఆయన (స) అతను వెళ్ళేటప్పుడు ఈ క్రింది హితబోధ చేసి పంపేవారు.

بَشِّرُوْا وَلَا تُنَفِّرُوْا وَيَسِّرُوْا وَلَا تُعَسِّرُوْا

"మీరు ఎక్కడికి వెళ్ళినా మీ రాక ప్రజలకు అసహనానికి గురిచేయకుండా సంతోషాన్ని కలిగించేలా ఉండాలి. ప్రజలకు మీరు వెసలుబాటు కలిగించే వైఖరిని అవలంబించండి. వారిని ఇబ్బందికి గురిచేయకుండా ఉండండి."

దైవప్రవక్త (స)కు పొగుడుతూ అల్లాహ్ తన గ్రంథంలో ఈ విషయాన్నే ఉటంకించాడు.

فَبِمَا رَحْمَةٍ مِّنَ اللّٰهِ لِنْتَ لَهُمْ وَلَوْ كُنْتَ فَظًّا غَلِيْظَ الْقَلْبِ لَا نْفَضُّوْا مِنْ حَوْلِكَ ۔

"నీవు వారి ఎడల మృదుస్వభావుడవు. ఒకవేళ నీవే గనక దురుసు స్వభావం, కఠిన హృదయం కలిగి ఉండి ఉంటే వారు నీ పరిసరాలలో ఉండకుండా ఎప్పుడో వెళ్ళిపోయి ఉండేవారు. ఇది దైవకారుణ్యమే."

డొంక తిరుగుడు మాటలకు బదులు సూటిగా మాట్లాడడం

సత్యధర్మ సందేశ విజయానికి గల కిటుకు ఏమిటంటే, మనిషి తార్కిక పంథా అవలంబించకుండా, అర్థంకాని మాటలు వల్లించకుండా ప్రజలను వారికి అర్థమయ్యే భాషలో సాదాసీదాగా అందరికీ తెలిసిన సత్కార్యాలు అవలంబించాలని బోధించడం. ఆ సత్కార్యాలు ప్రతి మనిషీ మంచి పనులుగా భావించే సత్కార్యాలు. వాటిని అర్థం చేసుకోవడానికి ప్రతి మనిషికి దైవం ఇంగిత జ్ఞానాన్ని (Common Sense) ప్రసాదించాడు.

ఈ సత్యధర్మ ప్రచారకుడు చేసే ఇలాంటి అభ్యర్థన ప్రతి మనిషినీ ప్రభావితం చేయగలదు. అది వినేవాని మనస్సులో నాటుకోగలదు. అందరూ ఎరిగిన ఇలాంటి మంచి వైపునకు పిలిచే కార్యానికి వ్యతిరేకంగా ఎవరైనా అద్భుతగులుతూ కల్లోలాన్ని రేపే ప్రయత్నం చేస్తే, వారే స్వయంగా తాము తమ అపజయానికి మరియు మన ఈ ప్రచారం విజయానికే కారణభూతులౌతారన్నది యదార్థం. ఎందుకంటే, సామాన్య ప్రజలు, "మనకు ఎంత విరోధి అయినప్పటికీ, ఓ ఉన్నత నైతిక విలువలు కలిగి గౌరవప్రదమైన జీవితం గడుపుతున్నవాడు ఎంత చక్కగా మనలను సన్మార్గం వైపుకు పిలుస్తున్నాడు అని ఆలోచిస్తాడు. మరో వైపు అతనికి వ్యతిరేకంగా ఎన్ని హేయమైన ఎత్తుగడలు పన్నబడుతున్నాయన్న యదార్థాన్ని గమనించినప్పుడు అతను అనుకోకుండానే క్రమక్రమంగా వ్యతిరేకులను అసహ్యించుతూ మన వైపుకు మొగ్గు చూపనారంభిస్తాడు. చివరికి రంగంలో మిగిలేదల్లా అసత్యవ్యవస్థతో తమ ప్రయోజనాలను ముడిపెట్టకున్నవారో లేదా తాత ముత్తాతల అంధానుకరణ మరియు

అజ్ఞానపు చీకట్లలో కొట్టుమిట్టాడేవారు మాత్రమే. అరేబియాలో దైవప్రవక్త (స) వారికి విజయం చేకూరింది ఈ వివేకాన్ని అవలంబించడం వల్లనే. ఆయన తరువాత కూడా కొద్ది కాలంలోనే ఇస్లామీయ వెల్లువ పరిసర దేశాల్లో ప్రవేశించి, ఒక్కోచోట నూటికి నూరు శాతం మందిని, మరో చోట 80శాతం మందిని, ఇంకోచోట 90శాతం మందిని ముస్లిములుగా మార్చివేసింది.

మూర్ఖులకు, అజ్ఞానులకు దూరంగా ఉండడం

ఈ సందేశ ప్రచారకార్యంలో సత్యపిపాసులకు సన్మార్గబోధ జరపడం ఎంత ముఖ్యమో, అజ్ఞానుల జోలికి పోకుండా ఉండడం కూడా అంతే ముఖ్యం. వారు మిమ్మల్ని కవ్వించడానికి ఎంత ప్రయత్నం చేసినా సరే. సందేశాన్నందించే వాని సంబోధన కేవలం మాటను అర్థం చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నవారి కోసమే పరిమితమై ఉండాలి. ఎవరైనా దురుసుతనాన్ని ప్రదర్శిస్తూ తర్కానికి లేదా దుర్భాషలకు దిగితే సందేశ ప్రచారకుడు మాత్రం అతణ్ణి ఎదిరించ నిరాకరించవలసి ఉంటుంది. ఈ విషయంలో అతను ఎంతో సావధానంగా మెలగాలి. ఎందుకంటే వివాదంలో ఇరుక్కోవడం వలన అతనికి నష్టం తప్ప మరేదీ మిగలదు. కారణం, ఏ శక్తినైతే అతను సందేశ ప్రచారం మరియు సంస్కరణ కోసం ఖర్చు చేయవలసి ఉంటుందో అది అనవసరమైన విషయంలో ఖర్చయిపోగలదు.

కవ్వింపులో సహనాన్ని ప్రదర్శించడం

మీ విరోధుల తరఫున వచ్చే ఒత్తిడి మరియు హింసల కారణంగా ఏదేని ప్రతిచర్య భావం ఉద్భవిస్తే అది షైతాను ప్రేరణ అని గమనించాలి. కాబట్టి ఎప్పుడైనా సందేశవహుడు, వ్యతిరేకుల హింసా దౌర్జన్యాలకు, వారి అజ్ఞానపు ఆక్షేపణలకు, వారు అతనిపై మోపే అపనిందలకు రెచ్చిపోయే సందర్భం వస్తే, అది షైతాను ప్రోద్బలం అని భావించి ఆ వెల్లువలో కొట్టుకుపోకుండా రక్షించమని వెంటనే దైవ శరణు వేడుకోవాలి. తాను నియంత్రణను కోల్పోయి సత్యధర్మానికి ఎక్కడ చేటు చేస్తానో అనే భయంతో వణికిపోవాలి. సత్యధర్మ కార్యం కేవలం వివేకం ద్వారానే నెరవేరగలదు. భావోద్రేకాలకు లోనుకాకుండా, సమయం, సందర్భాలను దృష్టిలో ఉంచుకుని, బాగా ఆలోచించి అడుగువేసేవాడే సరైన నిర్ణయం తీసుకునేవాడు. అయితే, ఆ పని సక్రమంగా నిర్వర్తించబడుతోందని గుర్తించిన షైతాను మాత్రం, ఆ కార్యంలో విఘ్నాలను సృష్టిస్తూ తన సహచరులను సత్యధర్మ సందేశహరునిపైకి ఉసికొల్పి ప్రతి దానికి ప్రతిదాడి చేసేటట్లుగా అతణ్ణి ప్రేరేపించడం జరుగుతుంది. మానసికంగా సందేశ ప్రచారకుణ్ణి లోబరచుకోవడానికి షైతాను వేసే ప్రతి ఎత్తుగడ చాలా మట్టుకు మనస్సును ఆకట్టుకునే మాటలు, మరియు ధార్మిక పర్యాయపదాల గలీబుల్లో దాగుంటాయి. కాని వాటి అడుగున ఉండేవి కేవలం మనోవాంఛలే.

అందువల్లనే చివరి రెండు ఆయత్‌లలో, ఎవరైతే దైవానికి భయపడతారో (అంటే చెడులకు దూరంగా ఉండేందుకు ప్రయత్నిస్తారో) వారు తమ మనస్సులో మరో ఉద్యమం ప్రభావమో లేదా మరో చెడు ఆలోచనో పొడజూపుతోందని తెలుసుకోగానే వెంటనే సావధానచిత్తులైపోతారు. అలా సావధానులైపోగానే వారికి, ఏ వైఖరి అవలంబించడంలో సత్యధర్మ ప్రయోజనం దాగుంది? అలాగే వారి నుండి సత్యం కోరే విషయమేమిటి? అనేది తేటతెల్లమైపోతుంది. ఇక ఎవరిలోనైతే 'మనోవాంఛలకు దాసోహం' అనే నైజం దాగుంటుందో వారికి షైతానుతో మైత్రీ సంబంధాలు ఏర్పడ తాయి. అలాంటప్పుడు వారు షైతాను ప్రేరణలను ఎదుర్కోలేకపోవడమో లేదా అతని వలలో చిక్కి తప్పుడు మార్గాలను అవలంబించడమో చేస్తారు. ఆ తరువాత షైతాను వారిని తమ ఇచ్ఛ వచ్చినట్లు ఎటు కావాలంటే అటు త్రిప్పుతూ ఉంటాడు. ఎక్కడా వారి అడుగులు ఆగవు. వ్యతిరేకి దుర్భాషలకు తాను కూడా జవాబుగా దుర్భాషలాడడం, ప్రతి ఎత్తుగడకు తాను కూడా అంతకుమించిన మరో ఎత్తుగడను పన్నడం జరిగిపోతుంది.

సందేశ ప్రచారంలో నిలకడ

وَإِذَا لَمْ تَأْتِهِم بِآيَةٍ قَالُوا لَوْلَا اجْتَبَيْتَهَا ۚ
قُلْ إِنَّمَا أَتَّبِعُ مَا يُوحَىٰ إِلَيَّ مِن رَّبِّي ۚ هَٰذَا بَصَائِرُ مِن رَّبِّكُمْ
وَهُدًى وَرَحْمَةٌ لِّقَوْمٍ يُؤْمِنُونَ ۝ (الاعراف : ٢٠٣)

"ప్రవక్తా! నీవు వారికి ఏదైనా ఒక సూచనను (మహత్యాన్ని) చూపకపోతే వారు ఇలా అంటారు: 'నీవు నీ కొరకు ఏదైనా సూచనను ఎందుకు ఎన్నుకోలేదు?' వారితో ఇలా అను: 'నేను కేవలం నా ప్రభువు నా వద్దకు పంపిన వహీని మాత్రమే అనుసరిస్తాను. ఇందులో జ్ఞానకాంతి పుంజాలు ఉన్నాయి. అవి మీ ప్రభువు తరుపు నుండి వచ్చాయి. ఇది మార్గదర్శకత్వం, కారుణ్యం, దానిని స్వీకరించే వారి కొరకు."
(అల్ ఆరాఫ్: 203)

ఈ ఆయత్ మొదటి భాగంలో, దైవతిరస్కారులు ఏ ప్రశ్న అయితే వేశారో ఆ ప్రశ్నలో పూర్తి ఎత్తిపొడుపు భావం దాగుంది. అంటే వారు అడిగిందేమిటంటే, నీవు ఏ విధంగానైతే ప్రవక్తను అని చెప్పుకుంటున్నావో ఆ విధంగానే ఏదో ఓ మహత్యాన్ని కూడా ఎందుకు కల్పించి తీసుకురాలేకపోయావు? అన్నదే ఆ ఎత్తిపొడుపు. దానికి సమాధానంగా దైవప్రవక్త (స) చెప్పింది ఎంత హుందాగా ఉందో గమనించండి. "మీరు ఏ విషయాన్నైతే తీసుకురమ్మని డిమాండు చేస్తున్నారో, లేదా దేని అవసరం అయితే నాకుంది అని అనుకుంటున్నారో దాన్ని నేను స్వయంగా కల్పించి చూపే హోదాకాదునాది. నేను కేవలం ఓ సందేశహరుణ్ణి మాత్రమే. నా హోదా కేవలం,

నన్ను మీ వద్దకు పంపించిన వాని ఆదేశాలపై అమలు చేయడం మట్టుకే. మహత్మ్యానికి బదులు నన్ను పంపించినవాడు దేన్నైతే నా వద్దకు పంపాడో అది ఈ ఖుర్‌ఆనే. ఇందులోనే జ్ఞానకాంతి పుంజాలు ఉన్నాయి. ఇందులో గల ప్రస్ఫుటమైన గొప్పతనం ఏమిటంటే, ఎవరైతే దీన్ని విశ్వసిస్తారో వారికి రుజుమార్గం లభిస్తుంది. వారికే ఇందులో కారుణ్యచ్ఛాయలు గోచరిస్తూ ఉంటాయి."

సందేశ ప్రచారంలో వివేకం మరియు సచ్ఛీలతల ప్రదర్శన

وَاِذَا قُرِئَ الْقُرْاٰنُ فَاسْتَمِعُوْا لَهٗ وَاَنْصِتُوْا
لَعَلَّكُمْ تُرْحَمُوْنَ ۝ (الاعراف: ٢٠٤)

"దివ్యఖుర్‌ఆన్ మీ ముందు పఠించబడుతూ ఉన్నప్పుడు దాన్ని శ్రద్ధతో వినండి, మౌనం పాటించండి. బహుశా మీరు కూడా కరుణింపబడతారేమో."
(అల్ ఆరాఫ్: 204)

అంటే యే వ్యతిరేకతా మరియు మంకుపట్టు కారణంగా మీరు ఖుర్‌ఆన్ పిలుపును వినకుండా మీ చెవుల్లో వేళ్ళు పెట్టుకొని, మీరే కాకుండా ఇతరులను కూడా వినకుండా గోలచేస్తున్నారో ఆ వైఖరిని వదిలి, అందులో ఏ విషయాలైతే బోధించబడ్డాయో వాటిని శ్రద్ధగా వినండి. ఆ బోధనలు మీకు అర్థమైపోయినప్పుడు, విశ్వాసులకు లభించిన దైవకారుణ్య భాగ్యం కూడా మీకు లభించవచ్చు అని చెప్పడం అన్నమాట. వ్యతిరేకుల ఎత్తిపొడుపు మాటలకు జవాబుగా ఇలాంటి సూక్ష్మమైన, మనస్సులను ఆకట్టుకొనే మరియు కఠిన హృదయాలను సైతం లోబరుచుకునే ప్రచార విధానం శ్రేష్ఠతను మాటల్లో చెప్పడం అలవికానిది. ప్రచార నైపుణ్యాన్ని నేర్చుకునే ప్రతి వ్యక్తి బాగా ఆలోచిస్తే, దీని ద్వారా ఎంతో గుణపాఠాన్ని నేర్చుకోగలడు.

దైవాన్ని స్మరించడం

అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు:

وَاذْكُرْ رَّبَّكَ فِىْ نَفْسِكَ تَضَرُّعًا وَّخِيْفَةً وَّدُوْنَ
الْجَهْرِ مِنَ الْقَوْلِ بِالْغُدُوِّ وَالْاٰصَالِ وَلَا تَكُنْ
مِّنَ الْغٰفِلِيْنَ ۝ (اعراف: ٢٠٥)

"ప్రవక్తా! నీ ప్రభువును ఉదయమూ, సాయంత్రమూ స్మరించు, లోలోన వినయంతోనూ, భయపడుతూ మెల్లగా నోటితో కూడాను. నిర్లక్ష్యం చేసే వారిలో నీవు చేరకు."
(అల్ ఆరాఫ్: 205)

స్మరించడం అంటే నమాజూ కావచ్చు లేదా ఇతర రకాల స్మరణ కూడా కావచ్చు. అది నోటి ద్వారా మెల్లగా చేసినా లేదా మనస్సులోనే చేసినా. ఉదయం సాయంత్రం అంటే ఈ రెండు వేళలూ అని. ఆ రెండు వేళ్ళల్లో దైవస్మరణ అంటే నమాజే. ఉదయం సాయంత్రం అనే పదం 'ఎల్లప్పుడూ' అనే అర్థంలోనూ వాడబడుతుంది. దీని ధ్యేయం సతతం దైవస్మరణలో లీనం అయిపోవడం అన్నమాట. ప్రసంగాన్ని ముగిస్తూ బోధించబడిన చిట్టచివరి బోధన ఇది. ఈ బోధనోద్దేశ్యం ఏమిటంటే, మీ పరిస్థితి నిర్లక్ష్యం చేసే వారి పరిస్థితిగా మారకుండా ఉండాలి; ప్రపంచంలో యే రుగ్మతలైతే వ్యాపించి ఉన్నాయో మరియు మనిషి నైతికతల్లో, అతని చేతల్లో ఏ చెడులైతే పొడసూపుతున్నాయో వాటికి కారణం, దేవుడనేవాడొకడు న్నాడని, అతనే తనకు పోషకుడని, తాను అతనికి దాసుణ్ణని, ప్రపంచంలో తనను పరీక్షించడానికే పంపించాడని, ఈ ప్రపంచ జీవితం అంతమైపోయిన తరువాత అతను తన సృష్టికర్తకు లెక్కజూపవలసి ఉంటుందనే యదార్థాన్ని మనిషి మరచిపోవడం వల్లనే. ఏ వ్యక్తి అయితే సన్మార్గాన్ని అవలంబించడం మరియు మానవాళిని ఆ మార్గంపై నడిచేటట్లు చేయదలుచుకున్నాడో అతను ఈ యదార్థాన్ని తానే స్వయంగా విస్మరించకుండా ఉండాలి. అందుకనే నమాజు, దైవస్మరణ మరియు దైవంతో శాశ్వత సంబంధం కలిగి ఉండాలని అల్లాహ్ మాటిమాటికి తాకీదు చేస్తున్నాడు.

వివేకవంతమైన మరియు శ్రేష్ఠమైన హితబోధ

ادْعُ إِلَىٰ سَبِيلِ رَبِّكَ بِالْحِكْمَةِ وَالْمَوْعِظَةِ الْحَسَنَةِ
وَجَادِلْهُم بِالَّتِي هِيَ أَحْسَنُ۔

"ప్రవక్తా! నీ ప్రభువు మార్గం వైపునకు ఆహ్వానించు, వివేకంతో చక్కని హిత బోధతో ప్రజలతో ఉత్తమమైన రీతిలో వాదించు." (అన్ నహ్ల్: 125)

హిక్మత్ (ఉపాయం) అంటే, బుద్ధిహీనుల్లా గ్రుడ్డిగా సందేశాన్ని అందించకుండా వివేకంతో ఎదుటివాని మానసిక పరిస్థితిని, అతని సామర్థ్యాన్ని మరియు అతని పరిస్థితులను అర్థం చేసుకొని, ఇంకా సందర్భాన్ని కూడా దృష్టిలో ఉంచుకొని వారి ముందు మాటను ఉంచవలసి ఉంటుంది. అన్ని రకాల మనుషుల్ని ఒకే తీరుగా సంబోధించకుండా, యే వర్గాన్నైతే మీరు మీ వైపునకు ఆహ్వానించదలిచారో ముందు వారిలోని రుగ్మతలను లేదా వ్యాధిని తెలుసుకోవలసి ఉంటుంది. ఆ తరువాత, ఆ వర్గం వారి మేధ మరియు మనస్సుల్లో నాటుకుపోయిన ఆ రుగ్మతను ఆ వ్యాధిని సమూలంగా పెకిలించివేయడానికి కావలసిన ఆధారాలను చూపి చికిత్స చేయవలసి ఉంటుంది.

"చక్కని హితబోధ"కు రెండు రకాల భావాలున్నాయి. ఒకటి, ఎదుటివానికి కేవలం ఆధారాలను చూపి సంతృప్తిపడేటట్లు చేయడమే కాకుండా అతని భావోద్రే

కాలను కూడా తట్టవలసి ఉంటుంది. చెడులు, రుగ్మతలను కేవలం సిద్ధాంతాలు వల్లించి దూరం చేయడమే కాకుండా మనిషి నైజంలో చెడుపట్ల యే అసహ్యత అయితే దాగుందో దాన్ని మేల్కొలిపి వాటి దుష్పరిణామాల గురించి భయపెట్టవలసి ఉంటుంది. హితబోధ మరియు సద్వర్తనకు సంబంధించిన మేళ్ళను కేవలం సైద్ధాంతికంగానే రుజువు చేయకుండా, వాటి వైపుకు మొగ్గేటట్లు వాటి పట్ల ఉత్సాహం కలిగేటట్లు ప్రయత్నాలు కూడా చేయవలసి ఉంటుంది.

రెండవ భావం ఏమిటంటే, చేసే హితబోధలో హృదయాన్ని ఆకట్టుకునే తీరు, ఎదుటివాని పట్ల శ్రేయం ఉట్టిపడే తీరు. సందేశ ప్రచారకుని వైఖరి ఎలాగుండాలంటే, అహ్వానితుని మనస్సులో ఆహ్వానించేవాని పట్ల ఎలాంటి దురభిప్రాయం పొడసూపకుండా ఉండేటట్లు ప్రవర్తించడం. ఒక్కొక్కప్పుడు ఎదుటివానిలో, తనను ఏమీ తెలియని దద్దమ్మగా తలచి తాను చెబుతున్నదే గొప్ప విషయం అనుకొని బోధిస్తున్నాడనే దురభిప్రాయం కలుగవచ్చు.

ఆ దురభిప్రాయాన్ని తొలగించడానికి సందేశ ప్రచారకుడు తాను, నిజంగానే అతని శ్రేయం కోరుతున్నానని, అతణ్ణి సంస్కరించాలనే తపన కలిగి ఉన్నాననే అభిప్రాయాన్ని కలుగజేయవలసి ఉంటుంది.

ఉత్తమమైన రీతిలో చర్చించడం

ధర్మం వైపునకు ఆహ్వానించేటప్పుడు ఓ సందేశవహుని మాటతీరు కేవలం తార్కికుని తర్కంలా, వితండవాదిలా ఉండి తాను ఇతరులను చులకనగా చూసి మాట్లాడుతున్నట్లుగా ఉండకూడదు. తన భాషా పటిమను చాటి ఎదుటివారి నోరు మూయించేది గాకుండా అతని మాటల్లో తీయందనం, పెద్ద మనిషి తరహా, నైతిక విలువలు ఉట్టిపడేటట్లు ఉండాలి. అతని మాటల్లో మనస్సుకు హత్తుకుపోయే ఆధారాలు అగుపడాలి. అంతేకాని, ఎదుటివానిలో మంకుపట్టు, మాటను నెగ్గించుకునేటట్లు ప్రవర్తించవలసి ఉంటుంది. ఒకవేళ అతనే గనక కయ్యానికి దిగితే అతడు మరింత దుర్మార్గంలోనికి వెళ్ళిపోకుండా అతని మానాన అతణ్ణి వదిలివేయ వలసి ఉంటుంది.

చర్చించే సమయంలో భావోద్రేకాలకు లోనుకాకుండా ఉండడం

وَقُلْ لِّعِبَادِىْ يَقُوْلُوا الَّتِىْ هِىَ اَحْسَنُ (بنی اسرائیل:۵۳)

"ప్రవక్తా! నా దాసులకు (అంటే విశ్వాసులైన దాసులకు), వారు తమ నోట అత్యుత్తమమైన మాటనే పలుకుతూ ఉండాలి అని చెప్పు." (బనీ ఇస్రాయీల్:53)

అంటే, దైవతిరస్కారులు, ముష్రికులు (బహుదైవారాధకులు) మరియు తమ వ్యతిరేకులతో మాట్లాడేటప్పుడు లేదా వారితో వాదానికి దిగినప్పుడు కఠిన పదజాలాన్ని మరియు అసత్య పదజాలాన్ని ఏ మాత్రం వాడకూడదు. వ్యతిరేకులు మనస్సును బాధపెట్టే ఎలాంటి పలకులు పలికినా ముస్లిములు మాత్రం సత్యం తప్ప మరే పలుకును పలకడంగాని, ఆవేశం వెల్లువలో కొట్టుకొనిపోతూ వారి దురుసుతనానికి దురుసుతనంతో సమాధానం ఇవ్వడం గాని చేయకూడదు. వారు శాంతంగా వారి స్థాయికి తగ్గట్టు సరైన, సత్యమైన వచనాలనే పలకాల్సి ఉంటుంది.

కోపోద్రేకాలకు, షైతాను ప్రేరణలకు దూరంగా ఉండడం

వాదనలో ఎప్పుడైనా కోపం పొడసూపినప్పుడు అది షైతాన్ ప్రొద్బలం అని తెలుసుకోవాలి. ఖుర్ఆన్‌లో ఈవిధంగా చెప్పడం జరిగింది:

إِنَّ الشَّيْطَٰنَ يَنزَغُ بَيْنَهُمْ ۚ إِنَّ الشَّيْطَٰنَ كَانَ
لِلْإِنسَٰنِ عَدُوًّا مُّبِينًا (بنی اسرائیل: ۵۳)

"అసలు మానవుల మధ్య కలహాన్ని సృష్టించడానికి ప్రయత్నం చేసేవాడు షైతానే. నిజానికి షైతాను మానవుడికి బహిరంగ శత్రువు." (బనీ ఇస్రాయీల్:53)

కాబట్టి వ్యతిరేకుల ఆక్షేపణలకు జవాబు చెప్పేటప్పుడు మీలో కోపోద్రేక అగ్ని జ్వాలలు పెల్లుబికుతున్నాయని గమనించగానే, మీ సత్యధర్మం వైపు పిలిచే కార్యాన్ని షైతాను చెడగొట్టడానికి ప్రయత్నిస్తున్నాడని తెలుసుకోవాలి. షైతాను ప్రయత్నం అంతా, మీరు కూడా మీ వ్యతిరేకుల్లా మీ సంస్కరణా కార్యక్రమాన్ని వదిలేసి వివాదాల్లో, జగడాల్లో చిక్కుకోవాలన్నదే. అతను మానవాళిని ఈ పనిలోనే నిమగ్నం చేసే ప్రయత్నం చేయదలిచినవాడు.

దుర్భాషలు నోట వెలువడకుండా జాగ్రత్తపడడం

وَلَا تَسُبُّوا الَّذِينَ يَدْعُونَ مِن دُونِ اللَّهِ فَيَسُبُّوا اللَّهَ
عَدْوًا بِغَيْرِ عِلْمٍ ۗ

(ఓ ముస్లిములారా!) వీరు అల్లాహ్‌ను కాదని ఎవరినైతే పూజిస్తున్నారో వారి ఆ ఆరాధకులను తిట్టకండి. (అలా జరిగితే) బహుశా వారు వారి అజ్ఞానం కారణంగా అల్లాహ్‌నే తిట్టగలరేమో."

ఈ హితబోధ దైవప్రవక్త (స) వారి అనుయాయులకు చేయబడిన హితబోధ. వారు తమ సందేశ ప్రచార కార్యక్రమోత్సాహంలో అడుగు మరింత ముందుకు వేసి,

వాదులాడుకుంటూ ముస్లిమేతరుల విశ్వాసాలపై వారి నమ్మకాలపై దాడి చేయడం, వారి మహాపురుషులను, వారి ఆరాధ్య దైవాలను తిట్టేవరకు రాకూడదన్నది దాని భావం. ఎందుకంటే, ఈ వైఖరి వారిని సత్యానికి చేరువచేసే బదులు మరింత దూరంగా నెట్టే వైఖరి.

వ్యతిరేకులపై ఫత్వాలు సంధించకూడదు

رَبُّكُمْ اَعْلَمُ بِكُمْ اِنْ يَّشَاْ يَرْحَمْكُمْ اَوْ اِنْ يَّشَاْ يُعَذِّبْكُمْ ط

"మీ ప్రభువుకు మీ పరిస్థితి ఏమిటో బాగా తెలుసు. ఆయన తలుచుకుంటే మీపై కారుణ్యాన్ని కురిపించనూ గలడు. అనుకుంటే శిక్షించనూ గలడు."

విశ్వాసుల నోట ఎప్పుడూ, 'మేము స్వర్గప్రవేశం చేసేవారం, ఫలానా వ్యక్తి లేదా ఫలానా వర్గం నరకంలోనికి ప్రవేశించేది అనే ఛాలెంజీలు విసరకుండా ఉండాలి. ఈ నిర్ణయంగైకొనేవాడు అల్లాహ్ ఒక్కడే. ఆయన మానవులందరి ప్రత్యక్ష మరియు పరోక్షాలను, వారి వర్తమానం మరియు భవిష్యత్తుల గురించి తెలిసినవాడు. ఎవరిని కరుణిస్తాడో మరెవరిని శిక్షిస్తాడో ఆ నిర్ణయం ఆయన మట్టుకే తీసుకోగలడు. అయితే, దైవగ్రంథం ఆ దేశాల ప్రకారం ఏ రకం మనుషులు ఆయన కారుణ్యానికి అర్హులో మరెలాంటివారు శిక్షకు అర్హులో అని చెప్పడం మట్టుకే మనిషికి వీలుంది. కాని ఏ వ్యక్తికి కూడా, ఫలానా వాడు శిక్షించబడతాడని లేదా ఫలానా వ్యక్తి కరుణించబడతాడని చెప్పే హక్కు లేదు.

ఈ నీతిని బోధించడానికి గల కారణం బహుశా, అప్పుడప్పుడు దైవతిరస్కారుల హింసలను తాళలేక ముస్లింల నోట మీరు నరకంలో బడతారని లేదా మీకు అగ్ని శిక్ష వేయబడుతుందనే మాటలు వెలువడి ఉండడమేమో.

وَمَآ اَرْسَلْنٰكَ عَلَيْهِمْ وَكِيْلًا (بنی اسرائیل:۵۴)

"ప్రవక్తా! మేము నిన్ను ప్రజలకు సంరక్షకుడుగా నియమించి పంపలేదు."

(బనీ ఇస్రాయీల్:54)

అంటే ఓ ప్రవక్త చేసే పని ప్రజలను ఆహ్వానించడం మట్టుకే. ఒకరికి అనుకూలంగా కారుణ్యం, మరొకరికి వ్యతిరేకంగా శిక్షల నిర్ణయం గైకొంటూ వారి అదృష్టాలను నిర్ణయించడం ప్రవక్తపని కాదు. దైవప్రవక్త (స) వారికి ఈ హెచ్చరిక చేయడానికి గల కారణం, ఆయన ద్వారా ఇలాంటి తప్పిదం ఏదైనా జరిగిపోయిందా? అన్నది కాదు దీని ఉద్దేశ్యం. అసలు ఈ ఆదేశాన్ని అవతరింపజేసి ముస్లిములను హెచ్చరించ

డమే దీని ఉద్దేశ్యం. ప్రవక్త (స)కే ఆ హోదా, ఆ స్థాయి లేనప్పుడు మీకు స్వర్గనరకాలను పంచి పెట్టే గుత్తాధిపత్యం ఎలా అబ్బుతుంది? అని ప్రశ్నించడం అన్నమాట.

ఎగతాళికి గురైనప్పుడు వారిని మన్నించి నిష్క్రమించడమే ఉత్తమం

దైవతిరస్కారులు, వ్యతిరేకుల తరపున దైవం మరియు ఆయన ప్రవక్త (స) పట్ల హేళన, ఎగతాళి జరుగుతూ ఉంటే, పట్టజాలని అలాంటి ఉద్రిక్త సందర్భాల్లో వారిని దీవిస్తూ అక్కడి నుండి నిష్క్రమించాల్సి వస్తుంది. దివ్యఖుర్ఆన్ ఇలా బోధిస్తోంది.

فَاصْفَحْ عَنْهُمْ وَقُلْ سَلَامٌ فَسَوْفَ يَعْلَمُونَ ○

(الزخرف : ٨٩)

“మంచిది, ప్రవక్తా! వారిని మన్నించు. “మీకు సలామ్” అని వారితో అను. త్వరలోనే వారికి తెలిసిపోతుంది.” (అజ్ జుఖ్రుఫ్:89)

అంటే, వారి కఠిన పదజాలం, హేళన మరియు ఎగతాళికి ప్రతిగా వారిని శపించకు, సమాధానంగా కఠిన పదాలను వాడకు. కేవలం సలాము చేసి వారి నుండి విడిపో. అలా విడిపోవడం వలన, వారిని నీవు ఎదిరించలేక వెనక్కు తగ్గావని ప్రజలు భావిస్తారేమో, నీకు అపజయం ఎదురైంది అని ప్రజలు నిన్ను చులకనగా చూస్తారేమో అనే తలంపును ఏ మాత్రం దరికి చేరనివ్వకు అని అర్థం.

అలాగే అల్‌జాసియహ్ సూరాలో ఇలా సెలవియ్యడం జరిగింది:

قُلْ لِلَّذِيْنَ آمَنُوْا يَغْفِرُوْا لِلَّذِيْنَ لَا يَرْجُوْنَ أَيَّامَ
اللّٰهِ لِيَجْزِيَ قَوْمًا بِمَا كَانُوْا يَكْسِبُوْنَ۔ (الزخرف : ٨٩)

“ప్రవక్తా! విశ్వాసులతో ఇలా అను: “అల్లాహ్ తరపు నుండి చెడ్డ రోజులు వస్తాయనే భయం లేనివారి చేష్టలను క్షమించండి. స్వయంగా అల్లాహ్, ఒక వర్గం వారికి వారి సంపాదనకు ప్రతిఫలం ఇవ్వడానికే.” (అల్ జాసియహ్:14)

ఈ ఆయత్ విషయంలో రెండు రకాల అర్థాలు చెప్పబడతాయి. ఆయత్‌లో ఉన్న పదాల్లో ఈ రెండు అర్థాలూ దాగున్నాయి. ఒకటి, విశ్వాసులు ఆ దుష్టవర్గం చేసే ఆగడాలను క్షమించాలన్నది. ఎందుకంటే, వారు సహనాన్ని సంయమనాన్ని పాటించినందుకు, మరియు దైవమార్గంలో యే హింసలనైతే వారు భరించారో దానికి తగిన ప్రతిఫలం ప్రసాదిస్తాడు అన్నది.

రెండవ అర్థం, విశ్వాసులు ఆ వర్గాన్ని మన్నించాలి అన్నది ఎందుకంటే వారి ఆగడాలకు ప్రతిఫలం అల్లాహ్‌యే స్వయంగా విశ్వాసులకు ఇస్తాడు అన్నది.

అప్పుడప్పుడు దైవానికి భయపడనివారు, విశ్వాసులతో ఏదో ఓ రకంగా జగడానికి దిగడంగాని, తమ నోటి దురుసుతనం ద్వారా, రచనల ద్వారా విశ్వాసులను

బాధిస్తున్న సాధారణ పరిస్థితుల్లోగాని, అన్ని సందర్భాల్లోనూ క్షమించివేయాలన్న ఆదేశం ఈ ఆయత్‌లో ఇవ్వడం జరిగింది. ఈ ఆయత్ ఉద్దేశ్యం ముస్లిములు తమ స్థాయి నుండి దిగజారి బుద్ధిహీనులైన ప్రజలతో వాగ్వివాదానికి దిగడం, ప్రతి దుష్ప్రవర్తనకు అదే రీతిలో జవాబు చెప్పడంగాని జరగకూడదు. ఎప్పటివరకైతే పెద్ద మనిషి తరహాలో హుందాగా మోపబడిన నేరానికి లేదా ఆక్షేపణకు సమాధానం ఇవ్వడమో లేదా తమను రక్షించుకునే వీలుంటుందో అంతవరకే ప్రయత్నించి చూడాలి. కాని ఎక్కడైతే వ్యవహారం ముదురుతూ ఉన్నట్లు అగుపడుతుందో ఆ సందర్భంలో మిన్నకుండి పోవడం, ఆ వ్యవహారాన్ని దైవానికే వదిలిపెట్టడం జరగాలి. ముస్లిములే గనక స్వయంగా ఆ వ్యవహారాన్ని తమ భుజస్కంధాలపై వేసుకుని వ్యవహారాన్ని చక్కబెడదామనుకుంటే అల్లాహ్ వారి మానాన వారిని వదిలేస్తాడు. అలాకాకుండా క్షమాగుణంతో వారిని వదిలేస్తే అల్లాహ్‌యే స్వయంగా ఆ దౌర్జన్యపరులను చూసుకుంటాడు. పీడితులు అవలంబించిన సహనానికి ప్రతిఫలమూ పొందగలరు.

వివేకానికి సంబంధించిన ఓ మంచి ఉదాహరణ

ఇక్కడ దివ్యఖుర్‌ఆన్ వివేకానికి సంబంధించిన ఓ నమూనాను ప్రదర్శిస్తోంది. ఖుర్‌ఆన్‌లో ఈ విషయానికి సంబంధించి 'సబా' అధ్యాయం 24వ ఆయత్(వాక్యం)లో ప్రశ్న జవాబుల రూపంలో ఎదుటివారిని తార్కికంగా ఆలోచించేటట్లు చేయడం జరిగింది. ఆ ఎదుటివాడు అతను కేవలం అల్లాహ్ దాస్యమే చేస్తూ సన్మార్గంపై ఉన్నవాడూ మరియు ఇంకొకడు ఆయన్ను కాక ఇతర దేవతలను పూజిస్తూ మార్గం తప్పినవాడు. ఈ ఉభయులకు ఖుర్‌ఆన్ సంబోధిస్తోంది ఈ ఆయత్‌లలో. అందుకని ఆ తరువాత వెనువెంటనే 'మేము సన్మార్గగాములం, మీరు మార్గభ్రష్టులు" అని చెప్పవలసి ఉండింది. కాని అలా జరగలేదు. అలా డైరెక్టుగా నిజాన్ని వెలిబుచ్చడం ఎంతో సరైందైనప్పటికీ సందేశ ప్రచార నైపుణ్యం ప్రకారం అది సరైంది కాదు. ఎందుకంటే ఎవరినైతే మీరు సంబోధించి మాట్లాడుతున్నారో అతణ్ణి నీవు మార్గభ్రష్టుడివి అని చెబుతూ మేమే సన్మార్గాన్ని అవలంబించేవారం" అని చెబితే అతను మరింత మంకును ప్రదర్శిస్తాడు. సత్యాన్ని గ్రహించేందుకు వీలులేకుండా అతని హృదయ కవాటాలు మూసుకుపోతాయి. దైవప్రవక్తలు కేవలం సత్యాన్ని చాటడానికే పంపించబడలేదు, కాగా; వీలైనంతమట్టుకు వివేకంతో చెడిపోయినవారిని సంస్కరించే బాధ్యత కూడా వారి భుజస్కంధాలపై వేయడం జరిగింది. అందుకనే అల్లాహ్ ఆయన(స)తో, ఓ ప్రవక్తా! ఈ ప్రశ్నకు జవాబుగా నీవు ఎలాంటి మొహమాటం లేకుండా మీరందరూ మార్గభ్రష్టులు, మేము మాత్రమే సన్మార్గగాములము అని చెప్పు అని ఆదేశించలేదు. దానికి బదులుగా, నీవు ఇప్పుడు వారికి ఇలా నచ్చజెప్పు, మాకూ మీకూ నడుమ ఉన్న తేడా ఏమిటంటే, ఎవరైతే భుక్తినిచ్చేవాడో ఆయన్నే మేము ఆరాధ్యునిగా

చేసుకున్నాము. మరెవరైతే భుక్తిని ఒసగలేరో వారిని మీరు దైవాలుగా పూజిస్తున్నారు. అలాంటప్పుడు మనముభయులమూ కలిసి సన్మార్గంపై నడుస్తున్నామని చెప్పడం సాధ్యం ఎలా అవుతుంది? ఈ ప్రస్ఫుటమైన తేడా మూలంగా మనలో ఒక వర్గం మాత్రమే సన్మార్గంపై ఉన్నట్లు. మరో వర్గం ఎలాగు మార్గం తప్పిందే. ఆ తరువాత, ఈ గీటురాయి ద్వారా సన్మార్గగాములెవరో, మార్గభ్రష్టులెవరో అనే నిర్ణయం మీరే తీసుకోవలసి ఉంటుంది.

وَاِنَّآ اَوۡ اِيَّاكُمۡ لَعَلٰى هُدًى اَوۡ فِىۡ ضَلٰلٍ مُّبِيۡنٍ

"ఇప్పుడు నిశ్చయంగా మేమో, మీరో ఎవరో ఒకరు మాత్రమే సన్మార్గంలో ఉన్నాము లేదా స్పష్టమైన మార్గభ్రష్టత్వంలో పడివున్నాము." (సబా:24)

సన్మార్గం ఏదీ? అది మనకు ప్రయోజనాన్ని కలిగించేదా కాదా? అన్నదాని గురించి ఆలోచించవలసి ఉందనే విషయం వైపునకు దృష్టిని మళ్ళించడం జరిగింది ఈ వాక్యంలో.

قُلۡ لَّا تُسۡـَٔلُوۡنَ عَمَّاۤ اَجۡرَمۡنَا وَلَا نُسۡـَٔلُ عَمَّا تَعۡمَلُوۡنَ ۝

"ఇంకా వారితో ఇలా అను, మేము చెప్పిన తప్పులను గురించి మిమ్మల్ని యే మాత్రం ప్రశ్నించడం జరుగదు. మీరు చేస్తూవున్న దానిని గురించి మమ్మల్నీ అడగడం జరుగదు." (సబా:25)

శ్రోతను ముందే ఆలోచింపజేసేదిగా ఉంది పై విషయం. ఆపై ఇంకో వాక్యాన్ని జోడించి అతను మరింత ఆలోచనా వివేచనాలతో మెలగమని సెలవియ్యడం జరిగింది. దీని ద్వారా, సన్మార్గాన్ని అవలంబించడం మరియు మార్గాన్ని తప్పడం అనే ఈ విషయంలో ఖచ్చితమైన నిర్ణయం గైకొనడం మన ప్రయోజనానికి సంబంధించిన విషయం అని హెచ్చరించడమూ జరిగింది. ఉదాహరణకు మేమే మార్గభ్రష్టులమైతే ఆ మార్గభ్రష్టత్వ దుష్పరిణామాన్ని మేము అనుభవిస్తాము. దాని గురించి మిమ్మల్ని ప్రశ్నించడం జరుగదు. కాబట్టి ఆ మార్గాన్ని ఎంచుకునే ముందు, ఎక్కడైనా మేము తప్పటడుగు వేయడం లేదు గదా అని బాగా ఆలోచించ వలసి ఉంటుంది. అలాగే మీరు కూడా, మా గురించి కాకుండా స్వయం మీ మేలు కోసం ఆ మార్గాన్ని ఎంచుకునే బదులు, ఎక్కడైనా అసత్యమైన సిద్ధాంతాన్ని పట్టుకొని వ్రేళ్ళాడడం లేదుకదా, అందుకోసమే మీ జీవిత సర్వస్వం వెచ్చించడం లేదు కదా అనే మీమాంసలో పడడం ముఖ్యం. ఈ విషయంలో మీరే గనక తప్పటడుగు వేస్తే అది మీకు మాత్రమే నష్టాన్ని చేకూరుస్తుంది. మాకెలాంటి నష్టం చేయదు.

సందేశ ప్రచారంలో ఓ మేలైన మచ్చుతునక

దివ్యఖుర్ఆన్‌లోని యాసీన్ సూరా, 22వ ఆయత్‌లో ఇలా సెలవియ్యడం జరిగింది:

وَمَالِيَ لَآ أَعْبُدُ الَّذِي فَطَرَنِي وَإِلَيْهِ تُرْجَعُونَ ۝

"ఎవరు నన్ను సృష్టించారో ఆయన్ను నేనెందుకు పూజించకూడదు? (చివరకు) మీరంతా ఎవరి వైపునకైతే మరలిపోనున్నారో?" (యాసీన్:22)

ఈ వాక్యాన్ని రెండు భాగాలుగా విభజించి చూస్తే, మొదటి భాగంలో "ఎవరు నన్ను సృష్టించారో ఆయన్ను నేనెందుకు పూజించకూడదు" అన్నది. రెండవ భాగంలో "మీరంతా ఎవరివైపునకైతే మరలిపోనున్నారో" అన్నది. ఇందులో మొదటి భాగంలో ఓ ఆధారం చూపెట్టే విషయం చెప్పడం జరిగింది. రెండవ భాగంలో ప్రచార ఉపాయాన్ని ప్రదర్శించడం జరిగింది. అందులో అతను చెప్పిన విషయం ఏమిటంటే, సృష్టికర్త దాస్యం చేయడం మనిషి బుద్ధి మరియు అతని నైజం కోరే కోరిక. సరైన విషయం కానిది ఏదైనా ఉందంటే అది తనను పుట్టించని వారిని ఆరాధించడం. రెండవ భాగంలో ఆ వ్యక్తి తనజాతి ప్రజలను, మీరు కూడా ఓ రోజున మరణించ వలసిందే, ఎవరి దాస్యం చేయడాన్ని మీరు నిరాకరిస్తున్నారో ఆ దైవం వైపునకే కదా మీరు తిరిగి వెళ్ళవలసి ఉంది. ఇకమీరే ఆలోచించండి! ఆయన్ను కాదన్న తరువాత మీకు సాఫల్యం ఎలా కలుగుతుంది? అని హెచ్చరించడం.

మాటల్లో సానుభూతిని ప్రదర్శించడం

ఆ దైవదాసుని సందేశ ప్రచారపు ఈ రెండు మాటల్లో ఎంత మృదుత్వం మరెంత మాధుర్యం ఉందో ఆలోచించారా? అలాగే హ్రజత్ మూసా (అ)ను సంబోధిస్తూ అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

اِذْهَبْ اِلٰى فِرْعَوْنَ اِنَّهٗ طَغٰى ۝ فَقُلْ هَلْ لَّكَ اِلٰى

اَنْ تَزَكّٰى ۝ وَاَهْدِيَكَ اِلٰى رَبِّكَ فَتَخْشٰى ۝

'ఫిరౌన్ వద్దకు వెళ్ళు. అతడు హద్దులు మీరి ప్రవర్తిస్తున్నాడు; పరిశుద్ధ జీవితం అనుభవించడానికి నీవు సిద్ధంగా ఉన్నావా? నేను నీ ప్రభువు మార్గాన్ని నీకు చూపితే, నీలో ఆయనపట్ల భయభక్తులు పొడసూపుతాయా?" (అన్నాజియాత్: 17-19)

హ్రజత్ మూసా (అ)కు ఇంకా ఇలా ఆదేశించడం జరిగింది:

فَقُوْلَا لَهٗ قَوْلًا لَّيِّنًا لَّعَلَّهٗ يَتَذَكَّرُ اَوْ يَخْشٰى (طٰهٰ : ٤٤)

"అతనితో మృదువుగా మాట్లాడండి. బహుశా అతడు హితబోధను స్వీకరిస్తాడేమో లేదా (దేవునికి) భయపడతాడేమో." (తాహా:44)

ఈ ఆయత్‌లో ఇది మృదు సంభాషణకు సంబంధించిన ఓ నమూనా. దీని ద్వారా తెలిసిందేమిటంటే, ఓ సందేశ ప్రచారకుడు చెడిపోయిన ఓ మనిషిని సన్మార్గంపై తెచ్చేందుకు ఎలాంటి వివేకాన్ని ప్రదర్శించి మాట్లాడాల్సి ఉంటుంది అన్నది. మరో నమూనా తాహా సూరాలోని 49 నుండి 52 వ ఆయత్‌లలో మూసా ఫిరౌనులకు నడుమ జరిగిన సంభాషణలో అగుపిస్తుంది.

قَالَ فَمَنْ رَّبُّكُمَا يٰمُوْسٰى ۝

"ఫిరౌను" సరే, అయితే మూసా! మీ ఇద్దరి ప్రభువు ఎవడు? అని అడిగాడు."

ఆ ఇద్దరు సోదరుల్లో సందేశాన్ని అందించేవారు మూసా ఒక్కరే కావడం వలన ఫిరౌను ఆయన్నే సంబోధిస్తూ అడిగిన మాటలివి. బహుశా ఆ సంబోధన ఆ ఇద్దరినుద్దేశించి కూడా కావచ్చు. దాని ఉద్దేశ్యం అతను హజ్రత్ హారూన్ (అ) వాగ్ధాటిని ప్రదర్శించకుండా ఉండేందుకు కూడా అలా మూసా (అ)నే అడిగి ఉండవచ్చు లేదా మాట్లాడడంలో జంకుతున్న హజ్రత్ మూసా (అ) బలహీనత నుండి ప్రయోజనం పొందడానికీ ప్రయత్నించవచ్చు.

ఫిరౌను అడిగిన ప్రశ్న ఉద్దేశ్యం, మీరిద్దరు అన్నదమ్ములు కలిసి ఈజిప్టు మరియు ఈజిప్టు ప్రజల ప్రభువును నేనైనప్పుడు ఎవరిని మీ ప్రభువుగా చేసుకున్నట్లు? అన్నది. నాజిఆత్ సూరాలో అతను, اَنَا رَبُّكُمُ الْاَعْلٰى "ఓ ఈజిప్టు ప్రజలారా! నేనే మీకు అందరికంటే గొప్పప్రభువును" అని అనడం కూడా జరిగింది.

జుఖ్రుఫ్ సూరాలో నిండు సభను ఉద్దేశించి అతను ఇలా అంటాడు:

يٰقَوْمِ اَلَيْسَ لِىْ مُلْكُ مِصْرَ وَهٰذِهِ الْاَنْهٰرُ
تَجْرِىْ مِنْ تَحْتِىْ (رکوع ۵)

"ప్రజలారా! ఈజిప్టు సామ్రాజ్యం నాది. కాదా? ఈ కాలువలు నా క్రింద ప్రవహించడం లేదా?" (జుఖ్రుఫ్:58)

"అల్ ఖసస్" సూరాలో తన సభాసదుల ముందు ఇలా హుంకరిస్తాడు.

يٰۤاَيُّهَا الْمَلَاُ مَا عَلِمْتُ لَكُمْ مِّنْ اِلٰهٍ غَيْرِىْ فَاَوْقِدْ
لِىْ يٰهَامٰنُ عَلَى الطِّيْنِ فَاجْعَلْ لِّىْ صَرْحًا لَّعَلِّىْۤ اَطَّلِعُ
اِلٰۤى اِلٰهِ مُوْسٰى (رکوع ۴)

"సభ్యులారా! నేను కాక మీకు మరో దేవుడెవడైనా ఉన్నాడేమో నేను ఎరుగను. హామాన్! ఇటుకలను కాల్చి నాకై ఒక ఎత్తయిన కట్టడాన్ని నిర్మాణం చేయించు. దానిపైకెక్కి బహుశా నేను మూసా దేవుణ్ణి చూడగలనేమో. నేను అతణ్ణి అసత్యవాదిగా పరిగణిస్తున్నాను." (అల్ ఖసస్:38)

'అష్షుఅరా' సూరాలో, మూసా (అ)ను గద్దిస్తూ ఇలా అంటాడు:

لَئِنِ اتَّخَذْتَ إِلَٰهًا غَيْرِي لَأَجْعَلَنَّكَ مِنَ الْمَسْجُونِينَ

"నీవు నన్ను కాదని మరెవరినైనా ఆరాధ్యుడుగా చేసుకుంటే, నిన్ను కూడా జైళ్ళలోపడి మ్రగ్గిపోతున్న వారిలో చేరుస్తాను." (అష్షుఅరా:29)

ఫిరౌను తన జాతికి ఏకైక ఆరాధ్యుడు, అతని తప్ప అక్కడ మరెవ్వరి ఆరాధన జరిగేది కాదు అని దీని అర్థం. ఫిరౌను ఖుద్దుగా సూర్యదేవత (రఅ లేదా రాఅ) నుండి రాచరికాన్ని పొందానని ఛాలెంజి చేసేవాడు. అలాగే ఆ జాతి మతంలో అనేక మంది దేవీదేవతలను కొలవడం జరిగేదన్న యదార్థం చరిత్ర ఆధారాల వల్ల లభ్యమౌతోంది. కాబట్టి ఫిరౌను తానొక్కడినే ఆరాధనకు అర్హుణని వాదించలేదు. కాగా, కార్యాచరణ రూపంలో మరియు సైద్ధాంతికంగానూ అతను పూర్తి ఈజిప్టు సామ్రాజ్య ప్రజానీకానికి రాజకీయంగా ప్రభువును అని ఛాలెంజి చేసినవాడు. అలాగే తనపై ఇంకే శక్తి కూడా రాజ్యాధికారిగా ఉండి అతని దూత వచ్చి ఆ శక్తిని విధేయించమని డిమాండు చేయడాన్ని జీర్ణించుకునే స్థితిలో లేనివాడు.

అతని ప్రశ్నకు సమాధానంగా మూసా (అ) ఇచ్చిన సమాధానం ఏమిటో దివ్యఖుర్ఆన్ ఈ విధంగా ఉటంకించింది:

قَالَ رَبُّنَا الَّذِي أَعْطَىٰ كُلَّ شَيْءٍ خَلْقَهُ ثُمَّ هَدَىٰ ○

"ప్రతి వస్తువుకు దాని స్వరూపాన్ని ప్రసాదించి, తరువాత దానికి మార్గం చూపినవాడే మా ప్రభువు." (తాహా:50)

'మా ప్రభువు' అంటే మేము అన్ని రకాలుగా ఆయన్ను ప్రభువుగా విశ్వసిస్తున్నాము - ప్రభువు, యజమాని, పాలకుడు వగైరాలన్నిటి విషయాల్లోనూ ఆయనే మా ప్రభువు. ఏ అర్థంలోనూ ఆయనకు తప్ప మరే ప్రభువును మేము గుర్తించడం లేదని అర్థం.

"ప్రతి వస్తువుకు దాని స్వరూపాన్ని ప్రసాదించినవాడు."

అంటే ప్రపంచంలో ఏ వస్తువు అయితే దాని రూపాన్ని కలిగివుందో దానికి ఆ రూపాన్ని ప్రసాదించినవాడు, దానికి ఆ శక్తి సామర్థ్యాలను ప్రసాదించినవాడు, దానికి యే ధర్మాలైతే అబ్బాయో ఆ ధర్మాలను వాటికి సమకూర్చినవాడు ఆయనొక్కడే.

చేతికి ప్రపంచంలో తనపని చేసే యే ఆకారమైతే అవసరం ఉందో, కాలికి నడువ గలిగే రూపం యేదైతే అవసరమో అవన్ని ఆయన కల్పించినవే. మనిషి, పశువు, వృక్షజాతి, ఖనిజ సంపద, గాలి, నీరు ఒకటేమిటి ప్రతి వస్తువుకు ఆయనే ఓ ప్రత్యేకమైన స్వరూపాన్ని ప్రసాదించాడు. అవి ఈ విశ్వంలో తమ పని తాము సజావుగా చేసుకొని పోయేటట్లుగా సృష్టించాడు అని అర్థం.

ఆ పిదప ప్రతి వస్తువుకు దాని ప్రత్యేక స్వరూపాన్నిచ్చి గాలికి వదిలేయలేదు. ఆ తరువాత ఆయనే ఆ వస్తువులన్నిటికి మార్గం కూడా చూయిస్తున్నాడు. ప్రపంచంలో ఏ వస్తువూ దాని సృష్టి ధర్మాన్ని నెరవేర్చే విధానం చూయించబడకుండా లేదు. చెవికి వినికిడి, కంటికి దృష్టి ఆయనే ఒసిగాడు. చేపకు ఈదడం, పక్షికి ఎగరడం కూడా ఆయన ద్వారా అబ్బినదే. చెట్టుకు పూలుపూచే, పండ్లుకాసే శక్తి, భూమికి విత్తనాలను మొలకెత్తించే ఆదేశం ఆయన ఇచ్చినదే. మొత్తానికి ఆయన సమస్త విశ్వం మరియు అందులోని ప్రతి వస్తువుకు సృష్టికర్తే కాకుండా వాటికి ఓ మార్గం చూపెట్టాడు కూడా.

ఈ సాటిలేని సమగ్రమైన వాక్యంలో హజ్రత్ మూసా (అ), ఆ ప్రభువు ఎవరో చెప్పడమేకాకుండా, ఆయన ప్రభువు కావడానికి గల కారణం ఏమిటి? ఆయన ఎందుకొరకు ప్రభువు అయ్యాడు? ఆయన తప్ప మరెవ్వరిని ప్రభువుగా ఎందుకు స్వీకరించడానికి వీల్లేదు? అనే యదార్థం చెప్పడం జరిగింది. ఈ చిన్న వాక్యంలో దానికి రుజువు కూడా ఉంది. ఫిరౌను అతని పాలిత ప్రజల్లోని ప్రతి వ్యక్తీ తన ఉనికి కొరకు అల్లాహ్‌కే రుణపడి ఉన్నప్పుడు, వారి హృదయం, ఊపిరితిత్తులు, కాలేయం, జీర్ణాశయం మొదలైన అవయవాలు అల్లాహ్ ఒసగిన ఆదేశాల మేరకే పనిజేయకపోతే వారిలోని ప్రతి ఒక్కడూ ఒక్క క్షణం కూడా జీవించి ఉండే అవకాశం లేదు. అలాం టప్పుడు, 'నేనే మీ ప్రభువును' అని ఫిరౌను సవాలు విసరగా, ప్రజలు తలలూపుతూ, ఔను నీవే మాకు ప్రభువు అని పలకడంలో అర్థమేలేదు.

అదేకాదు, ఈ చిన్నపాటి వాక్యంలో హజ్రత్ మూసా (అ) చూచాయగా దైవదౌత్యపు ఆధారాన్ని కూడా చూపెట్టారు. ఫిరౌను నిరాకరించేది కూడా ఆ యదార్థాన్నే. ఆయన చెప్పిన మాటల్లో, ఎవరైతే సమస్త విశ్వాన్ని పాలిస్తున్నాడో మరెవరైతే ప్రతి వస్తువుకు అవసరమైన స్వరూపాన్నిచ్చి దాని అవసరం మేర మార్గాన్ని చూబెడుతున్నాడో ఆయనే దేవుడు అనే సూచన కూడా ఉంది. కాబట్టి ఈ సార్వజనీన మార్గదర్శక హోదా ప్రకారం మనిషి భౌతిక జీవితానికి కూడా ఓ మార్గాన్ని చూపెట్టవలసి ఉంది. ఇతర భూచర, జలచరాలకు చూయించే మార్గం లాంటిది కాదు ఆ మార్గం. మానవాళి మార్గదర్శకత్వానికిగాను, వారి బుద్ధిజ్ఞానాలను తట్టి వారికి ఋజుమార్గం చూపే మనిషి నొకడిని నియమించడం జరగాలి. అతను వారికి రుజుమార్గం ఏదో చూపెట్టేవానిలా ఉండాలి.

హజ్రత్ మూసా (అ) ఇచ్చిన పై సమాధానానికి ఫిరౌను తిరిగి రెండవ ప్రశ్న వేస్తాడు.

قَالَ فَمَا بَالُ الْقُرُوْنِ الْاُوْلٰى (طٰہٰ : ۵۱)

"అయితే పూర్వం గతించిన తరాలవారి పరిస్థితి సంగతేమిటి?" అని అంటే, ఎవరైతే ప్రతి వస్తువును దాని స్వరూపాన్నిచ్చి జీవితంలో పనిజేసుకుపోయే మార్గమూ చూపి, ఆయనకు తప్ప మరెవ్వరూ ఆరాధ్యుడు కూడా లేకపోవడమే నిజమైతే, మరి మా తాతముత్తాతలు వందలాది సంవత్సరాలుగా ఇతర దేవుళ్ళను పూజిస్తూ వస్తున్నారో వారి గురించి నీవేమి చెప్పదలిచావు? వారి గతి ఏమౌతుంది? వారంతా మార్గభ్రష్టులేనా? వారందరూ శిక్షార్హులేనా? వారి బుద్ధి జ్ఞానాలు పనికిమాలినవేనా? అని అడగడం అన్నమాట. మూసా (అ) వేసిన ప్రశ్నకు ఫిరౌను వేసిన ఎదురు ప్రశ్న ఇది. బహుశా ఈ పలుకులు అతను అజ్ఞానం వల్ల పలికినవీ కావచ్చు లేదా వక్రబుద్ధి కలిగి వేసిన ప్రశ్న కావచ్చు. లేదా ఈ ప్రశ్నలో ఆ రెండు అర్థాలూ ఇమిడి ఉండవచ్చు. అంటే మూసా (అ) ఇచ్చిన జవాబుకు, ఇలా జరిగితే గతించిన మా తాతముత్తాతలంతా మార్గభ్రష్టులైనట్లే కదా" అని ప్రజలు కోపోద్రేకానికి లోనూకావచ్చు. దానికితోడు, తన సభాసదులు, మరియు ఈజిప్టు సామాన్య ప్రజానీకం మనస్సుల్లో మూసా (అ) ఇచ్చే సందేశానికి వ్యతిరేక భావన పెల్లుబికేటట్లు చేయడం కూడా అతని ఉద్దేశ్యం అయివుండవచ్చు. సత్యధర్మానుయాయుల ప్రచారానికి వ్యతిరేకంగా ఈ ఎత్తుగడను ఉపయోగించడం ఎప్పుడూ జరుగుతూ ఉన్నదే. అజ్ఞానులను రెచ్చగొట్టేందుకు ఎప్పుడూ ప్రభావం చూపే ఎత్తుగడే ఇది. ముఖ్యంగా, దివ్యఖుర్ఆన్ ఈ ఆయత్‌లు అవతరించిన కాలంలో, మక్కా నగరంలో దైవప్రవక్త (స) వారిని అపజయంపాలు చేయడానికి ఈ ఎత్తుగడనే ఉపయోగించడం జరిగింది. కాబట్టి హజ్రత్ మూసా (అ)కు వ్యతిరేకంగా ఫిరౌను కుట్రను తెలియజేయడం సందర్భోచితమైనది. హజ్రత్ మూసా (అ) ఎంతో వివేకంగా అతని ఆ కుటిల ప్రశ్నకు ఈ విధంగా సమాధానం ఇచ్చారు.

قَالَ عِلْمُهَا عِنْدَ رَبِّيْ فِيْ كِتٰبٍ ۚ لَا يَضِلُّ رَبِّيْ وَلَا يَنْسَى (طٰہٰ : ۵۲)

"దానికి సంబంధించిన జ్ఞానం నా ప్రభువు వద్ద ఒక గ్రంథంలో సురక్షితంగా ఉంది. నా ప్రభువు పొరపాటూ చేయడు, మరువడు కూడాను." (తాహా:52)

హజ్రత్ మూసా (అ) నోట దివ్యఖుర్ఆన్ ఇచ్చిన ఈ సమాధానంలో మనకు, ఆయన జవాబులోని వివేకం, ప్రచార నైపుణ్యానికి సంబంధించిన ఓ గుణపాఠం ఉంది. చూడ్డానికి శ్రోతల మనస్సుల్లో, వారి మాధ్యమంగా పూర్తి జాతి ప్రజల మనస్సుల్లో కలహాగ్నిని రేపడమే ఫిరౌను ఉద్దేశ్యం. ఒకవేళ ఈ ఆయత్‌లో హజ్రత్

మూసా (అ), "అవును! మీరంతా అజ్ఞానులు మరియు మార్గభ్రష్టులే, మీరంతా నరకంలో పడి కాలిపోయేవారే" అని ఉంటే, అది నిజాన్ని పలికే మాటే అయినప్పటికీ ఈ సమాధానం మట్టుకు హజ్రత్ మూసా (అ) ధ్యేయానికి బదులు ఫిరౌను ధ్యేయాన్ని నెరవేర్చేదిగా ఉండేది. కాబట్టి ఆయన(అ) ఎంతో వివేకంతో ఇచ్చిన ఆ సమాధానం స్వయం సత్యమైందే కాకుండా, దానికి తోడు ఫిరౌను విషకోరల్ని సైతం పీకిపారవేసింది. ఆయన చెప్పిన విషయం ఏమిటంటే, ఆ గతించినవారు ఎలాంటి వారైనా తమ ఖర్మలను ఆచరించి దైవం వద్దకు వెళ్ళిపోయారు. నా వద్ద వారి ఖర్మల్ని మరియు వారి సంకల్పాలను కొలిచే కొలమానం ఏదీ లేదు. అలాంటప్పుడు వారి గురించి నేనేమని చెప్పగలను? వారి రికార్డు మొత్తం అల్లాహ్ వద్ద సురక్షితంగా ఉంది. వారి ప్రతి కదలికను, ఆ కదలికకు సంబంధించిన ప్రతి ప్రేరణను ఆ దైవం ఒక్కడే బాగా ఎరుగును. వాటిలో యేదీ ఆయన దృష్టికి అందకుండా లేదు అలాగే ఏదీ ఆయన మేధ నుండి తప్పుకొని దాక్కునేది కాదు. వారిపట్ల యే వ్యవహారం అయితే అవలంబించబడుతుందో అది ఆయనకే తెలుసు. వారేమి చేశారో, ఎలాంటి పరిణామం వారికి ఎదురౌతుందో నేనుగాని, మీరుగాని ఆలోచించే విషయం కాదు. ఆలోచించ వలసిన విషయమల్లా మన వైఖరి ఎలాంటిది? మనం ఏ పరిణామాన్ని ఎదుర్కో బోతున్నామన్నదే.

హజ్రత్ మూసా (అ) ఇచ్చిన ఈ సమాధానంలో మంకుపట్టు కలిగిన ప్రతి వ్యక్తి మంకును విరిచే ఓ వివేకవంతమైన విధానం దాగుందని మనం గుర్తించగలం. ఎదుటివాడు వ్యతిరేకించడానికే పూనుకుంటే అతను సత్యాన్ని గుర్తించడం మహాకష్టం. అలాంటప్పుడు ఓ సందేశ ప్రచారకుడు, తన ప్రచారంలో ఓ విషయాన్ని బాగా గుర్తుంచుకొని ఆచీతూచి అడుగేయాల్సి ఉంటుంది. అదేమిటంటే, ఎదుటివాడు బోధించేవాని మాటను గ్రహించాలా లేదా దాన్ని రద్దు చేయాలా అనే విషయాన్ని ఆలోచించే బదులు తాను యే విషయాన్ని గ్రహిస్తే తనకు ప్రయోజనం కలుగుతుంది? మరే విషయాన్ని రద్దు చేస్తే తనకు నష్టం వాటిల్లుతుంది అనే పరిస్థితిలో పడవేసినట్లు మాట్లాడవలసి ఉంటుంది.

అల్ ఫుర్కాన్ సూరాలోని 11 నుండి 16 వరకు గల ఆయత్‌లలో ఈ వివేక వంతమైన వైఖరినే చాటే ఓ మచ్చుతునక మనకు అగుపడుతుంది.

4 నుండి 10 వరకు చెప్పబడిన ఆయత్‌లలో దైవతిరస్కారుల వీడని మంకును సూచిస్తూ, ఓ మంకుపట్టుగలవాడు ఆలోచనా రహితంగా మోపే ఆరోపణల గురించి చెప్పడం జరిగింది. వారు దైవప్రవక్త (స) విషయంలో, ఆయన మనలా భోంచేస్తారు, బజారుల్లో కెళ్ళి తమ కోసం సరుకులూ కుంటారు, అలాంటప్పుడు ఆయన ప్రవక్త ఎలా అయ్యారు? ఒకవేళ అల్లాహ్ ఓ మానవ మాత్రుడినే ప్రవక్తగా చేసి పంపించవలసి

వస్తే ఆయన వెంట ఓ దైవదూత కూడా ఉండవలసింది, ఆ దైవదూత చేత్తో కొరడా ఝుళిపిస్తూ ఒప్పుకుంటే ఈ ప్రవక్త మాటను ఒప్పుకోండి లేకపోతే ఇప్పుడే మీపై దైవశిక్షను కురిపిస్తాను అని ఎందుకు బెదిరించడం లేదు అన్నదే ఆరోపణలు.

హజ్రత్ మూసా(అ) గారి సందేశ ప్రచారంలో ప్రచార వివేకానికి సంబంధించిన సాటిలేని నమూనా మరొకదాన్ని గమనించండి. అష్షుఅరా సూరాలోని 23 నుండి 28వ ఆయత్‌లలో మూసా (అ) ఫిరౌనుతో ఇలా అంటారు:

فَوَهَبَ لِي رَبِّي حُكْمًا وَّجَعَلَنِي مِنَ الْمُرْسَلِينَ ۝

"నా ప్రభువు నాకు వివేక జ్ఞానాన్ని ప్రసాదించాడు. నన్ను సందేశహరులలో చేర్చుకున్నాడు."

దానికి ఫిరౌను ఆయన్ను ఇలా అడిగాడు:

وَمَا رَبُّ الْعٰلَمِيْنَ ۝ "ఈ సకల లోకాల ప్రభువు ఏమిటీ?" అని.

సమాధానంగా మూసా (అ) ఇలా అన్నారు:

قَالَ رَبُّ السَّمٰوٰتِ وَالْاَرْضِ وَمَا بَيْنَهُمَا
اِنْ كُنْتُمْ مُّوْقِنِيْنَ ۝

"ఆకాశాలకూ, భూమికీ ప్రభువు, భూమ్యాకాశాల మధ్యవున్న సమస్తానికీ ప్రభువు. నీవు (దేవుణ్ణి) నమ్మేవాడివే అయితే."

అంటే, భూమిపై నివసించే యే ప్రాణి తరపున మరియు అంతమైపోయే రాచరిక ప్రభ కలవాని తరపున నేను రాలేదు, నేను వచ్చింది ఈ భూమ్యాకాశాలకు ప్రభువు అయిన దేవుని తరపున. ఒకవేళ నీవు, ఈ విశ్వానికి ఎవరో ఒకరు కర్త మరియు యజమాని ఉన్నాడని నమ్మితే ఈ యదార్థాన్ని అర్థం చేసుకోవడం నీకు అంత కష్టమైన పనేమీ కాదు. దానికి ఫిరౌను తిరిగి,

قَالَ لِمَنْ حَوْلَهٗٓ اَلَا تَسْتَمِعُوْنَ ۝

"తన చుట్టూ ఉన్న వారితో, వింటున్నారా?" అని అన్నాడు. అంటే అతను మూసా (అ) తిరుగుబాటు వచనాల వైపునకు వారి దృష్టిని మళ్ళించడానికి ప్రయత్నం చేస్తున్నాడని అర్థం.

హజ్రత్ మూసా (అ) సమాధానంగా, قَالَ رَبُّكُمْ وَرَبُّ اٰبَآئِكُمُ الْاَوَّلِيْنَ ۝

"ఆయనే మీ ప్రభువు కూడా, పూర్వం గతించిన మీ తాత ముత్తాతల ప్రభువు కూడా" అని పలికారు.

అంటే, ఈ రోజు ఉనికిని కలిగి రేపు వారి ఉనికిని పోగొట్టుకునే ప్రభువులకు ప్రభువు, అలాగే నిన్నటి వరకు ప్రభువులుగా పూజించబడి నేడు వారి ఉనికే లేకుండా పోయిన అసత్య ప్రభువులకు ప్రభువు అని. యే ఫిరౌను అయితే మీకు ఈనాడు

ప్రభువుగా చెలామణి అవుతున్నాడో నిన్నటి వరకు అతని ఉనికేలేదు. అలాగే నిన్నటి వరకు మీ తాతముత్తాతలు యే ఫిరౌనులనైతే ప్రభువుగా చేసుకొని సేవించారో వారు ఈరోజు అసలే అగుపడడం లేదు, నేను యే ప్రభువు పాలనను, ఆయన ప్రభను గుర్తిస్తున్నానో ఆయన నేడు మీ ఫిరౌనుకు కూడా ప్రభువే. అంతకు పూర్వం గతించిన మీ తాత తండ్రులకు ప్రభువే.

హజ్రత్ మూసా (అ) ఇచ్చిన ఈ సమాధానాన్ని విని ఫిరౌనుకు ఏదీ పాలుపోక ఇలా అన్నాడు: قَالَ إِنَّ رَسُولَكُمُ الَّذِي أُرْسِلَ إِلَيْكُمْ لَمَجْنُونٌ ۝

"మీ వద్దకు పంపబడిన మీ దైవప్రవక్తగారు పూర్తిగా పిచ్చివారుగా కనిపిస్తున్నారే!"

దీనికి మూసా (అ) క్రితం ఇచ్చిన ఆధారాన్ని మరింత విశదీకరిస్తూ ఇలా సెలవిచ్చారు: قَالَ رَبُّ الْمَشْرِقِ وَالْمَغْرِبِ وَمَا بَيْنَهُمَا إِن كُنتُمْ تَعْقِلُونَ ۝

"తూర్పుకూ, పడమరకూ, వాటి మధ్య ఉన్న సర్వానికీ ప్రభువు; మీరు వివేకం కలవారే అయితే."

అంటే, మీరు నన్ను పిచ్చివానిగా ఖరారు చేస్తున్నారు. కాని మీరేగనక బుద్ధి జ్ఞానాలుపయోగించి ఆలోచిస్తే, యదార్థంగా ఈ భూమిలోని ఓ అతిచిన్న భాగానికి రాజుగా చెలామణి అవుతున్న ఫిరౌను మీకు ప్రభువా? లేదా తూర్పు పడమరలకు స్వామి మరియు ఈ ఈజిప్టుతో సహా ప్రతి వస్తువుకూ యజమాని అయిన ఆ దేవుడా మీకు ప్రభువు అనే యదార్థాన్ని తెలుసుకోగలరు. నేను మాత్రం ఆయన పాలననే స్వీకరిస్తున్నాను. ఆయన తరఫున ఈ ఆదేశాన్ని ఆయన దాసులకు చేరవేస్తున్నాను అని భావం.

ఈ ఆధారం చూపెట్టగా ఫిరౌను చేసేది లేక ఆ యదార్థాన్ని ఒప్పుకోవడంలో సందేహించే అవసరమే లేదు, కాని అతని గర్వం దానికి అనుమతించక అతను పిడివాదానికి దిగి ఇలా అన్నాడు:

قَالَ لَئِنِ اتَّخَذْتَ إِلَٰهًا غَيْرِي لَأَجْعَلَنَّكَ مِنَ الْمَسْجُونِينَ ۝

"నీవు నన్ను కాదని మరెవరినైనా ఆరాధ్యునిగా చేసుకుంటే, నిన్ను కూడా జైళ్ళలో పడి మ్రగ్గిపోతున్న వారిలో చేరుస్తాను."

ఈ సంవాదాన్ని అర్థం చేసుకోవాలంటే ఓ విషయాన్ని గుర్తుంచుకోవలసి ఉంటుంది. నేటిలా ప్రాచీన కాలంలోనూ 'ఆరాధ్యుడు' అనే పదం కేవలం ధార్మిక భావానికే పరిమితమై ఉండేది. అంటే ఆ ఆరాధ్యునికి కేవలం పూజాపునస్కారాలు, మ్రొక్కుబడులు మట్టుకే చెందేవి అన్నది. పోతే అసలు యదార్థం మాత్రం అదికాదు,

దేవుడు అతీతమైన శక్తులను, అధికారాలను కలిగి ఉండడం వలన మనిషి తన వ్యవహారాలను చక్కబెట్టుకోవడానికి ఆయన సహాయం కోసం ప్రార్థించేవాడు. చట్టపరంగా, రాజకీయంగా కూడా ఆ హోదా ఉత్తమమైనది. ప్రపంచ వ్యవహారాల్లోనూ ఆయన తనకు ఇష్టమైన ఆదేశాలను ఇవ్వగల శక్తివంతుడు. దేని గురించైతే ఆయన ఆదేశిస్తాడో మరి దేని గురించైతే వారిస్తాడో మనిషి దాన్నే సర్వోత్తమమైన చట్టంగా పరిగణించి, ఆయన ఎదుట మోకరిల్లాలి. అది అతని పట్ల విధిగా చేయబడిన శాసనం. కాని ప్రపంచాన్ని ఏలిన శ్లేష (Shadow) పాలకులు ఈ సత్యాన్ని ఎన్నడూ ఒప్పుకోలేదు. నేడు కూడా ఒప్పుకోడానికి సిద్ధంగా లేరు. ప్రపంచ వ్యవహారాల్లో మేమే సర్వాధికారులం, ఏ ఆరాధకునికి మా రాజకీయాల్లోనూ, మా శాసనాల్లోనూ జోక్యం చేసుకునే హక్కు లేదు అంటారు - సామ్రాజ్యాలతో, రాజులతో ప్రవక్తలు మరియు వారిని అనుసరించే సంస్కర్తల నడుమ ఏర్పడిన ఘర్షణకు కారణం కూడా అదే. వీరు సర్వేశ్వరుని పాలన మరియు ఆయన ఔన్నత్యాన్ని ఒప్పుకునేటట్లు చేసే ప్రయత్నం చేస్తే, జవాబుగా వారు తమ సర్వాధికారాల్ని చాటేటట్లు చేయడమే కాకుండా, చట్టం మరియు రాజకీయ రంగంలో వారు ఎవరినైనా స్వీకరిస్తే వారిని నేరస్తులుగా నిలబెట్టడం జరిగింది.

ఈ వివరణ ద్వారా ఫిరౌను ప్రశ్నలోని మర్మం ఏదో బాగా అర్థం చేసుకోగలరు. వ్యవహారం కేవలం పూజాపునస్కారాలు, మొక్కుబడుల వరకే పరిమిత మైతే అతనికి ఎలాంటి ఆక్షేపణ ఉండేది కాదు. ఎందుకంటే, మూసా (అ) ఇతర దేవతలకు కాకుండా కేవలం ఏకైక ప్రభువు అయిన అల్లాహ్‌నే పూజలకర్హుడు అని చెబుతున్నాడు కాబట్టి. ఒకవేళ ఈ భావంతోనే మూసా (అ) ఏకేశ్వరోపాసన వైపునకు అతణ్ణి పిలిచి ఉండినట్లయితే అతను ఉగ్రుడైపోవడానికి ఎలాంటి కారణమూ ఉండేదికాదు. అతను ఏదైనా చేయదలుచుకుంటే, తన తాతముత్తాతల ధర్మాన్ని వీడడానికి నిరాకరించడం మట్టుకే జరిగేది. హజ్రత్ మూసా (అ)తో, నా మత పండితులతో తర్కించుకోండి అని చెప్పి ఊరుకునేవాడే. అతణ్ణి ఆగ్రహోదగ్రునిగా చేసిన విషయం ఏమిటంటే, మూసా (అ) సర్వసృష్టికర్త తరఫున దూతగా తనను పరిచయం చేసుకోవడమే కాకుండా, “నీవు ఆ సర్వేశ్వరునికి సామంతుడవు. ఆయననే నీవు విధేయించాలి అని చెప్పడం. అలాంటప్పుడు అతను తనపై ఎలాంటి రాజకీయ మరియు శాసనాపరమైన ఔన్నత్యాన్ని ఒప్పుకోడానికి సిద్ధపడలేదు. పైగా అతను, తన ప్రజల్లో ఏ ఒక్క వ్యక్తి కూడా అతని తప్ప మరెవ్వరినీ పాలకుడుగా ఒప్పుకోడానికి వీల్లేదని తలచడం. అందుకని అతడు మొదట రబ్బుల్ ఆలమీన్ (సర్వేశ్వరుడు) యొక్క పర్యాయపదాన్ని ఛాలెంజి చేశాడు. ఎందుకంటే, అతని తరఫున మూసా తెచ్చిన సందేశంలో కేవలం ధార్మిక ఆరాధ్యుడనే భావం కాక ప్రస్ఫుటమైన రాజకీయ సార్వభౌమత్వపు సూచనలు కానవస్తున్నాయి గనుక. మూసా(అ) వివరణలిస్తూ, ఏ సర్వేశ్వరుని సందేశమైతే నేను నీ వద్దకు తెచ్చానో ఆయన ఎవరు; ఎలాంటి వాడు అని మాటిమాటికీ వివరిస్తూ పోతున్నప్పుడు అతను, “ఈజిప్టు దేశంలో నా సార్వభౌమత్వం తప్ప మరొకరి

సార్వభౌమత్వపు మాట ఎత్తావో నీవు జైలుపాలు కాగలవు జాగ్రత్త!" అని బెదిరించడం జరిగింది.

అతని అర్థం పర్థం లేని సమాధానానికి మూసా (అ) అతనినుద్దేశించి,

قَالَ اَوَلَوْ جِئْتُكَ بِشَيْءٍ مُّبِيْنٍ ۝

"నేను నీ ముందు ఒక స్పష్టమైన విషయాన్ని తీసుకువచ్చిన తరువాత కూడానా?" అని అడగడం జరిగింది.

అంటే, నేను ఈ విషయానికి సంబంధించిన స్పష్టమైన సూచన చూయించి నేను సకలలోక ప్రభువు, భూమ్యాకాశాలకు యజమాని మరియు తూర్పు పడమరలకు స్వామి అయిన అల్లాహ్ తరఫున వచ్చిన దూతను అని అంటే ఆ విషయాన్ని నిరాకరిస్తావా? అని అడగడం అన్నమాట.

ఈ మాట మూసా (అ) నోట వెలువడగానే సాధారణ బహుదైవారాధకులకు మల్లే అతడు ఓ మానవాతీత శక్తిని ప్రదర్శించమని అడగడం జరిగిపోయింది.

దానికి ఫిరౌను; قَالَ فَأْتِ بِهٖۤ اِنْ كُنْتَ مِنَ الصّٰدِقِيْنَ ۝

'మంచిది తీసుకురా, నీవు సత్యవాదివే అయితే' అని అన్నాడు.

హజ్రత్ మూసా (అ) వేసిన ప్రశ్నకు అతను చెప్పిన ఈ మాటలు అతని పరిస్థితి ప్రాచీన, ఆధునిక కాలాలకు చెందిన ముష్రికుల పరిస్థితి కంటే భిన్నంగా లేదని రుజువు చేస్తున్నాయి. అతను ఇతర ముష్రికులందరి వలెనే మానవాతీత శక్తుల విషయంలో అల్లాహ్‌ను తనపై ఓ ఆరాధ్యుడున్నాడనే భావంతో స్వీకరిస్తున్నాడన్నమాట. అలాగే వారందరిలా ఈ విశ్వంలో ఆయన శక్తి తక్కిన దేవతల కంటే మిన్న అని కూడా గుర్తిస్తున్నాడన్న మాట.

ఈ కారణంచేతనే మూసా (అ) అతనితో, నేను అల్లాహ్ తరఫున నియమించ బడి వచ్చిన దూతను కాను అని నీవు వాదిస్తే, స్పష్టమైన సూచనను చూయించి నేను ఆ సర్వేశ్వరుని తరఫున వచ్చిన దైవప్రవక్తను అని చెప్పి రుజువు చేయనా? అని అడగడం జరిగింది. అందుకనే అతడు, నీవు నీ వాదనలో సత్యవంతుడవే అయితే 'ఏదీ! యేదైనా ఓ మానవాతీతమైన సూచనను ఎందుకు చూపవు? అని అడిగాడు. అలాకాక, అతను ఒకవేళ అల్లాహ్‌నుగాని, ఆయన విశ్వానికి ప్రభువుకాదు అని గాని వాదించి ఉంటే ఓ స్పష్టమైన సూచనను చూయించమని అడిగే ప్రశ్నే ఉత్పన్నం కాకపోయేది. 'స్పష్టమైన సూచన' అనే మాట రావడానికి కారణం అతను అల్లాహ్ ఉనికిని మరియు ఆయన సార్వభౌమత్వాన్ని గుర్తిస్తున్నాడనే అనుకోవాలి.

ఇప్పుడు హజ్రత్ మూసా (అ) వారి సందేశ ప్రచార వివేకాన్ని కూడా ఇక్కడ గమనించాలి.

وَقَالَ مُوْسٰى رَبِّيْٓ اَعْلَمُ بِمَنْ جَآءَ بِالْهُدٰى مِنْ عِنْدِهٖ وَمَنْ تَكُوْنُ لَهٗ عَاقِبَةُ الدَّارِ ۭ اِنَّهٗ لَا يُفْلِحُ الظّٰلِمُوْنَ ۝ (القصص: ٣٧)

"మూసా ఇలా సమాధానం ఇచ్చాడు" తన వద్ద నుండి మార్గదర్శకత్వాన్ని తీసుకు వచ్చిన వ్యక్తి స్థితి ఎటువంటిదో నా ప్రభువు బాగా ఎరుగును. ఇంకా చివరిలో ఎవరి పర్యవసానం మంచిదౌతుందో ఆయనకే బాగా తెలుసు. సత్యం ఏమిటంటే, దుర్మార్గులు ఎన్నడూ సాఫల్యం పొందలేరు." (అల్ ఖసస్:37)

అంటే నీవు నన్ను ఇంద్రజాలికునిగా, అసత్యవాదిగా ఖరారు చేస్తున్నావు. కాని నా ప్రభువు నా పరిస్థితి గురించి పూర్తిగా తెలిసినవాడు. ఏ వ్యక్తి అయితే ఆయన తరపున ప్రవక్తగా నియమించబడ్డాడో ఆ వ్యక్తి ఎలాంటివాడూ అనే విషయాన్ని బాగా తెలిసినవాడు. చివరికి పర్యవసానపు తీర్పు ఆయన చేతిలోనే ఉంది. ఒకవేళ నేనే గనక అసత్యవాదినైతే నా పర్యవసానం చెడ్డదౌతుంది. మరి నీవే గనక అతస్య వాదివి అయితే గుర్తుంచుకో నీ పర్యవసానం ఏమంత బాగుండదు. యదార్థం యదార్థమే. దౌర్జన్యపరుని కొరకు మేలుండదు. ఏ వ్యక్తి అయితే దైవప్రవక్త కాడో, దొంగ ప్రవక్తగా నటించి ప్రయోజనం పొందదలిచాడో అతను కూడా దౌర్జన్యపరుడే. అతనికి మేలు జరిగేది కాదు. అలాగే మరెవరైతే తప్పుడు నేరాలు మోపి సత్యప్రవక్తను అసత్యవాది అని చిత్రించి కుట్రల ద్వారా సత్యాన్ని అణచివేయదలుచుకున్నాడో అతనూ దౌర్జన్యపరుడే. అతనికి కూడా ఎలాంటి సాఫల్యం లభించదు అని హెచ్చరించడం అన్నమాట.

సత్యాసత్యాల నడుమ జరిగే సంఘర్షణలో అసత్యం పన్నే కుట్రలు, కుతంత్రాలు

చరిత్రకు సంబంధించిన ప్రతి కాలంలోనూ అసత్యం, సత్యానికి విరుద్ధంగా మూర్ఖత్వం, మొండితనం, నేరారోపణ, అసత్య ప్రచారాలను తప్ప మరే హేతువు (Reason) ను చూపలేకపోయింది. ఈ విషయాన్ని దివ్యఖుర్ఆన్ ఈ విధంగా వివరిస్తోంది.

فَلَا يَسْتَطِيْعُوْنَ سَبِيْلًا ۝

"స్థిరమైన మాట అనేది వారికసలు తోచదు." (అల్‌ఫుర్ఖాన్:9)

అసత్యవాదులు సత్యం విషయంలో పూర్తిగా గ్రుడ్డివారై శత్రుత్వాన్ని, వైరాన్ని అవలంబిస్తారు. వారు సరైన హేతువును చూపలేరు. ఎల్లప్పుడూ అర్థం పర్థంలేని మాటలతో ఓ హేతుబద్ధమైన పిలుపును ప్రతిఘటించే ప్రయత్నం చేస్తూఉంటారు.

ఒకరు లేచి, ప్రజలారా! ఈ షిర్కు (బహుదైవారాధన), దేని పునాదులపైనైతే మీ మతం మరియు మీ సంస్కృతులు ఆధారపడి ఉన్నాయో అది ఓ తప్పుడు విశ్వాసం; అది తప్పు అని చెప్పడానికి నా వద్ద ఫలానా ఆధారాలు, హేతువులున్నాయి అని పలికితే దానికి సమాధానంగా, అది హేతుబద్ధమైనదే కాదు అని రుజువు చేయడానికి వారివద్ద ఎలాంటి ఆధారాలూ ఉండవు. అలా ఆధారాలను చూపే బదులు వారు, ఇతను ఓ పిచ్చివాడు లేదా ఇతనిపై ఇంద్రజాల ప్రభావం పడింది అని అవహేళనగా మాట్లాడుతారు. అలాగే అతను, ఈ విశ్వవ్యవస్థ పూర్తిగా ఏకేశ్వరవాదంపై నడుస్తోంది, చూడండి ఫలానా వస్తువులు దాన్ని బలపరుస్తున్నాయి అని పలికితే, వెంటనే ఇతను అసత్యవాది, ఇతనిపై ఇంద్రజాల ప్రభావం పడింది అని గోలబెడతారు. మీరు ప్రపంచంలో విచ్చలవిడిగా ప్రవర్తించడానికి కాదు, మీరంతా మీ ప్రభువు వైపునకు తిరిగి పోవలసివుంది అని, మరో జీవితంలో మీ కర్మలకు లెక్క జూపవలసి ఉంది, ఈ యదార్థాన్ని ఫలానా నైతిక, చారిత్రక మరియు వైజ్ఞానిక విషయాలు చాటి చెబు తున్నాయని అన్నప్పుడు సమాధానంగా, నీవు ఏదో కవిత్వాన్ని వల్లిస్తున్నావని అంటారు. అదే విధంగా, నేను దైవం తరపున మీ వద్దకు సత్యమైన బోధనలను తీసికొని వచ్చాను, ఈ బోధనలు స్పష్టమైన నిజాలు అని అతను అన్నప్పుడు అతని బోధనలను చర్చించ కుండానే అందులోని నిజానిజాలేమిటో తెలుసుకోకుండానే ఎలాంటి ఆధారం లేని ఆరోపణ నొకదానిని అతనిపై రుద్దుతూ ఇదంతా నీవు ఎక్కడి నుండో కాపీ చేసి తెచ్చావని అంటారు.

అతను తన దైవదౌత్యానికి రుజువుగా మహా మహిమాన్వితమైన దైవగ్రంథాన్ని, దాని ప్రభావంగా అతని అనుచరుల్లో వచ్చిన నైతిక మార్పును, స్వయంగా తన సచ్చరిచను వారి ముందుంచగా వీటిలో దేన్ని ఖాతరుచేయరు. ఒకవేళ సమాధానంగా ఏదైనా చెబితే, 'నీవు మావలె ఎందుకు భోంచేస్తున్నావు? బజారుల్లో ఎందుకు తిరుగుతున్నావు? ఓ దైవదూత ఎందుకు నీకు వెన్నంటి ఉండడం లేదు లేదా నీవద్ద ఏదైనా నిధి ఎందుకు లేదు అని మాత్రమే అంటారు. మొత్తానికి వారి ఈ మాటలు, ఇరుపక్షాల్లో ఎవరు సత్యంపై ఉన్నారు మరెవరు పాలుపోక అర్థంలేని మాటలు మాట్లాడుతున్నారనే విషయాన్ని చాటిచెబుతున్నాయి. కావాలని మాట్లాడే ఈ విచిత్రమైన మాటల విషయంలో దివ్యఖుర్ఆన్ ఇలా సెలవిస్తోంది:

تَبٰرَكَ الَّذِيْٓ اِنْ شَآءَ جَعَلَ لَكَ خَيْرًا مِّنْ ذٰلِكَ
جَنّٰتٍ تَجْرِيْ مِنْ تَحْتِهَا الْاَنْهٰرُ وَيَجْعَلْ لَّكَ قُصُوْرًا

(الفرقان : ١٠)

"శుభప్రదమైన ఆయన తాను కోరితే, వారు ప్రతిపాదించిన వస్తువులకంటే ఎంతో ఎక్కువగా నీకు ఇవ్వగలడు. (ఒకటికాదు) క్రింద కాలువలు ప్రవహించే ఎన్నో తోటలు పెద్దపెద్ద భవనాలూను."

అరబిక్ మూలంతో 'తబారక్' అనే పదం ఉపయోగించడం జరిగింది. ఆ తరువాత చెప్పబడిన మాటల్లో దాని అర్థం, ఎంతో విశాలమైన వనరులకు స్వామి, అపారమైన శక్తిమంతుడు, ఒకరికి మేలు చేయదలిస్తే తప్పకుండా చేయగల సమర్థుడు అన్న విషయాన్ని చాటిచెబుతున్నాయి.

بَلْ كَذَّبُوا بِالسَّاعَةِ ۖ وَأَعْتَدْنَا لِمَنْ كَذَّبَ بِالسَّاعَةِ
سَعِيرًا ۝ إِذَا رَأَتْهُمْ مِنْ مَكَانٍ بَعِيدٍ سَمِعُوا لَهَا تَغَيُّظًا
وَزَفِيرًا ۝ وَإِذَا أُلْقُوا مِنْهَا مَكَانًا ضَيِّقًا مُقَرَّنِينَ دَعَوْا
هُنَالِكَ ثُبُورًا ۝ لَا تَدْعُوا الْيَوْمَ ثُبُورًا وَاحِدًا وَادْعُوا
ثُبُورًا كَثِيرًا ۝ قُلْ أَذَٰلِكَ خَيْرٌ أَمْ جَنَّةُ الْخُلْدِ الَّتِي
وُعِدَ الْمُتَّقُونَ ۚ كَانَتْ لَهُمْ جَزَاءً وَمَصِيرًا ۝ لَهُمْ
فِيهَا مَا يَشَاءُونَ خَالِدِينَ ۚ كَانَ عَلَىٰ رَبِّكَ وَعْدًا
مَسْئُولًا ۝ (الفرقان : ۱۱تا ۱۶)

"అసలు విషయం ఏమిటంటే, వారు ఆ 'ఘడియ'ను తిరస్కరించారు. ఆ ఘడియను తిరస్కరించే వారికోసం మేము జ్వలించే అగ్నిని సిద్ధం చేసి ఉంచాము. అది వారిని దూరం నుంచి చూచినప్పుడు, వారు దాని క్రోధ ధ్వనులను, విజృంభణ ధ్వనులను వింటారు. దానిలోని ఒక ఇరుకైన స్థలంలో వారు కాళ్ళూ, చేతులు బంధించబడిన స్థితిలో క్రుక్కబడినప్పుడు, చావును పిలవడం ప్రారంభిస్తారు. (అప్పుడు వారితో ఇలా చెప్పబడుతుంది), 'ఈనాడు ఒక చావేకాదు, ఎన్నోచావుల కోసం అరవండి.''

వారిని అడగండి, ఈ పర్యవసానం మంచిదా లేక శాశ్వతంగా ఉండే స్వర్గం మంచిదా అని. ఆ స్వర్గం దైవభక్తి, దైవభీతి కలవారికి వాగ్దానం చేయబడింది. అది వారి కర్మలకు ప్రతిఫలం. వారి ప్రమాణానికి చివరి గమ్యస్థానం. అందులో వారి ప్రతి కోరికా తీరుతుంది. అందులో వారు శాశ్వతంగా ఉంటారు. దానిని ప్రసాదించడం అనేది నీ ప్రభువు తప్పనిసరిగా నెరవేర్చవలసిన ఒక వాగ్దానం.'' (అల్ ఫుర్కాన్: 11-16)

بَلْ كَذَّبُوا بِالسَّاعَةِ بَلْ 'బల్ కజ్జబూబిస్సాఅ' (అసలు విషయం ఏమిటంటే, వారు ఆ ఘడియను తిరస్కరించారు) అంటే వారంటున్నది, నిజంగానే వారు తగిన హేతువు ఆధారంగా ఈ ఖుర్ఆన్‌ను కాపీ చేసిన గ్రంథం అని అనుమానిస్తున్నారని కాదు. అలాగే మిాచేత ముక్తిపొందిన బానిసలు మిాకు ఏదో నూరిపోస్తున్నారన్నదిగాని, మిారు భోంచేస్తున్నారు లేదా బజార్లలో తిరుగాడుతున్నారు అనిగాని, మిా వెంట ఓ దైవదూత వెన్నంటి ఉంటే మేము మిా దైవదౌత్యాన్ని విశ్వసించేవారం అనిగాని,

మీపై ఏదైనా నిధి అవతరించి ఉంటే ఒప్పుకునేవారం అని కాని కాదు. వాటిలో ఏదీ అసలు కారణం కాదు. పైగా పరలోకాన్ని తిరస్కరించడమే ఆ వైఖరి. అదే వారిని సత్యాసత్యాల విషయంలో ఉపేక్షకు గురిచేసింది. దాని ఫలితంగానే ఆలోచించే, పరికించే మరియు పరిశోధించే అవసరం వారికి కలుగలేదు. కాబట్టి సమంజసమైన ఆహ్వానాన్ని రద్దు చేయడానికిగాను ఇలాంటి అర్థంపర్థంలేని వాదనలు చేస్తుంటారు. ఈ జీవితం తరువాత మరో జీవితం కూడా ఉందని, ఆ జీవితంలో వారు దైవం ఎదుట హాజరై తమ ఖర్మలకు లెక్క జూపవలసి ఉందనే భావన వారి మనస్సులో మెదలడమే లేదు. అతి స్వల్పమైన ఈ జీవితం తరువాత చనిపోయి అందరూ ఈ మాట్టిలో కలవాల్సిందే అని భావిస్తున్నారు. వారి దృష్టిలో విగ్రహారాధకుడు కూడా మట్టైపోతాడు. ఆస్తికుడుకూడా, నాస్తికుడు కూడా మట్టైపోవలసిందే. ఎవరికి ఎలాంటి ఫలితం ఉండబోదు. అలాంటప్పుడు బహుదైవారాధకుడై మరణించడంలోను లేదా ఏకేశ్వరోపాసకుడై లేదా నాస్తికుడై మరణించడంలో తేడా ఏమిటి? తప్పూ, రైటూ తేడా ఏదైనా ఉంటే వారి దృష్టిలో అది ఈ ఇహలోకపు విజయం, అపజయాల మేరకే. ఇక్కడ ఏ విశ్వాసం మరియు నైతికతలకు ఓ నిర్ధారితమైన సమాన ఫలితం లభించడం లేదు. అతను క్రైస్తవుడైనా, నక్షత్రాలను పూజించే వారైనా విగ్రహారాధకులైనా ప్రతివాడు ఇక్కడ మంచీచెడు రెండు రకాల పరిస్థితులకు లోనౌతున్నాడు. ఏ నమ్మకాన్ని అవలంబించేవాడైనా లేదా దాన్ని తిరస్కరించేవాడైనా ఉభయులూ కష్టాలను అనుభవిస్తూనే ఉన్నారు. సద్వర్తనులు మరియు దుష్టులుభయులూ తమ కర్మలకు ఇక్కడ ఒకే తీరుగా ఫలితం అనుభవించడం లేదు. ఓ దుష్టుడు ఇక్కడ ఐశ్వర్యాన్ని అనుభవిస్తూ ఉంటే మరో దుష్టుడు కష్టాలను అనుభవిస్తున్నాడు. అలాగే, ఓ సద్వర్తనుడు ఇక్కడ కష్టాలను అనుభవిస్తూ ఉంటే మరొక సద్వర్తనుడు కూడా గౌరవప్రదమైన జీవితాన్ని గడుపుతున్నాడు. కాబట్టి ప్రాపంచిక ఫలితాల ప్రకారం ఓ పరలోక తిరస్కారి, ఏ ఒక్క ప్రత్యేక నైతిక వైఖరి గురించి అది మంచిదా చెడ్డదా అనే విషయంలో తృప్తిపడజాలడు. ఈ పరిస్థితిలో ఎవరైనా ఓ విశ్వాసం వైపుకు, ఓ నైతిక సిద్ధాంతం వైపుకు ఆహ్వానిస్తే, ఓ పరలోక తిరస్కారి దాన్ని సీరియస్‌గా ఆలోచించే స్థితిలో ఉండడు. పైగా చిన్నపిల్లవానిలా ఏవో కొన్ని ఆక్షేపణలు లేవనెత్తి నోరు మూయించే ప్రయత్నం చేస్తాడు.

దైవాన్ని తిరస్కరించేవారు మరియు పిడివాదులకు ఎదురయ్యే దుష్పరిణామం ఎలా ఉంటుందనే సత్యాన్ని చెప్పిన తరువాత పై ఆయత్‌లో, దైవానికి భయపడుతూ జీవితం గడిపేవారికి శాశ్వతంగా ఉండే స్వర్గసీమ లభిస్తుందని హామీ ఇవ్వడం జరిగింది. ఈ వాగ్దానం చేసింది సర్వలోక పోషకుడు అయిన అల్లాహ్‌యే. ఇందులో చెప్పబడిన మాట, "దానిని ప్రసాదించడం అనేది నీ ప్రభువు తప్పనిసరిగా నెరవేర్చ వలసిన వాగ్దానం" అన్నది.

అయితే ఇక్కడ ఓ ప్రశ్న ఉత్పన్నం కావచ్చు. అదేమిటంటే, ప్రళయదినం, కర్మలకు లెక్కనడగడం, స్వర్గ నరకాలను ఇదివరకే నిరాకరించేవానిపై స్వర్గం వాగ్దానం మరియు నరకయాతనలు ఎలాంటి ప్రభావాన్ని వేయగలుగుతాయి? అన్నదే ఆ ప్రశ్న. చూడడానికి ఈ మాటలు సందర్భోచితమైన మాటలు కాకపోయినప్పటికీ, కొంత ఆలోచిస్తే ఈ విషయం సునాయాసంగా అర్థం కాగలదు. మనం గనక మాటను ఒప్పుకోమ్మని వత్తిడిచేస్తున్నప్పుడు, ఎదుటివాడు దాన్ని ఒప్పుకోవడానికి సిద్ధంగా లేనప్పుడు వాదన మరియు తర్కం తీరు మరోలా ఉంటుంది. అయితే మనం గనక, "నా మాటను ఒప్పుకోవడం కాదు, అది నీకు ప్రయోజనం కలిగించే విషయం మాత్రమే అన్న తీరులో ఎదుటివానితో చర్చకు దిగితే అతను ఎంతటి పిడివాది అయినా ఒకసారి ఆలోచించడానికి వివశుడైపోగలడు. ఇక్కడ చెప్పిన తీరు కూడా ఈ రకానికి చెందిందే. ఈ సందర్భంలో ఎదుటివాడు స్వయం తన ప్రయోజనం దృష్టితోనే ఆలోచించవలసి ఉంటుంది. మరో జీవితం ఉంది అనే ఆధారం ఏదీ లేనప్పటికీ, ఆ జీవితం లేదు అని రుజువు చేసే ఆధారం కూడా యేదీ లేదు. ఒకవేళ ఎదుటివాడు, నేను అనుకున్నట్లు మరో జీవితం అన్నదే లేదు అని, మనమంతా చనిపోయిన తరువాత మట్టయిపోయేవారమే అని అనుకుంటే పరలోక జీవితం ఉందని నమ్మేవాడు కూడా చనిపోయి మట్టిలో కలిసిపోయేవాడే. అలాంటప్పుడు మేము ఉభయులమూ సమానులమే అవుతాం. కాని ఒకవేళ అతని మాటే సత్యమైతే అప్పుడు నా గతి ఏమౌతుంది? అని తప్పక ఆలోచిస్తాడు. ఈ విధంగా మాట్లాడే తీరు పిడివాది యొక్క పిడివాదంలో ఓ అఖాతాన్ని సృష్టిస్తుంది. ఈ అఖాతమంతా విస్తరించాలంటే ప్రళయదినం, తిరిగిలేపబడడం, కర్మలకు లెక్కజూపడం, స్వర్గం, నరకాలకు సంబంధించిన చిత్రం అతని కళ్ళకు కనపడినట్లు చూయించడం జరగాలి.

ధర్మావగాహనకు కావలసిన వివేక విధానం

ఈ ఉత్తమ విధానం దివ్యఖుర్ఆన్‌లోని అష్షుఅరా సూరా ఆయత్ 70 నుండి 76లో వివరించడం జరిగింది. ఇబ్రాహీం (అ) తన తండ్రి మరియు తన జాతి ప్రజలను ఉద్దేశించి:

مَا تَعْبُدُوْنَ ○ "మీరు వేటిని పూజిస్తున్నారు?" అని అడగగా,

قَالُوْا نَعْبُدُ اَصْنَامًا فَنَظَلُّ لَهَا عٰكِفِيْنَ ○

"ఇవి కొన్ని విగ్రహాలు, వాటిని మేము పూజిస్తున్నాము. వాటి సేవలోనే మేము నిమగ్నమై ఉన్నాము" అని సమాధానం ఇస్తారు.

يَسْمَعُوْنَكُمْ اِذْ تَدْعُوْنَ ○ اَوْ يَنْفَعُوْنَكُمْ اَوْ يَضُرُّوْنَ ○

"మీరు వీటిని పిలిచినప్పుడు, ఇవి మీ మొరను ఆలకిస్తాయా? లేదా ఇవి మీకేమైనా లాభాన్నిగాని నష్టాన్నిగాని కలిగిస్తాయా?" అని వారిని అడిగినప్పుడు-

قَالُوْا بَلْ وَجَدْنَآ اٰبَآءَنَا كَذٰلِكَ يَفْعَلُوْنَ ٥

"లేదు, కాని. మేము మా తాతముత్తాతలు ఇలా చేస్తూ ఉండగా చూశాము" అని అంటారు. అప్పుడు ఇబ్రాహీం (అ) వారిని ఇలా అడుగుతారు:

قَالَ اَفَرَءَيْتُمْ مَّا كُنْتُمْ تَعْبُدُوْنَ ٥ اَنْتُمْ وَاٰبَآؤُكُمُ الْاَقْدَمُوْنَ ٥

"మీరు, పూర్వం మీ తాతముత్తాతలూ పూజిస్తూ వస్తున్న వాటిని మీరు (కళ్ళు తెరిచి) చూశారా?" అని.

అంటే ఓ మతం సత్యమైంది కావడానికి, అది తాతముత్తాల కాలం నుండి అవలంబించబడుతూ వస్తోంది, పూజింపబడే ఆ దైవాల్లో దైవత్వం ఉందా లేదా, అదృష్టాన్నిగాని, దురదృష్టాన్నిగాని కలిగించే అధికారాలు వాటికి ఉన్నాయా లేదా అని ఆలోచించకుండా, కేవలం తరతరాలుగా కళ్ళుమూసుకొని పూజించడమే దానికి హేతువు అని చెప్పడం సరిపోతుందా? అని అడగడం అన్నమాట. అలా కానప్పుడు-

فَاِنَّهُمْ عَدُوٌّ لِّيْٓ اِلَّا رَبَّ الْعٰلَمِيْنَ ٥

"నాకు ఇవన్నీ శత్రువులే, ఒక సకల లోకాల ప్రభువు తప్ప" అని అంటారు.

అంటే, నేను వీటి గురించి ఆలోచించినప్పుడు, ఒకవేళ నేను వాటిని పూజిస్తే నా ఇహలోకం, పరకలోకం రెండూ సర్వనాశనం అయిపోతాయి అని స్పష్టంగా తెలుస్తోంది. నేను వాటి ఆరాధనను నిష్ప్రయోజనకరమైందిగా, ప్రమాద రహితమైందిగా తలచడమే కాకుండా పైపెచ్చు నాకు నష్టదాయకమైందిగా కూడా భావిస్తున్నాను. నా దృష్టిలో వాటిని పూజించడం శత్రువును పూజించడం లాంటిదే అని అర్థం. ఇదే కాకుండా హజ్రత్ ఇబ్రాహీం (అ) వారి ఈ మాటలు, 'మర్యమ్' సూరాలో చెప్పబడిన విషయాన్ని కూడా గుర్తుకుతెస్తున్నాయి. మర్యమ్ సూరాలో ఇలా చెప్పడం జరిగింది:

وَاتَّخَذُوْا مِنْ دُوْنِ اللّٰهِ اٰلِهَةً لِّيَكُوْنُوْا لَهُمْ
عِزًّا ۝ كَلَّا سَيَكْفُرُوْنَ بِعِبَادَتِهِمْ وَيَكُوْنُوْنَ
عَلَيْهِمْ ضِدًّا

"వారు అల్లాహ్‌ను కాదని, కొందరిని తమ దేవుళ్ళుగా చేసుకున్నారు. తమకు వారు అండగా ఉంటారని భావించారు. కాని అండగా ఎవరూ ఉండరు. ఆ దేవుళ్ళు అందరూ వారి ఆరాధనను నిరాకరిస్తారు. పైగా వారికి ప్రత్యర్థులౌతారు."

(మర్యమ్:81,82)

అంటే ప్రళయం రోజున వారు, వారికి వ్యతిరేకంగా సాక్ష్యం ఇస్తారు. "మేము ఎన్నడూ మమ్మల్ని ఆరాధించండి అని వారిని అడగలేదు, పైగా వారు మమ్మల్ని ఆరాధిస్తున్నారనే విషయమూ మాకు అసలే తెలియదు" అని అంటారు.

సందేశ ప్రచార వివేకానికి సంబంధించిన మరో ఉపాయం కూడా ఇక్కడ గమనించతగినది, హజ్రత్ ఇబ్రాహీమ్ (అ), వారిని ఉద్దేశించి, మీ ఈ మిథ్యా దేవుళ్ళు మీకే శత్రువులు అని చెప్పలేదు. ఒకవేళ ఆయనే గనక అలా అని ఉంటే వారు మరింత మంకు మరియు పిడివాదానికి దిగి ఉండేవారు. వారు ఇబ్రాహీం (అ)తో, "ఏమిటీ! మా ఈ దేవుళ్ళు మాకు శత్రువులెలా అయ్యారు?" అని అడిగేవారే. దానికి భిన్నంగా ఆయన (అ)లా మంచీచెడ్డల గురించి ఆలోచించే అవకాశం ఏర్పడింది. ఇబ్రాహీం (అ) అవలంబించిన ఈ విధానం ప్రతి మనిషిలో నిద్రాణమై ఉండే అతని సహజ పరిశీలనా శక్తిని తట్టి లేపినట్లయింది. ప్రతి వ్యక్తి ఎప్పుడూ తన బాగు కొరకే ఆలోచిస్తాడు, "నేను వాటిని పూజించడంలోనే నాకు స్పష్టమైన నష్టం అగుపడుతోంది. కావాలని నేను నా నష్టాన్ని కోరుకోను, కాబట్టి చూడండి! నేను స్వయంగా వారి ఆరాధనకు దూరంగా ఉంటున్నాను" అని అన్నప్పుడు ఎదుటివాడు, తన స్వలాభం ఎందులో ఉంది? బహుశా నేను నాకు తెలియకుండా నా నష్టాన్ని కొనితెచ్చుకోవడం లేదుకదా అని సహజంగానే ఆలోచిస్తాడు.

సందేశ ప్రచారం ఎదుటి మనిషిని ఆలోచింపజేసేదిగా ఉండాలి

దైవం అన్నమ్ల్ సూరాలో ఇలా సెలవిస్తున్నాడు:

آٰللّٰهُ خَيْرٌ اَمَّا يُشْرِكُوْنَ ○

"అల్లాహ్ శ్రేష్ఠుడా లేక ఆయనకు సాటిగా వారు కల్పించే దేవుళ్ళు శ్రేష్ఠులా?" (అన్ నమ్ల్: 59)

చూడడానికి, ఈ ప్రశ్న విచిత్రంగా అగుపడుతోంది. యదార్థ దృష్టితో పరికించి చూస్తే, మిథ్యా దేవుళ్ళలో, అల్లాహ్‌కు సాటిగావచ్చే ఎలాంటి మేలూ అగుపడదు. పోతే, బహుదైవారాధకులు కూడా వారు ఆరాధించే దేవుళ్ళు అల్లాహ్‌కు సాటి వస్తారు అని అనుకునేవారు కాదు. అయితే ఈ ప్రశ్న వారిముందు లేవనెత్తడానికి కారణం కూడా వారు అలాంటి తప్పు చేస్తున్నారు అని తెలపడానికే. ప్రపంచంలో ఏ వ్యక్తి కూడా, తనకు లాభం చేకూరుతుంది అని అనుకోకుండా ఏ పనీ చేయలేడు. ఒకవేళ ఈ ముష్రికులు (బహు దైవారాధకులు) అల్లాహ్‌ను కాదని వారి అసత్య దైవాల ఆరాధన చేసేవారో, అల్లాహ్‌ను వదిలి వాటినే మ్రొక్కుకునేవారో, వారికే నైవేద్యాలు అర్పించేవారో, దానికి కారణం వాటి ద్వారా యేదో ఒక మేలు చేకూరుతోందనేకదా? అందువల్లనే, "చెప్పండి! అల్లాహ్ శ్రేష్ఠుడా లేదా ఆయనకు సాటిగా మీరు కల్పించే ఈ దేవుళ్ళు శ్రేష్ఠులా?" అనే ప్రశ్న వేయడం జరిగింది. ఎందుకంటే ముక్కుకు సూటిగా

అడిగిన ఈ ప్రశ్నకు సమాధానం ఇచ్చే ధైర్యం వారికి లేదు. వారిలోని కరుడుగట్టిన ముష్రిక్ కూడా, మా దేవుళ్ళే మేలు అనే ధైర్యం చేయలేడు. ఇక అల్లాహ్‌యే శ్రేష్ఠుడు అని ఒప్పుకున్న తరువాత వారి విశ్వాసం, వారి ధర్మం పునాది పూర్తిగా పడిపోతుంది. అందుచేత, ఆ శ్రేష్ఠతను శ్రేష్ఠతగా తలచకుండా చెడును అనుసరించడమే సరైంది అంటూ వారు దాన్నే అనుసరించడం జరిగింది.

ఈ రకంగా ఖుర్‌ఆన్ తన ప్రసంగం మొట్టమొదటి వాక్యంతోనే వ్యతిరేకులను నిర్వీర్యం చేసేసింది. ఆ తరువాత అల్లాహ్ శక్తి, ఆయన సృష్టికి సంబంధించిన ఒక్కో మహత్యం వైపుకు దృష్టిని మళ్ళీస్తూ, చెప్పండి! ఈ పనులు చేసింది ఎవరు? ఒకే ఒక అల్లాహ్‌కు సహవర్తులుగా ఉండి మరెవరైనా ఈ కార్యాల్లో సహకరిస్తున్నారా? ఒకవేళ అలా జరగకపోతే, మీరు ఆరాధ్యులుగా చేసుకోవడానికి వాటిలో ఏముందని తలిచారు?

దైవప్రవక్త (స) వారు ఈ ఆయత్‌ను పఠించిన తోడనే దానికి సమాధానంగా ఇలా అనేవారు:

بَلِ اللّٰهُ خَيْرٌ وَّ اَبْقٰى وَ اَجَلُّ وَ اَكْرَمُ

(కాదు, అల్లాహ్‌యే శ్రేష్ఠమైనవాడు, ఆయనే నిత్యుడు, ఆయనంతటి మహోన్నతుడు ఎవరూ లేరు.)

నిదురపోయే జాతిని తట్టిలేపే ఉపాయాలు

అష్ షుఅరా అధ్యాయంలోని 103వ ఆయత్‌లో ఇబ్రాహీం (అ) గారి కథ గురించి చెప్పిన తరువాత చివరగా ఇలా సెలవియ్యడం జరిగింది.

اِنَّ فِيْ ذٰلِكَ لَاٰيَةً ۭ وَمَا كَانَ اَكْثَرُهُمْ مُّؤْمِنِيْنَ ○

"నిశ్చయంగా ఇందులో ఒక గొప్ప సూచన ఉన్నది. కాని వారిలో అత్యధికులు విశ్వసించరు."
(అష్ షుఅరా:103)

హజ్రత్ ఇబ్రాహీం (అ)గారి ఈ గాథలో సూచనకు సంబంధించిన రెండు కోణాలున్నాయి. ఒకటి, అరబ్బు బహుదైవారాధకులు, ముఖ్యంగా మక్కావాసులు, ఓ వైపు హజ్రత్ ఇబ్రాహీం (అ) వారిని అనుసరిస్తున్నామని, ఆయన వంశంలోనే పుట్టామని గర్వించేవారు. కాని మరోవైపు, ఇబ్రాహీం (అ) యే షిర్కుకైతే వ్యతిరేకో, దాన్ని తుదముట్టించడానికి తన జీవితాన్నంతా ధారపోశారో ఆ మక్కావాసులు ఆ షిర్కులోనే చిక్కుకుపోయారు. ఇప్పుడు ఈ ప్రవక్త (స) అదే మార్గాన్ని వారికి ఉపదేశించగా, ఇబ్రాహీం (అ) జాతి ఆయనపట్ల యే వైఖరినైతే అవలంబించారో, ప్రవక్త ముహమ్మద్ (స) వారిపట్ల కూడా ఈ మక్కావాసులు అచ్చం అలాంటి వైఖరినే

అవలంబించారు. కాబట్టి, హజ్రత్ ఇబ్రాహీం (అ) అయితే షిర్కుకు శత్రువు మరియు ఏకేశ్వరోపాసనా ధ్వజవాహకులు అనే సత్యాన్ని వారికి గుర్తుచేయడం జరిగింది. అదేకాకుండా, హజ్రత్ ఇబ్రాహీం బహుదైవారాధకుడు కాదు అనే విషయం కూడా వారికి బాగా తెలుసు. అయినప్పటికీ వీరు తమ వైఖరిపైన్నే స్థిరంగా ఉండిపోయారు. ఈ గాథలోని సూచన రెండవ కోణం ఏమంటే, ఇబ్రాహీం (అ) వారి జాతి నామ రూపాల్లేకుండా అంతమైపోయింది. ఆ జాతిలో ఎవరికైనా యశస్సు (Immortality) దక్కిందంటే అది కేవలం ఇబ్రాహీం (అ) మరియు ఆయన పుత్రులు (ఇస్మాయీల్ మరియు ఇస్హాక్(అ)లకు) వారి సంతానానికి మట్టుకే. హజ్రత్ ఇబ్రాహీం (అ) తన జాతిని విడిచివెళ్ళిపోయిన తరువాత ఆ జాతిపై విరుచుకుపడిన శిక్ష ఎలాంటిదో దివ్యఖుర్ఆన్‌లో చర్చించబడనప్పటికీ, ఆ జాతి మాత్రం శాపగ్రస్తజాతుల్లో లెక్కించ బడింది.

اَلَمْ يَاْتِهِمْ نَبَاُ الَّذِيْنَ مِنْ قَبْلِهِمْ قَوْمِ
نُوْحٍ وَّعَادٍ وَّثَمُوْدَ وَقَوْمِ اِبْرَاهِيْمَ وَاَصْحَابِ
مَدْيَنَ وَالْمُؤْتَفِكٰتِ (التوبہ : ۹)

"వారికి తమ పూర్వీకుల చరిత్ర అందలేదా? నూహ్ జాతి ప్రజలు ఆద్, సమూద్ జాతులు, ఇబ్రాహీం జాతి ప్రజలు, మద్‌యన్ ప్రజలు, తల్లక్రిందులు చేయబడిన పట్టణాలు?" (అత్ తౌబా:70)

దైవ గ్రంథం కలవారు - సందేశ ప్రచారం

దివ్యఖుర్ఆన్, గ్రంథం కలవారి సందేశాన్ని అందజేసే వివేకవంతమైన విధానాన్ని సూచించింది.

وَلَا تُجَادِلُوْٓا اَهْلَ الْكِتٰبِ اِلَّا بِالَّتِيْ هِيَ اَحْسَنُ
اِلَّا الَّذِيْنَ ظَلَمُوْا مِنْهُمْ وَقُوْلُوْٓا اٰمَنَّا بِالَّذِيْٓ
اُنْزِلَ اِلَيْنَا وَاُنْزِلَ اِلَيْكُمْ وَاِلٰهُنَا وَاِلٰهُكُمْ
وَّاحِدٌ وَّنَحْنُ لَهٗ مُسْلِمُوْنَ ۝ (العنکبوت : ۴۶)

"గ్రంథ ప్రజలతో వాదించకు, ఉత్తమమైన రీతిలో తప్ప - అయితే వారిలోని దుర్మార్గులతో మాత్రం కాదు- వారితో ఇలా అను, "మేము మా వద్దకు పంపబడిన దాన్ని విశ్వసించాము, మీ వద్దకు పంపబడిన దానినీ విశ్వసించాము. మా దేవుడూ, మీ దేవుడూ ఒక్కడే, మేము ఆయనకే విధేయులం." (అల్ అన్‌కబూత్: 46)

"గ్రంథ ప్రజలతో వాదించకు ఉత్తమమైన రీతిలో తప్ప" అని అంటే, వాదన ఉత్తమమైన ఆధారాలు, హేతువులు చూపుతూ సభ్యతకలిగిన భాషలో పరస్పరం

అవగాహనచేసుకునే రీతిలో జరగాలి; దాని ద్వారా ఎవరితోనైతే వాదిస్తున్నామో అతని భావాలు సంస్కరించబడాలి అన్నమాట. సందేశాన్ని చేరవేసేవాడు, ఎదుటివాని హృదయకవాటాలను తెరిచి సత్యవాక్కును అందులో ప్రవేశింపజేసే ప్రయత్నం చేయాలి. అతనిని సన్మార్గంపైకి తీసుకువచ్చే ప్రయత్నం చేయాలి. అతడు ఎదుటివానితో, ఓ పహిల్వాను తన ప్రత్యర్థిని ఓడించడానికి ప్రయత్నిస్తున్నాడా అన్నట్లు ప్రవర్తించకూడదు, అలా కాకుండా అతను రోగికి ఉపశమనం కలిగించే వైద్యునిలా మెలగాలి. ఓ వైద్యుడు రోగికి చికిత్సచేసేటప్పుడు, సాధ్యమైనంత తక్కువ బాధ కలిగించి, రోగి ఆరోగ్యవంతుడు అయ్యేటట్లు ప్రయత్నిస్తాడు. తనవల్ల యే తప్పయినా జరిగిపోతే ఆ రోగి బాధ ఎక్కడ అధికమౌతుందో అని జాగ్రత్త వహిస్తాడు. ఇక్కడ సందర్భాన్ని బట్టి గ్రంథవహులలో వాదించేటప్పుడు మెలగవలసిన తీరు విషయంలో ఈ ఆదేశం ఇవ్వబడినప్పటికీ కేవలం అది గ్రంథం కలవారికోసమే పరిమితమైంది కాదు. సందేశ ప్రచార ఘట్టంలో అవలంబించవలసిన తీరుకు సంబం ధించిన ఓ ఆదేశం దివ్యఖుర్‌ఆన్‌లో చాలా చోట్ల ఇవ్వడం జరిగింది. ఉదాహరణకు:

اُدْعُ اِلٰى سَبِيْلِ رَبِّكَ بِالْحِكْمَةِ وَالْمَوْعِظَةِ الْحَسَنَةِ
وَجَادِلْهُمْ بِالَّتِيْ هِيَ اَحْسَنُ (النحل : ۱۲۵)

"ప్రవక్తా! నీ ప్రభువు మార్గం వైపునకు ఆహ్వానించు, వివేకంతో చక్కని హితబోధతో. ప్రజలతో ఉత్తమమైన రీతిలో వాదించు." (అన్ నహ్లా:125)

وَلَا تَسْتَوِي الْحَسَنَةُ وَلَا السَّيِّئَةُ اِدْفَعْ بِالَّتِيْ
هِيَ اَحْسَنُ فَاِذَا الَّذِيْ بَيْنَكَ وَبَيْنَهٗ عَدَاوَةٌ كَاَنَّهٗ
وَلِيٌّ حَمِيْمٌ ۝ (حم السجده : ۳۴)

"ప్రవక్తా! మంచీ, చెడూ ఒకటికావు. నీవు చెడును శ్రేష్ఠమైన మంచిద్వారా తొలగించు. అప్పుడు నీ పట్ల శత్రుభావం కలవాడు నీకు ప్రాణస్నేహితుడైపోవడాన్ని నీవు గమనిస్తావు." (హామీమ్ అస్సజ్దా:34)

اِدْفَعْ بِالَّتِيْ هِيَ اَحْسَنُ السَّيِّئَةَ نَحْنُ اَعْلَمُ
بِمَا يَصِفُوْنَ ۝ (المومنون : ۹۶)

"ఓ ప్రవక్తా! చెడును ఉత్తమమైన పద్ధతి ద్వారా నివారించు, యే విషయాలను వారు నిన్ను గురించి కల్పిస్తున్నారో అవి మాకు బాగా తెలుసు." (అల్ మోమినూన్:96)

خُذِ الْعَفْوَ وَاْمُرْ بِالْعُرْفِ وَاَعْرِضْ عَنِ الْجٰهِلِيْنَ ۝
وَاِمَّا يَنْزَغَنَّكَ مِنَ الشَّيْطٰنِ نَزْغٌ فَاسْتَعِذْ بِاللّٰهِ (الاعراف : ۱۴۴۔)

"ప్రవక్తా! మృదుత్వం, మన్నింపుల వైఖరిని అవలంబించు. మంచిని ప్రబోధించు. మూర్ఖులతో వాదానికి దిగకు. ఒకవేళ ఎప్పుడైనా షైతాను నిన్ను ఉసిగొలిపితే అల్లాహ్ శరణు వేడు." (అల్ ఆరాఫ్: 199)

సత్యధర్మ ప్రచారసేవలో అవలంబించే ఈ ఉత్తమమైన చర్చచేసే విధానం వైపుకు అల్లాహ్‌యే స్వయంగా మార్గాన్ని చూయించడం జరిగింది. ఈ విధానంలో నేర్పబడిన విషయం ఏమిటంటే, ఏ వ్యక్తితోనైతే మీరు వాదానికి దిగుతారో ఆ వ్యక్తి మార్గభ్రష్టత్వాన్ని ప్రారంభ అంశంగా చేసుకొని వాదించకూడదు. దానికి భిన్నంగా, మీకూ, అతనికి నడుమ సత్యం విషయంలో ఏయే అంశాలు ఉమ్మడిగా ఉన్నాయి అని చూడవలసి ఉంటుంది. అంటే వాదన ప్రారంభ అభిప్రాయ భేదాలతో కాకుండా ఏకాభిప్రాయానికి సంబంధించిన మాటలతో ప్రారంభం కావాలి. ఆ తరువాత మీ ఇరువురి ఏకాభిప్రాయాలను ముందుంచి, మీకూ అతనికి నడుమ ఏయే విషయాల్లో అభిప్రాయభేదాలున్నాయి? మీరు అతని యేయే విషయాలను సమర్థిస్తున్నారు, మరే విషయాలను సమర్థించడంలేదు అని ఎదుటివానిని నచ్చజెప్పే ప్రయత్నం చేయాలి.

ఈ సందర్భంలో ఓ విషయాన్ని గుర్తుంచుకోవలసి ఉంటుంది. అదేమిటంటే, గ్రంథం కలవారు అరేబియా బహుదైవారాధకుల్లా దైవవాణి, దైవదౌత్యం మరియు దైవ ఏకత్వాలను నిరాకరించేవారుకాదు. పైగా ముస్లిములకుమల్లే వారు ఈ యదార్థాలన్నిటినీ నమ్మేవారే. ఈ మౌలిక విషయాల్లో ఏకాభిప్రాయం ఉన్న తరువాత, ఏదైనా మౌలిక విభేదం పొడసూపగలిగేదిగా ఉంటే అది ముస్లిములు వారి వద్దకు వచ్చిన దైవగ్రంథాలను నమ్మకుండా కేవలం తమ వద్దకు వచ్చిన దైవగ్రంథాన్నే నమ్మండి అని వారిని పిలవడం, దాన్ని నమ్మకపోతే వారిని కాఫిర్‌లుగా ఖరారు చేయడం, అలా జరిగితే అది జగడానికి గొప్ప కారణం అయివుండేది. కాని ముస్లిముల పొజిషను మాత్రం దానికి భిన్నమైనది. వారు గ్రంథవహుల వద్దనున్న గ్రంథాలన్నిటిని సత్యమైనవిగానే గుర్తించేవారు. దానికితోడు ముహమ్మద్ (స) వారిపై అవతరించిన దైవవాణిని విశ్వసించారు. అయినప్పుడు, దైవం అవతరింపజేసిన ఓ గ్రంథాన్ని విశ్వసించడం మరో గ్రంథాన్ని తిరస్కరించడానికి యే కారణం అడ్డొచ్చిందో వారు వివరించి చెప్పాల్సిన విషయం. అందుకనే ఇక్కడ అల్లాహ్ గ్రంథం గల ప్రజలతో వాదించాల్సి వస్తే అన్నిటికంటే ముందు, మీ ఈ సకారాత్మక వైఖరిని లేదా పొజిషన్‌ను వారి ముందు ప్రదర్శించవలసి ఉంది. మీరు యే దేవుణ్ణయితే విశ్వసిస్తున్నారో ఆయనకే మేము విధేయులము, ఆయన తరపు నుండి ఏ బోధనలు, మరే ఆదేశాలు అయితే వచ్చాయో వాటికి మేము పూర్తిగా తలొగ్గుతున్నాము- ఆ ఆదేశాలు బోధనలు మీ వద్దకు వచ్చినా సరే- మేము కేవలం ఆయన ఆదేశానికి దాసులం, ఓ దైవాదేశం

వస్తే దాన్ని విశ్వసించడానికి, అదే ఆదేశం మరోచోట వస్తే దాన్ని విశ్వసించకపోవడానికి మేము ఓ దేశానికో, ఓ జాతికో లేదా ఓ సంతతికో దాసులం కాము అని వారికి అర్థమయ్యే రీతిలో తెలపవలసి ఉంటుంది.

కోపోద్రేకాలకు దూరంగా ఉండడం

ధర్మం వైపునకు ఆహ్వానించేందుకు ఆలోచనలకు తోడు, ఎదుటివాని భావోద్రేకాలు రెచ్చిపోకుండా చూడవలసి ఉంటుంది. దివ్యఖుర్ఆన్ మనకు ఈ విధంగా మార్గాన్ని చూపెడుతోంది.

قُلْ مَنْ يَّرْزُقُكُمْ مِّنَ السَّمَآءِ وَالْاَرْضِ اَمَّنْ يَّمْلِكُ
السَّمْعَ وَالْاَبْصَارَ وَمَنْ يُّخْرِجُ الْحَيَّ مِنَ الْمَيِّتِ
وَيُخْرِجُ الْمَيِّتَ مِنَ الْحَيِّ وَمَنْ يُّدَبِّرُ الْاَمْرَ ؕ
فَسَيَقُوْلُوْنَ اللّٰهُ ۚ فَقُلْ اَفَلَا تَتَّقُوْنَ ۝ (یونس: ۳۱)

"వారినడుగు: ఆకాశం నుండీ భూమి నుండీ మీకు ఉపాధినిచ్చేవాడు ఎవడు? వినేశక్తీ, చూస్తేశక్తీ ఎవడి ఆధీనంలో ఉన్నాయి? ప్రాణము లేని దాని నుండి ప్రాణమున్న దాన్ని, ప్రాణమున్న దానినుండి ప్రాణములేని దాన్నీ వెలికి తీసేవాడు ఎవడు? ఈ విశ్వవ్యవస్థను నడుపుతున్న వాడు ఎవడు? వారు అల్లాహ్ అని తప్పకుండా అంటారు. ఇలా అను: "అలాంటప్పుడు మీరు (సత్యానికి వ్యతిరేకంగా నడవడం) మానుకోరేమిటి?" (యూనుస్: 31)

فَذٰلِكُمُ اللّٰهُ رَبُّكُمُ الْحَقُّ

"నీ ప్రభువు అన్నమాట ఇలా రూఢీ అయింది." (యూనుస్ : 33)

అంటే, మీరు విశ్వసిస్తున్నట్లుగా ఈ పనులన్నీ అల్లాహ్యే చేస్తున్నప్పుడు, మీ నిజమైన పోషకుడు, యజమాని, స్వామీ ఆయనే అని, మీ దాస్యం, మీ ఆరాధనలన్నిటికీ ఆయనే అర్హుడు అయినప్పుడు, ఈ కార్యకలాపాల్లో ఎలాంటి భాగస్వామ్యం లేని ఆ మిథ్యా దేవుళ్ళలో దైవత్వం ఎక్కడి నుండి వచ్చింది? వారు దేవునికి భాగస్వాములు ఎలా అయ్యారు? అని అడగడం అన్నమాట.

فَمَاذَا بَعْدَ الْحَقِّ اِلَّا الضَّلٰلُ ۚۖ فَاَنّٰى تُصْرَفُوْنَ ۝ (یونس: ۳۲)

"కనుక సత్యాన్ని తృణీకరిస్తే మార్గభ్రష్టత్వం తప్ప ఇక మిగిలేదేమిటి? అసలు మీరు ఎటు మరలింపబడుతున్నారు?" (యూనుస్ :32)

ఇక్కడ సంబోధన పూర్తిగా సాధారణ ప్రజలనుద్దేశించి చేసిందే అన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి. వారిని, "మీరు ఎటు వైపుకు మరులుతున్నారు?" అని ప్రశ్నించడం

లేదు. మీరు ఎటువైపుకు మరలింపబడుతున్నారు? అని అడగడం జరిగింది. దీనిద్వారా అర్థం అయిందేమిటంటే, ప్రజలను సరైనమార్గం నుండి మళ్ళించి వక్రమార్గంపై నడపడానికి ఎవరో ఒక వ్యక్తో లేదా ఓ వర్గమో తప్పక ఉంది అని తెలుస్తోంది. కాబట్టి, మీరు గ్రుడ్డివారై తప్పుడు మార్గంపై నడిపించే వారి వెంట ఎందుకు వెడుతున్నారు, మీ బుద్ధి వివేచనాలను ఉపయోగించి సత్యమే ఇదైతే మిమ్మల్ని వారు ఎటు తీసుకు వెడుతున్నారు? అని ఎందుకు ఆలోచించడం లేదని ప్రజల మేధను తట్టి లేపడం జరిగింది. ప్రశ్నించే ఇలాంటి తీరును దివ్యఖుర్ఆన్ చాలా చోట్ల అవలంబించింది. ప్రతిచోట మార్గాన్ని తప్పించే వారి పేరు ఎత్తకుండా వారిని 'బడు' (పాసివ్ వాయిస్) తెరలో దాచడం జరిగింది. కారణం, వారిని నమ్మేవారు ఈ వ్యవహారాన్ని చల్లని గుండెలతో ఆలోచించాలని, ఏ ఒక్క వ్యక్తికి కూడా, "చూడండి! వీరు మీ మహాపురుషులను, మీ నాయకులను ఎలా విమర్శిస్తున్నారు" అని వారిని రెచ్చగొట్టే లేదా వారి మెదళ్ళను పాడుచేసే అవకాశం లభించకూడదు అనే ఉద్దేశ్యంతోనే. ఈ తీరు సంబోధనలో సందేశ ప్రచార వివేకానికి చెందిన ఓ ముఖ్య అంశం దాగుంది. దాన్ని ఉపేక్షించడానికి వీల్లేదు.

సిద్ధాంతాల పట్ల నిలకడ, రాజీపడని తీరు

فَاسْتَقِمْ كَمَآ اُمِرْتَ وَمَنْ تَابَ مَعَكَ وَلَا تَطْغَوْا
اِنَّهٗ بِمَا تَعْمَلُوْنَ بَصِيْرٌ ۝ وَلَا تَرْكَنُوْٓا اِلَى الَّذِيْنَ
ظَلَمُوْا فَتَمَسَّكُمُ النَّارُ وَمَا لَكُمْ مِّنْ دُوْنِ اللّٰهِ مِنْ
اَوْلِيَآءَ ثُمَّ لَا تُنْصَرُوْنَ ۝ وَاَقِمِ الصَّلٰوةَ طَرَفَيِ النَّهَارِ
وَزُلَفًا مِّنَ الَّيْلِ اِنَّ الْحَسَنٰتِ يُذْهِبْنَ السَّيِّاٰتِ ذٰلِكَ
ذِكْرٰى لِلذّٰكِرِيْنَ ۝ وَاصْبِرْ فَاِنَّ اللّٰهَ لَا يُضِيْعُ اَجْرَ
الْمُحْسِنِيْنَ ۝ (هود: ١١٢ تا ١١٥)

"ప్రవక్తా! నీవూ, (అవిశ్వాసం, తిరుగుబాటుల నుండి విశ్వాసం విధేయతల వైపునకు) మరలి వచ్చిన నీ సహచరులూ నీకు ఆజ్ఞాపించిన విధంగా రుజుమార్గంపై స్థిరంగా ఉండండి. దైవదాస్యపు హద్దులను అతిక్రమించకండి. మీరు చేస్తున్నదానిని మీ ప్రభువు కనిపెట్టి ఉంటాడు. ఈ దుర్మార్గుల వైపుకు కొంచమైనా మొగ్గకండి. ఒకవేళ మొగ్గినట్లయితే నరకంలో చిక్కుకుపోతారు. మిమ్మల్ని దేవుని నుండి కాపాడగల సహాయకుడూ, సంరక్షకుడూ ఎవ్వడూ మీకు దొరకడు. ఎక్కడి నుండీ మీకు సహాయం లభించదు. చూడు! నమాజును స్థాపించు, పగటి రెండు సరిహద్దు సమయాలలోనూ, కొంత రాత్రి గడచిన తరువాతనూ. వాస్తవానికి సత్కార్యాలు దుష్కార్యాలను దూరం

చేస్తాయి. అల్లాహ్‌ను జ్ఞాపకం ఉంచుకునే వారికి ఇది ఓ జ్ఞాపిక. ఓర్మి కలిగి ఉండు. అల్లాహ్ మంచి చేసేవారి ప్రతిఫలాన్ని ఎన్నటికీ వృధా చేయడు." (హూద్: 112-115)

"సత్కార్యాలు దుష్కార్యాలను దూరం చేస్తాయి" అంటే దుష్కార్యాలు ప్రపంచంలో వ్యాపించి ఉన్నాయి అని, ఈ సత్యసందేశ ప్రచారానికి వ్యతిరేకంగా యే దుష్కార్యాలైతే మీ పట్ల అవలంబించడం జరుగుతుందో వాటన్నిటిని పారద్రోల డానికి ఒకే ఒక సిసలైన విధానం ఉంది.

మీరు సాధ్యమైనంతమట్టుకు సత్పురుషులుగా మారిపోవడం, మీ సత్ప్రవర్తన ద్వారా ఈ దుష్కార్యాలను ఓడించాలి అన్నది. మిమ్మల్ని సత్పురుషులుగా తీర్చిదిద్దే ఉత్తమమైన విధానం ఈ నమాజు. పకడ్బందీగా మీపై విరుచుకుపడుతున్న దౌష్ట్యాల తుఫానును ఎదిరించే శక్తి దీని ద్వారానే మీకు లభ్యం కాగలదు. పైగా, ఆ చెడులను దూరం చేసి మీరు ప్రపంచంలో కార్యరూపంగా సత్సమాజ వ్యవస్థను పునరుద్ధ రించనూ గలరు.

సందేశ ప్రచార అవకాశాలను వినియోగించి ప్రయోజనం పొందడం

దివ్యఖుర్‌ఆన్‌లో వివరించబడిన హజ్రత్ యూసుఫ్ (అ) వారి గాధ ద్వారా మనకు తెలిసే విషయం ఏమిటంటే, ఆయన సందేశాన్ని చేరవేసే అవకాశాన్ని ఎలా గ్రహించారు అన్నది. ఈ గాధలో మనకు సందేశ ప్రచార ఉపాయానికి చెందిన ఓ ముఖ్యమైన అంశం లభిస్తుంది. ఇద్దరు వ్యక్తులు కలిసి కలలో చూసిన విషయం చెబుతారాయనకు. ఆయనపైగల విశ్వాసాన్ని చాటుతూ ఆ స్వప్నానికి అర్థం ఏమిటీ అని అడుగుతారు.

وَدَخَلَ مَعَهُ السِّجْنَ فَتَيٰنِ ؕ قَالَ اَحَدُهُمَآ اِنِّیۡۤ
اَرٰىنِیۡۤ اَعۡصِرُ خَمۡرًا ۚ وَقَالَ الۡاٰخَرُ اِنِّیۡۤ اَرٰىنِیۡۤ اَحۡمِلُ
فَوۡقَ رَاۡسِیۡ خُبۡزًا تَاۡكُلُ الطَّيۡرُ مِنۡهُ ؕ نَبِّئۡنَا
بِتَاۡوِيۡلِهٖ ۚ اِنَّا نَرٰٮكَ مِنَ الۡمُحۡسِنِيۡنَ ۝ (یوسف : ٣٦)

"జైలులో అతనితోపాటు ఇంకా ఇద్దరు బానిసలు కూడా ప్రవేశించారు. ఒకనాడు వారిలో ఒకడు ఇలా అన్నాడు: "నేను సారాయి పిండుతూ ఉన్నట్లు కలలో చూశాను." రెండో అతను ఇలా చెప్పాడు: "నా తలపై రొట్టెలున్నాయి, వాటిని పక్షులు తింటున్నట్లు నేను చూశాను." ఉభయులూ ఇలా అడిగారు: 'మాకు వాటి భావం వివరించు, మేము చూస్తూ ఉన్నాము, నీవు చాలా మంచివాడవు." (యూసుఫ్ : 36)

సమాధానంగా హజ్రత్ యూసుఫ్ (అ) ఇలా అన్నారు: నేను ఆ కలలకు భావం ఏమిటో తప్పక చెబుతాను, కాని మొదట, దేని ఆధారంగానైతే నేను ఈ కలల భావం చెబుతున్నానో ఆ విద్య నాకు ఎలా అబ్బిందో వినండి.

قَالَ لَا يَأْتِيكُمَا طَعَامٌ تُرْزَقَانِهِ إِلَّا نَبَّأْتُكُمَا بِتَأْوِيلِهِ
قَبْلَ أَنْ يَأْتِيَكُمَا ذَٰلِكُمَا مِمَّا عَلَّمَنِي رَبِّي (يوسف : ٣٧)

"ఇక్కడ మీకు ఇవ్వబడే భోజనం వచ్చే లోపల నేను ఈ స్వప్నాల భావాన్ని వివరిస్తాను. ఇది నా ప్రభువు నాకు ప్రసాదించిన విద్యలలోనిదే." (యూసుఫ్ : 37)

ఇలా వారి మాటలలో నుండే తన మాటను చెప్పే అవకాశాన్ని తీసి వారి ముందు తమ ధర్మసందేశాన్ని ఇవ్వనారంభించారాయన.

إِنِّي تَرَكْتُ مِلَّةَ قَوْمٍ لَا يُؤْمِنُونَ بِاللَّهِ وَهُمْ بِالْآخِرَةِ
هُمْ كَافِرُونَ ۝ وَاتَّبَعْتُ مِلَّةَ آبَائِي إِبْرَاهِيمَ وَإِسْحَاقَ
وَيَعْقُوبَ ۚ مَا كَانَ لَنَا أَنْ نُشْرِكَ بِاللَّهِ مِنْ شَيْءٍ ۚ ذَٰلِكَ
مِنْ فَضْلِ اللَّهِ عَلَيْنَا وَعَلَى النَّاسِ وَلَٰكِنَّ أَكْثَرَ النَّاسِ
لَا يَشْكُرُونَ ۝ (يوسف: ٣٨)

"అసలు విషయం ఏమిటంటే, అల్లాహ్‌ను విశ్వసించనివారి, పరలోకాన్ని తిరస్కరించేవారి విధానాన్ని నేను వదిలిపెట్టి, నా పెద్దలైన ఇబ్రాహీం, ఇస్హాక్, యాకూబ్‌ల విధానాన్ని అవలంబించాను. ఎవడినైనా అల్లాహ్‌కు భాగస్వామిగా చేయడం మా విధానం కాదు. వాస్తవానికి ఇది అల్లాహ్ అనుగ్రహమే మనపైనా సమస్త మానవులపైనా (ఆయన మనలను తనకు తప్ప ఇతరులెవరికీ దాసులుగా చేయలేదు అనేది). కాని చాలా మంది ప్రజలు కృతజ్ఞత చూపరు." (యూసుఫ్ : 38)

ఈ ఆయత్ ద్వారా మనకు తెలుస్తున్న విషయం ఏమిటంటే, ఓ వ్యక్తికైన సందేశ ప్రచారం చేయాలనే నిజమైన కోరికే ఉంటే, దానికి తోడు అతను దానికి తగిన వివేకాన్ని నైపుణ్యాన్ని కూడా కలిగి ఉంటే, ఎంత చక్కగా తన మాట్లాడే తీరును ఆ సందేశ ప్రచారం వైపుకు మళ్ళించ గలడన్నది. అలాగే ఆ కోరికే లేని వ్యక్తికి ఎన్నో అవకాశాలు కలిగినప్పటికీ, ఫలానా అవకాశం నాకు కలిగింది అనే ధ్యాసే ఉండదు. అలాంటివాడు ఎదుటి వాని ముందు సందేశాన్ని ఎలా ప్రబోధించగలడు? ఆ ధ్యాస ఉన్న వ్యక్తి మాత్రమే అవకాశం ఎప్పుడొస్తుందా అని ఎదురు చూస్తూ ఆ అవకాశం రాగానే తన పనిని ప్రారంభించేస్తాడు. అయితే ఓ వివేకం కలిగిన సందేశ ప్రచారకునికి అవకాశం రావడంలో మరో అవివేకి అయిన సందేశ ప్రచారకుని పసలేని ప్రచారంలో

తేడా ఉంటుంది. ఇతను సందర్భాసందర్భాలను దృష్టిలో ఉంచుకోకుండా ప్రజల చెవుల్లోనికి బలవంతంగా తన మాటను జొప్పించే ప్రయత్నం చేస్తాడు. ఆ పిదప తన అవివేకం ద్వారా, తన పోట్లాడే స్వభావం ద్వారా వారిని సందేశం దరికి రాకుండా మరింత బెదరగొడతాడు.

ఈ సంఘటన ద్వారా, ప్రజలకు ధర్మాన్ని బోధించే సరైన విధానం ఏమిటో మనం తెలుసుకోగలం. హజ్రత్ యూసుఫ్ (అ) అవకాశం రాగానే ధర్మానికి సంబంధించిన సర్వసిద్ధాంతాలను వాటి వివరాలన్నిటినీ ఆ ఇద్దరు బానిసల ముందు ఏకరువు పెట్టలేదు. పైగా, సత్యధర్మానుయాయుల మార్గం, అసత్య ధర్మానుయాయుల మార్గం నుండి ఎక్కడ వేరైపోతుందో ఆ పాయింటును మాత్రమే వారి ముందుంచడం జరిగింది. ఆ పాయింటే ఏకేశ్వరోపాసన మరియు షిర్కుకును సూచించే పాయింటు.

يٰصَاحِبَيِ السِّجْنِ ءَاَرْبَابٌ مُّتَفَرِّقُوْنَ خَيْرٌ اَمِ اللّٰهُ
الْوَاحِدُ الْقَهَّارُ ۝

"నా తోటి ఖైదీలారా! స్వయంగా మీరే ఆలోచించండి, చాలామంది విభిన్న ప్రభువులు మేలా? లేక సర్వశక్తిమంతుడు అయిన ఏకైక దేవుడు అల్లాహ్ మేలా?"
(యూసుఫ్ : 39)

ఈ తేడాను ఆయన ఎంత చక్కగా వర్ణించాడంటే సామాన్యబుద్ధి జ్ఞానాలుగల ఏ వ్యక్తి అయినాసరే దాన్ని ఆలోచించకుండా ఉండలేడు. ప్రత్యేకంగా, ఎవరినైతే ఆయన సంబోధించారో వారి మనస్సులో ఈ సత్యం సూటిగా దిగిపోయి ఉంటుంది. ఎందుకంటే వారు బానిసలు గనుక. ఒకే ఒక యజమానికి బానిసలుగా ఉండడం మేలా లేదా అనేకమంది యజమానులకు బానిసలుగా ఉండడం మేలా? సకల లోక ప్రభువుకు దాస్యం చేయడం మేలా లేదా తమలాంటి దాసులను సేవించడం మేలా అనే విషయాన్ని వారు బాగా ఎరిగినవారు. హజ్రత్ యూసుఫ్ (అ) వారితో మీ ధర్మాన్ని వదిలేసి నా ధర్మంలోనికి వచ్చేయండి అని కూడా కోరలేదు.

ఓ క్రొత్త తరహాలో వారిని ఇలా ప్రశ్నిస్తారు:

"తనకు తప్ప ఇతరులెవరికీ మనలను దాసులుగా చేయని ఆ అల్లాహ్ కరుణాకటాక్షాలను చూశారా? అయితే ప్రజలు ఆ కారుణ్యానికి ఆయనకు కృతజ్ఞతలు చూపేబదులు స్వయంగా తామే మిథ్యా దేవుళ్ళను సృష్టించుకొని వారిని పూజిస్తున్నారు."

ఆ విధంగా తనకు వ్యతిరేకులైన వారిని కూడా విమర్శకు గురి చేస్తారు. ఆ విమర్శ కూడా ఎంతో హేతుబద్ధంగా ఉంటుంది. అందులో మనస్సును బాధించే ఎలాంటి ఛాయకూడా అగుపడదు. కేవలం ఈ మాటలు చెప్పి ఊరుకుంటారు.

مَا تَعْبُدُونَ مِن دُونِهِ إِلَّا أَسْمَاءً سَمَّيْتُمُوهَا
أَنتُمْ وَآبَاؤُكُم مَّا أَنزَلَ اللَّهُ بِهَا مِن سُلْطَانٍ إِنِ
الْحُكْمُ إِلَّا لِلَّهِ أَمَرَ أَلَّا تَعْبُدُوا إِلَّا إِيَّاهُ ذَٰلِكَ الدِّينُ
الْقَيِّمُ وَلَٰكِنَّ أَكْثَرَ النَّاسِ لَا يَعْلَمُونَ ۝ (يوسف: ٤٠)

"ఆయనకు కాదని మీరు దాస్యం చేస్తున్నవారు, మీరూ మీ తాతముత్తాతలూ కల్పించుకున్న కొన్ని పేర్లు మాత్రమే తప్ప మరొకటేమీ కాదు. వారి కొరకు అల్లాహ్ యే నిదర్శనాన్ని అవతరింపజేయలేదు. పరిపాలించే అధికారం అల్లాహ్‌కు తప్ప మరొకరెవరికీ లేదు. ఆయనను తప్ప మీరు ఎవరి దాస్యాన్నీ చేయకూడదని ఆయన ఆజ్ఞ. ఇదే శుద్ధమైన సరైన జీవిత విధానం. కాని ఇది చాలా మందికి తెలియదు."
(యూసుఫ్ : 40)

అంటే, ఈ ఆరాధ్యుల్లో ఒకరిని మీరు అన్నదాతగా, మరొకరిని అయిశ్వర్య ప్రదాతగా, ఇంకొకరిని ఈ భూమికి రాజుగా, మరొకరిని ధనానికి దేవతగా లేదా ఆరోగ్య ప్రదాతగా, అనారోగ్యాలు కలిగించే శక్తిగా పిలుస్తున్నారో, ఆ పేర్ల వెనుక ఎలాంటి యదార్థంగాని, దైవత్వంగాని, పోషణ శక్తిగాని, రాచరికంగాని లేవు అని; అసలు యజమాని అల్లాహ్‌యే, ఆయన్ను ఈ విశ్వానికి కర్తగా మరియు ప్రభువుగా మీరు కూడా గుర్తిస్తూ ఉన్నదే. ఆయన వీరిలో ఎవరికీ ఆరాధ్యులని సర్టిఫికెటు ఇవ్వలేదు. అతనైతే ప్రభు హక్కులన్నిటినీ, అధికారాలన్నిటిని తన కోసమే ప్రత్యేకించు కున్నవాడు. మీరు ఆయనకు తప్ప మరెవ్వరికీ దాస్యం చేయువద్దు అనే ఆదేశాన్నిచ్చాడు.

సందేశ ప్రచార వివేకానికి సంబంధించిన మరో ఉదాహరణ

సందేశాన్ని చేరవేసే వివేకానికి సంబంధించిన మరో ఉదాహరణ ఇదే యూసుఫ్ సూరాలో చివరన ఇవ్వడం జరిగింది.

యూసుఫ్ (అ) వారి గాధను ముగించిన తరువాత ముగింపుకు ముందు, ఖుర్‌ఆన్ తన ఉద్దేశ్యాన్ని కూడా వినిపిస్తోంది. యూసుఫ్(అ)వారి గాధను మక్కా వాసులు వాదనా ఉద్దేశ్యంతో మహాప్రవక్త ముహమ్మద్(స)వారిని అడిగి తెలుసుకున్నదే. ఈ గాధను ఆయన(స) చెప్పలేరనే నమ్మకం వారికుండింది. కాని దివ్యఖుర్‌ఆన్ ఈ గాధను ఎంతో చక్కగా, వివరణాత్మకంగా వారిముందుంచి వారందరి దృష్టిని తన వైపుకు మళ్ళించుకోవడం జరిగింది. అప్పుడుగాని, ఈ సూరా (అధ్యాయం) చివరన ఆ గాధ ముగియగానే కొన్ని వాక్యాల రూపంలో ప్రబోధన మరియు ఆహ్వానానికి సంబంధించిన విషయం పూర్తిగా అందులో చేర్చి చెప్పడం జరుగలేదు.

وَكَأَيِّنْ مِّنْ آيَةٍ فِي السَّمٰوٰتِ وَالْأَرْضِ يَمُرُّوْنَ عَلَيْهَا وَهُمْ عَنْهَا مُعْرِضُوْنَ ○ وَمَا يُؤْمِنُ أَكْثَرُهُمْ بِاللّٰهِ إِلَّا وَهُمْ مُّشْرِكُوْنَ ○ (يوسف: ١٠٦)

"భూమిలో ఆకాశాల్లో ఎన్ని సూచనలు లేవు! కాని వారు వాటిని చూస్తూపోతూ ఉంటారు. కొంచమైనా గమనించరు. వారిలో అల్లాహ్‌ను విశ్వసించేవారు ఎంతమంది లేరు! కాని వారు ఆయనతోపాటు ఇతరులను భాగస్వాములుగా నిలబెడుతూ ఉంటారు." (యూసుఫ్:105,106)

"కొంచెమైనా గమనించరు" అని చెప్పే ఉద్దేశ్యం, ప్రజలకు వారి ఉపేక్షను గుర్తుచేయడం అన్నమాట. భూమ్యాకాశాల్లో ఉన్న ప్రతి వస్తువు కేవలం ఓ వస్తువే కాకుండా అది ఒక సూచనగా కూడా ఉందని, అది యదార్థం వైపుకు దృష్టిని మళ్ళి స్తోందని చెప్పడం. వీటిని కేవలం ఓ వస్తువుగా మాత్రమే చూసేవారు మనుషుల్లా కాకుండా పశువులు చూపినట్లుగానే చూస్తున్నారు. చెట్టును చెట్టుగా, గుట్టను గుట్టగా, నీటిని నీటిగా పశువులు కూడా చూస్తున్నాయి. తమ తమ అవసరం మేరకు ప్రతి జంతువుకు దాని ఉపయోగం కూడా తెలుసు. కాని ఏ ధ్యేయం కోసమైతే మనిషికి జ్ఞానేంద్రియాలకు తోడు ఆలోచించే మెదడు కూడా ఇవ్వడం జరిగిందో అది వాటిని చూడడం, వాటి అవసరాలను, ఉపయోగాలను తెలుసుకోవడం మట్టుకే కాకుండా, వాటి యదార్థాన్ని తెలుసుకోవడం, ఆసూచనల ఆధారంగా వాటి ధర్మాలను పరిశోధిం చడం కూడా జరగాలి. ఈ విషయాన్నే మనిషి విస్మరిస్తున్నాడు. ఈ ఉపేక్షే అతణ్ణి మార్గభ్రష్టత్వానికి లోనుచేస్తోంది. ఈ వైఖరే అవలంబించకుండా ఉంటే దైవప్రవక్తల బోధనలను అర్థం చేసుకోవడం మరియు ఆ బోధనల ద్వారా మార్గదర్శనం పొందడం ఎంత తేలికై ఉండేది?

"కాని వారు ఆయనతోపాటు ఇతరులను భాగస్వాములుగా నిలబెడుతూ ఉంటారు." పై వాక్యంలో సూచించిన విషయం గురించి ఉపేక్షించినందుకు ఇలాంటి ఫలితమే ఎదురౌతుంది అని చెప్పడం అన్నమాట. మార్గం చూపే గుర్తులు చూడకుండా కళ్ళుమూసుకొని ప్రజలు ఆ మార్గంపై నడిచినప్పుడు తాము చేరే గమ్యస్థానానికి బదులు దారితప్పి ఏటో వెళ్ళిపోయారు. చుట్టూ ఉన్న ముళ్ళ పొదల్లో చిక్కుకు పోయారు. అయినప్పటికీ కొందరు మాత్రం తమ గమ్యస్థానాన్ని పూర్తిగా విడిచి వేశారు. దేవుడే వారి సృష్టికర్త, పోషకుడు అనే యదార్థాన్ని కొట్టిపారేస్తూ ఉంటారు వీరు. చాలామంది ఇలాంటి మార్గభ్రష్టత్వంలో పడిపోయి ఉన్నారు. అది దైవాన్ని నిరాకరించే మార్గభ్రష్టత్వం కాదు, అది షిర్క్ (బహుదైవారాధన) అనే మార్గభ్రష్టత్వం. అంటే వారు దేవుణ్ణి, ఆయన అస్తిత్వాన్ని నిరాకరించరు. పైగా దైవత్వంలోను, ఆయన గుణగణ సంపదలోను, ఆయన అధికారాల్లోను, హక్కుల్లోనూ ఇతర దేవుళ్ళు ఏదో

ఓ రకంగా భాగస్వామ్యాన్ని కలిగి ఉన్నారు అనే షిర్క్ మార్గభ్రష్టత్వా నికి లోనై ఉన్నవారు. ఒకవేళ, అనుక్షణం దైవ ఏకత్వాని చాటే ఈ భూమ్యాకాశాల నిర్మాణం, మరియు అందున్న ప్రతి వస్తువుకు సంబంధించిన సూచనలను గుణపాఠం నేర్చుకొనే దృష్టితో వారు చూసి ఉంటే ఈ పొరపాటు అసలు జరిగి ఉండేది కాదు.

అపై ఇలా సెలవియ్యడం జరిగింది:

أَفَأَمِنُوا أَن تَأْتِيَهُمْ غَاشِيَةٌ مِّنْ عَذَابِ اللَّهِ أَوْ
تَأْتِيَهُمُ السَّاعَةُ بَغْتَةً وَهُمْ لَا يَشْعُرُونَ ۝ (يوسف:١٠٧)

"దైవశిక్షకు సంబంధించిన ఆపద ఏదీ వారిని చుట్టుముట్టదనీ, తెలియకుండా వారిపైకి ప్రళయగడియ అకస్మాత్తుగా వచ్చిపడదని వారు నిశ్చింతగా ఉన్నారా?"

మీరు నిశ్చింతగా గడుపుతున్న ఈ జీవితకాలం ఎంతో సుదీర్ఘమైనదిగా, ప్రస్తుతం మీకు చేకూరుతున్న ప్రశాంతత శాశ్వతమైనదిగా భావించి రాబోయే పరిణామాన్ని గురించి ఆలోచించే కార్యక్రమాన్ని వాయిదా వేసుకోకండి అని హెచ్చరించడం అన్నమాట. ఏ మనిషికి కూడా, తాను ఫలానా సమయం వరకు తప్పకుండా బ్రతికి ఉంటాననే గ్యారంటీ లేదు. యే ఒక్కడు కూడా తాను ఎప్పుడు పట్టుబడతాడో, యే పరిస్థితిలో తాను హాజరుపర్చబడతాడో చెప్పలేడు. భవిష్యత్తు పరదాలో యేది దాగివుందో ఒక్క క్షణానికి ముందు కూడా మీరు తెలుసుకోలేరన్నది రేయింబవళ్ళ మీ అనుభవమే చెబుతోంది. కాబట్టి యేదైనా ఆలోచించదలిస్తే ఇప్పుడే ఆలోచించుకోండి. మీరు యే జీవన మార్గంపై నడిచి వెడుతున్నారో, అడుగు ముందుకు వేసే ముందు కొంత తడువు ఆగి, ఆ మార్గం సరైందా కాదా? అది సరియైందే అనడానికి మీ వద్ద యేమైనా ఆధారాలున్నాయా? అనే విషయాన్ని ఆలోచించుకోండి. అలాగే, ఆ మార్గం సరైందే అనడానికి విశ్వసూచనల నుండి యేదైనా ఆధారం మీకు లభ్యం అవుతుందా? దానిపై నడిచి మానవాళి యే యే ఫలితాలను చవిచూసిందో, యే యే ఫలితాలు ప్రస్తుతం మీ సభ్యతతో పొడసూపుతున్నాయో, అవి మీరు సరైనమార్గంపై నడుస్తున్నారని రూఢీ పరుస్తున్నాయా,లేదా? అని గమనించండి.

قُلْ هَٰذِهِ سَبِيلِي أَدْعُو إِلَى اللَّهِ عَلَىٰ بَصِيرَةٍ
أَنَا وَمَنِ اتَّبَعَنِي وَسُبْحَانَ اللَّهِ وَمَا أَنَا مِنَ الْمُشْرِكِينَ ۝

"నీవు వారికి ఇలా తెలియజెయ్యి. నామార్గం ఇది. నేను అల్లాహ్ వైపునకు పిలుస్తాను. స్వయంగా నిండువెలుగులో నా మార్గాన్ని చూస్తున్నాను. నా సహచరులు కూడా చూస్తున్నారు. అల్లాహ్ పరిశుద్ధుడు. షిర్కు చేసేవారితో నాకు ఏ సంబంధం లేదు."

(యూసుఫ్:108)

హుందాగా సత్యధర్మాన్ని అందజేయడం

సత్యధర్మాన్ని చేరవేసే కార్యం హుందాతనంతో కూడుకున్న కార్యం, ఒకరి వెంటబడి చేసే కార్యం కాదిది. అజ్ జారియాత్ సూరాలో ఇలా సెలవియ్యడం జరిగింది.

فَتَوَلَّ عَنْهُمْ فَمَآ أَنْتَ بِمَلُوْمٍ ۝

"ప్రవక్తా! వారి నుండి ముఖం మరల్చుకో. నీపై ఎలాంటి ఆక్షేపణా ఉండదు."
(అజ్ జారియాత్:54)

ఈ ఆయత్‌లో 'తబ్లీగె దీన్' (సందేశ ప్రచారం)కు సంబంధించిన ఓ సూత్రాన్ని వివరించడం జరిగింది. దీన్ని బాగా అర్థం చేసుకోవలసి ఉంటుంది. సందేశాన్ని ఇతరులకు చేరవేసే ఓ వ్యక్తి, సరైన హేతువులను చూపి తన సందేశం ఏమిటో వివరిస్తూ అతని అపోహలను, ఆక్షేపణల్ని నివారించి, అతను చూపిన హేతువులకు సమాధానం కూడా ఇచ్చినట్లయితే, అతనిపై ఉన్న సత్యాన్ని చేరవేసే బాధ్యత అతను నెరవేర్చినట్లే. ఆ పిదప ఎవరైనా తన విశ్వాసాన్ని, తన నమ్మకాన్ని వదులుకోకపోతే అతని బాధ్యత మాత్రం సందేశ ప్రచారకునిపై ఉండదు. ఇక ఆ వ్యక్తి వెంటబడి తన సమయాన్ని వృధా చేసే అవసరం యేదీ లేదు. కాబట్టి అనవసరంగా అతణ్ణి తన మార్గంపైకి తెచ్చే ప్రయత్నం చేయడం వృధా. అతను నమ్మకపోతే నమ్మకుండా ఉండనీగాక. అతని వైపు నుండి దృష్టిని మళ్ళించినందుకు, అతను అలానే మార్గభ్రష్టత్వంలో మ్రగ్గిపోయినందుకు సందేశ ప్రచారకుణ్ణి తప్పుపట్టే వీలులేదు. ఎందుకంటే అతని మార్గభ్రష్టత్వానికి స్వయంగా తానే బాధ్యుడు గనుక.

దైవప్రవక్త (స)వారిని ఉద్దేశించి ఈ సూత్రం చెప్పబడింది, ఆయన (స) బహుశా (దైవం క్షమించుగాక) సందేశ ప్రచారం కోసం ప్రజల వెంటబడేవారని, అల్లాహ్ ఆయన్ను అలా చేయకుండా నివారించడానికి ఈఆయత్‌ను అవతరింపజేశాడు అని కాదు. ఈ సూత్రం వివరించడానికి అసలు కారణం ఏమిటంటే, ఓ సందేశ ప్రచారకుడు ప్రజలకు సాధ్యమైనంత వరకు సత్యాన్ని బోధించినప్పటికీ వారిలో ఆ పిడివాదపు సూచనలు ఏమాత్రం తగ్గలేదని వారిని వదిలేస్తాడు. అలాంటప్పుడు ప్రజలు అతనిపై ఆరోపణల బాణాలను సంధిస్తూ, చూశారా! మీరెలాంటి సందేశ ప్రచారకులు? మేము తెలుసుకోవాలనే ఉద్దేశ్యంతో వాదనకు దిగితే అలా మమ్మల్ని వదిలి వెళ్ళిపోతున్నారేమిటీ? అని ఏదేదో మాట్లాడడం జరుగుతుంది. వారి అసలు ధ్యేయం ఆ సందేశాన్ని అర్థం చేసుకోవడం కాకుండా, ఓ సందేశ ప్రచారకుణ్ణి వాదోపవాదాల్లో దించడం, అతని సమయాన్ని వృధా చేయడం మాత్రమే. అందుచేతనే అల్లాహ్ తన గ్రంథంలో స్పష్టంగా, అలాంటి వ్యక్తులతో పెట్టుకోకండి, అలా వారి మానాన వారిని వదిలేసి

నందుకు మీపై ఎలాంటి ఆక్షేపణ ఉండదు అని చెప్పడం అన్నమాట. ఏ గ్రంథం అయితే దైవప్రవక్త (స)కు ఇవ్వబడిందో దాని ప్రకారం ఆయన మనకు తన ధర్మం ఏదో తెలియజేయడం మట్టుకే బాధ్యులు. అంతేకాని, మా ప్రశ్నలకు ఎందుకు సమాధానం ఇవ్వరు అని వారు ఆరోపణలను లేవనెత్తేవీలులేదు.

సత్యసందేశ ప్రచారం నిరంతరంగా జరిగే కార్యక్రమం

దైవగ్రంథం అయిన దివ్యఖుర్ఆన్‌లో సత్యధర్మ ప్రచారం గురించి ఇలా సెలవియ్యడం జరిగింది:

وَذَكِّرْ فَإِنَّ الذِّكْرَىٰ تَنفَعُ الْمُؤْمِنِينَ ○ (الذاريات:٥٥)

"అయితే ఉపదేశిస్తూ ఉండు. ఎందుకంటే, ఉపదేశం విశ్వాసులకు ప్రయోజన కరమైంది."

(అజ్ జారియాత్:55)

ఈ ఆయత్‌లో సందేశ ప్రచార సూత్రం ఒకదానిని వివరించడం జరిగింది. సత్యధర్మ ప్రచారం అసలు ధ్యేయం, ఈ వరానికి విలువనిస్తూ దాన్ని పొందగోరే శుభాత్మలకు దానిని అందజేయడం. అయితే మానవసమాజంలోని వేలాది, లక్షలాది మందిలో ఆ శుభాత్మలు ఎక్కడున్నాయి అని తెలుసుకోవడం ఓ సందేశ ప్రచారకునికి సాధ్యం అయ్యే పని కాదు. అందుకని ఈ కార్యం నిరంతరంగా, నిర్విరామంగా జరగాలి. ఎక్కడెక్కడైతే విశ్వాసాన్ని స్వీకరించే వ్యక్తులు ఉంటారో అక్కడక్కడికి అతని స్వరం చేరాలి. ఇలాంటి శుభాత్మలే సందేశ ప్రచారకునికి అసలు నిధిలాంటి వారు. వారిని వెదకడమే అతని అసలు కార్యం. వారిని ఏరి దైవమార్గంపైకి తెచ్చి నిలబెట్టడం అతని లక్ష్యం కావాలి. మధ్యమధ్యలో పనికిరాని వ్యక్తులు తారసపడితే వారు ఈ విషయానికి అడ్డుతగిలేవారా? కలహాన్ని సృష్టించే వారా అని తెలియనంత మట్టుకే వారి వైపు దృష్టిని సారించవలసి ఉంటుంది. తన విలువైన సమయాన్ని వ్యర్థం చేసుకోకూడదు. ఎందుకంటే, వీరు అతని హితబోధ ద్వారా ప్రయోజనం పొందేవారు కాదు గనుక. వీరిపై తన మేధాశక్తిని ఉపయోగించడం వలన దీన్నుండి ప్రయోజనం పొందేవారికే అధిక నష్టం చేకూరుతుంది.

విముఖతను చూపవలసిన వ్యక్తులు

దివ్యఖుర్ఆన్, మనుషుల రకాలను బట్టి కొందరు వ్యక్తుల విషయంలో విముఖతను చూపమని సలహానిస్తోంది. కాబట్టి అన్ నజ్మ్ సూరా, 29వ ఆయత్‌లో ఎవరి కొరకు సమయాన్ని వృధా చేయకూడదో అలాంటి వ్యక్తులను గురించి వివరించడం జరిగింది.

فَأَعْرِضْ عَن مَّن تَوَلَّىٰ عَن ذِكْرِنَا وَلَمْ يُرِدْ
إِلَّا الْحَيَاةَ الدُّنْيَا ○

"కనుక ఓ ప్రవక్తా! మా ప్రస్తావన నుండి ముఖం త్రిప్పుకుని, భౌతిక జీవితం తప్ప మరొక తలంపులేని వ్యక్తిని అతని మానాన అతనిని వదిలిపెట్టు. వారికి ఉన్న జ్ఞానం మొత్తం ఇంతే." (అన్‌నజ్మ్:29)

అంటే అతని వెంటబడకు, అతనిని నచ్చజెప్పడంలో నీ సమయాన్ని వృధా చేయకు. ఇలాంటి వ్యక్తి నీ సందేశాన్ని స్వీకరించడానికి సిద్ధంగా ఉండడు. దైవారాధన, భౌతిక ప్రయోజనాలకంటే మిన్నయిన ధ్యేయం మరియు విలువల వైపునకు పిలుస్తూ, పరలోక సాఫల్యమే అసలైన విజయంగా చెప్పే ఈ సందేశాన్ని ఒప్పుకోవడానికి సిద్ధపడే వ్యక్తికాదతను. ఇలాంటి భౌతికవాదులు, నాస్తిక జనాల గురించి శ్రమించేబదులు, భౌతికవాదం అనే వ్యాధికి గురికాని దైవభీతిగల వారి వైపునకు దృష్టిని సారించు.

"వారికి ఉన్న జ్ఞానం మొత్తం ఇంతే" అని అంటే వీరు ఈ ప్రపంచం మరియు దాని లాభాలకంటే ఇంకేది ఎరుగరు, ఆలోచించనూలేరు. అందుకని వారి గురించి కష్టపడడం నిష్ప్రయోజనం. అల్ అన్‌ఆమ్ సూరాలో ఈ విషయాన్ని ఇలా వివరించడం జరిగింది. وَذَرِ الَّذِيْنَ اتَّخَذُوْا دِيْنَهُمْ لَعِبًا وَّلَهْوًا وَّغَرَّتْهُمُ الْحَيٰوةُ الدُّنْيَا (الانعام : ٧٠)

"తమ ధర్మాన్ని ఒక క్రీడగా, ఒక తమాషాగా భావించిన వారిని ఇహలోక జీవితం మాయకు గురిచేసిన వారిని నీవు వదిలిపెట్టు?" (అల్ అన్‌ఆమ్ : 70)

ఇస్లామీ సందేశ ప్రచారం దృష్టికోణంతో చూస్తే ఇక్కడ కేవలం సత్యాన్ని పొందగోరే వ్యక్తికే ప్రాధాన్యత ఉంది. సత్యాన్ని ఉపేక్షించే వారికి ఎలాంటి ప్రాధాన్యత లేదు. అబస్ సూరా ఆరంభంలో అల్లాహ్, దైవప్రవక్త ముహమ్మద్ (స) ఇబ్నె ఉమ్మె కుల్సూమ్ (ర)గారి రాక సందర్భంగా అవలంబించిన వైఖరిని ఎత్తిచూపడం జరిగింది. ఓ సందేశ ప్రచారకుడు తన సందేశాన్ని ప్రారంభించేటప్పుడు సహజంగానే అతని ధ్యాస జాతికి సంబంధించిన పలుకుబడి గల వ్యక్తులు తనసందేశాన్ని అందుకోవాలని, దానిద్వారా తన పని సులువైపోతుందని భావిస్తాడు. ఒకవేళ ఎలాంటి పలుకుబడి లేని సామాన్య ప్రజల్లో తన సందేశం వ్యాపించినప్పటికీ దానివల్ల అంత పెద్ద తేడా ఏదీ అగుపించదు. ఆ వ్యవహారంలో ఉన్న భావన కూడా అలాంటిదే. దాదాపు అదే వైఖరిని ఆరంభంలో దైవప్రవక్త (స) కూడా అవలంబించడం జరిగింది. దానివెనుక సిసలైన చిత్తశుద్ధి, సందేశాన్ని వ్యాపింపజేసే ఉద్దేశ్యం ఉండింది. పలుకుబడి గల వ్యక్తులను గౌరవించడం, లేదా సామాన్యులను కించపర్చడం లాంటి ఉద్దేశ్యం ఏదీ కాదు. అయితే అల్లాహ్, ఇది ఇస్లామీ సందేశాన్ని అందించే సరైన విధానం కాదు,

పైగా ఈ సందేశ ప్రచారం దృష్ట్యా సత్యాన్ని కోరే ప్రతి వ్యక్తి- అతను ఎంత బలహీనుడైనా, మరెంత ప్రభావం లేనివ్యక్తి అయినాసరే- సమాన ప్రాధాన్యతను కలిగి ఉంటాడు అని బోధించడం జరిగింది. అలాగే, సత్యాన్ని ఉపేక్షించే ప్రతి వ్యక్తి అతను సమాజంలో ఎంత పలుకుబడి కలిగివున్న వాడైనాసరే అప్రధానమైనవాడే. కాబట్టి మీరు ఇస్లామ్ బోధనలను బహిరంగంగా అందరికీ అందజేయండి. అయితే మీరు దృష్టి పెట్టవలసినదల్లా ఎవరైతే సత్యాన్ని స్వీకరించడానికి తహతహలాడు తున్నారో వారివైపునకే.

అలాకాకుండా, ఎవరైతే తమ ఔన్నత్యం, పలుకుబడి, తమ హోదాను చూసి విర్రవీగుతూ గర్వాన్ని ప్రదర్శిస్తున్నారో మరియు ప్రవక్త అవసరం తమకు యేమాత్రం లేదని భావిస్తున్నారో, పైగా ప్రవక్తకే తమ అవసరం ఉంది అని అలక్ష్యం చేస్తున్నారో అలాంటి వారి ముందు ఈ సందేశాన్ని ఉంచడం ఆయన మహోన్నత ప్రచార కార్యక్రమానికి యేమాత్రం తగినది కాదు. అందుకని ఇలా సెలవియ్యడం జరిగింది.

عَبَسَ وَتَوَلّٰىٓ ۙ اَنْ جَآءَهُ الْاَعْمٰى ؕ وَمَا يُدْرِيْكَ
لَعَلَّهٗ يَزَّكّٰىٓ ۙ اَوْ يَذَّكَّرُ فَتَنْفَعَهُ الذِّكْرٰى ؕ وَاَمَّا
مَنِ اسْتَغْنٰى ۙ فَاَنْتَ لَهٗ تَصَدّٰى ؕ وَمَا عَلَيْكَ اَلَّا
يَزَّكّٰى ؕ وَاَمَّا مَنْ جَآءَكَ يَسْعٰى ۙ وَهُوَ يَخْشٰى ۙ فَاَنْتَ
عَنْهُ تَلَهّٰى ۚ (عبس : ۱ تا ۱۰)

“విసుగుకొని ముఖం త్రిప్పుకున్నాడు, ఆ అంధుడు తన వద్దకు వచ్చాడని. నీకేమి తెలుసు, బహుశా అతను దారికి రావచ్చు లేదా హితోపదేశం గురించి ఆలోచించవచ్చు. లక్ష్యపెట్టని వాడి పట్లనైతే నీవు శ్రద్ధచూపుతావు; వాస్తవానికి, ఒకవేళ అతడు దారికి రాకపోతే, దానికి నీపై బాధ్యత లేదు కదా? ఎవడు తనంతట తాను నీ వద్దకు పరుగెత్తుకుంటూ వస్తాడో మరియు (దేవునికి) భయపడుతూ ఉంటాడో అతని వైపు నుండి నీవు ముఖం తిప్పుకుంటున్నావు.” (అబస:1-10)

సందేశ ప్రచారం సందర్భంగా దైవప్రవక్త (స)వారు విస్మరించినది ఈ పాయింటే. దీన్ని వివరించడానికే దైవం మొదట ఉమ్మె కుల్సూమ్ (ర) పట్ల ఆయన (స) అవలంబించిన వైఖరిని ఎత్తిచూపాడు. ఆ తరువాత, ఓ సందేశ ప్రచారకుని దృష్టిలో ఏ విషయం ప్రాధాన్యతను కలిగి ఉండాలి, దేనికి ప్రాధాన్యత ఇవ్వకూడదు అని తెలపడం జరిగింది. తాను సత్యపిపాసి అని, అసత్యాన్ని అనుసరించడం వలన దైవాగ్రహానికి ఎక్కడ గురి అవుతానో అనుకొని రుజుమార్గజ్ఞానం పొందడానికి స్వయంగా పరుగెత్తుకుంటూ రావడం ఒక వ్యక్తి వైఖరే చెబుతూ ఉంటే, మరొకరి వాలకం, ఆ

సత్యం పట్ల తనకు ఎలాంటి శ్రద్ధాశక్తులు లేవని, అసలు సత్యమార్గం తనకు అవసరమే లేదని చాటుతోంది. ఆ ఇరువురు వ్యక్తుల్లో, ఎవరు విశ్వసిస్తే, ధర్మానికి మేలు చేకూరుతుంది మరెవరి విశ్వాసం ధర్మవ్యాప్తికి అంతగా ప్రయోజనకారి కాదు అనే విషయం కాదు ఇక్కడ చూడవలసినది. ఇక్కడ చూడవలసిందల్లా ఎవరు రుజుమార్గాన్ని స్వీకరించి బాగుపడదలుచుకున్నాడు? మరెవరు ఆ మార్గాన్ని అసలే లెక్కచేయడం లేదు అన్నది. మొదటి రకం మనిషి అతను గ్రుడ్డివాడైనా, కుంటి వాడైనా, దరిద్రుడైనా, చూడ్డానికి ధర్మవ్యాప్తిలో ఓ పెద్ద సేవ చేసే వాడుకాకపోయినా మొత్తానికి ఓ సందేశ ప్రచారకుని కోసం ఆ వ్యక్తి విలువైనవాడు. అతని వైపునకే దృష్టిని కేంద్రీకరించవలసి ఉంటుంది. ఎందుకంటే ఈ సందేశప్రచార ఉద్దేశ్యం మనిషి సంస్కరణ కాబట్టి. ఆ వ్యక్తికి గనక సన్మార్గాన్ని బోధిస్తే అతను సంస్కరించ బడగలడు అని అతని వైఖరే చెబుతోంది. ఇకపోతే రెండవ రకం మనిషి, అతను సమాజంలో ఎంత పలుకుబడి కలవాడైనప్పటికీ అతని వెంటబడే అవసరం సందేశ ప్రచారకునికి లేదు. ఎందుకంటే, అతను బాగుపడదలచడం లేదని అతని వాలకమే చెబుతోంది. కాబట్టి అతని సంస్కరణ కోసం ప్రయత్నించడం సమయాన్ని వృధా చేయడమే అవుతుంది. అతను బాగుపడదలచకపోతే పోనీ, నష్టం అతనికే. సందేశ ప్రచారకునిపై అతని బాధ్యత ఏదీ ఉండదు.

పై ఆయత్‌లోని భావం ఏమిటంటే, దైవాన్ని విస్మరించి తమ ప్రాపంచిక ప్రాభవం గురించి విర్రవీగే వారిని అనవసరంగా ప్రాధాన్యతను ఇవ్వకండి. దానిపట్ల విముఖతను జూపేవారికి ప్రాధాన్యత ఇవ్వాలనేది ఇస్లాం అభిమతం కాదు. అయితే అతనికి ఇస్లామ్ ధర్మం ఏమిటో తెలియజేసి మీ బాధ్యతను తీర్చుకుంటే సరిపోతుంది. అలాగే ఆ గర్విష్ఠులను ఇస్లామ్‌వైపుకు మరల్చడానికి మీరు ఉపయోగించే తీరును చూసి వారిలో, దీనివల్ల మీకేదైనా ప్రయోజనం సిద్ధించగలదు, దాన్ని స్వీకరిస్తేనే మీ సందేశ ప్రచారం వ్యాప్తిచెందగలదు లేకపోతే మీరు అపజయం పాలుఅవుతారు అనే భావనను పుట్టించకూడదు. ఆ పని మాత్రం మీరు అసలు చేయనే చేయకూడదు. వారు సత్యాన్ని ఏ విధంగా ఉపేక్షిస్తున్నారో సత్యం కూడా వారిని అదేరకంగా ఉపేక్షిస్తోందన్న విషయాన్ని గుర్తుంచుకోండి.

దీన్నే అల్ ఆలా సూరాలో ఈవిధంగా వివరించడం జరిగింది:

وَنُيَسِّرُكَ لِلْيُسْرَىٰ ۝ فَذَكِّرْ إِن نَّفَعَتِ الذِّكْرَىٰ ۝

"మేము నీకు సులభమైన మార్గంలో ఉండే సౌకర్యాన్ని కలుగజేస్తున్నాము, కనుక నీవు హితబోధ చేస్తూ ఉండు, హితబోధ గనక లాభదాయకమైతే."

(అల్ ఆలా:9,10)

ఖుర్‌ఆన్ వ్యాఖ్యానకర్తలు సాధారణంగా ఈ రెండు వాక్యాలను వేరువేరుగా అర్థం చేసుకున్నారు. మొదటి వాక్యం అర్థాన్ని వారు మీకు ఓ తేలిగ్గా అర్థం చేసుకునే షరీఅత్ (ధర్మశాస్త్రం)ను ఇచ్చాము అని, రెండో వాక్యానికి, హితబోధ చేయండి అదే గనక లాభదాయకమైతే అని. అయితే, మా దృష్టిలో 'ఫజక్కిర్' (హితబోధ చేయండి) అనే పదం ఆ రెండు వాక్యాలను పరస్పరం కలిపే పదం. ఆ పదం తరువాత వచ్చే వాక్యసారాంశం రెండవ వాక్యం సారాంశాన్ని విపులీకరిస్తుంది. అందుకని మేము ఈ దైవోపదేశాన్ని ఇలా అర్థం చేసుకుంటున్నాము.

ఓ ప్రవక్తా! మేము దైవధర్మం ప్రచార విషయంలో, చెవిటివారికి వినిపించే తీరాలని, గ్రుడ్డివారికి మార్గం చూపించవలసిందే అని మిమ్మల్ని కష్టాలపాలు చేయడం లేదు. కాగా, ఓ సునాయాసమైన విధానాన్ని మీకు అందజేస్తున్నాము. అదేమిటంటే, దానిద్వారా ప్రయోజనం పొందడానికి ఎవరు ముందుకు వస్తారో వారికే మీరు హితబోధ చేయండి. ఎవరు దాన్నుండి ప్రయోజనం పొందగోరుతున్నారో మరెవరు దానికి సిద్ధంగా లేరో, అనే విషయం మీకు తెలియదు కనుక అది తెలుసుకోవాలంటే, మీరు ప్రతి ఒక్కరికీ బోధించవలసి ఉంటుంది. అయితే మీ ధ్యేయం మాత్రం ఆ గుంపులో నుండి ఆ బోధన ద్వారా ప్రయోజనం పొందే దైవదాసులను ఎంపిక చేసుకోవడం. వీరే మీ దృష్టి కేంద్ర బిందువులు. వారి శిక్షణ వైపే మీరు పూర్తి శ్రద్ధ చూపవలసి ఉంటుంది. వారిని తప్ప మిగతావారు ఎలాంటి హితబోధను స్వీకరించడానికి సిద్ధంగా లేరు అనే విషయం మీకు మీ అనుభవంద్వారా తెలిస్తే అలాంటి వ్యక్తుల వెంటబడి బోధించవలసిన అవసరం మీకు అసలే లేదు.

దైవభీతి గలవారే సత్యాన్ని స్వీకరిస్తారు

ఆ సూరాలో ఇంకా ధర్మసందేశాన్ని స్వీకరించే సామర్థ్యం కేవలం దైవభీతిగల వారికే ఉంటుందని, దైవభీతి లేనివారిలో అది కరువై ఉంటుందని చెప్పడం జరిగింది.

سَيَذَّكَّرُ مَنْ يَّخْشٰى (الاعلىٰ : ١٠)

"ఎవరైతే భయపడతాడో అతడే హితబోధను స్వీకరిస్తాడు" (అల్ ఆలా-10)

అంటే ఎవరి హృదయంలో దైవభీతి మరియు దుష్పరిణామాల పట్ల భయాం దోళనలుంటాయో, తాము బహుశా అపమార్గాన్ని అనుసరించడం లేదు కదా అనే మీమాంసలో పడే ఆ దైవదాసులే సన్మార్గం మరియు దుర్మార్గాల తేడాను వివరించి చెప్పినప్పుడు యే మార్గంపై నడిచినట్లయితే తమకు మేలు జరుగుతుందో వివరంగా చెప్పే వారి మాటలను సావధానంగా ఆలకిస్తారు.

సత్యాన్ని స్వీకరించే సామర్థ్యం లేనివారు

దైవభీతి గల మనిషి సత్యాన్ని స్వీకరించే సామర్థ్యం, స్తోమతలను కలిగివున్నట్లే, దురదృష్టులు మరియు దైవభీతి లేనివారికి ఆ సామర్థ్యం ఆ స్తోమతలు అసలే ఉండవని దివ్యఖుర్‌ఆన్ మనకు తెలియజేస్తుంది.

وَيَتَجَنَّبُهَا الْأَشْقَى ۝ الَّذِي يَصْلَى النَّارَ الْكُبْرَىٰ ۝ (الاعلیٰ : ۱۱ ، ۱۲)

"దానిని పెడచెవిన పెట్టేవాడే పరమ దౌర్భాగ్యుడు, అతడు ఘోరమైన అగ్నిలో పడతాడు." (అల్‌అలా:11,12)

ఎందుకంటే యదార్థంగా ఓ సందేశ ప్రచారకుని హెచ్చరికవల్ల సావధాను డయ్యేది అతని హితబోధను అనుసరించేవాడు, దైవభీతి కలవాడే గనక.

إِنَّمَا تُنذِرُ مَنِ اتَّبَعَ الذِّكْرَ وَخَشِيَ الرَّحْمَٰنَ بِالْغَيْبِ (یٰس:۱۱)

"హితబోధనను అనుసరించేవాణ్ణి మాత్రమే, కరుణామయుడైన దేవుణ్ణి చూడకుండానే భయపడేవాణ్ణి మాత్రమే నీవు హెచ్చరించగలవు." (యాసీన్:11)

అదేకాకుండా, మంకుగలవాడు,గర్విష్టులు సత్యాన్ని స్వీకరించజాలరు.

لَقَدْ حَقَّ الْقَوْلُ عَلَىٰ أَكْثَرِهِمْ فَهُمْ لَا يُؤْمِنُونَ ۝

"వారిలో అనేకులు శిక్షా నిర్ణయానికి అర్హులయ్యే వారు ఉన్నారు. కనుకనే వారు విశ్వసించటం లేదు." (యాసీన్:7)

ఈ మాటలు దైవప్రవక్త (స) వారి సందేశానికి వ్యతిరేకంగా పిడివాదాన్ని, మంకును ప్రదర్శించిన వ్యక్తుల గురించి చెప్పబడిన మాటలు. వీరు ఆయన (స) మాటను అసలే వినకూడదని నిర్ణయించుకున్నవారు. వీరిగురించి చెప్పబడినదేమి టంటే, "వీరు శిక్షానిర్ణయానికి అర్హులయ్యే ఉన్నారు కాబట్టే విశ్వసించడం లేదు" అన్నది. ఇలా చెప్పడంలో గల పరమార్థం ఏమిటంటే, ఎవరైతే బోధనను పెడచెవిన బెడతారో మరియు దైవం తరపున ఆయన ప్రవక్తల ద్వారా ఆ విషయం తేటతెల్ల మైనప్పటికీ సత్యాన్ని తిరస్కరిస్తూ శతృత్వాన్ని వహించే వైఖరి అవలంబిస్తూ ఉన్నారో వారిపై వారి కర్మల దుష్పరిణామాలు విరుచుకుపడతాయి, ఆ తరువాత వారికి విశ్వసించే భాగ్యం కలగదు అని అర్థం. ఈ విషయాన్నే ఆ తరువాత వచ్చిన వాక్యం వివరిస్తోంది. ఆ వాక్యం ఇది:

"హితబోధన అనుసరించేవాణ్ణి మాత్రమే, కరుణామయుడైన దేవుణ్ణి చూడకుండానే భయపడే వాణ్ణి మాత్రమే నీవు హెచ్చరించగలవు."

ఇలాంటి వ్యక్తుల మంకు మరియు పిడివాదపు ఉదాహరణనిస్తూ ఇలా చెప్పడం జరిగింది:

إِنَّا جَعَلْنَا فِي أَعْنَاقِهِمْ أَغْلَالًا فَهِيَ إِلَى الْأَذْقَانِ فَهُمْ مُقْمَحُونَ ○ (یٰسٓ : ۸)

"మేము వారి మెడలో పట్టాలను వేశాము, వాటివల్ల వారు గడ్డాల వరకు బంధించబడ్డారు. అందుకని వారు తలను ఎత్తి నిలుచున్నారు." (యాసీన్:8)

ఇక్కడ పట్టాలు అనే పదానికి అర్థం వారి పిడివాదం మరియు మంకుపట్టు. అదే వారిని సత్యాన్ని స్వీకరించడంలో అడ్డుగా నిలుస్తోంది. 'గడ్డాల వరకు బంధించ బడ్డారు', 'తలను ఎత్తి నిలుచున్నారు' అని అంటే, అది వారి మెడల నీల్గు. ఆ నీల్గు, గర్వం మరియు అహంకారానికి ఫలితంగా ఏర్పడినది అని అర్థం. అల్లాహ్ వచనం ఏమిటంటే, మేము వారి ఈ మంకు పట్టును, పిడివాదాన్ని వారి మెడలకు పట్టాలుగా చేశాము; యే అహంకారం మరియు గర్వంలోనైతే వారు విర్రవీగుతున్నారో, ఆ అహంకారం ఫలితంగా ఎలాంటి నికార్సైనా యదార్థం వారి ముందుకు వచ్చినా దాని ముందు తలను వంచకుండా వారి మెడలు బిగుసుకుపోయి నిటారుగానే నీల్గుతున్నాయి.

وَجَعَلْنَا مِنْ بَيْنِ أَيْدِيهِمْ سَدًّا وَمِنْ خَلْفِهِمْ سَدًّا فَأَغْشَيْنَاهُمْ فَهُمْ لَا يُبْصِرُونَ ○ (یٰسٓ : ۹)

"మేము వారి ముందు ఒక గోడనూ, వారి వెనుక మరో గోడనూ నిలబెట్టాము. మేము వారిని (ఈ విధంగా) కప్పివేశాము. ఇక వారికి ఏమీ తోచదు." (యాసీన్:9)

ఒక గోడ ముందు, మరో గోడ వెనుక నిలబెట్టడమంటే, ఈ మంకు మరియు ఈ అహంకారం వల్ల ఏర్పడే సహజమైన పరిణామం ద్వారా వీరు గత చరిత్ర నుండి ఎలాంటి గుణపాఠం నేర్చుకోవడంగాని, భవిష్యత్తులో ఎదురయ్యే పరిణామాల గురించి ఆలోచించడంగాని చేయరు అని అర్థం. వీరి పగ వారిని అన్ని వైపుల నుండి చుట్టుముట్టింది. ప్రతి శాంతచిత్తుడైన మనిషి వీక్షించగలిగినట్లుగా, ప్రస్ఫుటమైన యదార్థాలను సైతం వీక్షింపజేయకుండా వారి అపార్థాల తెరలు వారి కళ్ళను కప్పివేశాయి.

وَسَوَاءٌ عَلَيْهِمْ أَأَنْذَرْتَهُمْ أَمْ لَمْ تُنْذِرْهُمْ لَا يُؤْمِنُونَ ○ (یٰسٓ : ۱۰)

"నీవు వారిని హెచ్చరించినా, హెచ్చరించకపోయినా వారికి ఒక్కటే; వారు విశ్వసించే వారుకారు." (యాసీన్:10)

ఈ పరిస్థితిలో ధర్మప్రచార కార్యక్రమాన్ని కొనసాగించడం నిరర్థకం అనికాదు దీని అర్థం. పైగా దీని అర్థం ఏమిటంటే, మీ సందేశ ప్రచారం సార్వజనీనమై మానవులందరికీ చేరుతుంది. వారిలో కొందరు మాత్రమే పైన చెప్పిన కోవకు చెందినవారు. మరికొందరి గురించి మునుముందు చెప్పడం జరుగుతుంది. మొదటిరకం మనుషులే గనక మీకు ఎదరైె, వారు నిరాకరణను మరియు గర్వాన్ని ప్రదర్శిస్తూ మీకు ఎదురు తిరిగితే వారి వెంటబడకండి. అంతేకాని, వారి ఆ వైఖరికి నొచ్చుకొని, నిరాశ చెంది మీ పనిని మాత్రం వదులుకోవద్దు. ఎందుకంటే, ఈ మానవ సమూహం నడుమ, మీ బోధనను స్వీకరించేవారు, దైవానికి భయపడి రుజుమార్గాన్ని అవలంబించే వారు కూడా ఉన్నారన్న విషయం మీకు తెలియదు. మీ సందేశ ప్రచార అసలు ధ్యేయం అలాంటి రెండవ రకం మనుషులను వెదికి పట్టుకోవడం. వారిని అందులో నుండి యేరి బయటకు తీయడం మట్టుకే. పిడివాదులను వదిలేస్తూ విలువైన వారిని కూడగట్టడమే మీ పని.

మొండి ఘటాలకు దూరంగా ఉండడం

దైవవాణి పట్ల ఉత్సుకత చూపకుండా కేవలం కలహాన్ని సృష్టించే ఇలాంటి మూర్ఖజనులతో వాదించకూడదని దివ్యఖుర్‌ఆన్ ఆదేశిస్తోంది.

وَإِذَا رَأَيْتَ الَّذِينَ يَخُوضُونَ فِي آيَاتِنَا فَأَعْرِضْ
عَنْهُمْ حَتَّىٰ يَخُوضُوا فِي حَدِيثٍ غَيْرِهِ ۚ وَإِمَّا يُنسِيَنَّكَ
الشَّيْطَانُ فَلَا تَقْعُدْ بَعْدَ الذِّكْرَىٰ مَعَ الْقَوْمِ الظَّالِمِينَ
وَمَا عَلَى الَّذِينَ يَتَّقُونَ مِنْ حِسَابِهِم مِّن شَيْءٍ
وَلَٰكِن ذِكْرَىٰ لَعَلَّهُمْ يَتَّقُونَ ○ (الانعام: ٦٨، ٦٩)

"ప్రవక్తా! ప్రజలు గనక మా ఆయతులలో తప్పులెన్నడాన్ని నీవు గమనిస్తే వారిమధ్య నుండి తొలిగిపో, వారు ఈ ప్రస్తావనను వదిలిపెట్టి మరో విషయాన్ని గురించి మాట్లాడడం మొదలుపెట్టేవరకు. ఒకవేళ నిన్ను షైతాను ఎప్పుడైనా ఏమరుపాటుకు గురిచేస్తే, నీవు ఈ పొరపాటును గ్రహించిన తరువాత మళ్ళీ అటువంటి దుర్మార్గుల వద్ద కూర్చోవద్దు. వారి లెక్కలోని యే విషయానికీ భయభక్తులు కలవారు బాధ్యులుకారు. అయితే హితవు గరపడం వారి విధి. బహుశా వారు చెడు నడతను మానుకుంటారేమో!" (అల్ అన్‌ఆమ్:68,69)

అంటే, ఎవరైతే దైవ అవిధేయతా విషయంలో జాగ్రత్త వహిస్తూ ఉంటారో వారిపై అవిధేయతల కర్మల బాధ్యత పడి ఉండబోదు. అలాంటప్పుడు ఆ అవిధేయు లను ఒప్పించి తీరాలని వారితో వాదానికి దిగే అవసరం ఏముంది? వారి ప్రతి

మూర్ఖమైన, అసందర్భమైన ఆక్షేపణకు తప్పకుండా జావాబివ్వాల్సిందే అని ఎందుకను కోవాలి? వారు దాన్ని ఒప్పుకోకపోయినా ఒప్పించే ప్రయత్నం ఎందుకు చేయాలి? సత్యసందేశ ప్రచారకునిపైవున్న బాధ్యత ఒక్కటే. మార్గభ్రష్టత్వంలో మ్రగ్గిపోతున్న వారిని చూసి వారికి హితబోధజేయడం, సత్యాన్ని వారి ముందుంచడం. వారే గనక దాన్ని స్వీకరించకపోతే, జగడానికి, వివాదానికి దిగితే, సత్యాన్ని నమ్మేవారు వారితో వివాదానికి దిగి తమ మెదడును పాడుచేసుకోకూడదు, సమయాన్ని వృధా చేయ కూడదు. అంధకారంలోనే ఉండదలుచుకున్న వారిని వదిలి, తమ శక్తి సామర్థ్యాలను, స్వయంగా సత్యాన్ని వెదుక్కుంటూ మీ దగ్గరకు వచ్చిన వారిని బోధించడంలో, వారికి శిక్షణ ఇవ్వడంలో, సంస్కారవంతులుగా తయారు చేయడంలో ఆ సమయాన్ని వెచ్చించాలి.

సందేశాన్ని నేరుగా అందించాలి

వ్యతిరేకుల మూర్ఖత్వాన్ని పూర్తిగా ఉపేక్షిస్తూ చెప్పదలచిన మాటను నేరుగా చెప్పడమే సరైన సందేశ ప్రచార వివేకం. హామీమ్ అస్ సజ్దాహ్ సూరా అవతరణ నేపథ్యంలో జరిగిన సంఘటనను, దైవప్రవక్త (స) వారి చరిత్రను రచించిన ముహమ్మద్ బిన్ ఇస్హాక్, ప్రఖ్యాత తాబయీ ముహమ్మద్ బిన్ కఅబుల్ ఖర్జీ ఉల్లేఖనాన్ని ఉటంకిస్తూ ఇలా వివరించడం జరిగింది.

ఓ మారు ఖురైష్ తెగకు చెందిన సర్దారులు కొందరు మస్జిదె హరామ్ (కాబా మస్జిద్)లో ఓచోట తిష్టవేసి కూర్చోని ఉన్నారు. మస్జిద్ మరో మూలన దైవప్రవక్త(స) వారు కూడా ఒంటరిగా కూర్చునివున్నారు. అది హజ్రత్ హంజా (ర) వారు ముస్లింగా మారినప్పటి రోజులు. రోజురోజుకు పెరిగిపోతున్న ముస్లిముల జనాభాను చూసిన ఖురైషీలకు ఏంచేయాలో తోచడం లేదు. ఆ విషయమే చర్చించుకుంటున్న ఆ సర్దారుల్లో ఉత్బా బిన్ రబీయా అనేవాడు (ఇతను అబూ సుఫ్యాన్‌కు పిల్లనిచ్చిన మామ) ఖురైష్ సర్దారులతో, ''చూడండి! నేను ముహమ్మద్ (స) వద్దకు వెళ్ళి ఆయనతో మాట్లాడుతాను. ఆయన ముందు కొన్ని ప్రతిపాదనలు ఉంచుతాను. వాటిలో దేన్నైనా ఆయన ఒప్పుకుంటే మనం కూడా ఒప్పుకుందాం. అది మీకు ఇష్టమేనా? అలా జరిగితే ఆయన మనలను వ్యతిరేకించకుండా ఉంటాడు. ఏమంటారు?'' అని అడిగాడు. అక్కడున్న వారంతా అతని ప్రతిపాదనలతో ఏకీభవించారు. ఉత్బా లేచి వెళ్ళి దైవప్రవక్త(స) వారి దగ్గర కూర్చున్నాడు. మహాప్రవక్త (స) అతని వైపు చూడగానే అతను ఆయనను ఉద్దేశించి 'సోదర కుమారా! నీవు నీ జాతిలో నీ వంశం రీత్యా ఏ స్థానాన్ని పొంది ఉన్నావో అది నీకు బాగా తెలుసు. కాని నీవు మాత్రం నీ జాతిపై ఓ కష్టాన్ని గొనితెచ్చావు, సంఘంలో విభేదాలను సృష్టించావు, నీ జాతి ప్రజలందరినీ మూర్ఖులుగా చిత్రించావు. నీ జాతి ధర్మాన్ని దాని ఆరాధ్యుల్ని తెగుడుతున్నావు. నీ మాటల వల్ల అర్థం అయ్యేదేమిటంటే మేమూ, మా తాతముత్తాతలంతా కాఫిర్లమనే.

అయితే విను, నేను నీ ముందు కొన్ని ప్రతిపాదనలను చేస్తున్నాను. వాటి గురించి బాగా ఆలోచించుకో, బహుశా వాటిలో దేన్నైనా నీవు ఒప్పుకుంటావేమో. దానికి దైవప్రవక్త (స), అబుల్ వలీద్! చెప్పండి మీరు చెప్పదలచిందేమిటో నేను సావధానంగా వింటాను అని పలికారు. అతను తిరిగి ఇలా చెప్పనారంభించాడు:

"సోదర కుమారా! యే పనైతే నీవు ప్రారంభించావో దాని ఉద్దేశ్యం డబ్బు గడించేదైతే మేమంతా కలిసి నీవు మా అందరికంటే ధనవంతుడయ్యే అంత ధనం నీకిస్తాము. ఒకవేళ నీవు నీకు పెత్తనమే కావాలని కోరుకుంటున్నావా? మేము నిన్ను మా సర్దారుగా చేసుకుంటాము. ఏదీ నీ నిర్ణయానికి విరుద్ధంగా జరగబోదు. రాచరికం కావాలని కోరుకుంటున్నావా? నిన్ను మేము రాజుగా చేసుకుంటాము. అలాగే నీపై ఏదైనా జిన్ను ప్రభావం ఉండి దాన్ని తొలగించుకోలేకపోతున్నావా? మేము మంచి భూత వైద్యులను పిలిపించి దాన్ని పారద్రోలగలం, దానికి అయ్యే ఖర్చంతా మేమే భరించగలం."

అలా ఉత్బా మాట్లాడుకుంటూ పోతున్నాడు. దైవప్రవక్త (స) అతని మాటలను వింటూనే పోతున్నారు. చివరికి ఆయన అతనినుద్దేశించి, అబూ వలీద్! నీవు చెప్ప దలచిందంతా చెప్పేశావా? అని అడిగారు.

"అవును చెప్పేశాను" అన్నాడతను.

"సరే నా మాట కూడా విను" అంటూ బిస్మిల్లా హిర్రహ్మానిర్రహీం పఠించి, హామీమ్ అస్సజ్దా సూరాను పఠించనారంభించారు. ఉత్బా తన రెండు చేతులను వెనుకవైపు భూమిపై అన్చి ఆ పఠనాన్ని శ్రద్ధగా వింటూ ఉన్నాడు. సజ్దా ఆయత్‌చదివి (ఆయత్ నెం.28) దైవప్రవక్త (స) సజ్దా చేశారు. సజ్దా నుండి తలపైకెత్తి ఆయన(స) ఇలా అన్నారు:

"అబుల్ వలీద్! నా సమాధానం ఏమిటో విన్నారుగా! ఇక మీ ఇష్టం."

ఉత్‌బా ప్రతిపాదనలకు జవాబుగా అల్లాహ్ అవతరింపజేసిన ఆయత్‌లలో దైవప్రవక్త (స)తో చెప్పిన అతని మూర్ఖపు మాటలను గురించి ఏమాత్రం పట్టించు కోవడం జరగలేదు. ఎందుకంటే, అతను మాట్లాడినదంతా దైవప్రవక్త (స) గారి చిత్తశుద్ధిని, ఆయన ఆలోచనలను శంకించి మాట్లాడిన మాటలే. అతని మాటల వెనుక, దైవప్రవక్త (స) వారు దైవప్రవక్త మరియు ఖుర్‌ఆన్ దివ్యవాణి కాదు అనే తలంపే పనిజేస్తూ ఉండింది. కాబట్టి ఆయన సందేశానికి మూలకారణం కేవలం ధనవ్యామోహం మరియు అధికారాన్ని చేజిక్కించుకోవడమే అనుకున్నాడతను. లేదా (దైవం క్షమించుగాక) ఆయన మానసిక సంతులనాన్ని కోల్పోయారని అనుకోవడం అయి ఉండవచ్చు. తాను అనుకున్న మొదటి అంశం (అంటే డబ్బును ఆశగా

చూపడం) గురించే అయితే ఆయన (స)తో ఓ ఒప్పందం కుదుర్చుకోవడం. రెండో విషయం (అంటే ఆయన మానసిక సంతులనం విషయం) గురించే అయితే అది ఆయన్ను (స) అవమానపరుస్తూ, తమ ఖర్చుతో ఆయన పిచ్చిని కుదుర్చుతామని చెప్పడం. ఇలాంటి అర్థంపర్థంలేని నీచానికి వడిగట్టిన వ్యతిరేకుల మాటలకు జవాబు చెప్పడం పెద్దమనుషుల పనికాదు. పైగా వాటిని పెడచెవిన పెట్టి తన మాట యేదో వారికి వినిపించడమే ఓ సందేశ ప్రచారకుని లక్షణం అయి ఉండాలి.

కాబట్టి ఈ సూరాలో ఈ వైఖరే అవలంబించడం జరిగింది. ఉత్బా మాటలను పట్టించుకోకుండా, దివ్యఖుర్ఆన్ సందేశాన్ని అడ్డుకొనేందుకు మక్కా దైవధిక్కారులు అవలంబించిన అతి నీచమైన మొండి వైఖరి మరియు అనైతికతల గురించి ఈ సూరాలో చర్చించడం జరిగింది.

సత్యధర్మప్రచార ప్రతిఘటనకు ప్రచారకుడు నొచ్చుకోనవసరం లేదు

దీనికి సంబంధించి ఇలా సెలవియ్యడం జరిగింది:

وَلَوْ شَاءَ اللّٰهُ لَجَعَلَهُمْ أُمَّةً وَّاحِدَةً وَّلٰكِنْ يُّدْخِلُ
مَنْ يَّشَاءُ فِيْ رَحْمَتِهٖ ۚ وَالظّٰلِمُوْنَ مَا لَهُمْ مِّنْ وَّلِيٍّ
وَّلَا نَصِيْرٍ ○ (شوریٰ : ۸)

"అల్లాహ్ కోరివుంటే, వారందరినీ ఒకే సంఘంగా చేసి ఉండేవాడు. కాని ఆయన తాను కోరిన వారిని తన కృపకు పాత్రులను చేస్తాడు. దుర్మార్గులను రక్షించే వాడు గానీ, వారికి సహాయపడేవాడుగానీ ఎవ్వడూ లేడు." (అష్షూరా:8)

దీని ఉద్దేశ్యం దైవప్రవక్త (స)వారిని బోధించడం మరియు ఆయనకు స్థిమితాన్ని కూర్చడం. ఈ ఆయత్‌లో దైవప్రవక్తకు బోధించబడిన విషయం ఏమిటంటే, మీరు మక్కా దైవతిరస్కారుల అజ్ఞానం, మూఢత్వం మరియు ఆపై వారి మొండి వైఖరిని చూసి నొచ్చుకోకండి, మనుషులకు వారి ఇష్టప్రకారం నడుచుకునే స్వాతంత్ర్యం ఇవ్వడమే అల్లాహ్ ఉద్దేశ్యం. ఎవరైతే సన్మార్గాన్ని పొందదలిచారో వారికి ఆ మార్గంపై నడిచే భాగ్యం కలుగుతుంది. మరెవరైతే మార్గభ్రష్టత్వాన్నే కోరుకుంటాడో అతను అలా మార్గం తప్పిపోవడానికీ అతనికి వెసలుబాటు కూడా ఉంటుంది. ఎటువైపుకు వెళ్ళినా అతనికి ఆ మార్గమే సులభతరమౌతుంది. ఆ ఉద్దేశ్యమే లేకపోతే దైవప్రవక్తల్ని, దైవగ్రంథాల్ని పంపే అవసరమే ఉండేదికాదు. అల్లాహ్ తలిస్తే మానవుడు పుట్టినప్పుడే, ఈ సముద్రాలు, నదులు, పర్వతాలు, చెట్టు పుట్టలు, రాళ్ళు రప్పలు ఈ జీవజాలం అంతా ఆయన్ను విధేయిస్తున్నట్లే మానవుడు కూడా ఆయనకు విధేయుడగా ఉండేటట్లు చేసేవాడే. ఇదే విషయం దివ్యగ్రంథంలో మరోచోట ఇలా సెలవియ్యడం జరిగింది:

وَإِنْ كَانَ كَبُرَ عَلَيْكَ إِعْرَاضُهُمْ فَإِنِ اسْتَطَعْتَ
أَنْ تَبْتَغِيَ نَفَقًا فِي الْأَرْضِ أَوْ سُلَّمًا فِي السَّمَاءِ فَتَأْتِيَهُمْ
بِآيَةٍ ۚ وَلَوْ شَاءَ اللَّهُ لَجَمَعَهُمْ عَلَى الْهُدَىٰ ۚ فَلَا تَكُونَنَّ
مِنَ الْجَاهِلِينَ ○

"అయినా ఒకవేళ నీకు వారి వైముఖ్యాన్ని భరించడం కష్టంగా ఉంటే, నీకు గనక శక్తివుంటే భూమిలో ఓ సొరంగాన్ని వెదకి లేదా ఆకాశానికి నిచ్చనవేసి వారివద్దకు ఏదైనా సూచనను తీసుకొనివచ్చే ప్రయత్నం చెయ్యి. అల్లాహ్ గనక కోరివుంటే, వారిందరినీ సన్మార్గంపై చేర్చి ఉండేవాడే. కనుక నీవు అవివేకివి కావద్దు."

(అల్ అన్ఆమ్:35)

దైవప్రవక్త (స) ఆ జాతిని సముదాయించడంలో సుదీర్ఘ కాలాన్నే వెచ్చించారు. అయినా ఆ జాతి దారికి రాకపోవడం చూసిన ఆయన, దైవం తరఫున ఏదైనా సూచన వస్తే బాగుండు, దాన్ని చూసైనా వారి ఈ దైవతిరస్కార వైఖరి అంతమై నన్ను విశ్వసించే వారేమో అని అనుకునేవారు. ఆయన (స) గారి ఈ కోరికకే ఈ ఆయత్‌లో సమాధానం ఇవ్వడం జరిగింది. దీనిభావం ఏమిటంటే అసహనాన్ని ప్రదర్శించకండి, ఏ విధంగా మరో క్రమంలోనైతే మేము ఈకార్యాన్ని నిర్వహింప జేస్తున్నామో ఆ కార్యాన్ని సహనం మరియు ఓర్పుతో నిర్వహిస్తూ ఉండండి. మహత్మ్యాలు, సూచనలతోనే పని అయ్యేటట్లు చేయదలిస్తే మేము స్వయంగా ఆ పనిని చేసి ఉండేవారం కదా? యే ఆలోచనాత్మక మరియు నైతిక విప్లవం మరే పరిశుద్ధమైన నాగరికత నిర్మాణానికైతే మీరు నియమించబడ్డారో దాన్ని విజయ లక్ష్యం వరకు చేర్చే సరైన మార్గం ఇదికాదు. ఒకవేళ ప్రజల ప్రస్తుత జడత్వాన్ని మరియు వారి తిరస్కార భారాన్ని మోసే సహనం మీకు లేక, దాన్ని పారద్రోలేందుకు ఏదో ఒక సూచనను చూపించి వారిని దారికి తీసుకోరాదలిచారా? అయితే మీరు మీ సర్వశక్తులను ధారపోసి భూమిలో సొరంగం చేసైనా లేదా ఆకాశానికి నిచ్చెన వేసైనా ఆ సూచనను తీసుకురండి. అయితే మీ ఈ కోరికను మేము ఈడేంస్తామని మాత్రం ఆశ పెట్టుకోకండి. ఎందుకంటే మా ప్రణాళికలో దీనికి ఎలాంటి ఆస్కారం లేదు గనుక.

మానవులంతా ఏదో ఒక రకంగా సన్మార్గగాములు కావాలనే తలంపే గనక మాకున్నట్లయితే ప్రవక్తలను ప్రభవింపజేయడం, వారిపై గ్రంథాలను అవతరింప జేయడం మరియు దైవధిక్కారులతో ముస్లిములను సంఘర్షణకు దింపడం ఇంకా ఈ సత్యధర్మాన్ని ఒక దాని తరువాత ఒకటిగా వచ్చే ఈ ఉద్యమ మజిలీల నుండి నడిపించే అవసరం మాకేమిటి? అని చెప్పడం అన్నమాట. ఇది కేవలం అల్లాహ్ యొక్క ఒకే ఒక సృజనాత్మక సంకేతంతో జరిగిపోయేదే. కాని అల్లాహ్ ఈ కార్యాన్ని

ఈ విధానం ద్వారా చేయదలచలేదు. సత్యాన్ని హేతువుల ద్వారా ప్రజల ముందుకు తీసుకురావలనేది ఆయన ఉద్దేశ్యం. ఆ పిదప ఎవరైతే ఆలోచనా వివేచనలను ఉపయోగించి సత్యాన్ని తెలుసుకోగోరుతున్నారో వారు అయిచ్ఛికంగానే దాన్ని విశ్వసించాలి. తమ చరిత్రను ఆ మూసలో మలిచి అసత్యవాదుల ముందు తమ నైతిక ఔన్నత్యాన్ని చాటాలి. మానవ సమూహంలోని సంస్కారవంతులను తమ బలమైన ఆధారాలద్వారా, తమ ఉన్నత లక్ష్యాలు, ఉత్తమమైన జీవన సూత్రాలు మరియు పరిశుద్ధమైన చరిత్ర ద్వారా తమ వైపుకు ఆకర్షింపజేయాలి. అసత్యానికి వ్యతిరేకంగా నిర్విరామంగా కృషి సల్పుతూ ఆలోచనా వివేచనల మార్గం ద్వారా సత్యధర్మసంస్థాపనా గమ్యాన్ని చేరుకోవాలి. అల్లాహ్ ఇలాంటి కార్యంలో వారికి మార్గాన్ని చూయిస్తాడు. యే ఘట్టంలో ఎలాంటి సహాయం అల్లాహ్ తరఫున వారికి అవసరముంటుందో ఆ సహాయాన్ని కూడా ఆయన వారికి అందిస్తూ పోతుంటాడు. అయితే ఎవరైనా, ఈ సహజమైన మార్గాన్ని వదిలి కేవలం అల్లాహ్‌యే తన శక్తి ద్వారా ఈ చెడు ఆలోచనల్ని రూపుమాపి ప్రజల్లో మంచిని వ్యాపింపజేయగలడని, ఈ దుర్మార్గపు భావాలను సర్వనాశనం చేసి సభ్యసమాజాన్ని నెలకొల్పగలడు అని అనుకుంటే అది కల్ల. అలా ఎప్పుడూ జరగదు. ఎందుకంటే, అది అల్లాహ్ వివేకానికి వ్యతిరేకమైన ఆలోచన. ఆయన ఆ వివేకం ప్రకారం అల్లాహ్, మానవుణ్ణి ఓ బాధ్యతా యుతమైన వానిగా పుట్టించాడు. అతనికి తన ఇష్టమొచ్చినట్లుగా ప్రవర్తించే అధికారాలను కూడా ఇచ్చాడు. విధేయత మరియు అవిధేయతల స్వాతంత్ర్యాన్నీ ఒసిగాడు. అలాగే అతనికి పరీక్షా సమయాన్నికూడా కేటాయించాడు. అతని ప్రయత్నానికి తగినట్లు బహుమానం మరియు శిక్షలను అందించడానికి ఓ సమయాన్ని కూడ ఖరారు చేశాడు. కాబట్టి ఈ క్రమానుక్రమణావలంబనే దైవ చట్టం. ఈ విషయంలో సమాధానంగా దివ్యగ్రంథం ఇలా సెలవిస్తోంది.

وَقَالُوا لَوْلَا نُزِّلَ عَلَيْهِ آيَةٌ مِّن رَّبِّهِ ۚ قُلْ إِنَّ اللَّهَ
قَادِرٌ عَلَىٰ أَن يُنَزِّلَ آيَةً وَلَٰكِنَّ أَكْثَرَهُمْ لَا يَعْلَمُونَ
(الانعام : ٣٧)

"ఈ ప్రవక్తపై అతని ప్రభువు తరఫునుండి ఏదైనా సూచన ఎందుకు అవతరింపజేయబడలేదు?" అని వారు అడుగుతారు. అను: "అల్లాహ్‌కు సూచనను అవతరింపజేసే శక్తి పూర్తిగా ఉంది" అని. అయితే వారిలో అనేకులు అజ్ఞానంలో పడివున్నారు. (అల్ అన్ఆమ్:37)

సూచన అంటే కంటికి అగుపడే సూచన. ఈ ఆయత్ భావం ఏమిటంటే, సూచనను చూయించకపోవడానికి కారణం, ఆ సూచనను మేము చూయించలేము అనికాదు, పైగా అలా చూయించకపోవడానికి కారణం మరొకటుంది. దాన్నే ఈ అజ్ఞానులు తమ అజ్ఞానం చేత అర్థం చేసుకోలేకపోతున్నారు అని.

కాబట్టి అన్‌ఆమ్ సూరాలోని ఈ ఆయత్‌లో ఇలా చెప్పడం జరిగింది:

وَاَعْرِضْ عَنِ الْمُشْرِكِيْنَ ○ وَلَوْ شَآءَ اللّٰهُ مَآ اَشْرَكُوْا
وَمَا جَعَلْنٰكَ عَلَيْهِمْ حَفِيْظًا ۚ وَمَآ اَنْتَ عَلَيْهِمْ بِوَكِيْلٍ ○

"(ప్రవక్తా!) ఈ ముష్రికులను పట్టించుకోకు. అల్లాహ్ సంకల్పించి ఉన్నట్లయితే (స్వయంగా ఆయనే ఏ ఏర్పాటు చేసి ఉండేవాడంటే) వారు షిర్కు చేసే వారుకాదు. మేము నిన్ను వారికి కావలివానిగా నియమించనూలేదు, నీవు వారికి బాధ్యుడవూ గాదు." (అల్‌అన్‌ఆమ్:106,107)

భావం ఏమిటంటే, మిమ్మల్ని ఆహ్వానించేవారిగా మరియు సందేశ ప్రచారకులుగా చేశామేగాని వారికి కావలివారిగా చేయలేదు. మీ పనల్లా ప్రజల ముందు ఈ వెలుగును తీసుకొని రావడం, మీకు సాధ్యమైనంత వరకు సత్యాన్ని ప్రకటించడంలో ఎలాంటి సంకోచానికి గురికావద్దు. ఈ సత్యాన్ని ఒకరు స్వీకరించకపోతే స్వీకరించకపోనివ్వండి. ప్రజలను సత్యాన్ని నమ్మేవారుగా చేసి తీరాల్సిందే అని మిమ్మల్ని బలవంత పెట్టడం జరగలేదు. అలాగే మీ దైవదౌత్య పరిధిలో ఏ ఒక్కరూ అసత్యవాదిగా మిగలకుండా ఉండాలనే బాధ్యత, జవాబుదారీ ఏదీ మీపై లేదు. కాబట్టి, గ్రుడ్డివారిని ఏ విధంగా చూపుగలవారిగా చేయాలి? అనే ఆలోచనలతో అనవసరంగా మీ మెదడును పాడుచేసుకోకండి. ఒకవేళ ప్రపంచంలో అసత్యవాదులు ఎవ్వరూ మిగిలి ఉండకూడదనే దైవనిర్ణయమే అయివుంటే అల్లాహ్‌కు ఆ పనిని మీకు అప్పగించే అవసరం ఎక్కడుండేది? 'అయిపో' అని ఆయన ఇచ్చే ఆదేశం ఒక్కటే మానవులందరిని సత్యవాదులుగా చేసి ఉండేది కదా? కాని అక్కడ ఆ ఉద్దేశ్యమే లేదు. మనిషికి సత్యాఅసత్యాలను ఎన్నుకునే స్వాతంత్ర్యం మిగిలి ఉండాలని, సత్యప్రకాశాన్ని వారి ముందుంచిన తరువాత ఆ రెంటిలో అతను దేన్ని ఎంచుకుంటాడు అనే పరీక్ష పెట్టడమే దాని ధ్యేయం. అందుకని యే జ్యోతి అయితే మీకు ఒసగబడిందో దాని వెలుగులో మీరు స్వయంగా రుజుమార్గంపై నడుస్తూ, ఇతరుల్ని కూడా దానిపై నడువమని పిలువండి.సత్యాన్ని స్వీకరించే వారిని అక్కున చేర్చి వారిని మాత్రం విడువకండి. వారు ప్రపంచం దృష్టిలో ఎంత విలువలేనివారైనా సరే. దాన్ని స్వీకరించనివారి వెంటబడకండి. యే దుష్పరిణామం వైపుకైతే వారు పోదలిచారో, ఎటుపోవడానికే పట్టుబట్టి కూర్చున్నారో వారిని అటువైపుకే వెళ్ళిపోనివ్వండి.

సంస్కరణ కార్యక్రమం మందకొడిగా సాగుతుందని నిరాశ చెందకండి

సందేశ ప్రచారకుడుతాను చేబట్టిన సంస్కరణ కార్యక్రమం మందకొడిగా సాగు తుందని నిరాశ పడవద్దని, దాన్ని వేగిరపర్చడానికి అర్థంలేని మార్గాలను కూడా వెదక కూడదు అనే సూచనలు ఇవ్వడం జరిగింది.

وَلَوْ شَآءَ اللّٰهُ لَجَعَلَهُمْ اُمَّةً وَّاحِدَةً وَّلٰكِنْ
يُّدْخِلُ مَنْ يَّشَآءُ فِيْ رَحْمَتِهٖ ؕ وَالظّٰلِمُوْنَ مَا لَهُمْ مِّنْ
وَّلِيٍّ وَّلَا نَصِيْرٍ ۝

"అల్లాహ్‌యే సంకల్పిస్తే వారందరిని ఒకే సంఘంగా చేసి ఉండేవాడే. కాని ఆయన తాను కోరినవారినే తన కారుణ్యచ్ఛాయలో చేర్చుకుంటాడు. దౌర్జన్యపరులకు సంరక్షకుడు, సహాయకుడూ ఎవడూ ఉండడు."

ఈ ఆయత్ ఉద్దేశ్యం పైన చెప్పిన శీర్షికలో చెప్పిన ఉద్దేశ్యమే. ఇంకో ఉద్దేశ్యం, ధర్మసందేశ ప్రచారం మరియు ప్రజలను సంస్కరించడంలో విశ్వాసులకు ఆ పిదప బాగా ఎదురయ్యే కష్టాలెలాంటివో తెలియజేయడం. ఎవరైతే అల్లాహ్ ప్రసాదించిన ఎంపిక స్వాతంత్ర్యాన్ని, సంకల్పాన్ని మరియు దాని ఆధారంగా ప్రకృతిని మరియు విధానాల విభేదాల యదార్థాన్ని అర్థం చేసుకోలేరో, అలాంటి వారు ఒక్కోసారి సంస్కరణలో జరుగుతున్న జాప్యాన్ని చూసి నిరాశ చెందుతూ ఉంటారు. అల్లాహ్ తరఫున ఏదైనా సూచనగాని, మహాత్మ్యంగాని జరిగిపోతే వాటిని చూసిన ప్రజల మనసులు మారగలవేమో అని తలపోస్తూ ఉంటారు. మరొక్కోసారి అవసరానికి మించిన ఉద్వేగాన్ని ప్రదర్శించి సంస్కరణకు సంబంధించిన అర్థంలేని మార్గాలను అనుసరించే ప్రయత్నం చేస్తారు. దివ్యఖుర్ఆన్‌లో సూచనలు, మహత్మ్యాల గురించిన ప్రశ్నకు ఈ విధంగా సమాధానం ఇవ్వడం జరిగింది.

وَلَوْ اَنَّ قُرْاٰنًا سُيِّرَتْ بِهِ الْجِبَالُ اَوْ قُطِّعَتْ
بِهِ الْاَرْضُ اَوْ كُلِّمَ بِهِ الْمَوْتٰى ؕ

"పర్వతాలను నడిపించే, భూమిని బద్దలుచేసే, మృతులను గోరీల నుండి బయటకు రప్పించి మాట్లాడించే శక్తి గలిగిన ఖుర్ఆన్ అవతరింపజేస్తే ఏమై ఉండేది? (ఇటువంటి సూచనలు చూపించడం పెద్ద కష్టమేమికాదు). (అర్రాద్:31)

ఈ ఆయత్‌ను అర్థం చేసుకోవడానికి, ఈ సంబోధన దైవతిరస్కారులను కాకుండా విశ్వసించిన ముస్లిములను ఉద్దేశించి చేసిందనే విషయాన్ని గమనించడం అవసరం. దైవతిరస్కారులు మాటిమాటికి సూచనలు కావాలని అడగడాన్ని విన్న ముస్లిములకు, వారికి ఏదైనా సూచన చూయించడం జరిగితే ఎంత బాగుండునని, అలాగైనా వారు నమ్మేవారేమోనని అనిపించేది. అలాగే ఇలాంటి సూచన ఏదీ రాకపోవడం వలన దైవతిరస్కారులకు దైవప్రవక్త (స) వారి దైవదౌత్యం విషయంలో ప్రజల్లో అపోహలను సృష్టించే అవకాశం దొరుకుతుందని కూడా భయపడేవారు. అలాంటి సందర్భంలో వారి బాధ మరింత పెరుగుతూపోయేది. అందుకని ముస్లిములను ఉద్దేశించి, ఒకవేళ ఖుర్ఆన్ ఏదో ఓ సూరాతోపాటు ఇలాంటి సూచనలు

ఏవైనా చూయించడం జరిగితే వారు నిజంగానే విశ్వసిస్తారని అనుకుంటు న్నారా? ఏదో ఒక సూచన చాలు, ఇక వారు సత్యాన్ని విశ్వసించడానికి, ఆ సూచనకోసం ఎదురు చూస్తున్నారనుకుంటున్నారా? అని అడగడం జరిగింది. ఎవరికైతే దివ్యఖుర్‌ఆన్ బోధనల్లో, విశ్వసూచనల్లో, దైవప్రవక్త (స) వారి పవిత్ర జీవితంలో, సహాబా (ర)వారి జీవితాల్లో వచ్చిన విప్లవంలో ఆ సత్యజ్యోతి అగుపడలేదో వారికి పర్వతాలు తమ స్థానం నుండి కదిలినా, భూమి బ్రద్దలైనా, మృతులు గోరీల నుండి బయటకు వచ్చి మాట్లాడినా ఆ సూచనల నుండి వెలుగును పొంది సన్మార్గంపైకి వస్తారనుకున్నారా? అని అడగడం అన్నమాట.

بَلْ لِّلّٰهِ الْاَمْرُ جَمِيْعًا ۗ

"(ఇటువంటి సూచనలు చూపించడం పెద్ద కష్టమేమీ కాదు) ఎందుకంటే అధికారం సమస్తమూ అల్లాహ్ చేతిలోనే ఉంది."

అంటే సూచనలను చూపించకపోవడానికి అసలు కారణం, అల్లాహ్ వాటిని చూపించలేడు అనేది కాదు. కాగా అసలు కారణం ఏమిటంటే, ఇలాంటి విధానాలను అవలంబించి పనిజేయడం అల్లాహ్ నిర్ణయానికి వ్యతిరేకం అని. అసలు ఉద్దేశ్యం వారిని రుజుమార్గంపైకి తీసుకురావడం. ఓ ప్రవక్త యొక్క దౌత్యాన్ని ఒప్పుకునేటట్లు చేయడం కాదు. ప్రజల ఆలోచన, వారి దృష్టి కోణపు సంస్కరణ అది లేకుండా సాధ్యం అయ్యేది కాదు.

اَفَلَمْ يَايْئَسِ الَّذِيْنَ اٰمَنُوْٓا اَنْ لَّوْ يَشَآءُ اللّٰهُ لَهَدَى
النَّاسَ جَمِيْعًا ۔

"అల్లాహ్ గనక కోరితే మానవులందరికీ మార్గం చూపేవాడు అనే విషయాన్ని (తెలుసుకొని) కూడా విశ్వాసులు (అవిశ్వాసుల కోరికకు సమాధానంగా ఏదైనా సూచన ప్రత్యక్షమౌతుందనే) ఆశ వదులుకోలేదా?" (అర్రాద్:31)

అంటే ఆలోచన, అనుశీలనలు లేకుండా కేవలం ఓ ఉత్తుత్తి విశ్వాసమే అవసరం అని అనుకుంటే దానికోసం ఈ సూచనలను చూపించే అవసరం ఎక్కడిది? మానవులందరిని విశ్వాసులుగానే సృష్టించి అల్లాహ్ ఈ కార్యాన్ని ఎప్పుడో నెరవేర్చి ఉండేవాడు.

సందేశ ప్రచారంలో అనైతిక విధానాలు నిషిద్ధం

అల్లాహ్ దివ్యగ్రంథమైన ఖుర్‌ఆన్ నహ్ల్ సూరా 90వ ఆయత్‌లో మూడు విషయాలను గురించి ఆదేశం ఇచ్చాడు. వాటికి భిన్నంగా మూడు విషయాల గురించి నిషేధం విధించడం జరిగింది కూడా. ఆ మూడు విషయాలు వ్యక్తిగతంగానూ మనిషిని మరియు సామూహికంగా మొత్తం సమాజాన్ని చెడగొట్టే విషయాలు.

إِنَّ اللَّهَ يَأْمُرُ بِالْعَدْلِ وَالْإِحْسَانِ وَإِيتَاءِ ذِي الْقُرْبَىٰ وَيَنْهَىٰ
عَنِ الْفَحْشَاءِ وَالْمُنكَرِ وَالْبَغْيِ يَعِظُكُمْ لَعَلَّكُمْ تَذَكَّرُونَ ○

"న్యాయం చేయండి అనీ, ఉపకారం చేయండీ అని, బంధువుల హక్కులు నెరవేర్చండి అనీ అల్లాహ్ ఆజ్ఞాపిస్తున్నాడు. చెడునూ, అశ్లీలతనూ, అన్యాయాన్నీ, మితిమీరి ప్రవర్తించడాన్నీ నిషేధిస్తున్నాడు.ఆయన మీకు హితబోధ చేస్తున్నాడు మీరు గుణపాఠం నేర్చుకోవాలని." (అన్నహ్ల్:90)

ఏ విషయాలైతే నిషేధింపబడ్డాయో వాటిలో చివరిది మరియు మూడవది అయిన 'అల్‌బగీ', అంటే దౌర్జన్యం అని అర్థం. అల్బగీ విశాలార్థం తన హద్దును అతిక్రమించడం, ఇతరుల హక్కులను కొల్లగొట్టడం- ఆ హక్కులు సృష్టికర్త హక్కులైనా లేదా సృష్టితాల హక్కులైనాసరే.

ఇక ఆయత్ నెం. 91లో వరుసగా మూడు రకాల ఒప్పందాలను వాటి ప్రాధాన్యత ప్రకారం వేరువేరుగా చెప్పి వాటికి కట్టుబడి ఉండాలని ఆదేశం ఇవ్వడం జరిగింది.

అలాగే ఆయత్ నెం.92లో, భువిలో కల్లోలాన్ని సృష్టించడం కోసం, మూల కారణమైన ఒప్పందాన్ని భంగపరిచే నీచమైన ప్రవృత్తిని తెగడం జరిగింది.

وَلَا تَكُونُوا كَالَّتِي نَقَضَتْ غَزْلَهَا مِن بَعْدِ قُوَّةٍ أَنكَاثًا
تَتَّخِذُونَ أَيْمَانَكُمْ دَخَلًا بَيْنَكُمْ أَن تَكُونَ أُمَّةٌ
هِيَ أَرْبَىٰ مِنْ أُمَّةٍ ۚ إِنَّمَا يَبْلُوكُمُ اللَّهُ بِهِ ۚ

"స్వయంగా తాను శ్రమతో నూలువడికి, ఆ తరువాత తానే దానిని ముక్కలు ముక్కలుగా చేసిన స్త్రీ పరిస్థితి వంటిది మీ పరిస్థితి కాకూడదు. మీరు మీ ప్రమాణాలను మీ వ్యవహారాలలో పరస్పరం మోసగించుకోవడానికి పనిముట్లుగా చేసుకుంటారు ఒక జాతి రెండవ జాతికంటే ఎక్కువ లాభాలను పొందడానికి. వాస్తవానికి అల్లాహ్ ఈ ప్రమాణాల ద్వారా మిమ్మల్ని పరీక్షకు గురిచేస్తున్నాడు." (అన్ నహ్ల్:92)

ఇక్కడ, ప్రపంచంలో అన్నిటికంటే గొప్ప సంక్షోభాన్ని, కల్లోలాన్ని రేకెత్తించే అతినీచమైన ప్రవృత్తి 'వాగ్దాన భంగం' గురించి ప్రత్యేకంగా నిందించడం జరిగింది. దీన్ని గొప్పగొప్ప హోదాల్లో విరాజిల్లుతున్న పెద్ద మనుషులు కూడా పుణ్యకార్యంగా భావించి ఆచరిస్తూ ఉంటారు. అలా చేసినందుకు తన జాతి వారి నుండి శెభాష్ అని అనిపించుకుంటూ ఉంటారు. జాతులు, తెగల రాజకీయ, ఆర్థిక, మరియు ధార్మిక సంఘర్షణల్లో ఇలాంటివి నిత్యం జరిగే విషయాలే. ఓ జాతి నాయకుడు ఒకే

సమయంలో మరోజాతితో ఒడంబడిక లేదా ఒప్పందాన్ని కుదుర్చుకుని, మరో సమయంలో కేవలం తన జాతి ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకొని దాన్ని భంగపర్చడమో లేదా అతిక్రమించి ప్రయోజనం పొందడమో చేస్తూ ఉంటాడు. తమ వ్యక్తిగత జీవితంలో ఎంతో నిజాయితీని ప్రదర్శించే వ్యక్తులు కూడా ఇలాంటి పనులకు ఒడికట్టడం పరిపాటే. ఈ చర్యపై వారి జాతి సమస్తమూ వారిని నిందించకపోవడమే కాకుండా పైగా ఇలా చేసినందుకు వారిని అభినందించడం కూడా చేస్తుంది. ఇలాంటి ఎత్తుగడల్ని డిప్లమసీ అంటుంది. అల్లాహ్ దీని గురించే హెచ్చరిస్తూ, ప్రతి ఒప్పందం లేదా ప్రమాణం, ఆ ప్రమాణం లేదా ఒప్పందం కుదుర్చుకునే వ్యక్తి మరియు జాతి నైతికత, నిజాయితీలకు పరీక్ష. ఎవరైతే ఈ పరీక్షలో నెగ్గరో వారు అల్లాహ్ న్యాయ స్థానంలో జవాబు చెప్పుకోకుండా తప్పించుకోజాలరు.

"తప్పకుండా ఆయన ప్రళయం నాడు మీ సమస్త అభిప్రాయ తత్వాన్ని మీకు విశదం చేస్తాడు."

అంటే ఈ తీర్పు ప్రళయం రోజున్నే జరుగుతుంది. యే అభిప్రాయభేదాల్లో మీరు సతమతమౌతున్నారో వాటిలో ఎవరు సత్యవంతులో మరెవరు అసత్యవాదులో తెలిసేరోజది. కాని మొత్తానికి ఎవరైనా సత్యవంతుడే అయ్యి, అతని వ్యతిరేకి పూర్తిగా మార్గభ్రష్టుడు మరియు అసత్యవాదే అయినప్పటికీ, అతను తన మార్గభ్రష్టుడైన ప్రత్యర్థి పట్ల వాగ్దానభంగం, అసత్యం, అపనింద మరియు మోసాలను ప్రదర్శించ డానికి వీల్లేదు. అతనేగనక అలా చేస్తే ప్రళయం రోజున అల్లాహ్ పెట్టే పరీక్షలో అపజయాన్ని ఎదుర్కోవలసి ఉంటుంది. ఎందుకంటే, సత్యవాదం అనేది కేవలం సిద్ధాంతాల్లో మరియు విశ్వాసాల్లోనే నిజాయితీని ప్రదర్శించదు. ఆచరణలోనూ వనరుల సమీకరణలోనూ అది నిజాయితీ కోరుతోంది గనక. ప్రత్యేకించి ఈ ఆయత్‌లో గల హెచ్చరిక కొన్ని ధార్మిక సంస్థలను దృష్టిలో ఉంచుకుని చేసింది. ఈ సంస్థలు తమను తాము దైవానికి ప్రియమైన వారిగా తలుస్తూ, మాకు ప్రత్యర్థి అయిన వారంతా దైవధిక్కారులని, ఏ రకంగానైనా వారిని నష్టపర్చడం మా హక్కు అని, ఈ దైవధిక్కారుల పట్ల వ్యవహరించేటప్పుడు సత్యాన్నిగాని, నిజాయితీనిగాని, వాగ్దాన పాలననుగాని అవలంబించే అవసరం మాకు లేదని తలపోస్తారు. అచ్చం ఇలాంటి వైఖరినే అప్పటి అరబ్బు యూదులు కూడా అవలంబించేవారు. "అరబ్బు బహు దైవారాధకుల విషయంలో మేము ఎలాంటి వాగ్దానాలకు కట్టుబడి లేము, వారిపట్ల ఏ వైఖరినైనా అవలంబించవచ్చు" అని అనుకునేవారు. అలాగే యే ఎత్తుగడలు ఎన్నైనా దైవానికి ప్రీతిపాత్రులమైన మాకు మేలు చేకూరాలి, దైవధిక్కారులకు నష్టం కలగాలి అది పూర్తిగా ధర్మసమ్మతమైన విషయమే, దీనికి మేము దైవసమక్షంలో జవాబుదారులం కాము అని చెప్పుకునేవారు.

وَلَوْ شَاءَ اللّٰهُ لَجَعَلَكُمْ أُمَّةً وَّاحِدَةً

"ఒకవేళ అల్లాహ్ సంకల్పం ఇదే అయివుంటే, (అంటే, మీలో ఏ భేదాభిప్రాయమూ ఉండకూడదు అని) ఆయన మీ అందరినీ ఒకే సమాజంగా చేసి ఉండేవాడు." (అన్ నహ్ల్:93)

ఇది గతంలో చెప్పుకున్న విషయాన్ని మరింత వివరించి చెప్పడం అన్నమాట. దీని భావం ఏమిటంటే, ఎవరైన తనను తానుగా దైవానికి ప్రియుడని అనుకొని ప్రతి మంచి, చెడు మార్గం ద్వారా తన మతాన్ని (దేన్నైతే అతడు దైవధర్మం అని అనుకుంటున్నాడో) వికసింపజేయడానికి....ఇతర మతాలను తుదముట్టించడానికి ప్రయత్నం చేస్తున్నాడో, అతని ఈ వైఖరి అల్లాహ్ అభీష్టానికి వ్యతిరేకమైనది అని చెప్పడం. ఎందుకంటే, ఒకవేళ అల్లాహ్ అభీష్టమే అది అయివుంటే ప్రజల నుండి వారి ధార్మిక భేదాభిప్రాయ అధికారాన్ని లాక్కొనేవాడే. మానవులందరిని ఒకే ధర్మానికి విధేయులుగా చేయదలిస్తే దానికోసం అల్లాహ్‌కు ఈ మిథ్యా దైవప్రియుల నీచమైన ఎత్తుగడల సహాయం తీసుకునే అవసరం ఎక్కడిది. ఈ పని ఆయన తన సృష్టించే శక్తి ద్వారా చేసి ఉండేవాడు. అందరిని విశ్వాసులుగా, విధేయులుగానే పుట్టించేవాడు. వారి నుండి దైవధిక్కార శక్తినే లాక్కునేవాడు. అలాంటప్పుడు విశ్వాసం మరియు విధేయతా మార్గం నుండి ఇసుమంతైనా తప్పుకునే వీలు వారికి ఎక్కడుండేది?

وَلٰكِنْ يُّضِلُّ مَنْ يَّشَاءُ وَيَهْدِيْ مَنْ يَّشَاءُ

"కాని ఆయన తన ఇష్టప్రకారం కొందరిని అపమార్గానికి గురిచేస్తాడు. తన ఇష్టప్రకారం కొందరికి సన్మార్గం చూపుతాడు." (అన్ నహ్ల్: 93)

అంటే ఎంచుకునే స్వాతంత్ర్యాన్ని, ఇష్టమైన మార్గంపై నడిచే శక్తిని అల్లాహ్‌యే మనిషికి ఇచ్చాడు అని చెప్పడం. అందుకనే ప్రపంచంలో మనుషులు అనుసరిస్తున్న మార్గాలు భిన్నంగా ఉన్నాయి. ఒకరు అపమార్గాన్ని అవలంబించదలిస్తే అతనికి ఆ మార్గాన్ని అనుసరించడానికి కావలసిన వనరులను అల్లాహ్‌యే సమకూరుస్తున్నాడు. అలాగే ఎవరైనా సన్మార్గాన్ని పొందదలిస్తే అల్లాహ్ అతనికి సన్మార్గంపై నడిచేందుకు కావలసిన సదుపాయాలను సమకూరుస్తున్నాడు.

وَلَتُسْئَلُنَّ عَمَّا كُنْتُمْ تَعْمَلُوْنَ ○

"తప్పకుండా మీ పనులను గురించి మిమ్మల్ని సంజాయిషీ అడగడం జరిగి తీరుతుంది." (అన్ నహ్ల్:93)

అంటే ఎవరైనా ఇస్లామ్ ధర్మం యదార్థాన్ని ఒప్పుకున్న తరువాత, కేవలం మీరు అవలంబిస్తున్న మూర్ఖత్వాన్ని చూసి ఆ ధర్మం గురించి అపార్థం చేస్తుకొని

దానికి దూరమైపోతే, ఆ కారణంగా విశ్వాసుల వర్గంలో చేరకుండా ఆగిపోతే, ఎవరి నైతిక విలువలు, వ్యవహారాలు దైవతిరస్కారులకు ఏమాత్రం భిన్నంగా లేరని తలచి మీ వర్గంలో చేరకుండా ఉంటే అది మీరు చేసిన పొరపాటుకు ఫలితం అవుతుంది.

وَلَا تَتَّخِذُوٓا أَيْمَانَكُمْ دَخَلًۢا بَيْنَكُمْ فَتَزِلَّ قَدَمٌۢ بَعْدَ ثُبُوتِهَا وَتَذُوقُوا ٱلسُّوٓءَ بِمَا صَدَدتُّمْ عَن سَبِيلِ ٱللَّهِ ۖ وَلَكُمْ عَذَابٌ عَظِيمٌ ۝ (النحل: ٩٤)

"(ముస్లిములారా!) మీరు మీ ప్రమాణాలను ఒకరినొకరు మోసగించుకోవడానికి సాధనాలుగా చేసుకోకండి. ఇలా చేస్తే స్థిరపడిపోయిన పాదాలు తరువాత చలిస్తాయేమో, మీరు అల్లాహ్ మార్గం నుండి ప్రజలను నిరోధించిన అపరాధానికి దుష్ఫలితాన్ని చూస్తారేమో, శిక్షను అనుభవిస్తారేమో." (అన్‌నహ్ల్:94)

فَلِذَٰلِكَ فَٱدْعُ ۖ وَٱسْتَقِمْ كَمَآ أُمِرْتَ ۖ وَلَا تَتَّبِعْ أَهْوَآءَهُمْ ۖ (الشوریٰ: ١٥)

"(ఈ పరిస్థితి ఉత్పన్నం అయింది కాబట్టి) కనుక (ముహమ్మద్!) ఇప్పుడు నీవు ఆ ధర్మం వైపునకే ప్రజలను ఆహ్వానించు నీకు అజ్ఞాపించబడిన విధంగా; దానిపై స్థిరంగా ఉండు, వారి కోరికలను అనుసరించకు." (అష్షూరా:15)

అంటే వారిని రాజీపరిచేందుకు వారు ఇస్లామ్‌లో చేరెందుకుగాను ఈ ధర్మంలో ఎలాంటి మార్పులు చేర్పుల మార్గాన్ని వెదకకు. దాన్ని స్వీకరించేవాడు ఆ ధర్మాన్ని దేవుడు పంపించిన అసలు సిసలైన రూపంలో స్వీకరిస్తే స్వీకరించని. అలాకాక అతను నరకకూపంలో పడదలచుకుంటే పడిపోని. దైవధర్మం ప్రజల కోసం మార్చబడదు. ప్రజలు తమ మేలును కోరుకుంటే వారే స్వయంగా తమను మార్చుకొని దానికి అనుగుణంగా నడువవలసి ఉంటుంది.

సందేశ ప్రచారకుడు నిష్పక్షపాతిగా మెలగాలి

సందేశ ప్రచారకుడు అన్ని రకాల పక్షపాతానికి దూరంగా ఉండవలసి ఉంటుంది. తాను ఖుద్దుగా ఏదో ఓ రకమైన పక్షపాతానికి గురికాకుండా ఇతరులను కూడా దానికి వడిగట్టకుండా ప్రయత్నం చేయాలి. ఈ విషయాన్ని ఇలా సెలవియ్యడం జరిగింది:

وَقُلْ ءَامَنتُ بِمَآ أَنزَلَ ٱللَّهُ مِن كِتَٰبٍ ۖ وَأُمِرْتُ لِأَعْدِلَ بَيْنَكُمُ ۖ (الشوریٰ: ١٥)

"వారితో ఇలా అను, "అల్లాహ్ అవతరింపజేసిన గ్రంథాన్ని నేను విశ్వసించాను. మీ మధ్య న్యాయం చేయమని నాకు ఆజ్ఞాపించబడింది." (అష్షూరా:15)

ఈ సమగ్రమైన వాక్యానికి ఎన్నో అర్థాలున్నాయి. ఒక అర్థం ఏమిటంటే, నేను ఈ వర్గబంధాలకు దూరంగా ఉంటూ ముక్కుకు సూటి అయిన న్యాయాన్ని అవలంబించడానికే నియుక్తుడైన వాడిని. ఓ వర్గానికి అనుకూలంగా మరో వర్గానికి వ్యతిరేకంగా తీర్పు ఇవ్వడంలో పక్షపాతం వహించే వాణ్ణికాను. నాకు మనుషులందరితో సమాన సంబంధం ఉంది. ఆ సంబంధమే పూర్తి న్యాయం చేసే సంబంధం. ఎవరి మాట సత్యమైందో అతనికి నేను మిత్రుడను- ఆ వ్యక్తి పరాయి వ్యక్తి అయినాసరే- అలాగే ఏ మాట అయితే సత్యానికి విరుద్ధమో దానికి నేను వ్యతిరేకిని. ఆ వ్యక్తి నాకు దగ్గరి బంధువు అయినాసరే- అన్నది.

రెండవ అర్థం, నేను యే సత్యాన్నైతే మీముందుంచడానికి నియుక్తుడై ఉన్నానో ఆ సత్యం ఎవరిపట్ల తేడాను, హెచ్చుతగ్గులను చూపేదికాదు. పైగా అది అందరికి సమానమైనదే. ఇందులో నా వారికిగాని, పరాయివారికిగాని, పిన్నలకుగాని, పెద్దలకుగాని కలిమిగలిగినవారికిగాని, నిరుపేదలకుగాని, గౌరవనీయులకుగాని, నీచులకుగాని, వేరువేరుగా హక్కులేవీ లేవు. పైగా ఏదైతే సత్యమైనదో వారందరికీ అది సత్యమే. మరేదైతే పాపమో వారందరికీ అది పాపమే. యేదైతే నిషేధించబడిందో అందరికీ అది నిషిద్ధమే. యేదైతే నేరమో అది అందరికీ నేరమే. ఈ ముక్కుకు సూటి అయిన సూత్రానికీ నేను కూడా అతీతుణ్ణి ఏమీకాదు.

మొండి వైఖరిని అవలంబించే సంభోదితుణ్ణి పట్టించుకోకపోవడం

ఎంత వివేకాన్ని ప్రదర్శించినా తన మాటనే నెగ్గించుకోడానికి ప్రయత్నించే సంబోధితుణ్ణి అతని మానాన అతణ్ణి వదిలివేయడమే మేలు. దివ్యఖుర్ఆన్ ఈ విషయాన్ని ఇలా సెలవిస్తోంది:

فَذَرْهُمْ يَخُوضُوا وَيَلْعَبُوا حَتّٰى يُلٰقُوا يَوْمَهُمُ
الَّذِي يُوعَدُونَ ٥ (الزخرف : ٨٣)

"సరే, మంచిది, వారిని తమ అసత్యపు ఆలోచనలలో మునిగి ఉండనీ, తమ ఆటలలో నిమగ్నులై ఉండనీ. చివరకు వారు, తమను యే దినం గురించి భయపెట్టడం జరుగుతుందో ఆ దినాన్ని చూస్తారు." (అజ్ జుఖ్రుఫ్:83)

అందుకని వారితో అల్లాహ్ విధేయతా విషయంలో వాదులాడడం వల్ల ఒరిగేదేముంది?

قُلْ اَتُحَاجُّوْنَنَا فِي اللّٰهِ وَهُوَ رَبُّنَا وَرَبُّكُمْ ۚ (البقرہ:۱۳۹)

"ప్రవక్తా! వారితో ఇలా అను: "అల్లాహ్ విషయంలో మీరు మాతో వాదులాడు తారా? వాస్తవానికి ఆయనే మాకు ప్రభువు, మీకూ ప్రభువు." (అల్‌బఖర:139)

అంటే, అల్లాహ్‌యే మనందరికీ ప్రభువు, ఆయనను మాత్రమే విధేయించాలనే మేమంటున్నాం. మాతో వాదులాడడానికి ఇందులో ఇంకేదైనా క్రొత్త విషయం ఉందనా మీ ఉద్దేశ్యం? వాదులాడడానికి ఏమైనా అవకాశం ఉంటే దానికోసం మేము వాదులాడాలి, మీరుకాదు. ఎందుకంటే, అల్లాహ్ తప్ప మరే ఇతరులను దాస్యానికి అర్హులుగా చేస్తున్నారు, మేముకాదే! 'అతుహాజ్జూన ఫిల్లాహ్' అనే పదానికి మరో అనువాదం కూడా చేయవచ్చు. అది, మీ ఈ వాదులాట మీ సొంత విషయంలో కాదు దైవం గురించి అని. అలాంటప్పుడు ఇది ఎంతో సునాయాసంగా పరిష్కరింపబడే సమస్య.

وَلَنَآ اَعْمَالُنَا وَلَكُمْ اَعْمَالُكُمْ ۚ وَنَحْنُ لَهٗ مُخْلِصُوْنَ

(البقرہ : ۱۳۹)

"మా కర్మలు మాకు, మీ కర్మలు మీకు. మేమైతే మా దాస్యాన్ని కేవలం అల్లాహ్‌కే ప్రత్యేకం చేసుకున్నాము." (అల్‌బఖర: 139)

అంటే మీరు మీ కర్మలకు బాధ్యులు, మేము మా కర్మలకు బాధ్యులం. మీరు దాస్యాన్ని విభజించారు, అల్లాహ్‌కు సాటిగా ఇతరుల్ని కూడా దైవత్వంలో చేర్చి వాటిని ఆరాధిస్తూ విధేయిస్తున్నారు. అలాచేసే అధికారం మీకుంది. దాని పరిణామాన్ని మీరే స్వయంగా చూడగలరు. మేము బలవంత పెట్టేవాళ్ళంకాము. అయితే మేము మా దాస్యాన్ని, విధేయతను, ఆరాధనను పూర్తిగా అల్లాహ్‌కే ప్రత్యేకం చేసుకున్నాం. అలాచేసే అధికారం మాకుంది అని మీరు ఒప్పుకుంటే, అనవసరపు ఈ వాదులాట దానంతట అదే సమసిపోతుంది. ఈ విషయమే దివ్యఖుర్‌ఆన్ చాలా చోట్ల ప్రస్తావించింది.

اَمْ يَقُوْلُوْنَ افْتَرٰىهُ ۭ قُلْ اِنِ افْتَرَيْتُهٗ فَعَلَيَّ اِجْرَامِيْ
وَاَنَا بَرِيْۗءٌ مِّمَّا تُجْرِمُوْنَ ۝ (ہود : ۳۵)

"ఇదంతా (ప్రవక్త) అతనే స్వయంగా కల్పించాడని వారంటున్నారా? ప్రవక్తా! వారికి ఇలా చెప్పు: ఒకవేళ నేనే స్వయంగా దీనిని కల్పించి ఉన్నట్లయితే ఆ నేరము బాధ్యత నాపై ఉన్నది. మీరు చేస్తున్న నేరంతో నాకు ఏవిధమైన సంబంధం లేదు." (హూద్:35)

అలా అడిగే ఆ శైలిని పరిశీలిస్తే, దైవప్రవక్త ముహమ్మద్(స)వారి నోటి ద్వారా హజ్రత్ నూహ్(అ) వారి గాధను వింటూ ఆయన వ్యతిరేకులు, ముహమ్మద్ (స) వారే, ఈ గాధలను తామే స్వయంగా కల్పించి మాపై రుద్దడానికి ప్రయత్నిస్తున్నారని అనుకొని ఉండవచ్చు; మాటల ద్వారా యేదాడి అయితే ఆయన మాపై నేరుగా చేయదలచలేదో, ఇలాంటి ఓ కథ అల్లి మాపై ఆ దాడిని చేయదలిచారు అని భావించేవారు. కాబట్టి వారి ఈ ఆక్షేపణకు ఈ వాక్యంలో జవాబు చెప్పడం జరిగింది.

యదార్థం ఏమిటంటే నీచప్రవృత్తి కలిగి ఉన్న వారి ఆలోచన ఎప్పుడూ మాటలోని చెడ్డ కోణం వైపుకే మళ్ళుతుంది. మంచి గురించి వారు అంతగా పట్టించుకోరు. ఒక వ్యక్తి ఒకవేళ ఏదైనా వివేచనకు సంబంధించిన మాట చెప్పినప్పుడో లేదా మీకు ప్రయోజనం కలిగించే ప్రయత్నం చేసినప్పుడో లేదా మీరు చేస్తున్న తప్పును గురించి హెచ్చరిస్తున్నప్పుడు దాన్నుండి ప్రయోజనం పొందండి. మిమ్మల్ని మీరు సంస్కరించుకోండి. కాని నీచ ప్రవృత్తి గలవాడు, ఆ మాటల్లో సతతం ఏదో ఒక చెడు కోణాన్ని వెదకి ఆ వివేచన మరియు ప్రబోధాన్ని మంటగలపచూస్తాడు. ఆ చెడును తాను స్వయంగా ఆచరించడమేకాకుండా చెప్పే వానిపై కూడా ఏదో నిందను మోపజూస్తాడు. అలా ఎంతోమేలైన ప్రబోధాన్ని కూడా నిష్ప్రయోజనంగా మార్చి వేయవచ్చు. వినేవాడు దాన్ని హితోపదేశంగా కాక అతనిపై దాడిగా భావిస్తే , అతని ఆలోచన, తన తప్పును తెలుసుకునే బదులు మరింత అధోగతికి జారిపోగలదు. ఈ రకం మనుషులు ఎల్లప్పుడూ తమ ఆలోచనల ద్వారా ఓ అనుమానాన్ని సృష్టించుకుంటారు. ఓ సంఘటనను యదార్థ గాథగా మరియు కల్పిత కథగా భావించే రెండు సమాన అవకాశాలు ఉండి అది మీకే అన్వయిస్తోంది మరియు మీరు చేస్తున్న తప్పును ఎత్తిచూపుతోందన్నప్పుడు, మీరే గనక వివేచన గలవారైతే దాన్ని యదార్థంగా భావించి దాని గుణపాఠం గరిపే కోణం ద్వారా ప్రయోజనం పొందగలరు. అలాకాకుండా కేవలం మీరు ఓ అనుమానానికి లోనై దాన్ని తప్పుడు దృష్టితో చూసి నేరం మోపే వారైతే అది మీ తప్పే కాగలదు. చెప్పే వానిని చూసి, అతను కేవలం మిమ్మల్ని దెబ్బగొట్టడానికే ఇదంతా కల్పించి చెబుతున్నాడు అని భావిస్తే దానికి బాధ్యతను మీరే వహించాల్సి ఉంటుంది. అందుకనే ఈ ఆయత్‌లో చెప్పిన విషయం ఏమిటంటే, ఈ కథను నేనేగనక అల్లి ఉండి ఉంటే ఆ నేరానికి నేనే బాధ్యుణ్ణి. కాని మీరు చేస్తున్న నేరం ఏమిటో అది కూడా నేరమే అవుతుంది. దాని బాధ్యత విషయంలో మీరే పట్టుబడగలరు. నేను కాదు అని.

وَإِذَا سَمِعُوا اللَّغْوَ أَعْرَضُوا عَنْهُ وَقَالُوا لَنَا أَعْمَالُنَا
وَلَكُمْ أَعْمَالُكُمْ سَلَامٌ عَلَيْكُمْ لَا نَبْتَغِي الْجَاهِلِينَ ۝
(القصص : ٥٥)

"వారు ఎప్పుడైనా అసహ్యకరమైన మాటను వింటే, ఇలా అంటూ దూరంగా జరిగిపోతారు. "మా కర్మలు మావి; మీ కర్మలు మీవి. మీకో సలామ్, మేము అజ్ఞానుల పద్ధతిని అవలంబించదలచలేదు." (అల్ ఖసస్:55)

ఈ ఆయత్‌లో అసహ్యకరమైన ఆ మాటల వైపుకు దృష్టిని మళ్ళించడం జరిగింది. యే మాటలైతే అబూజహ్ల్ మరియు అతని అనుచరులు అబిసీనియా క్రైస్తవుల ప్రతినిధి వర్గంతో అన్నారో. ఈ సంఘటనను ఇబ్నె హిష్షామ్ మరియు బైహఖీలు, ముహమ్మద్ బిన్ ఇస్‌హాక్ మాధ్యమంగా ఇలా వివరించడం జరిగింది.

అబిసీనియాకు ముస్లిములు వలస వెళ్ళిన తరువాత దైవప్రవక్త (స) వారి దైవదౌత్యం మరియు ఆయన సందేశవార్తలు అబిసీనియా దేశం మొత్తంలో వ్యాపించాయి. అక్కడి నుండి దాదాపు ఇరవై మంది క్రైస్తవులు ఓ ప్రతినిధి వర్గంగా ఏర్పడి యదార్థాన్ని తెలుసుకునే ఉద్దేశ్యంతో మక్కాకు వచ్చారు. మక్కాలోని దైవగృహం కాబాలో దైవప్రవక్త (స) వారిని కలిశారు. ఇది చూసిన ఖురైష్‌కు చెందిన చాలా మంది వారి చుట్టూ వచ్చి చేరారు. వచ్చిన ప్రతినిధి వర్గంలోని కొందరు దైవప్రవక్త (స)ను కొన్ని ప్రశ్నలు అడగడం జరిగింది. ఆ ప్రశ్నలకు ఆయన (స) సమాధానం ఇచ్చారు. ఆ పిదప దైవప్రవక్త (స) వారిని ఇస్లామ్ ధర్మం వైపుకు ఆహ్వానించారు. దివ్యఖుర్‌ఆన్ ఆయత్‌లను వారికి చదివి వినిపించారు. ఖుర్‌ఆన్ వాక్యాలు విన్న ఆ ప్రతినిధి వర్గపు కళ్ళ నుండి అశ్రువులు జలజలా రాలనారంభించాయి. అలా వారు దివ్యఖుర్‌ఆన్ దైవగ్రంథమే అని ధృవపరచి వెంటనే ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించారు. సమావేశం ముగిసిన తరువాత అబూజహ్ల్ మరియు అతని సహచరులు కొందరు వెళ్ళి వారిని దారిలోనే అటకాయించారు. వారిని తూలనాడుతూ, "మీరు ఎంత దురదృష్టవంతులు! మీ మతస్తులు మిమ్మల్ని ఇక్కడికి పంపించింది మీరు పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించి భోగట్టా అందించమని. కాని మీరు అతని వద్ద కూర్చున్నారో లేదో మీ ధర్మాన్ని వదిలేసి ఆయన్ను విశ్వసించేశారు. మీకంటే పిచ్చోళ్ళను మేమింతవరకు చూడలేదు" అని ఏదేదో నోటికొచ్చినట్లు వాగనారంభించారు. ఇది విన్న ఆ ప్రతినిధి వర్గం జవాబుగా, "మీకు ఓ సలాము, సోదరులారా మేము మీతో మీలా అసహ్యావాదులాటకు దిగేవాళ్ళం కాము మమ్మల్ని మా దారిన నడవనీయండి, మీరు మీ విధానాన్ని అవలంబించుకోండి కావాలని మేము ఆ మేలుకు దూరంగా ఉండలేము" అనడం జరిగింది.

సందేశ ప్రచార నైపుణ్యాన్ని ప్రదర్శించే మరో నమూనా అష్షూరా సూరాలోని 10వ ఆయత్‌లోనూ మనకు లభిస్తోంది.

గ్రంథవహులకు దివ్యఖుర్‌ఆన్ ఇస్లామీయ ప్రబోధం ఇలా చేయడం జరిగింది:

فَإِنْ حَاجُّوكَ فَقُلْ أَسْلَمْتُ وَجْهِيَ لِلَّهِ وَمَنِ اتَّبَعَنِ ۗ
وَقُل لِّلَّذِينَ أُوتُوا الْكِتَابَ وَالْأُمِّيِّينَ أَأَسْلَمْتُمْ ۚ
فَإِنْ أَسْلَمُوا فَقَدِ اهْتَدَوا ۖ وَّإِن تَوَلَّوْا فَإِنَّمَا عَلَيْكَ
الْبَلَاغُ ۗ وَاللَّهُ بَصِيرٌ بِالْعِبَادِ ○ (آل عمران : ٢٠)

"ప్రవక్తా! ఇక వీరు నీతో ఘర్షణకు దిగితే ఇలా చెప్పు: "నేనూ నా అనుచరులూ అల్లాహ్‌కు సంపూర్ణంగా విధేయులమయ్యాము." గ్రంథం కలవారినీ, గ్రంథం లేనివారినీ ఉభయులనూ ఇలా అడుగు: "మీరు కూడా ఆయన పట్ల విధేయతకూ, దాస్యానికీ అంగీకరించారా?" అలా చేస్తే వారు సరైన మార్గాన్ని పొందినట్లే. కాని ఒకవేళ వారు దానికి విముఖులైతే, నీ బాధ్యత కేవలం సందేశాన్ని అందించడమే. తరువాత అల్లాహ్ తన దాసుల విషయాలను తానే స్వయంగా చూసుకుంటాడు."
(ఆలి ఇమ్రాన్:20)

మీరు కూడా ఆయన దాస్యాన్ని విధేయతను స్వీకరిస్తున్నారా? అని అడగడం అన్నమాట. ఇంకో రకంగా చెప్పాలంటే, నేనూ, నా అనుచరులు మాత్రం శుద్ధమైన ఇస్లామ్ ధర్మాన్ని ఒప్పుకున్నాం. అదే దేవుని అసలు ధర్మం. ఇక మీరే చెప్పండి! మీరు, మీ తాతముత్తాతలు కల్పించుకున్న విధానాలన్నిటిని వదిలి ఈ అసలుసిసలైన ధర్మం వైపుకు మరలగలరా?

సందేశ ప్రచార సందర్భంలో పరస్పరం శపించుకునే సందర్భమూ రావచ్చు

సందేశాన్ని చేరవేసే సమయంలో పరస్పరం శపించుకునే సందర్భం కూడా రావచ్చు.

فَمَنْ حَاجَّكَ فِيهِ مِن بَعْدِ مَا جَاءَكَ مِنَ الْعِلْمِ
فَقُلْ تَعَالَوْا نَدْعُ أَبْنَاءَنَا وَأَبْنَاءَكُمْ
وَنِسَاءَنَا وَنِسَاءَكُمْ وَأَنفُسَنَا وَأَنفُسَكُمْ ثُمَّ نَبْتَهِلْ
فَنَجْعَل لَّعْنَتَ اللَّهِ عَلَى الْكَاذِبِينَ ○ (آل عمران : ٦١)

"ఈ జ్ఞానం వచ్చిన తరువాత ఇక నీతో ఎవరైనా ఈ విషయంలో వివాదానికి దిగితే, ప్రవక్తా! వారితో ఇలా అను; "రండి! మీరూ మేమూ స్వయంగానూ వద్దాము. మన ఆలుబిడ్డలను కూడా పిలుచుకువద్దాము. అసత్యం పలికేవారిపై 'అల్లాహ్ శాపం పడుగాక" అని ప్రార్థిద్దాము."
(ఆలి ఇమ్రాన్:61)

'ఈ జ్ఞానం వచ్చిన తరువాత' అని అంటే, నజ్రాన్ తరఫున ఓ క్రైస్తవ ప్రతినిధి వర్గం దైవప్రవక్త (స)తో వివాదానికి దిగడానికి వచ్చింది. దైవప్రవక్త (స) వారితో మూడు అంశాల గురించి చర్చించారు. ఆయన చూపిన హేతువులకు, ఆధారాలకు వారి నుండి ఎలాంటి సమాధానం రాలేదు. ఆ అంశాలు ఈ క్రింది విధంగా ఉండినాయి.

వారికి నచ్చజెప్పజూపిన మొదటి అంశం ఏమిటంటే, ఈసా (అ) (ఏసుక్రీస్తు) దైవత్వపు విశ్వాసం, యే కారణాల వలన మీలో ఉద్భవించిందో వాటిలో ఏదీ ఆ విశ్వాసానికి సరైన హేతువు కాజాలదు. ఆయన ఓ మానవ మాత్రుడు. ఆయన్ను అల్లాహ్ ధార్మిక అవసరాల కోసం దైవదౌత్యపు హోదాలో నియమించాడు. దానికితోడు ఆయనకు ఇవ్వబడ్డ మహత్మ్యాలు కూడా ఆయన దైవదౌత్యాన్ని సూచించేవే. దైవతిరస్కారులు ఆయన్ను శిలువపై ఎక్కించకుండా తన వద్దకు రప్పించుకున్నాడు. తన దాసుణ్ణి తన ఇష్టమొచ్చిన రీతిగా వాడుకొనే అధికారం ప్రభువుకు ఉంది. కేవలం అసాధారణమైన విషయాలను చూసి, ఆయనే యజమాని అని, ప్రభువు అని లేదా దైవకుమారుడని లేదా దైవత్వంలో ఆయనకు భాగస్వామ్యం ఉందని తేల్చడం ఎంతవరకు సబబు?

వారికి బోధించబడిన రెండవ విషయం ఏమిటంటే, ఈసా (అ) దేని వైపుకైతే ఆహ్వానించడానికి వచ్చారో, అది దైవప్రవక్త ముహమ్మద్ (స) ఆహ్వానించే ధర్మమే. ఆ ఇద్దరి బోధనల్లో ఎలాంటి తేడా అగుపడదు.

ఇక ఈ ప్రసంగంలోని మూడవ మౌలిక అంశం వారికి తెలియడం జరిగిందే మిటంటే, దివ్యఖుర్ఆన్ ప్రబోధించిన ధర్మం కూడా ఈసా (అ) వారి 'హవారీ'లు (సహాయకులు) అవలంబించిన ధర్మమే. ఆ తరువాత వచ్చిన క్రైస్తవం, ఈసా మసీహ్ (ఏసుక్రీస్తు) బోధనలను అనుసరించే హవారీల ధర్మంపైగాని, ఆయన బోధనపైగాని నిలకడగా ఉండలేకపోయింది.

కాబట్టి ఇప్పుడు ఈ జ్ఞానం అవతరించిన తరువాత కూడా నజ్రాన్ నుండి వచ్చిన ప్రతినిధి వర్గం కావాలని మొండికి వేసికూర్చుంటే, వారి ముందు, సత్యం ఏదో, అసత్యం ఏదో తెలుసుకునేందుకు ఈ మూడు అంశాలను వారి ముందుంచడం జరిగింది. ఆ మూడింటిలోనూ దేనికీ సమాధానం వారివద్ద లేదు. క్రైస్తవ విశ్వాసాల్లో ఆ మూడు అంశాల విషయంలో వారి పరిశుద్ధ గ్రంథాల్లో వారికి ఎలాంటి ధృవీకరణ లభించలేదు, అదేకాకుండా దైవప్రవక్త ముహమ్మద్ (స) వారి సచ్చరితం, ఆయన బోధనలు, ఆయన ఘనకార్యాలను చూసిన ఆ ప్రతినిధి వర్గంలోని చాలామంది ఆయన దైవదౌత్యాన్ని తమ మనస్సుల్లోనే ఒప్పుకోవడం జరిగింది. కనీసం తమ నిరాకరణ ధోరణిలోనైనా మార్పు తెచ్చుకోవడం జరిగింది. అందుకని వారితో, "సరే మీకే గనక సత్యం మీ వైపునే ఉందని పూర్తి నమ్మకం కలిగి ఉన్నట్లయితే, రండి! మనలో ఎవరు అసత్యవాదులో వారిపై దైవాగ్రహం, దైవశాపం విరుచుకుపడుగాక"

అని ప్రార్థిద్దాం అని చెప్పడం జరిగింది. ఆ ప్రమాణం మాట విన్నంతనే వారిలో యే ఒక్కరూ దానికి సిద్ధపడలేదు. ఎవరి పరిశుద్ధత, గౌరవాలైతే ప్రజల్లో వ్యాపించి ఉన్నాయో, ఆ నజ్రాన్ క్రైస్తవ సన్యాసులు, పాదరీల బండారం మొత్తం అరేబియాలో బట్టబయలైపోయింది. స్వయంగా వారి విశ్వాసాలపైన్నే వారికి భరోసా లేని విశ్వాసాలను మనం నమ్ముతూ వస్తున్నామే! అని ప్రజలు అనుకున్నారు.

గ్రంథవహులు మరియు దైవ ఏకత్వపు విశ్వాసం

దివ్యగ్రంథంలో ఇలా చెప్పడం జరిగింది:

قُلْ يَاأَهْلَ الْكِتَابِ تَعَالَوْا إِلَىٰ كَلِمَةٍ سَوَاءٍ بَيْنَنَا
وَبَيْنَكُمْ أَلَّا نَعْبُدَ إِلَّا اللَّهَ وَلَا نُشْرِكَ بِهِ شَيْئًا وَ
لَا يَتَّخِذَ بَعْضُنَا بَعْضًا أَرْبَابًا مِنْ دُونِ اللَّهِ فَإِنْ تَوَلَّوْا
فَقُولُوا اشْهَدُوا بِأَنَّا مُسْلِمُونَ ۝ (آل عمران: ٦٤)

"ప్రవక్తా! ఇలా చెప్పు: గ్రంథప్రజలారా! మాకూ మీకూ మధ్య సమానమైన ఒక విషయం వైపుకు రండి. (అది ఏమిటంటే) మనం అల్లాహ్‌కు తప్ప మరెవరికీ దాస్యం చేయరాదు. ఆయనకు భాగస్వాములుగా ఎవరినీ నిలబెట్టరాదు. మనలోని వారెవరూ అల్లాహ్‌ను తప్ప మరెవరినీ తమ ప్రభువుగా చేసుకోరాదు అనేది." ఈ సందేశాన్ని స్వీకరించడానికి వారు వైముఖ్యం కనబరిస్తే వారితో స్పష్టంగా ఇలా అను: 'మేము ముస్లింలము (కేవలం అల్లాహ్‌కే దాస్యం చేసేవారూ, విధేయత చూపేవారూ) అనే విషయానికి మీరు సాక్షులుగా ఉండండి." (ఆలి ఇమ్రాన్: 64)

అంటే, మేమూ, మీరూ ఉభయులం కలసి విశ్వసిస్తూ ఉన్నటువంటి ఆ విశ్వాసాన్ని గురించి ఏకీభవిద్దాం. అది సత్యం అన్న విషయాన్ని మీరూ నిరాకరించలేరు. మీ ప్రవక్తలు కూడా దీన్ని సత్యంగానే ధృవీకరించారు. ఆ బోధనలు మీ పవిత్ర గ్రంథాల్లోనూ పొందుపర్చబడి ఉన్నాయి అని చెప్పడం అయింది.

సందేశ ప్రచారంలో హృదయాలను చూరగొనడానికే ప్రాధాన్యత ఉంది

فَأَعْرِضْ عَنْهُمْ وَعِظْهُمْ وَقُلْ لَهُمْ فِي أَنْفُسِهِمْ
قَوْلًا بَلِيغًا (النساء: ٦٣)

"కనుక వారితో వివాదానికి దిగకు. వారికి నచ్చజెప్పు. వారి హృదయాలలో నాటుకునే విధంగా బోధ చెయ్యి." (అన్‌నిసా:63)

మునాఫిక్‌ల (కపటులు) గురించి చెప్పిన తరువాత ఈ మాటలు చెప్పడం జరిగింది. దీని ద్వారా తెలిసినదేమిటంటే, చెడిపోయిన ముస్లిములను ౨ రకంగా

సంస్కరించాలి, వారిని తెగడకుండా వారి మనస్సులో మాటను ఎలా నాటాలో అన్న విషయం అర్థం చేసుకోవచ్చు. ఇలా వారి హృదయాలను చూరగొనడం, మనసుల్ని హత్తుకునేలా మాట్లాడడం దీని ఉద్దేశ్యం. అంతేకాని వారు భయభీతులై, సిగ్గుపడి మీ దగ్గరికి రాకుండా ఉండడం కాదు. వారు తమ సంస్కరణ కొరకు ప్రయత్నించేటట్లు చేయాల్సి ఉంటుంది.

లేఖల ద్వారా దైవధర్మం వైపుకు ఆహ్వానించడం

ఇది కూడా ఓ రకమైన సందేశ ప్రచారమే. దైవప్రవక్త (స) అప్పటి రాజులకు ఈ లేఖల ద్వారానే ధర్మం వైపునకు రమ్మని ఆహ్వానించి ఇస్లామ్ ధర్మాన్ని బోధించడం జరిగింది. సందేశాన్ని చేరవేయడానికి ప్రసంగాలు, చర్చలు, సింపోజియంలు ఎలా నిర్వహించడం జరుగుతుందో, ప్రచార ప్రసార సాధనాలు మరియు లేఖల ద్వారాను సందేశ ప్రచారం నిర్వహించవచ్చు. హుదేబియా ఒప్పందం ద్వారా దైవప్రవక్త (స)కు, తమ సందేశాన్ని విస్తరింపజేయడానికి మొట్టమొదటగా కొంత గడువు, దేశంలో ప్రశాంత పరిస్థితులు లభించాయి. అదేకాకుండా చుట్టుపక్కల ఇస్లామ్ సందేశాన్ని వ్యాపింపజేసే అవకాశమూ దొరికింది. వాటి ద్వారా ప్రయోజనం పొందుతూ ఆయన (స) ఈరాన్, రోమ్, ఈజిప్టు మరియు అరేబియాకు చెందిన రాజులకు, కుబేరులకు లేఖలురాసి ఆ పనిని ప్రారంభించారు. దానికితోడు ముస్లిమ్ సందేశ ప్రచారకులు దైవదాసులను దైవధర్మం వైపుకు ఆహ్వానించేందుకు వివిధ తెగలలోనికి, వివిధ జాతులలోనికి వెళ్ళారు.

సత్యధర్మ ప్రచారం ఓ విధి

قُلْ لَّآ اَسْـَٔلُكُمْ عَلَيْهِ اَجْرًا ؕ اِنْ هُوَ اِلَّا ذِكْرٰى
لِلْعٰلَمِيْنَ ۝ (الانعام : ٩٠)

"(ఓ ప్రవక్తా!) ప్రకటించు: నేను ఈ (ధర్మం ప్రచార, ప్రబోధ) కార్యానికిగాను మీ నుండి యే ప్రతిఫలాన్ని ఆశించడం లేదు. ఇది హితబోధ, సమస్త భూప్రజలకు" అని. (అల్ అన్ఆమ్:90)

అంటే ఖుర్ఆన్ ప్రపంచంలోని ప్రతి వ్యక్తి కోసం పూర్తిగా ఓ ప్రబోధం మరియు హితోపదేశం. ప్రతి మనిషి దీన్ని ముందుకొచ్చి పొందవలసి ఉంది. ఈ భావంతోనే ప్రతి సందేశ ప్రచారకుడు పనిజేయాల్సి ఉంటుంది. ఎవరికైతే ఈ ప్రబోధాన్ని అందించడం జరుగుతోందో, అతను కూడా ఈ భావంతోనే దాన్ని ఆహ్వానించాల్సి ఉంటుంది.

అప్రధాన విషయాలకంటే మూలసిద్ధాంతంపైన్నే దృష్టిపెట్టడం

మన సందేశ ప్రచార విధానోద్దేశ్యం ఏమిటంటే, ఏది ముందు అవసరమౌ తుందో దాన్నే ముందుగా తీసుకోవడం. ఏ అంశం ఎంత ప్రాధాన్యమైనదో దాని గురించి అంతే ప్రధానంగా ఆలోచించవలసి ఉంటుంది. దానిపైన్నే అధిక శ్రద్ధ చూపవలసి ఉంటుంది. అలాగే, ధార్మిక ప్రాముఖ్యత ఎంత తక్కువగా ఉంటుందో ఆ విషయంపై ఆ తరువాతనే దృష్టి సారించవలసి ఉంటుంది. అలాంటి అంశం ప్రాధాన్యతను మరీ అంత ఎక్కువగా చేసి చూపకూడదు.

గుర్తించవలసిన మరో విషయం ఏమిటంటే, శాఖలు, ఉపశాఖలకు సంబం ధించిన విషయాలను వేరువేరుగా చర్చించే బదులు అసలు మూల సిద్ధాంతం గురించే ఆలోచించాలి. దాన్ని సంస్కరిస్తే శాఖలు, ఉపశాఖలు సహజంగా వాటంతట అవే సంస్కరించబడతాయి. ఉదాహరణకు అగ్ని ప్రమాదంలో ఏ ఇల్లయినా దగ్ధమైపోతూ, దూలాలు, వాసాలు, చెక్కలు వగైరా కాలి క్రిందబడిపోతున్నాయి అను కోండి. అలాంటి సందర్భంలో ఒక్కో దూలం లేదా వాసాన్ని పడిపోకుండా అడ్డుకోవ డానికి వేరువేరుగా ప్రయత్నించడం జరుగదు. పైగా, ఒకే విధానం ద్వారా ఆ అగ్నిని ఆపే ప్రయత్నం జరుగుతుంది. లేదా మరో విధంగా చెప్పాలంటే, ఒకరి రక్తం పూర్తిగా చెడిపోయి అతని శరీరంపై అన్నిచోట్ల పుండ్లు, కురుపులు ఏర్పడ్డాయనుకోండి. అప్పుడు ఒక్కో పుండుకు మందు రాయడానికి బదులు, అసలు రక్తాన్నే శుద్ధి చేసే ప్రయత్నం జరగాలి. ఈ సూత్రం ఆధారంగానే మన సందేశ ప్రచారకులు స్థానిక పరిస్థితుల గురించి ఆలోచించి ప్రజలు చిక్కుకున్న ఆ రుగ్మతలకు అసలు కారణం ఏదై ఉంటుంది అని తెలుసుకోవడం ముఖ్యం. యే చర్య తీసుకున్నా ఆ అసలు మూలాన్ని దూరం చేయడానికే తీసుకోవాలి. ఈ కార్యంలో, ఆ రుగ్మతల శాఖోపశాఖ లను చూసి ఏ మాత్రం భయభీతులు కానవసరం లేదు. అలాగే సత్కార్యాలను పెంపొందించడం కూడా అవసరం. దాని మూలం ఏదో తెలుసుకునే ప్రయత్నమూ చేయాలి. దాన్ని పెంచిపోషించడానికి సమస్త శక్తిసామర్థ్యాలను ధారపోయాలి. ఈ మూలమే గనక దృఢంగా వేళ్ళూనుకొనిపోతే ఆ తరువాత ఆకులు, పూలు, పండ్లు తమంతట తామే సాక్షాత్కరిస్తాయి.

జమాఅత్ పూర్తి సాహిత్యం ఈ సిద్ధాంతం లేదా ఈ సూత్రాన్ని దృష్టిలో ఉంచుకునే రచించడం జరిగింది. ఇందులో మౌలిక విషయాల పటిష్ఠత కోసం బలమైన ఆధారాలు చూపెట్టడం జరిగింది. కాని శాఖలను సాధారణంగా స్పృశించడం జరుగలేదు. శాఖలను కత్తిరించడం లేదా వాటిని ఒక్కొక్కటిగా యేరి నరికివేసే బదులు మూలం మరియు కాండం వైపుకే దృష్టిని సారింపజేయడం జరిగింది. మీరు ముస్లిముల జీవన సౌధపు చెరిగిపోతున్న నగిషీలు, అందాలవైపుకు అతిగా దృష్టిని సారించే బదులు

దాని పునాదుల గురించి ఆలోచించండి. అలా జరుగని పక్షంలో ఆ కుడ్యాల అందాలు మరింత పెరిగిపోయినప్పటికీ, ఆ అందచందాలు తమ ప్రాభవాన్ని పూర్తిగా సంతరించుకోక మునుపే ఆ కట్టడం నేల మట్టమైపోవడాన్ని చూడగలరు.

మన నోట సంస్కరణకు సంబంధించిన ఏ మాట వెలువడినా అది కేవలం చిన్న చిన్న రుగ్మతల వైపుకే మళ్ళుతోంది. ప్రతి సంస్కరణాస్త్రం పాత పద్ధతి వైపుకే మళ్ళిపోతోంది. కాని ఆ చిలువలు, పలవలపై దాడి చేయడం వలన మనం మన లక్ష్యసాధనలో కృతకృత్యులం కాలేము. ఈ మార్గం వాదోపవాదాలు, ప్రదర్శనలగుండా వెళ్ళేమార్గం. ఈ తీరుగా పనిజేస్తూ పోతూవుంటే, అనవసరమైన ఉద్రేకాలు రగులు కుంటాయి. మనసును బాధించే రకరకాల 'వహ్హాబీ', 'బిద్అతీ' లాంటి పదాలు దొర్లుతూపోతుండడమే కాకుండా తలలు పగులగొట్టుకునే సంఘటనలూ చోటు చేసుకోగలవు. ఇలాంటి ప్రచార విధానాన్ని పునరావృతం కాకుండా జాగ్రత్తపడండి.

లోతుగా పరిశీలిస్తే, ఈ సకల రుగ్మతలు దైవ ఏకత్వ భావనను అర్థం చేసుకోక పోవడం వల్లనే ఉత్పన్నమౌతాయనే విషయం తెలియకపోవడం వల్లనో లేదా దైవదౌత్యపు సత్యాన్ని తెలుసుకొనకపోవడం వల్లనో లేదా పరలోకంపై ఉండవలసిన విశ్వాసాన్ని గుర్తించకపోవడం వల్లనో ఉద్భవిస్తాయన్న యదార్థాన్ని తెలుసుకోగలరు. దానికితోడు కొన్ని రుగ్మతలు ధర్మం మూలం ఏదో, దాని శాఖలేవో తెలుసుకోక పోవడం వలన, ఇంకా వాటిని తారుమారు చేయడం వలన ఉద్భవించేవి. అదేకాకుండా కొన్ని కారణాలు దైవగ్రంథం మరియు ప్రవక్త సంప్రదాయాలతో సంబంధాలు ఏర్పర్చుకోకపోవడం కూడా. ఇవన్నీ అజ్ఞానుల్లోనే ఉన్నాయని అనుకోవడం పొరపాటే. చాలామంది ఉలమాల్లోనూ నేరుగా వాటి గురించిన లోతైన జ్ఞానం కరువైపోయింది. మనమే గనక ఈ పరిస్థితిని మార్చివేయాలనుకుంటే, సంస్కరణ కార్యక్రమాన్ని వాటి పునాదుల (మూలాల) నుండి ప్రారంభించి పైకి తీసుకొనిపోవలసి ఉంటుంది. అయితే, ఒక మూలాన్నే తీసుకొని దాని శాఖలను ఉపేక్షించడం లేదా వాటి పూర్తి స్వేచ్ఛను ఇవ్వడం జరిగింది అన్నది నా భావం అసలేకాదు. ప్రారంభంలోనే అప్రధాన విషయాలపై ఎక్కువగా దృష్టిని కేంద్రీకరించకూడదు అన్నదే నా మనోగతం.

అతి తక్కువ మంది మాత్రమే తమ దురలవాట్లు, దురుసుతనం కారణంగా రుగ్మతలకు కొమ్ముకాస్తారన్నది నిరాకరించలేని నిజం. సామాన్య ప్రజలు పాపం కేవలం తమ అజ్ఞానం వల్ల దారి తప్పి ఉన్నారు. ఎప్పటి నుండో వారికి బోధింప బడుతూ వచ్చిన తప్పుడు ప్రబోధనలు, గరపబడుతూ వచ్చిన తప్పుడు శిక్షణ, ఇప్పటివరకు వారు అవలంబిస్తూ వచ్చిందే అసలు సిసలైన ధర్మం అనే భావన వారి మనోమస్తిష్కాల్లో వేళ్ళూనుకునిపోయేటట్లు చేసింది. ఇలాంటి అమాయకుల సంస్కరణ కేవలం సహనాన్ని, సంయమనాన్ని ప్రదర్శిస్తూ అంచెలవారీగా దైవ ఏకత్వం, దైవదౌత్యం మరియు పరలోక చింతనకు సంబంధించిన ఇస్లామీయ భావనలను

వారి మనస్సుల్లో వేళ్ళూనుకొని పోయేటట్లు చేయడం వలననే సాధ్యం కాగలదు. వారి విశ్వాసాల సంస్కరణలో మనమేగనక కృతకృత్యులం కాగలిగితే, ఇంకే వ్యతిరేకి కూడా 'వహ్హాబీ, వహ్హాబీ', అనే పదాన్ని వల్లిస్తూ వారిని సమీకరించుకోజాలడు. పైగా తానే స్వయంగా వెనక్కు తగ్గి పలాయనం చిత్తగించగలడు.

అరేబియాలో వచ్చిన ఆ విప్లవం ఎలాంటిదో మీరే గనక నిశితంగా ఆలోచించి చూస్తే దాని యదార్థం ఎలాంటిదో తేటతెల్లం అయిపోతుంది. ప్రవక్త మహనీయులు (స) వారి సందేశాన్ని తిరస్కరించేవారిలో కేవలం ఒక వర్గమే తమ స్వప్రయోజనాల కోసం ఆయన్ను విరోధించడం జరిగింది. తక్కిన వారంతా మోసానికి గురై వారి అడుగులకు మడుగులొత్తేవారే. ఉద్యమం విస్తరించి, సత్యం పూర్తిగా వారి ముందుకు వచ్చినప్పుడు, నిస్వార్థులైన సత్యపిపాసులకు ఆయన్ను (స) తిరస్కరించే మార్గం ఏదీ అగుపడలేదు. అరేబియా సామాన్య ప్రజానీకం అంతా సత్యం ముందు తలవంచేసింది. చివరికి తేలిన ఫలితం ఏమిటంటే, ఎవరైతే తమ స్వార్థప్రయోజనాల కోసం ఆయన (స)తో పోరాడుతూ వచ్చారో వారు పూర్తిగా ఏకాకులైపోవడం జరిగింది. కాబట్టే వారు కూడా ఆయన ముందు తలవంచకుండా ఉండలేకపోయారు. నేడు కూడా సత్యధర్మ ప్రచార విజయానికి గల మార్గం ఏమిటంటే, యదార్థాన్ని మీరు ప్రజల ముందుకు ఉన్నది ఉన్నట్లుగా తీసుకురావడం. అప్పటివరకు స్వార్థపరులైన నాయకుల మాయాజాలంలో పడి మోసానికి గురై ఉన్నవారు ఆ మాయాజాలం నుండి బయటపడిపోయి తమతమ నాయకులను వదిలేసి మీతో వచ్చి చేరిపోతారు. అదే కాకుండా, తమ స్వార్థం కోసం మీకు అడ్డుగా నిలిచేవారంతా చేసేది లేక నడుస్తున్న మన రైలుబండిని మాత్రం నిలువరించలేనంత అసహాయకులుగా మిగిలిపోగలరు.

ఈ ప్రణాళికనే మీరు అమలు చేయవలసివస్తే, మీలో ఉన్న 'ఆమీన్ బిల్ జహ్ర్' (ఆమీన్ అని బిగ్గరగా పలకడం), తేజాలు 'ఖుల్' లాంటి వివాదాలను అంతం చేయండి. దైవప్రవక్త (స) వారు ఒక్క ఈ రుగ్మతల్ని సంస్కరించడానికే ప్రభవించారా? ఇస్లాం ధ్యేయం పూర్తిగా అదేనా? దివ్యఖుర్ఆన్ బోధనలు మన నుండి కోరేది అదేనా? కొంత ఆలోచించండి! కాదు, అలాంటివేవీ కానప్పుడు, ప్రతి కాలంలోనూ దైవప్రవక్తలు తమ విరోధుల హింసలకు ఎందుకు బలౌతూ వచ్చారో ఆ విషయం వైపుకు మీ దృష్టి ఎందుకు పోవడం లేదు? నేడు ప్రాధాన్యతను సంతరించుకొని ఉన్న ఈ ఉపవిషయాలు ధర్మ సంస్థాపనా కార్యంలో ఎలాంటి ప్రాముఖ్యత పొందలేదు. మీరు ఆలోచించవలసిందల్లా ప్రజలు దైవధర్మాన్ని అయిచ్ఛికంగానే గుర్తించి, ప్రవక్త (స) వారి సంప్రదాయాలను సంతోషంగా విధేయించడానికి ముందుకు రావడం గురించి. ఇదే గనక జరిగితే, దైవగ్రంథం మరియు ప్రవక్త (స) వారి సంప్రదాయం ద్వారా ఏ విషయం అయితే రూఢీ అయింది అని తలిచే ప్రతి వ్యక్తి

దాన్నే అవలంబించే ప్రయత్నం చేస్తాడు. మరే విషయం అయితే వాటికి విరుద్ధం అని తెలుస్తుందో దాన్ని త్యజిస్తాడు. దృష్టి సారించవలసిందల్లా ఆ ఒక్క మౌలిక సంస్కరణపైన్నే. చెయ్యవలసిన ఏ పనుల వైపునకు నడిచే క్రమం అయితే మనకు ప్రవక్త (స) వారి పవిత్ర జీవితంలో కానవస్తోందో దాన్ని విస్మరించి కేవలం హదీసు గ్రంథాలను అనుసరించడం ప్రారంభిస్తే అది హదీసు గ్రంథాలను అనుసరించడం మాత్రమే అవుతుంది. ప్రవక్త మహనీయుని జీవితమార్గాన్ని అనుసరించడం కానేకాదు.

ఇస్లామ్ రాకకుపూర్వం అరేబియాలో నెలకొని ఉండిన రుగ్మతలు నేడు మనకాలంలో ఉన్న రుగ్మతలకు ఏమాత్రం తీసిపోవు. మరి ఆ రుగ్మతలన్నిటిపై ఒకేసారి వ్రేటు వేయడం జరిగిందా? సంస్కరణలన్నిటినీ ఒకే ఒకసారిగా అమలు చేయడం జరిగిందా? అలా జరుగలేదు. పైగా సంస్కరణా పునాదులను వేసి ఆ తరువాతనే నైతికతలను బోధించడం జరిగింది. ఆ పిదప జీవితం అనే చొక్కా చెరగు నుండి ఒక్కొక్క మరకను కడిగే పని క్రమంగా చేబట్టడం జరిగింది. ఆ క్రమం ఎన్నో సంవత్సరాల వరకు కొనసాగింది. మీరే గనక దైవప్రవక్త(స) వారిని అనుసరించదలుచు కుంటే, మొదట ఆయన(స) విధానాన్ని బాగా అర్థం చేసుకోండి. ఆ తరువాతే అడుగు ముందుకు వేయండి.

(రూదాద్ జమాఅతె ఇస్లామీ హింద్ (ఉర్దూ) రెండవ భాగం పుట:73-79)

మనం ఎవరికీ విరోధులం కాము

ఈ సందర్భంగా, ఇతర జమాఅత్‌ల అనుయాలకు అర్థమయ్యేటట్లు మనం చెప్పవలసిన విషయం ఏమిటంటే, మేము మా వైఖరి ద్వారాగాని, మా మాటల తీరు ద్వారాగాని ఎలాంటి సంస్థాపరమైన వివాదాలను రెచ్చగొట్టేవారము కాము అని, కేవలం రుగ్మతల మూలాలను మాత్రమే నిర్మూలించదలిచామని, మా సంబోధన పూర్తిగా సత్యాన్ని తిరస్కరించే మానవాళికోసమే అన్నది. మనం ఈ విషయాన్ని వారికి అర్థమయ్యే రీతిలో విడమర్చి చెప్పగలిగితే, ముఖ్యంగా వారికి మనకు నడుమ ఎలాంటి వివాదం ఏర్పడదు. మొత్తానికి మీ వైఖరి ద్వారా, మీరు ఆ సంస్థకు వ్యతిరేకంగా మసలుకుంటున్నారనే అనుమానాన్ని కలిగించే అవకాశం ఇవ్వకూడదు. మనం కేవలం దైవతిరస్కార వ్యవస్థ మరియు అజ్ఞానానికి మాత్రమే విరోధులం. దాన్నే ఎదుర్కోవలసి ఉంది. ఆ వ్యవస్థకు ఎవరు ఎంత మట్టుకు సంబంధాలను కలిగి ఉంటారో ఆ దామాషా ప్రకారమే మనం వారికి విరోధులం.

(రుదాద్ జమాఅతె ఇస్లామీ హింద్ రెండవ భాగం- పుట:79,80)

మీరు చేయదలుచుకున్న పని వివేకంతో చేయండి. అదే కరువైతే మీరు చేసే పని చక్కబడే బదులు చెడిపోగలదు. ప్రతి వ్యక్తి తనకు సంబంధించిన కార్య రంగాన్నే ఎంచుకొని ప్రజలపై తన దృష్టిని కేంద్రీకరించవలసి ఉంటుంది. ఎందుకంటే,

అతను అన్నిటికంటే దానికొరకే తగినవాడు కాబట్టి. కాలేజీ పట్టా పుచ్చుకొని బయటకు వచ్చిన యువకుడు ఈ సందేశ ప్రచారాన్ని ఉలమాల వద్దకు వెడితే, అతను తనపై, జమాఅతె ఇస్లామీపై కొన్ని ఫత్వాలు జారీ చేయించడం కంటే మరేదీ చేయలేడు. అలాగే ఓ పాతకాలపు తరహా ఆలిమ్ కాలేజీల్లో, యూనివర్శిటీల్లో సందేశప్రచారం చేయడానికి ప్రయత్నం చేస్తే బహుశా అతను అక్కడి విద్యార్థులను ధర్మానికి దూరం చేయడం కన్నా మరే సేవ చేయజాలడు. ప్రతి వ్యక్తి తనకు సంబంధించిన పరిధిలోనే పనిచేయాలి. దానికొరకే అతను సమర్థుడు కూడా. ఏ కార్యకర్త అయితే పల్లె ప్రజలతో మాట్లాడే సామర్థ్యాన్ని కలిగి ఉంటాడో అతను పల్లెలకు పోయి వారికి సందేశాన్ని అందించాలి. కార్మికులకు నచ్చజెప్పే సామర్థ్యం కలవారు కార్మికుల్లో పనిచేయాలి. ఈ పనిని చేసేవారు తమలో ఓ వైద్యుడు మరియు డాక్టరు ప్రత్యేకతలను పెంచి పోషించుకోవలసి ఉంటుంది. మొదట ఎదుటివారి మనోగతాలు, వారి మానసిక పరిస్థితి, ఆలోచనలను అర్థం చేసుకొనే ప్రయత్నం చేయాలి. దానికి అనుగుణంగానే వారితో మాట్లాడాలి. అలాగే వారి పరిస్థితులకు తగిన సాహిత్యాన్నే చదవడానికి వారికి ఇవ్వవలసి ఉంటుంది.

వాదోపవాదాలకు, ఖండనలకు, వివాదాలకు అన్ని పరిస్థితులలోనూ దూరంగా ఉండండి. దీనివల్ల ఎలాంటి సంస్కరణ జరగకపోగా చెడు అధికంగా జరుగుతోంది. ఎదుట వారు మిమ్మల్ని వాదోపవాదాలకు దింపదలిచినా మీరు మాత్రం వాటిలో చిక్కుకోకూడదు. ఎదుటివాడు మీతో వివాదానికి దిగడానికే నిర్ణయించుకున్నాడని తెలుసుకోగానే అతణ్ణి అతని మానాన వదిలివేయండి. మరో సమయంలో అతను సానుకూలంగా మీ మాటను వినడానికిగాని, అతని మాట చెప్పడానికిగాని ఉద్యుక్తుడైతే అతనితో మాట్లాడాలి. మరెవరిలోనైతే మీకు వ్యతిరేకభావం, మొండితనం అగుపడు తుందో అతని వెంటపడకండి. ప్రతి ఒక్కడిని బాగుచేసే బాధ్యత మీపై ఏదీ లేదు. సత్యాన్ని వినడానికి, దాన్ని స్వీకరించడానికి సిద్ధంగా ఉన్న దైవదాసులపైన్నే మీదృష్టిని కేంద్రీకరించండి. (తూర్పు పాకిస్తాన్ పరిస్థితులు మరియు సమస్యల సమీక్ష మరియు సంస్కరణ-పుట:33 నుండి 34 వరకు)

వ్యతిరేకతలో అవలంబించవలసిన వైఖరి

తీవ్రమైన వ్యతిరేకతకు జవాబుగా మీరు అల్లాహ్ నిర్ణయించిన హద్దులను, పరిమితులను మాత్రం దాటకండి. మీ నోటి ద్వారాగాని, మీ కలం ద్వారాగాని బయటవెడలే ప్రతి పదాన్ని, మీ నోట అది సత్యానికి విరుద్ధమైనదేమీ కాదు కదా? దానికి సంజాయిషీ దైవానికి ఇవ్వగలమా? అని బాగా ఆలోచించి ఆచితూచి వెలువ రించండి. మీ వ్యతిరేకులు దైవానికి భయపడినా భయపడకపోయినా- అన్ని సందర్భా ల్లోనూ మీరు మాత్రం ఆయనకు భయపడుతూ ఉండండి.

అధ్యాయం-4

సందేశ ప్రచారకుడు - అతని గుణగణాలు

ముందుమాట

- సయ్యద్ అసఅద్ గీలానీ

సందేశ ప్రచారకుడు ఈ భూమ్మీద అందరికంటే బాధ్యతాయుతమైన విశ్వ యదార్థాన్ని తెలుసుకున్న వ్యక్తి. తాను తెలుసుకున్న ఈ యదార్థాన్ని గుర్తించమని మానవాళిని పిలిచేవాడు. సత్యసందేశాన్ని విస్తరింపజేయడానికి అతను స్థాపించుకున్న ఇస్లామియోద్యమం ఇస్లామ్ సందేశ ప్రచార ధ్వజవాహిక. ఓ సందేశ ప్రచారకుడు సత్యం వైపుకు ఆహ్వానించడమంటే అతను అల్లాహ్ దాస్యం వైపునకు ఆహ్వానించడమే. ఎందుకంటే, విశ్వ సృష్టికర్త, యజమాని, ప్రభువు, పోషకుడు ఆయనే అనేది పెద్ద యదార్థం. దాస్యం మరియు ఆరాధనలకు అర్హుడు ఆయనే. దాసుడు తన యజమాని మరియు ప్రభువుకు దాస్యం చేయడమే ఆయనతో గల తన నిజమైన సంబంధం. అందుకే ఈ విషయాన్ని అల్లాహ్‌యే తన గ్రంథం అయిన దివ్యఖుర్‌ఆన్‌లో ఇలా సెలవిచ్చాడు:

وَمَا خَلَقْتُ الْجِنَّ وَالْإِنْسَ إِلَّا لِيَعْبُدُونِ ۝

"మేము మానవులను, జిన్నులను మా దాస్యం మరియు విధేయత కొరకే పుట్టించాము." (ఖుర్‌ఆన్)

కాబట్టి మానవ జీవితంలోని సమస్త కార్యకలాపాల్లో అన్నిటికంటే గొప్పదైన, ప్రధానమైన కార్యం విశ్వాన్ని సృష్టించిన సృష్టికర్తకు విధేయుడై ఆయన్ను ఆరాధించడమే. అలాగే, మానవుడు చేసే ఘనకార్యాల్లోకెల్లా గొప్పదైన ఘనకార్యం కూడా ప్రపంచ మానవాళినంతటిని ఆ యజమాని, ప్రభువు యొక్క విధేయత వైపునకు, ఆయన దాస్యం వైపునకు ఆహ్వానించడమే. ప్రపంచ మానవాళినంతటిలో, దైవదాస్యం వైపునకు ఆహ్వానించిన పరమ పవిత్రమైన, గౌరవనీయమైన వర్గం దైవప్రవక్తల వర్గం ఒక్కటే. ఆ వర్గానికి చెందిన వ్యక్తులు తమ తమ కాలాల్లో తమ తమ జాతులల్లో నిరంతరంగా, నిర్విరామంగా ప్రభవిస్తూ మానవాళినంతటినీ ఒకే ఒక విషయం వైపుకు మాటిమటికి పిలుస్తూ ఉండేవారు.

يَا قَوْمِ اعْبُدُوا اللَّهَ مَا لَكُم مِّنْ إِلَٰهٍ غَيْرُهُ

"ఓ జాతి ప్రజలారా! అల్లాహ్ దాస్యమే చేయండి, ఆయన తప్ప మీకు మరే ఆరాధ్యుడులేడు." అన్నదే ఆ పిలుపు.

ఇలా మానవులందరిలోనూ అందరికంటే గౌరవనీయమైన, నమ్మకమైన వర్గం ఇదొక్కటే. దైవప్రవక్తల ఉద్యమంలో కేంద్ర బిందువు మానవాళిని దైవదాస్యం వైపుకు ఆహ్వానించడం. ఎందుకంటే, మనిషి దేవునికి దాసుడు మరియు విధేయుడు అయినందున మానవులు ఈ యదార్థాన్ని ఒప్పుకోవడం పరమ యదార్థాన్ని ఒప్పుకోవడమే అవుతుంది గనక. ఆ ప్రవక్తల అనుచరులు లేదా వారి మార్గాన్ని అనుసరించే పుణ్య పురుషులు కూడా తమ తమ కాలాల్లో ప్రజలకు ఈ యదార్థాన్నే బోధిస్తూ వచ్చారు. అందువలన మనం, దైవం దృష్టిలో, మానవ శ్రేయం మరియు మార్గదర్శకత్వానికి సంబంధించిన అత్యున్నతమైన కార్యం మానవాళిని దైవదాస్యం వైపుకు పిలువడమే అని చెప్పగలం. శాస్త్రీయ అవిష్కరణలు, యంత్ర నిర్మాణాలు, మానవ వెసులుబాట్లు, రిక్తహస్తులు, ఆ పనులను ఆదుకోవడంలాంటి సామాజికి కార్యకలాపాలు, విద్యా ప్రజాసంక్షేమ సంస్థలు వగైరాలన్నీ ఈ ధర్మప్రచార కార్యం ముందు దిగదుడుపే. అవన్నీ రెండవశ్రేణికి చెందినవి. దైవం దృష్టిలో అత్యున్నతమైనది, ఇహపరలోకాల్లో మానవశ్రేయం, సంక్షేమానికి సంబంధించినదీ అయిన మహోన్నత కార్యం మటుకు, దైవదాసుల్ని దైవం వైపునకు మరలేటట్లు చేయడం. కాబట్టి ఈ కార్యం కోసం అత్యుత్తమమైన శక్తిసామర్థ్యాలుగల వ్యక్తులు కావాలి. అలాగే భౌతికమైన ఇతర కార్యాల్లో నిమగ్నమైవున్న వారు ఈ కార్యక్రమంలో తమ వంతు కృషి చేస్తూ తమ దైవదాస్య విధిని నెరవేర్చవలసి ఉంటుంది. అయితే ప్రతి పనిని చేయడానికి ఓ ప్రత్యేకమైన సామర్థ్యం ఎలా అవసరమౌతుందో అలాగే దైవదాస్యం వైపునకు పిలువడానికి కూడా ఓ ప్రత్యేక సామర్థ్యం మరియు శిక్షణలు అవసరమవుతాయి. దైవప్రవక్తలను ఆ మార్గాన తీర్చిదిద్దే పని దైవమే స్వతహాగా తన ప్రత్యేకమైన వనరుల ద్వారా తానే నిర్వహిస్తాడు. ప్రవక్తలకు శిక్షణ గరిపే విధానం కూడా వైవిధ్యాన్ని సంతరించుకొని ఉంది. ఒక్కోసారి ఆయన అంతర్గతంగా, బాహ్యంగానూ వారిలో దాగివున్న సూచనలను చూపెట్టి వారికి శిక్షణ గరిపితే, మరొక్కప్పుడు ఒకరిని మేకలు కాయించడం ద్వారా తీర్చిదిద్దడం జరిగింది. ఇంకొక్కప్పుడు ఒకరిని ఫిర్ఔను ఇంటనే ఉంచి పెంచిపోషించి పెద్దజేస్తే, ఇంకొకరిని నుయ్యి, జైలు మార్గాల ద్వారా నడిపి రాజసింహాసనాన్నే అధిష్టింపజేసి శిక్షణలను ఒసగడం జరిగింది. ఇంకో ప్రవక్తను గుహ, హిజ్రత్ దశలను అధిగమింపజేయించి ఇస్లామీ వ్యవస్థను స్థాపించేటట్టు శిక్షణను గరపడం జరిగింది. అయితే ప్రవక్తల తరువాత ఎవరైనా ఆ కార్యాన్ని

నిర్వర్తించదలిస్తే ఆ వ్యక్తి తనలో ఓ ప్రత్యేకమైన సామర్థ్యాన్ని పెంపొం దించుకోవడానికి ఓ ప్రత్యేకమైన శిక్షణ పొందవలసి ఉంటుంది. ఈ శిక్షణ విజ్ఞానానికి సంబంధించిన శిక్షణ మరియు కార్యాచరణకు సంబంధించిన శిక్షణ కూడా. అది లేకుండా ధర్మప్రచార కార్యం సవ్యంగా నిర్వర్తించడం సాధ్యం కాదు. ఇస్లామీయ ఉద్యమం ఈ రెండు రకాల సామర్థ్యాలు కలిగిన వ్యక్తుల్ని తయారు చేస్తుంది.

పరిజ్ఞానానికి సంబంధించిన సామర్థ్యం

యే వ్యక్తికైనా, సత్యం ఏమిటో, దాని ప్రమాణాలేవో, దాని గుర్తింపేదో, దాని స్వరూప స్వభావాలేవో, దాని పరిమితులెంతవరకో తెలియకపోతే మరియు అతనికి ఆ సత్యం, యే విషయాలను వారిస్తోంది మరే విషయాలను ఆదేశిస్తోంది అని గ్రహించే శక్తిలేకపోతే, తాను ఆ సత్యమేమిటో తెలుసుకోవడం గాని, ఇతరులకు, తాను చెప్పేది సత్యమే అని నమ్మేటట్లు చేయడంగాని సాధ్యం అయ్యే పనికాదు. అతను తాను సత్యం తప్ప మరేది బోధించడం లేదు అన్న విషయాన్ని ఇతరులకు చెప్పే స్థితిలో ఉండడు. కాబట్టి ధర్మప్రచారం కోసం సత్యపిపాస, సత్యపరిజ్ఞానం సత్యాన్ని తెలుసుకునే తపన, సత్యానికి సంబంధించిన సమస్త సుగుణాలు అన్నీ అవసరమవుతాయి. ఏ వ్యక్తి అయితే సందేశ ప్రచార కార్యాన్ని నిర్వర్తించదలుచుకుంటాడో అతను తనలో కొన్ని సామర్థ్యాలను పెంచిపోషించుకోవలసి ఉంటుంది.

అంతరాత్మ జాగరూకత

ఓ సందేశ ప్రచారకుడు తన కార్యాన్ని ప్రారంభించగానే గుర్తించవలసిన విషయం ఏమిటంటే తాను యే ధర్మసందేశాన్నయితే బోధించదలుచుకున్నాడో దాన్ని పూర్తిగా తన వ్యక్తిగత జీవితంలో ఆచరించి చూపుతున్నాడా లేదా అన్నది. ఈ మెళుకువ, ఈ భావన లేకపోతే తాను ఆ కార్యాన్ని నిర్వర్తించజాలడు. కారణం ఏమిటంటే, అతను బోధిస్తున్న ఆ ధర్మం మొట్టమొదటగా కోరేది ఆ అంశాన్నే. ఒకవేళ అతను ఆ ధర్మం కోరుతున్న డిమాండును పూరించని పక్షంలో, ఏ యే కోణాల్లోనైతే తాను ఆ డిమాండును పూరించడం లేదో ఎదుటి వాడు కూడా ఆ కోణాల్లోనే అతని పిలుపును ఖాతరు చేయడు. అందుకని అతను సత్యం త్రాసులో ముందు తనను తాను తూచుకోవలసి ఉంటుంది. ఆ లోపాన్ని సరిదిద్దుకోవడానికి తనవంతు కృషి చేయాలి. తన వ్యక్తిత్వాన్ని పరికించడం, ఆత్మపరిశీలన, అంతరాత్మ ఎదుట తనను నిలబెట్టి తన బరువెంతో తూచి తెలుసుకోవడమే దానికి నాంది. ఇది అచ్చం జిహాదుకు వెళ్ళేటప్పుడు ఆయుధాలను సరిచూసుకోవడం లాంటిది. మొత్తానికి ఈ కార్యం కోసం ఓ జాగృతమైన మనస్సాక్షి అవసరం. ఆ జాగృత మనస్సాక్షి గుర్తింపు ఏమిటంటే అతనికి ప్రతి సత్కార్యం చేసేటప్పుడు ఆనందం కలగడం, యేదైనా తప్పుదొరలిపోతే దానికి పశ్చాత్తాపం చెందడం.

హజ్రత్ ఉమర్ (ర), తమ సోదరి ఫాతిమా (ర)ను కొట్టి హింసించిన సంఘటన ఆయనలో గ్రాహ్యతను, వివేకాన్ని సృష్టించింది. తన అన్న అయిన ఉమర్(ర) గారి వైఖరికి తన జీవితంలో ఎన్నడూ మారుమాట్లాడని ఆ బలహీనురాలైన చెల్లెలు, ఓ స్వచ్ఛమైన ధర్మం విషయంలో ఆయనకు ఎదురు చెప్పింది. అలా కేవలం ఎదురు చెప్పడమేకాదు, "ఉమర్! నీవు ఏం చేయదలుచుకున్నావో చేసుకో, ఇప్పుడు మా మనస్సుల్లో నుండి ఇస్లామ్ ధర్మాన్ని ఏ మాత్రం తొలిగించలేవు" అని తెగేసి చెప్పేసింది. ఆ పట్టుదలతో కూడిన ఆమె ఆ మాట, ఓడిపోని ఆమె ఆ వైఖరి ఉమర్ (ర) వారి హృదయంలో ఓ మేల్కొలుపు ప్రేరణకు కారణభూతం అయింది. ఆయనలో 'ఉమర్ ఫారూఖ్' మేల్కొన్నాడు. ఇస్లాంలో ఏదో ప్రత్యేకత ఉండబట్టే బేల అయిన చెల్లి తనను ఎదురు తిరిగి లెక్కచేయనంత శక్తిమంతురాలైంది అని భావించారు. ఈ ధైర్యసాహసాలతో కూడిన ఆమె పలుకులు ఆయనలో సత్యాన్ని స్వీకరించేందుకు పురికొల్పాయి.

ఇదేకాదు ప్రతి వ్యక్తి, దైవప్రవక్త (స) వారు సెలవిచ్చినట్లుగా అయిదు అంశాలపై దృష్టిని సారించి తన అంతరాత్మను పరిశీలించుకోవాల్సి ఉంటుంది. వాటికి సంబంధించిన ప్రవక్త (స) ప్రవచనం ఇలా ఉంది:

1. తన వయస్సును ఏ కార్యకలాపాల్లో వెచ్చిస్తున్నాడు?
2. తన విజ్ఞానాన్ని యే ధ్యేయానికి వినియోగిస్తున్నాడు?
3. తన శారీరక, మానసిక సామర్థ్యాలు ఎక్కడ వెచ్చింపబడుతున్నాయి?
4. తన ఆదాయాన్ని ఏ యే చోట్ల నుండి కూడగడ్తున్నాడు?
5. దాన్ని ఏ యే మార్గాల్లో వెచ్చిస్తున్నాడు? వాటిలో దైవ భాగం ఎంత?

పైన చెప్పిన అంశాలను తరచిచూడడం, విశ్లేషించుకోవడమే మనిషి తనలోని చిత్తశుద్ధిని, దైవభీతిని మరయు ధర్మం కోసం పనిచేసే పట్టుదలను ప్రేరేపించగలవు; దైవమార్గంలో, దైవసందేశాన్ని చేరవేసే కార్యక్రమంలో అతణ్ణి తీర్చిదిద్దగలవు.

సంకల్పశుద్ధి

విషయాన్ని అర్థం చేసుకునే గ్రాహ్యత జాగృతం అయిన తరువాత, అల్లాహ్ ధర్మం కోసం పనిచేసే సంకల్పం మరియు పట్టుదలకు సంబంధించిన సమస్య ఉత్పన్నమవుతుంది. మనిషి సంకల్పించి దైవధర్మం వైపునకు మరలనంతవరకు అతని మనస్సు అతని ఆలోచనలు, అతని శక్తిసామర్థ్యాలన్నిటికీ ఓ లక్ష్యం అంటూ ఉండబోదు. ఇస్లామ్ ధర్మంలో సత్యసంకల్పం అన్నది పుణ్యకార్యాల ఆచరణకంటే ముందు ఎంతో ప్రాధాన్యతను సంతరించుకున్న సమస్య. సంకల్పశుద్ధి సత్కార్యాలకు ఎంతో బలాన్ని చేకూరుస్తుంది. వాటిలో చిత్తశుద్ధిని, నిస్వార్థతను పుట్టిస్తుంది. అలాగే

ఆ పనిని సుఖాంతం చేసి మనిషిలో పట్టుదలను, ధైర్యాన్ని, సహనాన్ని పుట్టిస్తుంది. సంకల్పం లేనిదే యే సత్కార్యమైనా సంపూర్ణతను సంతరించుకోజాలదు. కాబట్టి దైవదాస్యం వైపునకు ప్రజలను పిలిచే ప్రతి విశ్వాసి, ఇది తనపై ఉన్న అల్లాహ్ హక్కని, దాన్ని నిర్వర్తించని పక్షంలో అతని దైవదాస్య విధి నెరవేరదు అనే ఓ నిర్ణయానికి రావాలి. అది ఓ సామూహిక కార్యం. దాన్ని నెరవేర్చకపోతే వ్యక్తిగత పుణ్యకార్యాల్లోనూ నిలకడగాని, స్థిమితంగాని ఏర్పడజాలవు. ఓ సందేశ ప్రచారకునిలో తాను ధర్మం గురించి తెలియని వారు మరియు మార్గం తప్పి నడుచుకుంటున్న దైవదాసుల వరకు దైవధర్మాన్ని ఏకాగ్రత చిత్తంతో చేరవేస్తారని, ఆ కార్యంలో తన మేలైన సామర్థ్యాలన్నిటిని, తన శక్తి యుక్తులను ఉత్తమమైన రీతిలో వినియోగిస్తానని, ఆ మార్గంలో వచ్చే కష్టాలను చూసి యే మాత్రం వెరబోననే భావోద్వేగాలు తప్పకుండా ఉండవలసి ఉంటుంది. ఎందుకంటే, కష్టాలు, కడగండ్లు సత్యధర్మమార్గపు చద్ది మూటలు, కష్టాలు ఈ మార్గపు దారి బత్తాలు మరియు వ్యతిరేకతలు ఈ దారిన నడిచేందుకు అవసరమైన నియమనిబంధనలు గనక. మొత్తానికి, సత్యసందేశాన్ని మోసుకొని దైవదాసుల వైపుకు నడవడమే సత్యధర్మ ప్రచారకునికి గుర్తింపు. వారి వైపు నుండి అతనికి యేదైనా వ్యతిరేకత ఎదురైనా, శాపనార్థాలు, దెబ్బలు పడినా, అతనిపై రాళ్ళు రువ్వబడినా వాటన్నిటినీ భరిస్తూ అతను ఫలితాన్ని మాత్రం తన ప్రభువుకే అప్పజెప్పేస్తాడు. ఆ కార్యంలో ఏదైనా అడ్డంకి వచ్చినప్పటికినీ అతను దాన్ని వదులుకోజాలడు.

సత్యజ్ఞాన సంపాదన

సత్యానికి సంబంధించిన జ్ఞానమే ఇస్లామ్. దాన్ని కేవలం రెండే రెండు మార్గాల ద్వారా పొందవచ్చు. అవి: 1. ఖుర్‌ఆన్, 2. సున్నత్ (ప్రవక్త (స) వారి సంప్రదాయం). మానవులకు ప్రభువు అయిన అల్లాహ్ అభీష్టమేదో దైవగ్రంథం ఖుర్‌ఆన్ ద్వారా లభిస్తుంది. ఆయన ఆ అభీష్టాన్ని నిర్వర్తించే విధానం ఆ గ్రంథాన్ని తెచ్చిన ప్రవక్త (స) వారి సచ్చరితంలో లభిస్తుంది. మన యజమాని, ప్రభువు అయిన అల్లాహ్ మనల నుండి కోరే విషయం, దాన్ని నిర్వర్తించే విధానాలు రెంటిని దైవప్రవక్త (స) వారి బోధనలను తెలుసుకోవడం మినహా మనం అర్థం చేసుకోలేము. కాబట్టి సత్య ధర్మప్రచారకుడు దివ్యఖుర్‌ఆన్‌తో సంబంధాలు పెట్టుకోవడం అనివార్యమవుతుంది. ఈ ఏకైక గ్రంథం ఒక్కటే సత్యం మరియు మార్గదర్శకం. ఇక సమస్త మార్గదర్శకత్వం అంతా ఒక్క గ్రంథంలోనే ఉంది. మరే గ్రంథంలో గాని మరే విషయంలో గాని సత్యం లేనేలేదు. మార్గదర్శనాన్ని అన్వేషించేందుకు, సత్యాన్ని అనుసరించేందుకు ప్రయత్నించే ప్రతి వ్యక్తి ఈ గ్రంథం ద్వారా ప్రయోజనం పొందడం కంటే మరేమీ చేయలేడు. ఈ భూమ్మీద మహోన్నతుడైన దైవం పిలుపు ఇదొక్కటే. ఈ పిలుపు వైపుకు అడుగు ముందుకు వేయకుండా మనిషి సాఫల్యమార్గాన్ని పొందజాలడు.

కాబట్టి దివ్య ఖుర్‌ఆన్‌ను అధ్యయనం చేయడం, అందులో గల విషయాలను అర్థం చేసుకోవడం, అది చూపే మార్గదర్శనాన్ని పండితుల సహాయంతో గ్రహించడం, దాన్ని 'హిఫ్జ్' (కంఠస్తం) చేయడం, దాన్ని తన హృదయంలో నిక్షిప్తం చేయడం, ఆ మూసలో పోయబడి దాని రూపాన్ని దాల్చే ప్రయత్నం చేయడం ఎంతో అవసరం. అదేకాకుండా, పాపవాసన కూడా సోకని ఆ పరిశుద్ధ మానవుని అడుగుజాడల్లో నడిచేందుకు కృషి సల్పవలసి ఉంది. ఎందుకంటే, దైవం కోరిన సంపూర్ణమైన ప్రమాణాలను కలిగిన పరిపూర్ణమైన వ్యక్తిత్వం ఆయనదొక్కనిదే గనక. ఎవరైనా దైవ అభీష్టాన్ని మానవ వైఖరిలో పరావర్తనం చెందడం చూడదలుచుకుంటే అతను, దాన్ని దైవప్రవక్త ముహమ్మద్ (స)వారి నడవడిక మరియు ఆయన నైతికల్లోనే చూడగలడు. అలాగే ఎవరైనా ఖుర్‌ఆన్ సంబోధనను తన చెవులారా వినదలుచుకుంటే, అతను మహాప్రవక్త ముహమ్మద్ (స)వారి ప్రవచనాలను వినవచ్చు. మొత్తానికి సత్యం మూలం ఖుర్‌ఆన్ మరియు సున్నత్‌లనేది నిర్వివాదాంశం.

సహాబా (ర)ల పవిత్ర జీవితాల మరియు సాలెహీన్ చరిత్రల అధ్యయనం

దైవాదేశాలు మరియు దైవప్రవక్త (స) వారి సంపూర్ణ జీవన తీరు యేదైనా ఉత్తమమైన మానవతా మూసలో పోయబడింది అని మనిషి చూడదలుచుకుంటే, కేవలం ప్రవక్త (స)వారి అనుచరగణం గతించిన పుణ్యపురుషుల జీవితాల్లోనే దాన్ని దర్శించవచ్చు. ఆ మహాపురుషుల నడవడి, గుణగణాలు మనకు ఆదర్శాలు. వీరు తమ జీవితాలనే దైవధర్మ ప్రచారం, దాన్ని వ్యాపింపజేయడానికే వెచ్చించారు. వారంతా సత్యసంధులు, మార్గదర్శనం పొందినవారు, సద్గుణసంపన్నులే. వారి నడవడిక ద్వారా సత్కార్యాలు ప్రస్ఫుటమయ్యేవి. చెడుగులు దూరమయ్యేవి. వారి దర్పణంలో మనకు మంచిని చేబట్టే, చెడును విడనాడే ఉత్తమమైన ప్రతిబింబాలు కానవస్తాయి. వారు సత్యం కోసం జిహాద్ చేసిన ధీరులు, సత్యం కోసం తమ ఇల్లు వాకిలిని వదిలేసిన త్యాగధనులు, సత్యం కోసమే తమ జీవితాలను అర్పించి త్యాగం చేసినవారు, సత్యం కోసమే తమ జీవిత సర్వస్వాన్ని ధారపోసినవారు. వారి చేతలద్వారా మనకు సన్మార్గంపై నడిచే స్ఫూర్తికలుగుతుంది. వారు సత్యాన్ని మనకందించినవారు, మంచి చెడులేవో తమ నడవడిక ద్వారా సృష్టీకరించడం వల్లనే ఆ యదార్థం మనకు తెలిసొచ్చింది. వారి దైవభీతి, వ్యవహార శైలి, ఆరాధనల్లోని ఏకాగ్రత, మూర్తిత్వ ఔన్నత్యం, దైవం మరియు దైవప్రవక్తల పట్ల విశ్వాసం, ధర్మం కోసం వారు చేసిన త్యాగాల ద్వారా మనకు చెరిగిపోని స్ఫూర్తి లభిస్తోంది. వారి అడుగుజాడల్లో నడిచే మనం గమ్యాన్ని చేరగలం. ఓ సందేశ ప్రచారకుడు వారి జీవితాలను అధ్యయనం చేయడం, దాన్ని కరజ్యోతిగా మలుచుకోవడం ఎంతైనా అవసరం.

దైవంతో సంబంధం

ఓ సత్యసందేశ ప్రచారకునికి, అన్నింటికంటే పటిష్టమైన 'లంగరు' తన ప్రభువుతో అతనికిగల దృఢమైన, స్థిరమైన సంబంధం. తాను చేసే పనిని ఆ అల్లాహ్ అంతా గమనిస్తున్నాడని, కానరాని ఆయన దూతలు తనకు సహాయపడుతున్నారని, వారి అండదండలు తనకున్నాయని భావిస్తూ ఉండాలి. తాను నిత్యుడు, సజీవుడు, సర్వశక్తిమంతుడు మరియు సార్వభౌముడైన అల్లాహ్‌కు కార్యకర్తనని, ఆయన తనను అడుగడుగునా ఆదుకుంటాడనే గట్టి నమ్మకాన్ని కలిగి ఉండాలి. అల్లాహ్ గోచర, అగోచర విషయాలన్నింటినిలోనూ, చీకటి వెలుగుల్లోనూ తనను రక్షిస్తున్నాడని, తనకు అండగా నిలుస్తున్నాడని, ఆయన సంపూర్ణ దైవత్వం ఎదుట ఏ ఒక్కరూ కిమ్మనలేరనే భావన అతని మనస్సులో మెదలాడుతూ ఉండాలి. ఓ సందేశ ప్రచారకుడు తాను ఎవరికీ వినబడకుండా వేడుకునే నిశ్శబ్ద వేడుకోళ్ళను కూడా ఆయన వింటాడని, తన మనస్సుల్లో ఏదో ఓ మూలన దాగి కలవరపెడుతున్న ఆందోళనలను సైతం ఆయన ఎరిగిన వాడు అని భావించాలి. అలాగే, విశ్వసించదగ్గ అతి మిన్నయైన విశ్వాసం, భయపడదగిన గొప్ప దైవభీతి, ప్రసన్నతను పొందడానికి పడే అతి మిన్నదైన తాపత్రయం, అత్యుత్తమమైన ఆరాధనాభావం, ఉండవలసిన అతి లోతైన సంబంధ బాంధవ్యాలు అన్నీ ఆ అల్లాహ్‌కే చెందుతాయి అని అనుకోవాలి. ఆయన మార్గం వైపునకు పిలిచే ప్రతి సందేశానికి ఆయనే కేంద్రం. మన కృషినంతటికి, మన త్యాగానికి, ఆయన ప్రసన్నతను పొందేందుకు చేసే ప్రతి ప్రయత్నానికి ఆయనే మూలం. మన జీవితం పూర్తిగా ఆయనను సంతుష్టునిగా చేసేందుకే; మన సర్వస్వం ఆయన కోసమే ధారపోయడానికి సిద్ధంగా ఉన్నామనే భావనను కలిగి ఉండడం అవసరం.

إِنَّ صَلَاتِي وَنُسُكِي وَمَحْيَايَ وَمَمَاتِي لِلَّهِ رَبِّ الْعَالَمِينَ ۝

(నా నమాజు, నా ఆరాధనా విధానాలు, నా జీవన్మరణాలు అన్నీ ఆ సర్వ లోకాల ప్రభువు అయిన అల్లాహ్ కొరకే)

పరులపట్లగల యే ప్రేమనైనా త్యజించే శక్తి, ఇతరులపైగల యే కోపాన్నైనా దిగమ్రింగే సామర్థ్యం అల్లాహ్ కోసమే అయి ఉండడం ప్రతి సందేశ ప్రచారకునిలో ఉండదగిన సుగుణాలు. ప్రతి నష్టాన్ని సహించే సహన గుణం, ప్రతి లాభాన్ని త్యజించే త్యాగనిరతి పూర్తిగా అల్లాహ్ కోసమే అయి ఉండాలి. అల్లాహ్‌కు శత్రువులైన వారికి తానూ శత్రువే. ఆయనకు మిత్రులైనవారికి తాను సేవకుడైపోవాలి. ఇలా తన ప్రభువు ఒక్కొక్క సుగుణాన్ని తనలో ఇముడ్చుకొని ఆయన్ను ప్రేమించడం జరగాలి, ఆయనకు సతతం భయపడుతూ ఉండాలి. ఆయన ఆదేశధిక్కారంకంటే అగ్నిలోపడి మాడిమసై పోవడమే నయం అని అనుకోవాలి. ఆయన సంస్మరణే అన్నిటికంటే ప్రియమైనదై పోవాలి. ఆయన దాస్యం కోసమే నమాజు చేయాలి. ఆయనను ప్రసన్నునిగా

చేయడానికే రోజాలు పాటించాలి. ఆయన సంతుష్టిని బడయడానికే ఆయన మార్గంలో ధనాన్ని వెచ్చించాలి. తన ప్రభువుతో సంబంధాలు మెరుగైపోతే ఓ సందేశ ప్రచారకుని ఆధ్యాత్మిక పునాదులు పటిష్టమైపోయినట్లే. అల్లాహ్‌ను విశ్వసించిన తరువాత, ఆ విశ్వాసం కోరే ప్రతి విషయం పరిపూర్ణతను సాధించినట్లే.

ప్రవక్త (స) పట్ల పూర్తి ప్రేమాభిమానాలు

అల్లాహ్ తరువాత, అనంతమైన, అపరిమితమైన ప్రేమాభిమానాలు గల వ్యక్తిత్వం, ఓ సందేశ ప్రచారకునికి దైవప్రవక్త ముహమ్మద్ (స) వారి మహోన్నతమైన వ్యక్తిత్వమే. అది అతని విశ్వాసానికి సంబంధించిన ఓ అంశం. ఎందుకంటే మానవాళిని నరకకూపంలో బడకుండా రక్షించి స్వర్గాన్ని చేరేమార్గంపైకి తెచ్చింది, వినాశనం నుండి తప్పించి శాంతివైపునకు మార్గం చూపింది, విశ్వాసం, ఇస్లామ్ మరియు దైవప్రసన్నతను ఒడిసే అవకాశాలను కల్పించినది ఆయనే గనక. అలాగే హిజ్రత్ చేసి మన కోసం దైవధిక్కార వ్యవస్థ నుండి దైవవిధేయత వైపునకు వచ్చే మార్గాన్ని సుగమం చేశారు. కుఫ్ర్ (దైవతిరస్కారం)ను ఎదుర్కొని సత్యాసత్యాల నడుమనున్న తేడాను స్పష్టం చేసిన మహా మనిషి ఆయన. ప్రళయం వరకు సమస్త మానవాళినంతటికి కారుణ్య మూర్తి, శాశ్వత మార్గదర్శి, అధినాయకుడు ఆయనే కాబట్టి.

మహనీయ ప్రవక్త ముహమ్మద్ (స) మానవాళికి సభ్యతా సంస్కారాలను నేర్పినవారు. మనిషిని క్రూరత్వం నుండి బయటకులాగి నాగరికతను నేర్పినవారు. అజ్ఞానాంధకారం నుండి తీసి మనిషికి విజ్ఞానకాంతి వైపుకు నడిపినవారు. అత్యుత్తమమైన న్యాయవ్యవస్థను అందించి మానవ సమానత్వం మరియు సోదరభావాన్ని బోధిస్తూ యజమాని మరియు బానిసల నడుమ గల తేడాను రూపుమాపినవారు. మహిళకు మహోన్నతమైన స్థానమొసగి ఆమెను మగవానికి సమానంగా ధర్మచారిణిగా, సహవర్తిగా చేసినవారు. తల్లిగా ఆమె పాదాల క్రింద స్వర్గం ఉందని చెప్పి తనయులను ఆమెకు సేవ చేసేటట్లు చేశారు. పిన్నలు పెద్దలను గౌరవించే, పెద్దలు పిన్నల పట్ల దయాక్షమాగుణాలు కలిగి ఉండే సుగుణాలను నేర్పినవారు. ఆయనకంటే కారుణ్య మూర్తి, కరుణామయుడైన మానవుడు, ఆయనకు పూర్వం ప్రపంచంలో ఎవరూ జన్మించలేదు. జన్మించబోడు కూడా. ఆయన నిలువెల్ల కారుణ్యం, దయాగుణం గలవారు. పీడితులు, అనాథలు, నిర్భాగ్యులు,నిరుపేదలు వెనుకబడిన మానవతకు సంరక్షకుడాయన. ఆయన పట్ల ప్రేమాభిమానాలు కలిగి ఉండడం ఒక్కటే మనపై ఉన్న ఆయన రుణభారం కాదు అది మన విశ్వాసంలోని ఓ భాగం కూడా. ఎవరి హృదయంలోనైతే ఆయన (స) పట్ల ప్రేమాభిమానాలుండవో అతనిలో ఏ కొంచెం కూడా విశ్వాసం లేనట్లే లెక్క. ఓ సందేశ ప్రచారకునికి ఆయన ప్రేమాభిమానాలు మార్గదర్శకం. ఆయన (స)ను అనుసరించడం నిలకడ, పట్టుదలకు ప్రమాణం.

పరలోక చింతన

అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త (స) పట్ల ప్రేమాభిమానాలకు తోడు పరలోక చింతన కూడా ఓ మోమిన్ (విశ్వాసి) విశ్వాసం (ఈమాన్)లోని ఓ భాగమే. పరలోకానికి ప్రాముఖ్యతనివ్వడం మరియు ఇహలోకం కంటే పరలోకాన్ని తీర్చిదిద్దుకునే ప్రయత్నం చేయడం ఓ సత్యసందేశ ప్రచారకుని ప్రధమ కర్తవ్యం. అతను ఇహలోక భోగభాగ్యాల్లో, ఇక్కడి వ్యాపకాల్లోనే కొట్టుమిట్టాడే జనానికి పరలోక జీవితం గురించి హెచ్చరించే వాడు. యదార్థమైన, పరిపూర్ణమైన జీవితం ఈ ఇహలోక జీవితం కాదని, అది పరలోక జీవితమే అని దివ్యఖుర్ఆన్ మనకు స్పష్టంగా తెలియజేస్తూ ఉంది. సముద్రానికి, పొగమంచులోని కణానికి ఉన్న తేడా లాంటిదది. ప్రపంచం,మంచివారు చెడ్డవారు ఉభయులు కలసి ఉండేచోటు. కాని వీరంతా పరలోకానికి పయనమైన పిదప ఈ రెండు రకాల మనుషులు వేరైపోతారు. మంచివారు, సన్మార్గుల కొరకు కేటాయించ బడిన నివాస స్థలం స్వర్గం. అదెంతో అహ్లాదకరమైన, మనోహరమైన ప్రదేశం. చెడ్డవారి కోసం నరకం. అది ఎంతో భయంకరమైనది. ప్రపంచంలోని మానవాళ్లంతా అక్కడ ఈ రెండు రకాల వర్గాలుగా విభజింపబడతారు. ఈ విభజనకు మూలాధారం ఈ ఇహలోక జీవితంలో వారు చేసిన కర్మలే. మనిషి ఇహలోకంలో జీవితం గడిపినది దైవానికి విధేయునిగా ఉంటూనా? లేదా ఆయన్ను ధిక్కరించే తిరుగుబాటు ధోరణిని అవలంబించా? అతని జీవితం విధేయతా జీవితమా లేదా తిరుగుబాటు జీవితమా? ఓ వ్యక్తి తన నిజప్రభువును గుర్తించి ఆయనకు విధేయుడై జీవిస్తున్నాడా లేదా అన్నదే ఈ పరీక్ష ఉద్దేశ్యం. ఇది కేవలం ప్రపంచంలోనే సాధ్యమయ్యే పని. ఇక్కడది ఆ నిజ ప్రభువు యొక్క ఉనికి, సూచనలు మరియు గురుతుల రూపంలో దాగుంది. ఆయన వైపునకు నడవడంలో కష్టాలు నష్టాలు కూడా చవిచూస్తాం. ఆయన మార్గంలో షైతాను అందమైన వలలు కూడా అడ్డుగా వస్తాయి. పరలోకాన్ని కేవలం అంతరాత్మే (మనస్సాక్షే) గుర్తించగలదు. ప్రాపంచిక సుఖభోగాలు మనిషిని తన వైపునకు లాగుతూ ఉంటాయి. మనిషిని పరీక్షలో పడవేసే తీరే అది. ఈ ప్రపంచంలో ఓ సత్యసందేశ వహుడు ఈ యదార్థాన్ని గుర్తించాలి. సన్మార్గంపై తాను నడుస్తూనే ఇతరులను కూడా ఆ మార్గంపై నడిచేందుకు ఆహ్వానించాలి.

పరలోక చింతనను పెంచి పోషించేందుకు వివిధ రకాలకు చెందిన అనేక వనరులున్నాయి. వాటిలో అతి ప్రధానమైన వనరు (మార్గం) దివ్యఖుర్ఆన్‌లోని హెచ్చరికకు సంబంధించిన ఆయత్‌లు మరియు ప్రళయ దృశ్యాల అధ్యయనం చేయడం. ఆ తరువాతి వనరు హదీసుల్లో పొందుపర్చబడిన కితాబుర్రిఖాఖ్ (మనస్సులను ద్రవింపజేసే సంఘటనాధ్యాయం), కితాబుల్ ఫితన్‌లను (పరీక్షా సంఘటనల అధ్యాయం) అధ్యయనం చేయడం. గతించిన పుణ్యపురుషుల పరలోక చింతనను మేల్కొలిపిన సంఘటనల అధ్యయనం, చివరికి అప్పుడప్పుడు శ్మశాన వాటికలకు

వెళ్ళి పరలోకానికి పయనమైన వారి సమాధులను దర్శించి అక్కడ కొద్దిసేపుండి వారి గురించి ఆలోచించడం. అప్పుడప్పుడు ఆసుపత్రులకు వెళ్ళి రోగులను కలిసి వారిని పరామర్శించడం. ఇవన్నీ పరలోక చింతనను ప్రేరేపించే మార్గాలే. ఇలా ఓ సందేశ ప్రచారకుడు పరలోక చింతనను కలిగి ఉన్నవారి మధ్యలో ఉంటూ తన పరలోక చింతనను మరింత మేల్కొలుపుకోగలడు.

దివ్యఖుర్ఆన్ చూపిన ప్రవర్తన నడవడి రూపురేఖలు

ఇస్లామీయోద్యమ కార్యకర్త ప్రవర్తనా రూపురేఖలెలా ఉండాలో దివ్యఖుర్ఆన్ ఓ నియమావళిని చూబెట్టడం జరిగింది. అదేమిటంటే, ఓ విశ్వాసి మౌలికంగా ఓ ముజాహిద్ అయి ఉంటాడు. ధర్మ సందేశ ప్రచార కార్యక్రమం ఓ నిరంతరమైనది, నిర్విరామమైనదైన జిహాదె అక్బర్ (అంటే పెద్ద జిహాద్). తబూక్ పోరాటం జరిగిన తరువాత దైవప్రవక్త (స) మదీనాకు తిరిగి వస్తూ సహాబా (ర) వారితో, "మనం జిహాదె అజ్గర్ (చిన్న జిహాద్) నుండి జిహాదె అక్బర్ (పెద్ద జిహాద్) వైపుకు మరులుతున్నాం. ఎందుకంటే, మనం మన మనస్సును అల్లాహ్‌కు విధేయతను చూపేదిగా మలచవలసి ఉంది. దాన్ని అల్లాహ్ అభీష్టానికి అనుగుణంగా మలచడమే పెద్ద జిహాద్. జిహాద్ ఒక్కటే ఓ విశ్వాసి జీవితానికి చిహ్నం" అని అంటారు.

కాబట్టి దివ్యఖుర్ఆన్ ఓ సందేశ ప్రచారకునికి సంబంధించిన ఏ రూపురేఖలనైతే చూపిందో ఫుర్కాన్ సూరాలో అవి ఇలా ఉన్నాయి:

يَمْشُوْنَ عَلَى الْاَرْضِ هَوْنًا وَّاِذَا خَاطَبَهُمُ الْجٰهِلُوْنَ
قَالُوْا سَلٰمًا۔

"కరుణామయుని (అసలు) దాసులు ఎవరంటే, నేలపై అణుకువతో నడిచే వారు, మూర్ఖులు వారిని పలుకరించినప్పుడు మీకో సలాం అని అనేవారు."

يَبِيْتُوْنَ لِرَبِّهِمْ سُجَّدًا وَّقِيَامًا۔

"తమ ప్రభువు సన్నిధిలో సాష్టాంగపడి (సజ్దాలో) మరియు నిలబడి రాత్రులు గడిపేవారు."

اِذَا اَنْفَقُوْا لَمْ يُسْرِفُوْا وَلَمْ يَقْتُرُوْا وَكَانَ بَيْنَ
ذٰلِكَ قَوَامًا۔

"ఖర్చుబెడితే దుబారాగానూ ఖర్చుబెట్టకుండా, లోభత్వాన్నీ ప్రదర్శించకుండా ఈ రెండూ తీవ్రవైఖరుల మధ్య సమతుల్యం పాటించేవారు."

لَا يَدْعُوْنَ مَعَ اللّٰهِ اِلٰهًا اٰخَرَ

"అల్లాహ్‌ను తప్ప యే ఇతర దేవుణ్ణీ వేడుకోనివారు."

لَا يَقْتُلُونَ النَّفْسَ الَّتِي حَرَّمَ اللهُ اِلَّا بِالْحَقِّ۔

"అల్లాహ్ నిషేధించిన ఏ ప్రాణాన్నీ అన్యాయంగా హతమార్చనివారు."

لَا يَزْنُوْنَ

"వ్యభిచారానికి పాల్పడనివారు."

لَا يَشْهَدُوْنَ الزُّوْرَ

"అబద్ధానికి సాక్షులు కానివారు."

اِذَا مَرُّوْا بِاللَّغْوِ مَرُّوْا كِرَامًا

"వ్యర్థమైనవాటి వైపుగా పోవడం జరిగితే, సంస్కారవంతులు మాదిరిగా దాటిపోయేవారు."

'అల్ మూమినూన్' సూరాలో మరిన్ని గుణగణాల గురించి చెప్పడం జరిగింది:

هُمْ فِي صَلَاتِهِمْ خَاشِعُوْنَ

"తమ నమాజుల్లో వినమ్రతను పాటిస్తారు."

هُمْ لِلزَّكٰوةِ فَاعِلُوْنَ

"జకాత్ విధానాన్ని ఆచరిస్తారు."

هُمْ لِفُرُوْجِهِمْ حَافِظُوْنَ

"తమ మర్మాంగాలను పరిరక్షించుకుంటారు."

هُمْ لِاَمَانَاتِهِمْ وَعَهْدِهِمْ رَاعُوْنَ

"తమ అమానతులకు, తమ వాగ్దానాలకు కట్టుబడి ఉంటారు."

'లుక్మాన్' సూరాలో కొన్ని సుగుణాలు ఈ విధంగా బోధించబడ్డాయి:

لَا تُصَعِّرْ خَدَّكَ لِلنَّاسِ

"ప్రజలతో ముఖం ప్రక్కకు త్రిప్పిమాట్లాడకు."

لَا تَمْشِ فِي الْاَرْضِ مَرَحًا

"భూమిపై నిక్కుతూ నడవకు."

وَاقْصِدْ فِيْ مَشْيِكَ وَاغْضُضْ مِنْ صَوْتِكَ

"నీ నడకలో సమమైన తూకంపాటించు. నీ కంఠస్వరాన్ని కొంచెం తగ్గించు."

'తౌబా' సూరాలో మరిన్ని సుగుణాలు చెప్పబడ్డాయి:

اَلتَّائِبُوْنَ

"అల్లాహ్ వైపునకు మాటిమాటికీ మరలేవారు."

اَلْعَابِدُوْنَ

"ఆయనను ఆరాధించేవారు."

اَلْحَامِدُوْنَ

"ఆయనను స్తుతించేవారు."

اَلسَّائِحُوْنَ

"ఆయన కొరకు భూమ్మీద సంచారం చేసేవారు."

اَلرَّاكِعُوْنَ السَّاجِدُوْنَ

"రుకూ మరియు సజ్దా చేసేవారు."

اَلْاٰمِرُوْنَ بِالْمَعْرُوْفِ

"మంచిని చేయండి అని ఆజ్ఞాపించేవారు."

اَلنَّاهُوْنَ عَنِ الْمُنْكَرِ

"చెడు చెయొద్దని నిరోధించేవారు."

اَلْحَافِظُوْنَ لِحُدُوْدِ اللّٰهِ

"అల్లాహ్ విధించిన హద్దులను కాపాడేవారు."

మొత్తానికి, ఈ రకంగా ఖుర్‌అన్ మరియు హదీసు గ్రంథాల పుటల్లో ఎటు చూసినా సందేశ ప్రచారకుడైన విశ్వాసి ప్రవర్తన, గుణగణాల అందమైన పుష్పాలు విస్తరించి ఉన్నాయి. వాటిని తేలిగ్గా ఏరుకొని ఓ అందమైన పుష్పగుచ్ఛాన్ని తయారు చేసుకోవచ్చు.

ఎటుచూసినా సందేశ ప్రచారకుడైన విశ్వాసి ప్రవర్తన, సుగుణాలు కానవస్తాయి. వాటిని తేలిగ్గా ఏరుకొని వాటిని అవలంబించి ఓ సందేశ ప్రచారకుడు తనను తాను తీర్చిదిద్దుకోగలడు.

ఉద్యమ కార్యోన్ముఖుడు అయ్యేందుకు కావలసిన శిక్షణ

ఇస్లామీయోద్యమ ధ్వజవాహకుడు ప్రజల ముందు చిలుకాగోరింకల్లా పదాలను వల్లించడానికి కాదు, అతను కృషి సల్పేది జీవితాలను సంస్కరించడానికి, మేలైన ఓ సంస్కరణోద్యమం కోసం. కాబట్టి అతని అసలు రంగం కార్యాచరణ రంగం. అతను మానవతా క్షేత్రంలో తన సంస్కరణా విత్తనాలను నాటి శుభమైన

నైతికతలు మరియు నడవడికల పంటను పండించే వ్యక్తి. అతని ద్వారా, కార్య రూపంగా, మానవాళి సాఫల్య మార్గం అవలంబిస్తుంది. ఏదో ఓ మూలన కూర్చుని తపస్సు చేసుకునే సన్యాసి కాడతను. ఏ కొండగుహాలోనో తిష్ఠవేసి శాంతిని వెదికే యోగికాడతను. ఏ దైవం అయితే అతణ్ణి ఈ ప్రపంచంలో పరీక్షించడానికి పంపాడో ఆ పరీక్షా కేంద్రం నుండి తప్పుకోవడానికి ఓ మూలన కూర్చుని తన జీవితం అంతా గడిపేసే సర్వసంగ పరిత్యాగి కాడతను. అతను దైవప్రవక్త (స) వారి ఈ ప్రవచనానికి బద్ధుడైనవాడు. ఆయన(స) ఇలా సెలవిచ్చారు:

"మీలో ఏ ఒక్కరూ చెడు జరుగుతూ ఉండగా చూస్తే, దాన్ని తన చేతితో మార్చివేయాలి. అది సాధ్యం కాకపోతే నోటి ద్వారానైనా దాన్ని ఖండించి అడ్డుకోవాలి. అది కూడా సాధ్యం కానట్లయితే కనీసం తన మనస్సులోనైనా సరే దాన్ని అంత మొందించే కోరిక కలిగి ఉండాలి. ఎందుకంటే ఇది విశ్వాసం కనీస ధర్మం. ఎవరి మనస్సులోనైతే చెడు గురించి అసహ్యత ఉండదో, అతనిలో అవగింజంతైనా విశ్వాసం లేనట్లే."

అందుకని దివ్యఖుర్‌ఆన్‌లో స్పష్టంగా ఇలా ఆదేశించడం జరిగింది:

وَلْتَكُنْ مِّنْكُمْ اُمَّةٌ يَّدْعُوْنَ اِلَى الْخَيْرِ وَيَأْمُرُوْنَ
بِالْمَعْرُوْفِ وَيَنْهَوْنَ عَنِ الْمُنْكَرِ وَاُولٰٓئِكَ هُمُ
الْمُفْلِحُوْنَ ○ (آل عمران : ۱۰۴)

"మీలో మంచివైపునకు పిలిచేవారు, మేలు చెయ్యండని ఆజ్ఞాపించేవారూ, చెడు నుండి వారించేవారు కొందరు తప్పకుండా ఉండాలి. ఈ పనిని చేసేవారే సాఫల్యం పొందుతారు." (ఆలి ఇమ్రాన్:104)

ఇది ఓ ఇస్లామియోద్యమ ధ్వజవాహకునికి, కార్యరంగంలోనికి వచ్చి ధర్మప్రచార విధిని నిర్వర్తించేందుకు ఇవ్వబడ్డ ఆదేశం.

మానవాళి సంస్కరణకు కార్యరూపంగా చేసే కృషి

ఓ సత్యసందేశ ప్రచారకుని శిక్షణకు మొట్టమొదటి కార్యాచరణ శిక్షణామార్గం ఏమిటంటే, అతను దేన్నైతే సత్యమని భావిస్తున్నాడో దాన్ని నిర్వర్తించడం. యదార్థం ఏమిటంటే, తాను దైవదాసుల ముందు కార్యరూపేణా ఆ సత్యాన్ని ఉంచకపోతే, తత్ఫలితంగా ఎదురయ్యే స్వాభావిక పరిణామాలేవో చవిచూడలేడు. అడుగు ముందుకు వేసే ఈ ప్రక్రియలో అతనికి సహాయపడే స్నేహ హస్తాలూ లభిస్తాయి. ఇందులో అతనికి స్నేహితులూ లభిస్తారు అలాగే ఆ సందేశాల్లో అడ్డుకునే వారి వైరమూ లభిస్తుంది. వారు అతని మార్గాన్ని అడ్డుకుంటారు కూడా. ఇలా కార్యరూపంగా జరిగే కృషిలో అతనికి స్నేహితుల అండదండలు, వైరుల హింసా దౌర్జన్యాలూ రెండూ

ఎదురౌతాయి. ఈ రెండు పరిస్థితులు అతని శిక్షణకు ఎంతో అవసరం. స్నేహితులతో కలిసి అతను తన కార్యాన్ని ముందుకు తీసుకువెళ్ళే ప్లాను వేసుకుంటాడు. అలాగే విరోధుల అడ్డుగోడలను దాటే మార్గాలూ వెదుకుతాడు. వారి దౌర్జన్యాలను సహించే అభ్యాసం చేస్తాడు. ఇలా అతనిలో దృఢమైన పట్టుదల ఏర్పడుతుంది. అతను పరీక్షల కొలిమిలో కాలినికార్చుయిన బంగారమైపోతాడు.

ఈ సంఘర్షణలో అతని దగ్గరి బంధువులు, అతని ఆత్మీయులు కూడా, తన భవిష్యత్తు చెడిపోకుండా ఉండాలనే ఉద్దేశ్యంతో అతనిని అడ్డుకుంటారు. అలాగే అతని విరోధులు కూడా వారి ప్లానుల్లో విజయవంతం కావాలనే ఉద్దేశ్యంతో అతని మార్గాన్ని మరింత కష్టతరం చేస్తారు. ఈ పరిస్థితి ఓ సందేశ ప్రచారకునికి ఓ మేలైన శిక్షణా ప్రణాళికను సమకూర్చిపెడుతుంది. ఆ మూసలో పోయబడిన అతడు ఓ మేలైన సత్యప్రచారకునిగా రూపుదిద్దుకుంటాడు.

సత్పురుష సాంగత్యం

ఓ సందేశ ప్రచారకుని శిక్షణకు రెండో కార్యచరణ మార్గం సత్పురుషులతో సాంగత్యం కలిగి ఉండడం. అతను చెడ్డ వారి సాంగత్యాన్ని, స్నేహాన్ని, అభిమానాన్ని త్యజించి దైవభీతిగల వారితో కలిసి మెలసి ఉండవలసి ఉంటుంది. కారణం, అసత్యవాదులతో కలిసి ఉండడం వలన అతనిపై పడే దుష్ప్రభావాలు పడకుండా ఉంటాయి. అసత్యమైన, పనికిరాని పోకడలను భరించే అలవాటుకు లోనుకాకుండా ఉంటాడు. వారితో రాజీపడే ధోరణికి గురికాకుండా ఉంటాడు. అతను తన భావసారూప్యతగల వారు, సత్పురుషులతో కలిసి తిరిగినప్పుడు వారి సత్ప్రవర్తన వల్ల తాను ప్రయోజనం పొందడమే కాకుండా వారిని కూడా తాను నమ్మిన సత్యాన్ని బలపర్చేటట్లు ప్రోత్సహించగలడు. ఒకవేళ నమాజు చేసే ఓ వ్యక్తి నమాజు చేయని వ్యక్తులతో తెగిపోని సంబంధాలు పెట్టుకుంటే, అతను పోనుపోను తన నమాజులను కూడా పోగొట్టుకోగలడు. అతని ఆ నమాజు చేయని స్నేహితులు తన నమాజు చేసే అలవాటును ప్రోత్సహించకపోగా దాన్ని అడ్డుకోవడానికే ప్రయత్నిస్తారు. కాబట్టి ఓ సత్యసందేశవహుని నైతిక శిక్షణకు సరైనమార్గం దుష్ప్రవర్తనగల వారి సాంగత్యం కాదు. కేవలం సత్ప్రవర్తన గల సచ్ఛీలుర సాంగత్యమే. సత్ప్రవర్తన ఓ 'జమాఅత్' రూపందాల్చి ముందుకు కదిలితే అది మరింత ప్రభావవంతమైనదిగా పరిణమిస్తుంది. ఇస్లామ్ ముస్లిములను మంచికి ప్రోత్సహించేందుకు ఓ జమాఅత్‌గా ఏర్పడి పనిచేయమని ఆదేశిస్తోంది కూడా. మసిబొగ్గుల వద్ద కుర్చున్నవారు దాని నలుపును, పూల వద్ద కూర్చున్నవారు వాటి పరిమళాన్ని పుచ్చుకున్నట్లు మనుషులపై సత్పు రుషులు మరియు దుష్టుల సాంగత్యం ప్రభావం పడుతూ ఉంటుంది. సన్మార్గుల సభలకు, సమావేశాలకు వెళ్ళడం పుణ్యకార్యాలు ఆచరించడానికి, ధర్మప్రచారానికీ

కారణభూతమౌతుంది. అదేకాకుండా సత్పురుషులు పరస్పరం సద్బోధ చేసుకుంటూ ఉంటారు. ఇలా వ్యక్తిగత సంస్కరణకు తోడు సమూహిక సంస్కరణా కార్యక్రమం కొనసాగుతూ ఉంటుంది. ఓ సహచరుడు పడిపోతూ ఉండగా చూసిన మరో సహచరుడు అతణ్ణి పైకిలేపే ప్రయత్నం చేస్తాడు. ఒకరి అడుగులు తడబడుతూ ఉంటే, మరొకడు అడుగు ముందుకు వేసి అతణ్ణి పడిపోకుండా కాపాడుతాడు. ఒకరి చొక్కా చెరుగుపై పడినమరకను మరొకడు కడిగేసి శుభ్రం చేస్తాడు. ఒకరి సంస్కరణ మరొకరికి మార్గదర్శకమైపోతుంది. ఒకడు తన పరలోకాన్ని చక్కదిద్దే ప్రయత్నం చేస్తూ ఉంటే మరొకడు దానికి చేయూతనిస్తాడు. ఒకని మాట మరొకరికి కష్టాన్ని కలుగజేస్తూ ఉంటే మరొకడు ఎంతో మెళుకువగా అతణ్ణి అలా చేయకుండా హెచ్చరిస్తాడు. పూర్తి సమాజం ఇలా ఓ క్రమమైన రీతిలో మంచిని పంచుతూ సత్సమాజంగా ఏర్పడుతుంది. అదేకాకుండా, ఓ సందేశప్రచారకుడు ఓ సహాబీ (ర)ను లేదా ఓ ధార్మిక మహాపురుషుణ్ణో తన ఐడియల్‌గా చేసుకొని ఆయన సుగుణాలన్నిటిని తనలో పెంచి పోషించే కనీస ప్రయత్నం చేసినా, అది కూడా తన శిక్షణలో, తన నడవడికలో ఎంతో మంచి సంస్కరణను తీసుకురాగలదు.

తనకంటే మేలైన సహచరులను అనుసరించడం

శిక్షణ మరియు సంస్కరణలకు చెందిన మరో ఉత్తమ మార్గం, ఓ సత్యసందేశ ప్రచారకుడు తన సహచరుల్లో నైతికత, నడవడి, ధార్మికత మరియు దైవభీతి పరాయణత్వంలో తనకంటే మేలైన సహచరునిపై దృష్టి ఉంచి అతనిలోని సుగుణా లను తనలో ఇముడ్చుకునే ప్రయత్నం జేయడం. ప్రాపంచిక విషయాల్లో తనకంటే తక్కువగా ఉన్నవాడిని చూడాలని ఓ సందేశ ప్రచారకుణ్ణి ఆజ్ఞాపించడం జరిగింది. కారణం, పరుల భోగభాగ్యాలను చూసి తాను దురాశకు, అది తనకు లేదనే బాధపడ కూడదనే ఉద్దేశ్యంతోనే. ధార్మిక విషయాల్లో మాత్రం తనకంటే ఉన్నతులైన వారిపై దృష్టి ఉంచడం వలన అతను తనలో ఉన్న నైతికతలను, నడవడికను సరిచూసుకోవడం వలన తనలో ఉన్న లోపాలను సవరించుకోవాలి. అలాగే, అతనిలోవున్న సుగుణాలను అనుసరిస్తూ తనను తాను తీర్చిదిద్దుకునే ప్రయత్నం చేయాలి. మనిషి నిశితంగా పరిశీలిస్తే, నలువైపులా విస్తరించి ఉన్న రకరకాల తన సహచరుల్లో నైతికతలు, సద్వర్తనలకు సంబంధించిన అనేక మేలైన పుష్పాలు వికసిస్తూ ఉన్నట్లు గమనిస్తాడు. ఒకరిలో దైవభీతి ఉంటే, మరొకరిలో నీతినిజాయితీ ఉంటుంది. ఒకరిలో దైవమార్గంలో ధనాన్ని వెచ్చించే 'ఇన్ఫాక్ ఫీ సబీలిల్లాహ్' సుగుణం ఉంటే, మరొకరిలో దైవారాధనలో లీనమైపోయే సుగుణం ఉంటుంది. ఇంకొకరిలో దైవసంస్మరణలో లీనమైపోయే సుగుణం కానవస్తుంది. ఒకరు దైవదాసుల పట్ల ప్రేమానురాగాలు ప్రదర్శిస్తూ వారికి సేవ చేస్తూవుంటే, మరొకరు నమ్రత, దయాగుణం కలిగి ప్రజలతో చనువుగా

మెదులుతుంటారు. ఒకరు రాత్రిపూట ఏకాంతంగా ప్రార్థనలో నిమగ్నమైపోతే, మరొకరు పగటిపూట దైవధర్మ వ్యాప్తికి కృషి చేస్తూ ఉంటాడు. ఓ సత్యసందేశ ప్రచారకుడు తన చుట్టూ విస్తరించివున్న ఈ సుగుణాలన్నిటిని కూడగట్టి తన నడవడికలో అమర్చుకుంటాడు. తాను కూడా ఈ సుగుణ పుష్పాల పుష్పగుచ్ఛంగా తయారౌతాడు.

మంచిని ఆజ్ఞాపించడం చెడును ఆపడం

దైవదాసుల్లో కార్యరూపంగా మంచిని ఆజ్ఞాపిస్తూ చెడును అడ్డుకునే కార్యక్రమం చేబట్టడం, తద్వారా ఈ కార్యంలో అతనిని తెగిడేవారి తెగడ్తలకు, భయపెట్టే మరియు ఏ భయానికి తలగ్గొకుండా ఉండే అలవాటు కూడా ఓ సత్యసందేశ ప్రచారకుని శిక్షణకు ఓ సోపానమే. ఈ విషయంలో దైవప్రవక్త (స) వారి ఈ ప్రవచనం అతని దృష్టిలో ఉండాలి.

"నా ప్రాణాలు ఎవరి గుప్పెట్లో ఉన్నాయో ఆ దైవం సాక్షిగా! మీరు సత్కార్యాల ఆచరణకు ఆదేశించండి. చెడును అడ్డుకోండి. దుష్టుని చెయ్యిబట్టి అతణ్ణి సత్యం వైపునకు మరల్చండి. అలాజరగని పక్షంలో అల్లాహ్యే మనస్సుల్లోని దురాలోచనలను మరొకరిలో విస్తరించేటట్లు చేస్తాడు. లేదా, బనీ ఇస్రాయీల్ జాతిని అభిశపించినట్లు మిమ్మల్ని కూడా అభిశపించగలడు." (తిర్మిజీ)

దీనివల్ల అర్థం అయ్యేదేమిటంటే, ముస్లిముల్లో సత్కర్మల జ్యోతిని వెలిగించడం, దుష్కర్మల చీకటిని పారద్రోలే ప్రయత్నం చేయడం ఎంతైనా అవసరం అన్నది. ఒకవేళ ఈ కార్యాన్ని చేబట్టకపోతే ఇలాంటి వ్యక్తులు అల్లాహ్ శిక్షనుండి తప్పించుకోవడం బహుకష్టమే.

సుశిక్షణ, సంస్కరణలను ఆపే సమాజం

ఎవరైనా సత్యధర్మ కార్యక్రమానికి నడుము బిగించినప్పుడు, తానొక్కడే సమాజ సంస్కరణను చేబట్టజాలడు. పైగా సమాజం కూడా, అతనిలోని ఓ చిన్నపాటి లోపాన్నో, తప్పిదాన్నో వ్రేలెత్తిచూపి, అతణ్ణి సరైన సంస్కరణా ప్రమాణంపై నిలిపి ఉంచేందుకు వివశునిగా చేస్తుంది. ఓ సందేశ ప్రచారకుడు తాను ఏ విషయాన్ని స్వయంగా అనుసరించలేడో సమాజాన్ని ఆ విషయం వైపుకు ఆహ్వానించడంలో కృతకృత్యుడు కాజాలడు. అలాగే, ఏ చెడు నుండి తనను తాను సంరక్షించుకోజాలడో సమాజాన్ని కూడా అతను ఆ తప్పిదం నుండి రక్షించలేడు. ఈ రకంగా సంస్కరణా కార్యక్రమాన్ని అతను ప్రారంభించగానే, తరచి చూచే ప్రతి దృష్టి అతని ప్రతి కదలికను గమనిస్తూ ఉంటుంది. అతను యేదైనా తప్పిదం చేస్తే సమాజం ఆ తప్పిదాన్ని అతని ముందుంచుతుంది. కాబట్టి అనేక చెడుగులు కలిగి సమాజాన్ని సంస్కరించడానికి పూనుకోవడం ఓ సందేశ ప్రచారకునికి సాధ్యమయ్యే పనికాదు. సమాజమే అతని

ప్రతి మాటను, ప్రతి చేతను ఏకరువు పెట్టి అతని ముందు పెడుతున్నందున అతను కూడా తన మాట ప్రకారం నడుచుకోక తప్పదు. లేదా అతను ఆ పిలుపునే వదులు కోవలసి వస్తుంది. కాబట్టి మానవసమాజం సత్యధర్మ ప్రచారకునికి ఓ గీటురాయిగా మారి అతణ్ణి తీర్చిదిద్దేందుకు పరోక్షంగా కృషి చేస్తుంది. అప్పుడప్పుడు సమాజం చేసే విమర్శల ద్వారా, మరొకప్పుడు అది పెట్టే పరీక్షలు, చేసే సంఘర్షణల వెలుగులో సత్యసందేశవహుడు తనలోని ప్రతి లోపాన్ని దూరం చేసుకొని, చివరికి తన శక్తిసామర్థ్యాల పైన్నే ఆధారపడి ముందుకు వెళ్ళగలడు. ఇలా అతనికి, తన సమాజమే ఓ శిక్షణా వాతావరణాన్ని, సంస్కరణా మార్గాన్ని చేకూర్చి పెడుతుంది.

సద్వ్యవస్థ ప్రాబల్యం కొరకు సంఘర్షించడం

ఓ సత్య సందేశవహుణ్ణి తీర్చిదిద్దే అన్ని రకాల శిక్షణా మార్గాల్లో అన్నిటికంటే గొప్పదైన శిక్షణా మార్గం, అతను సత్యధర్మ వ్యవస్థ ప్రాబల్యం కోసం చేతల ద్వారా కృషిని ప్రారంభించడం మరియు అది పూర్తిగా సత్యవ్యవస్థ అనే నిజాన్ని తన మాట ద్వారా, చేతల ద్వారా ధృవీకరించడం. యదార్థం ఏమిటంటే, సత్యధర్మ ధ్వజవాహకుని నైతిక శిక్షణకు సంబంధించిన వివిధ సోపానాలున్నాయి. అలాగే, హదీసు ప్రకారం కూడా విశ్వాసానికి (ఈమాన్) సంబంధించిన వివిధ స్థానాలూ ఉన్నాయి. చెడును శక్తిసామర్థ్యాలతో అడ్డుకోవడం మొదటి సోపానం అయితే, దానికి సంబంధించిన శక్తిని కూడగట్టుకోవడం రెండవది. అంటే ధర్మసంస్థాపన కోసం కృషి చేయడం కూడా అతని ప్రథమ కర్తవ్యం. దాన్ని ఉపేక్షిస్తే ఇతర కార్యకలాపాల విలువ తగ్గిపోతుంది. దైవవాక్కును ఉన్నతం చేసే సంకల్పమే లేకపోతే సత్యధర్మాన్ని ప్రపంచం అంతటా ప్రబల చేయడం అతని ధ్యేయం కాకపోతే, అప్పటివరకు ఓ సందేశప్రచారకుని మూర్తిత్వం సంపూర్ణమయ్యేది కాదు. అతని ఆ మూర్తిత్వం పూర్తిగా బహిర్గతం కానేకాదు.

ఓ సత్యధర్మ ప్రచారకునిలో నిస్సందేహంగా విశ్వాసానికి సంబంధించిన అన్ని కోణాలు మరియు అన్ని రకాల సోపానాలు ఉండితీరడం అవసరం. వాటిలో అల్లాహ్‌పై విశ్వాసం, దైవప్రవక్తలపై విశ్వాసం, పరలోకంపై విశ్వాసం, ఆ విశ్వాసానికి సంబంధించిన అన్ని కోణాలు సంపూర్ణంగా ఉండాలి. అలా జరగని పక్షంలో ఈమాన్ డిమాండ్లేవీ పరిపూర్ణతను సాధించలేవు. అలాగే కేవలం నోటితో విశ్వసించానని చెప్పేయడం సరిపోయేది కాదు. పైగా, తనను తాను పూర్తిగా అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త (స) విధేయతకు సమర్పించడం, ఆయన ఆదేశాలను శిరసావహించి ముందుకు నడవడం కూడా అంతే ముఖ్యం. ఆచరణ కరువైన ఈమాన్ కాపట్యానికి నిదర్శనం. ఈమాన్ (విశ్వాసం) డిమాండ్లకు అనుగుణంగా నడుచుకునే నడతే అసలు సిసలైన ఇస్లామ్. అంటే ఆచరణాయుక్తమైన విధేయతను జీవితంలోని అన్ని రంగాల్లోనూ ప్రదర్శించడమే యదార్థమైన ఇస్లామ్ అన్నమాట. ఆ విధేయత కూడా ఎలా ఉండా

లంటే, అందులో స్పృహ, ఆదేశపాలన, దైవభీతి, దైవప్రవక్త (స) వారి పట్ల ప్రేమాభిమానాలు ప్రస్ఫుటంగా కానరావాలి. అందులో ఓ విశ్వాసి బాధ్యతతో సత్యధర్మాన్ని అనుసరించే ప్రయత్నం చేస్తూ సంపూర్ణంగా దైవాదేశాలకు తలొగ్గే వానిగా మారిపోవాలి. ఏ ఆదేశమైతే అక్కడి నుండి లభిస్తుందో దాన్ని శిరసావహించి అవలంబించడం, మరే విషయం గురించి నిషేధం విధించబడుతుందో దాని జోలికిపోకుండా ఉండడం, ఏ విషయంలోను తన ఇష్టానికి తావు ఇవ్వకపోవడం జరగాలి. మరో విధంగా చెప్పాలంటే తనను తాను దైవం, దైవప్రవక్త (స)ల అభీష్టానికే అంకితం కావాలి.

అది అంతమట్టుకే సరిపోయే విషయం కాదు. అతను నిబంధనల ప్రకారం దైవాభీష్టానికి కట్టుబడి ఉండడమే కాకుండా అతనిలో తన ప్రభువు, యజమాని అయిన అల్లాహ్ ఆదేశాలను, పాలిస్తూ వాటి అనుసరణకు తోడు ఆయన పట్ల అతని ఊహలోసైతం మరే మార్గం మెదలనటువంటి తీవ్రమైన ప్రేమాభిమానాలు పాతుకుపోవడం అవసరం. దైవాదేశాలపై నడిచే అంకితభావం అతనిలో ఏర్పడాలి. తన దైవవాక్కు (కలిమా) ఉన్నతం అయ్యేంతమట్టుకు అతని మనస్సులో సతతం ఓ రకమైన అలజడి నెలకొనే ఉండాలి. దైవవిరోధులకు వ్యతిరేకంగా ఎడతెగని మరియు నిరంతరమైన కృషి జరపడమే కాకుండా అతను చివరకు తన ధనప్రాణాలను సైతం త్యాగం చేయడానికి సిద్ధంగా ఉండాలి. ఈ తీరు పొడసూపినప్పుడే అతనిలో ఓ సందేశ ప్రచారకునిలో ఉండవలసిన సుగుణాలు బహిర్గతం అవుతాయి. ఆ తరువాత అతను ఒకరి ప్రోత్సాహం కోసం ఏమాత్రం ఎదురుచూడడు. కాగా ఓ స్వభావిత (ఆటోమెటిక్) యంత్రంలా అతను తన ప్రభువు మార్గంపై ముందుకు సాగుతూనే ఉంటాడు. అలా అతని ఉనికి అల్లాహ్ సూచనల్లో ఓ సూచనగా మారిపోతుంది.

ఈ విషయాన్నే ఓ మహాపురుషుడు ఎలా వివరించాడో చూడండి:

"నేను నా ప్రభువు విధేయతను ఏ కొంచెం జవదాటినా దాని ప్రభావాన్ని నేను నా కుమారుని అమర్యాదలో, నా భార్య అశ్రద్ధలో, నా స్వారీ (గుర్రం) తల బిరుసుతనంలోనూ స్పష్టంగా చూస్తాను."

సందేశ ప్రచార కార్యం ఒకరిని మానవునిగా తీర్చిదిద్దే వివేకవంతమైన కార్యం అని చెప్పడంలో సందేహం ఏమాత్రం లేదు. ఈ కార్యం మొరటుగా, అసహ్యామైన రీతిలో నిర్వర్తించే కార్యంకాదు. మానవుని మానసిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకోకుండా, కేవలం బలవంతపెట్టి, పరుష పదజాలంతో కించపరుస్తూ వారి మనసుల్ని మార్చే ప్రయత్నం చేయబూనిన వారు సాధారణంగా ఎదుటివారి మనస్సులను నొప్పించడం తప్ప వారిని సక్రమమైన మార్గం పైకి తేచ్చేవారుకాదు. ఎందుకంటే హృదయకవాటాలు లోపలి నుండి తెరుచుకుంటాయి కాబట్టి. వాటిని ఆ ఇంటి యజమానే స్వయంగా తెరువనంత మట్టుకు బలవంతంగా ఎవరు తెరిపించలేరు. తబ్లీగ్ (సందేశ ప్రచార కార్యం) కూడా వివేకంతో కూడుకున్నది. దాన్ని మేలైన రీతిలోనే నిర్వర్తించాలనే ఆదేశాలున్నాయి.

أُدْعُ إِلَىٰ سَبِيلِ رَبِّكَ بِالْحِكْمَةِ وَالْمَوْعِظَةِ
الْحَسَنَةِ وَجَادِلْهُم بِالَّتِي هِيَ أَحْسَنُ (النحل: ١٢٥)

"నీ ప్రభువు మార్గం వైపునకు ఆహ్వానించు వివేకంతో చక్కని హితబోధతో ప్రజలతో ఉత్తమమైన రీతిలో వాదించు." (అన్‌నహ్ల్:125)

అయితే ఓ సందేశ ప్రచారకుడు, మానవుల ప్రశిక్షణను చెడగొట్టే మరియు వారి శిక్షణ ప్రభావాన్ని నీరుకార్చే అంశాలేవో తెలుసుకొనే అవసరం ఉంది. ఆ అంశాలు అనేకమైనప్పటికీ వాటిలో ప్రమాదకరమైన అంశం అసహనం మరియు తొందరపాటు. వాటికంటే ప్రమాదకరమైనది పరుష పదజాలం, దురుసుతనం మరియు మాటల ద్వారా మనుసులను నొప్పించే వైఖరి. అలాగే ఓ సందేశ ప్రచారకుడు ధర్మసందేశం గురించి పట్టించుకోని వారెవరై ఉంటారు? సత్యధర్మాన్న తికి పాటు పడకపోవడమే కాకుండా, అసలు దానికి సమర్థులు కూడా కానివారెవరు? సత్య ప్రచారం కోసం ఏ మాత్రం పనికిరానివారెవరు? అన్న విషయాలను కూడా గుర్తించవలసి ఉంటుంది. వీరంతా ప్రాపంచిక భోగభాగ్యాల్లో మునిగితేలుతున్నవారు. అధికార మదంతో విర్రవీగేవారు, స్వార్థపరులు, అయిశ్వర్యానికి బానిసలైనవారు. పరలోకం గురించి పట్టంచుకోనివారే వీరు. ఇలాంటి వ్యక్తుల ఉనికి సత్యప్రచార కార్యంలో అసలే పనికి రానిది. అలాగే, అతను తెలుసుకోవలసిన ఇంకో విషయం ఏమిటంటే, మానవ సమాజంలో తేలిగ్గా సత్యసందేశాన్ని గ్రహించి, దానికి వెన్ను దన్నుగా నిలిచేవారు, సత్యధర్మాన్ని ఉన్నతం చేయడానికి సిద్ధంగా ఉన్నవారెవరు? దాని కొరకు తమ సర్వస్వాన్ని ధారపోయడానికి సిద్ధపడుతున్నవారెవరు? అన్నది. తమ సంభాషణలో సంస్కారం, దైవభీతి, మంచితనం ఉట్టిపడే పెద్ద మనుషులు, వారిలో ఆలోచన చేసే అలవాటుగలవారు, విషయాన్ని అర్థం చేసుకునేవారు, సత్య పిపాసులు, దైవసూచనలను లోతుగా అధ్యయనం చేసేవారు, సత్య సంధులు, ధైర్యవంతులు ప్రముఖంగా చెప్పుకోదగినవారు. అలాంటి వ్యక్తులకు సత్యసందేశాన్ని అందించడం ద్వారా ఓ సత్యసందేశవహుడు తన సహచరుల సంఖ్యను పెంచుకో గలడు.

విజ్ఞానానికి సంబంధించిన శిక్షణా సూత్రాలను తన అంతర్గత సంస్కరణకు గాను, కార్యాచరణకు సంబంధించిన శిక్షణాసూత్రాలను తన బాహ్యసంస్కరణకు గాను ఉపయోగించగలిగితే ఓ సందేశ ప్రచారకునికి కావలసినంత ఆధ్యాత్మిక, మానసిక శిక్షణ దానంతటికదే చేకూరగలదు. దాని సహాయంతో సత్యధర్మ ప్రచారం మరియు ధర్మసంస్థాపన్నోతికి సంబంధించిన కార్యం సునాయాసంగా చేయవీలౌ తుంది. కాని, ఓ వ్యక్తి ఈ సుగుణాలన్నీ తనలో ఇముడ్చుకోకుండా ప్రచార రంగంలో దిగడానికి వీలుబడదని మాత్రం భావించకూడదు. ఇది కేవలం ఓ సంస్కరణా ప్రమాణం మట్టుకే. సందేశ ప్రచార కార్యక్రమాన్ని తన భుజస్కంధాలపై వేసుకొని బయలుదేరడం అన్నది ఓ మోమిన్ విధి. విధి నిర్వహణ కోసం ప్రతి వ్యక్తిలో ఇలాంటి

సామర్థ్యాలు ఉండడం అవసరం అన్న విషయాన్ని గుర్తించుకోవలసి ఉంది. అతని ప్రయత్నాన్ని స్వీకరించే ప్రభువు అత్యంత కరుణామయుడు, కృపాసాగరుడూను. ఏ దాసుడైతే తన వైపునకు నడుచుకువెడతాడో అతని వైపునకు ఆయన పరుగెత్తుకుంటూ వచ్చేటంత దయామయుడు. ఆయన ఆ దాసుని స్థానాల్ని (హోదాల్ని) ఊహించ లేనంతగా ఉన్నతం చేస్తాడు. ఆయన కారుణ్యాన్ని లెక్క గట్టేవారెవరు?

సత్యధర్మ ప్రచారకుని గుణగణాలు

సందేశ ప్రచారకుని ప్రత్యేకత

దివ్యఖుర్ఆన్‌లోని ఓ ఆయత్‌లో సందేశవహుని ప్రధాన ప్రత్యేకతలను ఈ విధంగా వివరించడం జరిగింది:

وَمَنْ أَحْسَنُ قَوْلًا مِّمَّن دَعَا إِلَى اللَّهِ وَعَمِلَ صَالِحًا وَقَالَ إِنَّنِي مِنَ الْمُسْلِمِينَ ○

"అల్లాహ్ వైపుకు ఆహ్వానిస్తూ సత్కర్మలనాచరించి, "నేను ముస్లిమును" అని పలికే వ్యక్తి పలుకుకంటే మరెవరి పలుకు మేలైనది కాగలదు?"

ఈ ఆయత్ పూర్తి ప్రాధాన్యతను అర్థం చేసుకోవాలంటే, ఈ పలుకులు మక్కాలో ఎలాంటి పరిస్థితిలో చెప్పడం జరిగిందో ఆ పరిస్థితులను దృష్టిలో ఉంచుకో వలసి ఉంటుంది. దైవప్రవక్త ముహమ్మద్ (స) మరియు ఆయన అనుచరగణంపై హింసాదౌర్జన్యాల పరంపర కొనసాగుతూ ఉండిన కాలమది. అలాంటి పరిస్థితిలో ఈ మాటలు పలకడం, దాన్ని ప్రకటించడం అంతసులువైన పనికాదు. అంటే "నేను ముస్లిమును" అని ప్రకటించడమంటే, క్రూరమృగాలను తమను చీల్చి చెండాడ మని ఆహ్వానించడం అన్నమాట. ఇలాంటి పరిస్థితుల్లో చెప్పబడిన మొట్టమొదటి మాట ఏమిటంటే, అల్లాహ్ వైపునకు ఆహ్వానించేవాని పలుకే అత్యుత్తమమైన పలుకు అన్నది. మరో విధంగా చెప్పాలంటే, ఓ సందేశ ప్రచారకుని ప్రత్యేకతలు ఏవంటే, అతని పిలుపు అల్లాహ్ వైపుకు రమ్మని పిలవడం, ఆ పిలుపులో ప్రాపంచిక స్వార్థం ఏదీ లేకుండా ఉండడం. తన దేశంపట్లగాని, తన జాతిపట్లగాని, తన కుటుంబం పట్లగాని మరియు తన ఆర్థిక స్థితిపట్లగాని తనకు ఎలాంటి ప్రయోజనం లేకుండా ఉండడం. ఓ వ్యక్తి ఎవరైతే చిత్తశుద్ధి కలిగి దైవం వైపునకు పిలుస్తున్నాడో, దైవగ్రంథం దివ్యఖుర్ఆన్ బోధనల ప్రకారం అతని ప్రత్యేకతలు ఈ క్రింది విధంగా ఉంటాయి.

1. అతను అల్లాహ్ ఏకత్వం వైపునకు ప్రజలను ఆహ్వానిస్తాడు.
2. అల్లాహ్ తప్ప మరెవరి దాస్యం చేయకూడదు, మరొకరిని ఆరాధించకూడదు అని బోధిస్తాడు.

3. దైవం తప్ప మరెవరిపట్ల భయభీతులు కలిగి ఉండకూడదు, ఆయనపై తప్ప మరెవ్వరిపైనా భరోసా ఉంచకూడదు అని చెబుతాడు.
4. కేవలం ఆయన ఆదేశపాలనే జరగాలి, ఆయన చట్టాలనే అనుసరించాలి అని హెచ్చరిస్తాడు.
5. ఏ పని చేస్తున్నా మనిషి, నేనెవరి దాసుణ్ణి? ఎవరి ముందు జవాబు చెప్పుకో వలసి ఉంటుంది? అనే విషయాన్ని దృష్టిలో ఉంచుకునే పనిజేయాలి అని హితం పలుకుతాడు.
6. మనిషి కృషినంతటికీ, అతని ప్రయత్నాలన్నిటికీ కేంద్రం కేవలం అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త (స) వారు చూపిన సిద్ధాంతాలు, సూత్రాలేనని, వాటి ప్రకారమే తన వైయక్తిక మరియు సామాజిక జీవన నిర్మాణం జరగాలని, తద్వారానే దైవసంతుష్టి, ప్రసన్నత లభించగలదని బోధిస్తాడు.

చెప్పబడ్డ మరో విషయం ఏమిటంటే, సత్యబోధకుడు సద్వర్తన అనే సుగుణాన్ని అలవర్చుకొని ఉండడం. అంటే అతను చేసే కార్యం సత్కార్యమై ఉండాలి. "సందేశాన్ని చేరవేసేవాని నడవడి సరైంది కాకపోతే, అతను చేరవేసే సందేశ ప్రభావం ఏమాత్రం పనిజేయదు" అనే ఆదేశాన్ని గనక లోతుగా అర్థం చేసుకుంటేనే దాని భావం పూర్తిగా అవగతం కాగలదు. మనిషి దేనివైపునకైతే ఆహ్వానిస్తున్నాడో అతను ఆ ఆహ్వానానికి నిలువెల్ల సాక్ష్యమై ఉండడం అవసరం. అతని జీవితంలో దైవధిక్కార ధోరణికి సంబంధించిన ఏ చిన్నపాటి గురుతైనా అగుపడకుండా ఉండాలి. అతని చొక్కా చెరుగుపై అనైతికతకు సంబంధించిన ఓ సూక్ష్మమైన మరక కూడా కనబడకుండా ఉండాలి. అతని పరిసర వాతావరణం, అతని సొసైటీ, అతని స్నేహితులు, అతని బంధుమిత్రులు అందరూ అతను తమలో అత్యుత్తమైన మరియు పరిశుద్ధమైన వ్యక్తిత్వం గల వాడని సాక్ష్యం ఇచ్చేటంత ఉన్నత వ్యక్తి అయి ఉండాలి.

ఈ బోధనలు మనకు దివ్యఖుర్‌ఆన్ మరియు ప్రవక్త (స)వారి సంప్ర దాయంలో అడుగడుగునా అగుపడతాయి. దైవప్రవక్త ముహమ్మద్ (స) వారి పరిశుద్ధ జీవిత చరిత్రే ఈ విషయంలో గొప్పసాక్షి. ఆయన దైవం తరఫున సత్యసందేశానికి నడుము బిగించినప్పుడు అప్పటికే నలభై సంవత్సరాల నుండి ఆ సమాజంలోనే ఉంటూ వచ్చినవారు. ఆ సమాజం ఆయన (స) మహోన్నత వ్యక్తిత్వాన్ని కళ్ళారా చూసిన సమాజం. ఆయన (స) ఉన్నత నైతికతల గురించి తెలియనివాడు, ఆయన ప్రత్యక్ష, పరోక్ష జీవితాన్ని భేష్ అని ఒప్పుకోని వాడు ఆ సమాజంలో ఏ వ్యక్తీ లేడు. ఆయన(స)కు ఎంత దాపుగా ఉండే వ్యక్తి, ఆయన పట్ల అంతే గొప్ప అభిమాని. యే వ్యక్తుల ముందు ఆయన జీవితపు ఏ ఒక్క కోణం కూడా దాగుండలేదో, ఆ వ్యక్తులు ప్రప్రథమంగా ఆయన దైవదౌత్యాన్ని ధృవీకరించారు.

హజ్రత్ ఖదీజా (రజి)గారి ఉదాహరణనే తీసుకుందాం.

హజ్రత్ ఖదీజతుల్ కుబ్రా (ర) పదిహేనేళ్ళ వరకు ఆయన దాంపత్య జీవితంలో ఉన్న మహిళ. ఆమె వయస్సులో చిన్నవారేమీ కాదు. ఆయన (స) కంటే వయస్సులో పెద్ద. ఎప్పుడైతే దైవప్రవక్త (స) తమ దైవదౌత్యాన్ని ప్రకటించారో ఆమె వయస్సు 55 ఏండ్లు, ఆమె ఓ ప్రాజ్ఞత కలిగిన, వయస్సు మళ్ళిన, బుద్ధివివేచనాలు గలిగి ఉన్న మహిళ. దానికితోడు పదిహేనేళ్ళు ఆయనతో కాపురం చేసి భర్త జీవితాన్ని ఎంతో దగ్గరగా ఉండి వీక్షించిన మహిళకు భర్తలోని ఏ లోటుపాటు కూడా తెలియకుండా ఉండే ఆస్కారం లేదు. ప్రాపంచిక ప్రయోజనాల కోసం ఓ భార్య తన భర్త అధర్మ కార్యాల్లో పాలుపంచుకోగలదు. కాని ఆయన్ను విశ్వసించడం మాత్రం కుదిరే పని కాదు. ఈ వ్యక్తి దైవప్రవక్త అయి ఉంటాడు లేదా ప్రవక్త కాగలడు అని మాత్రం సాక్ష్యం ఇవ్వజాలదు. కాని హజ్రత్ ఖదీజా (ర) మాత్రం ఆయన పట్ల ఎంత అభిమానం గల మహిళో అని చెప్పడానికి తార్కాణం, ఆయన తనకు దైవదౌత్యం ఈ రకంగా లభించింది అని చెప్పగానే ఒక్కక్షణం కూడా ఆలస్యం చేయకుండా దాన్ని ఒప్పుకోవడం జరిగింది.

ఆ తరువాత, ఆయనకు మరీ దగ్గరగా వున్న వ్యక్తి హజ్రత్ జైద్ బిన్ హారిస్ (ర) వారి ఉదాహరణను చూడండి. ఈయన ఓ బానిసగా దైవప్రవక్త (స) వారి ఇంటికి వచ్చినప్పుడు 15 ఏళ్ళ కుర్రవాడు. దైవప్రవక్త (స)కు దైవదౌత్యం లభించినప్పుడు ఆయన వయస్సు 30 సంవత్సరాలు. అంటే మొత్తం పదిహేనేళ్ళు దైవప్రవక్త (స) వారింట ఉంటూ అన్ని విధాల, అన్ని కోణాలుగా ఆయన (స) వారి జీవితాన్ని పరికించి చూసే అవకాశం ఆయనకు లభించిందన్నమాటే. హజ్రత్ జైద్ (ర)కు దైవ ప్రవక్తంటే ఎంత ప్రాణమో, అభిమానమో చెప్పడానికి జరిగిన ఓ ప్రత్యేక సంఘటన నుండి తెలుసుకోవచ్చు. ఆ సంఘటన ఇది:

బాల్యంలోనే హజ్రత్ జైద్ (ర) బిన్ హారిస్ తమ తల్లిదండ్రుల నుండి వేరై పోవలసి వచ్చింది. దైవ మహత్యం ఆయన్ను దైవప్రవక్త (స) వరకు చేరవేసింది. ఆయన తల్లిదండ్రులకు, ఆయన పినతండ్రికి తమ కుమారుడు ఫలానాచోట బానిస బ్రతుకు బ్రతుకుతున్నాడని తెలిసి మక్కా నగరానికి వస్తారు. ఇది దైవప్రవక్త(స)కు దైవదౌత్యం లభించనప్పటి మాట. వారంతా హజ్రత్ ముహమ్మద్ (స) వారింటికి వచ్చి, "తమరు మా అబ్బాయికి బంధవిముక్తునిగా చేస్తే మేము మీకెంతో రుణపడి ఉంటాము" అని అడిగారు.

దానికి ఆయన (స), "సరే, నేను అబ్బాయి (జైద్)ను పిలుస్తాను. అతను మీ వెంట వెళ్ళదలచుకుంటే నాకేమీ అభ్యంతరం ఉండదు. మీ వెంట పంపివేస్తాను.

ఒకవేళ అతను నా వద్దనే ఉండదలిస్తే, నా వెంట ఉండదలచినవాణ్ణి బలవంతంగా నా నుండి వేరు చేసే మనిషిని కాను నేను" అని అంటారు.

ఈ మాటలు విన్న ఆయన తల్లిదండ్రులు, "మీరు ఎంతో న్యాయమైన మాట పలికారు, జైద్‌ను పిలుపించండి" అన్నారు.

హజ్రత్ జైద్ (ర) వారి ముందుకురాగా, దైవప్రవక్త ఆయనుద్దేశించి, "వీరిని గుర్తుపట్టగలవా?" అని అడిగారు.

"అవును! గుర్తుపట్టాను, ఈయన నా తండ్రి, ఆయన నా పినతండ్రి."

"వీరు నిన్ను మీ ఇంటికి తీసుకు వెళ్ళడానికి వచ్చారు. నీ ఇష్టమైతే సంతోషంగా వారి వెంట వెళ్లిపోవచ్చు" అన్నారు ఆయన(స).

ఆయన తండ్రి, పిన తండ్రి కూడా, "మేము నిన్ను మా వెంట తీసుకువెళ్ళ దలిచాము" అని అన్నారు.

సమాధానంగా జైద్ (ర) బిన్ హారిస్ ఇలా అన్నారు: "నేను, (దైవప్రవక్త వైపు వ్రేలుపెట్టి చూయిస్తూ) ఈయనలో చూసిన సుగుణాల తరువాత, ఆయన్ను వదిలి నా తండ్రి, నా బాబాయి మరియు బంధువుల వద్దకు పోదలచలేదు."

ఇదీ ఆయన(స)గారి నైతికతల విషయంలో ఆయన సేవకుడు ఇచ్చిన సాక్ష్యం. ఓ సేవకుడు యజమానికి కృతజ్ఞుడుగా మారిపోవడం సామాన్యంగా జరిగే విషయమే. కాని, ఆయనను విశ్వసించేటంత అభిమాని మాత్రం కావడం బహుకష్టం. విశ్వసించ డానికి కావలసిన విషయం, ఆయనలో మూర్తిత్వ ఔన్నత్యం, మహోన్నతమైన నైతిక విలువల పరిశుద్ధత తప్పకుండా ఉండితీరాలి. అదిచూసిన ఆయన సేవకుడు ఈయన తప్పకుండా ఓ ప్రవక్తే అని ప్రకటించడంలో ఏమాత్రం సంకోచించలేదు. మరో విషయాన్ని గుర్తుంచుకోవలసి ఉంది. అదేమిటంటే, హజ్రత్ జైద్ (ర) బిన్ హారిస్ సామాన్యమైన బుద్ధివివేచనలు కలవారుకాదు, మదీనా నగరంలో దైవప్రవక్త (స) వారి పరిపాలన ప్రారంభం అయ్యాక అనేక సైనిక పోరాటాల్లో ఆయన్ను ముజా హిదీన్‌ల పటాలాలకు అధ్యక్షునిగా చేసి పంపడం జరిగింది. ఇది ఆయన సామర్థ్యానికి తార్కాణం.

ఆ తరువాత హజ్రత్ అబూబక్ర్ సిద్దీఖ్ (ర)గారిని చూద్దాం. దైవదౌత్యం రాకపూర్వం ఆయన దైవప్రవక్త (స)గారికి ప్రాణమిత్రునిగా ఉండి ఆయన్ను దగ్గరగా వీక్షించే అవకాశం లభించింది. ఆయన ఎల్లప్పుడు ఆయనవెంటే ఉండేవారు. మక్కా నగరంలో అందరికంటే యే ఇరువురి మధ్య గాఢమైన స్నేహబంధం ఉండిందో వారిలో ఒకరు హజ్రత్ ముహమ్మద్ (స) మరియు ఇంకొకరు హజ్రత్ అబూబక్ర్ (ర)లు. ఓ మిత్రుడు తన మిత్రుణ్ణి ప్రేమించగలడు. అతని మనసులోని మాటను

చెప్పగలడు. కాని ఆ మిత్రుడు ఓ దైవప్రవక్త అని మాత్రం చెప్పేటంతగా అభిమానించ లేడు. హజ్రత్ అబూబక్ర్ సిద్దీఖ్ (ర) ఎలాంటి సంకోచం లేకుండా ఆయన్ను ప్రవక్త అని ప్రకటించడం, ఇరవై ఏళ్ళ సుదీర్ఘమైన సహచర్యంలో ఆయన నైతిక పరిశుద్ధతను మరియు ఆయన మహోన్నతమైన నడవడికను గుర్తించగలగడమే. ఈ కారణం చేతనే ఆయన సత్యాన్ని గుర్తించి, ఇంత మహోన్నత వ్యక్తిత్వం గల మనిషే తప్పకుండా ఓ ప్రవక్త కాగలడని, ఆయన తప్పకుండా ఓ ప్రవక్తే అని ప్రకటించడం జరిగింది.

ఆ పిదప హజ్రత్ అలీ (ర) గారి వంతు.

హజ్రత్ అలీ (ర) గారిపేరును నేను ముందుగా ఎందుకు ఎత్తలేదంటే, అప్పుడు ఆయన వయసు కేవలం పది సంవత్సరాలే. ఆయన దైవప్రవక్త (స) వారి ఇంటనే పెంచిపోషించబడ్డారు. ఓ పదేళ్ళ కుర్రవాడు ఏ ఇంటనైతే పెరుగుతూ ఉంటాడో, మరెవరి వద్దనైతే ఉంటూ వస్తాడో అతను ఆ ఇంటికి సంబంధించిన ప్రతి కోణాన్ని బాగా ఎరిగి ఉంటాడు. ముఖ్యంగా ఆయన ఎంత వివేచనాపరుడైన మనిషంటే, భవిష్యత్తులో ఆయన సామర్థ్యాల ఆధారంగా ఓ గొప్ప వ్యక్తిగా వినుతికెక్కినవారు. అంటే బాల్యం నుండే ఆయనకు మంచి బుద్ధిజ్ఞానాలు, వివేచనా సామర్థ్యాలు ఉన్నాయని మనం అర్థం చేసుకోవచ్చు. అలాంటి ప్రాజ్ఞుడు, వివేచనాపరుడైన బాలుడు కూడా హజ్రత్ ముహమ్మద్ (స)ను దైవప్రవక్త అని ఒప్పుకోవడం జరిగిందంటే ఆయన (స)గారి ప్రేమానురాగాలు, ఆయన (స) మహోన్నతమైన మరియు పరిశుద్ధమైన నైతికత, నడవడికల గురించి బాగా ఎరిగి ఉండబట్టేగదా!

కాబట్టి సద్వర్తన, సదాచారం విషయంలో పైన చెప్పబడిన గొప్ప ఉదాహరణల ద్వారా తెలిసివచ్చిందేమిటంటే, ఏ వ్యక్తి అయితే దేనిగురించి బోధిస్తున్నాడో, ఆ బోధనకు తగ్గట్టుగా అతని జీవనచక్రం కూడా ఆ బాటలోనే నడవాలి అన్నది. అతని నైతికత ఎంత పరిశుద్ధమైనది మరియు అతని నడవడి ఎంత మహోన్నతమైనదై ఉండాలంటే, అతను అల్లాహ్ మార్గం వైపునకు పిలవడానికి లేచినప్పుడు అతని మాటకు విలువ ఉండాలి. అతని మాట ప్రభావితం చేసేదిగా ఉండాలి. అతని చేతలు అతని నడవడిక ఓ సాక్ష్యంగా నిలువాలి. ఇతని మాటలో సత్యం ఉందని ప్రజలు ఒప్పుకోవాలి. ఎదుటివారు ఆ విషయాన్ని ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా, వారు మాత్రం ఈ మనిషి తన మాటల్లో నిజాయితీపరుడు, ఇతను చెప్పేదంతా తాను నమ్మిన సిద్ధాంతం మరియు దాని ప్రచారానికి కట్టుబడి ఉన్నాడు కాబట్టే అలా బోధిస్తున్నాడు అని మనస్ఫూర్తిగా నమ్మేటట్లు ఉండాలి. కాబట్టి దైవప్రవక్త ముహమ్మద్ (స) గారి బద్ధ శత్రువు అయిన అబూజహ్ల్ కూడా ఓ సందర్భంలో ఇలా అనడం జరిగింది.

"ఓ ముహమ్మద్ (స)! మేము నిన్ను అసత్యవాది అని అనడం లేదు. కాని ఏ సందేశమైతే నీవు తెచ్చావో అది అసత్యమైనది అని అంటున్నాం అంతే."

అంటే, ఆయన (స) గారి బద్ధ విరోధి కూడా ఆయన సత్యసంధతను ఒప్పుకోవడం జరిగింది. కాబట్టి ఓ సందేశ ప్రచారకుని మరో గొప్ప సుగుణం ఏమిటంటే అతని మాటలు అతనిచేతలకు తగినట్లుగా ఉండడం. అంటే నడవడికలోని ఔన్నత్యం, నైతికతలోని పరిశుద్ధత.

మూడవ సుగుణం ఏమిటంటే, "వ ఖాల ఇన్ననీ మినల్ ముస్లిమీన్" అన్నది. అంటే, నేను ముస్లిమును అని ప్రకటిస్తాడు అని. దీన్ని అర్థం చేసుకోవాలంటే, మక్కా నగరపు ఆ వాతావరణాన్ని దృష్టిలో ఉంచుకోవాలి. ఏ కాలంలోనైతే ఏ వ్యక్తి అయినా లేచి నిలబడి ఓ దైవతిరస్కారి (కాఫిర్)ని సంబోధిస్తూ, "నేను ముస్లిమును" అని ప్రకటించడం. ఈ ప్రకటన ఓ సాధారణ విషయం కాదు అప్పటిలో. పైగా క్రూరమృగాలను తనపై దాడి చేయమని ఆహ్వానించడం లాంటిది. అలాంటప్పుడు ఓ సందేశ ప్రచారకుని యే ప్రత్యేకత అయితే మన ముందుకు వస్తుందో అది కేవలం అల్లాహ్ వైపునకు ఆహ్వానించేవాడు, కేవలం పరిశుద్ధమైన చేతల ద్వారా ప్రాణ శత్రువులకు, అననుకూల పరిస్థితుల్లోనూ, తాను ఓ ముస్లిమును కాదు అని చెప్పకుండా ఆ సత్యాన్ని దాచిపెట్టకుండా ఉండడం. తాను ఓ ముస్లిమును అని ప్రకటించడంలో సిగ్గు పడకపోవడం, వెరువకపోవడం. పైగా బాహాటంగా, "అవును! నేను ముస్లిమునే, మీరు చేసుకోదలచింది చేసుకోండి" అని ప్రకటించడం. మరో రకంగా చెప్పాలంటే, సందేశ ప్రచారకుని మూడవది ముఖ్యసుగుణం ఏమిటంటే, నేను ఎవరికి భయపడేవాడిని కాను, పెద్ద ధైర్యవంతుణ్ణి అని హెచ్చరించడం అన్నమాట. దైవమార్గం వైపునకు పిలువగా ఏ మాత్రం దెబ్బతగిలినా విలవిల్లాడుతూ అచేతనంగా కూర్చుండి పోవడం ఓ పిరికిపంద మాత్రమే చేయగలడు. కాని తీవ్రమైన శత్రుత్వ వాతావరణంలో, వ్యతిరేక పవనాలు వీస్తున్నప్పుడు, ప్రమాద ఘంటికలు మ్రోగుతున్నప్పుడు ఇస్లామ్ ధ్వజాన్ని ఎత్తి నిలబడగలిగే వాడే అసలు సిసలైన సందేశ ప్రచారకుడు. అతను దీని పర్యవసానం ఎలా ఉంటుంది? అని కూడా ఆలోచించడు. దైవప్రవక్త (స) గారి వ్యక్తిత్వం ఆ ధైర్యసాహసాలకు సంపూర్ణ ప్రతిరూపం. మక్కా నగరంలో బాహాటంగా ఆయన (స) ఇస్లామ్ సందేశం వినిపించి దానికి సాక్ష్యంగా నిలిచినవారు. అలాగే ఆయన ప్రజల్లో ఆ కార్యాన్ని కొనసాగించిన మహామనిషి. ఆయన రక్తాన్ని కళ్ళజూడడానికి, ఆయనను ఆయన అనుచర గణాన్ని హింసా దౌర్జన్యాల కొలిమిలో మాడ్చడానికి వెనకాడలేదు. ఆయన అలాగే ఏకధాటిగా పద మూడు సంవత్సరాలు దైవసందేశాన్ని వినిపిస్తూనే ఉన్నారు. ఎనలేని ఆ వాతావరణపు చీకట్లు క్రమ్ముకోగా, ఒత్తిళ్ళు అధికంకాగా, కష్టాలపరంపరలు అధికమౌతూపోగా, ఆయన తన సందేశాన్ని మాత్రం కొనసాగిస్తూనే పోయారు. ఆ పిదప మదీనాకు చేరిన తరువాత ఏ పరిస్థితులైతే వెన్నంటివచ్చాయో, మరే ప్రమాదకరమైన గొప్ప యుద్ధాలు సంభవించాయో వాటిలోను ఆయన (స) గారి అడుగు ఎప్పుడూ వెనకు

జరుగలేదు. 'హునైన్' పోరాటం సందర్భంలో ముస్లిములకు దాదాపుగా అపజయం ఎదరైనంత పనైంది. అయినప్పటికి మహాప్రవక్త ముహమ్మద్ (స) తన స్థానాన్ని వదిలిపెట్టకుండా, ఇంకా చెప్పాలంటే, యుద్ధరంగంలో శత్రు సైనిక పంక్తులకు ఎదురుగా నడుస్తూనే పోయారు. తాను ఎవరో అన్న సత్యాన్ని కూడా దాచకుండా శత్రువులకు వినబడేటట్లు,

أَنَا النَّبِيُّ لَا كَذِبْ أَنَا ابْنُ عَبْدِ الْمُطَّلِبْ

"నేను దైవప్రవక్తను, అసత్యవాదిని కాను. నేను అబ్దుల్ ముత్తలిబ్ పౌత్రుణ్ణి" అంటూ బిగ్గరగా నినదించడం కూడా జరిగింది.

ఈ ప్రకటన చేసింది ఆయన్ను శత్రువులు పూర్తిగా చుట్టుముట్టిన సమయంలో. వెంట కేవలం ఇద్దరు ముగ్గురు సహచరులు మాత్రమే ఉన్న తరుణంలో. ఆ సమయంలో ఆయన అవును! నేను ప్రవక్తనే అని చాటడం, ఓ సత్యధర్మ ప్రచారకుడు ఎంత స్థయిర్యవంతుడు, ధైర్యసాహసాలుగలవాడు అయి ఉండాలో చాటి చెబుతున్న సత్యం. దైవసందేశ ప్రచారకునిలో ధైర్యం, స్థయిర్యం, నిలకడ అనే సుగుణాలే లేకపోతే ఆ మార్గంలో అతను నిలబడజాలడు. ఒకవేళ అతను నిలబడగలిగినా, తన భీరత్వం ద్వారా అసలు కార్యానికే విఘాతం కల్పించడానికి కారణభూతుడౌతాడు. (ఖుత్బాయె యూరప్ పేజి:343)

ఇస్లాం ధర్మ ప్రచార పనికి అవసరమైన వ్యక్తిగత, సామూహిక సుగుణాలు

సందేశవహునిలో ఉండవలసిన సుగుణాల గురించి చెప్పుకున్న తరువాత, ఈ పని కోసం వారిలో ఉండవలసిన కనీస సుగుణాలేవో టూకీగా మీ ముందుంచుతున్నాను. అవే గనక లేకపోతే ఓ సత్యసందేశవహుడు తన విధిని సక్రమంగా నిర్వర్తించలేడు.

వ్యక్తిగత సుగుణాలు

1. మొదటిది మౌలికమైన సుగుణం, మనలో ప్రతి ఒక్కడూ తన మనోవాంఛకు వ్యతిరేకంగా పోరాడి, దాన్ని ముస్లిముగా దైవా దేశాలను తప్పక పాటించేటట్లుగా మలచడం. ఇదే విషయం హదీసులో ఈ రకంగా చెప్పడం జరిగింది.

اَلْمُجَاهِدُ مَنْ جَاهَدَ نَفْسَهُ فِي طَاعَةِ اللهِ

"అల్లాహ్ విధేయతలో తన కోరికలకు వ్యతిరేకంగా పోరాడేవాడే అసలైన ముజాహిద్."

అంటే, బయటి ప్రపంచంలో దైవధిక్కారులకు వ్యతిరేకంగా పోరాడడానికి బయలుదేరకముందు మీలో దాగున్న తిరుగుబాటుదారుణ్ణి దైవమార్గంపైకి

తీసుకురండి. అది (అంటే కోరిక) సతతం దైవాదేశాలకు, దైవప్రసన్నతకు వ్యతిరేకంగా నడువమని మిమ్మల్ని లోనుండే వత్తిడి తెస్తుంది. అలాంటిది ఏదైన మీలో పెంచి పోషించబడుతూ, అల్లాహ్ ప్రసన్నతకు వ్యతిరేకంగా మిమ్మల్ని నియంత్రించేటంత బలం కలిగి ఉంటే, మీరు బయటి ప్రపంచంలో విస్తరించి ఉన్న దైవధిక్కారులకు వ్యతిరేకంగా యుద్ధం ప్రకటించడం అర్థంపర్థంలేని ఆలోచన. దాన్ని ఉదాహరణగా చెప్పుకోవాలంటే, ఇంట్లో మత్తుపానీయ సీసాలు దాచుకొని బయట మాత్రం సారాయి నిషేధం గురించి పోట్లాడినట్లు ఉంటుందా వ్యవహారం. ఈ ద్వంద్వ వైఖరి మన ఉద్యమాన్ని నాశనం చేసే వైఖరి. మొదట మీరు స్వయంగా దైవం ఎదుట తల వంచండి. ఆ తరువాతే ఇతరులను ఆయన విధేయత వైపుకు పిలవండి.

2. ఈ జిహాద్ (తన కోరికలకు వ్యతిరేకంగా పోరాటం) తదుపరి వచ్చే రెండో స్థానం హిజ్రత్‌ది. హిజ్రత్ అసలు ఉద్దేశ్యం ఇల్లూవాకిలి వదిలేసి వెళ్ళిపోవడం కాదు; దైవధిక్కార వైఖరిని వదిలిపెట్టి దైవ ప్రసన్నత వైపునకు పురోగమించడం. అసలు ముహాజిర్ ఒకవేళ స్వస్థలాన్ని వదిలి వెళ్ళిపోతున్నాడంటే, అతనికి తన స్వస్థలంలో దైవచట్టాల ప్రకారం జీవితం గడిపే అవకాశాలు లభించకపోవడం వల్లనే. అయితే ఎవరైనా తన ఇల్లూ వాకిలీ వగైరాలను వదిలేసి అల్లాహ్ విధేయతను అనుసరించకపోతే అతని ఆ హిజ్రత్ ఓ పిచ్చితనం తప్ప మరేదీ కాదు. ఈ యదార్థాన్ని హదీసుల్లో వివరంగా చెప్పడం జరిగింది. ఉదాహరణకు ఈ ఒక్క హదీసునే తీసుకుందాం. దైవప్రవక్త (స)ను సంబోధిస్తూ ఒకరు ఈ ప్రశ్న వేస్తారు.

ای الھجرۃ افضل یارسول اللہ

"ఓ దైవప్రవక్తా! ఎలాంటి హిజ్రత్ ఉత్తమమైన హిజ్రత్?" అని. ఆయన దానికి సమాధానం ఇస్తూ ఇలా సెలవిచ్చారు:

ان تھجر ما کرہ ربک

"అల్లాహ్‌కు అయిష్టమైన వాటినంతటిని నీవు వదిలేయాలి.
(అదే మేలైన హిజ్రత్)."

లోనదాగివున్న తిరుగుబాటుదారుడే దైవవిధేయునిగా మారనప్పుడు మనిషి స్వస్థలాన్ని వదిలి వెళ్ళిపోవడానికి విలువ ఎక్కడిది? కాబట్టి నేను కోరేదేమిటంటే, మీరు బయటి శక్తులన్నింటి కంటే ముందు మీలోని తిరుగుబాటు శక్తులతో పోరాడండి. పర్యాయపదమైపోయిన 'కాఫిర్'లను ముస్లిములుగా మలచడానికి ముందు మీ మనస్సును, మీ కోరికను ముస్లిముగా చేయండి. ఈ విషయాన్ని సమగ్రమైన పదాల్లో ఇలా వివరించవచ్చు:

مثل المومن ومثل الايمان كمثل الفرس في اخيته
يجول ثم يرجع الى اخيته -

దైవప్రవక్త (స) వారి ఓ హదీసు ప్రకారం, "మీరు మిమ్మల్ని ఓ గుంజకు కట్టివేయబడిన గుర్రంలా మలచుకోండి. అది ఎంత దూరం పోయి వచ్చినా మొత్తానికి త్రాడు దాన్ని పోనిచ్చేటంత మట్టుకే పోయి రాగలదు."

ఇలాంటి గుర్రం పరిస్థితి తిరుగుబోతు గుర్రం కంటే భిన్నమైనది. ఆ తిరుగుబోతు, స్వతంత్ర కలిగిన గుర్రం ప్రతి మైదానంలో తిరుగుతుంది. ప్రతి చేనులోబడి మేసేస్తుంది. ఎక్కడ దానికి పచ్చగడ్డి అగుపడితే అడ్డుఅదుపులేకుండా మేస్తుంది. కాబట్టి ఆ తిరుగుబోతైన గుర్రపు అలవాటును మీ నుండి తీసివేసి, గుంజకు కట్టబడివున్న గుర్రం అలవాటును పెంపొందించుకోండి.

ఈ అలవాటును అలవర్చుకోవడంతోపాటు మరో అడుగు ముందుకువేసి మీ దగ్గరి వాతావరణంతో- దాన్ని నేను హోంఫ్రంటుగా పిలుస్తాను- పోరాటం ప్రారంభించండి. ఇంటివారు, మీ బంధువులు, మీ మిత్రులు, మీ సొసైటీతో మీకు దగ్గరి సంబంధాలుంటాయి. వారందరితో ఓ ప్రాక్టికల్ సంఘర్షణ ప్రారంభం కావాలి. సంఘర్షణ అంటే మీ సంబంధీకులతో కుస్తీ పట్టడం గాని వారితో జగడానికి దిగడం గాని కాదు. మీరు ఓ వ్యక్తిగా, ఓ సముదాయంగా జమాఅత్ కార్యకర్త అయి మీ ధ్యేయ సాధనకు ఎంత కట్టుబడి ఉండాలంటే మీ సిద్ధాంతానికి ఎంతమట్టుకు అంకితం అయిపోవాలంటే, ఎలాంటి ధ్యేయం లేకుండా, లక్ష్యం లేకుండా జీవితాలను గడుపుతున్న వీరు మీ సిద్ధాంతానికి కట్టుబడి ఉండడాన్ని సహించలేకుండా ఉండడమే ఆ సంఘర్షణ. మీ భార్యలు, మీ సంతానం, మీ తల్లిదండ్రులు, మీ బంధుమిత్రులు మీ వైఖరికి వ్యతిరేకంగా మిమ్మల్ని అడ్డుకోవడానికి వివశులైపోవడం, మీరు మీ ఊళ్ళోనే ఓ ఆగంతులైపోవడం, మీరు మీ ఉపాధి కోసం ఎక్కడైతే పనిజేస్తుంటారో అక్కడ మీ ఉనికి ప్రస్ఫుటంగా కటకంగా మారిపోవడం. ఆఫీసులో కూర్చుని ప్రమోషన్ల కలలనుకనే ఆ మెత్తటి కుర్చీ మీకు నిప్పుల కుంపటై పోవాలి. మొత్తానికి ఎవరైతే మీకు అతి సన్నిహితంగా ఉంటారో వారితోనే ఆ సంఘర్షణ మొదలుకావాలి. ఎవరి ఇంట జిహాద్ రంగం సిద్ధంగా ఉందో అతను కొన్ని మైళ్ళు నడిచి జిహాద్‌కు వెళ్ళడం ఎందుకు? మొదటి పోరాటం ఇంటి నుండే ప్రారంభం అయేట్లు ఉండాలి. ఇప్పటి వరకు, ఎక్కడెక్కడి నుండి ఆ సంఘర్షణ ప్రారంభమయిందో ఆ వార్తలు విని తృప్తి చెందుతున్నాను. మరెక్కడి నుండి అలాంటి వార్తలు నాకు అందడం లేదో అలాంటి వార్తలు వస్తాయేమోనని ఆత్రుతతో ఎదురుచూస్తున్నాను.

అయితే, నేను ఇప్పుడు తెలియజేయదలిచిందేమిటంటే, ఈ సంఘర్షణ అంతా ఓ డాక్టరు ఓ రోగితో చేసే సంఘర్షణ తీరుగా ఉండాలన్నదే. డాక్టరు అసలు రోగితో

పోరాడనేపోరాడడు. అతని పోరాటమంతా రోగంతోనే. అతని ప్రయత్నం పూర్తిగా సానుభూతితో నిండి ఉంటుంది. ఒకవేళ అతను రోగికి చేదుమందు (తాగించినా) లేదా అతని ఏ అవయవంపై కత్తి బెడుతున్నాడంటే, అదంతా అతను సానుభూతితో, చిత్తశుద్ధితో చేస్తున్నదే. అందులో ఎలాంటి శత్రుత్వం ఉండదు. అతని అసహ్యతగాని, అతని కోపంగాని కేవలం రోగానికి వ్యతిరేకంగానే. రోగికి వ్యతిరేకంగా కాదు. అచ్చం ఆ తీరుగానే ఓ మార్గభ్రష్టుడైన సోదరుణ్ణి మార్గం వైపునకు తీసుకురండి. అతను ఎట్టి పరిస్థితుల్లోనూ, తనను నీచంగా చూడడం జరుగుతోందనిగాని లేదా నేరుగా తనను అసహించుకోవడం జరుగుతోందనిగాని భావించకుండా, అది కేవలం తన పట్ల సానుభూతి ఉండి ప్రేమగా పిలుస్తున్నాడనే భావన కలిగేటట్లు మెలగవలసి ఉంటుంది.

నిజానికి అసలు తబ్లీగ్ అన్నది ప్రసంగాలు మరియు రచన ప్రదర్శనల ద్వారా జరిగేది కాదు. ఇవి సందేశ ప్రచారానికి అవలంబించే పసలేని విధానాలు. అసలు తబ్లీగ్ లేదా సందేశ ప్రచారం ఏదంటే, మీరు పూర్తిగా నిలువెల్ల సందేశమై ఓ నమూనాగా నిలువడం. ఎక్కడైనా ప్రజలముందు ఇలాంటి ఓ మచ్చు అగుపడ్డా, మీ వైఖరి ద్వారా, వీరే దైవమార్గంపై నడిచే వారు అని వారు గుర్తించగలరు. కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేసేవాడు ప్రజల ముందుకు వస్తే, మొత్తం కాంగ్రెస్ పార్టీయే అతని కళ్ళెదుట ఎలా మెదలిపోతుందో మీరు కూడా ఇస్లామ్ కోసం సర్వస్వాన్ని ధార పోయగలిగితే వారిముందు ఇస్లామియోద్యమం రూపురేఖలన్నీ బహిర్గతం అయ్యే టట్లు ఉండాలి. ఈ యదార్థాన్ని విడమర్చి చెబుతూ, దైవప్రవక్త ముహమ్మద్ (స),

إذا رؤوا ذكر الله

"వారిని చూడగానే అల్లాహ్ గుర్తుకువస్తాడు" అని చెప్పడం జరిగింది.

ఇది వెంటనే జరిగిపోవాలని నేనను. ఇది క్రమక్రమంగా లభించే స్థానం.

దైవమార్గంలో తన వాతావరణంతో ఎడతెగకుండా సంఘర్షణ జరుగుతూ ఉన్నప్పుడు, మీరు ఎల్లవేళలా, ప్రతిక్షణం మీ ధ్యేయసాధన కోసం కృషిచేస్తూ త్యాగాలు చేస్తూనే ఉంటారు. అప్పుడుగాని ఓ సమయాన మీకు ఆ స్థానం లభించగలదు. అప్పుడే మీరు నిలువెల్ల సందేశంగా మారిపోగలరు. ఈ లక్ష్యసాధన కోసం మీరు దివ్యఖుర్ఆన్‌ను, హదీసు గ్రంథాల్ని లోతుగా అధ్యయనం చేసి ఇస్లామ్ ఏ రకపు మనుషులను కోరుకుంటుందో చూడండి. అలాగే దైవప్రవక్త (స) ఏ రకం మనుషులను తయారు చేశారో, ఎలాంటి గుణగణాలను ఇస్లామీ యోద్యయ కార్యకర్తల్లో పెంపొందించారో తెలుసుకోండి. ప్రపంచానికే గొప్ప సంస్కర్త అయిన

ప్రవక్త (స) ఏ మానవులనైతే తయారు చేశారో, వారిని పదిహేనేళ్ళ వరకు తీర్చిదిద్ది రంగంలో దించడం జరిగింది. ఆ తయారీ వివరాలేమిటో అది ఏ క్రమ పద్ధతిలో సాగిందో తెలుసుకోండి. ఈ తయారీలో ఏ సుగుణాలకు ముందు ప్రాధాన్యత నివ్వబడింది? మరే సుగుణాలకు తదుపరి ఇవ్వడం జరిగిందో తెలుసుకోండి. యే స్థానానికి చేరుకున్నప్పుడు అల్లాహ్ వారిని, "ఇక మీరు ప్రపంచంలోని ఉత్తమ సమాజ సభ్యులయ్యారు" అని కితాబిచ్చాడో, ప్రపంచాన్ని సంస్కరించడానికి ఎప్పుడు సమర్థులయ్యారో అని చెప్పడం జరిగిందో దాన్ని అర్థం చేసుకోండి. ఈ నమూనానే స్వయంగా మీ తయారీ కోసం ముందుంచుకోవలసి ఉంటుంది.

ఇక్కడ వివరాల్లోనికిపోయే అవకాశం లేదు. కేవలం రెండు హదీసుల్ని మీ మార్గదర్శకానికి నేను ప్రస్తావిస్తున్నాను. వాటి ద్వారా ఏ యే సుగుణాలుగల వ్యక్తులు దీనికి అవసరం అవుతారో వాటి గురించి దైవప్రవక్త (స) ఎలా సెలవిచ్చారో చెబుతాను. అవి ఇలా ఉన్నాయి:

مَنْ احب لله و ابغض لله و اعطى لله و منع لله
فَقَدِ استكمل الايمان۔

"మనిషి సంపూర్ణ విశ్వాసి అయ్యేది, అతని పరిస్థితి పూర్తిగా ఇలా మారినప్పుడే. అతని శత్రుత్వంగాని, అతని మిత్రుత్వంగాని, ఇతరులకు బహూకరించే అతని తత్వంగాని, ఒకరికి ఇవ్వకుండా ఆగిపోయే మనస్తత్వంగాని కేవలం అల్లాహ్ కోసమే అయివుండాలి. మనోవాంఛలు మరియు ప్రాపంచిక ప్రేరణలకు అందులో ఏమాత్రం ప్రమేయం లేకుండా ఉండాలి."

మరో హదీసులో దైవప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు:

أمرني ربي بتسع

"నా ప్రభువు నాకు తొమ్మిది విషయాల గురించి ఆదేశించాడు."

١۔ خشية في السر والعلانية

1. ప్రతి ప్రత్యక్ష, పరోక్ష పరిస్థితిలోనూ నేను దైవానికి భయపడుతూ ఉండాలి.

٢۔ وكلمة العدل في الغضب والرضا

2. ఒకరిపై దయగలిగినా, ఇంకొకరిపై కోపం వచ్చినా ఈ రెండు పరిస్థితుల్లోనూ నేను న్యాయమే చేయాలి.

٣۔ والقصد في الفقر والغنا

3. దారిద్ర్యంలో ఉన్నా లేదా సంపన్నుడనై ఉన్నా అన్ని పరిస్థితుల్లోనూ సమతౌల్యాన్నే పాటించాలి.

٤- وإن اصل من قطعني

4. నాతో సంబంధాలను త్రెంచుకున్న వారితో నేను సత్సంబంధాలను పునరుద్ధరించుకోవాలి.

٥- واعطي من حرمني

5. నాకు ఇవ్వకుండా చేసేవానికి ఏదైనా ఇచ్చి నేను సత్కరించాలి.

٦- واعف من ظلمني

6. నాపై దౌర్జన్యం చేసేవాణ్ణి క్షమించాలి.

٧- وان يكون صمتي فكرا

7. నా మౌనం ఆలోచనామయమై ఉండాలి.

٨- ونطقي ذكرا

8. నా సంభాషణ దైవసంస్మరణమై ఉండాలి.

٩- ونظري عبرة

9. నా దృష్టి నాకు గుణపాఠం నేర్పే దృష్టి అయివుండాలి.

కావలసిన ఈ సుగుణాలను చెప్పిన తరువాత దైవప్రవక్త (స) ఇంకా ఇలా సెలవిస్తున్నారు:

أُمرت ان امر بالمعروف وانهىٰ عن المنكر

"మంచిని ఉపదేశించమని, చెడును త్రుంచమని నాకు ఆదేశించడం జరిగింది."

దీని ద్వారా తెలిసిందేమిటంటే, మంచిని వ్యాపింపజేయడానికి, చెడును అంతమొందించడానికి ఏ సమాజం అయితే నడుము బిగిస్తుందో ఆ సమాజపు ప్రతి వ్యక్తిలో ఈ సుగుణాలు ఉండి తీరాల్సిందే. ఆ సుగుణాలతోనే ఈ విధి నిర్వహించబడగలదు. ఆ సుగుణాలు లేకుండా మనం మన హోదా డిమాండ్లను పరిపూర్తి చెయ్యలేము.

సామూహికంగ పాటించాల్సిన సుగుణాలు

అది వ్యక్తిగత గుణగణాల ప్రణాళిక. ఇక కావలసింది సామూహికంగా కావలసిన ఇతర నైతిక గుణగణాల విషయమిది. సాముదాయిక వ్యవస్థను పటిష్టం మరియు క్రియాశీలకం చేయడానికి గాను, జమాఅత్ సభ్యుల నడుమ ప్రేమ, వాత్సల్యం మరియు సానుభూతి కావాలి. పరస్పరం వారిలో సదావగాహన ఉండాలి.

అపనమ్మకానికి బదులు నమ్మకం, భరోసాలుండాలి. కలిసిపనిచేసే సామర్థ్యం అవసరం. అలాగే ఒకరికి ఒకరు హితం బలికే అలవాటు కావాలి. స్వయం ముందుకు నడుస్తూ ఇతరులను కూడా తమ వెంట తీసుకువెళ్ళే ప్రయత్నం చేయాలి. ఈ సుగుణాలు ప్రతి సంస్థ కోసం అనివార్యమైన సుగుణాలే. అలాకాకుండా, ఒక్కొక్కరుగా అందరూ మహోన్నతమైన మంచి గుణాలనే పుణికిపుచ్చుకున్నప్పటికీ, వారు పరస్పరం కలువకుండా వేరువేరుగా ఉండిపోతే, ఒకరి నొకరు సహాయపడకుండా ఉంటే, భుజానికి భుజం కలిపి నడవలేకుండాపోతే, మనం అసత్య ధ్వజవాహకులను ఏమీ చేయలేని స్థితిలో ఉండిపోగలం.

వ్యక్తిగతంగా ఉన్నతమైన సుగుణాలుగల వ్యక్తులు మనలో ఎప్పుడూ ఉంటూనే వస్తున్నారు అని నేనంటే అందులో తప్పేలేదు. వారు ఈ రోజు కూడా తప్పకుండా ఉన్నారు. ఒకవేళ మనం, ఇలాంటి వ్యక్తులు ఇతర యే సమాజంలోనూ లేరు అని సవాలు విసిరినా, బహుశా ఆ సవాలును స్వీకరించేవారు ఎవరూ ఉండక పోవచ్చు. కాని ఈ వ్యవహారం కేవలం వ్యక్తిగత సంస్కరణకే పరిమితమైనది. ఎవరైతే తమ వ్యక్తిగత సంస్కరణలో మంచి పట్టుసాధించగలిగారో వారు మహా అయితే కొన్నివందల మందిలోనో లేదా కొన్ని వేల మందిలోనో తమ ప్రభావాన్ని వ్యాపింపజేసి, పవిత్రను సాధించి వెళ్ళిపోయినవారే. ఈ విధానం ఏమంత గొప్ప కార్యాలు ఆచరించే విధానం కాదు. పెద్ద పెద్ద బరువులను ఎత్తగలిగి, కుస్తీలో అనేక మందిని చిత్తుజేయ గలిగే పహిల్వాను కూడా ఓ సుశిక్షితమైన రెజిమెంటు ముందు కొద్దిసేపైన నిలువ జాలడు. అలాగే, మనలోని కొందరి తీరుకూడా అలానే ఉంది. వ్యక్తిగతంగా తాము ఎంత గొప్ప నీతి నిజాయితీపరులైె, తమలో తాము ఎంతగొప్ప సంస్కారులైనప్పటికీ ఓ రిజిమెంటు భాగంగా పనిజేయకుండా కేవలం వ్యక్తిగతంగానే పనిచేస్తూ సుశిక్షితమైన రెజిమెంటు ఎదుట తొడచరిచి నిలబడినట్లుగానే నిలబడు తున్నారు. వ్యక్తిగత సంస్కరణ రీత్యా మన జమాఅత్‌లోనూ మేలైన కార్యకర్తలకు కొదవలేదు. వారి పరిస్థితినిజూస్తే నాకు అసూయ కూడ కలుగుతోంది. అయితే సాముహిక సంస్కరణకు సంబంధించినంతవరకు పరిస్థితులు విచారం కలిగించేలా ఉన్నాయి. అందుకని, సాముహికంగా దేన్ని త్యజించే స్థితిలో ఉన్నారో మరియు వేటిని అనుసరించవలసి ఉందో తెలుసుకోవడం ఎంతో అవసరం.

దివ్యఖుర్ఆన్‌లో ఈ సమస్యపై సూత్రప్రాయంగా వివరమైన మార్గదర్శ కాలున్నాయి. అలాగే హదీసుల్లోనూ ఆ సూత్రాలకు సంబంధించిన సంపూర్ణ వివరాలు ఉన్నాయి. ఆ తరువాత దైవప్రవక్త(స), మరియు సహాబా (ర) వారి జీవిత చరిత్రల అధ్యయనాల వల్ల కూడా మనకు కావలసిన సాముహిక నైతిక విలువలకు సంబంధించిన ఆచరణాత్మకమైన నమూనాలు లభిస్తాయి. వీటిని చదివి, మన

సాముదాయిక వ్యవస్థలో ఏయే లోటుపాట్లు ఉన్నాయో బేరీజు వేసుకొని చూడండి. ఆ లోపాలను అధిగమించే ప్రయత్నం చేయండి.

సామూహిక వ్యవస్థలో ఓ వ్యక్తికి మరో వ్యక్తితో అవసరం ఏర్పడడం అనివార్యం. పరస్పర అవగాహన, సానుభూతి, త్యాగం మరియు సహనాలే లేకపోతే మీ మనస్తత్వాల్లో చోటుచేసుకొని ఉన్న అభిప్రాయభేదాలు జమాఅత్ వ్యవస్థను నాల్గు రోజులకంటే అధికంగా కొనసాగనియ్యవు. సాముదాయిక వ్యవస్థ నడిచే సూత్రం, కేవలం ఇతరుల కొరకు మీరు మీ సొంత లాభాన్ని కొంత వరకు వదిలి వేయడం, ఈ త్యాగం చేసే ధైర్యమే మీకు లేకపోతే మీరు ఏ విప్లవం ఊసు కూడా ఎత్తడానికి వీల్లేదు.

అల్లాహ్ మార్గంలో చేసే కృషికి అవసరమైన అంశాలు

అల్లాహ్ మార్గంలో జరిపే కృషికి కావలసిన సుగుణసంపదకు సంబంధించిన వివరాలు ఖుర్ఆన్ మరియు హదీసుల్లో వివరంగా చెప్పడం జరిగింది. కేవలం చెప్పడమేకాకుండా ఒక్కొక్క సుగుణాన్ని, అది ఎలా ఉండాలి, ఎంత మోతాదులో ఉండాలన్న విషయం కూడా విశదంగా చెప్పడం జరిగింది. వీటికి సంబంధించిన ఆదేశాలను, సూచనలన్నిటిని మీరు క్రోడీకరించి 'ముజాహిదా ఫీ సబీలిల్లాహ్' కోసం సిద్ధం కావడానికి చేయవలసినదేమై ఉంటుందో అర్థం చేసుకోండి. వాటి గురించి నేను టూకీగా కొన్ని సూచనలివ్వదలిచాను.

అన్నింటికంటే మొదట ఉండవలసిన సుగుణం సహనం. సహనం అనేది లేకుండా ఒక దైవమార్గంలోనే కాదు మరే మార్గంలోనూ కృషి (ముజాహిదా) చేయ వీలుండదు. తేడా ఉండేదల్లా దైవమార్గంలో ఉండవలసిన సహనం ఓ రకమైన సహనం అయితే, ప్రపంచ ప్రయోజనాలు పొందడానికి కావలసిన సహనం ఇంకో రకమైన సహనం. అన్నింటిలోనూ సహనం కావలసిందే. సహనానికి సంబంధించిన కోణాలు అనేకం. ఒకటేమిటంటే తొందరపాటును పూర్తిగా వదిలేయడం. రెండవది, ఏ మార్గంలోనైతే కృషి జరుగుతోందో ఆ మార్గంలో అడ్డుతగిలే కష్టాలు, వ్యతిరేకతలు మరియు సంఘర్షణల్లో స్థైర్యాన్ని పాటించి అడుగు వెనకకు వేయకుండా ఉండడం. మూడవ కోణం ఏదంటే, మీ ప్రయత్నాల ఫలితం త్వరగా బయల్పడకపోయినా ధైర్యాన్ని కోల్పోకుండా సతతం ప్రయత్నిస్తూనే ఉండిపోవడం. మరో కోణం ఏమిటంటే, లక్ష్యసాధనలో అతిపెద్ద ప్రమాదాలు, నష్టాలు వాటిల్లినా, భయం మరియు ఆశలకు సంబంధించిన అవకాశాలు ముందొచ్చి నిలిచినా మీ అడుగులు మాత్రం తడబడకుండా స్థిరంగా ఉండడం. భావోద్రేకాలను రెచ్చగొట్టే అతి తీవ్రమైన సందర్భాల్లోనూ మనిషి తన మనోసంతులనాన్ని పోగొట్టుకోకపోవడం, ఉద్రేకాలకు బానిస అయి ఎలాంటి తప్పడుగు వేయకపోవడం కూడా సహనానికి సంబంధించిన అంశమే.

ఎల్లప్పుడు శాంతం మరియు బుద్ధివివేచనలనుపయోగించి ప్రశాంత చిత్తంతో నిర్ణయాలు గైకొని పనిజేయాల్సి ఉంటుంది. సహనం వహించమన్న ఆదేశం మట్టుకే కాదు, సహనతత్వాన్ని అలవర్చుకోండన్నది కూడా ఒక ఆదేశమే. అంటే, వ్యతిరేక శక్తులు వాటి అసత్య లక్ష్యసాధనకు యే ఓర్పు నేర్పులతో నిలబడి ప్రయత్నం చేస్తున్నాయో వాటికితోడు మీరు గట్టిగా నిలబడి పోరాడాలి అని అర్థం. అందుకే దివ్యఖుర్‌ఆన్‌లో 'ఇస్‌బిరూ' (సహనం వహించండి) అనడంతో పాటు 'సాబిరూ' (సహనశీలురుకండి) అని ఆదేశించడం జరిగింది.

ఎవరికి వ్యతిరేకంగానైతే మీరు సత్యధర్మ ధ్వజోన్నతికి పాటుబడాలని అను కుంటున్నారో వారి సహనానికీ మీ సహనానికి నడుమగల తేడా ఏమిటో తెలుసుకోండి. అందులో మీ సహనం దామాషా ఎంత? అని ఆలోచించండి. బహుశా మనం వారిలోవున్న సహనంలోని 10శాతం సహనాన్ని కూడా పుణికిపుచ్చుకోలేదనిపిస్తోంది. అసత్యాన్ని ప్రబలంజేయడానికి వారు యే సహనాన్నైతే ప్రదర్శిస్తున్నారో దాన్ని లెక్కకట్ట డానికి వారు చేస్తున్న అక్రమ యుద్ధాలు పరిస్థితులపై దృష్టిని సారించి చూడండి. ఎన్నో సంవత్సరాలుగా కష్టబడి, లెక్కలేనంత డబ్బును ఖర్చుచేసి నిర్మించుకున్న కర్మాగారాల్ని, నగరాల్ని, రైల్వేస్టేషనులను సైతం అవసరమొచ్చినప్పుడు ఖుద్దున తమ చేతులతోనే నేలమట్టం చేశారు వీరు. సైన్యాన్ని ఉక్కుచక్రాల క్రింద నలిపేసే యుద్ధటాంకులకు ఎదురొడ్డి నిలుస్తారు. శత్రువు బాంబులు కురి పించే యుద్ధ విమానాల నీడలో స్థిరంగా నిలబడతారు వీరు. వారికి ధీటుగా మన సహనం 105 శాతానికి చేరగలిగితేనేగాని వారితో మనం తలపడే ధైర్యం చేయలేం. సరంజామా రీత్యా మనం వారికి కొరగానప్పటికీ, మనం ఆ సరంజామా లోపాన్ని పూడ్చుకోవడానికి కావలసింది ఒక్క సహనమే.

2. ముజాహిదాకు కావలసిన రెండవ విషయం, త్యాగ సుగుణం. సమయం, శ్రమ మరియు ధన త్యాగం! ఈ త్యాగం పరంగా చూసినా అసత్య ధ్వజవాహక శక్తులతో పడే పోటీలోనూ మనం వెనుకబడే ఉన్నాం. వారిని ఎదిరించాలంటే ఈ త్యాగనిరతి విషయంలో మనం వారికి ఎన్నో మైళ్ళు ముందడుగులో ఉండవలసివుంది. కాని మన పరిస్థితి ఎలాగుందంటే, ఓ వ్యక్తి ఇరవై, యాభై, వంద, వేయి రూపాయల ఉద్యోగం కోసం తన సమస్త సామర్థ్యాలను స్వయం శత్రువుకు అమ్మేస్తున్నాడు. ఇలా మన జాతికి పనికివచ్చే శక్తి పూర్తిగా నిరర్థకంగా మారిపోతోంది. మానసిక సామర్థ్యాలు కలిగివున్న వర్గం, పెద్ద ఆదాయాన్ని వదిలేసి ఇక్కడ కేవలం అవసరానికి సరిపోయే అతి తక్కువ భృతికోసం తనసేవలను అందించడానికి సాహసించడం లేదు. ఒకవేళ అలాంటప్పుడు ఈ వ్యక్తులు ఆ త్యాగాన్ని కూడా చేయలేకపోతే, ఆ మార్గంలో వళ్ళువంచి పనిజేయకపోతే యే ఉద్యమమైనా ఎలా మనగలుగుతుంది? కేవలం వాలంటీర్ల సహాయంతో ఏ ఉద్యమమైనా నడువజాలన్నది లోకమెరిగిన

సత్యమేకదా! సాముహిక వ్యవస్థలో వాలంటీర్లకు గల హోదా, ప్రాధాన్యత కేవలం మానవ శారీరక వ్యవస్థలో కాళ్ళు చేతులకు ఉన్న ప్రాధాన్యతే. శరీరంలో వాటితో పనిజేయించేందుకు స్పందించే హృదయం, ఆలోచించే మేధే లేనప్పుడు ఈ కాళ్ళు చేతులు ఎలా పనిజేస్తాయి? మరో విధంగా చెప్పాలంటే, మనం వాలంటీర్లతో పనిజేయించుకోవడానికి మనలో గొప్ప జనరల్స్ అవసరం. అయితే విచారపడ వలసిందేమిటంటే, ఎవరివద్దనైతే ఆ హృదయాలు, ఆ మేధాశక్తులున్నాయో వారు ప్రాపంచిక వికాసాలకు బానిసలై ఉన్నారు. మార్కెట్టులో ఎవరైతే అధిక ధర పెడతారో వారు వారివైపునకే వెళుతూ ఉంటారు. మన జాతి ఉత్తమ వ్యక్తులు తమ సొంత లాభాన్ని కొంతవరకు మానుకొని లక్ష్యానికి అంకితమయ్యేటంత స్థాయికి ఎదగలేదు. ఈ త్యాగం విషయంలో, ప్రతి దినం కోట్లాదిరూపాయలను వెచ్చిస్తూ లక్షలాది ప్రాణాలను త్యాగం చేస్తున్న అసత్యధ్వజవాహకులు, విచ్ఛిన్న కర శక్తులు మన ద్వారా ఓటమిపాలౌతారు అని అంటే హాస్యాస్పదంగానే ఉంటుంది.

3. ముజాహిదా ఫీ సబీలిల్లాహ్ మూడవ సుగుణం మనస్సును దానిపై కేంద్రీకరించి పనిచేయడం. కేవలం మానసికంగా ఓ వ్యక్తి ఓ ఉద్యమాన్ని అర్థం చేసుకోవడం, కేవలం మానసికంగా సంతృప్తి చెందడం లాంటివి ఈ మార్గంలో వేసే అడుగుల్లో ఒక అడుగుమాత్రమే. ఆ ప్రభావం వల్ల ఒరిగేది ఏదీ ఉండదు. ఇక్కడ కావలసింది హృదయంలో ఓ అగ్నిజ్వాల రగలడం. కనీసం, తన పిల్లవాడు వ్యాధి గ్రస్తుడైనప్పుడు మిమ్మల్ని నిలుచొనివ్వక డాక్టరు వద్దకు తీసుకొని వెళ్ళేటంత ఆరాటం లేదా ఇంట్లో రేషను లేనప్పుడు తపించేటంత పరితాపం లాంటిది. ఆ ఆరాటం, ఆ తపన మనిషిని ప్రశాంతంగా కూర్చోనివ్వదు. మిమ్మల్ని లక్ష్యం వైపుకు మరల్చి, మీ మనస్సును దానిపై లగ్నం చేసి, మీ దృష్టిని దానిపై నిలిపి ఉంచే భావోద్రేకాలు మీ మనస్సులో రేకెత్తాలి. ఒకవేళ మీ వ్యక్తిగతమైన లేదా మీ కొటుంబికమైన లేదా మీకు సంబంధించని ఇతర వ్యవహారాలు మిమ్మల్ని అటువైపుకు లాగే ప్రయత్నం చేసినా, మీ స్వంత లాభం కోసం మీ శక్తి సామర్థ్యాలు మీ సమయంలోని అతికొద్ది భాగమే దానికి వెచ్చించే ప్రయత్నం చేయాలి. అధిక కృషి మాత్రం మీరు మీ జీవన ధ్యేయం కోసమే వెచ్చించాలి. హృదయంలో ఇలాంటి తపనగాని, ఆరాటంగాని లేకపోతే మీరు ఈ కార్యంలో పూర్తిగా లీనం కాజాలరు. కేవలం మాటల ద్వారా ఒరిగేదేముండదు. చాలా మంది మానసికంగా మనకు వెన్నుదన్నుగా ఉండడానికి సిద్ధపడతారు కాని హృదయంలో రగిలే తపన, ఆరాటాలతో పూర్తిగా మనకు తోడ్పడే వారు బహు అరుదు. నాతో వ్యక్తిగత మరియు సాముదాయిక సంబంధాలు గల ఓ మిత్రుడు ఇటీవలే నాతో, ఆయనకు ఉన్న రెండేళ్ళ సాన్నిహిత్యం తరువాత నా ముందు ఓ నిజాన్ని బహిర్గతం చేశారు. ఆయన మాటల ప్రకారం ఆయన నేను ఇప్పటివరకు కేవలం మానసిక సంతృప్తి ప్రాతిపదికపైన్నే జమాఅత్‌లో చేరానని,

అయితే ఇప్పుడు ఈ విషయం నా హృదయంలో నాటుకొని నా ఆత్మను వశపర్చు కుంది" అని చెబుతూ, "ప్రతి వ్యక్తి స్వయంగా ఆత్మవిమర్శ చేసుకొని తాను కేవలం ఈ జమాఅత్ మానసిక సభ్యుణ్ణా లేదా ఈ ధ్యేయానికి సంబంధించిన అగ్నిజ్వాల తన హృదయంలో రాజుకున్నదా? అని ఆలోచించాలని అభిలషిస్తున్నాను" అని చెప్పడం జరిగింది. ఒకవేళ ఆ కార్యోన్ముఖత తనలో లేదని అనిపిస్తే దాన్ని పుట్టించే ప్రయత్నం చేయాలి. ఎక్కడైతే ఆ కార్యోన్ముఖత ఉంటుందో మరొకరి ప్రోత్సహంగాని, బలవంతంగాని అవసరం ఉండదు, ఆ శక్తే గనక ఉండి ఉంటే ఒకవేళ ఓ జమాఅత్ సభ్యుడు వెనుకబడిపోయే లేదా వేరే ప్రదేశానికి వలస వెళ్ళిపోయేందుకు వివశుడైపోతే అక్కడి పనంత ఆగిపోతుంది అనే పరిస్థితి మాత్రం ఏర్పడదు. దానికి భిన్నంగా ప్రతి వ్యక్తి, తన పిల్లవాడు రోగగ్రస్తుడైనప్పుడు తపించే విధంగా ఆ పనిని చేబట్టి పూర్తిచేస్తాడు. ఒకవేళ మీ అబ్బాయే వ్యాధిగ్రస్తుడైతే (దైవం అలా జరుగనివ్వకపోగాక) మీరు అతని జీవన్మరణాల సమస్యను మరెవరి పైన్నో వదిలివేయలేరు. పరామర్శించేవారు ఎవ్వరూలేరనో, మందులు తెచ్చేవాడు దొరక లేదనో, డాక్టరు వద్దకు తీసుకువెళ్ళేవాడు అగుపడలేదనో అతణ్ణి అలాగే వదిలివేయడం అసాధ్యం. ఎవరూ లేకపోయినా మీరొక్కరే అన్నీ చూసుకుంటారు. ఎందుకంటే ఆ అబ్బాయి మీ సొంతకుమారుడు. మారు తండ్రి పిల్లవాణ్ణి చావు బ్రతుకుల్లో వదిలేయనూవచ్చు. కాని సొంత తండ్రి ప్రాణప్రదమైన తన తనయుణ్ణి ఎలా వదిలేయ గలడు. అతని హృదయంలో ఓ ఆరాటం, ఓ తపన రేకెత్తుతూనే ఉంటుంది. అచ్చం అలాగే ఈ కార్యంలో మీకు హృదయపూర్వకమైన సంబంధం ఉండివుంటే దాన్ని మీరు ఒకరిపై వదిలివేయలేరు. అలాగే ఇతరుల అసమర్థత, తప్పుడు విధానం మరియు అశ్రద్ధను సాకుగా తీసుకొని ఆ కార్యాన్ని సమసి పోయేందుకు వదిలివేయడం, మీరు మీ ఇతర వ్యాపకాల్లో లీనం అయిపోవడం కూడా సాధ్యం అయ్యే విషయం కాదు. ఈ వైఖరి పూర్తిగా దైవధర్మం, దాని సంస్థాపన మరియు దాని ఔన్నత్యపు ధ్యేయం పట్ల ఓ మారు తండ్రికి ఉండే సంబంధంలాంటిది. సొంత తండ్రి సంబంధం లాంటిదే అయితే మీలో ప్రతి ఒక్కడూ ఈ మార్గంలో ప్రాణాలొడ్డి పనిజేయగలడు. ఎలాంటి మర్మం లేకుండా స్పష్టంగా నేను చెప్పదలచిందేమిటంటే, మీరే గనక ఈ మార్గంలో హృదయ పూర్వకంగా, మీరు కనీసం మీ భార్యాపిల్లల పట్ల ఉండవలసిన ప్రేమాను రాగాలు కూడా లేకుండా అడుగుముందుకు వేస్తే, దాని పరిణామం వెనక్కుదగ్గడం, ఓడిపోవడం కంటే వేరుగా ఉండబోదు. ఆ ఓటమి ఎంత తీవ్రంగా ఉంటుందంటే, చాలా కాలం వరకు మన సంతతులు ఈ ఉద్యమం పేరు ఎత్తడానికైనా ధైర్యం చేయలేనంత ఓటమి అది. పెద్దపెద్ద అడుగులు ముందుకు వేసే బదులు ముందు మీరు మీ ఆత్మశక్తి, మీ నైతిక శక్తులను బేరీజు వేసుకొని చూడండి. ముజాహిదా ఫీ సబీలిల్లాహ్ కోసం ఏ ధైర్యస్థయిర్యాలు అవసరమో వాటిని మీలో ఉద్భవింపజేసే ప్రయత్నం చేయండి.

4. ఈ మార్గంలో కావలసిన నాల్గవ సుగుణం, మనం నిరంతరాయంగా కృషి చేయడం, అది కూడా ఓ క్రమబద్ధమైన పద్ధతిలో పని చేసే అలవాటును కలిగి ఉండడం. ఓ సుదీర్ఘకాలంగా మన జాతి, ఏ పనైనా అతి తక్కువ సమయంలో జరిగిపోవాలని, ఏ అడుగైతే ముందుకు వేస్తామో అందులో ఆడంబరత బాగా అగుపడాలనే అలవాటుకు లోనైవుంది. అది నెలా, రెండు నెలల్లో చేసిందంతా బూడిదలో పోసిన పన్నీరైపోయినా సరే. ఈ అలవాటును మనం మార్చవలసి ఉంటుంది. దాని స్థానంలో క్రమమైన విధానం, ఎలాంటి ఆర్భాటాలులేని కార్యం కోసం ప్రాక్టీసు అవసరం. యే చిన్నపాటి పని అయినాసరే, అది అవరసమై మీకు అప్పజెప్పబడితే, ఎలాంటి ప్రస్ఫుటమైన, త్వరగా లభించే ఫలితాన్ని ఆశించకుండా, ఎలాంటి పొగడ్తను కోరుకోకుండా మీ జీవితాన్నంతా ఆ కార్యంలో వెచ్చించాల్సి ఉంటుంది. ముజాహిదా ఫీ సబీలిల్లాహ్ కార్యరణరంగం ఎప్పుడూ వేడిగా ఉండేదిగాదు. అలాగే ప్రతివాడు ముందు వరుసలో నిలబడే పోరాడడు. ఓ సారి జరిగే యుద్ధానికి అప్పుడప్పుడు పాతిక ఏళ్ళదాకా నిశ్శబ్ద తయారీ అవసరముంటుంది. ముందువరుసల్లో వేలాది మంది పోరాడుతుంటే వారి వెనుక లక్షలాది మంది యుద్ధ అవసరాలకు సంబంధించిన చిన్నచిన్న పనుల్లో నిమగ్నమై ఉంటారు. ఆ పనులు చూచేవారికి ఎంతో అల్పమైనవిగా కూడా అగుపడవచ్చు.

సత్యధర్మం వైపుకు పిలిచేవాని సుగుణ సంపద గురించి మనకు దివ్యఖుర్ఆన్ ఎలాంటి మార్గదర్శకాల నిస్తోందో ఇప్పుడు చూద్దాం.

అసత్యవాదులు, సత్యసందేశవహుల్ని తేలిగ్గా తీసుకోరాదు

فَاصْبِرْ إِنَّ وَعْدَ اللّٰهِ حَقٌّ وَّلَا يَسْتَخِفَّنَّكَ
الَّذِيْنَ لَا يُوْقِنُوْنَ ۝ (الروم : ٦٠)

"ప్రవక్తా! సహనంతో ఉండు. నిశ్చయంగా అల్లాహ్ వాగ్దానం సత్యమైంది, అవిశ్వాసులు నిన్ను తేలిగ్గా తీసుకోరాదు." (అర్‌రూమ్:60)

"అల్లాహ్ వాగ్దానం సత్యమైనది" అనే మాట ఈ సూరాలో చెప్పబడిన 47వ ఆయత్‌లో ఉంది. ఆ వాగ్దానం విషయంలో అల్లాహ్ తన విధానాన్ని వివరిస్తూ, ఎవరైతే దైవప్రవక్తలు తెచ్చిన స్పష్టమైన సూచనలను హేళన, నిరాకరణ మరియు మంకుతనాలతో అడ్డుకోవడం జరిగిందో, అలాంటి నేరస్తుల పట్ల ప్రతీకారం తీసుకోవడం (فَانْتَقَمْنَا مِنَ الَّذِيْنَ اَجْرَمُوْا) జరిగిందని, విశ్వాసులకు సహాయపడడం అనేది వారికి ఆయనపై ఉన్న హక్కు (وَكَانَ حَقًّا عَلَيْنَا نَصْرُ الْمُؤْمِنِيْنَ) అని కూడ చెప్పడం జరిగింది.

1. "తేలిగ్గా తీసుకోరాదు" అని అంటే, శత్రువు మిమ్మల్ని, వారి అల్లరిదౌర్జన్యాల కారణంగా మీరు అణిగిపోయేటంత బలహీనులు అనిగాని లేదా వారి అపనిందలు, అసత్య ప్రచార ఉద్యమానికి మీరు జంకుతున్నారు అనిగాని, వారి బెదిరింపులు మరియు శక్తి ప్రదర్శనలు, హింసాదౌర్జన్యాలకు భయపడుతున్నారనిగాని, వారి హేళన, ఎత్తిపొడుపు మాటలకు అధైర్యపడుతున్నారని గాని భావించకూడదు అని అర్థం. అలాగే వారుచూపే ఆశలకు మీరు లొంగిపోతారని, జాతీయ ప్రయోజనాల పేరిట ఏ అప్పీళ్ళయితే చేస్తున్నారో ఆ కారణంగా వారితో రాజీపడతారని గాని వారు అనుకోవడానికి వీల్లేదు. దానికి భిన్నంగా మీరు మీ విశ్వాసంలో ఎంతో గట్టివారని, మీ పట్టుదలలో ఎంతో నిబద్ధత గలవారని, మీ వైఖరిలో ఎంతో ఘటికులని చాటి చెప్పేవారని, మిమ్మల్ని వారు ఏ మూల్యానిచ్చైనా కొనలేరని, యే మోసంతో మిమ్మల్ని వంచించలేరని, ఎలాంటి ప్రమాదంగాని, మరెలాంటి కష్టనష్టాలుగాని మిమ్మల్ని మీ మార్గం నుండి ఏ మాత్రం కదల్చలేవని అలాగే ధర్మం విషయంలోనూ మరే లావాదేవీల్లోనూ మీరు వారికి లొంగిపోలేరని భావించేటట్లుగా ప్రవర్తించవలసి ఉంటుంది. ఈ విషయాన్నంతా అల్లాహ్ తన సమగ్రమైన ఒక్క చిన్న వాక్యం, "అవిశ్వాసులు మిమ్మల్ని తేలిగ్గా తీసుకోరాదు"లో పొందుపర్చడం జరిగింది.

అల్లాహ్ తన ప్రవక్త (స)ను ఈ ప్రపంచంలో ఎంత స్థిరచిత్తునిగా చూడదలిచాడో, ఆయన (స) అంతే ధైర్యవంతునిగా, స్థిరచిత్తులుగా మెలిగారనే సత్యాన్ని చరిత్ర చాటి చెబుతోంది. ఆయనతో ఎవరు, యే రంగంలోనూ తలపడినా అతను ఆ రంగంలోనే అపజయాన్ని చవిజూడవలసి వచ్చింది. చివరికి, అరేబియా దైవతిరస్కారులు, బహుదైవారాధకులు తమ శక్తిని, తమ వనరుల్ని వెచ్చించి అన్ని రకాల ఎత్తుగడలను ఉపయోగించి ఆ విప్లవాన్ని అడ్డుకోజూసినా అరేబియాలో ఆ విప్లవం విస్తరించింది.

ప్రప్రథమ దైవం వైపు పిలుపు దగ్గరి బంధువులకే

وَاَنْذِرْ عَشِيْرَتَكَ الْاَقْرَبِيْنَ ۝ (الشعراء : ٢١٤)

"నీ దగ్గరి బంధువులను భయపెట్టు." (అష్షుఅరా:214)

అంటే దేవుని నిష్పక్షపాతమైన ఈ ధర్మంలో దైవప్రవక్త (స) వారికి ఎలాంటి రాయితీ ఇవ్వడం జరుగలేదు. ఆయన వంశం, కుటుంబం మరియు దగ్గరి బంధువులకు కూడా ఎలాంటి రాయితీలు ఇవ్వలేదు. ఇక్కడ ప్రతి ఒక్కరితోనూ వారి గుణగణాల ప్రాతిపదికపైనే వ్యవహరించడమైంది. వంశం ప్రాతిపదిక కాని, ఒకరితో మనిషికి ఉండే సంబంధ బాంధవ్యంగాని ఎవరికి ఎలాంటి ప్రయోజనాన్ని చేకూర్చలేవు. దుష్ట కార్యాలు, దుర్మార్గాల విషయంలో దైవ శిక్ష భయం అందరికీ సమానమైనదే. పరాయి

వారంతా శిక్షింపబడతారేమో కాని ప్రవక్త బంధువులం కాబట్టి మనం రక్షించ బడతాం అనే భావన వారికి రాకుండా ఉండడానికి గాను దైవం, “మీరు మీ బంధువులకు స్పష్టంగా హెచ్చరించండి” అనే ఆదేశం ఇవ్వడం జరిగింది. ఒకవేళ వారు తమ విశ్వాసాన్ని, తమ నడవడికను సరిగా ఉంచుకోకపోతే, ‘దైవప్రవక్త (స) వారి బంధువులం’ అనే వాదన ఏమాత్రం పనిజేయదు అని హెచ్చరించడం అన్నమాట.

విశ్వసనీయమైన ఉల్లేఖనాల ప్రకారం, ఈ ఆయత్ అవతరించిన తరువాత మహాప్రవక్త (స) మొట్టమొదటగా తమ తాతగారి వంశం అయిన అబ్దుల్ ముత్తలిబ్‌ని సంబోధిస్తూ ఒక్కొక్కరిని పేరుపేరున పిలిచి, “ఓ అబ్దుల్ ముత్తలిబ్ వంశమా, ఓ అబ్బాస్(ర), ప్రవక్త (స) మేనత్త ఓ సఫియ్యా (ర), ముహమ్మద్ (స) ముద్దుల పట్టీ

انقذوا انفسكم من النار فاني لا املك
لكم من الله شيئا سلوني من مالي ما شئتم۔

ఓ ఫాతిమా! మీరు స్వయంగా నరకాగ్ని నుండి మిమ్మల్ని రక్షించుకునే ప్రయత్నం చేసుకోండి. నేను మాత్రం మిమ్మల్ని దైవశిక్షనుండి కాపాడలేను. అయితే మీరు నా సొత్తులో నుండి ఏదైనా అడిగి తీసుకోవచ్చు.”

ఆ తరువాత ఆయన వేకువఝామున్నే లేచి సఫా కొండపై ఎత్తయిన ప్రదేశంలో నిలబడి ‘యా సబాహాహ్’ (అయ్యో! ఉదయాన్నే వచ్చిపడ్డ ప్రమాదం) అంటూ ఓ ఖురైష్ ప్రజలారా! ఓ బనీ కఅబ్ బిన్ లవీ, ఓ బనీ మర్రాహ్, ఓ అలెఖుస్సై, ఓ అబ్దె మునాఫ్, ఓ బనీ అబ్దుష్షమ్స్, ఓ బనీ హాషిమ్, ఓ అలె ముత్తలిబ్ అని ఖురైష్ తెగ మరియు వంశాలను పేరుపేరున ఎలుగెత్తి పిలిచారు. ఉదయాన్నే ఏదైనా దాడి ప్రమాదం ముంచుకొచ్చినప్పుడు, ఆ ప్రమాదం గురించి ఎవరికైనా తెలిసిపోతే అతను ఇలానే పిలిచే ఆనవాయితీ ఉండేది. ఆ పిలుపు వినగానే ప్రజలు అన్ని వైపుల నుండి ఆ వ్యక్తి వద్దకు పరుగెత్తి వచ్చేవారు. కాబట్టి దైవప్రవక్త (స) వారి పిలుపు విని ప్రజలు తమతమ ఇండ్ల నుండి బయటకు వచ్చి ఆయన వైపుకు పరుగుదీశారు. అక్కడికి పోలేనివాడు తన తరఫున మరొకరిని విషయం ఏమిటో తెలుసుకొని రమ్మని పంపించాడు. అందరూ అక్కడికి చేరిన తరువాత దైవప్రవక్త (స) వారిని సంబోధిస్తూ ఇలా సెలవిచ్చారు:

“ప్రజలారా! ఈ కొండకు అవలి వైపున ఓ బలమైన సైనిక పటాలం మీపై విరుచుకుపడడానికి సిద్ధంగా ఉందని నేను అంటే మీరు నా మాటలను విశ్వసిస్తారా?”

అందరూ ముక్తకంఠంతో, “మీరు అసత్యం పలుకేవారు కానేకాదు అని మేము మా అనుభవం ద్వారా చెబుతున్నాం” అని అన్నారు.

అప్పుడు ఆయన ఇలా సెలవిచ్చారు:

"సరే! దేవుని తీవ్రమైన శిక్ష మీపై విరుచుకుపడక ముందే మిమ్మల్ని హెచ్చరిస్తున్నాను. మీ ప్రాణాలను ఆ శిక్ష బారి నుండి రక్షించుకోవడానికి ప్రయత్నం చేయండి. దేవుని శిక్ష విషయంలో నేను ఏమాత్రం మీకు సహాయపడలేను. ప్రళయ దినాన మిగతా వారంతా సత్కార్యాలు మూటగట్టుకు రాగా, మీరు మాత్రం లోకంలోని పాపాలన్నిటిని నెత్తిన ఎత్తుకొచ్చి, "ఓ ముహమ్మద్! (స) (మమ్మల్ని రక్షించండి) అని అన్నప్పుడు నేను మీ వైపునుండి ముఖం త్రిప్పుకోడానికి వివశుణ్ణైపోతాను. అయితే మీకు నాకు నడుమ రక్తసంబంధం ఉన్నందున ఇక్కడ మాత్రం నేను మీతో ఉదారంగా ప్రవర్తించగలను."

ఈ విషయం బుకారీ, ముస్లిమ్, ముస్నదె అహ్మద్, తిర్మిజీ, నిసాయి మరియు తఫ్సీరె ఇబ్నె జరీర్ గ్రంథాల్లో హజ్రత్ ఆయిషా (ర), హజ్రత్ అబూహురైరా (ర), హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్(ర), హజ్రత్ జుబైర్ (ర) బిన్ అమ్రూ, హజ్రత్ కబీసా (ర) బిన్ ముఖారిల ద్వారా ఉల్లేఖించబడింది.

దివ్యఖుర్‌ఆన్‌లో "నీ దగ్గరి బంధువులను భయపెట్టు" అనే ఆదేశం, దైవప్రవక్త (స) తన బంధువర్గాన్నంతా సమావేశపరిచి ఆ ఆదేశాన్ని పాలించండి అని చెప్పడం మట్టుకే సరిపోలేదు. దైవధర్మంలో దైవప్రవక్త మరియు ఆయన బంధువర్గం లేదా వంశం కోసం మరెవరికి లేని ప్రత్యేకమైన రాయితీలు ఏవీ ఉండవు అనే అంశాన్ని ఆ ఆదేశంలో స్పష్టం చేయడం జరిగింది. హాలాహలం అందరికి హాలాహలమే. దైవప్రవక్త(స) కర్తవ్యం ఏమిటంటే అందరికంటే ముందు దానికి దూరంగా ఉండడం. ఆ తరువాత తన దగ్గరి బంధువులను దాన్నుండి భయపెట్టడం, ఆ తరువాత సర్వమానవాళికి ఆ విషాన్ని తిన్న తరువాత ప్రాణాలు వదలగలరనే సత్యాన్ని చాటి చెప్పడం. మరే విషయం అయితే ప్రయోజనం చేకూర్చేదో అందరికంటే ముందు దాన్ని అవలంబించడం ప్రవక్త హోదాకు తగిన అంశం. ఆ పిదప తన బంధుమిత్రులకు దాన్ని అవలంబించమని చెప్పాలి. అలా చేయడం వలన చూసే ప్రతివాడు ఈ బోధన కేవలం ఇతరులకు బోధించేది కాదని, ప్రవక్త తన సందేశ ప్రచారంలో చిత్తశుద్ధి కలిగినవాడని నమ్మగలడు. ఈ తీరుగానే దైవప్రవక్త (స) తన జీవితాంతం మెలగడం జరిగింది. మక్కా విజయం రోజున ఆయన నగరంలో ప్రవేశిస్తూనే ఈ ప్రకటన గావించారు.

"అజ్ఞానకాలం నాటి యే వడ్డీ అయితే ప్రజలపై భారంగా ఉండిందో అది ఈ రోజు నా కాళ్ళ క్రింద నలిపివేయబడింది. మొట్టమొదటగా యే వడ్డీనైతే నేను అంతం చేస్తున్నానో అది నా పినతండ్రిగారైన హజ్రత్ అబ్బాస్ (ర) గారివడ్డీ."

(వడ్డీని నిషేధిస్తూ యే ఆదేశమైతే దివ్యఖుర్‌ఆన్‌లో అవతరించిందో అంతకు ముందు హజ్రత్ అబ్బాస్(ర) వడ్డీ వ్యాపారం చేసేవారు. ఆ వడ్డీ ఆయనకు ప్రజల నుండి రావలసి ఉన్న విషయం ఇక్కడ గమనార్హం.)

ఓసారి ఖురైష్‌కు చెందిన ఫాతిమా అనే ఓ యువతికి దొంగతనం నేరం క్రింద చేయి తీసివేయాలని ఆదేశించారు దైవప్రవక్త. హజ్రత్ ఉసామా (ర) బిన్ జైద్ ఆమెకు పడిన శిక్ష విషయంలో ఏదో సిఫార్సు చేయబోగా ఆయన(స) "దైవసాక్షి! ఒకవేళ ముహమ్మద్ (స) కుమార్తె ఫాతిమా కూడా దొంగతనానికి పాల్పడి ఉంటే ఆమె చేయి నరికివేసేవాణ్ణి" అని అనడం జరిగింది.

రాజీపడే ధోరణిని వీడండి

"ప్రవక్తా! నీ ప్రభువు గ్రంథం నుండి నీపై అవతరింపజేయబడిన దానిని (యథాతథంగా) వినిపించు. ఆయన ప్రవచనాలను మార్చే అధికారం ఎవరికీ లేదు. (ఒకవేళ ఎవరికోసమైనా నీవు అందులో మార్పులు, చేర్పులు చేసినట్లయితే) ఆయనను తప్పించుకొని పారిపోయి నీవు ఏ ఆశ్రయాన్నీ పొందలేవు. తమ ప్రభువు ప్రసన్నతను అర్థిస్తూ ఎవరు ఉదయం, సాయంత్రం ఆయన్ను వేడుకుంటారో, వారి సహచర్యం పట్ల నీ హృదయాన్ని సంతృప్తి పర్చుకో. వారి నుండి నీ దృష్టిని ఏ మాత్రం మరల్చకు. నీవు ఇహలోకపు మెరుగులను కోరుకుంటావా? ఎవని మనస్సును మేము మా ధ్యానం పట్ల శ్రద్ధ లేకుండా చేశామో, ఎవడు తన వాంఛలకు అనుగుణంగా వర్తించాడో, ఎవరి పనితీరు అతివాదంపై ఆధారపడి ఉంటుందో అటువంటి వ్యక్తి పట్ల విధేయత చూపకు. స్పష్టంగా ఇలా ప్రకటించు, "ఇది సత్యం, మీ ప్రభువు నుండి వచ్చింది, ఇష్టమైనవారు దానిని స్వీకరించనూవచ్చు, ఇష్టంకాని వారు దానిని తిరస్కరించనూ వచ్చు." (అల్‌కహఫ్:27-29)

"ఏ ఆశ్రయాన్ని పొందలేవు" అని అంటే, ఆ సమయంలో దైవప్రవక్త (స) (దైవం క్షమించుగాక) మక్కా దైవారాధకుల కోరిక ప్రకారం ఖుర్‌ఆన్‌లో ఏదైనా మార్పులు చేర్పులు చేయడానికి లేదా ఖురైషీయులతో ఎంతోకొంత రాజీపడడానికి సిద్ధంగా ఉండడం వలన అల్లాహ్ ఆయన్ను అలా చేయకుండా వారిస్తున్నాడేమో అని అనుకోవడం కాదిక్కడ. అసలు విషయం ఏమిటంటే ఈ సంబోధనంతా మక్కా దైవారాధకులను దృష్టిలో పెట్టుకొని చేసింది. దైవప్రవక్తను సంబోధిస్తూ చెప్పిన విషయంలాగే ఇది మనకు అగుపిస్తున్నా, ముహమ్మద్ (స)కు దైవవాణిలో తన తరపున ఏ చిన్నపాటి మార్పు, చేర్పూ చేసే అధికారం ఏమాత్రం లేదు, ఆయనపై అవతరింపజేయబడిన దానిని యథాతథంగా మీకు చేరవేయడమే ఆయన బాధ్యత. మీకిష్టమైతే దాన్ని ఉన్నది ఉన్నట్లుగా స్వీకరించండి. ఇష్టం కాకపోతే స్వీకరించకపోవడం మీ ఇష్టం; అయితే మిమ్మల్ని సంతోషపెట్టడానికి ఈ ధర్మంలో మీ కోరిక మేరకు మార్పు చేయబడుతుందేమో అనే ఆశలు పెట్టుకోకండి, అది ఎంత చిన్నమార్పు అయినాసరే అని తెలియజేయడం. దైవతిరస్కారులు ఆయన (స)తో మాటిమాటికి, "మేము మీ మాటను పూర్తిగా నమ్మేయాలని ఎక్కడుంది? మా ధర్మంలోని నమ్మ

కాలను, సంప్రదాయాలను కొన్నైనా మీరు ఒప్పుకుంటే మేము కూడా మీ ధర్మంలోని విషయాలను కొన్నింటిని ఒప్పుకుంటాం. ఇలా మనలో ఏర్పడ్డ చీలిక కొంతైనా సమసిపోగలదు" అని డిమాండు చేసేవారు. దివ్యఖుర్‌ఆన్‌లో వారి ఈ డిమాండ్లేవో చాలా చోట్ల వివరించడం జరిగింది. దానికి ఇలాంటి సమాధానమే ఇవ్వడం జరిగింది. ఉదాహరణకు యూనుస్ సూరా 15వ ఆయత్‌ను గమనించండి:

وَإِذَا تُتْلَىٰ عَلَيْهِمْ آيَاتُنَا بَيِّنَاتٍ قَالَ الَّذِينَ لَا يَرْجُونَ
لِقَاءَنَا ائْتِ بِقُرْآنٍ غَيْرِ هَٰذَا أَوْ بَدِّلْهُ ۚ (يونس: ١٥)

"మమ్మల్ని కలిసే నమ్మకం లేని వారికి స్పష్టమైన మా మాటలను వినిపించినప్పుడు ఇలా అంటారు: "దీనికి బదులుగా మరొక ఖుర్‌ఆన్ తీసుకురా లేదా ఇందులో సవరణలు చెయ్యి." (యూనుస్:15)

"అటువంటి వ్యక్తి పట్ల విధేయత చూపకు" అంటే అతని మాటను వినకు, అతనికి లొంగిపోకు, అతని కోరికను తీర్చకు, అతను చెప్పినదానిని అనుసరించకు అని అర్థం. ఇక్కడ 'విధేయత' అనే పదం విశాలమైన అర్థంలో ఉపయోగించబడింది.

'ఇష్టమైన వారు దానిని స్వీకరించనూ వచ్చు, ఇష్టం లేని వారు దానిని తిరస్కరించనూ వచ్చు." దీన్ని చదివిని పిదప, కహఫ్ వారి (గుహవారి) గాథను వినిపించిన తరువాత ఈ వాక్యం చెప్పడానికి కారణం ఏమిటో అర్థమైపోతుంది. అస్‌హాబె కహఫ్‌కు సంబంధించిన ఏ సంఘటనలైతే చెప్పడం జరిగిందో వాటిలో, తౌహీద్ (ఏకేశ్వరవాదం)ను విశ్వసించిన తరువాత వారు లేచి నిక్కచ్చిగా, "మా ప్రభువు కేవలం భూమ్యాకాశాలకు ప్రభువు ఒక్కడే" అని పలకడం, ఆ పిదప వారు తమ మార్గభ్రష్టమైన జాతి పట్ల ఎలాంటి రాజీపడే ధోరణిని అవలంబించక పోవడం. పైగా వారు ఎంతో ధైర్యంగా, "మేము ఆయన తప్ప మరే దేవుణ్ణి పిలిచేవారం కాదు, ఒకవేళ మేమలా చేస్తే అది అసంబద్ధమైన విషయం కాగలదు" అని చెప్పడం జరిగింది. వారు తమ జాతిని, ఆ జాతి పూజించే దేవుళ్ళను వదిలేసి, ఎలాంటి ఆధారం లేకుండా మరెలాంటి సరంజామా వెంట తీసుకోకుండా ఓ గుహలోనికి వెళ్ళిపోవడానికే ప్రాధాన్యతనిచ్చారు. కాని, సత్యం నుండి వీసమంతైయినా జరిగి వారి జాతి ప్రజలతో రాజీపడడానికి ఒప్పుకోలేదు. ఆ పిదప వారు నిద్ర నుండి మేల్కొన్న తరువాత కూడా, "మా జాతి మనలను వారి సమాజం వైపునకు మరల్చడంలో ఎక్కడ విజయం సాధిస్తుందో అని, అలా జరిగితే మేము ఎన్నటికీ సాఫల్యాన్ని పొంద లేము" అని భయపడడమూ జరిగింది. ఈ సంఘటనలను వివరించిన తరువాత ఇప్పుడు దైవప్రవక్త (స)ను సంబోధిస్తూ ఇలా చెప్పడం జరుగుతోంది. ఈ బహు దైవారాధకులు సత్యతిరస్కారాలతో రాజీపడడం ఇక్కడ చర్చనీయాంశమైన

విషయం కానేకాదు. దైవం తరఫు నుండి వచ్చిన దానిని యధాతథంగా వారి ముందుంచండి. వారు దాన్ని స్వీకరిస్తే సరి, స్వీకరించకపోతే వారే దాని దుష్పరిణా మాన్ని చవిచూస్తారు. స్వీకరించినవారు, వారు పిన్న వయస్కు లైనా, యువకులైనా, దరిద్రులైనా, బానిస లైనా, శ్రామికులైనా మొత్తానికి వారే విలువైనవారు. వారినే ప్రేమించడం జరుగుతుంది. వారుగాక మిగతా పెద్దపెద్ద సర్దారులు, ధనవంతులు, ఆస్తిపరులు, ఐశ్వర్యవంతుల గురించి పట్టించుకోవద్దు. వారంతా ఎన్ని భోగభాగ్యాలు కలిగివున్నా దైవాన్ని విస్మరించిన వారు, కేవలం మనో వాంఛలకు దాసులైనవారు.

హూద్ సూరాలో ఇలా సెలవియ్యడం జరిగింది:

"ప్రవక్తా! నీవూ, (అవిశ్వాసం, తిరుగుబాటుల నుండి విశ్వాసం, విధేయతల వైపునకు) మరలివచ్చిన నీ సహచరులూ, నీకు ఆజ్ఞాపించిన విధంగా రుజుమార్గంపై స్థిరంగా ఉండండి. దైవదాస్యపు హద్దులను అతిక్రమించకండి. మీరు చేస్తున్న దానిని మీ ప్రభువు కనిపెట్టి ఉంటాడు. ఈ దుర్మార్గుల వైపునకు కొంచెమైనా మొగ్గకండి. ఒకవేళ మొగ్గినట్లయితే నరకంలో చిక్కుకుపోతారు. మిమ్మల్ని దేవుని బారి నుండి కాపాడగల సహాయకుడూ, సంరక్షకుడూ ఎవ్వడూ మీకు దొరకడు." (హూద్:112,113)

"ప్రవక్తా! ఈ ప్రజలు నిన్ను పరీక్షకు గురిచేసి మేము నీ వైపునకు పంపిన వహీ (దైవవాణి) నుండి నిన్ను మరలించడానికి ప్రయత్నం చేయడంలో యే కొరతా చేయలేరు. మా పేరుతో నీవు ఏదైనా విషయాన్ని కల్పించాలని వారు ఇలా చేశారు. ఒకవేళ నీవు అలా కల్పించి ఉంటే వారు తప్పకుండా నిన్ను తమ మిత్రునిగా చేసుకొని ఉండేవారు. మేము గనక నీకు మనోబలాన్ని ఇచ్చి ఉండకపోతే నీవు వారివైపునకు కొంతైనా మొగ్గివుండేవాడవు అనేది అసంభవమేమీ కాదు. కాని ఒకవేళ నీవు అలా మొగ్గి ఉంటే, మేము నీకు ప్రపంచంలో కూడా రెట్టింపు శిక్షను రుచిచూపించి ఉండేవారము. పరలోకంలో కూడా రెట్టింపు శిక్షే. మాకు వ్యతిరేకంగా నీవు ఏ సహాయకుడినీ పొంది ఉండేవాడవు కావు." (బనీ ఇస్రాయీల్:73-75)

ఈ పూర్తి గాథను వివరించిన తరువాత అల్లాహ్ రెండు విషయాల గురించి సెలిస్తున్నాడు. ఒకటేమిటంటే, సత్యాన్ని తెలుసుకున్న తరువాత మీరు అసత్యంతో రాజీపడిపోతే చెడిపోయిన జాతి మీ పట్ల ప్రసన్నత కనబర్చవచ్చు. కాని దైవశిక్ష మాత్రం మీపై విరుచుకుపడుతుంది. మీకు ఇహపరలోకాలు రెంటిలోనూ ఇబ్బడి శిక్ష పడగలదు. రెండవ విషయం ఏదంటే, మనిషి తాను ప్రవక్త అయినాసరే అల్లాహ్ సహాయం మరియు ఆయన దయలేకపోతే స్వయంగా తన శక్తి సామర్థ్యాల ఆధారంగా ఆ తుఫానును ఎదిరింపజాలడు అన్నది. దైవప్రవక్త స) సత్యంపై నగధీరునిగా నిలబడి ఉండడానికి, ఎలాంటి పరీక్షా వెల్లువలు ఆయన్ను వీసమంతైనా కదల్చలేకపోవడానికి గల కారణం అల్లాహ్ ఆయనకు ప్రసాదించిన సహనం మరియు స్థయిర్యాలే.

జంకూ గొంకూల్లేని సత్యసందేశ ప్రకటన

"కనుక ప్రవక్తా! నీకు ఆజ్ఞాపించబడుతూ ఉండిన విషయాన్ని బహిరంగంగా ఎలుగెత్తి చాటు. షిర్కు చేసే వారిని ఏమాత్రం లెక్కచేయకు. నిన్ను ఎగతాళి చేసే వారికి, అల్లాహ్‌తోపాటు ఇతరులను కూడా దేవుళ్ళుగా నిర్ణయించే వారికి నీ తరఫున బుద్ధిచెప్పడానికి మేము చాలు. త్వరలోనే వారికి తెలిసి పోతుంది." (అల్‌హిజ్ర్: 94-96)

పరుల కోరికలను అనుసరించకూడదు

"ప్రవక్తా! నీవు స్పష్టంగా ఇలా అను: అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించమని నాకు ఆజ్ఞాపించబడింది. ఇతరులను భాగస్వాములుగా నిలబెట్టకు అని నాపై నిషేధం విధించబడింది. కనుక నేను మిమ్మల్ని ఆయన వైపునకే ఆహ్వానిస్తున్నాను. ఆయన వైపునకే నేను మరలుతాను." ఈ మార్గదర్శకత్వంతోనే మేము ఈ అరబీ ఫర్మానాను నీపై అవతరింపజేవాము. ఇక నీవు గనక, నీ వద్దకు ఈ జ్ఞానం వచ్చిన తరువాత కూడా ప్రజల కోరికలను అనుసరిస్తే అల్లాహ్ సమక్షంలో నిన్ను రక్షించేవాడు గానీ నీకు సహాయపడేవాడుగానీ ఎవడూ ఉండడు. మరెవడూ ఆయన శిక్ష నుండి నిన్ను తప్పించనూలేడు." (అల్‌ఆరాఫ్:36-37)

36వ ఆయత్‌లో ఓ ప్రశ్నకు సమాధానముంది. 37వ ఆయత్‌లో ఎలాంటి మొహమాటం లేకుండా అమలుచేసే తాకీదూ ఉంది.

ఇస్లామ్ ధర్మ వ్యతిరేకుల ప్రత్యేకమైన ఆక్షేపణలకు జవాబుంది మొదటి ఆయత్‌లో. వారు, ఈయన (ప్రవక్త-స) ఛాలంజీ చేస్తున్నట్లుగా, గతించిన ప్రవక్తలు తెచ్చిన బోధనలనే గనక తెచ్చి ఉన్నట్లయితే, యూదులు, క్రైస్తవులు కూడా గతించిన ప్రవక్తల అనుయాయులేకదా! మరి వారు ఎందుకు ముందుకొచ్చి ఆయన్ను ఆహ్వానించడం లేదు? అనే ఆక్షేపణలను లేవనెత్తారు. దానికి సమాధానంగా చెప్పబడిన విషయం ఏమంటే, వారిలో కొందరు ప్రసన్నతను వ్యక్తం చేస్తున్నారు, మరికొందరు అయిష్టంగా ఉన్నారు. అయితే ఓ ప్రవక్తా! ఎవరు సంతోషించినా మరెవరూ అయిష్టతను ప్రదర్శిస్తున్నా, మీరు మాత్రం, "నాకు ఈ జ్ఞానం అల్లాహ్ వైపు నుండి ప్రసాదించబడింది, నేను ఏ పరిస్థితుల్లోనూ దాన్నే అనుసరిస్తాను అని నిక్కచ్చిగా చెప్పండి" అన్నది.

అజ్ఞానపు అన్నికాలం చట్టాలను వదిలేయడం

"అప్పుడు యూసుఫ్ తన సొంత సోదరుని సంచివెదికే ముందు మారు సోదరుల సంచులను వెదకడం ప్రారంభించాడు. తరువాత తన సోదరుని సంచి నుండి పోయిన వస్తువును బయటకు తీశాడు. ఈ విధంగా మేము యూసుఫ్‌కు మా యుక్తిద్వారా సహాయపడ్డాము. రాజధర్మం (ఈజిప్టు రాజు శాసనం) ప్రకారం తన సోదరుణ్ణి బంధించడం అతనికి తగదు. ఒకవేళ అల్లాహ్‌యే అలా కోరితే తప్ప." (యూసుఫ్:75)

అంటే హజ్రత్ యూసుఫ్ (అ), తామే స్వయంగా సొంత వ్యవహారంలో రాజ ధర్మాన్ని అమలు చేయడం ఆయన (అ) దైవదౌత్య హోదాకు తగినది కాదు. తమ సోదరుణ్ణి తన వద్దనే ఉంచుకోవడానికి ఆయన ఏ ఉపాయాన్ని పన్నారో అందులో కొంతలోపం ఉండిపోయింది. అదేమిటంటే, సొంత సోదరుణ్ణి తప్పకుండా తన వద్దనే ఉంచుకోవచ్చు కాని రాజు శాసనాన్ని అమలుపర్చే అలా చేయాలి. అయితే ఆ రాజాధి కారాలు ఇస్లామేతర చట్టాలు. ఆయన ఆ అధికారాన్ని అతని చేతుల్లో నుండి తీసుకొని వాటి స్థానంలో ఇస్లామి చట్టాలను ప్రవేశింపజేయడానికి వాటి సహాయం తీసు కోవడం జరిగింది. దైవమే గనక తలిస్తే తన ప్రవక్తపై ఆ మచ్చబడేటట్లు చేసేవాడే. కాని దైవం అలా జరుగనివ్వలేదు. కాబట్టి నేరుగా అల్లాహ్ తన ఉపాయం ద్వారా, యూసుఫ్ (అ) అనుకోకుండా, తమ తక్కిన సోదరులతో "దొంగకు పడే శిక్ష ఏమిటి?" అని అడిగేటట్లు చేశాడు. వారు దానికి సమాధానంగా ఇబ్రాహీం (అ) వారి షరీఅత్ చట్టంలో ఉన్న శిక్ష ఏమిటో చెప్పడం జరిగింది. యూసుఫ్ (అ) సోదరులు ఈజిప్టు పౌరులు కాకపోవడం కూడా యాదృచ్ఛికమే. వారంతా ఓ స్వతంత్ర ప్రాంతం నుండి వచ్చినవారు. అందుకని వారే స్వయంగా తమ చట్టం ప్రకారం తన మనిషిని ఆ వస్తువుకు యజమాని అయిన వ్యక్తి బానిసత్వంలోనికి ఇవ్వడానికి సిద్ధపడ్డారు. అలాం టప్పుడు ఈ వ్యవహారంలో ఈజిప్టు శిక్షాస్మృతి సహాయం పొందే అవసరమేలేకపోయింది. తదుపరి రెండు ఆయత్‌లలో అల్లాహ్ తన కృప, తన జ్ఞాన ఔన్నత్యం ఏమిటో తెలియజేయడం జరిగింది. ఓ దైవదాసుడు తన మానవ లోపాల కారణంగా ఏదైనా తప్పిదానికి పాల్పడుతున్నప్పుడు అల్లాహ్ పరోక్షంగా అతనిని రక్షించే సదుపాయాలు చేయడం ఓ దాసునికి అంతకంటే కావలసిందేముంటుంది? తమ కృషి వలన గొప్ప గొప్ప పరీక్షలు ఎదురైనప్పుడు చిత్తశుద్ధిని ప్రదర్శించే వారికే ఇలాంటి ఉన్నతస్థానాలు లభ్యమౌతాయి. హజ్రత్ యూసుఫ్ (అ) జ్ఞానసంపన్నుడు మరియు ఎంతో వివేకంగా పనిజేసేవారై నప్పటికీ సమయం ఆసన్నమైనప్పుడు ఆయన జ్ఞానంలో కొంచెం లోటు అగుపించింది. ఆ లోటును పరమజ్ఞాని అయిన అల్లాహ్ పూడ్చేశాడు.

ఇకపోతే, దేశంలో రాజశాసనం చెలామణిలో ఉండగా, హజ్రత్ యూసుఫ్ (అ) తన కోసమని దాన్ని అమలుపర్చడం ఆయన హోదాకు ఎందుకు తగింది కాదు? అనే ప్రశ్నకు జవాబు అంతిమ దైవప్రవక్త (స) వారి విధానాన్ని పరికించి చూస్తే సునా యాసంగా పరిష్కరింపబడుతుంది. దైవప్రవక్త (స) వారి ప్రారంభ పాలనా కాలంలో ఇస్లామి చట్టాలు ఇంకా జారీ కానప్పుడు ప్రజలు పాతకాలపు పద్ధతిలోనే సారాయి త్రాగుతుండేవారు. మరి దైవప్రవక్త (స) కూడా వారిలా తాగినట్లా? ప్రజలు వడ్డీ వ్యాపారం చేస్తూ ప్రజల నుండి వడ్డీ వసూలుచేస్తూ ఉండేవారు. ఆయన (స) వారిలా వడ్డీ వ్యాపారం చేశారా? ప్రజలు 'ముతా' మరియు అక్కాచెల్లెళ్ళను ఒకేకాలంలో నికాహ్ చేసుకొని సంసారాలు సాగిస్తూ ఉండేవారు. ఆయన (స) కూడా అలా చేశారా?

దీనివల్ల అర్థమయ్యే విషయం ఏమిటంటే, కొన్ని అనివార్యకారణాలవల్ల ఇస్లామీ చట్టాల అమలు క్రమక్రమంగా జరగడం ఒకటైతే, దాన్ని ఆ క్రమంలో అజ్ఞాన కాలం నాటి విధానాలను అమలు చేయడం మరొకటి. ఒకదాని తరువాత మరొక చట్టాన్ని అమలుచేసే విధానంలో స్వేచ్ఛ ఇవ్వబడింది ఇతరులకే. అయితే, సందేశ ప్రచారకుడు యే చెడుగులనైతే అంతమొందించడానికి నియుక్తుడయ్యాడో, స్వయంగా ఆ విధానాల్లో ఏ ఒక్కదానినైనా సరే అనుసరించడం అతని హోదాకు తగినది కాదు.

భౌతికవాదుల భోగభాగ్యాలను ఖాతరు చేయకూడదు

"వారిలో విభిన్న వర్గాల వారికి మేము ఇచ్చిన ఐహిక సంపద వైపు నీవు కన్నెతి కూడా చూడకు. వారి స్థితికి బాధపడకు. వారిని విడిచిపెట్టి విశ్వాసులవైపునకు మొగ్గు." (అల్‌హిజ్ర్:88)

సత్యవంతుల విలువ అపారం

"తమ ప్రభువు ప్రసన్నతను అర్థిస్తూ ఎవరు ఉదయం,సాయంత్రం ఆయనను వేడుకుంటారో, వారి సహచర్యం పట్ల నీ హృదయాన్ని సంతృప్తి పరుచుకో. వారి నుండి నీ దృష్టిని ఏ మాత్రం మరల్చకు. నీవు ఇహలోకపు మెరుగులను కోరు కుంటావా?" (అల్ కహఫ్:28)

ఇబ్నె అబ్బాస్ (ర) గారి ఉల్లేఖనం ప్రకారం, ఖురైషీ సర్దారులు దైవప్రవక్త (స) వారితో ఇలా చెప్పేవారు:

"ఈ బిలాల్ (ర), సుహైబ్ (ర), అమ్మార్ (ర), ఖబ్బాబ్ (ర)లు, ఈ ఇబ్నె మస్‌ఊద్ (ర)లాంటి నిరుపేదలు నీ సహచర్యంలో కూర్చోవడం మాకిష్టం లేదు. మేము వారితో కలిసి కూర్చోలేము. వారిని బయటకు పంపిస్తేగాని నీ దగ్గరకు వచ్చి కూర్చోము. అప్పుడే నీవు చెప్పేదేదో వినగలం."

దానికి అల్లాహ్ తన ప్రవక్త (స)తో, "ఎవరైతే దైవప్రసన్నత పొందడానికి నీచుట్టూ వచ్చి చేరారో, ఉదయం సాయంత్రం తమ ప్రభువును వేడుకుంటున్నారో వారి సహచర్యం పట్ల నీ హృదయాన్ని సంతృప్తి పర్చుకో, వారి నుండి నీ దృష్టిని ఏమాత్రం మరల్చుకోకు. నీవు భౌతికమైన వారి ఆర్భాటాన్ని చూసి, వారు నీ వద్దకు వచ్చి కూర్చోవాలనే ఉద్దేశ్యంతో చిత్తశుద్ధిగల నీ సహచరుల్ని వదులుకుంటావా? అని అడగడం జరిగింది. ఈ వాక్యంలో అల్లాహ్ తన ప్రవక్త (స)ను సంబోధిస్తూ అడిగినట్లుగా మనకు అగుపించినా, అసలు ఉద్దేశ్యం మాత్రం ఖురైష్ సర్దారులకు, మీరు విర్రవీగిపోతున్న ఈ ప్రదర్శనా పటాటోపం, అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త (స) దృష్టిలో ఏమాత్రం విలువలేనిది, చిత్తశుద్ధి గలిగి, ఎల్లవేళలా దైవాన్ని వేడుకునే నిరుపేదలే మీకంటే ఎంతో విలువైన వారు అని తెల్చిచెప్పడం అన్నమాట. అచ్చం

ఇలాంటి వ్యవహారమే హజ్రత్ నూహ్ (అ) మరియు ఆయన జాతిసర్దారుల నడుమ ఏర్పడింది. హజ్రత్ నూహ్ (అ)తో ఆయన జాతి సర్దారులు కూడా, "మాలో అధములుగా చూడబడే వ్యక్తులు ఏదీ ఆలోచించకుండానే నీ వెంట తిరుగుతున్నారు" అని చెప్పగా హజ్రత్ నూహ్ (అ), "నేను విశ్వసించిన వారిని ఛీదరించుకునేవాణ్ణి కాను, మీరు ఎవరినైతే తక్కువ దృష్టితో చూస్తున్నారో, వారి విషయంలో అల్లాహ్ వారికి ఎలాంటి మేలు చేయడు అని నేను భావించడం లేదు" అని సమాధానమిస్తారు.

(హూద్: 27,29,31; అల్అన్ఆమ్: 52; అల్హిజ్ర్: 88)

కావలసింది సామాజిక హోదా కాదు, సత్యస్వీకార భావం

వారు ఇలా జవాబు పలికారు, "ఏమిటీ! మేము నిన్ను విశ్వసించాలా? వాస్తవానికి అధములైన వారే నిన్ను అనుసరిస్తున్నారు." దానికి నూహ్ ఇలా అన్నాడు: "వారు చేసే పనులెలాంటివో నాకేమి తెలుసు? వారి లెక్కచూడడం నా ప్రభువు బాధ్యత. అయ్యో! మీరు కొంచెం తెలివిగా వ్యవహరిస్తే ఎంత బాగుంటుంది."

(అష్షుఅరా:111-113)

"అధములైన వారే నిన్ను అనుసరిస్తున్నారు" అని నూహ్(అ)కు జవాబు ఇచ్చిన వారు ఆయన జాతికి చెందిన సర్దారులు మరియు ఉన్నత హోదాలు కలిగినవారు. ఈ గాథకు సంబంధించి మరోచోట ఇలా చెప్పడం జరిగింది:

అతని జాతికి చెందిన తిరస్కార సర్దారులు ఇలా అన్నారు: "నీవు కేవలం ఓ మానవ మాత్రునిగ తప్ప మరే వ్యక్తిగా మాకు అగుపడడం లేదు. అధములైన వారే ఆలోచించకుండా నిన్ను అనుసరిస్తున్నారు. ఏ విషయంలో మీరు మాకంటే ముందంజలో ఉన్నట్లు?"

నూహ్ (అ)ను విశ్వసించిన వారిలో చాలా మంది నిరుపేదలు, చిన్నచిన్న వృత్తులు చేసుకొని బ్రతికేవారు, శ్రామికులు లేదా తమ జాతిలో ఎలాంటి స్థానం లేనటువంటి యువకులే అన్నది దీనిద్వారా తెలుస్తోంది. పోతే, మిగిలిన ఉన్నత తరగతికి చెందిన పలుకుబడిగల వ్యక్తులు, ధనవంతులు వారిని వ్యతిరేకించడానికే సిద్ధపడ్డారు. వారు తమ జాతి ప్రజలను రకరకాలుగా మోసగించి తమ వెంట త్రిప్పుకునే ప్రయత్నం చేస్తూ ఉండినవారు. ఈ సందర్భంగా, యే ఆధారాలైతే వారు నూహ్కు (అ)కు వ్యతిరేకంగా చూపెట్టడం జరిగిందో వాటిలో ఒకటి ఇది: ఒకవేళ నూహ్ (అ) సందేశంలో ఏదైనా బలముండి ఉన్నట్లయితే జాతికి చెందిన సర్దారులు, పండితులు, ధార్మిక గురువులు, గౌరవనీయులు, బుద్ధిమంతులు దాన్ని స్వీకరించి ఉండేవారుకదా! కాని వారిలో యే ఒక్కడూ ఆయన్ను విశ్వసించలేదు. ఆయన వెంట ఉన్నవారంతా అధమ వర్గానికి చెందిన అమాయక జనం. వారికి ఆలోచించే శక్తి కూడా లేదు. అలాంటప్పుడు మాలాంటి ఉన్నతులం ఆ బుద్ధిహీనులు మరియు అధముల గుంపులో ఎలా చేరిపోగలం? అన్నది.

అచ్చం ఇలాంటి మాటలనే ఖురైష్ దైవతిరస్కారులు కూడా దైవప్రవక్త ముహమ్మద్ (స) విషయంలోనూ మాట్లాడేవారు. ఆయనను కొందరు అమాయక యువకులు, బానిసలు, నిరుపేదలు మాత్రమే అనుసరిస్తున్నారని, జాతికిచెందిన యే ఒక్క పెద్ద మనిషో, గౌరవనీయుడో ఆయన వెంట లేడని వారివాదన.

అబూ సుఫ్యాన్ రోమ్ చక్రవర్తి హర్క్యులెస్ వేసిన ప్రశ్నలకు సమాధానమిస్తూ,

تبعه منا الضعفاء والمساكين۔

"ముహమ్మద్ (స)ను మా జాతిలోని నిరుపేదలు, బలహీనులు మట్టుకే స్వీకరించారు" అని చెప్పడం జరిగింది.

అంటే, వారి ఆలోచనా వైఖరి ప్రకారం జాతి పెద్ద మనుషులకు బుద్ధివివేచనల జ్ఞానం ఉంది కాబట్టి వారు సత్యం అని నమ్మితేనే అది సత్యం కాగలదు. ఇకపోతే, బడుగువారి విషయం, వారు బలహీనులు, బడుగుప్రజలు కావడమే అందుకు నిదర్శనం. వారికి బుద్ధి వివేచనాలు లేవు కాబట్టి ఒక విషయాన్ని వారు స్వీకరించినా అది సత్యం కాదు. జాతికి చెందిన సర్దారులు దానిని ఖండించారంటే అందులో ఎలాంటి పసలేనట్లే లెక్క. మక్కా దైవతిరస్కారులైతే ఒక అడుగు ముందుకు వేసి, "ఓ మామూలు మనిషి ప్రవక్త కాలేడు, దేవుడు ఎవరినైనా ప్రవక్తగా పంపించాలని అనుకుంటే ఓ కుబేరునికి ఆ పదవి ఇచ్చి పంపవలసి ఉండాల్సింది" అని చెప్పేవారు.

وَقَالُوا لَوْلَا نُزِّلَ هَٰذَا الْقُرْآنُ عَلَىٰ رَجُلٍ مِّنَ الْقَرْيَتَيْنِ عَظِيمٍ ۝ (الزخرف : ٣١)

వారు ఇలా అంటారు: "ఈ ఖుర్ఆన్ రెండు గొప్ప నగరాల (మక్కా మరియు తాయిఫ్)లోని యే పెద్ద మనిషిపైనైనా ఎందుకు అవతరించబడలేదు?"

(అజ్ జుఖ్రుఫ్:31)

"మీరు కొంచెం తెలివిగా వ్యవహరిస్తే ఎంత బాగుంటుంది?" ఇది పైన చేసిన వారి ఆక్షేపణకు మొదటి సమాధానం. వారి ఆక్షేపణకు పునాది వారి ఆలోచనా సరళే. దాని ప్రకారం, ఎవరైతే నిరపేదలో, శ్రామికులో, ఉన్నత కుటుంబాలకు సేవజేసే వారో లేదా సమాజంలోని బడుగువర్గాలకు చెందినవారో వారిలో ఎలాంటి ఆలోచనా సామర్థ్యం ఉండదని, వారికి బుద్ధి జ్ఞానాలు అసలే ఉండవన్నది. అందుచేత వారి విశ్వాసం ఆలోచనా రహితమైనది. వారి నమ్మకం నమ్మదగింది కాదు, వారు చేసే సత్కార్యాలకు ఎలాంటి విలువ ఉండదు అని వాదించేవారు. హజ్రత్ నూహ్ (అ) వారి వాదనకు సమాధానంగా, నా వద్దకు వచ్చి నన్ను విశ్వసిస్తూ ఆ విశ్వాసం ప్రకారం నడుచుకునే వారి ఆచరణ ఎలాంటిదో తెలుసుకునే మార్గం నా వద్దలేదు. దాని

అడుగున ఏ ప్రేరణలున్నాయో దానికి ఎంత విలువ గట్టాలో ఆ లెక్క గట్టడం దేవుని పని. అది నేనుగాని మీరుగాని నిర్ణయించే విషయం కాదు.

وَمَآ اَنَا بِطَارِدِ الْمُؤْمِنِيْنَ ۝ اِنْ اَنَا اِلَّا نَذِيْرٌ مُّبِيْنٌ ۝

(الشعراء : ۱۱۴، ۱۱۵)

"విశ్వసించిన వారిని గెంటివేయడం నా పనికాదు. నేను కేవలం స్పష్టంగా హెచ్చరిక చేసేవాణ్ణి మాత్రమే." (అష్షుఅరా:114,115)

ఇది వారి ఆక్షేపణకు రెండవ సమాధానం. వారి ఆక్షేపణ వెనుక దాగున్న అంశం ఏదంటే, విశ్వసించినవారి యే వర్గం అయితే హజ్రత్ నూహ్ (అ) చుట్టూ చేరుతుందో అది మా సమాజానికి చెందిన బడుగు వర్గాలకు చెందినది కాబట్టి ఉన్నత వర్గంలో యే ఒక్క వ్యక్తికి కూడా ఆ గుంపులో చేరడానికి మనసొప్పడం లేదు. మరో విధంగా చెప్పాలంటే, ఓ నూహ్! మేము నిన్ను విశ్వసించి మమ్మల్ని అధములు, నీచుల కోవలో నిలబెట్టుకోవాలా? మేము బానిసలు, కూలివారు మరియు నౌకర్ల వరుసలోనికి వచ్చి కూర్చోవాలా? అని అడగడం అన్నమాట. దానికి హజ్రత్ నూహ్ (అ) ఇచ్చిన సమాధానం ఇది: "ఎవరైతే నా మాటను తిరస్కరిస్తున్న వారి వెంటయితే పడివేడుకోవడం, నా మాటను వినేవారిని గెంటివేసే అసంబద్ధ మైన వైఖరిని నేనెలా అవలంబించగలను? నేను మాత్రం నిలబడి బాహాటంగా, యే మార్గాన్నైతే మీరు అనసరిస్తున్నారో అది పూర్తిగా అసత్యమైన మార్గం, మరే మార్గం వైపునకు నేను మిమ్మల్ని రమ్మని ఆహ్వానిస్తున్నానో అందులో మీ అందరి ముక్తి దాగుంది అని ప్రకటించే నిస్పక్షపాతిని. ఇక నా హెచ్చరికను స్వీకరించి నా వైపునకు రావడం లేదా కళ్ళు మూసుకొని గ్రుడ్డిగా వినాశనానికి దారితీసే మార్గంపై నడవడం మీ ఇష్టంపై ఆధారపడి ఉంది. ఏ దైవదాసులైతే నా ఈ హెచ్చరికను విని రుజుమార్గాన్ని అవలంబించడానికి నా వద్దకు వచ్చారో, వారి జాతి ఏది, వారి వంశమేది, వారి కులమేది, వారి వృత్తి ఏది అని అడగడం నా పని కాదు. మీ దృష్టిలో వీరు అధములే అయితే వారిని గెంటివేసి, గౌరవనీయులైన మీరు వినాశమార్గాన్ని త్యజించి ముక్తిమార్గంపైకి ఎప్పుడు దయజేస్తారా అని ఎదురు చూస్తూ కూర్చోలేను.

దైవప్రవక్త ముహమ్మద్ (స) మరియు మక్కా దైవతిరస్కారుల నడుమ అచ్చం ఈ వ్యవహారమే ఈ ఆయత్‌ల అవతరణా సమయంలో నలుగుతూ ఉండింది. దీన్ని దృష్టిలో ఉంచుకుంటే, హజ్రత్ నూహ్ (అ) మరియు ఆయన జాతి సర్దారుల ఈ సంభాషణ ఇక్కడ ఎందుకు ప్రస్తావించబడిందో అర్థం అవుతుంది. మక్కా దైవ తిరస్కారుల గొప్పగొప్ప సర్దారులు బిలాల్, అమ్మార్ మరియు సుహైబ్ (ర.అ.) లాంటి బానిసలు మరియు వృత్తి పనిజేసుకొని బ్రతికేవారి వెంట మేము ఎలా

కూర్చోగలం? అని అనేవారు. అంటే వారి ఉద్దేశ్యం, విశ్వసించిన ముస్లిముల వరుస నుండి ఈ నిరుపేదలను తొలగించితే తప్ప- మాలాంటి గౌరవనీయ కుటుంబాల వాళ్ళు మీ వైపునకు మరలే అవకాశం లేదు అని చెప్పడం అన్నమాట. దీనికి మహాప్రవక్త (స)కు దైవం తరపున స్పష్టమైన మాటల్లో ఈ సూచనలనిస్తూ సత్యానికి విముఖత చూపే గర్వాంధుల కోసం విశ్వసించిన నిరుపేదలను గెంటివేయడం కుదరదు అని హెచ్చరించడం జరిగింది.

أَمَّا مَنِ اسْتَغْنَىٰ ۝ فَأَنْتَ لَهُ تَصَدَّىٰ ۝ وَمَا عَلَيْكَ أَلَّا
يَزَّكَّىٰ ۝ وَأَمَّا مَنْ جَاءَكَ يَسْعَىٰ ۝ وَهُوَ يَخْشَىٰ ۝ فَأَنْتَ عَنْهُ
تَلَهَّىٰ ۝ كَلَّا إِنَّهَا تَذْكِرَةٌ ۝ فَمَنْ شَاءَ ذَكَرَهُ ۝ (عبس: ٥ تا ١٢)

"(ఓ ముహమ్మద్-స)! లక్ష్యపెట్టనివాడి పట్లనైతే నీవు శ్రద్ధ చూపుతావు, వాస్తవానికి, ఒకవేళ అతడు దారికిరాకపోతే, దానికి నీపై బాధ్యత లేదుకదా? ఎవడు తనంతట తాను నీ వద్దకు పరుగెత్తుకుంటూ వస్తాడో మరియు (దేవునికి) భయపడుతూ ఉంటాడో, అతని వైపు నీవు ముఖం తిప్పుకుంటున్నావు. ఎంత మాత్రం కాదు, అదసలు ఒక హితబోధ, ఇష్టమైన వారు దీన్ని స్వీకరించవచ్చు." (అబస: 5-13)

وَلَا تَطْرُدِ الَّذِينَ يَدْعُونَ رَبَّهُمْ بِالْغَدَاةِ
وَالْعَشِيِّ يُرِيدُونَ وَجْهَهُ ۖ مَا عَلَيْكَ مِنْ حِسَابِهِمْ
مِنْ شَيْءٍ وَمَا مِنْ حِسَابِكَ عَلَيْهِمْ مِنْ شَيْءٍ فَتَطْرُدَهُمْ
فَتَكُونَ مِنَ الظَّالِمِينَ ۝ وَكَذَٰلِكَ فَتَنَّا بَعْضَهُمْ بِبَعْضٍ
لِيَقُولُوا أَهَٰؤُلَاءِ مَنَّ اللَّهُ عَلَيْهِمْ مِنْ بَيْنِنَا ۗ أَلَيْسَ
اللَّهُ بِأَعْلَمَ بِالشَّاكِرِينَ (الانعام: ٥٢،٥٣)

"రేయింబవళ్ళూ తమ ప్రభువును వేడుకునేవారినీ, ఆయన ప్రసన్నతను పొందగోరే ప్రయత్నంలో నిమగ్నులై ఉన్న వారినీ నీవు దూరంగా తొలగిపొమ్మనకు. వారికి సంబంధించిన లెక్కలోని యే విషయాన్ని గురించిన భారమూ నీపైలేదు. దీని తరువాత కూడా నీవు గనక వారిని దూరంగా త్రోసివేస్తే దుర్మార్గులలో చేరిపోతావు. అసలు మేము ఈ విధంగా వారిలోని కొందరిని కొందరి ద్వారా పరీక్షకు గురిచేశాము. వారు వీరిని చూసి, "మా మధ్య అల్లాహ్ దయాదాక్షిణ్యాలను పొందినవారు వీరేనా?" అని అనేందుకు- అవును! అల్లాహ్ కృతజ్ఞతలు చూపే తన భక్తులను వీరికంటే బాగా ఎరుగడా?" (అల్అన్ ఆమ్: 52-53)

అనుసరణకు తోడు అనుశీలన కూడా అవసరం

وَاخْفِضْ جَنَاحَكَ لِمَنِ اتَّبَعَكَ مِنَ الْمُؤْمِنِينَ ۝ فَإِنْ
عَصَوْكَ فَقُلْ إِنِّي بَرِيءٌ مِّمَّا تَعْمَلُونَ (الشعراء: ۲۱۶،۲۱۵)

"విశ్వాసులలో నిన్ను అనుసరించే వారి పట్ల మృదువుగా మెలుగు. కాని ఒకవేళ వారు నీ పట్ల అవిధేయత చూపితే అప్పుడు వారితో, 'మీరు చేస్తున్నదానికి నేను బాధ్యుడనుకాను' అని అను." (అష్షుఅరా: 215,216)

ఈ ఆయత్ భావాన్ని రెండు రకాలుగా అర్థం చేసుకోవచ్చు. ఒకటేమిటంటే, మీ బంధువుల్లో ఎవరైతే మిమ్ములను విశ్వసించి, మిమ్మల్నే అనుసరిస్తున్నారో ఓ ప్రవక్తా! వారితో మృదువుగా మెలగండి; మరెవరైతే మీ మాట వినరో వారిని వది లేయండి అన్నది. రెండవది, ఈ వాక్యం ఎవరినైతే హెచ్చరించమని చెబుతోందో ఆ బంధువులమట్టుకే సంబంధించి కాకుండా సార్వత్రికమైనదీ కూడా ఉండవచ్చు. అంటే, విశ్వసించి మిమ్ములనే అనుసరించే వారిపట్ల మృదువుగా మెలగండి, మరెవరైతే అవిధేయతకు పాల్పడుతున్నారో వారిని హెచ్చరిస్తూ మీరు చేస్తున్న దానికి నేను బాధ్యుడను కాను అని చెప్పండి అని.

ఈ వాక్యం ద్వారా అర్థం అయ్యే విషయం ఏమిటంటే, ఆ కాలంలో ఖురైష్ మరియు వారికి చుట్టుపట్ల నివసించే అరబ్బుల్లో కొంతమంది దైవప్రవక్త (స) వారి సత్యసందేశానికి ప్రభావితులయ్యారని, అయితే వారు ప్రాక్టికల్‌గా ఆయనను అనుస రించకుండా యథాప్రకారం తమ మార్గభ్రష్టమైన సమాజంలో ఇతర దైవతిరస్కారులతో కలిసిమెలిసి జీవితం గడుపుతున్నారన్న విషయం ద్యోతకమవుతోంది. అల్లాహ్ వారిని అసలు విశ్వాసుల నుండి వేరుపర్చడం జరిగింది. మృదువుగా మెలగమనే ఆదేశం అసలు విశ్వాసుల పట్ల అవలంబించాలన్నదే.

ఇకపోతే దైవప్రవక్త (స) ను అనుసరించడానికి ఎవరు నిరాకరించారో వారిలో ఆయన (స) సత్యసందేశాన్ని ఒప్పుకున్నవారూ, దాన్ని తిరస్కరించినవారూ ఉన్నారు. అలాంటి వారిని సంబోధిస్తూ, మీరు మీ కర్మల ఫలాన్ని మీరే స్వయంగా అనుభ విస్తారు అని స్పష్టంగా చెప్పండి. మిమ్మల్ని హెచ్చరించిన తరువాత ఇప్పుడు నాపై మీ కర్మల బాధ్యత ఏదీ ఉండదు అని నిక్కచ్చిగా చెప్పివేయండి.

వ్యతిరేకతకు వెరువకండి

وَلَقَدْ آتَيْنَا مُوسَى الْكِتَابَ فَاخْتُلِفَ فِيهِ ۚ وَلَوْلَا كَلِمَةٌ
سَبَقَتْ مِن رَّبِّكَ لَقُضِيَ بَيْنَهُمْ ۚ (هود: ١١٠)

"మేము ఇది వరకు మూసాకు కూడా గ్రంథాన్ని ఇచ్చి ఉన్నాము. దాని విషయంలో కూడా విభేదించడం జరిగింది. (ఇప్పుడు నీకు ఇవ్వబడిన ఈ గ్రంథం

విషయంలో విభేదించడం జరుగుతున్నట్లుగా). నీ ప్రభువు తరపు నుండి ఒక విషయం ముందేగనక నిర్ణయించబడి ఉండకపోతే, ఈ విభేదించే వారి విషయంలో ఎప్పుడో తీర్పు జరిగి ఉండేది." (హూద్: 110)

ఈ చివరి పదాలు కూడా దైవప్రవక్త (స)ను సంతృప్తి పర్చడానికి, ఆయనకు సహనం నూరిపోయడానికి చెప్పబడినవే. ఎవరైతే ఖుర్ఆన్ విషయంలో విభేదిస్తున్నారో వారి గురించి నిర్ణయం ముందే తీసుకోవడం జరిగిందని, అల్లాహ్ తీర్పు నిర్ణయించిన సమయానికి ముందు వెలువడేది కాదు; అలాగే ఈ భూలోక వాసులు తీర్పు కావాలని కోరడంలో తొందరపాటు ఉందని, అల్లాహ్ మాత్రం ఆ తీర్పు ఇవ్వడంలో త్వరపడే వాడు కాడు అని చెప్పడం అన్నమాట.

వ్యతిరేకుల కుచేష్టలను ఎదిరించడం

فَاصْفَحِ الصَّفْحَ الْجَمِيْلَ ٥ اِنَّ رَبَّكَ هُوَ الْخَلّٰقُ الْعَلِيْمُ ٥

(الحجر: ٨٥، ٨٦)

"ప్రవక్తా! నీవు (వారి కుచేష్టలకు) పెద్ద మనిషి తరహాలో మన్నించు. నిశ్చయంగా నీ ప్రభువు అందరినీ సృష్టించిన వాడూ, అంతా తెలిసినవాడూను." (అల్‌హిజ్ర్:85)

అంటే సృష్టికర్త కావడం మూలంగా ఆయన తన సృష్టితాలపై సంపూర్ణ అధికారాన్ని కలిగి ఉన్నాడు. ఏ సృష్టితానికైనా ఆయన పట్టు నుండి పారిపోయే శక్తి లేదు. దానికి తోడు ఆయన సర్వం ఎరిగినవాడు కూడా. "మీరు వారిని సంస్కరించేందుకు ఏ పాట్లయితే పడుతున్నారో వాటిని కూడా ఆయన ఎరుగు. అలాగే ఏ ఎత్తుల ద్వారా మీ కృషిని నీరుగార్చడానికి ప్రయత్నం చేస్తున్నారో అవి కూడా ఆయనకు తెలుసు. కాబట్టి మీరు భయపడనవసరంగాని, తొందరపాటుకు గురయ్యే అవసరంగాని ఏ మాత్రం లేదు. సమయం వచ్చినప్పుడు న్యాయమైన తీర్పు వెలువడుతుంది" అని ధైర్యం చెప్పడం జరిగింది ప్రవక్త (స)కు.

సత్కార్యాల ద్వారా చెడుల ప్రక్షాళన

وَاَقِمِ الصَّلٰوةَ طَرَفَيِ النَّهَارِ وَزُلَفًا مِّنَ الَّيْلِ ؕ اِنَّ
الْحَسَنٰتِ يُذْهِبْنَ السَّيِّاٰتِ ؕ ذٰلِكَ ذِكْرٰى لِلذّٰكِرِيْنَ ٥

(هود: ١١٤)

చూడు! నమాజును స్థాపించు, పగటి రెండు సరిహద్దుల సమయం లోనూ, కొంత రాత్రి గడిచిన తరువాతనూ. వాస్తవానికి సత్కార్యాలు దుష్కార్యాలను దూరం చేస్తాయి." (హూద్: 114)

అంటే, యే దుష్కార్యాలు, రుగ్మతలైతే ప్రపంచంలో వ్యాపించి ఉన్నాయో, ఈ సందేశ ప్రచారం పట్ల, మీ పట్ల కక్షబూని వారు అవలంబిస్తున్న ఆగడాలను రూపుమాపే అసలు విధానం ఏదంటే, మీరు స్వయంగా సాధ్యమైనంత వరకు సదాచారులుగా మారాలి. మీ సదాచారం ద్వారా దుర్మార్గాన్ని ఓడించండి. మిమ్మల్ని సదాచార సంపన్ను లుగా మలిచే అత్యుత్తమమైన విధానమే ఈ నమాజు. ఇది మీకు దుష్కార్యాలకు వ్యతిరేకంగా లేచిన ఈ తుఫానును ఎదిరించే శక్తిసామర్థ్యాలను ఇవ్వడమే కాకుండా మీరు దాన్ని రూపుమాపి ప్రపంచంలో సుఖశాంతుల సద్వ్యవస్థను కూడా నెలకొల్పగలరు.

వ్యతిరేకుల పట్ల మీరు అవలంబించవలసిన వైఖరి

وَاِنْ مَّا نُرِيَنَّكَ بَعْضَ الَّذِىْ نَعِدُهُمْ اَوْ نَتَوَفَّيَنَّكَ
فَاِنَّمَا عَلَيْكَ الْبَلٰغُ وَعَلَيْنَا الْحِسَابُ ٥ (الرعد : ٤٠)

"ప్రవక్తా! ఏ చెడు పర్యవసానాన్ని గురించి మేము ఈ ప్రజలను బెదిరిస్తూ వచ్చామో, అందులో ఒక భాగాన్ని నీ జీవిత కాలంలో చూపించినా లేదా అది సంభవించే ముందు మేము మీకు తెలుపకున్నా ఏ పరిస్థితిలోనైనా, నీ పని కేవలం సందేశాన్ని అందజేయడమే. లెక్క తీసుకోవడం మట్టుకు మా పని." (అర్రాద్: 40)

ఇక్కడ భావం ఏమిటంటే, ఎవరైతే మీ ఈ సందేశ ప్రచారాన్ని తిరస్కరించారో వారి పరిణామం ఎలా జరుగుతుంది? అది ఎప్పుడు సంభవిస్తుంది. అనే మీమాంసలో పడకుండా మీకు అప్పజెప్పబడిన కార్యాన్ని పూర్తి ఏకాగ్రతా చిత్తంతో నెరవేరుస్తూ పోండి. తీర్పు మాకు వదిలివేయండి అని. ఇది దైవప్రవక్త(స)కే సంబోధించి చెప్పినట్లు అగుపడినప్పటికీ, ఛాలెంజీగా మాటిమాటికి దైవప్రవక్త (స)తో, మా ఏ పర్యవసానం గురించైతే మమ్మల్ని బెదిరిస్తూ వస్తున్నావో ఆ శిక్ష మాపై ఎందుకు విరుచుకుబడడం లేదు? అని అడుగుతున్న విరోధులను సంబోధిస్తూ చెప్పబడిందే.

సత్యసందేశవహుడు శక్తి పొందే మార్గాలు

وَلَقَدْ نَعْلَمُ اَنَّكَ يَضِيْقُ صَدْرُكَ بِمَا يَقُوْلُوْنَ ٥
فَسَبِّحْ بِحَمْدِ رَبِّكَ وَكُنْ مِّنَ السّٰجِدِيْنَ ٥ وَاعْبُدْ
رَبَّكَ حَتّٰى يَاْتِيَكَ الْيَقِيْنُ ٥ (الحجر : ٩٧ تا ٩٩)

వారు నిన్ను గురించి కల్పిస్తున్న మాటల వల్ల నీ మనసుకు మిక్కిలి కష్టం కలుగుతోందని మాకు తెలుసు. (దానికి చికిత్స ఏమిటంటే) నీ ప్రభువు స్తోత్రం చేస్తూ ఆయన పవిత్ర నామాన్ని స్మరించు. ఆయన సన్నిధానంలో సాష్టాంగపడు.

తప్పకుండా వచ్చే చివరి గడియ వరకూ నీ ప్రభువు దాస్యం చేస్తూ ఉండు." (అల్‌హిజ్ర్: 97-99)

అంటే సత్యప్రచారం మరియు సంస్కరణ కోసం చేసే కృషిలో భాగంగా ఏ కష్టాలు, ఏ కడగండ్లు అయితే మీకు ఎదురౌతాయో, వాటిని అడ్డుకునే శక్తి సామర్థ్యాలు ఏవైనా మీకు లభిస్తే అవి కేవలం నమాజు స్థాపన మరియు దైవదాస్యంపై స్థిరంగా నిలబడడం ద్వారానే లభిస్తాయి. ఈ విషయమే మీకు స్వాంతన చేకూరుస్తుంది, మీలో సహనాన్ని పుట్టిస్తుంది. అలాగే మీకు ధైర్యాన్ని చేకూర్చి, తుఫానులా వచ్చిపడే శాపనార్థాలు, తిట్లు మరియు అడ్డంకులకు దీటుగా నిలబడే సామర్థ్యాన్ని కలిగిస్తాయి. దీని ఫలితం మీకు దైవప్రసన్నత రూపంలో లభించగలదు.

నమాజు స్థాపన

"ప్రవక్తా! వహీ ద్వారా నీ వద్దకు పంపబడిన గ్రంథాన్ని పారాయణం చెయ్యి. నమాజును స్థాపించు. నిశ్చయంగా నమాజు అశ్లీల కార్యాల నుండి, చెడు పనుల నుండి నిరోధిస్తుంది. అల్లాహ్ సంస్మరణ దీనికంటే కూడా చాలా గొప్ప విషయం. నీవు చేసేదంతా అల్లాహ్‌కు తెలుసు." (అల్ అన్‌కబూత్:45)

నమాజును స్థాపించు అనే సంబోధన దైవప్రవక్త (స)ను ఉద్దేశించి చేసిందే అయినా అది విశ్వాసులందరికీ వర్తిస్తుంది. సహించరాని హింసాదౌర్జన్యాలు, విశ్వాసంపై స్థిరంగా నిలబడనివ్వని తీవ్రమైన కష్టాలు విశ్వాసులపై విరుచుకుపడ్డ కాలమది. ఆ ఆయత్‌లు ఈ సందర్భంలోనే అవతరించాయి.

దివ్యఖుర్‌ఆన్ పారాయణం

వారిని ఎదిరించేందుకు అల్ అన్‌కబూత్ సూరాలోని మొదటి నాల్గు రుకూలలో సహనాన్ని, స్థయిర్యాన్ని నూరిపోస్తూ, దేవునిపైన్నే పూర్తి భారం ఉంచాలనే బోధజేసిన తరువాత, దాన్ని ఎలా అమలుపర్చాలో ఆ ఉపాయం కూడా చెప్పడం జరిగింది. అది నమాజు స్థాపన మరియు దివ్యఖుర్‌ఆన్ పారాయణం. అసత్యవాదులు లేవనెత్తిన తీవ్రమైన విమర్శనా వెల్లువ మరియు వ్యతిరేకతల తుఫాను హోరులకు స్థిరంగా నిలబడడమే కాకుండా వాటి దిశను మార్చే శక్తి సామర్థ్యాలు, సచ్చరితం కేవలం ఈ రెంటి ద్వారానే సాధ్యపడగలవు ఓ విశ్వాసికి. అయితే దివ్యఖుర్‌ఆన్ పారాయణం మరియు నమాజు ద్వారా మనిషికి లభించే ఈ శక్తి కేవలం దివ్యఖుర్‌ఆన్ పదాల వల్లింపుతోనే సరిపెట్టుకోక దాని బోధనలను ఖచ్చితంగా తన ఆత్మలో లీనం చేసుకున్నప్పుడు, మరియు నమాజు కేవలం అవయవాల కదలికలకే పరిమితం కాకుండా అతని హృదయానికి హత్తుకొని పోయి అతని నైతికతలను ప్రేరేపించేదిగా ఉన్నప్పుడే. నమాజు ద్వారా ఒనగూడే సుగుణం ఏమిటో దివ్యఖుర్‌ఆన్ ముందు

వాక్యంలో వివరించింది. ఇకపోతే ఖుర్‌అన్ పారాయణం దాని గురించి తెలుసుకో వలసిన విషయం ఏమిటంటే, యే పారాయణమైతే గొంతును దాటి హృదయం వరకు చేరలేదో అది ఆ వ్యక్తికి కష్టకాలంలో స్థిరంగా నిలబడే శక్తి లభించకపోగా స్వయం అతనికి తన విశ్వాసంపై కూడా నిలబడే శక్తిని ప్రసాదించలేదు. ఓ హదీసులో ఓ వర్గం గురించి ఇలా సెలవియ్యడం జరిగింది.

يَقْرَاُوْالقُرْآنَ وَلَا يُجَاوِزُ حَنَاجِرَهُمْ يَمْرِقُوْنَ
من الدين مروق السهم من الرمية

"వారు ఖుర్‌అన్ పారాయణం చేస్తారు కాని ఖుర్‌అన్ వారి గొంతు నుండి క్రిందికి దిగదు. ధనస్సు నుండి బాణం దూసుకు వెళ్ళిపోయినట్లుగా వారు ధర్మం నుండి వెళ్ళిపోతారు."

ఏ పారాయణం వల్ల మనిషి ఆలోచనా సరళిలో, నైతికతా నడవడికల్లో ఎలంటి మార్పురాకపోగా, పైపెచ్చు ఖుర్‌అన్ పఠించిన తరువాత కూడా, ఖుర్‌అన్ దేన్నుండి వారిస్తుందో వాటన్నిటినీ ఆచరిస్తూ పోతుంటే అతని ఆ పారాయణం ఓ విశ్వాసి చేసే పారాయణం కానేకాదు. దీని గురించి దైవప్రవక్త (స) స్పష్టంగా ఇలా సెలవిస్తున్నారు:

ما آمن بالقرآن من استحل محارمه-

"ఆ వ్యక్తి ఖుర్‌అన్‌ను విశ్వసించనేలేదు ఎవరైతే అది హరామ్ (నిషిద్ధం) చేసిన వస్తువులను హలాల్ (ధర్మసమ్మతం) చేసుకున్నాడో."

(తిర్మిజీ-సుహైబ్ రూమీ-ర)

ఇలాంటి పారాయణం మనిషి మనస్సును సంస్కరించి, అతని ఆత్మకు బలంచేకూర్చే బదులు తన దైవంపట్ల మరింత మొండివైఖరిని ప్రదర్శించే వానిగా, తన అంతరాత్మకు వ్యతిరేకంగా మరింత సిగ్గుమాలిన వానిగా చేస్తుంది. అతనితో 'క్యారెక్టరు' లాంటి ఏదీ మిగిలి ఉండనివ్వదు. ఎందుకంటే, ఏ వ్యక్తి అయితే ఖుర్‌అన్‌ను దైవగ్రంథంగా విశ్వసిస్తూ దాన్ని పఠించి దైవం ఇచ్చిన సూచనలు ఏవో తెలుసుకుంటూనే ఆయన బోధనలను జవదాటుతూ పోతుంటే, అలాంటి వ్యక్తి చట్టాన్ని బాగా ఎరిగి నేరం చేసిన నేరస్తుడికి సమానం. ఈ పరిస్థితిని దైవప్రవక్త(స) ఓ చిన్నపాటి వాక్యంలో ఇలా విశదీకరించారు:

القرآن حجة لك او عليك (مسلم)

"ఖుర్‌అన్ నీకు అనుకూలంగా లేదా నీకు వ్యతిరేకంగా ఒక సాక్ష్యం." (ముస్లిం)

అంటే, నీవు ఖుర్‌ఆన్‌ను సరిగా అనుసరిస్తే అది నీకు ఓ సాక్షిగా నిలవడం వలన, పరలోకంలో నిన్ను ప్రశ్నిస్తున్నప్పుడు నీవు దాన్ని సాక్ష్యంగా ప్రవేశపెడుతూ, నేను ఏది చేసినా ఈ గ్రంథానికి అనుగుణంగానే చేశాను అని చెప్పవచ్చు. ఒకవేళ నీ కార్యాచరణ పూర్తిగా దానికి అనుగుణంగానే ఉండి ఉంటే ఈ ఇహలోకంలో యే ఇస్లామీ న్యాయనిర్ణేత నిన్ను శిక్షించలేడు. అలాగే ప్రళయ దినాన తీర్పుదినపు యజమాని కూడా నిన్ను మన్నిస్తాడు. కాని ఈ గ్రంథమే నీకు అంది, నీవు దాన్ని పఠించి, నీ ప్రభువు నీ నుండి కోరేదేమిటో, దేని గురించి నిన్ను ఆదేశిస్తున్నాడో మరి దేన్నుండి వారిస్తున్నాడో తెలుసుకున్న తరువాత కూడా దానికి వ్యతిరేక వైఖరినే అవలంబిస్తే, ఈ గ్రంథం నీకు సాక్షిగా నిలబడి దైవన్యాయస్థానంలో నీకు వ్యతిరేకంగా నీపై వేయబడిన నేరాన్ని మరింత పటిష్ఠం చేయగలదు. ఆ తరువాత నీవు తెలియదనే సాకుజూపి తప్పించుకోవడమో లేదా తేలికైన శిక్ష పొందడమో నీకు సాధ్యమయ్యే విషయం కాదు.

"నమాజు అశ్లీల కార్యాల నుండి, చెడు పనుల నుండి నిరోధిస్తుంది" అంటే, ఈ నమాజులోని అనేక గుణాల్లో ఇది ఒక ముఖ్యమైన సుగుణం అని చెప్పడం అన్నమాట. సందర్భాన్ని బట్టి ఈ సుగుణాన్ని ప్రస్ఫుటం చేసి చూపెట్టడం జరిగింది. మక్కా వాతావరణంలో ఏ అడ్డంకులైతే ముస్లిములకు తారసపడ్డాయో వాటిని ఎదిరించడానికి వారికి భౌతిక శక్తికంటే నైతిక శక్తి అవసరమే అధికంగా ఉండింది. ఈ నైతిక శక్తి ఉత్పాదనకు మరియు దాన్ని వికసింపజేయడానికి రెండు ఉపాయాలు సూచించడం జరిగింది. ఒకటి దైవగ్రంథం దివ్యఖుర్‌ఆన్ పారాయణం అయితే రెండవది నమాజు స్థాపన. ఆ తరువాత ఇప్పుడు సూచించబడుతున్న విషయం ఏదంటే, మీరు ఇస్లాం ధర్మాన్ని స్వీకరించక పూర్వం ఏయే చెడుగుల్లో చిక్కుకొని ఉన్నారో, మీ చుట్టుపట్ల నివసించే అరబ్బులు అరబ్బేతర సమాజం ఏ రుగ్మతల్లోనైతే కొట్టుమిట్టాడుతూ ఉందో దాన్నుండి బయటపడే మార్గం ఈ నమాజు స్థాపన ఒక్కటే అన్నది.

బాగా ఆలోచించి చూస్తే, ఈ సందర్భంలో నమాజు ఈ ప్రత్యేక ప్రయోజనాలను ఇక్కడ ఎందుకు చెప్పడం జరిగిందో సునాయాసంగా అర్థమైపోతుంది. నైతికపరమైన రుగ్మతలకు దూరంగా ఉండడం, ఇహపరలోకాల్లో ప్రయోజనకారే కాకుండా, ఆ పరిశుద్ధతను సంతరించుకున్న వారికి, అందుకు వ్యతిరేకంగా చెడుగుల్లో చిక్కుకొని, ఆ చెడుగులనే పోషిస్తున్న ఈ అజ్ఞానపు అపరిశుద్ధ వ్యవస్థను కొనసాగించే ప్రయత్నం చేస్తున్న ప్రజల్లో గొప్ప గౌరవమర్యాదలు లభిస్తాయి.

ఏ రుగ్మతలైతే అశ్లీలంగా, చెడ్డపనులుగా భావించడం జరుగుతున్నాయో మానవ నైజం కూడా వాటిని అశ్లీలమైనవిగా, చెడ్డవిగానే భావిస్తోంది. ప్రతి సమాజం,

ప్రతి జాతి ప్రజలు వారు ఎంత చెడిపోయి ఉన్నప్పటికీ వాటిని రుగ్మతలుగానే భావిస్తారు. దివ్యఖుర్‌ఆన్ అవతరణ కాలంలోనూ అప్పటి అరబ్బు సమాజం సర్వ సాధారణ ఈ భావాన్నే కలిగి ఉండేది. ఆ సమాజ ప్రజలు కూడా నైతికతలకు సంబంధించి చెలామణిలో ఉన్న మంచిచెడుల గురించి ఎరిగినవారే. చెడుగుకంటే మంచిని ఆదరించేవారు. వారిలో చెడుగును మంచిపనిగా, లేదా మంచి పనిని చెడు దృష్టితో చూసేవాడు బహుశా లేడనే చెప్పాలి. ఈ పరిస్థితిలో చెడిపోయిన సమాజ ప్రజల్లో కొందరు నైతికంగా మారిపోయి తమ నడవడికలోనూ, తమ వైఖరిలోనూ తమ వారిలో కొట్టొచ్చినట్లు అగుపడడం ప్రభావం చూపకుండా ఉండ లేదు. అరేబియాకు చెందిన సాధారణ ప్రజానీకం, చెడులను రూపుమాపి, మంచిని పెంచిపోషించి పరిశుద్ధులుగా చేసే ఈ ఉద్యమంలో నైతికతా విలువలను గమనించ లేకపోవడం అసాధ్యమైన విషయం ఏదీ కాదు. అలాగే దానికి వ్యతిరేకంగా, కేవలం అజ్ఞానపు శత్రుత్వాల పస లేని నినాదాల ఆధారంగా, శతాబ్దాలుగా ఈ చెడుగులను పెంచిపోషిస్తున్న అజ్ఞానపు వ్యవస్థను పెంచిపోషిస్తూ ఆ చెడుగుల్లోనే చిక్కుకొనిపోయిన వారికి వెన్నుదన్నుగా నిలువడం కూడా వారికి అంతే అసాధ్యమైన విషయంగా ఉండింది. ఈ కారణంగానే ఖుర్‌ఆన్ ఈ సందర్భంలో ముస్లిములకు, భౌతిక వనరులను సమకూర్చుకునే నమాజును స్థాపించమనే సూచనలు ఇచ్చింది. దీనిద్వారా ఈ పిడికెడు మంది ప్రజల మనస్సులను చూరగొని ఎలాంటి ఆయుధ సంపత్తి లేకుండా శత్రువులను ఓడించగలిగారు.

నమాజుకు సంబంధించిన యే మేలైతే ఈ ఆయత్‌లో వివరించబడిందో అది రెండుకోణాలను కలిగివుంది. ఒకటి దాని సుగుణం. అంటే ఇది అశ్లీలం మరియు చెడు పనులను అడ్డుకుంటుందనేది. రెండవది, కావలసిన సుగుణం. అంటే, నమాజు చేసే వాడు నిజంగానే అశ్లీలం, చెడు పనులు మానేయాలి అన్నది. అడ్డుకునే విషయానికి వస్తే నమాజు తప్పకుండా ఈ పని చేస్తుంది. నమాజు గురించి ఏ కొంతైనా ఆలోచించగలిగినవాడు, చెడులను అడ్డుకోవడానికి ఎన్ని బ్రేకులైతే వేయ వీలుంటుందో వాటన్నిటిలో బాగా పనిజేసే బ్రేకు కేవలం నమాజు ఒక్కటే అని తెలుసుకుంటాడు. మనిషిని ప్రతి రోజు అయిదు పూటలా దైవధ్యానం వైపునకు పిలుస్తూ, నీవు ఈ లోకంలో సర్వస్వతంత్రుడవు కావు, ఓ దేవునికి దాసుడవు మాత్రమే, నీ దైవం నీ ప్రత్యక్ష మరియు పరోక్ష కర్మలనే కాకుండా నీ మనస్సులో మెదిలే సంకల్పాల గురించి కూడా తెలిసినవాడు, నీవు ఆయన ముందు నీ కర్మలకు సమాధానం ఇచ్చే సమయం ఓ రోజు తప్పనిసరిగా రానుంది అనే విషయాన్ని గుర్తుకు తెస్తూ ఉంటే, ప్రభావం కలిగించే విషయం అంతకంటే మరేది కాగలదు? ఈ గుర్తుచేయడం మట్టుకే సరిపెట్టకుండా మనిషిని ప్రతి నమాజు వేళైనప్పుడు, యేకాంతంలోనూ యే దేవాదేశాన్ని కూడా జవదాటకూడదు అనే ప్రాక్టీసును చూపెట్టాలి.

నమాజు కోసం బయలుదేరినప్పటి నుండి దాన్ని పూర్తి చేసేటంత వరకు నిరంతరంగా, తాను దైవచట్టాన్ని త్రెంచేశాడు అని తెలుసుకో గలిగే మూడవ కన్ను తనకు, దైవానికి తప్ప మరేది ఉండబోదు. ఉదాహరణకు, మనిషికి ఒకవేళ వుజూయే భంగమైందని అనుకుందాం. అతను నమాజు కోసం నిలబడ్డప్పుడు అతనికి, దేవునికి తప్ప వుజూ లేదనే విషయం మరెవరికీ తెలియగలదు? అలాగే మనిషి నమాజు సంకల్పం చేయకుండా చూపేవారికి రుకూ సజ్దాలు, ఖియాములు చేస్తూ, నమాజులో పఠించవలసిన ఖుర్‌ఆన్ దుఆలకు బదులు గజళ్ళను, పద్యాలను వల్లిస్తూ ఉంటే, అతను నమాజు చేయడం లేదు అనే నిజం తనకు, దైవానికి తప్ప మరెవరికీ అర్థం కాగలదు? దానికి భిన్నంగా మనిషి తన శరీరం, తన వస్త్రాల పరిశుద్ధత లగాయతు నమాజులోని అంశాలు, అందులో పఠించవలసిన విషయాల్లో దైవ ఆదేశపాలనకు సంబంధించిన అన్ని షరతులను పాటిస్తూ ప్రతిరోజు అయిదుపూటలూ నమాజు సల్పుతూ ఉంటే దాని అర్థం, ఆ నమాజు ద్వారా ప్రతిరోజు అనేకమార్లు అతని అంతరాత్మను తట్టిలేపడం, అతనిలో బాధ్యతాభావాన్ని కలిగించడం, అతణ్ణి ఓ బాధ్యతాయుతమైన మనిషిగా తీర్చిదిద్దడం జరుగుతుంది. అలాగే అతను, తాను దేన్నైతే విశ్వసించాడో ఆ చట్టాన్ని అన్ని వేళలా బాహాటంగా అనుసరించే అభ్యాసాన్ని ప్రాక్టికల్‌గా చేయించడం జరుగుతుంది. బలవంతంగా చేయించే బయటి శక్తి ఏదీ ఉన్నా లేకున్నా లేదా ప్రజలకు అతని ఆచరణ తెలిసినా తెలియకపోయినా సరే.

ఈ విధంగా చూస్తే, నమాజు మనిషిని అశ్లీలం, చెడుగుల నుండి అడ్డుకోవడమే కాకుండా, ప్రపంచంలో అంతకంటే మనిషిని చెడుగుల నుండి వారించే ప్రభావితమైన శిక్షణా పద్ధతి మరేది లేదని ఒప్పుకోక తప్పదు. ఇకపోతే మనిషి నమాజును క్రమం తప్పకుండా చేస్తూవుంటే, నిజంగానే చెడుగులకు దూరంగా ఉండగలడా? అనే ప్రశ్న ఉద్భవించడం సహజం. అది, మనస్సు అదుపు కోసం ఆ శిక్షణ పొందుతూ దాన్నుండి ప్రయోజనం పొందగోరే మనిషిపై ఆధారపడిన విషయం. అతను ప్రయత్నం చేస్తే నమాజు ద్వారా ఒనగూడే సాంస్కారిక ప్రయోజనాల ప్రభావం అతనిపై పడగలదు. అలాకాక దాని ప్రభావాన్ని పొందడానికే సిద్ధపడక లేదా కావాలని ఆ ప్రభావాలను పట్టించుకోని వానిపై ప్రపంచంలోని ఏ సాంస్కారిక ఉపాయం పనిజేసేది కాదు. ఉదాహరణగా చెప్పాలంటే, ఆహారపు అసలు పని శరీరానికి పోషణ ఇవ్వడం మరియు పెరుగుదలకు సహాయపడడం. ఈ ప్రయోజనం చేకూరేది మనిషి దాన్ని జీర్ణించుకున్నప్పుడే. ఎవరైనా భోజనం చేసిన ప్రతిసారి దాన్ని వాంతి ద్వారా బయటకు కక్కేస్తూపోతే అతని ఈ రకమైన భోజనం అతనికి ఎలాంటి ప్రయోజనాన్ని చేకూర్చలేదు. అలాంటి వ్యక్తిని ముందు నిలుచోబెట్టి, భోజనం శరీర పోషణకు పనికి రాదు, పెరుగుదలకు తోడ్పడదు అని మీరు చెప్పలేరు. అతణ్ణి చూపుతూ చూశారా ఇతను రోజూ భోజనం చేసినా సుష్కించి పోతున్నాడని కూడా అనలేరు. అచ్చం ఈ విధంగానే

సరైన ఆచరణలేని ఓ నమాజీని ముందుకు నిలచోబెట్టి ఇతను ప్రతిరోజూ నమాజు చేస్తున్నా అతని దుర్నడతలో ఎలాంటి మార్పు రాలేదు కాబట్టి నమాజు అశ్లీలాన్నుండి, దుష్కార్యాల నుండి అడ్డుకోలేదు అని కూడా చెప్పలేరు. అలాంటివాడు, అసలు నిజంగానే నమాజు చేయడం లేదు అని చెప్పాలి. ఎందుకంటే, భోజనం చేసిన తరువాత వాంతి చేసి భోజనాన్ని బయటకు తీసివేసే వాని విషయంలో 'అతను అసలు భోజనమే చేయడం లేదు' అని చెప్పడం ఎలా సబబుకాదో అది కూడా ఇంతే.

ఇదే విషయాన్ని అనేక హదీసుల్లో దైవప్రవక్త (స) గారి కొన్ని ప్రవచనాలను అనేకమంది సహాబా (ర)లు, తాబయీన్‌లు ఉల్లేఖించారు. వాటిలో ఇమ్రాన్ ఇబ్నె హుసేన్ ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు:

مَنْ لَّمْ تَنْهَهُ صَلَاتُهُ عَنِ الْفَحْشَاءِ وَالْمُنْكَرِ فَلَا
صَلٰوةَ لَهُ (ابن ابی حاتم)

"ఎవరినైతే నమాజు అశ్లీలం మరియు చెడు పనుల నుండి అడ్డుకోలేదో అతని నమాజు నమాజే కాదు." (ఇబ్నె అబీ హాతిమ్)

ఇబ్నె అబ్బాస్ (ర) దైవప్రవక్త ప్రవచనాన్ని ఇలా ఉల్లేఖిస్తున్నారు:

من لم تنهہ صلوتہ عن الفحشاء والمنکر لم یزدد
بها من الله الا بعدا ، (ابن ابی حاتم۔طبرانی)

"ఎవరి నమాజు అయితే అతణ్ణి చెడ్డ పనులు చేయకుండా వారించలేదో అతణ్ణి అతని నమాజు అల్లాహ్‌కు మరీ దూరం చేసింది." (ఇబ్నె అబీ హాతిమ్-తిబ్రానీ)

ఈ ప్రవచనాన్నే హజ్రత్ హసన్ బస్రీ (రహ్మాలై) కూడా చెప్పడం జరిగింది. (ఇబ్నె జరీర్, బైహకీ)

ఇబ్నె మస్‌ఊద్ (ర) దైవప్రవక్త (స) గారి ప్రవచనాన్ని ఇలా ఉల్లేఖిస్తున్నారు:

لاصلوة لمن لا یطع الصلوة وطاعة الصلوة
ان تنهیٰ عن الفحشاء والمنکر ، (ابن جریر، ابن ابی حاتم)

"ఎవరైతే చెడ్డపని జేశాడో అతను నమాజునే అనుసరించలేదు. నమాజు అనుసరణ ఏమిటంటే మనిషి అశ్లీల కార్యాలు మరియు చెడ్డ పనులు చేయకుండా ఉండడం." (ఇబ్నె జరీర్, ఇబ్నె అబీ హాతిమ్)

ఈ విషయానికే సంబంధించిన అనేక ఉల్లేఖనాలు హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్‌ఊద్, అబ్దుల్లా బిన్ అబ్బాస్ (ర)లు, హసన్ బస్రీ, ఖతాదా మరియు ఆమష్ (రహ్మాలై)లు చెప్పడం జరిగింది.

ఇమామె జాఫర్ సాదిఖ్ (ర) ఇలా అంటున్నారు:

"ఎవరైనా తన నమాజు స్వీకరించబడిందో లేదో అని తెలుసుకోగోరితే, అతని నమాజు అతణ్ణి అశ్లీలం మరియు చెడు పనుల నుండి ఎంతవరకు వారించగలిగిందో చూడాలి. ఒకవేళ నమాజు అడ్డుకోవడం వలన అతను ఆ చెడుల జోలికి పోకపోతే అతని నమాజు స్వీకరించబడినట్లే." (రూహుల్ మఆనీ)

అల్లాహ్ సంస్మరణ

"అల్లాహ్ సంస్మరణ దీనికంటే కూడా చాలా గొప్ప విషయం" అన్నదానికి అనేక అర్థాలు చెప్పుకోవచ్చు. ఒకటి, అల్లాహ్ సంస్మరణ (అంటే నమాజు) దాని ప్రభావం రీత్యా చెడు పనుల నుండి వారించడమే కాకుండా అంతకంటే మిన్నగా అది సత్కార్యాలు ఆచరించడానికి, సదాచారాన్ని అవలంబించడానికి పురికొలిపేది అని.

రెండో అర్థం ఏమిటంటే, అల్లాహ్ సంస్మరణే అతి గొప్పది, సదాచారాల్లోకెల్లా మేలైనది, మనిషి చేసే ఏ కార్యమూ అంతకంటే మేలైనది కాబోదన్నది.

మూడవ భాగం ఏమిటంటే అల్లాహ్‌యే మిమ్మల్ని జ్ఞాపకం పెట్టుకోవడం, మీరాయన్ను సంస్మరించడం కంటే గొప్పది అని. దివ్యఖుర్‌ఆన్‌లో అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు:

فَاذْكُرُونِيٓ أَذْكُرْكُمْ (البقرة : ١٥٢)

"కనుక మీరు నన్ను జ్ఞాపకం పెట్టుకోండి. నేను మిమ్మల్ని జ్ఞాపకం పెట్టుకుంటాను." (అల్ బకర: 152)

కాబట్టి దైవదాసుడు నమాజులో అల్లాహ్‌ను స్మరిస్తే, అల్లాహ్ కూడా అతణ్ణి జ్ఞాపకం పెట్టుకుంటాడు. అల్లాహ్ ఏ దాసుణ్ణయితే జ్ఞాపకముంచుకుంటాడో అది ఆ దాసుడు ఆయన్ను జ్ఞాపకం బెట్టుకోవడం కంటే గొప్ప భాగ్యమే కాగలదు.

ఈ మూడు భావాలకు తోడు, హజ్రత్ అబుద్దర్దా (ర)గారి సతీమణి నుడివిన మాటల్లో లీలామాత్రంగా మరో భావం కూడా మనకు స్ఫురిస్తోంది. అదేమిటంటే, అల్లాహ్ స్మరణ కేవలం నమాజుమట్టుకే పరిమితమై ఉండకుండా దాని పరిధి ఎంతో విశాలమైనది. మనిషి రోజాపాటించినప్పుడో, జకాత్ చెల్లించినప్పుడో లేదా మరే పుణ్యకార్యం చేసినప్పుడో అతను తప్పకుండా అల్లాహ్‌ను జ్ఞాపకం చేస్తూనే ఆ పనులు చేస్తాడు. అందుకనే అతని ద్వారా ఆ పుణ్యకార్యాలు జరుగుతాయి. అలాగే మనిషికి చెడు పనులకు పాల్పడే అవకాశాలు ఏవైనా వచ్చినప్పుడు, ఆ పాపకార్యాలు చేయకుండా ఆగిపోతాడు. ఇది కూడా దైవాన్ని జ్ఞాపకం ఉంచుకున్నందుకు ఫలితంగానే. అందుకని దైవస్మరణ ఓ విశ్వాసి పూర్తి జీవితాన్నే శాసిస్తుంది.

దైవారాధన శక్తికి దోహదం

وَلَا تُطِعْ مِنْهُمْ آثِمًا أَوْ كَفُوْرًا ○ وَاذْكُرِ اسْمَ
رَبِّكَ بُكْرَةً وَّأَصِيْلًا ○ وَمِنَ اللَّيْلِ فَاسْجُدْ لَهُ
وَسَبِّحْهُ لَيْلًا طَوِيْلًا ○ (الدهر: ٢٤تا٢٦)

"వారిలోని ఏ దుర్మార్గుని మాటలుగానీ, ఏ సత్యతిరస్కారి మాటలుగానీ వినకు. నీ ప్రభువు పేరును ఉదయం, సాయంత్రం స్మరించు. రాత్రివేళకూడా ఆయన సన్నిధిలో సాష్టాంగపడు. రాత్రివేళ సుదీర్ఘ సమయాలు ఆయనను స్తుతించడంలో గడుపుతూ ఉండు." (అద్దహ్ర్: 24-26)

"సత్యతిరస్కారి మాటలు వినకు" అంటే వారికి భయపడి సత్యధర్మ ప్రచారాన్ని వదిలివేయకు మరియు మరే దుర్మార్గుని కోసం ధర్మం బోధించే నైతిక బోధనల్లోగాని, మరే సత్యతిరస్కారి కోసం ధర్మంలోని విశ్వాసాలను వీసమెత్తయినా మార్పులు చేర్పులకు లోనుజేయడానికి సిద్ధపడకు అని చెప్పడం అన్నమాట. ఏదైతే నిషేధించ బడిందో అది నిషిద్ధమైనదే అని. చెడు ప్రవృత్తిగల వారు నీపై ఎంత వత్తిడి తెచ్చినా నిన్ను ఎంత ఆడిపోసుకున్నా సరే కొంచెమైనా మృదుత్వాన్ని పాటించకు. అలాగే ఏ విశ్వాసాలైతే అసత్యమైనవో వాటిని అసత్యమైనవేనని, మరేది సత్యమో దాన్ని సత్యమైనదే అని బాహాటంగా ప్రకటించు. దైవతిరస్కారులు నీ నోరు మూయడానికి లేదా ఈ విషయంలో కొంత రాజీధోరణిని అవలంబించమని నీపై ఎంత వత్తిడి తెచ్చినాసరే.

'నీ ప్రభువు పేరును ఉదయం సాయంత్రం స్మరిస్తూ ఉండు" అన్నది వారి ఆ తీవ్రమైన వత్తిడిని ఎదిరించడానికి సరైన చికిత్స. దివ్యఖుర్‌ఆన్ దైవతిరస్కారులను ఎదిరించడంలో సహన స్థయిర్యాలు వహించమని బోధించినప్పుడల్లా వెంటనే అల్లాహ్ స్మరణ మరియు నమాజుల ఆదేశాలివ్వడం కూడా జరిగిందనే విషయం గమనార్హం. దీనిద్వారా అర్థమయ్యే విషయం ఏమిటంటే, సత్యధర్మ మార్గంలో సత్యం పట్ల వ్యతిరేకతను ప్రదర్శించే దైవతిరస్కారులు కల్పించే అడ్డంకులను అధిగమించాలంటే యే శక్తి అయితే అవసరముంటుందో అది దీని ద్వారానే లభ్యం అవుతుంది. ఉదయం సాయంత్రం దైవనామ స్మరణ చేయడమంటే, ఎల్లవేళలా అల్లాహ్‌ను జ్ఞాపకముంచుకోవడం అని కూడా గావచ్చు. కాని అల్లాహ్ స్మరణ సమయాలను కేటాయించడం జరిగితే దాని భావం నమాజు మాత్రమే అవుతుంది.

దైవస్మరణ ద్వారా శక్తిని పొందడం

يَا أَيُّهَا الَّذِيْنَ آمَنُوا اذْكُرُوا اللّٰهَ ذِكْرًا كَثِيْرًا ○
وَّسَبِّحُوْهُ بُكْرَةً وَّأَصِيْلًا ○ (الاحزاب: ٤١، ٤٢)

"విశ్వసించిన ఓ ప్రజలారా! అల్లాహ్‌ను అత్యధికంగా స్మరించండి. ఉదయం సాయంత్రం ఆయన పవిత్రతను కొనియాడుతూ ఉండండి." (అల్ అహ్‌జాబ్: 41,42)

దీనిద్వారా ముస్లిములకు బోధించబోయే విషయం ఏమిటంటే, శత్రువుల తరఫున దైవప్రవక్త (స) పై యే తిట్ల వర్షం అయితే కురిపించబడుతుందో సత్యధర్మాన్ని నష్టపెట్టేందుకు ప్రవక్త (స) వారి వ్యక్తిత్వాన్ని లక్ష్యంగా పెట్టుకొని ఆయనపై యే దుష్ప్రచార తుఫాను అయితే లేపబడుతుందో అట్టి పరిస్థితిలో విశ్వాసుల కర్తవ్యం వారి దుశ్చేష్టలను సహించి మిన్నకుండిపోవడమో, శత్రువులు వ్యాపింపజేసిన అనుమానాల ఉచ్చులో తామే స్వయంగా చిక్కుకొని పోవడమో లేదా వారికి సమాధానంగా తాము కూడా దుర్భాషలకు పాల్పడడమో జరగకూడదు అని చెప్పడం అన్నమాట. పైగా సాధారణ రోజులకంటే ఆ కాలంలో ప్రత్యేకంగా అల్లాహ్‌ను స్మరించాలని చెప్పడం. అల్లాహ్‌ను అత్యధికంగా స్మరించడం అంటే, మనిషినోట ఎల్లవేళలా జీవితంలోని ప్రతి వ్యవహారంలోనూ ఏదో ఓ రకంగా దైవనామం వెలువడుతూ ఉండాలి. ఇలాంటి స్పృహ హృదయాల్లో దేవుని గురించిన భావన నెలకోకుండా రానేరదు. ఆ భావన మనిషి చేతనావస్థ (Consciousness)ను దాటి (Sub-Consciousness) అంతఃచేతనంలో ఆపై అధఃచేతనంలో స్థిరపడ్డప్పుడే సాధ్యం. అప్పుడేగాని అతను ఏమాట మాట్లాడినా అందులో నోట అల్లాహ్ నామం వెలువడదు. తినడం ప్రారంభిస్తే బిస్మిల్లాహ్ అంటాడు. భోజనం చేయడం పూర్తయితే అల్‌హందులిల్లాహ్ అని పలుకుతాడు, నిద్రకు ఉపక్రమించినా అల్లాహ్ నామాన్ని స్మరిస్తాడు. మేల్కొన్నా ఆయన నామాన్నే జపిస్తాడు. మాట్లాడుతున్నప్పుడు అతని నోటి వెంట బిస్మిల్లాహ్, అల్‌హందులిల్లాహ్, ఇన్షా అల్లాహ్, మాషా అల్లాహ్ అనే పదాలే దొర్లుతుంటాయి. తన ప్రతి అవసరానికి అల్లాహ్ సహాయాన్నే కోర్తాడు. తనకు ఏదైనా లభిస్తే ఆయనకు కృతజ్ఞతలు చెప్పుకుంటాడు. కష్టం వచ్చినప్పుడు ఆయన కారుణ్యాన్నే కోరుకుంటాడు. ప్రతి కష్ట సమయంలోనూ ఆయన వైపుకే మరలుతాడు. యేదైనా చెడు చేసే అవకాశం వస్తే ఆయనకే భయపడతాడు. తప్పిదం జరిగినప్పుడు ప్రతిసారి మన్నించమని వేడుకుంటాడు. ఏదైనా అవసరం ఏర్పడితే ఆయన్నే ఆ అవసరం తీర్చమని ప్రాధేయపడతాడు. మొత్తానికి కూర్చున్నా, లేచినా, ఏ పనిజేసినా ఆయన నామ స్మరణే జరుగుతుంది. ఇదే ఇస్లామీయ జీవితానికి ప్రాణం. ఇతర ఆరాధనలెన్నైతే నెరవేర్చబడుతున్నాయో వాటికి ఒక సమయం, ఒక సందర్భం అంటూ కేటాయించడం జరిగింది. వాటిని నెరవేర్చిన పిదప మనిషికి కొంత తీరిక లభిస్తుంది. అయితే ఈసంస్మరణ అనే ఆరాధన ఎల్లవేళలా జరిగే ఆరాధన. ఇదే మానవ జీవితపు శాశ్వత సంబంధాన్ని అల్లాహ్ మరియు ఆయన ఆరాధనతో ముడిపెట్టి ఉంచేది ఇదే. మనిషి మనస్సు కేవలం ఆ ప్రత్యేకమైన పనులను ఆచరిస్తున్నప్పుడే కాకుండా, ఆ సంస్మరణ సతతం అన్ని వేళలా దైవం వైపునకు మొగ్గేటట్లు చేసి

అతని నాలుకను తడారకుండా ఉంచగలుగుతుంది. మనిషి ఈ దశకు చేరుకున్నప్పుడే, తాను జీవితంలో చేసే ఆరాధనలు, ధార్మిక కార్యకలాపాలు అచ్చం, ఓ మొక్క సరైన వాతావరణంలో, సరైన శీతోష్ణస్థితిలో నాటబడి తన నైజం ప్రకారం పెరిగి పెద్దదై పైపైకి ఎదిగి వస్తున్నటువంటిది. అందుకు భిన్నంగా, ఈ శాశ్వత సంస్మరణ కరువైన జీవితంలో జరిగే కార్యకలాపాలు, ప్రత్యేక సమయాల్లో చేసే ఆరాధనల ఉపమానం, సరిపడని వాతావరణంలో అననుకూల శీతోష్ణస్థితిలో నాటబడి కేవలం తోట యజమాని ప్రత్యేక శ్రద్ధతో పైకి వచ్చే మొక్కలాంటిది. దీన్నే మహాప్రవక్త (స) ఓ హదీసులో ఇలా సెలవిచ్చారు:

عن معاذ بن انس الجهنی عن رسول الله صلی الله علیه
وسلم ان رجلا سأله ای المجاهدین اعظم اجرا یا
رسول الله؟ قال اکثرهم لله تعالیٰ ذکرًا، قال
ای الصائمین اکثر اجرًا- قال اکثرهم ذکرا ثم
ذکر الصلوٰة و الزکوٰة والحج، والصدقة کل
ذالك يقول رسول الله صلی الله علیه وسلم
اکثرهم ذکرا (بخاری ومسلم)

ముఆజ్ బిన్ అనస్ జుహ్నీ దీన్ని ఉల్లేఖిస్తూ, ఓ వ్యక్తి దైవప్రవక్త (స)ను ఇలా అడిగాడు: "ఓ దైవప్రవక్తా! జిహాద్ చేసే వారిలో అందరికంటే అధిక పుణ్యఫలం ఎవరికి లభిస్తుంది?" జవాబుగా ఆయన (స), "వారిలో ఎవరైతే అధికంగా దైవాన్ని స్మరిస్తాడో అతను" అని సెలవిచ్చారు.

"రోజా పాటించేవారిలో ఎవరు అధికంగా పుణ్యఫలాన్ని పొందుతాడు?" అని ప్రశ్నించినప్పుడు ఆయన (స) "వారిలో ఎవరైతే దైవాన్ని అధికంగా స్మరిస్తాడో అతను" అని సమాధానమిచ్చారు.

తిరిగి ఆ వ్యక్తి అదే విధంగా నమాజు, జకాత్ మరియు హజ్, దానధర్మాలు ఆచరించే వారి గురించి అడగగా దైవప్రవక్త (స) ప్రతి ప్రశ్నకు సమాధానంగా, "ఎవరైతే అల్లాహ్‌ను అధికంగా స్మరిస్తారో వారు" అని సమాధానం ఇచ్చారు. (బుఖారీ, ముస్లిం)

సత్య సందేశవాహుడు జరిపే మహత్తర పోరాటం

فَلَا تُطِعِ الْكٰفِرِيْنَ وَ جَاهِدْهُمْ بِهٖ جِهَادًا
كَبِيْرًا ۝ (الفرقان : ۵۲)

"(ప్రవక్తా!) అవిశ్వాసుల మాటలను ఎంత మాత్రం నమ్మకు. ఈ ఖుర్‌ఆన్ ద్వారా వారితో మహత్తరమైన పోరాటం జరుపు." (అల్‌ఫుర్ఖాన్: 52)

మహత్తర పోరాటానికి మూడు అర్థాలు చెప్పవచ్చు. ఒకటి, మనిషి తన కృషిలో ఎలాంటి ప్రయత్నాన్ని కూడా వదలకుండా ప్రయత్నం చేయడం. రెండవది, పెద్ద ఎత్తున చేసే ఆ ప్రయత్నంలో తనకు లభించిన వనరులు, మార్గాలన్నిటిని ఉపయోగించడం. మూడవది, తాను చేసే ఆ సమగ్రమైన పోరాటంలో యే పోరాట రంగాన్ని కూడా వదలకుండా అన్ని రంగాల్లోను పోరాడుతూ మరే యుద్ధరంగాల్లో శత్రువు తన బలాన్ని ఉపయోగిస్తున్నాడో ఆ రంగాల్లో తన శక్తిని కూడా వినియోగించడం. అలాగే ఏయే కోణాల నుండి సత్యధర్మాన్ని ఉన్నతం చేసే అవసరముంటుందో ఆయా కోణాల్లో నోటి ద్వారా, కలం ద్వారా పోరాటం జరగాలి. అవసరమొస్తే ధనప్రాణాలు, ఆయుధ సంపత్తిని ఉపయోగించాలి.

భౌతిక ప్రయోజనాలను కాలదన్నడం

قُل لَّآ أَسْـَٔلُكُمْ عَلَيْهِ أَجْرًا ۖ إِنْ هُوَ إِلَّا ذِكْرَىٰ لِلْعَٰلَمِينَ ۝ (الانعام: ۹۰)

"ప్రకటించు! నేను ఈ (ధర్మం యొక్క ప్రచార, ప్రబోధ) కార్యానికిగాను మీ నుండి ఏ ప్రతిఫలాన్ని ఆశించడం లేదు. ఇది ఒక హితబోధ, సమస్త భూప్రజల కొరకు అని." (అల్ అన్ఆమ్:90)

ధర్మప్రచార హోదా బాధ్యతలు

اِتَّبِعْ مَآ أُوحِىَ إِلَيْكَ مِن رَّبِّكَ ۖ لَآ إِلَٰهَ إِلَّا هُوَ ۖ وَأَعْرِضْ عَنِ ٱلْمُشْرِكِينَ ۝ وَلَوْ شَآءَ ٱللَّهُ مَآ أَشْرَكُوا۟ ۗ وَمَا جَعَلْنَٰكَ عَلَيْهِمْ حَفِيظًا ۖ وَمَآ أَنتَ عَلَيْهِم بِوَكِيلٍ ۝ (الانعام: ۱۰۶، ۱۰۷)

"ప్రవక్తా! నీపై నీ ప్రభువు తరఫు నుండి అవతరించిన 'వహీ'ని అనుసరిస్తూ ఉండు. ఎందుకంటే ఆ ప్రభువు ఒక్కడు తప్ప మరొక దేవుడు లేనేలేడు. ఈ ముష్రిక్కులను పట్టించుకోకు. అల్లాహ్ సంకల్పించి ఉన్నట్లయితే, (స్వయంగా ఆయనే ఏ ఏర్పాటు చేసి ఉండేవాడంటే) వారు షిర్కు చేసేవారుకాదు. మేము నిన్ను వారికి కావలివానిగా నియమించనూ లేదు, నీవు వారికి బాధ్యుడవూ కావు." (అల్ అన్ఆమ్:106,107)

భావం ఏమిటంటే నిన్ను ప్రబోధకునిగా, ప్రచారకునిగా మాత్రమే చేయడం జరిగింది. నిన్ను కావలివానిగా మాత్రం చేయడం జరుగలేదు. నీ పనల్లా కేవలం

ప్రజలకు ఆ వెలుగు ఏమిటో చూపెట్టు, సత్యప్రకటనా బాధ్యతను నెరవేర్చడంలో ఎలాంటి బద్ధకాన్ని పాటించకు. ఆ పిదప ఎవరైనా సత్యాన్ని సత్యంగా స్వీకరించకపోతే, వారిని సత్యవాదులుగానే మార్చి తీరాలని నిన్ను నియమించడం జరుగలేదు. కాబట్టి ఈ ఆలోచనతో ఎవరైతే కళ్ళు తెరచి కూడ చూడదలచ లేదో ఈ గ్రుడ్డివారిని చూపుగల వారిగా ఎలా మలచాలా అని నీ మనస్సును పాడుచేసుకోకు. అది నీకై జవాబు దారీకాని, నీ బాధ్యతగాని కావు. ప్రపంచంలో ఏ వ్యక్తినీ అసత్యవాదిగా ఉంచకూడదు అని దైవమే తలచివుంటే, అల్లాహ్ ఈ కార్యాన్ని మీ భుజస్కంధాలపై వేసే అవసరమెందుకుండేది? "అయిపో" అని ఇచ్చే ఆయన ఆజ్ఞ ఒక్కటే మానవులందరిని సత్యవాదులుగా మార్చేసేది కాదా? కాని అక్కడ ఆ ఉద్దేశ్యం లేనేలేదు. అసలు ఉద్దేశ్యం మనిషికి సత్యాసత్యాలను ఎంచుకునే స్వాతంత్ర్యం మిగిలి ఉండాలని, ఆ తరువాత ఆ సత్యకాంతి వారి ముందుంచి, ఆ రెంటిలో అతను దేనిని ఎంచు కుంటాడో అని పరిక్షించడమే. కాబట్టి ఏ వెలుగైతే మీకు చూయించబడిందో ఆ వెలుగు మార్గంలో మీరు స్వయంగా నడుస్తూనే ఇతరులను దానిపై నడువమని ఆహ్వానిస్తూ ఉండండి. అదే సరైన వైఖరి. ఎవరైతే ఈ సత్యసందేశాన్ని స్వీకరిస్తారో వారినే అక్కున చేర్చుకోండి. వారు లోకం దృష్టిలో ఎంత అధములుగా చూడబడుతున్నా వారిని మాత్రం విడువకండి. దాన్ని స్వీకరించని వారి వెంటబడకండి. ఏ దుష్పరిణామం వైపుకు వారు స్వయంగా పోదలుచుకున్నారో, అటు పోవడానికే సిద్ధంగా ఉన్నారో వారిని అటువైపుకు వెళ్ళేందుకు వదిలేయండి.

అల్లాహ్ శరణుకోరండి, దుఆ చేయండి

قُلْ اَعُوْذُ بِرَبِّ النَّاسِ مَلِكِ النَّاسِ اِلٰهِ النَّاسِ
مِنْ شَرِّ الْوَسْوَاسِ الْخَنَّاسِ -

"ఇలా అను: నేను మానవుల ప్రభువు, మానవుల చక్రవర్తి, మానవుల ఆరాధ్య దైవం (అయిన అల్లాహ్) శరణు కోరుతున్నాను- దుష్టభావాలు రేకెత్తించే వాడి కీడు నుండి. వాడు మాటిమాటికీ మరలివస్తూ ప్రజల మనస్సుల్లో దుష్టభావాలను రేకెత్తిస్తాడు, వాడు జిన్నుజాతికి చెందిన వాడైనా కావచ్చు, మానవ జాతికి చెందిన వాడైనాకావచ్చు."
(అన్నాస్:1-6)

దుష్టభావాలు రేకిత్తించేవారి కీడు నుండి అల్లాహ్ శరణు వేడుకోవడం అంటే ఏమిటి? శరణు వేడుకునేవాడు స్వయం ఆ దుష్టభావాలను రేకెత్తించే వాడి నుండి అల్లాహ్ శరణు వేడుకోవడం అన్నమాట. అంటే, ఎక్కడైనా తన హృదయంలో అతడు ఏదైనా దుష్టభావాలు కలిగిస్తాడేమో అనే అతని కీడు నుండి అన్నమాట. రెండవ భావం ఏమిటంటే, దైవమార్గం వైపునకు ఆహ్వానించే వానికి వ్యతిరేకంగా ఏ వ్యక్తి అయినా ప్రజల మనస్సులో దుష్టభావాలు రేకెత్తిస్తూ తిరుగుతుంటే అతని కీడు

నుండి సత్యసందేశ ప్రబోధకుడు అల్లాహ్ శరణు వేడుకుంటాడు అని. అతని వ్యక్తిత్వానికి వ్యతిరేకంగా ఏయే మనుషుల హృదయాల్లోనైతే ఈ దుష్టభావాలు రేకెత్తించబడుతున్నాయో వారందరి వద్దకు వెళ్ళి ఒక్కొక్కరి అపార్థాలను దూరం చేయడం సత్యసందేశ ప్రచారకునికి సాధ్యమయ్యే పనికాదు. దానికోసం అతను దైవసందేశ ప్రబోధాన్ని వదిలేసి, దుష్టభావాలు రేకెత్తించే వారి ఆక్షేపణలకు, వారు మోపే నేరాలకు జవాబు చెప్పుకుంటూ తిరగడం కూడా సరైనది కాదు. అతని విరోధులు ఏ నీచస్థాయికైతే దిగజారారో ఆ స్థాయికి తాను కూడా దిగజారడం అతని హోదాకు తగినది కానేకాదు. అందుకని అల్లాహ్, ఇలాంటి దుష్టుల దౌష్ట్యం నుండి మిమ్మల్ని కాపాడాలని అల్లాహ్ శరణు వేడుతూ, ఎలాంటి చీకూ చింత లేకుండా మీ సత్యసందేశ ప్రచారంలో నిమగ్నమైపోండి. ఇక వారిని అడ్డుకోవడం మీ పనికాకుండా, మానవుల ప్రభువు, మానవుల చక్రవర్తి, మానవుల ఆరాధ్య దైవం అయిన అల్లాహ్ పని అని చెప్పడం అన్నమాట.

దుష్టభావాల ప్రేరణే దౌష్ట్యానికి నాంది

దుష్టభావం మనస్సులో కలిగినప్పుడే దౌష్ట్యం లేదా కీడు ఆలోచన కూడా అక్కడి నుండే ప్రారంభం అయిందనే చెప్పాలి. ఏమరుపాటుగా ఉండే వ్యక్తిలో లేదా ఎలాంటి ఆలోచనలు లేని మనిషి మనస్సులో అది రేకెత్తిందంటే అతనిలో చెడు చేసే కోరిక ప్రారంభం అయినట్లే. ఆ తరువాత మరిన్ని ప్రేరణలు ఆ చెడు కోరికను చెడు సంకల్పంలోనికి మార్చివేస్తాయి. పోను పోను ఆ దుష్టభావాల ప్రభావం మరింతగా పెరిగి ఆ సంకల్పం దృఢ పడిపోతుంది. ఆ తరువాత అతను వేసే అడుగే దౌష్ట్యం లేదా కీడు. కాబట్టి దుష్టభావాలు రేకెత్తించేవాడి కీడు నుండి దైవం శరణు పొందాలనే మాటకు అర్థం, ఆ కీడు ఎక్కడి నుండైతే ప్రారంభం అవుతుందో అల్లాహ్ దాన్ని అక్కడే సమసిపోయేటట్లు చేయాలన్నది.

మరో తీరుగా ఆలోచిస్తే దుష్ట ప్రేరణలను రేకెత్తించేవారి కీడు క్రమం ఇలా ఉంటుందని అర్థం అవుతుంది. మొదట వారు బాహాటంగా దైవతిరస్కారం, షిర్క్, నాస్తికత్వం లేదా అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త (స) పట్ల అవిధేయత మరియు విశ్వాసుల పట్ల శత్రుత్వాన్ని ప్రజలలో పురికొల్పుతారు. అందులో వారికి అపజయం ఎదురై, అల్లాహ్ ధర్మాన్ని స్వీకరించినవారిని రకరకాలుగా బిద్అత్ మార్గంపైకి వెళ్ళేటట్లు ప్రయత్నాలు చేస్తారు. అది కూడా జరగని పక్షంలో పాపాల వైపుకు వారిని ప్రోత్సహిస్తారు. అందులోనూ వారికి సాఫల్యం లభించకపోతే, చిన్నచిన్న పాపాలు చేయడంలో తప్పేది లేదు అనే భావన మనిషి మనస్సులో పుట్టించే ప్రయత్నం చేస్తారు. ఎందుకంటే అవేగనక ఎక్కువైె పాపాల భారం మనిషిపై అధికంగా పడాలనే ఉద్దేశ్యంతో. ఈ బిద్అత్‌ను కూడా మనిషి చేయకుండా తప్పించుకున్నప్పుడు చివరి

అస్త్రంగా, మనిషి ఆ సత్యధర్మాన్ని కేవలం తన మట్టుకే పరిమితం చేసుకొని దాని ప్రాబల్యం కోసం ఎలాంటి ప్రయత్నం చేయకుండా ఉండేటట్లు ప్రయత్నిస్తారు. ఎవరైనా వారి ఈ ఎత్తుగడలన్నిటిని వమ్ము చేసి పారేస్తే జిన్నులు, మానవుల్లోని షైతానుల పార్టీ మొత్తం కలిసి అలాంటి వ్యక్తిపై విరుచుకుపడుతుంది. అతనికి వ్యతిరేకంగా ప్రజలను ఉసిగొల్పుతుంది. అతనిపై తిట్లు, శాపనార్థాలు కురిపిస్తుంది. నేరాలు మోపుతుంది. అతణ్ణి అన్ని రకాలుగా ప్రజల్లో తలెత్తుకు తిరుగలేనంతగా అగౌరవం పాలుచేస్తుంది. ఆ పిదప షైతాను ఆ విశ్వాసిని కోపోద్రిక్తునిగా చేసి, ఇదంతా సహించడం పిరికితనం, లేచి నీపై దాడిచేసే వారిని అడ్డుకో అంటు అతని పౌరుషాన్ని ఆవేశాన్ని తట్టిలేపుతాడు. ఇది షైతాను యొక్క చిట్టచివరి అస్త్రం. దీని ద్వారా అతను ఓ సత్యసందేశ ప్రబోధకుణ్ణి మార్గం నుండి తప్పించి ముళ్ళపొదల్లో చిక్కుకునేటట్లు చేసే ప్రయత్నం చేస్తాడు. దీన్నుండి కూడా సత్యసందేశవహుడు తప్పించుకుంటే ఇక షైతాను నిస్సహాయుడైపోయినట్లే. దీన్ని గురించే దివ్యఖుర్‌ఆన్‌లో ఇలా సెలవియ్యడం జరిగింది:

وَاِمَّا يَنْزَغَنَّكَ مِنَ الشَّيْطٰنِ نَزْغٌ فَاسْتَعِذْ بِاللّٰهِ (الاعراف:٢٠٠)

"ఒకవేళ ఎప్పుడైనా షైతాను నిన్ను ఉసిగొలిపితే అల్లాహ్ శరణు వేడు.'
(అల్ ఆరాఫ్:200)

وَقُلْ اَعُوْذُ بِكَ مِنْ هَمَزٰتِ الشَّيٰطِيْنِ (مومنون:٩٧)

"ఇలా ప్రార్థించు: "ప్రభూ! షైతానుల ప్రేరణల నుండి నేను నిన్నే శరణు వేడుకుంటున్నాను." (అల్ మూమినూన్:97)

اِنَّ الَّذِيْنَ اتَّقَوْا اِذَا مَسَّهُمْ طٰۤئِفٌ مِّنَ الشَّيْطٰنِ
تَذَكَّرُوْا فَاِذَا هُمْ مُّبْصِرُوْنَ ۝ (الاعراف: ٢٠١)

వాస్తవానికి భయభక్తులు గలవారి పరిస్థితి ఇలా ఉంటుంది: ఎప్పుడైనా షైతాను ప్రభావం వల్ల వారికి ఏదైనా చెడు ఆలోచన తట్టినప్పటికీ, వారు తక్షణం అప్రమత్తులౌతారు. తరువాత వారు అవలంబించవలసిన సరైన మార్గమేమిటో వారికి స్పష్టంగా అగుపిస్తుంది. (అల్ ఆరాఫ్: 201, 202)

ఈ కారణంగా ఎవరైతే షైతాను చివరి ఎత్తుగడ నుండి బయటపడతారో, వారి విషయంలో అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు:

وَمَا يُلَقّٰىهَاۤ اِلَّا ذُوْ حَظٍّ عَظِيْمٍ ۝ (حٰمٓ السجدہ:٣٥)

"ఈ స్థానం మహా అదృష్టవంతులకు తప్ప మరెవరికీ లభ్యం కాదు."
(హామీమ్ అస్సజ్దా: 35)

మనస్సు చేసే మోసం పట్ల జాగ్రత్త వహించడం

ఈ సందర్భంలో మరో విషయాన్ని కూడా దృష్టిలో ఉంచుకోవలసి ఉంటుంది. అదేమిటంటే మనిషి మనస్సులో దుష్ప్రేరణలను బయటి మానవ, జిన్ను షైతానులే రేకెత్తించవు. ఖుద్దు అతని మనస్సు కూడా వాటిని ప్రేరేపిస్తుంది. ఆ మనిషి తప్పుడు సిద్ధాంతాలు, అతని బుద్ధి కూడా దాన్ని వక్రమార్గంలో పెడ్తాయి. అతని సొంత అసంబద్ధమైన అవసరాలు, అతని కోరికలు తరచి చూసే అతని జ్ఞానాన్ని, స్వయం నిర్ణయశక్తిని మార్గం నుండి తప్పిస్తాయి. బయటి షైతానులే కాకుండా స్వయం తన మనస్సులో దాగున్న షైతాను కూడా అతణ్ణి తప్పటడుగు వేసేటట్లు చేస్తాడు. ఈ విషయాన్నే ఖుర్‌ఆన్ ఓ చోట ఇలా సెలవిస్తోంది:

وَنَعْلَمُ مَا تُوَسْوِسُ بِهٖ نَفْسُهٗ

"మేము అతని మనస్సులో సొంతంగా రేకెత్తే దుష్టభావాల గురించి కూడా ఎరిగినవారము."

ఈ దుష్ట ప్రేరణల గురించే దైవప్రవక్త (స) తన ఖుత్బాలో ఇలా సెల వియ్యడం జరిగింది:

نَعُوْذُ بِاللّٰہِ مِنْ شُرُوْرِ اَنْفُسِنَا

(మనస్సు రేకెత్తించే కీడుల నుండి మేము అల్లాహ్ శరణు వేడుకుంటున్నాము.)

సత్యవాదులకు ఎదురయ్యే కఠిన పరీక్షలు

وَالسَّمَآءِ ذَاتِ الْبُرُوْجِ ۝ وَالْيَوْمِ الْمَوْعُوْدِ ۝
وَشَاهِدٍ وَّمَشْهُوْدٍ ۝ قُتِلَ اَصْحٰبُ الْاُخْدُوْدِ ۝
النَّارِ ذَاتِ الْوَقُوْدِ ۝ اِذْ هُمْ عَلَيْهَا قُعُوْدٌ ۝ وَّهُمْ
عَلٰى مَا يَفْعَلُوْنَ بِالْمُؤْمِنِيْنَ شُهُوْدٌ ۝ وَمَا نَقَمُوْا
مِنْهُمْ اِلَّآ اَنْ يُّؤْمِنُوْا بِاللّٰهِ الْعَزِيْزِ الْحَمِيْدِ ۝

(البروج : ١ تا ٨)

"దృఢమైన బురుజులు గల ఆకాశం సాక్షిగా! వాగ్దానం చేయబడిన (ప్రళయ) దినం సాక్షిగా! చూసేవాని సాక్షిగా! చూడబడేదానిసాక్షిగా! కందకం వాళ్ళు సర్వనాశనం అయ్యారు. అది ఇంధనంతో తీవ్రంగా మండే అగ్ని గల కందకం. అప్పుడు వారు ఆ కందకం చుట్టూ కూర్చుని, విశ్వాసుల పట్ల చేసిన నిర్వాకాన్ని చూస్తూ ఉండేవారు. ఆ విశ్వాసుల పట్ల వారి శత్రుత్వానికి కారణం ఇది తప్ప మరేదీ కాదు- మహాశక్తి

మంతుడు, సకల స్తోత్రాలకు తగినవాడు, భూమ్యాకాశాల సామ్రాజ్యానికి యజమాని అయిన అల్లాహ్‌ను వారు విశ్వసించారు. ఆ దేవుడు సమస్త విషయాలను గమనిస్తూ న్నాడు." (అల్ బురూజ్: 1-8)

ఈ ఆయత్‌ల అవతరణా ధ్యేయం, విశ్వసించినవారిపై చేసే హింసా దౌర్జన్యాల దుష్పరిణామాన్ని గురించి దైవతిరస్కారులను హెచ్చరించడం. అలాగే, వారు వహించే సహనం ఫలితంగా ఆ దౌర్జన్యపరులతో ప్రతీకారం తీర్చుకుంటాడు అని వారికి ధైర్యం చెప్పడం.

దీని సందర్భంగా మొదట 'అస్‌హాబుల్ ఉఖ్దూద్' (కందకం వాళ్ళ) గాధను వినిపించడం జరిగింది. వీరు అగ్నితో రగులుతున్న కందకాలలో విసిరివేసి వారిని కాల్చిచంపివేశారు. ఈ గాధ ద్వారా మోమిన్‌లకు మరియు కాఫిర్‌లకు కొన్ని విషయా లను అవగతం చేయడం జరిగింది. ఒకటేమిటంటే, యే అస్‌హాబుల్ ఉఖ్దూద్ దైవశాపం మరియు ఆయన క్రోధానికి అర్హులయ్యారో మక్కా సర్దారులు కూడా దానికి అర్హులౌతున్నారన్నది.

రెండవది ఈ విశ్వసించిన వారు ఎంత తీవ్రమైన శిక్షను అనుభవిస్తున్నా సరే వారు ఆ విశ్వాసమార్గాన్ని వదలకుండా ప్రతి కఠిన శిక్షను భరించాలన్నది. మూడవ విషయం ఏమిటంటే, యే దైవాన్ని నమ్మడం వలన ఈ కాఫిర్లు కృద్ధులౌతున్నారో మరియు విశ్వాసులు తమ విశ్వాసాన్ని వదలకుండా ఆయన్నే అనుసరిస్తూ పోతున్నారో ఆ దైవం భూమ్యాకాశాల సామ్రాజ్యానికి అధిపతి, సకల స్తోత్రాలకు తగినవాడూను. మీ రెండు వర్గాలను ఆయన గమనిస్తూనే ఉన్నాడు. కాబట్టి ఖచ్చితంగా దైవ తిరస్కారులకు వారి ధిక్కారపు శిక్ష నరకం రూపంలో లభించడమే కాకుండా, వారి ఈ దౌర్జన్యపు శిక్ష వారికి అగ్నివాతల రూపంలో అనుభవించవలసి ఉంది. అలాగే, విశ్వసించి సత్కార్యాలు ఆచరించినవారు స్వర్గంలో ప్రవేశించడం కూడా తథ్యమే. ఇదే అన్నిటికంటే గొప్ప విజయం.

قُتِلَ اَصْحٰبُ الْاُخْدُوْدِ

"కందకం వాళ్ళు సర్వనాశనమయ్యారు."

కందకం వాళ్ళు అంటే, ఎవరైతే పెద్దపెద్ద గోతులను త్రవ్వి అందులో అగ్నిని రగిల్చి విశ్వాసులను అగ్నిలో పడవేసినవారో; అగ్నిలో పడవేయడమేకాకుండా తమ కళ్ళతో వారు కాలుతూ ఉండగా తమాషా చూసినవారో అని అర్థం. 'సర్వనాశనం అయ్యారు' అని అంటే వారిపై దైవశాపం విరుచుకుపడి వారు దైవశిక్షకు అర్హు లయ్యారు అని. దీనికోసం మూడు విషయాలను సాక్షిగా నిలబెట్టి ప్రమాణం చేయడం జరిగింది. ఒకటి బురుజులుగల ఆకాశం, రెండు వాగ్దానం చేయబడిన ప్రళయదినం,

మూడు ఆ ప్రళయ బీభత్స దృశ్యం మరియు ఆ దృశ్యాన్ని తిలకించే సమస్తజీవులు. మొదటిదీ, దేనినైతే సాక్షిగా నిలబెట్టడం జరిగిందో ఆ శక్తిమంతుడు విశ్వంలోని బహ్మాండమైన నక్షత్రాలు, వాటి గ్రహాలపై అధికారం చెలాయించేవాడు. ఆయన పట్టు నుండి ఈ హేయమైన, నీచమైన మానవుడు ఎలా తప్పించుకోగలడు? సాక్షిగా నెలబెట్టి ప్రమాణం చేయబడిన రెండవ విషయం ఏదంటే, దౌర్జన్యం చేసేవారు వారిపై తమవంతు దౌర్జన్యం చేశారు కాని, మానవులను హెచ్చరించి చెప్పిన ఆ రోజు తప్పకుండా వచ్చి తీరేదే, ఆనాడు దౌర్జన్యాన్ని సహించిన ప్రతి వ్యక్తి ఫిర్యాదు వినడం జరుగుతుంది, దౌర్జన్యం చేసే వారిని ప్రశ్నించడమూ జరుగుతుంది అనేది. ఇక మూడవ దానిపై ఒట్టేసి చెప్పిన విషయం ఏమిటంటే, ఈ కౄరులు నిస్సహాయులైన విశ్వాసులను అగ్నిలో పడవేసి కాల్చుతూ ఎలా తమాషా జూశారో అచ్చం అదేవిధంగా ప్రళయదినాన సృష్టితాలన్ని చూస్తూ ఉండగా వారిని అగ్నిలో పడవేసి మాడ్చడం జరుగుతుంది అనేది.

కందకాల్లో అగ్నిని రగిల్చి విశ్వాసులను అందులో విసరిన సంఘటనలు అనేకం ఉల్లేఖనాల్లో వివరించడం జరిగింది. వీటిద్వారా ప్రపంచంలో ఎన్నోమార్లు ఇలాంటి దౌర్జన్యకాండ జరిగినట్లు మనకు తెలుస్తుంది. వాటిలో ఓ సంఘటన హ్జ్రత్ సుహైబ్ (ర) రూమీ దైవప్రవక్త (స) ప్రవచించినట్లు ఇలా ఉల్లేఖించారు:

"ఓ రాజు దగ్గర ఓ ఇంద్రజాలికుడుండేవాడు. అతను తన వృద్ధాప్యంలో రాజుతో, 'నా నుండి ఈ విద్య నేర్చుకునే కుర్రవానినెవరినైనా నియమించండి' అని అడిగాడు. రాజు ఓ బాలుడిని దానికోసం నియమించడం జరిగింది. కాని ఆ బాలుడు ఆ ఇంద్రజాలికుని వద్దకు వస్తూపోతూ ఓ సన్యాసి (బహుశా అతను ఈసా (అ) అనుయాల్లోనివాడు అయివుండవచ్చు) వద్దకు కూడా పోయి వస్తూ ఉండేవాడు. అతని బోధకు ప్రభావితుడై విశ్వాసి అయిపోయాడు. అతని శిక్షణవల్ల అతనిలో కొన్ని మహత్మ్యాలు చోటుచేసుకున్నాయి. అతడు గ్రుడ్డి వారికి దృష్టిని ప్రసాదించడం, కుష్టురోగుల్ని నయం చేయడం ప్రారంభించాడు. రాజు ఆ బాలుడు దైవ ఏకత్వాన్ని విశ్వసించాడు అని తెలుసుకొని మొదట ఆ సన్యాసిని చంపివేశాడు. ఆ తరువాత ఆ బాలుణ్ణి చంపబోగా ఏ ఆయుధం కూడా అతనిపై ప్రభావం చూపలేదు. చివరికి ఆ బాలుడే రాజుతో, 'నీవు నన్ను చంపివేయదలిస్తే ప్రజలంతా వినేటట్లు 'బిస్మిరబ్బిల్‌గులామ్' (ఈ బాలుని ప్రభువు పేర) అని నాపై బాణం వదులు నేను చనిపోగలను' అంటాడు. రాజు అలా చేయగానే బాలుడు మరణించాడు. దీన్ని చూసిన ప్రజలు 'మేము ఈ బాలుని ప్రభువును విశ్వసిస్తున్నాము' అని ఎలుగెత్తి అరిచారు. రాజు సభాసదులు రాజుతో, 'మనం కాకూడదు అని అనుకున్నదే జరిగిపోయింది, ప్రజలు మీ ధర్మాన్ని వదిలి ఈ బాలుని ప్రభువును నమ్మి

విశ్వసించారు' అనగా రాజు కృద్ధుడై రోడ్ల ప్రక్కన కందకాలు త్రవ్వించి వాటిని అగ్నితో నింపాడు. ఎవరెవరైతే విశ్వాసం నుండి మరలడానికి ఒప్పుకోలేదో వారిని ఆ అగ్నిగుండంలో పడవేయడం జరిగింది.

(అహ్మద్, నిసాయీ, తిర్మిజీ, ఇబ్నె జరీర్, అబ్దుర్రజ్జాక్, ఇబ్నె అబీషైబా, త్రిబ్రానీ, అబ్ద్ బిన్ హమీద్)

రెండవ సంఘటన హజ్రత్ అలీ(ర) ఉల్లేఖించినది. ఆయన ఉల్లేఖనం ఇలా ఉంది:

"ఈరాన్‌కు చెందిన ఓ రాజు సారాయి మత్తులో తన సోదరిని చెరిచాడు. వారిద్దరి నడుమ అక్రమసంబంధాలు ఏర్పడ్డాయి. విషయం తెలియగా రాజు, దైవం సొంతసోదరితో నికాహ్‌ను ధర్మసమ్మతం చేశాడు అని ప్రకటన చేయించాడు. ప్రజలు దాన్ని ఒప్పుకోలేదు. దానికి అతను రకరకాల యాతనలు పెట్టి ప్రజలను ఆ విషయం ఒప్పుకునేటట్లు చేశాడు. ఆ శిక్షల్లో అగ్నితో నిండిన కందకాల్లో, దాన్ని ఒప్పుకోని ప్రతి వ్యక్తినీ విసరివేసి కాల్చి మసి చేసే యాతన కూడా ఉండింది. హజ్రత్ అలీ (ర) గారు వివరించినట్లుగా అప్పటి నుండి మజూసీల్లో (అగ్ని ఆరాధకుల్లో) ముహర్రమాత్‌తో (రక్తసంబంధీకులతో) నికాహ్ చేసుకోవడం ఆనవాయితీగా వస్తోంది. (ఇబ్నె జరీర్)

మూడవ సంఘటనను హజ్రత్ అబ్బాస్ (ర) ఇలా ఉటంకిస్తున్నారు. ఇది బహుశా యూదుల ఉల్లేఖనాల నుండి గ్రహించినదై ఉండవచ్చు.

'బాబిలోనియా వారు బనీ ఇస్రాయేలు వారిని మూసా (అ) ధర్మాన్ని వీడడానికి వత్తిడి చేశారు. ఆ వత్తిడిలో భాగంగా దాన్ని నిరాకరించిన వారిని వారు అగ్ని గుండాలలో విసరివేశారు."
(ఇబ్నె జరీర్, అబ్దుల్లా బిన్ హమీద్)

అన్నిటికంటే ప్రసిద్ధమైన సంఘటన 'నజ్రాన్'కు సంబంధించింది. దీన్ని ఇబ్నె హిషామ్, తబ్రీ, ఇబ్నె ఖల్లదూ మరియు ముఅజమల్ బిన్ బుల్దా రచయిత లాంటి ఇస్లామీయ చరిత్రవేత్తలు వివరించారు. వాటి వివరాలిలా ఉన్నాయి.

"హమీర్ (యమన్) రాజు 'తబ్బాన్ అసద్ అబూ కరబ్' ఓ సారి 'యస్రిబ్'కు వెళ్ళాడు. అక్కడ అతను యూదులకు ప్రభావితుడై యూద ధర్మాన్ని స్వీకరించాడు. తన వెంట బనీ ఖురైజా యూద పండితులిద్దరిని వెంట బెట్టుకొని యమన్ చేరాడు. అక్కడి నుండి పెద్ద ఎత్తున యూదుమత ప్రచారం చేశాడు. అతని తరువాత అతని కుమారుడు 'జూనువాస్' గద్దెనెక్కాడు. అతను దక్షిణ అరేబియాలోని నజ్రాన్‌పై దండెత్తాడు. నజ్రాన్ అప్పుడు క్రైస్తవానికి పెట్టనికోట. అక్కడి నుండి క్రైస్తవాన్ని తుడిచివేసి వారిని యూదమతంలోనికి మార్చాలన్నది అతని ధ్యేయం.

(ఇబ్నె హిషామ్ మాటల్లో వీరు హజ్రత్ ఈసా (అ) వారి అసలు ధర్మాన్ని అనుసరిస్తున్నవారు)

నజ్రాన్‌కు చేరి అతను ప్రజల్ని యూదమతం స్వీకరించమని ఆహ్వానించాడు. వారు అతని ఆహ్వానాన్ని నిరాకరించారు. దానికి అతను అనేకమందిని అగ్నితో నిండిన కందకాల్లో విసరివేయించి మాడ్చేశాడు. అనేకుల్ని నరికివేశాడు. మొత్తం ఇరవై వేల మంది వరకు సంహరించబడ్డారు. నజ్రాన్‌కు చెందిన ఓ వ్యక్తి దౌస్ జూసఅలబాన్ తప్పించుకొని పారిపోవడం జరిగింది. మరో ఉల్లేఖనం ప్రకారం అతను రోమ్ చక్రవర్తి అయిన కైజరు వద్దకు, మరో ఉల్లేఖనం ప్రకారం అబిసీనియా రాజు 'నజాషీ' వద్దకు వెళ్ళి ఆ దౌర్జన్యం గురించి చెప్పాడు. మొదటి ఉల్లేఖనంలో రోమ్ చక్రవర్తి కైజరు అబిసీనియా రాజుకు లేఖరాయడం, రెండవ ఉల్లేఖనం ప్రకారం అబిసీనియా రాజు కైజరును ఓ నౌకాదళాన్ని సమకూర్చమని అర్థించడం జరిగింది. ఎలాగైతేనేమి చివరకు అబిసీనియా రాజు 70 వేల సైన్యాన్ని 'అరియాత్' పేరుగల వానిని సైన్యాధ్యక్షునిగా చేసి యమన్‌పై దండెత్తడానికి పంపించాడు. ఆ యుద్ధంలో జూనువాస్ చంపివేయబడ్డాడు. యూదుల పాలన అంతం అయింది. యమన్ అబిసీనియా సామ్రాజ్యంలో ఓ భాగంగా లీనమైపోయింది."

విజయ భాగ్యానికి గర్వపడక కృతజ్ఞతలను చూపండి

اِذَا جَآءَ نَصۡرُ اللّٰهِ وَالۡفَتۡحُ ۙ وَرَاَيۡتَ النَّاسَ
يَدۡخُلُوۡنَ فِىۡ دِيۡنِ اللّٰهِ اَفۡوَاجًا ۙ فَسَبِّحۡ بِحَمۡدِ
رَبِّكَ وَاسۡتَغۡفِرۡهُ ؕ اِنَّهٗ كَانَ تَوَّابًا (النصر)

"అల్లాహ్ సహాయం వచ్చినప్పుడు, విజయ భాగ్యం లభించినప్పుడు, ప్రజలు తండోపతండాలుగా అల్లాహ్ ధర్మంలో ప్రవేశించడాన్ని నీవు చూసినప్పుడు (ప్రవక్తా!) నీవు నీ ప్రభువు స్తోత్రంతోపాటు ఆయన పవిత్ర నామాన్ని స్మరించు. ఇంకా ఆయన మన్నింపును వేడుకో. నిస్సందేహంగా ఆయన పశ్చాత్తాపాన్ని ఎంతగానో అంగీకరించేవాడు." (అన్నస్ర్: 1-3)

హజ్రత్ అబ్బాస్ (ర), ఇంకా ఇతర సహాబీ (ర)ల ఉల్లేఖనాల ద్వారా తెలిసే విషయం ఏమిటంటే, ఈ సూరాలో అల్లాహు తఆలా దైవప్రవక్త (స) వారికి, అరేబియాలో ఇస్లామ్ ధర్మ విజయం పరిపూర్ణమై, ప్రజలు అల్లాహ్ ధర్మంలో తండోపతండాలుగా వచ్చి ఎప్పుడు చేరిపోతారో, అప్పుడు మిమ్మల్ని ఈ భూలోకానికి పంపించిన కార్యం పూర్తి అయినట్లు భావించండి అని తెలియజేయడం జరిగింది. ఆ తరువాత ఆయన దయతో ఆ మహత్కార్యాన్ని నిర్వర్తించడంలో కృతకృత్యులై

నందున అల్లాహ్ స్తోత్రంతోపాటు ఆయన పవిత్ర నామాన్ని స్మరించడంలో లీనమైపొమ్మని ఆదేశించడం జరిగింది. అలాగే ఈ ధర్మకార్య నిర్వహణలో ఏ పొరపాట్లు మరే ఏమరుపాట్లు ఆయన వల్ల జరిగిపోయాయో వాటిని క్షమించమని ప్రాధేయపడండి అని కూడా చెప్పడం జరిగింది. ఇక్కడ ఆగి మనిషి కొంచెం ఆలోచించిజూస్తే, ఓ ప్రవక్త మరియు ప్రపంచమే సర్వం అనుకునే ఓ సామాన్య నాయకుని నడుమ ఎంత గొప్ప తేడా ఉందో తెలుసుకోగలడు. ఓ సామాన్య నాయకుడు తన జీవితంలో ఏదైన గొప్ప విప్లవాన్ని తీసుకురావడంలో విజయం పొందితే, అతను దాని కొరకు ఈ సందర్భంగా ఉత్సవం జరిపి తన నాయకత్వం పట్ల గర్వాన్ని ప్రదర్శించుకునే సందర్భం. కాని ఇక్కడ అల్లాహ్ ప్రవక్త (స)ను మనం చూస్తున్నాం. ఆయన 23 సంవత్సరాల కొద్దికాలంలోనే మొత్తం జాతి విశ్వాసాలను, ఆలోచనల్ని, అలవాట్లను, నైతిక విలువల్ని, సభ్యతా సంస్కృతిని, సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితిని యుద్ధసామర్థ్యాలనే పూర్తిగా మార్చివేశారు. అజ్ఞానాంధకారంలో కొట్టుమిట్టాడే జాతిని పైకి లేపి ప్రపంచాన్నే జయించి వాటికి నాయకత్వం వహించేటట్లు మలిచారు. కాని ఇలాంటి వ్యక్తి ఇంత మహోన్నతమైన కార్యాన్ని తన చేతుల మీదుగా నిర్వర్తించిన తరువాత కూడా ఆయనకు ఉత్సవం జరుపుకునే అనుమతి ఇవ్వకుండా అల్లాహ్, ఆయన స్తోత్రం చేయాలని, ఆయన పవిత్ర నామాన్ని స్మరించాలని, ఆయన్నే వేడుకోవాలని ఆదేశం ఇస్తున్నాడు. ఆయన (స) ఓ సేవకునిలా దైవ ఆదేశపాలనలో లీనమైపోతున్నారు.

హజ్రత్ ఆయిషా (ర) సెలవిచ్చిన దాని ప్రకారం, దైవప్రవక్త (స) తమ మరణానికి ముందు سُبْحَانَكَ اللّٰهُمَّ وَبِحَمْدِكَ أَسْتَغْفِرُكَ وَأَتُوبُ إِلَيْكَ "సుబ్హానకల్లాహుమ్మ వ బిహందిక అస్తగ్ఫిరుక వ అతూబు ఇలైక్", కొన్ని ఉల్లేఖనాల్లో

سُبْحَانَ اللّٰهِ وَبِحَمْدِهِ أَسْتَغْفِرُ اللّٰهَ وَأَتُوبُ إِلَيْهِ

"సుబ్హానల్లాహి వ బిహందిహీ అస్తగ్ ఫిరుల్లాహ వ అతూబు ఇలైహి" అని అధికంగా పఠించేవారు. నేను ఆయనతో ప్రవక్తా! మీరు ఈ పదాలను ఇప్పుడెందుకు పఠిస్తున్నారో అని అడగగా ఆయన (స), నా కోసం ఓ గురుతు నిర్దేశించబడింది. దాన్ని చూడగానే నేను ఈ పదాలను పలకాలి. ఆ గురుతు إِذَا جَاءَ نَصْرُ اللّٰهِ وَالْفَتْحُ 'ఇజా జాఅ నస్రుల్లాహి వల్ఫత్హ్" (ముస్నదె అహ్మద్, ముస్లిమ్, ఇబ్నె జరీర్, ఇబ్నుల్ ముంజిర్, ఇబ్నె మర్దూయా)

ఈ ఉల్లేఖనానికి సరిపోయే కొన్ని ఉల్లేఖనాల్లో హజ్రత్ ఆయిషా (ర) ఇలా ఉటంకించారు.

"ఆయన తన రుకూ మరియు సజ్దాల్లో అధికంగా ఈ పదాలను పలికేవారు:

سُبْحَانَكَ اللّٰهُمَّ وَبِحَمْدِكَ اَللّٰهُمَّ اغْفِرْ لِي

"సుబ్‌హానకల్లాహుమ్మ వ బిహందిక అల్లాహుమ్మగ్ఫిర్‌లీ" ఇది దైవప్రవక్త (స) ఖుర్‌ఆన్ (అన్‌నస్రసూరా)కు చెప్పిన గూడార్థం.

(బుకారి, ముస్లిమ్, అబూదావూద్, నిసాయి, ఇబ్నెమాజా, ఇబ్నెజరీర్)

فَسَبِّحْ بِحَمْدِ رَبِّكَ

'ఫ సబ్బిహ్ బిహంది రబ్బిక' (నీవు నీ ప్రభువు స్తోత్రంతో పాటు ఆయన పవిత్రనామాన్ని పఠించు)లో హంద్ అంటే అల్లాహ్‌ను స్తోత్రించడం, ఆయనకు కృతజ్ఞతలు అర్పించుకోవడం కూడా. తస్బీహ్ అంటే అల్లాహ్‌ను అన్ని రకాలుగా పవిత్రునిగా ఖరారు చేయడం. ఈ సందర్భంగా, 'నీ ప్రభువు ఈ మహత్యాన్ని చూడగానే నీ ప్రభువు స్తోత్రంతోపాటు ఆయన పవిత్ర నామాన్ని స్మరించు' అనే ఆదేశంలో హంద్ భావం ఏమిటంటే, ఈ మహోన్నతమైన విజయం చేకూరినప్పుడు నీ హృదయంలో, అది నీ వల్ల జరిగిన కార్యం అనే భావం వీసమంతైనా రానియ్యకు అని. పైగా దాన్ని పూర్తిగా అల్లాహ్ దయగా భావించు. దానికి ఆయనకు కృతజ్ఞతలు చెప్పుకో మరియు నీ హృదయపూర్వకంగా నీ నోటి ద్వారా ఈ విజయానికి సంబంధించిన సకల మెచ్చుకోళ్ళు అల్లాహ్‌కే చెందుతాయి అని ప్రకటించు.

ఇంకా 'తస్బీహ్' అనే పదానికి భావం, అల్లాహ్ నామం ఉన్నతం కావడానికి నీ ప్రయత్నానికి కూడా ప్రమేయం ఉంది లేదా ఆ ప్రయత్నంపైనే అది ఆధారపడి ఉండింది అనే భావానికి ఆయన ఎంతో ఉన్నతుడు, పవిత్రుడు అని అర్థం. దానికి భిన్నంగా మీ హృదయం, మీ ప్రయత్నం, మీ కృషి విజయ భాగ్యం సతతం అల్లాహ్ సహాయసహకారాలపైన్నే ఆధారపడింది అనే విశ్వాసంతో నిండి ఉండాలి. ఆయన తన ఏ దాసునితోనైనా తన కార్యాన్ని నిర్వర్తింపజేయగలగేవాడే. అయితే ఆయన మీ ద్వారా, మీ చేతుల ద్వారా ఈ బృహత్తర కార్యాన్ని నిర్వర్తింపజేసి తన ధర్మాన్ని ఉన్నతం చేయడం వల్ల మీరు ఆయనకు రుణపడి ఉన్నారు. అదేకాకుండా 'తస్బీహ్' అంటే سُبْحَانَ اللّٰهِ 'సుబ్‌హానల్లాహ్' అనడంలో ఆశ్చర్యానికి సంబంధించిన కోణం కూడా దాగుంది. మనిషి బుద్ధిజ్ఞానాలను ఆశ్చర్యానికి లోనుచేసే కార్యం ఏదైనా జరిగిపోతే అతను సుబ్‌హానల్లాహ్ అని అంటాడు. అలా అనడానికి కారణం ప్రపంచంలో ఏ వ్యక్తికి సాధ్యంగాని మానవాతీత సంఘటన కేవలం అల్లాహ్ మహాత్మ్యం వల్లనే జరిగిపోయింది కాబట్టి.

وَاسْتَغْفِرْهُ 'వస్తగ్ఫిర్‌హు' (ఆయన మన్నింపును వేడుకో) అని అంటే, ఏ బాధ్యతనైతే ఆయన నీకు అప్పగించడం జరిగిందో దాన్ని నిర్వర్తించడంలో నీచే జరిగిపోయిన పొరపాట్లు, లోటుపాట్ల నుండి చూపుమరల్చి నిన్ను మన్నించమని వేడుకో అని అర్థం. ఇస్లామ్‌లో ఓ దాసునికి నేర్పబడిన మర్యాదలివి. అల్లాహ్ ధర్మం ఎంత గొప్ప కార్యం మనిషి నెరవేర్చినా, ఆయన మార్గంలో ఎన్ని త్యాగాలు చేసినా,

ఆయన ఆరాధనలో ఎన్ని కష్టాలను ఓర్చుకున్నా, నాపైనా ప్రభువు హక్కు ఏదైతే ఉండిందో దాన్ని నేను పూర్తిగా నెరవేర్చననే భావం ఏ కోశనా మెదలడానికి వీల్లేదు. కాగా అతను, నేను చేయవలసింది చేయలేకపోయానే అనే భావంతో, ఆ కార్య నిర్వహణలో నాచే జరిగిపోయిన లోటుపాట్లు, పొరబాట్లను మన్నించి నా ఈ అత్యల్పమైన సేవను స్వీకరించమని వేడుకోవాలి. మరే మానవుడు కూడా ఊహించలేని ఈ మర్యాదను దైవప్రవక్త (స) నేర్పినప్పుడు, తన కార్యాన్ని గొప్పకార్యంగా భావిస్తూ అల్లాహ్ హక్కు ఏదైతే తనపై ఉండిందో దాన్ని నిర్వర్తించే అర్హత తనకుందని చెప్పుకోవడానికి ఏ మనిషీ సాహసించలేడు. అల్లాహ్ హక్కును ఆయన సృష్టిలోని యే జీవి కూడా నిర్వర్తించలేనంత ఉన్నతుడు ఆయన.

అల్లాహ్ ఈ ఫర్మానా ముస్లిములకు, తాము నిర్వహించే యే ఆరాధన, యే తపస్సు మరే సేవను ధర్మంలోని గొప్ప కార్యంగా భావించవద్దని సతతం బోధి స్తోంది. కాగా తమ ప్రాణాన్ని అల్లాహ్ మార్గంలో త్యాగం చేసినా, ఆ కార్యనిర్వహణ పూర్తికాలేదనే సత్యాన్ని గుర్తుంచుకోవాలి. ఇలా వారికి ఏదైనా విజయభాగ్యం లభిస్తే, దాన్ని తన సమర్థతగా కాకుండా అల్లాహ్ దయాఫలితమే అని భావించాలి. దానికి గర్వపడే బదులు తమ ప్రభువు ముందు ఎంతో వినయంగా తలవంచి ఆయనను స్తోత్రిస్తూ, ఆయన పవిత్రనామాన్ని స్మరిస్తూ ఆయన్ను మన్నించమని వేడుకోవాలి.

-: సమాప్తం :-